శ్రీరస్తు

తైత్తిరీయోపనిషత్తు

ఆంధ్రటీకాతాత్పర్యస్వర సహితము

శ్రీశంకరభగవత్పాదకృతభాష్యముననుసరించి

శిక్షావల్లి, ఆనందవల్లి, భృగువల్లులకును ;

సాయణాచార్యకృతభాష్యముననుసరించి

నారాయణప్రశ్నమునకును

శ్రీ కనుపర్తి మార్కండేయశర్మగారిచేత

ఆంధ్రటీకాతాత్పర్యములు

వ్రాయఁబడినవి

పరివర్ధిత, తృతీయముద్రణము

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచేఁ బ్రకటితము.

1954

All Rights Reserved.

9019
Cat

294.15

Printed by
V. VENKATESWARA SASTRULU
of V. RAMASWAMY SASTRULU & SONS
at the 'VAVILLA' PRESS
MADRAS—1954.

16193

ప్రకాశకవిజ్ఞప్తి

ప్రత్యక్షానుమానప్రమాణంబులచేత తెలిసికొనశక్యము గాని అతీంద్రియవిషయంబుల తెలుపునట్టి గ్రంథసముదాయము వేద మని చెప్పఁబడుచున్నది. అట్టి వేదము కర్మ, ఉపాసనా, జ్ఞానములను కాండత్రయాత్మకమయి వెలయుచున్నది. ఉపాసనమును, జ్ఞానమును బోధించునట్టి వేదభాగమునకు 'ఉపనిషత్తు' అనునామము సుప్రసిద్ధమయియున్నది. ఈ యుపనిషత్తులు ౧౦౮ అని శిష్టు లంగీకరించియున్నారు. ఈ ౧౦౮ ఉపనిషత్తులలో మొదటి ౧౦ ఉపనిషత్తులు దశోపనిషత్తు లనంబఱగుచున్నవి.

దశోపనిషత్తులు

౧ ఈశ, ౨ కేన, ౩ కఠ, ౪ ప్రశ్న, ౫ ముండక, ౬ మాండూక్య, ౭ తైత్తిరీయ, ౮ ఐతరేయ, ౯ ఛాందోగ్య, ౧౦ బృహదారణ్యకములను నవి దశోపనిషత్తులని ప్రసిద్ధి; వీనిలో మొదటి ౮ ఉపనిషత్తులు శంకరభాష్యము ననుసరించి వ్రాయఁబడిన ఆంధ్రటీకాతాత్పర్యవివరణములతో మాచేత ముద్రింపఁబడినవి.

ఛాందోగ్య, బృహదారణ్యకములను రెండు ఉపనిషత్తులుకూడ త్వరలో ఇట్లే ముద్రింపఁబడఁగలవు.

శ్రీ త్రిశేషులగు మాతండ్రిగారు పైనచెప్పిన దశోపని షత్తులు, నృసింహతాపిని, శ్వేతాశ్వతరోపనిషత్తులను ౧౨ ఉపనిషత్తులకును తేటతెలుఁగునందు వచనముగ భాషాంతరీ కరణమొనర్చియుండిరి.

ఇతరోపనిషత్తులు

కొందఱువిద్వాంసులు దశోపనిషద్వ్యతిరిక్తములయిన ౯౮ ఉపనిషత్తులను యోగోపనిషత్తు లనియు, సామాన్య వేదాంతోపనిషత్తులనియు, సన్న్యాసోపనిషత్తులనియు, శైవో పనిషత్తులనియు, శాక్తోపనిషత్తులనియు, వైష్ణవోపనిషత్తులనియు ౬ భాగములుగ విభజించియున్నారు.

౧. యోగోపనిషత్తులు—సంఖ్య ౨౦

౧ * అద్వయతారక, ౨ అమృతనాద, 3 * అమృత బిందు, ౪ * క్షురిక, ౫ * తేజోబిందు, ౬ * త్రిశిఖబ్రాహ్మణ, ౭ * దర్శన, ౮ ధ్యానబిందు, ౯ నాదబిందు, ౧౦ పాశుపతబ్రహ్మ, ౧౧ * బ్రహ్మవిద్య, ౧౨ * మండలబ్రాహ్మణ, ౧3 * మహావాక్య, ౧౪ * యోగకుండలి, ౧౫ * యోగచూడామణి, ౧౬ * యోగతత్త్వ, ౧౭ * యోగశిఖ, ౧౮ వరాహ, ౧౯ శాండిల్య, ౨౦ * హంసోపనిషత్తులు.

☞ యోగోపనిషత్తులు ౨౦ లో, * గుర్తుగల ౧౪ ఉపనిషత్తులు మాత్రమే ఆంధ్రటీకతోడ ముద్రితములు.

౨. సామాన్యవేదాంతోపనిషత్తులు—సంఖ్య ౨౪.

౧. అక్షి, ౨ అధ్యాత్మ, ౩ అన్నపూర్ణ, ౪ ఆత్మ, ౫ * ఆత్మబోధ, ౬ ఏకాక్షర, ౭ కౌషీతకిబ్రాహ్మణ, ౮ * గర్భ, ౯ * నిరాలంబ, ౧౦ పైంగల, ౧౧ * ప్రాణాగ్నిహోత్ర, ౧౨ మంత్రిక, ౧౩ మహా, ౧౪ * ముక్తిక, ౧౫ ముద్గల, ౧౬ మైత్రాయణి, ౧౭ * వజ్రసూచిక, ౧౮ * శారీరక, ౧౯ శుకరహస్య, ౨౦ * సర్వసార, ౧౨ సావిత్రి, ౨౨ సుబాల, ౨౩ సూర్య, ౨౪ * స్కందోపనిషత్తులు.

☞ సామాన్యవేదాంతోపనిషత్తులు ౨౪ లో, * ఈగుర్తుగల ౯ ఉపనిషత్తులు మాత్రమే ఆంధ్రటీకతో ముద్రితములు.

౩. సన్న్యాసోపనిషత్తులు—సంఖ్య ౧౭.

౧ * ఆరుణి, ౨ అవధూత, ౩ కఠరుద్ర, ౪ కుండిక, ౫ * జాబాల, ౬ తురీయాతీతావధూత, ౭ నారదపరివ్రాజక, ౮ నిర్వాణ, ౯ పరబ్రహ్మ, ౧౦ పరమహంసపరివ్రాజక, ౧౧ * పరమహంస, ౧౨ * బ్రహ్మ, ౧౩ భిక్షుక, ౧౪ మైత్రేయి, ౧౫ యాజ్ఞవల్క్య, ౧౬ శాట్యాయనీయ, ౧౭ సన్న్యాస ఉపనిషత్తులు.

☞ సన్న్యాసోపనిషత్తులు ౧౭ లో, * ఈగుర్తుగల ౪ ఉపనిషత్తులు మాత్రమే ఆంధ్రటీకతో ముద్రితములు.

౪. శైవోపనిషత్తులు—సంఖ్య ౧౫.

౧ అక్షమాలిక, ౨ * అథర్వశిరస్, ౩ * అథర్వశిఖ, ౪ కాలాగ్నిరుద్ర, ౫* కైవల్య, ౬* గణపతి, ౭ * జాబాలి, ౮ *

దక్షిణామూర్తి, ౯ పంచబ్రహ్మ, ౧౦ బృహజ్జాబాల, ౧౧ భస్మజాబాల, ౧౨ రుద్రహృదయ, ౧3 రుద్రాక్షజాబాల, ౧౪ శరభ, ౧౫ * శ్వేతాశ్వతర ఉపనిషత్తులు.

☞ శైవోపనిషత్తులు ౧౫ లో, * ఈగుర్తుగల ౭ ఉపనిషత్తులు మాత్రమే ఆంధ్రటీకతో ముద్రితములు.

౫. వైష్ణవోపనిషత్తులు—సంఖ్య ౧౪.

౧ అవ్యక్త, ౨ కలితసంతారణ, 3 * కృష్ణ, ౪ గరుడ, ౫ గోపాలతాపిని, ౬ తారసార, ౭ త్రిపాద్విభూతి మహానారాయణ, ౮ దత్తాత్రేయ, ౯ నారాయణ, ౧౦ నృసింహతాపిని, ౧౧ రామతాపిని, ౧౨ రామరహస్య, ౧3 * వాసుదేవ, ౧౪ హయగ్రీవ ఉపనిషత్తులు.

☞ వైష్ణవోపనిషత్తులు ౧౪ లో, * ఈ గుర్తుగల ౨ ఉపనిషత్తులుమాత్రమే ఆంధ్రటీకతో ముద్రితములు.

౬. దేవ్యుపనిషత్తులు—సంఖ్య ౮.

౧ త్రిపుర, ౨ త్రిపురతాపిని, 3 దేవి, ౪ బహ్వృచ, ౫ * భావన, ౬ సరస్వతీరహస్య, ౭ సీతా, ౮ సౌభాగ్యలక్ష్మి ఉపనిషత్తులు.

☞ దేవ్యుపనిషత్తులు ౮ లో, ఒక్కటిమాత్రమే ఆంధ్రటీకతో ముద్రితమయినది.

కీర్తిశేషులగు మాతండ్రిగారు దశోపనిషత్తులను శ్వేతాశ్వతర, నృసింహతాపిన్యుపనిషత్తులను మూలము ననుసరించి

తేట తెలుఁగులో వచనరూపమున భాషాంతరీకరించి యుండిరి. మే మాగ్రంథమును "ద్వాదశోపనిషత్తులు, వచనము" అను పేరులో ప్రకటించియున్నారము. వేదాంతశాస్త్రమునం దభిరుచిని అధికసంఖ్యాకు లగుజనులకు కలుగఁజేయవలయునను తలంపుతో మాతండ్రిగారు ఆంధ్రభాషయందు రచియించియున్న బ్రహ్మసూత్రార్థచంద్రికను శ్రీయుత వెన్నెలకంటి సుందరరామశర్మగారిచేత ముద్రణార్హముగ వ్రాయించి మఱియు అనేకాంశముల నందు చేర్పించి ప్రచురించియున్నారము. దశోపనిషత్తులలో శ్రీశంకరభాష్యము ననుసరించిన ఆంధ్రటీకాతాత్పర్యవివరణములతో మే మిదివఱకు ప్రకటించిన ఈశాద్యుపనిషదష్టకమును శ్రీ కనుపర్తి మార్కండేయశర్మగారి సహాయమున ప్రకటింపఁగలిగినందులకు వారియందు కృతజ్ఞులము. ఛాందోగ్య, బృహదారణ్యకోపనిషత్తులనుకూడ త్వరలో ప్రకటించి పాఠకుల కందఁజేయఁగలము. తక్కిన లఘూపనిషత్తులందు ఆంధ్రటీకాతాత్పర్యములతో నిదివఱకు ముద్రింపఁబడని యుపనిషత్తులనుకూడ త్వరలో క్రమముగ ముద్రింపఁగలము. ఈద్వితీయ ముద్రణమునందు చాలవిషయములను క్రొత్తఁగా చేర్చి ప్రకటించినారము. యథాశక్తి మేము చేయుచున్న ఈ జ్ఞానయజ్ఞరూపమగు గ్రంథప్రకటన పాఠకసముదాయమును తగు ప్రోత్సాహము నొనర్తురుగాక!

తండయార్పేట,
చెన్నపట్టణము.
10-5-1934

ఇట్లు,
వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్.

శ్రీ గురుభ్యో నమః.

తైత్తిరీయోపనిషదుపోద్ఘాతము

శ్లో. నారాయణ సమారంభాం శంకరాచార్యమధ్యమామ్,
అస్మదాచార్యపర్యన్తాం వందే గురుపరమ్పరామ్.
శాస్త్రం శారీరమీమాంసా దేవస్తు పరమేశ్వరః,
ఆచార్య శ్శంకరాచార్యః సంతు మే జన్మజన్మని.

వేదములు పరమపవిత్రగ్రంథములు, ఇవి భగవంతుని ఉచ్ఛ్వాసనిశ్శ్వాసరూపములు, ఇట్టివేదములు పరమపూజ్యులును జన్మజరామరణశూన్యులును అగు మహర్షిపుంగవులచేత స్వతపస్సామర్థ్యముచేత గ్రహింపఁబడి లోకోపకారార్థము శిష్యప్రశిష్యసంప్రదాయరూపమున లోకమునందు వ్యాపింపఁ జేయఁబడినవి.

ఈ వేదములందు కర్మబ్రహ్మకాండలకు సంబంధించిన విషయమింతయు అధికారతారతమ్యము ననుసరించి చక్కఁగా బోధింపఁబడియున్నది.

కర్మకాండయందు ఇహపరలోకసుఖ సంపాదనమునకు వలయు శాస్త్రీయములగు సకలోపాయములు చక్కఁగాఁ దెలుపఁబడియున్నవి. లోకమునందుఁగల చతుష్షష్టివిద్యలకు ఈ కర్మకాండమే మూలాధారము. చతుష్షష్టివిద్యలకు సంబంధి-

చిన రహస్యములన్నియు వేదములందు బీజభూతములుగా నచ్చటచ్చటఁ దెలుపఁబడియున్నవి.

బ్రహ్మకాండమునందు నశ్వరమగు ఇహపరలోకసుఖ ప్రాప్తికంటె శాశ్వతముగా నిరతిశయానందరూపబ్రహ్మానుభవ ప్రాప్తికి సంబంధించిన విషయమంతయు సాధనసహితముగఁ దెలుపఁబడినది. ఇట్టి వేదభాగమునకు ఉపనిషత్తని నామాంతరము గలదు. ఒక్కొక్క వేదశాఖ కొక్కొకటి చొప్పునఁ గల ౧౧౩౧ ఉపనిషత్తులలో, ౧౦౮ ఉపనిషత్తులు మాత్రమే యిప్పుడు లభించుచున్నవి. వీనిలో ౧౦ ఉపనిషత్తులు అధిక ప్రచారము కలిగియున్నవి. వీనికే దశోపనిషత్తు లని ప్రసిద్ధి. ఈపది యుపనిషత్తులలో తైత్తిరీయోపనిషత్తు ఒకటి, ఇది కృష్ణయజుర్వేద తైత్తిరీయశాఖకు చేరినది, తైత్తిరీయశాఖ యందు ఆరణ్యకభాగమున పఠింపఁబడియున్నది.

ఇట్టి తైత్తిరీయోపనిషత్తునకు ౫ ప్రశ్నము లని అధ్యాపక సంప్రదాయప్రసిద్ధము.

౧. శిక్షావల్లి
౨. బ్రహ్మవల్లి
౩. భృగువల్లి
౪. నారాయణప్రశ్నము
౫. చిత్తిప్రశ్నము

అను ౫ ప్రశ్ననామములు సుప్రసిద్ధము, అయినను చిత్తి ప్రశ్నము చాతుర్హోత్రచయనమునందు వినియుక్తమైయుండి బ్రహ్మవిద్యను ప్రతిపాదించునది కానందుచేత ఉపనిషద్గ్రంథ

ములందు శిక్షాదిప్రశ్నచతుష్టయమునే అందఱు ప్రకటించుచున్నారు. మేమున్ను శిక్షాదిప్రశ్నచతుష్టయమునకు మాత్రమే టీకాతాత్పర్యవివరణముల నిచట వ్రాసినారము. సకల వేదభాష్యకారులగు సాయణాచార్యు లిట్లని చెప్పిరి:—

ఈతైత్తిరీయోపనిషత్తు 'సాంహితి' యనియు, 'వారుణి' యనియు, 'యాజ్ఞికి' యని త్రివిధమయియున్నది.

౧. సాంహితి:—శిక్షాప్రశ్నము, లేక శిక్షావల్లి యను భాగము సాంహితి యనంబడును. ప్రప్రథమమున సంహితాధ్యయనవిధానము—ఉపాసనము చక్కఁగా నిరూపింపఁబడి యుండుటచేత దీని కీపేరు కలిగినది.

౨. వారుణి:—బ్రహ్మవల్లి, లేక ఆనందవల్లి యను భాగము, భృగువల్లి యనుభాగము వారుణి యనంబడును. బ్రహ్మవిద్యాసంప్రదాయ ప్రవర్తకుఁడగు వరుణునియొక్క సంబంధముచేత నీరెండుప్రశ్నములకు వారుణి యను నామము కలిగినది.

౩. యాజ్ఞికి:—యజ్ఞసంబంధములగు మంత్రములు అధికముగా నుండుటచేత (నారాయణప్రశ్నము) యాజ్ఞికి యనంబడుచున్నది.

ఈమూఁడింటిలో వారుణియే ముఖ్యమయినది, కాని బ్రహ్మవిద్యా ప్రాప్త్యుపాయసాధనభూతములగు అనేకోపాసనల నిరూపించి యుండుటచేత సాంహిత్యుపనిషత్తు (అనఁగా శిక్షాప్రశ్నము) ప్రప్రథమమున చెప్పఁబడినది.

బ్రహ్మసూత్రములు - తైత్తిరీయోపనిషత్తు

ఉత్తరమీమాంసాశాస్త్ర మనంబడు బ్రహ్మసూత్రములను వేదవ్యాసభగవానుఁడు రచించెను. వేదశిరోభాగములగు వేదాంతములందు—అనఁగా ఉపనిషత్తులందుఁగల సంశయాంశములను సమన్వయించి విమర్శించి సిద్ధాంత మొనర్చుటకుఁగాను ఉత్తరమీమాంసాశాస్త్రమునందు విమర్శార్థము గైకొనఁబడిన విషయములు చాలవఱకు ఉపనిషత్తులకు సంబంధించియున్నవి.

బ్రహ్మసూత్రములు - ప్రథమాధ్యాయము

౧. జిజ్ఞాసాధికరణమునందుఁ గల

సూ. అథాతో బ్రహ్మజిజ్ఞాసా. ౧-౧-౧.

అనుసూత్రమునకు "తపసా బ్రహ్మజిజ్ఞాసస్వ" అను నీ తైత్తిరీయోపనిషద్వాక్యము ప్రమాణము.

౨. జన్మాద్యధికరణమునందుఁగల

సూ. జన్మాద్యస్యయతః. ౧-౧-౨.

అనుసూత్రమునకు 'యతో వా ఇమాని భూతాని జాయంతే' అను తైత్తిరీయవాక్యము ప్రమాణము.

3. ఈక్షత్యధికరమునందుఁ గల

సూ. గతిసామాన్యాత్. ౧-౧-౧౦.

అనుసూత్రమునకు 'తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః' అను శ్రుతివాక్యము ప్రమాణము.

౪. ఆనందమయాధికరణమునందుఁ గల

సూ. ఆనందమయోఽభ్యాసాత్. ౧-౧-౧౨

అను సూత్రమునకు 'తస్మాద్వా ఏతస్మాద్విజ్ఞానమయాత్, అన్యోఽంతర ఆత్మాఽఽనందమయః. (తై. ఉ. ౨-౫)' అను శ్రుతివాక్యము ప్రమాణము.

ఇట్లే ఈ యధికరణమునందుఁ గల

సూ. తద్ధేతువ్యపదేశాచ్చ.	౧-౧-౧౪
" మాంత్రవర్ణికమేవచ గీయతే	౧-౧-౧౫.
" నేతరోఽనుపపత్తేః.	౧-౧-౧౬.
" భేదవ్యపదేశాచ్చ.	౧-౧-౧౭.
" కామాచ్చనానుమానాపేక్షా.	౧-౧-౧౮.
" అస్మిన్నస్యచతద్యోగం శాస్తి.	౧-౧-౧౯.

అను ఆఱు సూత్రములందు ఈతైత్తిరీయ శ్రుతివాక్యము లధికముగ ప్రమాణముగఁ గైకొనఁబడినవి.

౫. ఆకాశాధికరణమునందుఁ గల

సూ. ఆకాశస్తల్లింగాత్. ౧-౧-౨౨.

అనుసూత్రమునకు 'యదేష ఆకాశ ఆనందో న స్యాత్, తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః' అనుతైత్తిరీయోపనిషచ్ఛ్రుతివాక్యములు ప్రమాణము.

౬. కారణత్వాధికరణమునందుఁ గల

సూ. కారణత్వేన చాకాశాదిషు యథావ్యప దిష్టోక్తేః. ౧-౪-౧౪.

అనుసూత్రమునకు 'ఆత్మన ఆకాశ స్సంభూతః' ఇత్యాదిశ్రుతి వాక్యము ప్రమాణము.

౭. ప్రకృత్యధికరణమునందుఁ గల

సూ. అభిధ్యోపదేశాచ్చ. ౧-౪-౨౪.

అనుసూత్రమునకు 'సోఽకామయత బహుస్యాం ప్రజాయే యేతి' మున్నగు శ్రుతులు ప్రమాణములు.

సూ. ఆత్మకృతేః పరిణామాత్. ౧-౪-౨౬.

అనుసూత్రమునకు 'తదాత్మానగ్ం స్వయ మకురుత' మున్నగు శ్రుతులు ప్రమాణము.

బ్రహ్మసూత్రములు - ద్వితీయాధ్యాయము

౮. విలక్షణత్వాధికారమునందుఁ గల

సూ. నవిలక్షణత్వాదస్య తథాత్వం చశబ్దాత్ .౨-౧-౪.

అనుసూత్రమునకు 'విజ్ఞానంచా విజ్ఞానంచ' మున్నగు శ్రుతి వాక్యములు ప్రమాణములు.

౯. ఆరంభణాధికరణమునందుఁ గల

సూ. అసద్వ్యపదేశా న్నేతి చే న్నధర్మాంతరేణ వాక్యశేషాత్. ౨-౧-౧౭.

అనుసూత్రమునకు 'అసద్వా ఇద మగ్ర ఆసీత్' అను శ్రుతి వాక్యము ప్రమాణము.

౧౦. ఇతరవ్యపదేశాధికరణమునందుఁ గల

సూ. ఇతరవ్యపదేశాద్ధితాకరణాదిదోషప్రసక్తిః.
౨-౧-౨౧.

అనుసూత్రమునకు 'తత్సృష్ట్వా । తదేవాను ప్రావిశత్' అను శ్రుతివాక్యము ప్రమాణము.

౧౧. వియదధికరణమునందుఁ గల

సూ. అస్తితు ౨-3-౨.

అనుసూత్రమునకు 'తస్మాద్వా ఏతస్మా దాత్మన ఆకాశ స్సంభూతః' అను శ్రుతిప్రమాణము.

సూ. శబ్దాచ్చ. ౨-3-౪.

అనుసూత్రమునకు 'ఆకాశశరీరం బ్రహ్మ, ఆకాశ ఆత్మా' మున్నగు శ్రుతులు ప్రమాణము.

సూ. స్యాచ్చైకస్య బ్రహ్మశబ్దవత్. ౨-3-౫.

అనుసూత్రమునకు 'తపసా బ్రహ్మవిజిజ్ఞాసస్వ, తపో బ్రహ్మేతి' మున్నగు శ్రుతులు ప్రమాణము.

సూ. ప్రతిజ్ఞాహాని రవ్యతిరేకాచ్ఛబ్దేభ్యః. ౨-3-౬.

అనుసూత్రమునకు 'తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః, ఆకాశాద్వాయుః' మున్నగు శ్రుతులు ప్రమాణము.

బ్రహ్మసూత్రములు—తృతీయాధ్యాయము

౧౭. పురుషవిద్యాధికరణమునందుఁ గల

సూ. పురుషవిద్యాయా మివచేతరేషా మనామ్నా
నాత్. 3-3-౨౪

అనుసూత్రమునకు "తస్యైవం విదుషో యజ్ఞస్య" అను నారాయణప్రశ్నముయొక్క ౮౦-వ అనువాకము విషయము.

బ్రహ్మసూత్రములు - చతుర్థాధ్యాయము

౧3. జగద్వ్యాపారాధికరణమునందుఁ గల

సూ. జగద్వ్యాపార వర్జం ప్రకరణాదసన్నిహిత
తత్వాచ్చ. ౪-౪-౧౭

సూ. ప్రత్యక్షోప దేశాదితిచే న్నాధికారిక మండల
స్థోక్తేః. ౪-౪-౧౮

అనుసూత్రములకు 'ఆప్నోతి స్వారాజ్యం, సర్వేఽస్మై దేవా బలిమావహంతి' మున్నగు శ్రుతివాక్యములు విషయము.

ఇటుల సూత్రములతో ప్రత్యక్ష సంబంధములేక విషయము ననుసరించి పరంపరాసంబంధముగల అనేక వాక్యములు ఈ తైత్తిరీయోపనిషత్తునకు సంబంధించినవి ఈ క్రింద తెలుపఁబడిన బ్రహ్మసూత్రములందు శ్రీశంకర భగవత్పాదాచార్యుల వారిచేత ప్రమాణముగఁ గైకొనఁబడియున్నవి:—

౧-౧-౧; ౧-౧-౨; ౧-౧-౧౦; ౧-౧-౧౨; ౧-౨-౧౯ ౧-౨-౧౭; ౧-౨-౨౩; ౧-౩-౮; ౧-౩-౨౬; ౧-౪-౨౨ ౨-౧-౧౪; ౨-౨-౨౪; ౨-౩-౭; ౨-౩-౮; ౨-౩-౧౦; ౨-౩-౧౩ ౨-౩-౧౪; ౨-౩-౧౭; ౨-౩-౧౮; ౨-౩-౩౧; ౨-౩-౩౬ ౨-౩-౪౦; ౨-౩-౪౭; ౨-౪-౧; ౩-౧-౨; ౩-౨-౧౭; ౩-౨-౨౨ ౩-౨-౨౩; ౩-౨-౩౧; ౩-౩-౪; ౩-౩-౧౧; ౩-౩-౧౨; ౩-౪-౯ ౩-౪ ౧౮; ౩-౪ ౨౦; ౪-౩-౧౪; ౪-౪-౧౮.

ఆంధ్రద్రావిడపాఠభేదములు

ఈతైత్తిరీయోపనిషత్తును ఆంధ్రపాఠ మనియు, ద్రావిడ పాఠ మనియు ద్వివిధముగ శిష్టజనులు పఠించుచున్నారు.

శిక్షా బ్రహ్మ భృగువల్లులయందు స్వల్పభేదమున్ను, నారాయణప్రశ్నమునందు విశేషభేదమున్ను ఈ పాఠద్వయ మునకుఁ గలదు.

ద్రావిడపాఠము.—ఈ పాఠానుసారము శ్రీవైష్ణవులు మాత్రము పఠింతురు.

ఆంధ్రపాఠము.—ఆంధ్ర, ద్రావిడ, కర్ణాట, మహా రాష్ట్రాది సకల దేశీయబ్రాహ్మణులందఱు ఆంధ్రపాఠానుసారము పఠింతురు. ద్రవిడపాఠమున లేని యనేకమంత్రములు ఆంధ్ర పాఠమునఁ గలవు.

ద్రవిడపాఠమునఁ గలమంత్రములన్నియు కలిగియుండి, ఇతరమంత్రములుకూడ అనేకములుండుటచేత మేమీగ్రంథము నందు ఆంధ్రపాఠము ననుసరించియే టీకాతాత్పర్యములను వ్రాసినారము.

తైత్తిరీయోపనిషత్తులని వ్యాఖ్యాతలందఱచే అంగీక రింపఁబడుచున్న శిక్షావల్లి, బ్రహ్మవల్లి (ఆనందవల్లి), భృగువల్లి, నారాయణప్రశ్నములు నాలుగింటిలో మొదటి మూఁడు ప్రశ్నములకు శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యకృతభాష్యము, విద్యారణ్యకృత బృహద్వివరణము, శంకరానందకృతదీపిక, సురేశ్వరాచార్యకృత భాష్యవార్తికము మున్నగు వ్యాఖ్యానగ్రంథములు గలవు. నారాయణప్రశ్నమునకు భట్టభాస్కర సాయణాచార్యకృత భాష్యములు మాత్రము గలవు. సాయణభాష్యము ఆంధ్రపాఠమును, భట్టభాస్కర భాష్యము ద్రావిడపాఠమును చాలవఱకు అనుసరించుచున్నవి.

శ్రీమచ్ఛంకరానందులవారు ఆత్మపురాణమనియును, శ్రీమద్విద్యారణ్యులవారు అనుభూతిప్రకాశమనియు రెండు గ్రంథములను రచించిరి. ఈ రెండుగ్రంథములున్ను ఉపనిషత్తులకు విపులముగా నొనర్పఁబడిన శ్లోకరూపవ్యాఖ్యానగ్రంథములు. ఈ రెండుగ్రంథములను ఉపనిషద్రహస్యము నెఱుంగఁదలఁచినవార లవశ్యము పఠించుట యుక్తము.

నారాయణప్రశ్నము - ఖిలకాండము.

నారాయణప్రశ్నమును ఖిలకాండమని శ్రోత్రియులు చెప్పెదరు. ఖిలకాండమనఁగా శ్రౌతసూత్రమునందు వినియోగము లేని మంత్రసముదాయమని కొందఱున్ను, పదక్రమ పాఠములు లేని మంత్రసముదాయమని కొందఱున్ను చెప్పుచున్నారు. శ్రీమత్సాయణాచార్యులవారు "యథా బృహదా

రణ్యకే సప్తమాష్టమాధ్యాయయోః ఖిలకాండత్వేనాచార్యైరు దాహృతత్వాత్, తథేయం నారాయణీయాఖ్యా యాజ్ఞిక్యుపనిషదపి ఖిలకాండరూపా, తల్లక్షణోపేతత్వాత్, కర్మోపాసనాబ్రహ్మ తత్త్వజ్ఞానేషు కించిదవశిష్టం తస్య సర్వస్యాభిధానేన ప్రకీర్ణ రూపత్వం ఖిలత్వమ్." అని మఱియొకవిధముగా చెప్పియుండు టచేత తదనుసార మీ నారాయణప్రశ్నము ఖిలకాండమని చెప్పఁబడుచున్నది. ఏలయనఁగా ఈ నారాయణప్రశ్నము నందు:—

౧. 'అంభస్యపారే' మున్నగు మంత్రములచేత బ్రహ్మ తత్త్వము ప్రతిపాదింపఁబడియున్నది.

౨. 'ఆదిత్యోవా ఏషఏతన్మండలం' మున్నగు మంత్ర ములచేత ఉపాసనము ప్రతిపాదింపఁబడియున్నది.

3. 'భూరన్నమగ్నయే పృథివ్యై స్వాహా' మున్నగు మం త్రములచేత కర్మలు చెప్పఁబడినవి.

ఈ నారాయణప్రశ్నమునందు వైశ్వదేవము, సంధ్యా వందనము, దేవతాపూజనము మున్నగు కర్మప్రతిపాదకమగు మంత్రసముదాయ మధికముగ నుండుటచేత ఇది 'యాజ్ఞికీ' యని చెప్పఁబడినది. కర్మప్రతిపాదకమగు మంత్రసముదాయమే అధికముగ ఈనారాయణప్రశ్నమునం దున్నను ఉపక్రమము నందు బ్రహ్మతత్త్వప్రతిపాదనమును, ఉపసంహారమున సత్యాదిసన్న్యాసాంతము లగు తత్సాధనములును చెప్పఁబడి

యున్నవి, బ్రహ్మసూత్రమునం దీ ఉపనిషద్గతమంత్రముల యర్థవిమర్శనముకూడ రెండధికరణములందు చేయఁబడియున్నది. కావున ఇయ్యది యుపనిషత్తని అందఱిచేతను కొనియాడఁబడుచున్నది.

శిక్షాదివల్లీత్రయమునందు ఒకటిరెండుచోట్ల మాత్రమే ఆంధ్రద్రవిడపాఠములకు భేద మున్నందువలన ఆ విషయమును ఉపేక్షించి అధికభేదముగల నారాయణప్రశ్నమును గూర్చి ఆంధ్రద్రావిడపాఠములకుఁగల పరస్పరభేదములను ఈ క్రింద వివరముగఁ దెలుపుచున్నాఁడను:—

నారాయణప్రశ్న మను నామాంతరముగల యాజ్ఞిక్యుపనిషత్తునందు గల

ఆంధ్రద్రావిడపాఠభేదముల వివరణము.

ఆంధ్రపాఠమునందుండు ఈ క్రిందియనువాకములు ద్రావిడపాఠమునందు లేవు.

	అను.	వాక్యాని.
౧. నిధనపతయే...పవిత్రమ్.	౧౬	౨౩
౨. ఓమిత్యేకాక్షరం...వినియోగః.	౩౩	౪
౩. ఋచేత్వా...ధారామ్.	౪౦	౬
౪. మయిమేధాం...దధాతు.	౪౪	౧

	అను	వాక్యాని.
౫. అపైతుమృత్యుః...శచీపతిః.	౪౫	౨
౬. పరంమృత్యో...వారాన్.	౪౬	౨
౭. వాతంప్రాణం...మహీమహి.	౪౭	౨
౮. అముత్ర...శచీభిః.	౪౮	౨
౯. హరిగ్ంహరన్త...విక్రమస్వ.	౪౯	౨
౧౦. శల్కైరగ్నిం...స్తరామ్యహమ్.	౫౦	౨
౧౧. మాచ్ఛిదో...విధేమతే.	౫౧	౨
౧౨. మానో...రీరిషః.	౫౨	౨
౧౩. మానస్తోకే...విధేమతే.	౫౩	౨
౧౪. ప్రజాపతే...రయీణామ్.	౫౪	౨
౧౫. స్వస్తిదాః...అభయంకరః.	౫౫	౨
౧౬. త్ర్యంబకం...మామృతాత్.	౫౬	౨
౧౭. యేతే...యజామహే.	౫౭	౨
౧౮. మృత్యవేస్వాహా మృత్యవేస్వాహా.	౫౮	౧
౧౯. దేవకృతస్యైనసః...స్వాహా.	౫౯	౧౧
౨౦. యద్దేవాః...స్వాహా.	౬౦	౨
౨౧. కామోఽకార్షీత్...స్వాహా.	౬౧	౨
౨౨. మన్యురకార్షీత్...స్వాహా.	౬౨	౨
౨౩. తిలాన్ జుహోమి...స్వాహా.	౬౩	౪
౨౪. తిలాఃకృష్ణాః...స్వాహా.	౬౪	౭
౨౫. అగ్నయేస్వాహా...దధాతుస్వాహా.	౬౭	౪౧
౨౬. ఓంతద్బ్రహ్మ...సువరోమ్.	౬౮	౯
౨౭. వాఙ్మఆసన్...మాహిగ్ంసీః.	౭౨	౮
౨౮. వయస్సుపర్ణాః...బధ్నాన్	౭౩	౨

	అను	వాక్యాని.
౨౯. నమోరుద్రాయ...పాహి.	౭౫	౧
౩౦. త్వమగ్నే...శుచిః.	౭౬	౨
౩౧. శివేనమే...నమః.	౭౭	౧

ద్రావిడపాఠస్థ షడ్వింశోఽనువాకః ఆంధ్రపాఠే ౩౪, ౩౫ అను వాకత్వేన పరిగృహీతః.

ఆంధ్రపాఠస్థ ౩౫ అనువాకస్య అంతిమభాగః ద్రావిడపాఠే ౨౭ అనువాకత్వేన పరిగృహీతః.

౩౦ ద్రావిడపాఠస్థ ౨౬ అనువాకః ఆంధ్రపాఠే ౩౬ అనువాకత్వేన పరిగృహీతః. పరంతు "గచ్ఛదేవి యథా సుఖం" ఇత్యనంతరం "స్తుతోమయావరదా" ఇత్యాదివాక్యద్వయం అధికం వర్తతే.

ఆంధ్రపాఠస్థ ౬౫ అనువాకః ద్రవిడపాఠే ౫౧, ౫౨, ౫౩, ౫౪ ౬౦ ఇత్యనువాకపంచకత్వేన పరిగణితః, పాఠక్రమోఽపి పరివర్తితః.

ఆంధ్రపాఠస్థ ౬౬ అనువాకస్య భూర్యంశః ద్రావిడపాఠే ౫౫, ౫౬. ౫౭, ౫౮, ౫౯ ఇత్యనువాకపంచకత్వేన పరిగణిత్వా పాఠక్రమః పరివర్తితః,

ఆంధ్రపాఠస్థ ౬౯ అనువాకః ద్రావిడపాఠే ౩౨, ౩౩, ౩౪, ౩౫ ఇత్యనువాకచతుష్టయత్వేన పరిగృహీతః.

ఆంధ్ర పాఠానుసారేణ

నారాయణప్రశ్నస్థానువాకానాం వాక్యసంఖ్యా.

అనువాకాది	సంఖ్య.	వా.సం	అనువాకాది	సంఖ్య.	వా.సం
అంభస్యపారే	౧	౧౫౧	నమోహిరణ్యబాహవే	౨౨	౧
జాతవేదసే	౨	౧౪			
భూరన్నం	౩	౧	ఋతగ్ంసత్యం	౨౩	౨
భూరగ్నయే	౪	౧	సర్వోవైరుద్రః	౨౪	౪
భూరగ్నయేచ	౫	౧	కద్రుద్రాయ	౨౫	౩
పాహి నో	౬	౪	యస్యవైకంకతీ	౨౬	౧
పాహి నో	౭	౪	కృణుష్వపాజః	౨౭	౧
యశ్ఛందసాం	౮	౨	అదితిర్దేవాః	౨౮	౧
నమోబ్రహ్మణే	౯	౧	ఆపోవా ఇదగ్ం	౨౯	౧
ఋతం తపః	౧౦	౧	ఆపః పునంతు	౩౦	౪
యథావృక్షస్య	౧౧	౧	అగ్నిశ్చ	౩౧	౯
అణోరణీయాన్	౧౨	౩౪	సూర్యశ్చ	౩౨	౯
సహస్రశీర్షం	౧౩	౨౬	ఓమిత్యేకాక్షరం	౩౩	౪
ఆదిత్యోవాఏషః	౧౪	౧	ఆయాతు వరదా	౩౪	౫
ఆదిత్యోవై తేజః	౧౫	౧	ఓజోఽసి	౩౫	౧౦
నిధనపతయేనమః	౧౬	౨౩	ఉత్తమేశిఖరే	౩౬	౪
సద్యోజాతం	౧౭	౩	ఘృణిస్సూర్యః	౩౭	౩
వామదేవాయ	౧౮	౧	బ్రహ్మమేతుమాం	౩౮	౧౨
అఘోరేభ్యః	౧౯	౨	బ్రహ్మమేధయా	౩౯	౧౩
తత్పురుషాయ	౨౦	౨	బ్రహ్మమేధవా	౪౦	౧౯
ఈశానః	౨౧	౧	మేధాదేవీ	౪౧	౪

అనువాకాది	సంఖ్య.	వా.సం	అనువాకాది	సంఖ్య.	వా.సం
మేధాంమ ఇంద్రః	౪౨	౪	తిలాన్జుహోమి	౬౩	౫
ఆమాం మేధా	౪౩	౨	తిలాఃకృష్ణాః	౬౪	౭
మయిమేధాం	౪౪	౧	ప్రాణాపాన	౬౫	౫
అపైతుమృత్యుః	౪౫	౨	పృథివ్యాపస్తేజో	౬౬	౧౫
పరంమృత్యో	౪౬	౨	అగ్నయేస్వాహా	౬౭	౪౧
వాతంప్రాణం	౪౭	౨	ఓంతద్బ్రహ్మ	౬౮	౯
అముత్రభూయాత్	౪౮	౨	శ్రద్ధాయాంప్రాణే నివిష్టః	౬౯	౨౪
హరిగ్ం హరన్తం	౪౯	౨			
శల్కైరగ్ని మింధానః	౫౦	౨	శ్రద్ధాయాంప్రాణేనివిశ్యా	౭౦	౧౦
మాచ్ఛిదోమృత్యో	౫౧	౨			
మానోమహాంతం	౫౨	౨	అంగుష్ఠమాత్ర	౭౧	౨
మానస్తోకేతనయే	౫౩	౨	వాఙ్మఆసన్	౭౨	౮
ప్రజాపతేనత్వ	౫౪	౨	వయస్సుపర్ణాః	౭౩	౨
స్వస్తిదావిశస్పతిః	౫౫	౨	ప్రాణానాంగ్రంథిః	౭౪	౨
త్ర్యంబకం	౫౬	౨	నమోరుద్రాయ	౭౫	౧
యేతేసహస్రం	౫౭	౨	త్వమగ్నేద్యుభిః	౭౬	౨
మృత్యవేస్వాహా	౫౮	౧	శివేనమే	౭౭	౧
దేవకృతస్యైనసః	౫౯	౧౧	సత్యంపరంపరగ్ం	౭౮	౧
యద్వోదేవాః	౬౦	౨	ప్రాజాపత్యోహారుణిః	౭౯	౧
కామోఽకార్షీత్	౬౧	౨	తస్యైవం విదుషః	౮౦	౧
మన్యురకార్షీత్	౬౨	౨	అనువాకాః. ౮౦. వాక్యాని ౫౬౩		

ఈతైత్తిరీయోపనిషత్తునకు, ఆంధ్రటీకాతాత్పర్యములు వ్రాయునప్పుడు గైకొనిన గ్రంథసహాయము.

౧. శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యకృత మగు తైత్తిరీయోపనిషద్భాష్యము, ఆనందగిరివ్యాఖ్యానసహితము.

౨. శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యకృత తైత్తిరీయభాష్యము, వనమాల వ్యాఖ్యానసమన్వితము.

3. శ్రీమచ్ఛంకరానందకృత ఆత్మపురాణము.

౪. శ్రీమద్విద్యారణ్యమునికృత అనుభూతిప్రకాశము.

౫. శ్రీమత్సురేశ్వరాచార్యకృతతైత్తిరీయభాష్యవార్తికము.

౬. శ్రీమద్విద్యారణ్యమునికృత తైత్తిరీయబృహద్వివరణము.

ఆంధ్రవ్యాఖ్యానమును వ్రాయునపుడు పైగ్రంథముల నుండి చాలవిషయములను సంగ్రహించినాఁడను, మఱికొన్ని గ్రంథములనుండియు సహాయమును పొందినాఁడను. ప్రథమ ముద్రణమునందు చాలచోట్ల మంత్రమునకు మాత్రమే ఆంధ్రటీకాతాత్పర్యముల వ్రాసియుంటిని. ఈ ద్వితీయముద్రణమునందు చాలచోట్ల శంకరకృత మగు ఉపనిషద్భాష్యమును పలుతావుల ఆంధ్రతాత్పర్యమునందు అధికముగ చేర్చినాఁడను. ఇంకయు గ్రంథమునందు నిలిచియున్న అజ్ఞానకృతములగు దోషములను, ప్రమాదజనితదోషములను పండితులు తెలిపినయెడల కృతజ్ఞతాపూర్వకముగ పరిగ్రహించి తృతీయముద్రణమున సంస్కరించి ప్రకటించెదము.

"బృందావనం", కీలుపాకు, మదరాసు. ౨౦-౫-3౪.

ఇట్లు విద్వద్విధేయుఁడు,
క. మార్కండేయశర్మ.

తైత్తిరీయోపనిషద్విషయసూచిక.

శిక్షావల్లి (పుటలు ౧-౧౧౩)

అనువాకము.	విషయము.	పుట.
౧	శాంతిపాఠము ...	౧
	ఉపనిషద్భాష్యపీఠిక ...	౮
	ఉపనిషచ్ఛబ్దనిర్వచనము ...	౧౮
౨	శిక్షాధ్యాయము ...	౨౦
	అక్షరముల నుచ్చరించురీతి ...	౨౪
౩	సంహితోపాసనము ...	౨౬-౩౩
౪	మేధాకామజపమంత్రములు, శ్రీకామహోమమంత్రములు	౩౪-౪౩
౫	వ్యాహృత్యుపాసనము ...	౪౩-౫౨
౬	మనోమయత్వాదిగుణకబ్రహ్మోపాసనము	౫౨-౬౨
౭	పృథివ్యాద్యుపాధికబ్రహ్మోపాసనము ...	౬౩-౬౯
౮	ప్రణవోపాసనము ...	౭౦-౭౪
౯	ఉపాసకధర్మములు ...	౭౪-౭౯
౧౦	బ్రహ్మయజ్ఞప్రతినిధిమంత్రము ...	౮౦-౮౨
౧౧	శిష్యానుశాసనము ...	౮౩-౯౨
	విద్యాకర్మవివేకము ...	౯౨-౧౦౯
౧౨	శాంతిపాఠము ...	౧౦౯-౧౧౩

బ్రహ్మవల్లి - ఆనందవల్లి (పుటలు ౧౧౪-౨౩౩).

అనువాకము.	విషయము.	పుట
౧	శాంతిపాఠము ...	౧౧౪-౧౨౮
	బ్రహ్మవిద్యాప్రకాశము ...	౧౨౮ ౧౪౩
౨	అన్నమయకోశవివరణము ...	౧౪౪-౧౫౩
౩	ప్రాణమయమనోమయకోశవివరణము ...	౧౫౪-౧౬౧
౪	మనోమయవిజ్ఞానమయకోశవివరణము ...	౧౬౨-౧౬౫
౫	విజ్ఞానమయానందమయకోశవివరణము ...	౧౬౬-౧౭౧
౬.౭	బ్రహ్మసత్తాసాధనము ...	౧౭౨-౧౯౭
౮	ఆనందతారతమ్యవివరణము ...	౧౯౮-౨౨౬
౯	నిర్వికల్ప బ్రహ్మప్రతిపాదనాదికము ...	౨౨౭-౨౩౩

భృగువల్లి (౨౩౪-౨౮౩)

౧	వారుణిభృగూపాఖ్యానము ...	౨౩౪
౨	బ్రహ్మవిజ్ఞానమున ప్రథమపర్యాయము ...	౨౪౨
౩	" ద్వితీయపర్యాయము ...	౨౪౫
౪	... " తృతీయపర్యాయము ...	౨౪౭
౫	... " చతుర్థపర్యాయము ...	౨౫౦
౬	... " పంచమపర్యాయము ...	౨౫౩
౭	... అన్నబ్రహ్మోపాసక వ్రతనియమములు ...	౨౫౬
౮	... " ...	౨౫౯
౧౦	ప్రశ్నవిశేషములు ...	౨౬౩

నారాయణప్రశ్నము (౨౮౪-౬౪౦).

అనువాకము.	విషయము.		పుట.
౧	బ్రహ్మతత్త్వప్రతిపాదనము	...	౨౮౪
	కర్మకాండమంత్రములు	...	౩౨౨
	దేవతాగాయత్రీమంత్రములు	...	౩౨౫
	స్నానాంగమంత్రములు	...	౩౩౩
౨	అనిష్టపరిహారార్థము జపింపదగిన మంత్రములు		౩౭౪
౩	అన్నకామహోమమంత్రములు	...	౩౮౧
౪,౫	మహావ్యాహృతిమంత్రములు	...	౩౮౩
౬,౭	జ్ఞానప్రాప్తిమంత్రములు	...	౩౮౮
౮	ప్రణవస్తుతి	...	౩౯౧
౯	బ్రహ్మధారణము	...	౩౯౩
౧౦	తపస్సిద్ధినిమిత్తము జపింపదగినమంత్రములు		౩౯౪
౧౧	నిషిద్ధాచరణనింద	...	౩౯౬
౧౨	తత్త్వోపదేశము	...	౩౯౮
౧౩	ఈశ్వరగుణవిశేషవర్ణనము (మంత్రపుష్పము.)		౪౨౩
౧౪,౧౫	ఆదిత్యమండలమున బ్రహ్మోపాసనము		౪౩౫
౧౬	పార్థివలింగపూజా నమస్కారమంత్రములు		౪౪౧
౧౭-౨౧	మహాదేవపంచవక్త్రమంత్రములు	...	౪౪౯
౨౨	మహాదేవమంత్రము	...	౪౫౫
౨౩-౨౫	దేవతానమస్కారమంత్రములు	...	౪౫౭
౨౬	అగ్నిహోత్రహవణీవృక్షనిర్ణయము	...	౪౬౧
౨౭	రక్షోఘ్నమంత్రములు	...	౪౬౨
౨౮-౨౯	పృథివీజలాధిదేవతాస్తుతిమంత్రములు...		౪౭౦

అనువాకము.	విషయము.		పుట.
౩౦-౩౬	సంధ్యావందనమంత్రములు	...	౪౭౪
౩౭	ఆదిత్యస్తుతిమంత్రము	...	౪౯౬
౩౮-౪౦	త్రిసువర్ణమంత్ర, తద్వ్యాఖ్యానములు	...	౪౯౭
౪౧-౪౪	మేధాదేవతాప్రార్థనాదిమంత్రములు	...	౫౧౧
౪౫-౫౭	అభీష్టసిద్ధికొఱకు ఈశ్వరుని ప్రార్థించుమంత్రములు		౫౧౭
౫౮	మృత్యుదేవతాహోమమంత్రములు	...	౫౩౨
౫౯	విధురవైశ్వదేవహోమమంత్రములు	...	౫౩౩
„	పాపనివారకహోమమంత్రములు	...	౫౩౪
౬౦-౬౨	„	...	„
౬౩-౬౬	విరజాహోమమంత్రములు	...	౫౪౨
౬౭	వైశ్వదేవహోమ బలిహరణ మంత్రములు		౫౫౮
౬౮	పాపక్షయకరమంత్రములు	...	౫౬౮
౬౯	ప్రాణాహుతిమంత్రములు	...	౫౭౦
౭౦-౭౭	భోజనానంతరము జపింపఁదగిన మంత్రములు		౫౭౭
౭౮	జ్ఞానసాధనభేదములు	...	౫౮౯
౭౯	జ్ఞానసాధనవిషయకమగు ఆఖ్యాయిక	...	౫౯౮
౮౦	ఆత్మయజ్ఞము	...	౬౨౩

శ్రీరస్తు

తైత్తిరీయోపనిషత్

శిక్షావల్లీ

ఆంధ్రటీకాతాత్పర్యసమన్వితము

పూర్వశాంతిపాఠః.

హరిః ఓమ్

[1]శం నో మిత్రశ్శం వరుణః। శం నో భవత్వర్యమా।
శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణురురుక్రమః।
[2]నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్ర
త్యక్షం బ్రహ్మాసి। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మ వది
ష్యామి। ఋతం వదిష్యామి। సత్యం వదిష్యామి ॥౧॥
తన్మామవతు। తద్వక్తారమవతు। అవతు మామ్।
అవతు వక్తారమ్। ఓం శాన్తిశ్శాన్తిశ్శాన్తిః ॥౧॥
సత్యం వదిష్యామి పంచచ ॥

౧. ప్రథమోఽనువాకః.

మూ. హరిః ఓమ్. ౧శం నో మిత్ర శ్శం వరుణః । శం నో భవ
త్వర్యమా । శం న ఇంద్రో బృహస్పతిః । శం నో విష్ణు
రురుక్రమః । నమో బ్రహ్మణే । నమ స్తే వాయో ।
త్వ మేవ ప్రత్యక్షం బ్రహ్మాసి । *త్వ మేవ ప్రత్య
క్షం బ్రహ్మ వదిష్యామి । ఋతం వదిష్యామి । సత్యం
వదిష్యామి ॥౧। త న్మా మవతు । త ద్వక్తార మవతు ।
అవతు మామ్ । అవతు వక్తారమ్ । ఓం శాన్తి శ్శాన్తి
శ్శాన్తిః ౧। సత్యం వదిష్యామి పంచ చ।

టీ. ౧. మిత్రః = మిత్రుఁడు (ప్రాణవృత్తికిని పగటికి అభిమాని యగుదేవత), నః = (శిష్యాచార్యులము అగు) మాకు, శం = సుఖమును (కలుఁగఁజేయువాఁడు అగుఁగాక), వరుణః = వరుణుఁడు (అపానవృత్తికిని రాత్రికిని అభిమానియగుదేవత), శం = సుఖకరుఁడు (మాకు అగుఁగాక), అర్యమా = అర్యముఁడు (సూర్యమండలమునకును, నేత్రములకును అభిమాని యగుదేవత), నః = మాకు, శం = సుఖకరుఁడు, భవతు = అగుఁగాక. ఇంద్రః = ఇంద్రుఁడు (బలాభిమాని యగు దేవత), నః = మాకు, శం =

---

* భాష్యే 'త్వామేవ' ఇత్యేవవ్యాఖ్యాతం. తథాఽపి సంప్రదాయ పాఠమనుసృత్యాస్మాభిః 'త్వమేవ' ఇత్యేవముద్రితమ్.

సుఖకరుఁడు (అగుఁగాక), బృహస్పతిః = బృహస్పతి (వాక్కునకును బుద్ధికిని అభిమానియగు దేవత సుఖకరుఁడు అగుఁగాక), ఉరుక్రమః = (త్రివిక్రమావతారమునందు) విస్తీర్ణమయిన పాదప్రక్షేపముగల, విష్ణుః = విష్ణువు (పాదాభిమాని యగుదేవత), నః = మాకు, శం = సుఖకరుఁడు (అగుఁగాక).

టీ. ౨. బ్రహ్మణే = వాయుస్వరూపునికొఱకు, నమః = నమస్కారము. వాయో = ఓవాయూ! తే = నీకొఱకు, నమః = నమస్కారము, త్వం ఏవ = నీవే, ప్రత్యక్షం = ప్రత్యక్షమయిన, బ్రహ్మాసి = బ్రహ్మము అగుచున్నాఁడవు. త్వాం ఏవ = నిన్నే, ప్రత్యక్షం = ప్రత్యక్షమయిన, బ్రహ్మ = బ్రహ్మము (అని), వదిష్యామి = చెప్పుచున్నాఁడను. (నిన్నే) ఋతం = ఋతస్వరూపునిగను (ఋత మనఁగా శాస్త్రానుసారము ఆచరణీయ మని బుద్ధియందు నిశ్చయించుకొనఁబడినవిషయము, యజ్ఞయాగాదికర్మ జాతము), వదిష్యామి = చెప్పుచున్నాఁడను. సత్యం = సత్యస్వరూపునిగను (సత్యమనఁగా శాస్త్రానుసారము నిశ్చయింపఁబడిన విషయమును వాక్కాయ ములచేత నాచరించుట), వదిష్యామి = చెప్పుచున్నాఁడను. తత్ = (సర్వాత్మకమును, నాచేత స్తుతింపఁబడినదియు అగు) ఆవాయు పరబ్రహ్మము, మాం = (విద్యార్థియగు) నన్ను, అవతు = సంరక్షించుఁగాక. తత్ = ఆ వాయుపరబ్రహ్మము, వక్తారం = ఆచార్యుని, అవతు = సంరక్షించుఁగాక. మాం=(విద్యార్థియగు)నన్ను, అవతు = సంరక్షించుఁగాక. వక్తారం=ఆచార్యుని, అవతు=సంరక్షించుఁగాక. ఓం శాంతిః (అస్తు) = (ఆధ్యాత్మికతాపము) శమిం చుఁగాక. శాంతిః (అస్తు) = (అధిభౌతికతాపము) శమించుఁగాక. శాంతిః (అస్తు) = అధిదైవికతాపము శాంతించుగాక.

తా. ౧. మిత్రుఁడు, వరుణుఁడు, అర్యముఁడు, ఇంద్రుఁడు, బృహస్పతి, విష్ణువు వీరలు అధ్యాత్మదేవతలు. అనఁగా—

౧. శరీరమందుఁ గల ప్రాణవృత్తికి అభిమానియగు దేవత మిత్రుఁడు; ౨. అపానవృత్తికి అభిమాని యగుదేవత వరుణుఁడు; 3. నేత్రాభిమాని యగుదేవత అర్యముఁడు; ౪. బలాభిమాని యగుదేవత ఇంద్రుఁడు; ౫. వాగ్బుద్ధ్యభిమాని యగుదేవత బృహస్పతి; ౬. పాదాభిమాని యగుదేవత విష్ణువు. ఇటుల వీరలు అధ్యాత్మదేవత లగుచున్నారు. ఇట్టిదేవతలు నాకు సుఖమును కలుగఁజేయుదురుగాక యని ప్రప్రథమమున ప్రార్థించుచున్నాఁడు. ఆయాదేవతలు సుఖకారు లయినయెడల విద్యాశ్రవణము, విన్నవిషయమును మరుపులేక మనస్సునందు ధరించుట మొదలగు కృత్యములు శిష్యునకును, శిష్యున కుపదేశించుట మొదలగునవి ఆచార్యునకును చక్కఁగా కలుగు నను తలంపుతో వారిని ప్రార్థించుట అత్యావశ్యకముగదా.

తా. ౨. బ్రహ్మమునకు నమస్కారము. ఓవాయూ! నీకునమస్కారము; ఇచట ప్రథమమున పరోక్షముగను, రెండవపర్యాయము అపరోక్షముగను బ్రహ్మమునకు నమస్కారము చేయఁబడినది. నీవే ప్రత్యక్షమయిన బ్రహ్మము అయితివి. కావున నిన్నే ప్రత్యక్షమయిన బ్రహ్మముగా చెప్పుచున్నాఁడను. ప్రాణము బాహ్యమయిన చక్షురాదికమువలె రూపదర్శనాద్యనుమేయముగాక సాక్షివేద్యమయి భోక్తయగు పరమాత్మకు సన్నిహితమయి యుండునది కావున ప్రత్యక్ష బ్రహ్మమనుట న్యాయమే యగుచున్నది. రాజదర్శనాకాంక్షి యగువాఁడు రాజద్వారపాలకుని గాంచి నీవే రాజువంటివాఁడవు అని పలికి సులభముగ తనకార్యమును సానుకూలముగ చేసికొనుచున్నటుల హృదయాంతర్గతుఁడగు బ్రహ్మమును జూడఁ

దలఁచిన ముముక్షువు పరబ్రహ్మమునకు ద్వారపాలకుఁడగు వాయువును నీవే బ్రహ్మమని పలుకుటయు యుక్తమే యగుచున్నది.

ఇదివఱకు నమస్కారము, బ్రహ్మవదనము (అనఁగా బ్రహ్మమని చెప్పుట) అనునవి చెప్పి స్తుత్యంతరమును చెప్పుచున్నాఁడు:—

నిన్నే ఋతమునుగాఁ జెప్పుచున్నాఁడను.

నిన్నే సత్యమునుగాఁ జెప్పుచున్నాఁడను.

ఋత మనఁగా శాస్త్రీయమయిన కర్తవ్యమును బుద్ధియందు నిశ్చయించుకొనుట. సత్యము అనఁగా ఆనిశ్చయించుకొన్నవిషయమును వాక్కాయములచే నాచరించుట. వాయువు సర్వాత్మకము కావున ఋతుసత్యశబ్దాభిధేయముకూడ అగుచున్నది. ఇట్టి సర్వాత్మక మగు వాయుపరబ్రహ్మము విద్యార్థి యగు నాచేత నమస్కరింపఁబడి స్తుతింపఁబడినదై నాకు విద్యను కలుగఁజేసియు, ఆచార్యునకు వక్తృత్వసామర్థ్యమును కలుగఁజేసియు సంరక్షించుఁగాక. "నన్ను సంరక్షించుఁగాక ! ఆచార్యుని సంరక్షించుఁగాక!" అని రెండుపర్యాయములు చెప్పుట ఆదరార్థము అని గ్రహించవలయును.

"శాంతిః శాంతిః శాంతిః"

అని ముమ్మారు శాంతిని పఠించుట త్రివిధ తాపప్రశమనార్థము చెప్పఁబడినది.

౧. వివరణము.

అహరభిమానదేవత మిత్రుఁడనియు, రాత్ర్యభిమానదేవత వరుణుఁడనియు అనుటకు శ్రుతిప్రమాణము:—

తైత్తిరీయసంహిత ౬-వ కాండము, ౪-వ ప్రపాఠకము, ౮-వ యనువాకమునందు మిత్రావరుణగ్రహబ్రాహ్మణమునం దీవిధముగఁ గలదు.—

తైత్తి—౩

శ్రు. నవా ఇదం దివా న నక్త మాసీ దవ్యావృత్తం తే దేవా మిత్రా వరుణా వబ్రువ న్నిదం నో వివాసయతా మితి తా వబ్రూతాం వరం వృణావహా ఏక ఏవాఽఽవత్పూర్వో గ్రహో గృహ్యాతా ఇతి తస్మా దైంద్ర వాయవః పూర్వో మైత్రావరుణా ద్గృహ్యాతే ప్రాణాపానా హ్యేతౌ యదు పాగ్ం శ్వన్తర్యామౌ మిత్రో ఽహ రజనయ ద్వరుణో రాత్రిం తతో వా ఇదం వ్యౌచ్ఛత్. తై. సం. ౬. ౪. ౮. 3.

(అర్థ.) ప్రథమమున కాలమంతయు ఇంతవఱకు రాత్రి, ఇంతవఱకు పగలు అను విభాగము లేకయుండెననియు, దేవతలు మిత్రావరుణులను కాలమును విభజింపవలసినదిగా కోరిరనియు, దేవతల మనోరథానుసారము వారిలో మిత్రుఁడు (సూర్యోదయము మొదలుకొని సూర్యుని యస్తమయము వఱకు) పగలని విభజించె ననియు, వరుణుఁడు (సూర్యాస్తమయము మొదలుకొని మఱల సూర్యోదయమువఱకు) రాత్రియని విభజించె ననియు, అది మొదలుకొని ఈ విభాగము ఏర్పడినది.

[illegible] ప్రకృతమున కత్యావశ్యకమగుటచేత తాత్పర్యమునందు అభిమాని దేవతావిషయమును మాత్రమే వివరించినాఁడను.

౨. తాపత్రయవివరణము.

1. ఆధ్యాత్మికతాపమనఁగా:—జ్వరము, తలనొప్పి మున్నగువ్యాధులు; 2. ఆధిభౌతికతాప మనఁగా:—చోరవ్యాఘ్రాదుల యుపద్రవము; 3. ఆధి దైవికతాప మనఁగా:—యక్షరాక్షసాద్యుపద్రవము; ఇట్టి శాంతిపఠనము మున్నగునవి శిష్యాభిప్రేతములు కాని ఆచార్యాభిప్రేతములు కావని ఎఱుంగవలయును.

సూచనము:—మూలమునందు "త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి" అని గలదు. ఇట్లే వైదికపాఠము సుప్రసిద్ధమయి యున్నది. శ్రీమచ్ఛంకరా

చార్యులవారు భాష్యమునందు "త్వామేవ" అని గ్రహించి భాష్యము నొనర్చిరి. ద్వాదశానువాకమునందు "త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మావాదిషమ్" అని యుండుటచేత ఇచట కూడ ఆచార్యులవారి కాలమునందు "త్వామేవ" అని పాఠ ముండుటచేతనే వారటుల గ్రహించి భాష్యము నొనర్చియున్నారని తెలియవచ్చుచున్నది. అయినను వైదికపాఠబలము ననుసరించి మేము "త్వమేవ" అనియే మూలమునందు ముద్రించియున్నారము. అర్థమునందు "త్వం ఏవ = నిన్నే" అని అర్థమును వ్రాసి యున్నారము. అప్పుడు ద్వితీయార్థమునందు ప్రథమనుగా గ్రహించవలయును.

3. "వదిష్యామి" అను లకారమునకు వర్తమానార్థమును గ్రహించితిమి. వనమాలయం దిట్లే వ్యాఖ్యాతమైనది.

౪. శాంతిపాఠరూపమగు "శం నో మిత్రః శ్శం వరుణః......ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః" అనునది ఇచట ప్రథమానువాకముగా పరిగణింపఁబడినది. ఈ శిక్షాధ్యాయమునందు ౧౨ అనువాకములు గలవు. అందు ౧-వ, ౧౨-వ అనువాకములు శాంతిపాఠరూపములు.

౫. ఈ యధ్యాయమునందు ప్రప్రథమమున వర్ణ, స్వర, మాత్రాది శిక్షణావశ్యకతను బోధించుటచేత "శిక్షావల్లి" యనియు, సంహితాద్యుపాసనమును చెప్పుటచేత "సాంహిత్యుపనిషత్" అనియు, ఈ యధ్యాయమునకు నామములు వ్యవహారములో నున్నవి.

శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యకృత

ఉపనిషద్భాష్య పీఠిక.

శ్లో. యస్మా జ్జాతం జగ త్సర్వం యస్మి న్నేవ ప్రలీయతే,
యేనేదం ధార్యతే చైవ తస్మై జ్ఞానాత్మనే నమః. ౧

తా. ఈ జగమంతయు ఎవనివల్లనుండి పుట్టినదో, ఎవనిచేత ధరింపఁబడుచున్నదో, ఎవనియందు లీన మగుచున్నదో అట్టి జ్ఞానాత్మునకు (అనఁగా జ్ఞానస్వరూపునకు) నమస్కారము.

శ్లో. యై రిమే గురుభిః పూర్వం
పదవాక్యప్రమాణతః,
వ్యాఖ్యాతా స్సర్వవేదాంతా
స్తా న్నిత్యం ప్రణతోఽస్మ్యహమ్. ౨

తా. పదవాక్యప్రమాణ వివేచనాపూర్వకముగ ఈ సకలోపనిషత్తులను ఏగురువులు వ్యాఖ్యానమొనర్చియుండిరో అట్టి గురువులనుగూర్చి నే నెల్లప్పుడు నమస్కరించుచున్నాఁడను.

శ్లో. తైత్తిరీయకసారస్య మయాఽఽచార్యప్రసాదతః,
విస్పష్టార్థరుచీనాం హి వ్యాఖ్యేయం సంప్రణీయతే. 3

తా. (ఉపనిషత్తునందుండు) సకలపదములకు స్పష్టముగ అర్థమును గ్రహింపఁదలఁచు వారి నిమిత్తము నేను శ్రీమదాచార్యులవారి కృపావిశేషబలముచేత తైత్తిరీయోపనిషత్తునకు వ్యాఖ్యానమును చేయుచున్నాఁడను.

పీఠిక.

నిత్యకర్మలు పూర్వజన్మమునందు చేసిన పాపములను నశింపఁజేయుఁ నవి యనియు, కామ్యకర్మలు ఫలాభిలాషగలవారి కనియు పూర్వభాగము నందు (అనఁగా వేదమునందు) ప్రతిపాదింపఁబడియున్నది. ఇపుడు కర్మ ప్రవృత్తికి హేతుభూత మగు కామముయొక్క నిరాసముకొఱకు బ్రహ్మవిద్య చెప్పఁబడుచున్నది. కోరికయుండియే కర్మాచరణమునందు ప్రవర్తింపు చున్నారు కావున కర్మమునకు కామము (కోరిక) ప్రవర్తక మగుచున్నది. ఆప్తకాములయిన వారలకు కామములేనందువలన వారు ఆనందాత్మయందు లీనులయియుందురు. అప్పుడు ప్రవృత్తియే కలుగఁజాలదు. ఆత్మకాముఁడే ఆప్తకాముఁ డనఁబడును. ఆత్మ యనఁగా బ్రహ్మము. అట్టిబ్రహ్మము నెఱింగిన వానికే పరప్రాప్తిని (బ్రహ్మవిదాప్నోతి పరం. తై. ఆ. ౮. ౧. ౧ అని ముందు) చెప్పఁబడును. అందువలన అవిద్య నశింపఁగా స్వస్వరూపమునం దుండుటయే పరప్రాప్తి యగును. ఇందులకు ప్రమాణభూతములగు శ్రుతులు.—

౧. అథయం ప్రతిష్ఠాం విందతే. తై. ఉ. ౨. ౭. ౧.

౨. ఏత మానందమయ మాత్మాన ముపసంక్రామతి. తై. ఉ. ౨. ౮. ౧.

(మున్నగునవి చాల గలవు.)

౧. పూర్వపక్షము.

పూర్వమీమాంసకులు కేవల కర్మములే మోక్ష సాధనములని నిర్ణయించుట.

క. (మోక్షము నభిలషించువాఁడు) కామ్య, నిషిద్ధకర్మలను చేయఁడు. ప్రారబ్ధకర్మము అనుభవముచేత నశించును. నిత్యకర్మాచరణమువలన ప్రత్య

వాయము కలుగదు. కావున అప్రయత్నముగ స్వస్వరూపముగ నుండుటయే మోక్షము.

ఖ. లేక నిరతిశయప్రీతి యనునది స్వర్గశబ్దవాచ్యము. అట్టిస్వర్గము కర్మాచరణసాధ్యము. కావున కర్మల నాచరించుటవలననే మోక్షము కలుగును.

౧. తత్సమాధానము.

క. కర్మ లనేకవిధములు అయియుండుటవలన అట్లనరాదు. అనేక జన్మాంతరకృతములును, *విరుద్ధఫలజనకములును అగుకర్మలు ఆరబ్ధఫలము లనియు, అనారబ్ధఫలము లనియు అనేకవిధములుగా నున్నవి. అందువలన అనారబ్ధఫలములు (అగుకర్మలు) ఒకేజన్మమునందు అనుభవించుటచేత నశించు ననుట సంభవముకాదు. (కావున) శేషకర్మ (ఫలానుభవ) నిమిత్తము శరీరారంభము కలిగితీరును. కర్మ (ఫలము) శేషించి యుండు ననుటకు.—

౧. శ్రు. తద్య ఇహ రమణీయచరణాః అభ్యాశోహ యత్తే రమణీయాం యోని మాపద్యేరన్ బ్రాహ్మణయోనిం వా క్షత్రియయోనిం వా వైశ్యయోనిం వా; అథ యఇహ కపూయచరణా అభ్యాశోహయత్తే కపూయాం యోని మాపద్యేరన్ శ్వయోనిం వా సూకరయోనిం వా చాండాలయోనింవా†) ఛాందోగ్యోపనిషత్తు. ౫. ౧౦. ౭.

---

* విరుద్ధఫలజనకము లనఁగా ఒకఁడు అశ్వమేధయాగము నొనర్చును. అతఁడే సురాపానాదిదుష్కృత్యముల నొనర్చును. ఈసుకృతదుష్కృతముల ఫలములు విరుద్ధముగ నుండును. ఒకజన్మమునందు ఇట్టి విరుద్ధధర్మములగుఫలముల ననుభవించుట అసంగత మని భావము.

† అర్థ. పుణ్యకర్మల నాచరించినవారు స్వర్గమునందు పుణ్యఫల మనుభవించి పుణ్యశేషముతో బ్రాహ్మణాద్యుత్తమజన్మములందు పుట్టుచున్నారు.

౨. స్మృ. (వర్ణా ఆశ్రమా శ్చ స్వకర్మనిష్ఠాః ప్రేత్య కర్మఫల మను భూయ) తతశ్శేషేణ విశిష్టదేశజాతికులరూపాయుశ్శ్రుతవృత్తవిత్తసుఖమే ధసో జన్మప్రతిపద్యంతే. †

గౌతమధర్మసూత్ర. ౨. ౧౧. ౨౯.

మున్నగు శ్రుతిస్మృతిప్రమాణము లనేకములు గలవు.

పూర్వపక్షము.

నిత్యకర్మలు ఆరబ్ధములుకాని ఇష్టానిష్టఫలములుగల కర్మల నాశన మొనర్చును (కావున నిత్యకర్మాచరణముచేత కర్మశేషము నశించి మోక్షము సిద్ధించును. దీనివలన జ్ఞానములేకయే నిత్యకర్మాచరణమువలన మోక్షము సిద్ధించును.) అని పూర్వమీమాంసకుని యభిప్రాయము.

సమాధానము.

(నిత్యకర్మలు) చేయనియెడల ప్రత్యవాయము గలదని చెప్పఁబడి యున్నది కావున నీవుచెప్పినట్లు అనరాదు. (నిత్యకర్మలు) నిత్యకర్మల నాచరింపకపోవుటచేత కలుగనట్టి ప్రత్యవాయమును పోఁగొట్టుకొనుటకే ఆచరింపఁబడుచున్నవి. (అని పూర్వమీమాంసకులు) అంగీకరించియున్నారు కావున అనారబ్ధఫలకర్మక్షయార్థము (నిత్యకర్మాచరణ) మనుట తగదు. లేక ఒకవేళ నిత్యకర్మాచరణము అనారబ్ధఫల కర్మక్షయార్థమే యని యంగీకరించినను పాపఫలప్రదకర్మనే నశింపఁజేయునుగాని విరోధము లేకపోవుటవలన

---

† పాపకర్మ లనొనర్చినవారు నరకలోకమునందు తత్ఫల మనుభవించి కర్మశేష ములో శ్వసూకరచండాలాది నీచజన్మములందు పుట్టుచున్నారు. అని పై ఛాందోగ్యశ్రుత్యర్థము. గౌతమధర్మసూత్రార్థముసైత మింతయే.

పుణ్యఫలప్రదకర్మలను నశింపఁజేయఁజాలదు. ఇష్టఫల(ప్రద)మగుకర్మ పుణ్యకర్మ కావున నిత్యకర్మలతోడ విరోధింపదు. పుణ్యపాపములకు (గదా పరస్పరము) విరోధము తగియుండును.

కర్మాచరణమునకు హేతుభూతములగుకామములు జ్ఞానము లేనియెడల నశింపఁజాలవు కావున అశేషకర్మక్షయ మెన్నఁటికిని కాఁజాలదు. కామము ఫలవిషయము కావున (ఆకామము) అనాత్మవిదునకే కలుగునుగాని ఆత్మవిదునకు కలుగదు. ఆత్మ నిత్యప్రాప్తుఁడు కావున కామోత్పత్తియే కలుగఁ జాలదు. విద్వాంసునివిషయమై "అయమాత్మా పరంబ్రహ్మ" యని చెప్పఁబడియే యున్నది.

నిత్యకర్మల నాచరింపమిచే ప్రత్యవాయము కలుగు ననుట అయుక్తము కావున పూర్వజన్మార్జిత పాపములవలన పొందఁబడునట్టి ప్రత్యవాయక్రియకు నిత్యాకరణమును లక్షణగాగ్రహించినయెడల "అకుర్వన్ విహితం కర్మ" అను చోటఁ గల శతృప్రత్యయమునకు అనుపపత్తి లేదు.

అట్లు గ్రహింపనియెడల "అభావమువల్లనుండి భావము పుట్టుట" యను సర్వప్రమాణవ్యాకోపము సిద్ధించును.

ఇందువలన అయత్నముగ స్వాత్మావస్థాన మనుట పొసఁగనేరదు.

(ఇంతవఱకు మీమాంసకుని ప్రథమాశంకకు సమాధానము.)

పూర్వమీమాంసకుని ద్వితీయాశంకకు సమాధానము.

ఖ. "స్వర్గశబ్దవాచ్య మగు నిరతిశయప్రీతి కర్మలవల్లనే సిద్ధించుచున్నది కావున కర్మలవల్లనే మోక్షము సిద్ధించును" అని చెప్పుట యుక్తము కాదు. (ఏలయనఁగా) మోక్షము నిత్యము. లోకమునందు నిత్యమేదియు ఆరబ్ధమగుటలేదు. ఏయది ఆరబ్ధమో అది యనిత్యము. కావున మోక్షము కర్మల (నాచరించుట) వలన కలుగఁజాలదు. "విద్యాసహితములగు కర్మలు

నిత్య(మగు మోక్ష)మును కలుగఁజేయును" అనియు ననఁగూడదు. (అట్లనుట) విరోధమగుచున్నది. "నిత్యము ఆరబ్ధమగుచున్నది." అనుట (పరస్పర)విరుద్ధము (గదా) "ఏయది నశించుచున్నదో అదియే మఱల పుట్టుట లేదు. కావున ప్రధ్వంసాభావమువలె నిత్యమగు మోక్షముసైతము ఆరబ్ధము కావచ్చును" అనునెడల అట్లనరాదు. (ఏలయనఁగా) మోక్షము భావరూపము. "ప్రధ్వంసాభావము ఆరబ్ధమగుచున్నది" అనుటయు పొసఁగనేరదు, అభావమునకు విశేషము లేకపోవుటచేత కేవలము వికల్పమే యగుచున్నది. అభావమనఁగా భావమునకు భిన్నమయినది. (భావమునకు ప్రతియోగి యనుట) లోకమునందు అభిన్నమగుభావము ఘటపటాదులతో విశేషితమయి భిన్నమయినదానివలె 'ఘటభావము' అనియు; 'పటభావము' అనియు (ఎటుల) చెప్పఁబడుచున్నదో అట్లే నిర్విశేషమగు అభావము సైతము క్రియాగుణసంబంధమువలన ద్రవ్యాదికమువలె వికల్పింపఁబడుచున్నది. అభావము ఉత్పలాదికమువలె విశేషణవిశిష్టముకాదు. విశేషణసమన్వితమే యభావమగునెడల భావమే యగునుగదా.

ప్రకారాంతరముగా పూర్వపక్షము—తత్సమాధానము.

పూర్వ:—విద్యాకర్మకర్త నిత్యుఁడు కావున విద్యాకర్మసమూహము వలన కలుగునట్టి మోక్షముసైతము 'గంగాప్రవాహమువలె నిత్యమగుఁగాక'

సమా:—అనుట తగదు. కర్తృత్వ మెప్పుడును దుఃఖరూపము. కర్తృత్వమును వదలిన మోక్షమునకు విచ్ఛిత్తి సంభవించును. కావున అవిద్యాది కర్మోపాదానహేతువులు నశింపఁగా స్వాత్మావస్థానమే మోక్షము.

ఆత్మయనిన బ్రహ్మమే. అట్టి యాత్మవిజ్ఞానమువల్లనే అవిద్యానివృత్తి యగుచున్నది. కావున బ్రహ్మవిద్యానిమిత్తము ఉపనిషత్తు (యొక్క వ్యాఖ్యానము) ఆరంభింపఁబడుచున్నది.

ఉపనిషచ్ఛబ్దనిర్వచనము.

ఉపనిషత్తనఁగా బ్రహ్మవిద్యయని (ఎఱుంగునది).

వైయాకరణమతమునను సరించి నిర్వచనత్రయము

౧. ఉపనిషదితి బ్రహ్మవిద్యా. తచ్ఛీలినాం కర్మజన్మమరణాది నిశాతనాత్.

౨. తదవసాదనా ద్వా.

3. బ్రహ్మణః ఉపనిగమయితృత్వాత్ (తదర్థత్వాత్ గ్రంథోఽప్యుపనిషత్).

అర్థ. ౧. ఉపనిషత్తనఁగా బ్రహ్మవిద్య. ఆబ్రహ్మవిద్యను పరిశీలించు విద్వాంసులగువారలకు కర్మజన్మమరణాదికమును శిథిలమొనర్చునది కావున "ఉపనిషత్తు" అనఁబడును.

౨. లేక ఆజన్మమరణాదికమును నశింపఁజేయునది కావున (బ్రహ్మవిద్య) ఉపనిషత్తనఁబడును.

3. (లేక) బ్రహ్మమును పొందింపఁజేయునది కావున బ్రహ్మవిద్య 'ఉపనిష' త్తనఁబడును. అట్టివిషయము కలిగియుండుటచేత గ్రంథముసైతము ఉపనిష త్తనఁబడును.

అర్థాంతరము.

౪. ఉపనిషణ్ణాం అస్యాం పరంశ్రేయ ఇతి ఉపనిషత్. తదర్థత్వా ద్గ్రంథోఽప్యుపనిషత్.

అర్థ. దీనియందు మోక్షము సమీపమునందు విషయముగా నున్నది. కావున 'ఉపనిషత్' అని చెప్పఁబడును. అట్టివిద్యయే ప్రయోజనముగాఁగల గ్రంథముసైతము ఉపనిషత్తని చెప్పఁబడును.

వివరణము:—జీవునకు శరీరప్రాప్తి కలుగుట బంధహేతు వనియు, శరీరప్రాప్తిలేకపోవుట మోక్ష మనియు శ్రుతిసిద్ధాంతము. ఈవిషయమునే ౧. శ్రు: న హ వై సశరీరస్య సతః ప్రియాప్రియయో రపహతి రస్తి ౨. శ్రు. అశరీరం వావ సంతం న ప్రియాప్రియే స్పృశతః. అనియుశ్రుతులు ఘంటాఘోషముగ పలుకుచున్నవి. ఈవిషయమును వేదాంతులు సుస్పష్టముగను, ఒకవిధముగ పూర్వమీమాంసకులును అంగీకరించినారు. కాని ఇట్టిస్థితి జ్ఞానమువలనఁగాని కలుగఁ జాలదని వేదాంతులును, జ్ఞాన మక్కరలేకయే కర్మాచరణము వల్లనే సిద్ధించునని పూర్వమీమాంసకులును పలుకుచున్నారు. అందు పూర్వమీమాంసకుని సిద్ధాంతమును ప్రక్రమమున వివరించెదను:—

ముముక్షువగువాఁడు కామ్యకర్మలను నిషిద్ధకర్మలను ఆచరింపఁజాలఁడు కావున స్వర్గాదిపుణ్యలోకములుగాని, శ్రేష్ఠజన్మముగాని, నరకబాధగాని, నీచజన్మముగాని వానికి కలుగదు.

నిత్యకర్మల నాచరించుచున్నాఁడు కావున ప్రత్యవాయము అనఁగా నిత్యకర్మల నాచరింపనందువలన కలిగెడిపాపము నశించును.

ప్రారబ్ధమగు కర్మఫలమువలన ఈజన్మము మనకు సమకూడెను కావున ప్రారబ్ధజన్మానుభవమువలన కర్మయంతయు నశించిపోవును.

జన్మాంతరమును కలుగఁజేయఁ జాలెడి కామ్యనిషిద్ధకర్మలు ముముక్షువగువానికి లేవు గనుక, వానికి పునర్జన్మప్రాప్తియే లేదు. ఇదియే ప్రియాప్రియరహితావస్థ గావున మోక్షము అనంబడును.

(పూర్వమీమాంసకుల యభిప్రాయమునందు నిత్యకర్మాచరణమునకు ఫలమేమియులేదు. ఆచరింపనియెడల వచ్చెడిపాపమును పోఁగొట్టుకొనుటకయి నిత్యకర్మల నాచరించుచున్నాఁడేగాని ఆయాచరణమువలన మఱొకపుణ్యఫలమేమియు లేదని భావము.

వేదాంతమతమున పైదానికి సమాధానము.

వేదాంతుల యభిప్రాయమునందు నిత్యకర్మాచరణమునైతము పుణ్యలోకప్రాప్తికి సాధనభూత మని గ్రహించునది.

కర్మలు విహితము లనియు, కామ్యములనియు, ప్రాయశ్చిత్తములనియు, నిషిద్ధము లనియు నాల్గు తెఱఁగులు.

శ్రుతియందు ఈపైని వివరింపఁబడిన కర్మభేదమును పరిగణింపక శ్రు. కర్మణా పితృలోకః. బృ. ఉ. ౧. ౫. ౧౬. అని చెప్పఁబడియున్నది. ఇచట 'కర్మణా' యను నిర్విశేషణమగుపదము విహితకర్మవాచకముగాని తదితరవాచకముగాదు. ఏలయనఁగా, 'కర్మణా' యనుపదమునకు నిషిద్ధకర్మ యని గ్రహింపఁ దగదుగదా. అట్లే ప్రాయశ్చిత్తకర్మ యని గ్రహింపఁ దగదుగదా. కామ్యకర్మ యని యందుమేని కామ్యకర్మలు పశుకాముఁడు, స్వర్గకాముఁడు, స్వారాజ్యకాముఁడు మున్నగు అధికారిని కంఠోక్తిగనే చెప్పుచున్నవి. ఇచట అట్టి కంఠోక్తిలేదు. ఇఁక పరిశేషన్యాయముచేత 'కర్మణా' యను పదముచేత 'విహితకర్మయే' తప్పక గ్రహింపవలసివచ్చుచున్నది. అని వేదాంతుల యభిప్రాయము.

ఇదియునుఁగాక మోక్షకామియగువాఁడు ఈకర్మను చేయవలయును అని ప్రత్యేకముగ వేదమునం దెచ్చటగాని ఏమియు విధింపఁబడియుండలేదు కనుక కర్మాచరణమునకు సంసారమే ఫల మనుట సిద్ధాంతము.

పూర్వమీమాంసకుఁడు 'ముముక్షు వగువాఁడు కామ్యనిషిద్ధకర్మముల నాచరింపఁడు కావున పుణ్యపాపజన్మలు వానికి కలుగఁజాల'వని చెప్పినపుడు అట్టిపుణ్యపాపకర్మలు ప్రకృతజన్మమునందు ఆచరింపక పోవచ్చును గాని జన్మాంతరములందు సంచితములయియున్న కర్మలనుగుఱించి పూర్వ

మీమాంసకుఁ డేమియు సమాధానమును చెప్పియుండలేఁడు. పూర్వజన్మములందు సంచితమయియున్న పుణ్యపాపకర్మజాతమంతయు కలసి ప్రకృతజన్మ మేర్పడియున్నదని పూర్వమీమాంసకుని యభిప్రాయము కావచ్చునుగాని అయ్యది సంగతముకాదు.

విరుద్ధఫలజనకములగు కర్మలయొక్క ఫలము ఒకజన్మమునందు అనుభవించుట యుక్తిప్రమాణవిరుద్ధముగదా. ఇదియునుఁగాక ధర్మశాస్త్రములందు ఒక్కొక కర్మవలన వచ్చెడి ఫలము అనేకజన్మములం దనుభవింపవలసినటుల సుస్పష్టముగా చెప్పఁబడియున్నదిగదా. ఈవిషయమును గుఱించి సుస్పష్టముగ వచించిన శ్రీవార్తికకారునివచనముల నిట నుదహరించుచున్నాఁడను:—

శ్లో. అనారబ్ధఫలానీహ సంతి కర్మాణి కోటిశః,
తద్యఇహేతి వచసో గమ్యతాం కర్మణాం స్థితిః. ౧౨
నచైకదేహే భోగోఽస్తి బ్రహ్మహత్యాఽశ్వమేధయోః,
విరుద్ధఫలహేతుత్వా న్మాథసాత్వికదేహయోః. ౧౩
సప్తజన్మానుగం కార్య మేకస్యాపీహ కర్మణః,
శ్రూయతే ధర్మశాస్త్రేషు కిముతానేకకర్మణామ్. ౧౪

పూర్వమీమాంసకుఁడు తరువాత "నిత్యకర్మలు సంచితదురితక్షయార్థములు" అని ఒకమాట చెప్పఁగా మీసిద్ధాంతమునందు నిత్యకర్మలు నిత్యాకరణమువలన రాఁబోవునట్టి ప్రత్యవాయపరిహారకములు అని [గలదు గావున నీవిపుడు చెప్పినమాట నీసిద్ధాంతమునకు భంగకరము అని] వేదాంతి పూర్వమీమాంసకుని నిరసించినాఁడు. నిత్యాకరణమువలన ప్రత్యవాయము పుట్టు ననుట పూర్వమీమాంసకమతసిద్ధాంతానుసారమని గ్రహించునది.

"ఆరబ్ధమయినది అనిత్యము" అనెడి సుప్రసిద్ధమయిన వ్యాప్తిని గ్రహించి మోక్షము నిత్యము కావున కర్మారబ్ధము కాదనెడి వేదాంత

సిద్ధాంతమునకు విరుద్ధముగ ఆరబ్ధమయినను నిత్యముగా నుండెడిదానిని పూర్వమీమాంసకుఁడు దృష్టాంతముగాఁ జూపుచున్నాఁడు:—

ఘటప్రధ్వంసరూపమగు అభావము ఆరబ్ధమయినను అయ్యది నిత్యము అగుచున్నదిగదా. అట్లే మోక్షము సైతము కర్మారబ్ధమయినను ప్రధ్వంసాభావమువలె నిత్యమే యగును. అని పూర్వమీమాంసకుఁ డాక్షేపింపఁగా "నీవు చెప్పిన దృష్టాంతము విరుద్ధమయినది. భావరూపమయిన కార్యము ఆరబ్ధమయినది అనిత్య" మని వ్యాప్తియున్నది కావున నీవు చెప్పిన ప్రధ్వంసాభావదృష్టాంతము సరికాదు. అభావము అనఁగా ఉన్నది అనుటకు విరుద్ధము గాని దానియందు సత్తలేదు. మోక్షము భావరూపముగాని అభావరూపము గాదు. భావరూపమగు కార్యము ఆరబ్ధమగునెడల నశించుట సర్వసమ్మతము కావున మోక్షమెన్నటికిని కర్మారబ్ధముకాదు. అభావమెన్నటికిని కార్యరూపముకాదు. అభావముసైతము కార్యమే యగునెడల అయ్యదియు భావమే యగును గదా.

ఉపనిషత్ శబ్దనిర్వచనము.

'ఉపనిషత్' అనుశబ్దము "ఉ, ప, ని" అను ఉపసర్గలతో కూడిన 'షద్ ల్' ధాతువువల్లనుండి పుట్టినది. క్విప్ ప్రత్యయరూపము. షద్ ల్ ధాతువునకు

'షద్ ల్ విశరణగత్యవసాదనేషు' అని మూఁడర్థములు.

విశరణ మనఁగా:—శిథిలమగుట.

గతి యనఁగా:—పొందుట.

అవసాదన మనఁగా:—నాశనము.

ఈమూఁడర్థములకు అనుకూలమగువిధముగా నిర్వచనత్రయమును శ్రీమదాచార్యులవారు భాషించిరి. ఇది వైయాకరణమతానుసారము.

రెండవనిర్వచనము శ్రీమదాచార్యులవారు వేదాంతశాస్త్రసంప్రదాయానుసార మిచ్చియున్నారు. (వారిచ్చిన నిర్వచనము ననుసరించునట్టి నిర్వచనశ్లోకములను కొన్నింటిని ప్రాచీనములగువాని నీక్రింద గనంబఱచుచున్నాఁడను.

శ్లో. ఉపనీయ తమాత్మానం బ్రహ్మాపాస్తద్వయం యతః,
నిహంత్యవిద్యాం తజ్జంచ తస్మా దుపనిషత్ భవేత్. ౧
నిహంత్యనర్థమూలాం స్వా విద్యాం ప్రత్యక్తయా పరమ్,
నయత్యపాస్తసంభేద మత శ్చోపనిషత్ భవేత్. ౨
ప్రవృత్తిహేతూ న్నిశ్శేషాం స్తన్మూలోచ్ఛేదకత్వతః,
యతో౽వసాదయే ద్విద్యా తస్మా దుపనిషత్ భవేత్. 3

శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యులవారే మఱొకచోట ఈయుపనిషత్ శబ్దమును వివరింపుచు ఇంతకంటె సుస్పష్టముగ వివరించియున్నారు:—

1. య ఇమాం బ్రహ్మవిద్యా ముపయంతి ఆత్మభావేన శ్రద్ధా భక్తి పురస్సరాః సంతః తేషాం గర్భజన్మ జరారోగాద్యనర్థపూగం నిశాతయను పరం వా బ్రహ్మగమయతి అవిద్యాది సంసారకారణం చ అత్యంత మవసాదయతి=వినాశయతీత్యుపనిషత్; ఉప+ని+పూర్వస్య సదేః ఏవమర్థస్మరణాత్.

అర్థ. ఎవ్వరీబ్రహ్మవిద్యను శ్రద్ధాభక్తియుక్తులయి సేవించుచున్నారో వారియొక్క జన్మజరామరణాద్యనర్థములను శిథిలమొనర్చునదియు, లేక పరమగు బ్రహ్మమును పొందించునదియు, సంసారకారణమగుఅవిద్యను సమూలముగ నాశనమొనర్చునదియు ఉపనిషత్తనంబడును.

ఉప+ని+పూర్వకమగు 'షద్ల్' ధాతువునకు ఇట్టియర్థముగలదని పండితాభిప్రాయము.

సూచనము:—ఈ తైత్తిరీయోపనిషద్రాజముయొక్క వివరణమును శ్రీమచ్ఛంకరాచార్యులు మున్నగువారలు భాష్యములు, దీపికలు మున్నగు రూపమునమాత్రమేగాక ౧. అనుభూతిప్రకాశము-అను పేరుతో శ్రీమద్విద్యారణ్యులవారును, ౨. ఆత్మపురాణము-అను పేరుతో శంకరానందుల వారును శ్లోకరూపముగ వివరించియున్నారు. మఱియు సురేశ్వరాచార్యుల వారు తైత్తిరీయోపనిషచ్ఛంకరభాష్యమునకు వార్తికరూపముగ శ్లోకములలో వివరణ మొనర్చియున్నారు. ఆయాయనువాకాంతమునందు ఆయాయనువాకమునకు వివరణరూపములగు శ్లోకములయొక్క సంఖ్యను సూచించెదను. పాఠకు లాగ్రంథములను గాంచి విషయములను గ్రహించెదరుగాక.

౧. అనుభూతిప్రకాశము.

౨. ఆత్మపురాణము.

3. భాష్యవార్తికము. పీఠిక. శిక్షా. ౧-3౬

మంత్రభాష్యము. శిక్షా. 3౭-౪౯

---

౨. ద్వితీయోఽనువాకః.

అవ. ఉపనిషద్గ్రంథము అర్థజ్ఞానమే ప్రధానముగాఁ గలది కావున గ్రంథమును పఠించునపుడు అశ్రద్ధగా పఠింతురని భావించి అట్లు పఠింపఁగూడదని తెలుపుటకుఁగాను శిక్షాధ్యాయ మారంభ మగుచున్నది:—

౮. శీక్షాం వ్యాఖ్యాస్యామః । వర్ణ స్స్వరః । మాత్రా బలమ్ । సామసంతానః । ఇత్యుక్త శ్శీక్షాధ్యాయః ॥ శీక్షాం పంచ ॥౨॥

టీక. శీక్షాం=శిక్షను, వ్యాఖ్యాస్యామః = వివరముగా చెప్పుచున్నారము. వర్ణః=వర్ణములనియు, స్వరః=స్వరములనియు, మాత్రా=మాత్రలనియు, బలమ్=బలమనియు, సామ=సామమనియు, సంతానః = సంతానమనియు, శిక్షాధ్యాయః=శిక్షాధ్యాయము, ఇతి=ఈ ప్రకారము, ఉక్తః=చెప్పఁబడినది.

తా. వర్ణములనియు, స్వరములనియు, మాత్రలనియు, బలమనియు, సామమనియు, సంతానమనియు నాఱువిధములుగాఁగల శిక్షను చక్కఁగా చెప్పినారము. ఇదియే శిక్షాధ్యాయము.

ఇఁక దీని వివరము:—

౧. వర్ణములు:—అకారాది క్షకారాంతము లగు అక్షరములు.

౨. స్వరములు:—ఉదాత్త, అనుదాత్త, స్వరితములు.

3. మాత్రలు:—హ్రస్వ, దీర్ఘ, ప్లుతములు.

౪. బలము:—ఆయాయక్షరముల నుచ్చరించునపుడు చేయవలసిన ప్రయత్నవిశేషము. ఉదాహరణము:—'బ' యను అక్షరమును ఉచ్చరింపఁదలఁచితిమేని పెదవుల రెంటిని కలుపవలయును. అవిధముగా 'బ' అను అక్షరము నుచ్చరించుటకుఁగాను పెదవులరెంటిని కలుపుట యనుప్రయత్న విశేషమును చేయుట 'బల' మనంబడును. ఇట్లే సర్వాక్షరములను గ్రహించవలయును.

౫. సామము:—అనఁగా సమస్త అక్షరములను అతివేగముగను అతి మందముగను పలుకక మధ్యమవృత్తిగా నుచ్చరించుట.

16, 193

౬. సంతానము:—అనఁగా సంహిత 'వర్ణానాం అవిలంబేనోచ్చారణం సంహితాసంజ్ఞం స్యాత్' అను ప్రమాణానుసారము అక్షరములను విలంబములేక ఉచ్చరించుట సంహిత యనంబడును.

పైన చెప్పఁబడిన ఆఱువిషయములను అధ్యయనకాలమునందు సావధానముగ పరిశీలించుచు పఠనమును, ప్రవచనకాలమునందు అధ్యాపనమును ఆచరించవలయును. అట్లు కానియెడల మన మనుకొన్నదానికంటె విలక్షణమయినఅర్థము సంభవించును. కావున అట్టియనర్థనివృత్తికొఱకు ఈయుపదేశమిచుట చేయఁబడినది.

మంత్రో హీన స్స్వరతో వర్ణతో వా
మిథ్యా ప్రయుక్తో న త మర్థ మాహ,
స వాగ్వజ్రో యజమానం హినస్తి
యథేంద్రశత్రు స్స్వరతో ఽపరాధాత్.

అనెడి పాణినీయశిక్షాగ్రంథవచనమువలన ఇట్టి స్వరవర్ణాది నియమవిశేషావశ్యకత కర్మకాండకుసైతము అత్యావశ్యకము కావున ఈయుపదేశము కర్మకాండయందే చెప్పుట న్యాయము కాని జ్ఞానకాండయందు చెప్పుట మాత్రము తగదని కొంద ఱందురు. కాని అట్లు చెప్పఁగూడదు.

స్వరవర్ణాదినియమాదికము కర్మకాండమునందు కంటె జ్ఞానకాండమునందే అత్యంతావశ్యకము. ఎట్లనఁగా కర్మకాండమునందు స్వరవర్ణవిపర్యాసాదికము సంభవించునెడల తద్దోషపరిహారార్థము ప్రాయశ్చిత్తముసైతము విధించఁబడియున్నది కావున ఆ ప్రాయశ్చిత్తము నాచరించిన యెడల తత్ స్వరవర్ణాదివిపర్యాసోచ్చారణముచేత జనించిన పాపము శాంతించును.

జ్ఞానకాండమునందు సగుణనిర్గుణ ప్రతిపాదకములగు వాక్యములను విపరీతముగ నుచ్చరించి వ్యతిరేకార్థమును గ్రహించితిమేని యథార్థోపాసనము, యథార్థావబోధము కలుగనందువలన పురుషార్థమే సిద్ధింపదు. వ్యతి

లేకార్థబోధమువలన కలిగిన మిథ్యాజ్ఞాన, అన్యదాజ్ఞానములు నశించుటకు ప్రాయశ్చిత్తమేమియు శాస్త్రమునందు ప్రతిపాదితమయి యుండలేదు.

కావున యథార్థముగ బ్రహ్మావబోధము కలుగుటకుగాను ఉపనిషదధ్యయనమునందే యత్నాతిశయము ఆవశ్యక మగుటకుగాను ఉపనిషత్కాండమునందు ఈవిషయ ముపదిష్టమయినది.

శ్రీమాధవాచార్యులవారు ఈయనువాకమునకు వ్యాఖ్యాన మొనర్చుచు ఆరంభమునందు:—

“యద్యప్యత్ర శిక్షాదిశబ్దానా మేకశ్రుత్యా అధీయమానత్వాత్ వ్యాకరణోక్త ప్రకృతి ప్రత్యయాదిప్రయుక్త స్వరో నోపలక్ష్యతే తథా ఽపి సంప్రదాయ ప్రసిద్ధః స్వరః తథైవాభ్యసనీయః, తస్యచార్థవిశేషజ్ఞాన ఉపయోగాభావే ఽప్యనేన శిక్షాధ్యాయేన విధీయమానత్వా దదృష్టోపయోగో భవిష్యతి. తచ్చ అదృష్ట ముపాసనాయాం తత్త్వజిజ్ఞాసోః తత్త్వ విద్యాయాం చ ప్రతిబంధపరిహారాయ సంపద్యతే.” అని చెప్పియున్నారు. దీనివలన సంహితయందువలె ప్రకృతిప్రత్యయములను వ్యాకరణశాస్త్రము నందు విధించియున్న స్వరాదికము ననుసరించి ఈయుపనిషద్గ్రంథమునందు స్వరములేదనియు సంప్రదాయానుసారముగా ఉన్నస్వరము మాత్రము గల దనియు, అట్టి సంప్రదాయానుసారమగు స్వరమైనను ఉపనిషత్ప్రతిపాదిత మయినది కావున అట్లే ఉచ్చరింపదగిన దనియు, అన్యథాగా ఉచ్చరించిన దోషావహమనియు భావము.

విపర్యయముగ దంత్యతాలవ్యోచ్చారణాదికమువలన కలిగెడి అర్థ భేదముల కుదాహరణము:—

౧. కార్యం సకలం కురు = కార్యమును సమగ్రముగ చేయుము. ఇందుగల దంత్యమగు సకారమును, తాలవ్యముగ నుచ్చరించితిమేని,

"కార్యం శకలం కురు = కార్యమును చెడఁగొట్టుము" అనువిపరీతార్థబోధ కలుగును.

౨. సకృత్ కురు = ఒక్కపర్యాయము చేయుము. శకృత్ కురు = పురీషోత్సర్జనముచేయుము. ఇట్లే గ్రహించునది.

స్వరాదివిషయమును గ్రంథవిస్తరభీతిచేత మానినాఁడను.

శిక్షాశబ్దమునకు శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యులవారు ద్వివిధమగు వ్యుత్పత్తిని ఇచ్చియున్నారు.

౧. శిక్షా:—శిక్ష్యతే అనయేతి వర్ణాద్యుచ్చారణలక్షణం, 'శిక్షా' శిక్షైవ 'శీక్షా' దైర్ఘ్యం ఛాందసం.

అర్థ. దీనిచేత వర్ణములు మొదలగునవి పలుకవలసిన లక్షణము శిక్షింపఁబడును. కావున 'శిక్షా' అని చెప్పఁబడును. 'శిక్షా' అనునదియే 'శీక్షా' అనియగును. 'శిక్షా' అని యనుటకు 'శీక్షా' అనుట ఛాందసము.

అక్షరముల నుచ్చరించురీతి.

౧. అ కు హ విసర్జనీయానాం కంఠః = అ, క, ఖ, గ, ఘ, ఙ, హ, ః వీనిని కంఠస్థానమునందుండి ఉచ్చరింపవలయును.

౨. ఇ చు య శా నాం తాలు=ఇ, చ, ఛ, జ, ఝ, ఞ, య, శ వీనిని తాలుస్థానమునందుండి ఉచ్చరింపవలయును.

౩. ఋ టు ర షా ణాం మూర్ధా=ఋ, ట, ఠ, డ, ఢ, ణ, ర, ష వీనిని మూర్ధస్థానమునందుండి ఉచ్చరింపవలయును.

౪. ఌ తు ల సా నాం దన్తాః=ఌ, త, థ, ద, ధ, న, ల, స వీనిని దంతములనుండి ఉచ్చరింపవలయును.

౫. ఉ పూ పధ్మానీయానా మోష్ఠౌ = ఉ, ప, ఫ, బ, భ, మ, ఃప్ ఇవి ఓష్ఠమునుండి ఉచ్చరింపవలయును.

౬. ఇ మ జ ణ నా నాం నాసికాచ=అర్థము సులభము.

౭. ఏ ఐ తోః కంఠతాలు ,,

౮. ఓ ఔ తోః కంఠోష్ఠం ,,

౯. వకారస్య దంతోష్ఠం ,,

౧౦. అనుస్వారస్య నాసికా ,,

౧౧. జిహ్వామూలీయస్య జిహ్వామూలం ,,

ఈ విధముగా నెఱుంగునది.

ఈ యధ్యాయమునందు ఈ యుచ్చారణలక్షణము చెప్పఁబడియుండ లేదు గదా, కావున పైనిఁజెప్పఁబడిన వ్యుత్పత్తి ఇచట అంతగా అనుకూలముగా లేదను తలంపుతో వ్యుత్పత్త్యంతరమును ఆచార్యులవారే చెప్పియున్నారు.

---

౨. శిక్ష్యంత ఇతివా శిక్షాః వర్ణాదయః (వేదనీయత్వేన ఉపదిశ్యంత ఇత్యర్థః. 'వనమాలా')

అర్థ. వర్ణ, స్వర, మాత్రా, బల, సామ, సంతానములు తెలిసికొన వలసినవని ఉపదేశింపఁబడినదని యర్థము.

౧. అను. ... ...

౨. అధ్యా. ... ...

౩. భా. వా. శిక్షా. ౫౦-౫౩

౩. తృతీయోఽనువాకః.

౧. ౧సహ నౌ యశః । సహ నౌ బ్రహ్మవర్చసమ్ । ౨అథాత
స్సగ్ంహితాయా ఉపనిషదం వ్యాఖ్యాస్యామః ।
పంచస్వధికరణేషు అధిలోక మధిజ్యౌతిష మధివిద్య
మధిప్రజ మధ్యాత్మమ్ । తా మహాసగ్ంహితా ఇత్యా
చక్షతే । ౩అథాధిలోకమ్ । పృథివీ పూర్వరూపమ్ ।
ద్యౌ రుత్తరరూపమ్ । ఆకాశ స్సంధిః ॥౩।

౨. వాయు స్సంధానమ్ । ఇత్యధిలోకమ్ । ౪ అథాధి
జ్యౌతిషమ్ । అగ్నిః పూర్వరూపమ్ । ఆదిత్య ఉత్తర
రూపమ్ । ఆప స్సంధిః । వైద్యుతస్సంధానమ్ । ఇత్యధి
జ్యౌతిషమ్ । ౫అథాధివిద్యమ్ । ఆచార్యః పూర్వ
రూపమ్ ॥౪॥

౩. అన్తేవాస్యుత్తరరూపమ్ । విద్యా సన్ధిః । ప్రవచ
నగ్ం సన్ధానమ్ । ఇత్యధివిద్యమ్ । ౬అథాధిప్రజమ్ ।

మాతా పూర్వరూపమ్ । పితోత్తరరూపమ్ । ప్రజా
సన్ధిః । ప్రజననగ్ం సన్ధానమ్ । ఇత్యధిప్రజమ్ ॥౩॥

౪. ౨అథాధ్యాత్మమ్ । అధరాహనుః పూర్వరూపమ్ ।
ఉత్తరా హనురుత్తరరూపమ్ । వాక్సన్ధిః జిహ్వా
సన్ధానమ్ । ఇత్యధ్యాత్మమ్ । ౩ఇతీమా మహాసగ్ం
హితాః । య ఏవ మేతా మహాసగ్ంహితావ్యాఖ్యా
తా వేద । సంధీయతే ప్రజయా పశుభిః । బ్రహ్మవర్చ
సేనాన్నాద్యేన సువర్గ్యేణ లోకేన ॥౬॥

సంధి, రాచార్యః పూర్వరూప, మిత్యధిప్రజం, లోకేన ॥3॥

టీ. ౧. (సంహితోపాసనము మున్నగువాని నెఱుంగుటవలన వచ్చెడి) యశః = కీర్తి, నౌ=శిష్యాచార్యుల మగు మాకు, సహ(అస్తు)=కూడా (అగుం గాక). బ్రహ్మవర్చసం = (ఆసంహితోపాసనమువలన కలిగిన) బ్రహ్మతేజస్సు, నౌ = శిష్యాచార్యుల మగుమాయిద్దఱకు, సహ(అస్తు) = కూడా (అగుంగాక).

౨. అథ = (పూర్వానువాకమునందు చెప్పంబడిన స్వరవర్ణాది శిక్షాభ్యాసరూప అధ్యయనలక్షణపరిజ్ఞాన) అనంతరము, అతః = (ఆసంహితోచ్చారణమునందే బుద్ధి సస్వరముగ ప్రవేశించును) కావున, అధిలోకం = లోకములందును, అధిజ్యౌతిషం = తేజస్సులందును, అధివిద్యం = విద్యలందును, అధిప్రజం=ప్రజలందును, అధ్యాత్మం = దేహమునందును, పంచసు = ఐదుఅయిన,

అధికరణేషు = ఆశ్రయములచేత (తృతీయార్థమునందు సప్తమి), సంహితాయాః = సంహితయొక్క, ఉపనిషదం = ఉపాసనమును, వ్యాఖ్యాస్యామః = స్పష్టముగా చెప్పఁగలము. తాః = ఆయైదువిషయములును, మహాసగ్ంహితా ఇతి = గొప్పసంహితలని, ఆచక్షతే = (వేదజ్ఞులు) పలుకుచున్నారు.

3. అథ = ఇఁక, అధిలోకం = లోకసంహితకు సంబంధించిన విషయము (చెప్పఁబడుచున్నది.) పూర్వరూపం = (సంహితయొక్క) పూర్వాక్షరము, పృథివీ = భూమియనియు, ఉత్తరరూపం = (సంహితయొక్క) ఉత్తరాక్షరము, ద్యౌః = అంతరిక్షమనియు, సంధిః = (సంహితయొక్క పూర్వోత్తరాక్షరముల) సంధి, ఆకాశః = ఆకాశమనియు, సంధానం = (పూర్వోత్తరాక్షరముల) సంధానము, వాయుః = వాయువనియు, ఇతి = ఈవిధముగా, అధిలోకం = లోకము నాశ్రయించి చెప్పఁబడిన యుపాసనము.

౪. అథ = ఇఁక, అధిజ్యౌతిషం = జ్యోతిస్సంహితకు సంబంధించినవిషయము (చెప్పఁబడుచున్నది.) పూర్వరూపం = (సంహితయొక్క) పూర్వాక్షరము, అగ్నిః = అగ్నియనియు, ఉత్తరరూపం = (సంహితయొక్క) ఉత్తరాక్షరము, ఆదిత్యః = సూర్యుఁడనియు, సంధిః = (సంహితయొక్క పూర్వోత్తరాక్షరములు) కలియుట, ఆపః = ఉదకములనియు, సంధానం = (పూర్వోత్తరాక్షరముల) సంధానము, వైద్యుతః = విద్యుత్తులనియు, ఇతి = ఈవిధముగా, అధిజ్యౌతిషం = జ్యోతిస్సుల నాశ్రయించి చెప్పఁబడిన యుపాసనము.

౫. అథ = ఇఁక, అధివిద్యం = విద్యాసంహితకు సంబంధించినవిషయము (చెప్పఁబడుచున్నది.) పూర్వరూపం = (సంహితయొక్క) పూర్వాక్షరము, ఆచార్యః = ఆచార్యుఁడనియు, ఉత్తరరూపం = (సంహితయొక్క) ఉత్తరాక్షరము, అంతేవాసీ = శిష్యుఁడనియు, సంధిః = (సంహితయొక్క పూర్వోత్తరాక్షరముల) సంధి, విద్యా = విద్యయనియు, సంధానం = (సంహిత

యొక్క పూర్వోత్తరాక్షరముల) సంధానము, ప్రవచనం = ప్రవచనమనియు, ఇతి= ఈవిధముగా, అధివిద్యం=విద్యనాశ్రయించి చెప్పఁబడిన యుపాసనము.

౬. అథ=ఇఁక, అధిప్రజం=ప్రజాసంహితకు సంబంధించినవిషయము (చెప్పఁబడుచున్నది) పూర్వరూపం = (సంహితయొక్క) పూర్వాక్షరము, మాతా = తల్లియనియు, ఉత్తరరూపం = (సంహితయొక్క) ఉత్తరాక్షరము, పితా=తండ్రియనియు, సంధిః=(సంహితయొక్క పూర్వోత్తరాక్షరముల) సంధి, ప్రజా=ప్రజయనియు, సంధానం=(సంహితయొక్క పూర్వోత్తరాక్షరముల) సంధానము, ప్రజననం=ప్రజననమనియు, ఇతి = ఈవిధముగా, అధిప్రజం = ప్రజనాశ్రయించి చెప్పఁబడిన యుపాసనము.

౭. అథ=ఇఁక, అధ్యాత్మం = అధ్యాత్మసంహితకు సంబంధించిన విషయము. (చెప్పఁబడుచున్నది.) పూర్వరూపం = (సంహితయొక్క) పూర్వాక్షరము, అధరాహనుః = క్రిందిపెదవియనియు, ఉత్తరరూపం = (సంహితయొక్క) ఉత్తరాక్షరము, ఉత్తరాహనుః = పైపెదవియనియు, సంధిః = (సంహితయొక్క పూర్వోత్తరాక్షరముల) సంధి, వాక్ = వాక్కనియు, సంధానం = సంధానము, జిహ్వా = నాలుకయనియు, ఇతి = ఈవిధముగా, అధ్యాత్మం=దేహము నాశ్రయించి చెప్పఁబడిన యుపాసనము.

౮. ఇతి=ఈవిధముగా, ఇమాః = ఈచెప్పఁబడినవి, మహాసంహితాః = గొప్పసంహితలు (సంహిత యనఁగా ఉపాసనము.) యః=ఎవఁడు, ఏవం= ఈ విధముగా, వ్యాఖ్యాతాః = వివరింపఁబడిన, ఏతాః = ఈ, మహాసంహితాః = గొప్పసంహితలను (ఐదింటిని), వేద = ఉపాసించుచున్నాఁడో, (సః=వాఁడు,) ప్రజయా=సంతానముతోడను, పశుభిః = పశువులతోడను, బ్రహ్మవర్చసేన = బ్రహ్మవర్చస్సుతోడను, అన్నాద్యేన = భోగ్యవస్తుసముదాయముగల, సువర్గేణ లోకేన = స్వర్గలోకముతోడను, సంధీయతే = సంధింపఁబడుచున్నాఁడు.

తా. ౧. శిష్యుఁడు ప్రప్రథమమున బ్రహ్మవిద్యావిషయక మగు కీర్తియు, బ్రహ్మవర్చస్సు ఇవి శిష్యాచార్యుల మగు మా కిద్దఱకుఁ గలుగవలయు నని కోరుచున్నాఁడు. శిష్యుఁడు కృతకృత్యుఁడు కాలేదు కావున ఈప్రార్థనము శిష్యుఁ డొనర్చినదే. ఆచార్యుఁ డొనర్చినదికాదు. ఆచార్యుఁడు కృతార్థుఁడు కావున అతఁడు కోరఁదగినదియే లేదు అని శ్రీశంకరాచార్యుల వారు భాష్యమునందు వివరించియున్నారు.

౨. ఇఁక సంహితోపనిషత్తును అయిదు అధిష్ఠానములందు వివరించి చెప్పుచున్నాము. వాని పేరులు ౧. అధిలోక మనియును, ౨. అధిజ్యౌతిషమనియును, 3. అధివిద్యయనియును, ౪. అధిప్రజమనియును, ౫. అధ్యాత్మమనియును చెప్పఁబడును. ఇవియే మహాసంహితలని చెప్పఁబడును. మూలమునందుఁ గల అథ, అతః అనుశబ్దములకు గల భాష్యవివరణమేమనఁగా:—

అథ=అధ్యయనలక్షణవిధానమును చెప్పినపిదప అని. (వర్ణ, స్వర, మాత్రా, బల, సామ, సంతానములని వివరముగ ద్వితీయానువాకమునందు అధ్యయనలక్షణవిధానము చెప్పఁబడియున్నది) అతః = అనుశబ్దమునకు "సాధారణముగా అధ్యయన మొనర్చినవారలు గ్రంథమునందుమాత్రమే చిత్తప్రవృత్తి కలిగియుందురు కావున వారిమనస్సు అర్థవిషయమగు వస్తువునందు మొట్టమొదట ధారాళముగ ప్రవేశింపదు. అట్టి వారికిగాను స్థూలమగు శబ్దవిషయోపాసనమును విధించుటయే లాభకరము కావున సంహితారూపగ్రంథప్రధాన మగు ఉపాసనమును విధించుటయే న్యాయమను తలంపుతో" అని వ్యాఖ్యాన మొనర్చినారు. భాష్యపంక్తి నీక్రింద నుదహరించుచున్నాఁడను.

"అతః=యతో ఽత్యర్థం గ్రంథభావితా బుద్ధి ర్న శక్యతే సహసా ఽర్థజ్ఞానవిషయ మే అవతారయితుమిత్యతః" అని.

3. ఇఁక లోకసంహిత చెప్పఁబడుచున్నది:—సంహితముయొక్క పూర్వవర్ణమును పృథివిగను, ఉత్తరవర్ణమును ద్యులోకముగను, పూర్వోత్తర వర్ణములయొక్క సంధిని ఆకాశముగను, పూర్వోత్తరవర్ణసంధానమును వాయువుగను, ఈవిధముగా లోకాత్మకముగ సంహిత నుపాసించవలయును. ఇది లోకసంహిత యనంబడును.

౪. ఇఁక జ్యోతిస్సంహిత చెప్పఁబడుచున్నది:—సంహితయొక్క పూర్వవర్ణమును అగ్నిగను, సంహితయొక్క ఉత్తరవర్ణమును ఆదిత్యునిగను, పూర్వోత్తరవర్ణములయొక్క సంధిని అప్పులు (జలములు) గను, పూర్వోత్తరవర్ణసంధానమును విద్యుత్తుగను, ఈవిధముగ జ్యోతిరాత్మకముగ సంహిత నుపాసించవలయును. ఇది జ్యోతిస్సంహిత యనంబడును.

౫. ఇఁక విద్యాసంహిత చెప్పఁబడుచున్నది:—సంహితయొక్క పూర్వవర్ణమును ఆచార్యునిగను, సంహితయొక్క ఉత్తరవర్ణమును శిష్యుని గను పూర్వోత్తరవర్ణములయొక్కసంధిని విద్యగను, పూర్వోత్తరవర్ణసంధానమును ప్రవచనముగను, ఈ విధముగ విద్యాత్మకముగ సంహిత నుపాసించ వలయును. ఇది విద్యాసంహిత యనంబడును.

౬. ఇఁక ప్రజాసంహిత చెప్పఁబడుచున్నది:—సంహితయొక్కపూర్వ వర్ణమును మాతగను, సంహితయొక్క ఉత్తరవర్ణమును పితగను, పూర్వోత్తరవర్ణములయొక్క సంధిని ప్రజగను, పూర్వోత్తరవర్ణసంధానమును ప్రజననముగను, ఈవిధముగ ప్రజాసంహిత నుపాసించవలయును. ఇది ప్రజాసంహిత యనంబడును.

౭. ఇఁక అధ్యాత్మసంహిత చెప్పఁబడుచున్నది:—సంహితయొక్క పూర్వవర్ణమును క్రిందిపెదవిగను, సంహితయొక్క ఉత్తరవర్ణమును పైపెదవిగను, పూర్వోత్తరవర్ణములయొక్క సంధిని వాక్కుగను, పూర్వోత్తరవర్ణసంధానమును జిహ్వగను ఈవిధముగ నుపాసించవలయును.

8. ఈచెప్పఁబడిన ౫ను మహాసంహితలు. ఎవ్వఁ డీవిధముగా (అనఁగా లోకజ్యోతిషాదిదృష్టితో) ఈ మహాసంహితల నుపాసించునో వాఁడు ప్రజ పశువులు, బ్రహ్మవర్చస్సు, అన్నాదికము, స్వర్గము మున్నగు ఫలములను పొందును.

మంత్రమునందుగల 'వేద' అనుపదము ఉపాసనాప్రకరణమునందు చెప్పఁబడుటచేత 'ఉపాసనావాచి' యగుచున్నది. "ఇతి ప్రాచీనయోగ్యోపాస్వ" అని చెప్పుటయే ఇందులకు ప్రమాణము.

ఉపాసనమనఁగా శాస్త్రానుసారము విచ్ఛేదములేక శాస్త్రనిర్దిష్టమగు ఒక ఆలంబనమునందు బుద్ధిని ప్రవేశపెట్టి ఎల్లప్పుడు దానిని స్మరించుటయగును. (ఒకపర్యాయము ధ్యేయవస్తువునందు బుద్ధిని ప్రవేశపెట్టుట ఉపాసన మనంబడదు. ఏలయనఁగా:—ఈవిషయము లోకప్రసిద్ధమయియున్నది. 'గురువు నుపాసించుచున్నాఁడు, రాజు నుపాసించుచున్నాఁడు' అనుచోట ఎవ్వఁడు నిరంతరను గురువును రాజును ఉపాసించునో వాఁడే యగును గాని ఇతరుఁడుగాఁడు. అట్టివాఁడే ఉపాసనాఫలమును పొందును. కావున ఇచ్చట సైతము ఈ సంహితల నీభావనతో నిరంతర ముపాసనమును సలిపిన వాఁడే ఈ ఫలమును పొందును.

వివరణము:—సంహితలను లోకాదిదృష్టితో ఉపాసించవలయునని చెప్పిన విషయమును దృష్టాంతపూర్వకముగ వివరించుచున్నారము.

'ఇషేత్వా' అనుచోట.

౧. షకారముపైనగల ఏకారము పూర్వవర్ణము. దీనిని పృథివీభావనతో నుపాసించవలయును.

౨. త్వా అనుచోట గల తకారము ఉత్తరవర్ణము. దీనిని ద్యులోకభావనతో నుపాసించవలయును.

3. ఆ 'ఏకారతకార'ములయొక్క మధ్యభాగము సంధి. దీనిని అంత రిక్షలోకభావనతో నుపాసించవలయును.

౪. 'షేత్త్వా' అనునపుడు సంహితాసమయమునం దుచ్చరించునపుడు అచట గనంబడునట్టి రెండవతకార మెయ్యది గలదో అది సంధానము. దీనిని, వాయులోకభావనతో నుపాసించవలయును.

ఇచట లోకసంహితను మాత్రమే గనంబఱిచితిమి. ఇట్లే తక్కిన జ్యోతిష, విద్యా, ప్రజా, ఆత్మసంహితలను గూర్చి గ్రహించునది.

ఆత్మసంహితయనఁగా:—ఆత్మయనఁగా దేహము. ఆదేహావయవములను గుఱించి చెప్పెడివిషయము అధ్యాత్మ మనఁబడును.

పృథివి పూర్వరూపమనియు, ద్యులోకముత్తరరూపమనియు మున్న గునవి తెలిసికొన్నంతమాత్రముచేతనే ఫలమేమియు లేదు. తదనుసారము అసకృదావృత్తి పూర్వకస్మరణరూపమగు ఉపాసనముచేతనే ఫలముకలుగును.

మఱియు ఈవిషయము బ్రహ్మజ్ఞానప్రకరణమునందు చెప్పఁబడియున్నది కావున ఫలకామియై ఉపాసించునెడల కామితఫలము కలుగుననియు, నిష్కామియై ఉపాసనమును సల్పునెడల జ్ఞానమునకు సాధనమగుననియుఁ తెలిసికొనవలయును.

అథాధిలోకం...ఇత్యధిలోకం । అథాధిజ్యోతిషం...ఇత్యధిజ్యోతిషం । ఇటుల ౫ పర్యాయములు 'అథ' శబ్దము మంత్రమునందు చెప్పఁబడియున్నది. అధిలోక, ఇది లోకదృష్టి, జ్యోతిషదృష్టి మున్నగుక్రమనియమార్థమని సూచించుటకుగాను చెప్పఁబడినది.

౧. అను ... ...

౨. ఆత్మ ... ...

3. భా. వా. శిక్షా. ౫౪-౬౭.

౪. చతుర్థోఽనువాకః.

మేధాకామస్య జపమన్త్రాః.

శ్రీకామస్య హోమార్థా మన్త్రాశ్చ.

మూ. ౧యశ్ఛన్దసామృషభో విశ్వరూపః ఛన్దోభ్యో ఽధ్య
మృతాత్సంబభూవ స మేన్ద్రో మేధయా స్పృణో
తు అమృతస్య దేవ ధారణో భూయాసమ్ ౨శరీరం
మే విచర్షణమ్ జిహ్వా మే మధుమత్తమా। కర్ణా
భ్యాం భూరి విశ్రువమ్ బ్రహ్మణః కోశో ఽసి మేధ
యా పిహితః శ్రుతం మే గోపాయ। ౩ఆవహన్తీ
వితన్వానా ॥౧॥

కుర్వాణా చీరమాత్మనః। వాసాగ్ంసి మమ
గావశ్చ అన్నపానే చ సర్వదా తతో మే శ్రియ
మావహ లోమశాం పశుభిస్సహ స్వాహా। ౪ఆమా
యన్తు బ్రహ్మచారిణస్స్వాహా (*౫విమాయన్తు

* ఏతే 5, 6, 7 మన్త్రాః ద్రావిడపాఠే నవిద్యన్తే. ఆన్ధ్రపాఠే విద్యన్తే.

బ్రహ్మచారిణ స్స్వాహా। ౬ప్రమాయన్తు బ్రహ్మచారిణ స్స్వాహా ౭దమాయన్తు బ్రహ్మచారిణ స్స్వాహా। ౮శమాయన్తు బ్రహ్మచారిణ స్స్వాహా) ॥౨।

౯యశోజనే ఽసాని స్వాహా ౧౦శ్రేయా న్వస్యసో ఽసాని స్వాహా। ౧౧తం త్వా భగ ప్రవిశాని స్వాహా ౧౨స మా భగ ప్రవిశస్వాహా ౧౩తస్మిం త్సహస్ర శాఖే। ని భగాహం త్వయి మృజే స్వాహా ౧౪యథా ఽఽపః ప్రవతా యన్తి యథామాసా అహర్జరమ్। ఏవం మాం బ్రహ్మచారిణః ధాత రాయన్తు సర్వత స్స్వాహా। ౧౫ప్రతివేశో ఽసి ప్రమా భాహి ప్రసూపద్యస్వ ॥౩॥

(వితన్వానా ప్రవిశస్వాహా స్సప్త చ ద్రావిడపాఠః).

(వితన్వానా శమాయన్తు బ్రహ్మచారిణ స్స్వాహా, ధాత రాయన్తు సర్వత స్స్వాహైకం చ॥

టీక. ౧. యః=ఏయది, ఛందసాం=వేదములకు, ఋషభః=ప్రాధాన్యమైనదో, విశ్వరూపః = సర్వరూపమయినదో, (సః=ఆ ప్రణవము,) అమృతాత్=అమృతస్వరూపములగు, ఛందోభ్యః = వేదములలో, సంబభూవ = (సంభూతమై) ప్రకాశించుచున్నది. ఇంద్రః = పరమేశ్వరస్వరూపమగు,

సః=ఆ ప్రణవము, మా=నన్ను, మేధయా=ప్రజ్ఞచేత, స్పృణోతు=సంతోషింపఁజేయుఁగాక. దేవ=ప్రకాశస్వరూపమగు ఓ ప్రణవమా! అమృతస్య = (అమృతత్వమునకు హేతుభూతమగు) బ్రహ్మజ్ఞానమును, ధారణః=ధరించువాఁడను, భూయాసం = అయ్యెదనుగాక.

౨. మే=నాయొక్క, శరీరం=దేహము, విచర్షణం = యోగ్యమయినది, (భూయాత్=అగుఁగాక.) మే=నాయొక్క, జిహ్వా=నాలుక, మధుమత్తమా=మధురభాషణముగలది, (భూయాత్ = అగుఁగాక.) కర్ణాభ్యాం = కర్ణములవల్లనుండి, భూరి = విస్తారముగా, విశ్రువం = వినియెదనుగాక. (నాదేహేంద్రియములు ఆత్మజ్ఞానార్హము లగుగాక) (ఓ ప్రణవమా! నీవు) బ్రహ్మణః = పరమాత్మకు, కోశః = నివాసస్థానము, అసి = అయితివి. మేధయా=సామాన్యప్రజ్ఞచేత, పిహితః = కప్పఁబడితివి. మే=నాయొక్క, శ్రుతం = శ్రవణపూర్వకమయిన ఆత్మజ్ఞానాదికమును, గోపాయ = రక్షించుమా! (ఈమంత్రములు మేధాకాముఁడు జపింపఁదగినవి.)

శ్రీకాముఁడు హోమము చేయవలసిన మంత్రములు:—

3. తతః=మేధను కలుగఁజేసినతరువాత, ఆత్మనః మమ = నాకు, వాసాంసి=వస్త్రములను, గావః చ=గోవులను, అన్నపానేచ = అన్నపానీయములను, సర్వదా=ఎల్లప్పుడు, ఆవహంతీ=సంపాదించుచున్నదై (అటుల సంపాదించినవానిని), వితన్వానా=విస్తరింపఁజేయుచున్నదై (అటుల విస్తరింపఁజేసినదానిని), చీరం=దీర్ఘకాలముండుదానిగా, కుర్వాణా = చేయుచున్నట్టి (విసంపదగలదో అట్టి), లోమశాం=అజాదివిశిష్టమయిన, శ్రియం=సంపదను, పశుభిఃసహ = పశువులతోకూడా, (ఓప్రణవమా!) మే=నాకు, ఆవహ = పొందింపుము. స్వాహా=స్వాహా పదమిచట హోమార్థమయిన మంత్ర మిది యని సూచించుటకుఁగాను చెప్పఁబడినది. (ఇట్లే సర్వత్ర గ్రహించునది.)

౪. బ్రహ్మచారిణః = విద్యార్థులగు బ్రహ్మచారులు, మాం=నన్నుఁగూర్చి, ఆయన్తు = వచ్చెదరుగాక.

౫. వి = వివిధకామములుగల అనఁగా స్వర్గలోకకాములు, మోక్ష కాములు, పశ్వాదికాములు నగు, బ్రహ్మచారిణః=బ్రహ్మచారులు, మాం=నన్నుఁ గూర్చి, ఆయన్తు = వచ్చెదరుగాక.

౬. ప్ర=శ్రేష్ఠబుద్ధిగల, బ్రహ్మచారిణః=బ్రహ్మచారులు, మా = నన్నుఁ గూర్చి, ఆయన్తు = వచ్చెదరుగాక.

౭. దం=బాలక్రీడలుడిగిన, బ్రహ్మచారిణః = బ్రహ్మచారులు, మా = నన్నుఁగూర్చి, ఆయన్తు = వచ్చెదరుగాక.

౮. శం=క్రోధాదిచిత్తదోషములులేని, బ్రహ్మచారిణః=బ్రహ్మచారులు, మా = నన్నుఁగూర్చి, ఆయన్తు = వచ్చెదరుగాక.

౯. జనే=జనులయందు, యశః = యశస్సుగలవాఁడను, అసాని=అయ్యెదనుగాక.

౧౦. వస్యసః=వనికునికంటె, శ్రేయాన్=శ్రేష్ఠుఁడను, అసాని=అయ్యెదనుగాక.

౧౧. భగ = పూజ్యమయిన ఓంప్రణవమా! తం = (బ్రహ్మకు కోశభూతమయిన)ఆ, త్వా=నిన్ను, ప్రవిశాని=ప్రవేశించి, త్వత్స్వరూపుఁడనయ్యెదను.

౧౨. భగ = పూజ్యమయిన ఓంప్రణవమా! సః = ఆప్రసిద్ధమయిన నీవు, మా = నన్ను, ప్రవిశ = ప్రవేశించుమా !

౧౩. భగ = పూజ్యమగునో ఓంకారమా! సహస్రశాఖే = శివవిష్ణ్వాది రూపభేదములు గలదానివలె గనంబడు, తస్మిన్ = ఆ, త్వయి = నీయందు, అహం = నేను, (పాపకృత్యాం = నేనొనర్చిన పాపకార్యముచు,) నిమృజే = ప్రక్షాళనము చేసికొనుచున్నాఁడను.

౧౪. ఆపః=ఉదకములు, ప్రవతా = పల్లమయినదారిగ, యథా=ఏవిధముగా, గచ్ఛంతి = పోవుచున్నవో, యథా = ఏవిధముగా, మాసాః = మాసములు, అహర్జరం = సంవత్సరమును గూర్చి, (గచ్ఛంతి = పోవుచున్నవో,) ఏవం = ఈవిధముగా, ధాతః = సర్వజగత్కారణమగు ఓ ప్రణవమా ! బ్రహ్మచారిణః = బ్రహ్మచారులు, మాం = నన్నుఁగూర్చి, సర్వతః = అంతటనుండి, ఆయంతు = వచ్చెదరుగాక.

౧౫. (ఓ ప్రణవమా! నీవు,) ప్రతివేశః=సమీపమునందున్న గృహము (అనఁగా గృహమువలె సకలదుఃఖనివారకమని యర్థము.) అసి = అయితివి, మా=నన్ను, ప్రభాహి = ప్రకాశింపఁజేయుము! మా = నన్ను, ప్రపద్యస్వ= పొందుమా !

తా. ౧. (ప్రథమ ద్వితీయానువాకములందు శాంతిని, శిక్షను విధించి మూఁడవయనువాకమునందు సంహితోపాసనము విధించి ఈ యనువాకమునందు మేధాకాముఁ డగువాఁడు జపించవలసిన మంత్రములును, శ్రీకాముఁడు చేయవలసిన హోమార్థము లగుమంత్రములును చెప్పఁబడినవి. ప్రథమమున మేధాకాముఁడు జపించవలసిన మంత్రములు చెప్పఁబడుచున్నవి:— (ఈయనువాకము ప్రణవస్తుతి పరము) ప్రణవము వేదత్రయములలో సారభూతమయి ప్రకాశించుచున్నది. ఇదియే సర్వస్వరూపము. పరమేశ్వర స్వరూపమగు ఈప్రణవము నన్ను మేధావంతునిగా నొనర్చుఁగాక. ఓ ప్రణవమా! నేను అమృతస్వరూప మగుబ్రహ్మజ్ఞానమును ధరించువాఁడ నయ్యెదనుగాక యని తాత్పర్యము.

సూచనము:—ఈ మంత్రమునందు 'ఛందోభ్యోఽధ్యమృతాత్సంబభూవ" అనుచోట "అధిసంబభూవ" యనుపదమునకు "పుట్టుట" యను విషయము సుప్రసిద్ధమయియుండఁగా "ప్రకాశించెను" అను అర్థమును చెప్పుట న్యాయమగునా? అను సందేహమునకు శ్రీశంకరాచార్యులవారు భాష్య

మునం దిటుల వ్రాసియున్నారు:—నిత్యమయిన ఓంకారమునకు పుట్టుకను చెప్పుట ఉపపన్నముకాదు. "ప్రజాపతి ర్లోకా నభ్యతపత్" అను (ఛాందో. ౨. ౨౩. ౨.) శ్రుతివలన లోకదేవవేదవ్యాహృతులవలన సారమును గ్రహించఁ దలఁచి తపమొనర్చిన ప్రజాపతికి సారభూతముగా ఓంకారము స్ఫురించెను. అని తెలియవచ్చుచున్నది. కావున అట్టియర్థ మిచట చెప్పఁబడినది.

ఇచ్చట మేధాప్రార్థనమునకు అవకాశమేమియున్నదని సంశయించఁ బనిలేదు. మేధ ఉన్నఁగాని ఆచార్యుని అనుగ్రహమువలన గ్రహించినవిద్యను ధరింపఁజాలఁడు. విద్యాధారణ మున్నఁగాని బ్రహ్మజ్ఞానము కలుగఁజాలదు. కావున ఇచట మేధాకాముఁడు జపించవలసినమంత్రమును చెప్పుట ఆవశ్యకమే గాని అనావశ్యకము కాదని తెలిసికొనవలయును.

౨. నాదేహము ఆరోగ్యసమన్వితమైనది అగుఁగాక. నానాలుక మధురభాషణములు గలది యగుఁగాక. నాచెవులు చక్కఁగా వినుటకు సమర్థము లగుఁగాక. అనఁగా నాదేహము ఇంద్రియములు బ్రహ్మజ్ఞానార్హము లగుఁగాక. ఓ ప్రణవమా! నీవు పరబ్రహ్మమునకు కోశభూతమయినదానవు. (కోశ మనఁగా ఒర. కత్తి ఒరయందు ఎటుల నుండునో పరబ్రహ్మము సైతము ప్రణవమునం దట్లే ఉండును. కావున ప్రణవ మిచట బ్రహ్మమునకు కోశస్థానముగాఁ జెప్పఁబడినది.) లౌకికప్రజ్ఞచేత ఆచ్ఛాదింపఁబడితివి. (అనఁగా సాధారణప్రజ్ఞగలవారలు నీమాహాత్మ్యము నెఱుంగఁజాలరని తాత్పర్యము.) అట్టి నీవు శ్రవణపూర్వకమగు ఆత్మజ్ఞానమును సంరక్షించుము. (అనఁగా రాగద్వేషాదికముచేత చిత్తము పరిభూత మగుటగాని లేక తదర్థవిస్మరణముగాని లేనివడువున నన్ను రక్షించుమని తాత్పర్యము. శరీర పాటవము లేనియెడల శ్రవణాద్యనుష్ఠానమునకే యోగ్యుఁడు కాఁజాలఁడు. వాగింద్రియము పరుషభాషణశీలమయినయెడల శీలము సర్వదా ఏకాకారము కావున జ్ఞానోపదేష్టయందును అట్టి పరుషభాషణము నుపయోగించుట సంభవము కావున జ్ఞానోపదేశము సైతము సంభవించదు. కర్ణములకు

చెవుడు తటస్థించిన గ్రంథశ్రవణమే సంభవించదు. ఇట్లే అన్నియవయవములకు గ్రహించునది. ఇచ్చట జిహ్వాకర్ణశ్రవణములనే గ్రహించినను సర్వవిధశరీరపాటవమునకు బోధకముగానే మనము గ్రహించవలయును, కావున కండ్లు మున్నగు సకలావయవములు కూడ చక్కఁగా తత్తత్క్రియానిర్వహణక్షమములయి యుండవలయుననియే ఉపాసకుని యభిప్రాయము.) ఈరెండుమంత్రములును మేధాకాముఁడు దేహారోగ్యకాముఁడు జపించవలసినవి.

ఇఁక శ్రీకామునకు హోమార్థములయిన మంత్రములు చెప్పఁబడుచున్నవి.——

3. ఓ ప్రణవమా ! నాకు మేధను శరీరపాటవమును కలుగఁజేసిన పిదప అన్నపానీయములను, గోవులను వస్త్రములు మొదలగువానిని గలుగఁజేయుచు అట్టివానిని వృద్ధిజేయుచు ఆ వృద్ధిచేసినవానిని చిరకాల ముండునటుల చేయునట్టి సంపదను గూడ నాకు కలుగఁజేయుము. కేవలము గోవులు మాత్రమే గాక మేఁకలు, గొఱ్ఱెలు మున్నగు పశువులుకూడ నాకు కలిగియుండుగాక యని తాత్పర్యము. (మేధ లేనివానికి సంపద లున్న యెడల వాఁడు దుష్టుఁడై దుర్వ్యయముల నొనర్చి చెడిపోవును కావున మేధను కలుగఁజేసినతరువాతనే సంపదను కలుగఁజేయుమనియు, సంపద లేనియెడల చిత్తశుద్ధికయి ఆచరించవలసిన యాగాద్యనుష్ఠానముసైతము ఆచరించ వలనుపడదు కావున మేధను కలుగఁజేసినపిదప అవశ్యము సంపదను కూడ నొసంగుమని తాత్పర్యము.

౪. విద్యాభిలాషులయిన బ్రహ్మచారులు నన్నుఁగూర్చి వచ్చెదరు గాక.

౫. స్వర్గాదిలోకప్రాపకము లగు లౌకికవిద్యలను మోక్షవిద్యను అఖిల

షించు విద్యార్థులుకూడ నాసమీపమునకు వచ్చి సఫలీకృతమనోరథు లయ్యెదరుగాక.

౬. శ్రేష్ఠమయిన బుద్ధిబలముగల బ్రహ్మచారులందఱు నాసమీపమునకే వచ్చెదరుగాక.

౭. బాలచేష్టలను మానిన బ్రహ్మచారులు నాసమీపమునకు విద్యార్థులయి వచ్చెదరుగాక.

౮. శాంతచిత్తులగు బ్రహ్మచారులు నాసమీపమునకు వచ్చెదరు గాక.

(ఈమంత్రమునకు మొత్తముగా కలిసి అనేకసంఖ్యలుగల విద్యార్థిబృందము నాసమీపమునకు వచ్చుగాక యని ఒకరిమతము.)

౯. 'ఈయాచార్యుఁ డెందఱినో విద్యావంతుల నొనర్చినాఁడు' అనెడి కీర్తివిశేషమును జనసమూహమునందు నేను పొందెదను గాక.

౧౦. ఐశ్వర్యవంతునికంటె అతిశయమైన మాన్యతగలవాఁడ నయ్యెదనుగాక.

౧౧-౧౨. (ఇదివఱకుఁ జెప్పఁబడినమంత్రములందు మేధాప్రాప్తి ఐశ్వర్యప్రాప్తి మున్నగు సకలేప్సితములను కోరియున్నాఁడు. ఇప్పు డీమంత్రమునందు విద్యావ్యాప్తికిని ఐశ్వర్యాదికమునకును ప్రయోజనభూతమగు ఓంకారవాచ్యబ్రహ్మముతోడ ఐక్యతను ప్రార్థించుచున్నాఁడు:—)ఓపూజ్యమయిన ప్రణవమా! నేను పరబ్రహ్మమునకు కోశభూతమగు నిన్ను ప్రవేశించుచున్నాఁడను. బ్రహ్మకు కోశభూతమగు నీవున్నూ నన్ను ప్రవేశించుము. అనఁగా పరబ్రహ్మమునకు కోశభూతమగు త్వత్స్వరూపుఁడనే అయ్యెదను. నీవున్నూ నన్ను ప్రవేశించుము. అనఁగా మనకిద్దఱకు భేదమున్నదని తలంచెడి అజ్ఞానమును సమూలముగా నిర్మూలనము చేయుమని భావము.

౧౩. ఓపూజ్యమగు ప్రణవమా! శివవిష్ణ్వాద్యనేకవిధరూపములుగల నిన్ను స్మరించి నాపాపములను పోఁగొట్టుకొనియెదను.

౧౪. నీళ్లు పల్లపుప్రదేశమునకు ఎట్లు పోవునో, మాసములు సంవత్సరమును గూర్చి ఎటుల పోవునో ఆదేవిధముగా ఓ ప్రణవమా! నాసమీపమునకు అధ్యయనార్థము నలుదిక్కులనుండి బ్రహ్మచారులందఱు వచ్చెదరుగాక.

౧౫. ఓ ప్రణవమా! నీవు నిన్నుపాసించువారలకు సమీపమునందున్న గృహమువంటిదానవు, అనఁగా గృహమువలె సకలదుఃఖములను నివారించుదానవు. కావున ఆత్మతత్త్వమును నాకు ప్రకాశింపఁ జేయుము. (నీనిష్ఠయే సంసారశ్రమాపనోదనక్షమమయినది కావున ఆత్మస్వరూపమును వాస్తవముగా ప్రకాశింపఁజేయుమని భావము.) నన్నుఁగూడ పొందుము. (రసవిద్ధమయినలోహము రసమయమయినవిధముగా నన్నుపొంది నన్నుఁగూడ తన్మయుని చేయుమని భావము.)

జ్ఞాపిక:—విద్యాప్రకరణమునందు శ్రీకాముని గుఱించి చెప్పుట ధనార్థమని గ్రహించవలయును. ఆధనము శాస్త్రీయవిహితకర్మల నాచరించుటకొఱకనియు, విహితకర్మలు, ఉపాత్తదురితక్షయార్థమనియు, దురితక్షయమయినపిదప జ్ఞానోత్పత్తి కలుగుననియు శ్రీమదాచార్యులవారు భాష్యమునందు చెప్పి ఇందులకు ప్రమాణముగ శ్రీమన్మహాభారతము శాంతి పర్వమునందుగల మోక్షధర్మములోని ఈక్రిందిశ్లోకము నుదహరించిరి:—

శ్లో. జ్ఞాన ముత్పద్యతే పుంసాం క్షయాత్పాపస్య కర్మణః,
యథాఽఽదర్శతలప్రఖ్యే పశ్యత్యాత్మాన మాత్మని.

భార. మోక్ష. ౨౦౪. ౮.

ఈమంత్రములలో, ౫,౬,౭,౮ మంత్రములు ఆంధ్రపాఠమునందు మాత్రము గలవు గాని ద్రావిడపాఠమునందు లేవు. ఆనందాశ్రమ, మహీశూరపురముద్రితభాష్యగ్రంథములందు పైమంత్రములు ఆచార్యదృతములయినటుల గలదు. శ్రీరంగముద్రితభాష్యగ్రంథమునందు పైవాక్యములు గ్రహింపఁబడియుండలేదు.

తైత్తిరీయభాష్యవార్తికమునందు, ౬, ౭ మంత్రములుమాత్రము పరిగ్రహింపఁబడినవి. ౫, ౨ మంత్రములు పరిగ్రహింపఁబడియుండలేదు. దీనివలన ఆచార్యులవారిచట ఆంధ్రపాఠమును గ్రహించినటుల స్ఫురించుచున్నది.

౧. అను.........

౨. ఆత్మ.........

3. భా. వా. ౬౭-౯౧.

---

౫. పంచమోఽనువాకః.

వ్యాహృత్యుపాసనము

౧భూర్భువస్సువరితి వా ఏతాస్తిస్రో వ్యాహృతయః । తాసాముహస్మైతాం చతుర్థీమ్ । మాహాఽచమస్యః ప్రవేదయతే । మహ ఇతి । తద్బ్రహ్మ । స ఆత్మా । అఙ్గాన్యన్యా దేవతాః । ౨భూరితి వా అయం లోకః । భువ ఇత్యన్తరిక్షమ్ । సువరిత్యసౌ లోకః ॥౧॥

మహ ఇత్యాదిత్యః । ఆదిత్యేన వావ సర్వే లోకా మహీయంతే । 3భూరితి వా అగ్నిః । భువ ఇతి వాయుః ।

సువ రిత్యాదిత్యః । మహ ఇతి చన్ద్రమాః । చంద్రమసా వావ సర్వాణి జ్యోతీగ్ంషి మహీయంతే । ఽభూ రితి వా ఋచః । భువ ఇతి సామాని । సువ రితి యజూగ్ంషి ॥౨॥

మహ ఇతి బ్రహ్మ । బ్రహ్మణా వావ సర్వే వేదా మహీయంతే । ఽభూ రితి వై ప్రాణః । భువ ఇత్యపానః । సువ రితి వ్యానః । మహ ఇత్యన్నమ్ । అన్నేన వావ సర్వే ప్రాణా మహీయన్తే । తా వా ఏతాశ్చతస్ర శ్చతుర్ధా చతస్ర శ్చతస్రో వ్యాహృతయః । తా యో వేద స వేద బ్రహ్మ । సర్వేఽస్మై దేవా బలి మావహన్తి ॥౩॥

అసౌ లోకో యజూగ్ంషి వేద ద్వే చ. ॥౪॥

టీక. ౧. భూః='భూః' అనియు, భువః = 'భువః' అనియు, సువః= 'సువః' అనియు, ఇతి=ఈవిధముగా, ఏతాః=ఈ, తిస్రః = మూఁడున్నూ, వ్యాహృతయఃవై = వ్యాహృతులుగదా, తాసాం=ఆవ్యాహృతులకు, ఏతాం= ఈ, చతుర్థీం=నాల్గవ వ్యాహృతిని, మహఃఇతి = 'మహః' అని, మాహాచమస్యః = మాహాచమస్యమహర్షి, ప్రవేదయతే ఉ హ స్మ=తెలిసికొనెనుగదా. తత్=ఆమాహాచమస్య మహర్షిచేత దృష్ట మగు 'మహః' అను వ్యాహృతియే, బ్రహ్మ = బ్రహ్మము. సః=ఆ'మహ'యనువ్యాహృతియే, ఆత్మా = ఆత్మ, అన్యాః = ఇతరములగు, దేవతాః = దేవతలు, (ఇచట దేవతలుపలక్షణము లోకము మున్నగునవి యనుట.) అంగాని=అంగములు.

౨. భూఃఇతి='భూః' అనువ్యాహృతి, అయం=ఈ, లోకఃవై=లోకము గదా (మర్త్యలోకమనుట), భువఃఇతి = 'భువః' అనువ్యాహృతి, అంతరిక్షం= అంతరిక్షలోకము. సువఃఇతి='సువః' అనువ్యాహృతి, అసౌలోకః = స్వర్గలోకము. మహఃఇతి = 'మహః' అనువ్యాహృతి, ఆదిత్యః = ఆదిత్యలోకము. సర్వే=సమస్తమయిన, లోకాః=లోకములు, ఆదిత్యేన = ఆదిత్యునిచేత, మహీయన్తేవావ = వృద్ధిని పొందుచున్నవిగదా.

3. భూః ఇతి='భూః' అనువ్యాహృతి, అగ్నిః=అగ్ని, భువః ఇతి = 'భువః' అనువ్యాహృతి, వాయుః = వాయువు, సువఃఇతి='సువః' అనువ్యాహృతి, ఆదిత్యః = ఆదిత్యుఁడు, మహఃఇతి='మహః' అనువ్యాహృతి, చంద్రమాః=చంద్రుఁడు, సర్వాణి = సకలములయిన, జ్యోతింషి = జ్యోతిస్సులు, చంద్రమసా=చంద్రునిచేత, మహీయంతేవావ=వృద్ధిని పొందుచున్నవిగదా.

౪. భూఃఇతి='భూః' అనువ్యాహృతి, ఋచః వై=ఋక్కులుగదా. భువః ఇతి='భువః'అనువ్యాహృతి, సామాని=సామములు, సువః ఇతి='సువః' అనువ్యాహృతి, యజూంషి = యజుస్సులు, మహఃఇతి='మహః' అనువ్యాహృతి, బ్రహ్మ=ఓంకారము, సర్వేవేదాః = వేదములన్నియు, బ్రహ్మణా = ఓంకారముచేత, మహీయన్తేవావ=వృద్ధిని పొందుచున్నవిగదా.

౫. భూఃఇతి='భూః' అనువ్యాహృతి, ప్రాణఃవై = ప్రాణవాయువుగదా, భువఃఇతి='భువః' అనువ్యాహృతి, అపానః = అపానవాయువుగదా, సువఃఇతి='సువః' అనువ్యాహృతి, వ్యానః=వ్యానవాయువుగదా, మహఃఇతి = 'మహః' అనువ్యాహృతి, అన్నం = అన్నముగదా, సర్వే=సమస్తములయిన, ప్రాణాః=ప్రాణములు, అన్నేన = అన్నముచేత, మహీయంతే వావ=వృద్ధిని పొందుచున్నవిగదా.

౬. తాః=ఆ, ఏతాః=ఈ, చతస్రః=నాలుగువ్యాహృతులు, చతుర్ధా= నాల్గువిధములుగదా, వ్యాహృతయః = వ్యాహృతులు, చతస్రః చతస్రః =

వాల్గేసి నాల్గేసి యగుచున్నవి. తాః=ఆవ్యాహృతులను, యః=ఎవ్వఁడు, వేద = ఉపాసించునో, సః=వాఁడు, బ్రహ్మ=బ్రహ్మమునే, వేద = ఉపాసించుచున్నాఁడు, అస్మై = ఈ(విషయమును) యెఱింగినవానికి, సర్వేదేవాః = దేవతలందఱు, బలిం=పూజను, ఆవహంతి = చేయుచున్నారు.

తా. మూఁడవయనువాకమునందు సంహితోపాసనము వివరింపఁబడి యున్నది. నాల్గవయనువాకమునందు మేధాకామునకు శ్రీకామునకు తత్తత్కామప్రాప్తికి సాధనభూతము లగుమంత్రములు చెప్పఁబడియున్నవి. నాల్గవ యనువాకమునందు చెప్పఁబడిన మేధాకామాదిమంత్రములను సైతము ఫలాభిలాషలేక జపహోమముల నాచరించునెడల సంహితోపాసనమునవలెనే చిత్తశుద్ధిమూలకముగ విద్యోపయోగము లగుచున్నవి. ఈ ౫-వ అనువాకమునందును, పై ౬-వ అనువాకమునందును, వ్యాహృత్యాత్మకబ్రహ్మోపాసనము చెప్పఁబడినది.

అందు ౫-వ యనువాకమునందుమాత్రము బ్రహ్మకు అంగభూతము లగు వ్యాహృతుల యుపాసనము చెప్పఁబడుచున్నది.

పైయనువాకమునందు అంగిభూత బ్రహ్మోపాసనము చెప్పఁబడును.

'భూః, భువః, సువః' అనునవి మూఁడున్నూ వ్యాహృతులని చెప్పఁబడును. మాహాచమస్యుఁడనువార్షి 'మహః'అనునది నాల్గవవ్యాహృతి కలదని తపఃప్రభావముచేతఁ గనిపెట్టెను. ఆవ్యాహృతియే బ్రహ్మము. ఆ వ్యాహృతియే ఆత్మ. ఏలయనఁగా 'మహః'అను అంగికి భూః, భువః, సువః అను వ్యాహృతులు అంగములు. అంగ్యధీనముగా ఇతరావయవములకు వృద్ధి ఎటుల కలుగునో అటులనే ఇతరవ్యాహృతులకు ఈవ్యాహృతివలన అవస్థితి కలుగుచున్నది. ఇఁక క్రమముగ ఆవ్యాహృతులు బ్రహ్మమునకు అంగభూతములు కావున అంగోపాసనారూపమగు వ్యాహృత్యుపాసనమునందు క్రమముగ ౧ లోక, ౨ దేవ, 3 వేద, ౪ ప్రాణదృష్టిరూపోపాసనములు ఇఁదు విధింపఁబడినవి:—

౧. లోకదృష్ట్యుపాసనము.

1. 'భూః' అనువ్యాహృతిని ఈలోక (అనఁగా భూలోక) దృష్టితో ఉపాసించవలయును.

2. 'భువః' అనువ్యాహృతిని అంతరిక్షలోకదృష్టితో ఉపాసించ-వలయును.

3. 'సువః' అనువ్యాహృతిని స్వర్గలోకదృష్టితో ఉపాసించవలయును.

4. 'మహః' అనువ్యాహృతిని ఆదిత్యలోకదృష్టితో ఉపాసించవలయును. లోకములన్నియు ఆదిత్యప్రకాశసమన్వితములయి సర్వప్రాణులకు వ్యవహారయోగ్యము లగుచున్నవిగదా.

౨. దేవవిశేషదృష్ట్యుపాసనము.

1. 'భూః' అనువ్యాహృతిని అగ్నిదృష్టితో నుపాసించవలయును.

2. 'భువః' అనువ్యాహృతిని వాయుదృష్టితో నుపాసించవలయును.

3. 'సువః' అనువ్యాహృతిని ఆదిత్యదృష్టితో నుపాసించవలయును.

4. 'మహః' అనువ్యాహృతిని చంద్రదృష్టితో నుపాసించవలయును. సకల తేజఃపుంజములు చంద్రునిచేత పూజ్యములయి పరిగణింపఁబడుచున్నవిగదా.

3. వేదదృష్ట్యుపాసనము.

1. 'భూః' అనువ్యాహృతిని ఋగ్వేదదృష్టితో నుపాసించవలయును.

2. 'భువః' అనువ్యాహృతిని సామవేదదృష్టితో నుపాసించవలయును.

3. 'సువః' అనువ్యాహృతినియజుర్వేదదృష్టితోనుపాసించవలయును.

4. 'మహః' అనువ్యాహృతిని ఓంకారదృష్టితో నుపాసించవలయును.

ఓంకారమును ఆద్యంతములందుచేర్చి పఠించుటచేతనే వేదములన్నియు పూజనీయము లగుచున్నవి గదా. ఈయనువాకమునందే ముందు "ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్య న్నాహ" అని చెప్పఁబోవుచున్నాఁడు కావున వేదమును ఉపక్రమించునప్పుడు ఓంకారపూర్వకముగనే ఉపక్రమించవలయును కావున పైనిచెప్పఁబడిన విషయము యుక్తమే యగుచున్నది.

౮. ప్రాణదృష్ట్యుపాసనము.

1. 'భూః' అనువ్యాహృతిని ప్రాణవాయుదృష్టితో ఉపాసించవలయును.

2. 'భువః' అనువ్యాహృతిని అపానవాయుదృష్టితో ఉపాసించవలయును.

3. 'సువః' అనువ్యాహృతిని వ్యానవాయుదృష్టితో నుపాసించవలయును.

4. 'మహః' అనువ్యాహృతిని అన్నదృష్టితో నుపాసించవలయును.

లోకమునందు ప్రాణములన్నియు అన్నముచేతనే పోషింపఁబడుచున్నవి గదా. ఈవిషయము జగత్ప్రసిద్ధముమాత్రమే గాదు. ఇందులకు శ్రుతిప్రమాణముగూడఁ (బృహ. ౫. ౧౨. ౧.) గలదు:—

శ్రు. "శుష్యతి వై ప్రాణః ఋతే ఽన్నాత్" అని (అన్నము లేని యెడల ప్రాణము శోషించునుగదా) అని యర్థము.

పైనిచెప్పఁబడిన 'భూః, భువః, సువః, మహః' అను వ్యాహృతులు లోక, దేవ, వేద, ప్రాణ, దృష్టులతో నాల్గువిధము లగుచున్నవి. అప్పుడు

1. 'భూః' అనువ్యాహృతి 'పృథివి, అగ్ని, ఋగ్వేదము, ప్రాణవాయువు' ఈదృష్టితో నాల్గువిధము లగుచున్నవి.

2. 'భువః' అనువ్యాహృతి 'అంతరిక్షము, వాయువు, సామవేదము, అపానవాయువు' ఈదృష్టితో నాల్గువిధము లగుచున్నది.

3. 'సువః' అనువ్యాహృతి 'స్వర్గము, ఆదిత్యుఁడు, యజుర్వేదము, వ్యానవాయువు' ఈదృష్టితో నాల్గువిధము లగుచున్నది.

4. 'మహః' అనువ్యాహృతి 'ఆదిత్యలోకము, చంద్రుఁడు, ఓంకారము, అన్నము' ఈదృష్టితో నాల్గువిధము లగుచున్నది. మొత్తము నాల్గునాల్గులు కలసి ౧౬ అగుచున్నది.

ఈవిధముగా అంగభూతములగు వ్యాహృతులను ఎవ్వఁడుపాసించునో అతఁడే బ్రహ్మము నెఱుంగును. అతనికే దేవతలందఱు పూజాదికము నాచరింతురు.

వ్యాహృతిశబ్దవ్యుత్పత్తి.

౧. వ్యాహరణం - ఉచ్చారణం, తద్విషయత్వా న్మంత్రాణాం వ్యాహృతిత్వమ్.

౨. (యద్వా) వివిధే-కర్మణి, ఆహ్రియంతే-ప్రయుజ్యంతఇతి— వ్యాహృతయః.

అర్థ. వివిధము లగు కర్మలందు ప్రయోగింపఁబడుచున్నవి కావున వ్యాహృతు లనంబడును.

వ్యాహృతులను వివిధవిషయములందు ప్రయోగించవలసినదిగా చెప్పినమాత్రముల నీక్రింద నిచ్చుచున్నాఁడను.—

తైత్తిరీయసంహిత ౧-వ కాండము, ౬-వ ప్రశ్నము, ౧౦-వ అనువాకము:—

౧......అగ్నిహోత్ర మేతాభి ర్వ్యాహృతీభి రుపసాదయే ద్యజ్ఞముఖం వా అగ్నిహోత్రం బ్రహ్మైతా వ్యాహృతయో యజ్ఞముఖ ఏవ బ్రహ్మ. ౨. కురుతే.

౨. సంవత్సరే పర్యాగత ఏతాభి రేవోపసాదయే ద్బృహ్మణైవో భయత స్సంవత్సరం పరిగృహ్ణాతి.

3. దర్శపూర్ణమాసౌ చాతుర్మాస్యాన్యా లభమాన ఏతాభి ర్వ్యాహృతీభిర్హవీగ్ంష్యాసాదయే ద్యజ్ఞముఖం వై దర్శపూర్ణమాసౌ చాతుర్మాస్యాని బ్రహ్మైతా వ్యాహృతయో యజ్ఞముఖ ఏవ బ్రహ్మ కురుతే సంవత్సరే పర్యాగత ఏతాభి రేవాసాదయే ద్బృహ్మణైవోభయత స్సంవత్సరం పరిగృహ్ణాతి.........

౪......సామిధేనీ రనువక్ష్య న్నేతా వ్యాహృతీః పురస్తా ద్దధ్యా ద్బ్రహ్మైవ ప్రతిపదం కురుతే రథాబ్రాహ్మణ స్సాశీర్కేణ యజ్ఞేన యజతే.

౫. యం కామయేత యజమానం భ్రాతృవ్య మస్య యజ్ఞస్యాశీ ర్గచ్ఛేదితి తస్యైతావ్యాహృతీః పురోఽనువాక్యాయాం దధ్యాత్......

౬...యాన్కామయేత యజమానా న్త్సమావత్యేనా న్యజ్ఞ స్యాశీ ర్గచ్ఛేదితి తేషామేతా వ్యాహృతీః పురోఽనువాక్యాయా అర్ధర్చ ఏకాంద ధ్యాద్యాజ్యాయై పురస్తా దేకాం యాజ్యాయా అర్ధర్చ ఏకాం తథై నా న్త్సమావతీ యజ్ఞస్యాశీ ర్గచ్ఛతి.

అర్థ. ౧. వ్యాహృతులచేత అగ్నిహోత్రహవిస్సు నాసాదించ వలయును.

౨. అగ్నిహోత్రారంభానంతరము సంవత్సరము అయినపిదప మఱల నీవ్యాహృతులచేతనే హవిరాసాదన మొనర్పవలయును.

3. దర్శపూర్ణ చాతుర్మాస్యయాగములయందు నీవ్యాహృతులచేతనే హవిరాసాదనము చేయవలయును.

౪. హోత 'సామిధేనీఋక్కులను' పఠించఁబోవుచు ముందుగా నీవ్యాహృతులను పఠించవలయును.

౫. యజ్ఞఫలమును యజమానునియొక్క శత్రువునకు చెందఁజేయ వలయు ననుదురూహ అధ్వర్యునకు కలిగెనేని ఆయధ్వర్యుఁడు పురోఽనువాక్యముకంటె ముందుగా వ్యాహృతులను పఠించవలయును.

౬. అనేకయజమానులు కలిసి చేయుసత్రయాగములందు యజమానులందఱు సమానమయినఫలమును పొందవలయునని 'హోత' యను ఋత్విక్కు తలంచునెడల పురోఽనువాక్యను సగముపఠించి ౧-వ వ్యాహృతిని, యాజ్యను చెప్పుటకుముందుగా ౨-వ ఆహుతిని, యాజ్య సగముచెప్పి 3-వ వ్యాహృతిని పఠించవలయును.

మఱియు ప్రాణాయామమునందు, గాయత్రీజపమునందు, పరిషేచనమునందు దాదాపు సకలకర్మలందు ప్రయోగింపఁబడును కావున "వ్యాహృతులు" అని చెప్పుటకు తగియున్నవి.

వ్యాహృత్యుపాసనమునకు సంబంధించిన వివరము నీక్రింద నిచ్చుచున్నాఁడను:—

	౧	౨	3	౪
వ్యాహృతులు	భూః	భువః	సువః	మహః
లోక	(అయం లోకః) భూలోకము	అంతరిక్ష లోకము	(అసౌలోకః) స్వర్గలోకము	ఆదిత్య లోకము
దేవ	అగ్ని	వాయువు	ఆదిత్యుఁడు	చంద్రుఁడు
వేద	ఋగ్వేదము	సామవేదము	యజుర్వేదము	బ్రహ్మవేదము
ప్రాణ	ప్రాణవాయువు	అపానవాయువు	వ్యానవాయువు	అన్నము

మాహాచమస్యశబ్ద వ్యుత్పత్తి.

మహాన్ చమసః—సోమపానార్థః పాత్రవిశేషో యస్య మునేః సః మహాచమసః, బహుషు సోమయాగేషు వర్తమానత్వా చ్చమసస్య మహత్త్వమ్. మహాచమసః గోత్రాపత్యంపుమాన్—'మాహాచమస్యః'.

అర్థ. చమస మనఁగా, సోమపానార్థమగు పాత్రము. పూజ్యమగు అట్టిపాత్ర మెవ్వనికి గలదో అట్టిమహర్షి 'మహాచమసుఁడు' అనేక సోమయాగములందు ఉండుటచేతనే అతనిచమసమునకు మహత్త్వము సిద్ధించుచున్నది. అట్టి మహాచమసునియొక్క గోత్రమునందు పుట్టినవాఁడు మహాచమస్యుఁడు. అని తైత్తిరీయభాష్యవార్తికమునం దున్నది.

శంకరభాష్యమునందును, విద్యారణ్యకృత బృహద్దీపికయందును 'మహాచమసస్యాపత్యం మాహాచమస్యః' అనిమాత్రమే చెప్పఁబడియున్నది. సురేశ్వరాచార్యకృతభాష్యవార్తికమునందు:—

శ్లో. మహాచమసగోత్రత్వా ద్గోత్రార్థస్తద్ధితో భవేత్,
మాహాచమస్యోఽత స్స్యాత్ మహోవేదయతే పరామ్.

అని చెప్పఁబడియుండుటచేత ఇచట 'గోత్రాపత్య' మని వ్రాయడమైనది.

---

౬. షష్ఠోఽనువాకః.

(మనోమయత్వాదిగుణక బ్రహ్మోపాసనము.)

అవ. ౫.వ అనువాకమునందు వ్యాహృత్యాత్మకమగు బ్రహ్మముయొక్క అంగభూతములగు వ్యాహృతులయుపాస

నము చెప్పఁబడినది. తద్వ్యాహృతుల నుపాసించినవాఁడు బ్రహ్మోపాసనమునకు అర్హుఁడగును. కావున అట్టి బ్రహ్మమును సాక్షాత్తుగ పొందుటకు అర్హమగు స్థానము మున్నగునవి ఈయనువాకమునందు చెప్పఁబడుచున్నవి:—

మం. ౧స య ఏషోఽన్తర్హృదయ ఆకాశః తస్మిన్నయం పురుషో మనోమయః అమృతో హిరణ్మయః ౨అన్తరేణ తాలుకే య ఏష స్తన ఇవావలమ్బతే సేన్ద్రయోనిః । యత్రాసౌ కేశాన్తో వివర్తతే । వ్యపోహ్య శీర్షకపాలే । 3భూ రిత్యగ్నౌ ప్రతితిష్ఠతి । భువ ఇతి వాయౌ ॥౧॥

సువ రిత్యాదిత్యే । మహ ఇతి బ్రహ్మణి । ౪ఆప్నోతి స్వారాజ్యమ్ ఆప్నోతి మనసస్పతిమ్ వాక్పతి శ్చక్షుష్పతిః । శ్రోత్రపతి ర్విజ్ఞానపతిః । ౫ఏత త్తతో భవతి । ఆకాశశరీరం బ్రహ్మ । సత్యాత్మ ప్రాణారామం మన ఆనన్దమ్ । శాన్తిసమృద్ధ మమృతమ్ । ఇతి ప్రాచీనయోగ్యోపాస్స్వ ॥౨॥

వాయౌ వమృత మేకం చ ॥౬॥

౧. టీక. అంతః హృదయే = హృదయపుండరీకమధ్యభాగమునందు, యః=ఏ, ఏషః=ఈ, ఆకాశః=ఆకాశముగలదో, తస్మిన్ = ఆయాకాశమునందు, మనోమయః = మనోమయుఁడును, అమృతః = మరణధర్మరహితుఁడును, హిరణ్మయః=జ్యోతిర్మయుఁడును అగు, సః అయం=ఆ ఈ, పురుషః= పురుషుఁడు (కలఁడు.)

౨. తాలుకే అన్తరేణ = తాలుకలకు మధ్యభాగమునందు, యః=ఏ, ఏషః=ఈ (సుషుమ్నా నాడి), స్తనః ఇవ=స్తనమువలె, అవలంబతే=వ్రేలాడుచున్నదో, యత్ర = ఎచ్చట, అసౌ=ఈ, కేశాంతః = కేశములయొక్క మొదలు, వివర్తతే=విభాగముగా నున్నదో, శీర్షకపాలే = శిరఃకపాలములను, వ్యపోహ్య = విభజించి బయలువెడలినది యెయ్యది గలదో, సా=అది, ఇంద్రయోనిః=పరమాత్మను పొందుటకు మార్గభూతము.

3. (ఈప్రకారము పరమాత్మ ప్రతిపత్తిమార్గమును పొందిన విద్వాంసుఁడు) భూః ఇతిఅగ్నౌ= 'భూః' అనువ్యాహృత్యాత్మకమగు ఆఅగ్నియందు, ప్రతితిష్ఠతి=ఉంటున్నాఁడు. భువః ఇతివాయౌ='భువః' అనువ్యాహృత్యాత్మకమగు వాయువునందు, ప్రతితిష్ఠతి = ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు. సువః ఇతి ఆదిత్యే='సువః' అను తృతీయవ్యాహృత్యాత్మకుఁడగు ఆదిత్యునియందు, (ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు.) మహః ఇతి బ్రహ్మణి='మహః' అను చతుర్థవ్యాహృత్యాత్మక మగుబ్రహ్మమునందు, ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు.

౪. స్వారాజ్యం = స్వారాజ్యభావమును, ఆప్నోతి = పొందుచున్నాఁడు. మనసఃపతిం = అందఱిమనస్సులకు అధిపతిత్వమును, ఆప్నోతి = పొందుచున్నాఁడు. వాక్పతిః = అందఱివాక్కులకు అధిపతి యగుచున్నాఁడు. చక్షుష్పతిః=నేత్రములకు అధిపతి యగుచున్నాఁడు. శ్రోత్ర

పతిః=శ్రవణములకు అధిపతి యగుచున్నాఁడు. విజ్ఞానపతిః=విజ్ఞానాధిపతి యగుచున్నాఁడు.

౫. తతః=తరువాత, ఏతత్ = ఈ చెప్పఁబోవునది, భవతి = అగుచున్నాఁడు. ఆకాశశరీరం = ఆకాశమువలె సూక్ష్మశరీరము కలిగినట్టియు, సత్యాత్మ=మూర్తము, అమూర్తము అయిన స్వరూపముగలవియు, ప్రాణారామం=ప్రాణములందు క్రీడగలదియు, మన ఆనన్దం = ఆనందస్వరూపమగు మనస్సుగలవియు, శాంతిసమృద్ధం = ఉపశమముచేత నిండినదియు, అమృతం=అమరణధర్మము అగు, బ్రహ్మ=బ్రహ్మస్వరూపుఁడు (అగుచున్నాఁడని మొదట చెప్పఁబడినక్రియతో సమన్వయము) ఈవిధముగా, ప్రాచీనయోగ్య = ఓ ప్రాచీనయోగ్యుఁడా! ఉపాస్వ=ఉపాసించుము.

౧. తా. 'భూః భువః సువః' అను వ్యాహృతిత్రయము లోక, దేవతా, వేద, ప్రాణాత్మకముగా 'మహః' అను వ్యాహృత్యాత్మకమగు బ్రహ్మమునకు అంగభూతమని వెనుకటి యనువాకమునందు చెప్పఁబడినది. ఈయనువాకమునందు అంగిభూతమగు పరబ్రహ్మముయొక్క సాక్షాల్లాభార్థము ఉపాసనార్థము హృదయాకాశము స్థానముగా చెప్పఁబడుచున్నది. శ్రీమహావిష్ణువు నుపాసించుటకు సాలగ్రామము స్థానముగా ఉపదేశించినటుల ఇచట పరబ్రహ్మము నుపాసించుటకు హృదయపుండరీకము స్థానభూతముగా నుపదేశించడమైనది. ఆహృదయపుండరీకమునందు ఆబ్రహ్మ ముపాసించబడు నెడల మనోమయత్వాది ధర్మవిశిష్టమగు అట్టి బ్రహ్మము కరతలామలకముగ చక్కఁగా గ్రహించఁబడును. '"సయఏషోఽంతర్హృదయ ఆకాశః" అను చోటుగల "సః" అను పదము "తస్మిన్నయం పురుషో మనోమయః" అనుచోటుగల "అయం పురుషః" అనుపదముతో సమన్వయించఁదగినదిగాని "యః ఏషః" అనుపదములతో అన్వయించఁదగినది కాదు.

౨. హృదయమనఁగా తామరమొగ్గవంటి ఆకారముకలిగి అనేకములగు నాడులకు ఆశ్రయములగు రంధ్రములు గలిగి ఊర్ధ్వనాలమును అధోబిలమునుగల మాంసపిండము. ఈమాంసపిండము పశువును ఛేదించునపుడు ప్రత్యక్షముగా అందఱకు గనఁబడును. ఆహృదయమునందు గల అవకాశమునందు పురుషుఁడు నివసించును. ఆపురుషుఁడు మనోమయుఁడు. మఱియు అమరణధర్ముఁడు. మఱియు జ్యోతిర్మయుఁడు. ఇట్టి మనోమయ, అమరణధర్మ, జ్యోతిర్మయత్వాదిగుణములు కలిగి హృదయాకాశమునందు సాక్షాత్కరింపఁబడెడి పరమేశ్వరుని చేరుటకు మార్గము చెప్పఁబడుచున్నది.— హృదయమునుండి ఏనాడి ఊర్ధ్వముగా వ్యాపించియున్నదో దానికి సుషుమ్నయని పేరు. అయ్యది తాలుకలయొక్క మధ్యభాగమునం దున్నది. ఆ తాలుకలయొక్క మధ్యభాగమునందు ఏమాంసపిండము స్తనమువలె వ్రేలాడుచున్నదో తన్మధ్యభాగమునుండి మూర్ధప్రదేశమును భేదించుకొని బయలువెడలిపోవుట పరమాత్మప్రాప్తికి మార్గము. ఆవిధముగా రేచకముచేత సుషుమ్నానాడిని శిరఃకపాలము భేదించుకొని బయలువెడలులాగు చేసినవాఁడు ఈలోకమునకును (ఋగ్వేదమునకును ప్రాణవాయువునకును) అధిష్ఠాతయు, 'మహః' అను వ్యాహృతిరూపబ్రహ్మమునకు అంగభూతుఁడగు 'భూః' అను వ్యాహృతిరూపాగ్నియందు ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు. అనఁగా అగ్నిస్వరూపముచేత ఈలోకమును వ్యాపించును.

3. అట్లే 'మహః' అనువ్యాహృతిరూపబ్రహ్మమునకు అంగభూతమగునట్టియు, 'భువః' అనువ్యాహృత్యాత్మకమగు వాయువునందు ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు. పిదప 'సుః' అనువ్యాహృత్యాత్మకమగు ఆదిత్యునియందు ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు. (ప్రతిష్ఠితుఁ డగుట యనఁగా తత్స్వరూపము

చేత లోకమునందు వ్యాపించుట యని యర్థము) పిదప అంగియు చతుర్థ వ్యాహృత్యాత్మకమును అగుబ్రహ్మమునందు ప్రతిష్ఠితుఁ డగును.

౪-౫. ఇటుల బ్రహ్మభావమును పొందినవాఁడై స్వారాజ్యమును పొందును. సకల మనస్సులకు అధిపతియగును. వాక్కులకు, నేత్రములకు, శ్రోత్రములకు, విజ్ఞానములకు అధిపతియగును. (విద్వాంసుఁడు సర్వాత్మకుఁ డగును కావున వెనుకచెప్పఁబడిన వాక్పతిత్వ, చక్షుష్పతిత్వాదిక ముపపన్న మగుచున్నది.) ఇంతియేకాదు. ఇంతకంటె అతిశయమగు ఫలమును సైతము పొందుచున్నాఁడు:—ఆకాశమే శరీరముగాఁ గలవాఁడును, లేక జలాదికమునకును, దుఃఖాదికమునకును చేరుటకుకూడ వీలులేనంతటి సూక్ష్మమగుశరీరము గలవాఁడును, మూర్తము అమూర్తము అయిన రూపము గలవాఁడును, లేక సత్యస్వరూపుఁడును, ప్రాణారాముఁడును, సుఖకరమగు మనస్సుగలవాఁడును, శాంతిచేత నిండియున్నవాఁడును అగు పరమాత్మస్వరూపుఁడే తా నగును. కావున ఓ ప్రాచీనయోగ్యుఁడా! నీ విటుల ఉపాసించుమని మాహాచమస్యుఁడను ఆచార్యుఁడు తనశిష్యుఁడగు ప్రాచీనయోగ్యునకు ఉపదేశించెను. ఉపాసనశబ్దార్థ మిదివరకే చెప్పఁబడినది.

వివరణము:—శంకరభాష్యమునందు కొన్నిపదములకు వివరణముగలదు. వాని నిచట ఉదాహరించుచున్నాఁడను:—

'తస్మిన్నయం పురుషో మనోమయః' అనుచోటగల పురుషశబ్దమునకు భాష్యకారులగు శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యులవారు త్రివిధముగా వ్యాఖ్యాన మొనర్చినారు.

౧. పురుషః—

౧. పురి శయనాత్ పురుషః.

(అర్థ. పురి=హృదయమునందు లేక, శరీరమునందు, శయనాత్ = ఉండుటవలన, పురుషః=పురుషుఁడని చెప్పఁబడును.)

౨. పూర్ణత్వాత్ పురుషః.

(అర్థ. పూర్ణత్వాత్=(అంతట) పూర్ణుఁడైయుండుటవలన, పురుషః= పురుషుఁడని చెప్పఁబడును.)

3. పూర్ణా వా భూ రాదయో లోకా యేనేతి పురుషః.

(అర్థ. యేన=ఎవనిచేత, భూరాదయో లోకాః = భూమి మున్నగు లోకములు, పూర్ణాః-పూరింపఁబడినవో, ఇతి=ఈహేతువువలన, పురుషః = పురుషుఁడని చెప్పఁబడును.)

౪. మనోమయః—

౧. మనః=జ్ఞానం మనుతే జ్ఞానకర్మణః, తన్మయః తత్ప్రాయః తదుప,లభ్యత్వాత్.

(అర్థ. మనమనఁగా జ్ఞానము. ఈమనశ్శబ్దము 'మనఅవబోధనే' అను ధాతువునుండి పుట్టినది. తన్మయమనఁగా అజ్ఞానమే ప్రధానముగాఁ గలవాఁడు. ఏలయనఁగా ఉపాసనాసంస్కృతమగు మనస్సుచేత లభించుచున్నాఁడు కావున 'మనోమయుఁడు' అనంబడును.)

౨. మనుతే అనేనేతివా మనః, అంతఃకరణం తదభిమానీ తన్మయః తల్లింగోవా.

అర్థ. ఆచార్యులవారు "హృదయా దూర్ధ్వం ప్రవృత్తా సుషుమ్నా నామనాడీ యోగశాస్త్రేషు ప్రసిద్ధా, సాచ అంతరేణ=మధ్యే, తాలుకే = తాలుకయోర్గతా" అని భాష్యమునందు "హృదయాదూర్ధ్వం... ప్రసిద్ధా" అనునంతపఙ్త్కు మూలమునందులేని విషయమునకు మూలభూతమగు శ్రుత్యంతర మిది:—

శ్రుతి. శతం చైకాచ హృదయస్య నాడ్య స్తాసాం మూర్ధాన మభి నిస్సృతైకా, తయోర్ధ్వ మాయ న్నమృతత్వ మేతి. (కఠ. ౬. ౧౬.)

3. సత్యాత్మ:—

౧. సత్యాత్మ, సత్యం (మూర్తామూర్తం) = అవితథం స్వరూపం వా యస్య తదిదం సత్యాత్మ.

అర్థ. సత్యమనఁగా పృథివి, అప్పు, తేజము లక్షణముగాఁగల మూర్తము, వాయ్వాకాశాత్మకమగు అమూర్తము లక్షణముగాఁ గలవాఁడు. ఇయ్యది పరమాత్మకు కల్పితమగురూపము.

౨. సత్యం=అవితథం, ఆత్మా=స్వభావో యస్య తదిదం సత్యాత్మ.

లేక సత్యమయిన స్వభావముగలది సత్యాత్మ యనంబడును.

౪. ప్రాణారామమ్:—

౧. ప్రాణారామం=ప్రాణేషు, ఆరమణం=ఆక్రీడాయస్య తత్ ప్రాణారామమ్.

అర్థ. ప్రాణేషు = విషయసమన్వితములగు ఇంద్రియములందు, యస్య= దేనికి, ఆరమణం-ఆక్రీడా = క్రీడించుటగలదో, తత్ =అది, ప్రాణారామం = ప్రాణారామ మనంబడును. ఈవ్యుత్పత్తి బ్రహ్మమునకు జీవభావాభిప్రాయముతో చెప్పఁబడినది.

కేవలబ్రహ్మపరముగ మఱొకవ్యుత్పత్తిసైతము చెప్పఁబడియున్నది:—

౨. ప్రాణానాం వా ఆరామో యస్మిన్, తత్ ప్రాణారామమ్.

(అర్థ. యస్మిన్ =(నియంతృరూపుఁడై) ఎవఁడుండఁగా, ప్రాణానాం = ప్రాణములకు, ఆరామః = సంచారము కలుగునో, తత్ = ఆవస్తువు, ప్రాణారామం = ప్రాణారామ మనంబడును.

౫. మన ఆనందమ్:—

మన ఆనందం = 'ఆనందభూతం సుఖకృదేవ యస్య మనః తన్మన ఆనందమ్.'

(అర్థ. యస్య = ఎవనియొక్క, మనః=మనస్సు, సుఖకృత్ ఏవ=సుఖమునే కలుగఁజేయునో, తత్=అది, మన ఆనందం=మన ఆనంద మనంబడును. ఇయ్యది బ్రహ్మమునకు జీవభావాభిప్రాయములో చెప్పఁబడిన వ్యుత్పత్తి.)

౬. శాంతిసమృద్ధమ్:—

౧. శాంతిసమృద్ధమ్—శాంతిః = ఉపశమః, శాంతిశ్చ తత్ సమృద్ధం చ శాంతిసమృద్ధమ్.

(అర్థ. శాంతియనఁగా సకలద్వైతభావనివృత్తి సమృద్ధియనఁగా ఆత్మభావముచేత వ్యాపింపఁబడినది. శాంతియై సమృద్ధమైనది. శాంతిసమృద్ధము.)

౨. శాంత్యా వా సమృద్ధవ దుపలభ్యత ఇతి శాంతిసమృద్ధమ్.

(అర్థ. శాంతియనఁగా సమాధియగును. అట్టి సమాధిచేత పూర్ణానంద రూపముగ పొందఁబడునది 'శాంతిసమృద్ధ' మగును.)

ఇచట మూలమునందు "ఇతి ప్రాచీనయోగ్యోపాస్స్వ" అని "ప్రాచీనయోగ్యాచార్య" పదము నుదహరించుట విద్యయందు ఆదరాతిశయము కలుగుటకని గ్రహించునది.

ఈయనువాకమునందు చెప్పఁబడిన బ్రహ్మోపాసనము ముఖ్యబ్రహ్మోపాసనమా? లేక హిరణ్యగర్భబ్రహ్మోపాసనమా? అని కొందఱకు సంశయము కలుగవచ్చునుకాని ఇందు ప్రతిపాదింపఁబడినది ముఖ్యబ్రహ్మోపాసనమే అని తెలిసికొనవలయును. బ్ర. సూ. ౪. ౩. ౧౪ కార్యాధికరణమునం దీవిషయము సిద్ధాంతీకరింపఁబడినది. గ్రంథవిస్తరభీతిచేత పూర్వపక్షమును అనువదించలేదు.

ప్రాచీనయోగ్యశబ్దమునకు వ్యుత్పత్తి ఇట్లుండ నోపునేమో—ప్రాచీనైః=కర్మకాండప్రతిపాదితైః నిత్యనైమిత్తికకర్మభిః వినాశిత పాపః యః ఉపాసనవిధౌ యోగ్యః=అధికారీ సః ప్రాచీనయోగ్యః.

(అనఁగా కర్మకాండయందు విధింపఁబడిన నిత్యనైమిత్తికకర్మల నాచరించి తన పాపమును నశింపఁజేసికొని ఎవఁడు ఉపాసనావిధికి యోగ్యుఁడై యున్నాఁడో అతఁడు "ప్రాచీనయోగ్యుఁడు" అనంబడును.

ఈయనువాకమునందు విషయము సుబోధముగ నున్నను పదముల యొక్క అన్వయమును చక్కఁగా చూచునెడల అర్థము సుస్పష్టముగ లేనటుల తోఁచును. అటుల తోఁచుట ఏలయనఁగా విషయపూరణార్థము మఱొకశ్రుతినుండి కొంతవిషయమును గ్రహించుటచేతనే. కావున ఈ యనువాకాభిప్రాయ బోధకములగు భాష్యవార్తికశ్లోకముల నీక్రింద నిచ్చుచున్నాఁడను:—

౫-౬, అనువాకములు రెంటికిని పరస్పరసంబంధ ముండుటచేత వార్తికకారులును అట్లే వివృతినొనర్చిరి. కనుక శ్లోకములు పైరెండనువాకములకు సంబంధించియే యుండును.

శ్లో. స యః పరోక్షనిర్దిష్టః ప్రత్యక్షేణ స దర్శ్యతే,
అన్తర్హృదయ ఆకాశే పశ్యాత్మానం త్వ మాత్మనా. ౧౧
పద్మాకారో హి మాంసస్య ఖండో హృదయ ముచ్యతే,
ఆకాశ స్తస్య మధ్యే యో బుద్ధే రాయతనం సదా. ౧౨
తస్మిన్ స పురుషో జ్ఞేయో మనోమయ ఇహాంజసా,
శశిస్థరాహువత్సాక్షా న్మనస్యేవోపలభ్యతే. ౧౩
మనుతే మనసా యస్మాత్ తేనాయం స్యా న్మనోమయః,
స్యా ద్వా తదభిమానిత్వా త్తల్లింగా త్తన్మయస్మృతః. ౧౪
అమృతో ఽమరణధర్మాస్స్యా ద్ధిరణ్యం జ్యోతి రుచ్యతే,
ఊర్ధ్వం ప్రవృత్తానాడ్యేకా సుషుమ్నాహృదయా దధి. ౧౫
గత్వాతాలుకయో ర్ద్విద్వా న్మధ్యేనోదానగర్భయా,
స్తనవల్లంబతే కంఠే మాంసఖండ స్త్వధోముఖః. ౧౬

ఇంద్ర స్యాసౌ సృతిర్జ్ఞేయా రేచకేన తయా వ్రజేత్,
తయా గత్వా ఽథ యాయా త్స యత్ర కేశాన్తో వివర్తతే. ౧౭
భిత్వా శిరఃకపాలే ద్వే భూ రిత్యగ్నిం ప్రపద్యతే,
ద్వితీయయాఽథ వ్యాహృత్యా వాయౌ సంప్రతితిష్ఠతి. ౧౮
ఆదిత్యే సువరిత్యేవం లోకేశే ప్రతితిష్ఠతి,
స్థిత్వైవ మంగభూతేషు ప్రతితిష్ఠ త్యథాంగిని. ౧౯
మహ ఇత్యాత్మని స్థిత్వా స్వారాజ్యం ప్రతిపద్యతే,
నాన్యో రాజా ఽస్తి యస్యేహ రాజా య స్స్వయ మేవ తు. ౨౦
సస్వరాట్ తస్య భావశ్చ స్వారాజ్య మిహ కీర్త్యతే,
మనోగీశ్చక్షుషాం చైవ శ్రోత్ర విజ్ఞానయో రపి. ౨౧
ఆప్నతి పర్యుపాసీనః స్వారాజ్యం నాత్రసంశయః,
వ్యాహృత్యాత్మన ఏకస్య రూపసంక్లప్తయే ఽధునా. ౨౨
ఉపాసనావిధిత్సాయై పరో గ్రంథో ఽవతార్యతే,
వియద్దేహ మిదం బ్రహ్మ వియ త్సదృశ మేవవా. ౨౩
మూర్తామూర్త స్వభావంచ త్రైలోక్యాద్యాత్మతో భవేత్,
ఇంద్రియారమణం చైవ మనఆనంద మేవ చ. ౨౪
శాంత్యా సమృద్ధ మత్యర్థం బ్రహ్మైత దమృతం పరమ్,
ప్రాచీనయోగ్యోపాస్వేత ద్యథావ్యాఖ్యాతలక్షణమ్. ౨౫
మాహాచమస్య ఆచార్య అన్తేవాసిన ముక్తవాన్.

తైత్తి. భాష్య. వార్తిక శిక్షావల్లీ. ౧౧—౨౬.

౭. సప్తమోఽనువాకః

(పృథివ్యాద్యుపాధిక బ్రహ్మోపాసనము.)

మం. ౧పృథివ్యంతరిక్షం ద్యౌర్దిశోఽవాంతరదిశాః । అగ్ని
ర్వాయు రాదిత్య శ్చన్ద్రమా నక్షత్రాణి ఆప ఓష
ధయో వనస్పతయ ఆకాశ ఆత్మా ఇత్యధిభూతమ్ ।
అథాధ్యాత్మమ్ । ప్రాణో వ్యానోఽపాన ఉదాన
స్సమానః చక్షు శ్శ్రోత్రం మనో వాక్త్వక్ చర్మ
మాగ్ంసగ్ం స్నావాఽస్థి మజ్జా । ఏత దధి విధాయ
ఋషి రవోచత్ పాఙ్క్తం వా ఇదగ్ం సర్వమ్ ।
పాఙ్క్తేనైవ పాఙ్క్తగ్ం స్పృణోతీతి ॥౧॥

సర్వ మేకం చ ॥౭॥

టీక. ౧. పృథివీ=భూమి, అంతరిక్షం = అంతరిక్షము, ద్యౌః=ద్యులోకము, దిశః = దిక్కులు, అవాంతరదిశాః = అవాంతరదిశలు (ఇవి లోక పాంక్త మనఁబడును). అగ్నిః = అగ్ని, వాయుః = వాయువు, ఆదిత్యః = సూర్యుఁడు, చంద్రమాః=చంద్రుఁడు, నక్షత్రాణి=నక్షత్రములు (ఇవి దేవతా పాంక్త మనఁబడును). ఆపః=జలములు, ఓషధయః=ఓషధులు, వనస్పతయః =

వనస్పతులు, ఆకాశః=ఆకాశము, ఆత్మా=విరాడ్భూతము (ఇవి భూతపాంక్త మనంబడును). ఇతి = ఈవిధముగా, అధిభూతం = భూత పాంక్తము చెప్పఁబడినది. (లోక దేవతా పాంక్తములు సైతము చెప్పఁబడినవని గ్రహింపవలయును.)

౨. అథ=ఇఁక, అధ్యాత్మం = దేహవిషయక మగు పాంక్తత్రయము (చెప్పఁబడుచున్నది) ప్రాణః = ప్రాణవాయువు, వ్యానః = వ్యానవాయువు, అపానః=అపానవాయువు, ఉదానః = ఉదానవాయువు, సమానః = సమాన వాయువు (ఇవి వాయుపాంక్త మనంబడును). చక్షుః = నేత్రములు, శ్రోత్రం = చెవులు, మనః=మనస్సు, వాక్ = వాక్కు, త్వక్ = దేహము (ఇవి ఇంద్రియపాంక్త మనంబడును). చర్మ = చర్మము, మాగ్ంసం = మాంసము, స్నావా = సన్ననరము, అసి = ఎముక, మజ్జా = కొవ్వు (ఇవి ధాతుపాంక్త మనంబడును.) ఏతత్=ఈవిధముగా, ఋషిః = వేదము లేక ఈవిషయము నెఱింగిన ఒకమహర్షి, అధివిధాయ = చేసి, ఇదం సర్వం = ఈకనంబడు ప్రపంచమంతయు, పాంక్తం వా=పాంక్తమే, పాంక్తేన ఏవ= పాంక్తముచేతనే అనఁగా ఆధ్యాత్మిక పాంక్తత్రయముచేతనే, పాంక్తం = బాహ్య పాంక్తత్రయమును, స్పృణోతి ఇతి=నిండించుచున్నాఁడు అని, అవోచత్=పలికెను.

తా. ఇదివఱకు బ్రహ్మమును వ్యాహృత్యాత్మగా నుపాసించుట ౬-వ యనువాకమునందు చెప్పఁబడినది. ఈ ౭-వ యనువాకమునందు ఆ బ్రహ్మమునే పృథివ్యాది పాంక్తస్వరూపమున నుపాసించునట్టివిధానము చెప్పఁబడుచున్నది. ఐదుసంఖ్య కలిగియున్నయెడల పంక్తిచ్ఛందస్సు సిద్ధించును. కావున ముందుఁజెప్పఁబోవు పృథివ్యాదికము పాంక్త మనంబడును. పంచసంఖ్యాయోగమువలన పంక్తిచ్ఛందస్సిద్ధియే కాదు. "పంచాక్షరా పంక్తిః, పాంక్తో యజ్ఞః" అను శ్రుతివలన యజ్ఞసామ్యము సైతము కలుగును.

అట్టి పాంక్తమగుటచేత కలిగినయజ్ఞసామ్యముచేత జగమునంతయు లోకా ద్యాత్మాంత మగు బాహ్యపాంక్తత్రయముగను, ప్రాణాది మజ్జాంతమగు అధ్యాత్మపాంక్తత్రయముగను శ్రుతి నిర్ణయించినది. ఇయ్యది యజ్ఞమునే నిర్ణయించినట్లగును. (ఈవిధముగా బ్రహ్మోపాధిభూతమగు ప్రపంచము నంతయు పఙ్క్తిచ్ఛందోరూపముగను, యజ్ఞరూపముగను భావించుకొని పాంక్త జగదాత్మకమగు బ్రహ్మమే నేనని ఉపాసించువానికి) తదుపాసనముచేత స్థూలసర్వప్రపంచోపాధిస్వరూపుఁడగు ప్రజాపతి (హిరణ్యగర్భ)ని పొందు చున్నాఁడు.

పృథివ్యాదిక మగు జగత్తు పాంక్తము ఎట్లని ఆశంకించుకొని శ్రుతియే తత్సమాధానమును చెప్పుచున్నది:—

అ. ౧. పృథివి, అంతరిక్షము, ద్యులోకము, దిక్కులు, అవాంతర దిక్కులు, ఇవి లోకపాంక్తము.

౨. అగ్ని, వాయువు, ఆదిత్యుఁడు, చంద్రుఁడు, నక్షత్రములు, ఇవి దేవతాపాంక్తము.

3. జలములు, ఓషధులు, వనస్పతులు, ఆకాశము, ఆత్మ(ఇచట ఆత్మ యనఁగా విరాట్పురుషుఁడు. ఏలయనఁగా ఈ ఆత్మపదము భూతాధికార మునం దున్నది.) ఇవి భూతపాంక్తము.

ఈమూఁడును బాహ్యపాంక్తత్రయము.

ఆ. ౧. ప్రాణము, వ్యానము, అపానము, ఉదానము, సమానము, ఇవి వాయుపాంక్తము.

౨. చక్షుస్సు, శ్రోత్రము, మనస్సు, వాక్కు, త్వక్కు, ఇవి ఇంద్రియ పాంక్తము.

3. చర్మము, మాంసము, స్నావ, అస్థి, మజ్జ, ఇవి ధాతుపాంక్తము. ఈమూఁడును అధ్యాత్మపాంక్తత్రయము.

(ఆత్మయనఁగా దేహము. ఆదేహమునం దున్నవానినిగుఱించి చెప్పెడి విషయము, ఆధ్యాత్మము, ప్రాణవ్యానాదికము, చక్షుశ్శ్రోత్రాదికము, చర్మమాంసాదికము, దేహసంబంధమయినది కావున ఈపంచకత్రయము ఆధ్యాత్మపాంక్తత్రయము అనంబడుట యుక్తము.)

శ్రుతియందు ప్రతిపాదింపఁబడిన బాహ్యము, ఆధ్యాత్మము అను పాంక్తత్రయమే సకలజగత్స్వరూపము (ఇంతకంటె భిన్నమయినది ప్రపంచమునందు లేదనుట.)

ఈ ప్రపంచము అంతయు పాంక్తరూపముచేతనే ఉన్నదనువిషయమును భగవానుఁడగు వేదపురుషుఁడు నిర్ణయించినవాఁడై ఈప్రకారముగా చెప్పెను:—ఈప్రపంచమంతయు పాంక్తస్వరూపము ఆధ్యాత్మిక పాంక్తత్రయముచేత బాహ్యపాంక్తత్రయమును పూరించుచున్నాఁడు. (ఇచట పూరించుట యనఁగా ధాన్యాదికముచేత పాత్రాదికమును నిండించునటుల గాదని తెలుపుటకయి భాష్యకారులవారు "ఏకాత్మతయా ఉపలభ్యతే" అని చెప్పియున్నారు. బాహ్యపాంక్తత్రయము, ఆధ్యాత్మిక పాంక్తత్రయము ఒకటియే యనియు) ఇట్టి పాంక్త జగదాత్మకమగు బ్రహ్మమే నేనని ఎవఁడెఱింగి ఉపాసించునో వాఁడు హిరణ్యగర్భుఁడే యగును. మూలమునందు గల 'ఋషిః' అను పదమునకు భాష్యకారులవారు. ౧. వేదమనియు, ౨. ఇట్టివిషయమును తపఃప్రభావముచేత నెఱింగిన ఒకఋషియనియు వ్యాఖ్యానమొనర్చి యున్నారు.

వివరణము:—యజ్ఞము పాంక్త మెట్లనఁగా:—

పత్నీ, యజమాన, పుత్ర, దైవ, మానుష(విత్త)ములు, అయిదింటిచేత యజ్ఞము సంపాదితమగుటచేత యజ్ఞము పాంక్తమగును. మఱియు తైత్తిరీయబ్రాహ్మణము ప్రథమాష్టకము, ప్రథమప్రశ్నము. ౧౦-వ యనువాకము నందు పంచాగ్న్యాధానవిధి చెప్పఁబడియున్నది. అచట ఇతిహాసమును చెప్పుచు:—"ప్రజాపతిః ప్రజా అసృజత, సరిరిచానోఽమన్యత, ...సాతతః ప్రాచ్యుదక్రామత్, ...సాద్వితీయముదక్రామత్, ...సాతృతీయముదక్రామత్, ...సాచతుర్థముదక్రామత్, ...సాపంచమముదక్రామత్, ...అథోపంక్తిమేవ, పంక్తిర్వా ఏషా బ్రాహ్మణే ప్రవిష్టా. 3. తామాత్మనోఽధి నిర్మిమీతే, యదగ్ని రాధీయతే, తస్మా దేవతావంతో ఽగ్నయ ఆధీయంతే, పాంక్తంవా ఇదగ్ంసర్వం, పాంక్తేనైవపాంక్తగ్ స్పృణోతి"

తై. బ్రా. ౧. ౧. ౧౦. ౧—౪

అనుశ్రుతిచేత సైలము యజ్ఞము పాంక్తమని సిద్ధించుచున్నదిగదా.

ఈ యనువాకమునుగుఱించి వార్తికకారుఁ డొనర్చిన శ్లోకములు సుస్పష్టముగ అనువాకార్థమును బోధించుచుండుటచేత నిచట నుదాహరించుచున్నాఁడను:—

శ్లో. పాంక్తస్వరూపే హైతస్య భూయో ఽప్యన్య దుపాసనమ్,
ఉదారఫలసిద్ధ్యర్థం పృథివీ త్యుచ్యతేఽధునా, ౨౭
పంచభి ర్యత ఆరబ్ధా జగ త్పాంక్త మతో భవేత్,
యజ్ఞః క్లప్తో భవే దేవం పాంక్తో యజ్ఞ ఇతి శ్రుతిః. ౨౮
యజ్ఞేన పరిక్లప్తేన త్రైలోక్యాత్మాన మశ్నుతే,
పాంక్తత్వసిద్ధయే తస్మా దారబ్ధైషా పరాశ్రుతిః. ౨౯

దిగంతం లోకపాంక్తంస్యా న్నక్షత్రాంతం చ దైవతమ్,
ఆత్మాంతం భూతపాంక్తం చ విరాడాత్మాఽధికారతః. ౩౦
ఉపలక్షణ మేతత్స్యా ద్దేవతా లోకపాంక్తయోః,
అధిభూత మితి వక్ష్యామోఽథాధ్యాత్మమతఃపరమ్. ౩౧
వాయుపాంక్తం సమానాంతం త్వగంతం చేంద్రియం తథా,
చర్మాది ధాతుపాంక్తం చ విశ్వ మేతావ దుచ్యతే. ౩౨
పాంక్తమేవ జగత్సర్వ మితి దృష్ట్వాఽభ్యధా దృషిః,
పాంక్తంవా ఇదమా బ్రహ్మస్తంబం నాన్యదితిస్మహ. ౩౩
ఆధ్యాత్మికేన పాంక్తేన సంఖ్యాసామాన్యకారణాత్,
బలయత్వాత్మభావేన పాంక్తం బాహ్య మశేషతః. ౩౪

పాంక్తషట్కకోష్ఠకము

బాహ్యపాంక్తత్రయము.						
పృథివి	అంతరిక్షము	ద్యులోకము	దిశలు	అవాంతర దిశలు	లోకపాంక్తము	౧
అగ్ని	వాయువు	ఆదిత్యుఁడు	చంద్రుఁడు	నక్షత్రములు	దేవతా పాంక్తము	౨
జలము	ఓషధులు	వనస్పతులు	ఆకాశము	ఆత్మ	భూత పాంక్తము	౩

అధ్యాత్మపాంక్తత్రయము.

ప్రాణ	వ్యానము	అపానము	ఉదానము	సమానము	వాయు పాంక్తము	౪
చక్షుస్సు	శ్రోత్రము	మనస్సు	వాక్కు	త్వక్కు	ఇంద్రియ పాంక్తము	౫
చర్మము	మాంసము	వస	అస్థి	మజ్జ	ధాతు పాంక్తము	౬

ఈపైని వివరింపఁబడియున్న చక్రముప్రకారము జీవుఁడనగు నేను పంచాత్మకుఁడ నగుటచేత పాంక్తశబ్దవాచ్యుఁడను. జగత్తుసైతము పంచాత్మక మగుటచేత పాంక్తమే యగుచున్నది. కావున నాయొక్కయు, ప్రపంచము యొక్కయు స్వరూపము ఒకటియే గాని వేఱుకాదు. అని విరాట్పురుషుని ఉపాసించువానికి విరాట్స్వరూపప్రాప్తి కలుఁగును.

౧. అను...

౨. ఆత్మ...

3. భా. వా... ౧౨౭ - ౧౩౪.

౮. అష్టమోఽనువాకః

(ప్రణవోపాసనము - శుద్ధబ్రహ్మోపాసనము.)

మం. ఓమితి బ్రహ్మ ఓమితీదగ్ం సర్వమ్ । ఓమిత్యే
తదనుకృతిహస్మవా అప్యోశ్రావయత్యాశ్రావయన్తి ।
ఓమితి సామాని గాయంతి । ఓగ్ం శోమితి శస్త్రాణి
శగ్ంసన్తి । ఓమిత్యధ్వర్యుః ప్రతిగరం ప్రతిగృణాతి ।
ఓమితి బ్రహ్మా ప్రసౌతి । ఓమిత్యగ్నిహోత్రమను
జానాతి । ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్యన్నాహ బ్రహ్మో
పాప్నవానీతి । బ్రహ్మైవోపాప్నోతి ॥౧॥

ఓం దశ ॥౨॥

టీ. ఓం ఇతి = ఓం అనుశబ్దముయొక్క రూపమును, బ్రహ్మ=పర బ్రహ్మమని (మనస్సుచేత ఉపాసించవలయును), ఇదంసర్వం = ఈ సమస్తమైనదియు, ఓం ఇతి= ఓంకారమనియే (తలంపవలయును), ఓం ఇతి ఏతత్= ఈ ఓంకారమనునది, అనుకృతి=అనుకరణమని, హస్మవై = సుప్రసిద్ధముగదా, అపి = మఱియు, ఓశ్రావయఇతి = ఓశ్రావయ అని, ఆశ్రావయంతి = బదులు పలుకుచున్నారు. ఓం ఇతి = ఓం అనియే, సామాని = సామమంత్రములను, గాయన్తి=గానముచేయుచున్నారు. ఓగ్ంశోంఇతి = ఓగ్ంశోం అని, శస్త్రాణి=

శస్త్రమాత్రములను, శంసన్తి=చెప్పుచున్నారు. ఓం ఇతి=ఓం అని, అధ్వర్యుః=అధ్వర్యుఁడు, ప్రతిగరం=ప్రతిగరమును; అనఁగా "ఓథామోదఇవ" అను మంత్రమును, ప్రతిగృణాతి = బదులుపలుకుచున్నాఁడు. ఓం ఇతి=ఓం అని, బ్రహ్మా=బ్రహ్మయను ఋత్విక్కు, ప్రసౌతి=(ఇతరఋత్విక్కులు ప్రోక్షణాది కర్మల నాచరించుటకు) అనుజ్ఞనిచ్చుచున్నాఁడు. ఓం ఇతి=ఓం అని, అగ్నిహోత్రం=అగ్నిహోత్రమును చేయుటకు, అనుజానాతి=అంగీకారము నిచ్చుచున్నాఁడు. బ్రాహ్మణః = బ్రాహ్మణుఁడు, బ్రహ్మ=వేదమును, ఉపాప్నవాని ఇతి = పొందెదనని, ప్రవక్ష్యన్=ప్రవచనము చేయఁదలఁచినవాఁడై, ఓం ఇతి=ఓం అని, ఆహ = పలికెను. బ్రహ్మైవ = బ్రహ్మమునే, ఉపాప్నోతి = పొందుచున్నాఁడు.

తా. (షష్ఠానువాకమునందు వ్యాహృత్యాత్మకముగ బ్రహ్మోపాసనము విధింపఁబడినది. సప్తమానువాకమునందు పృథివ్యాదిపాఙ్క్తస్వరూపముగా బ్రహ్మోపాసనము విధింపఁబడియున్నది. ఇఁక అష్టమానువాకమునందు సర్వోపాసనములకు అంగభూతమగు ఓంకారోపాసనము విధింపఁబడుచున్నది. అచేతనమును శబ్దమాత్రమును అగు ఓంకారము ఫలము నిచ్చుటకు సమర్థము కాదుగదా! అట్టి ఓంకారము నుపాసించుటవలన ఫల మేమియని పంశయింపఁబనిలేదు. అచేతనమగు సాలగ్రామమునందు దేవభావమునుంచి పూజించువారికి బ్రహ్మము ఫలము నెటుల కలుగఁజేయునో అట్లే ఫలదాత ఇచ్చుటను బ్రహ్మమే కావున పైసంశయము అక్కఱలేదు. ఇందులకు ప్రమాణము:— 'ఏతేనైవాయతనేనైకతర మన్వేతి' ప్రశ్నో. ౫. ౨. అని శ్రుతి. అనఁగా ఓంకారమను ప్రాప్తిసాధనోపాయముచేతనే పరాపరరూప బ్రహ్మమును పొందును. అని కలదు; కావున ఓంకారోపాసన మీయనువాకమునందు చెప్పఁబడుచున్నది:—ఓం అను అక్షరమే పరబ్రహ్మస్వరూపము. కనఁబడునది అంతయు ఓంకారాత్మకమే. (ఓంకారము సర్వాత్మ

కము కావున అట్టి ఓంకారమునందు సర్వాత్మక బ్రహ్మదృష్టి నుంచుట యుక్తమే యని భావము) బ్రహ్మము సర్వాత్మకము, ఇదియంతయు బ్రహ్మమే అని శ్రుతులు బ్రహ్మము సర్వాత్మకమని ఘోషించుచున్నవిగాని ఓంకారము సర్వాత్మకమని చెప్పలేదు గదా యని చెప్పదరేని అట్లనరాదు. శబ్దస్వరూపమంతయు ఓంకారముచేత వ్యాపింపఁబడిన దని "తద్యథా శంకు నా" ఛాందో. ౨. ౨౩. ౩. శ్రుతి చెప్పుచున్నది. ఓంకారము సర్వశబ్దాత్మకమయిన కానిండు, శబ్దార్థరూపమగు ప్రపంచాత్మకముగా ఓంకార మెట్లగు ననఁగా అభిధేయ మెప్పుడును అభిధానాధీనము కావున అభిధానాభిధేయములను తాదాత్మ్యమును లరుచుగా గ్రహించుచున్నారు కావున అభిధానాత్మకము ఓంకారమను విషయము సుప్రసిద్ధమే కావున అభిధేయాత్మకము కూడా ఓంకారమే యని తాదాత్మ్యముచేత గ్రహించినారని భావము. ఇట్లని ఆచార్యులవారు భాష్యమునందు వ్యాఖ్యానమొనర్చియున్నారు. ఓంకారోపాసనము నీయనువాకమునందు విధించియున్నారు కావున ఆ ఓంకారమును స్తుతించుటకుఁగాను పలువిధములుగా తన్మహిమను చెప్పుచున్నాఁడు. ఓం అనునది అనుకరణ మగుచున్నది. అనఁగా ఎవరైనా "ఆపనిని చేసినావా? ఆచటికి వెళ్లెదవా?" అని ప్రశ్నించినయెడల చేసినాఁడను, వెళ్లగలను అనుటకు 'ఓం' అని యనును. సంస్కృతభాషయందు 'ఓం' అను పదము అనుకృతిబోధకము అనువిషయము సుప్రసిద్ధము గదా.

౫. మఱియు "ఓ శ్రావయ" అని అగ్నీధ్రునికూర్చి పలుకుచున్నారు. ఈమాటకు తాత్పర్యము:—ఓ అగ్నీధ్రుఁడా! హవిస్సు నిచ్చెడి సమయమయినదని దేవతల కెఱింగింపుము. అని యగును.

౬. 'ఓం' అని యుపక్రమించియే సామగానము నుపక్రమింతురు.

౭. 'ఓగ్ం శోం' అని యుపక్రమించియే హోతలు శస్త్రములను పఠింతురు. శస్త్రము లనఁగా గానములేని స్తోత్రబుక్కులు.

౮. "ఓం౽థా మోద" అని యధ్వర్యుఁడు ప్రతిగరము పలుకును. దీనియర్థ మేమనఁగా. ఓం=ఓహోతా! అథ = అర్థర్చము నీవు చెప్పినవిదమ, ఆమోద = మాకు సంతోషము కలిగినదని భావము.

౯. 'ఓం ప్రోక్ష' అని బ్రహ్మ ఇతరఋత్విక్కులకు అనుజ్ఞ నిచ్చును. ఇతరఋత్విక్కులు "బ్రహ్మన్ ప్రోక్షిష్యామి" అని అనుజ్ఞనువేఁడఁగా బ్రహ్మ అతనికి 'ఓం ప్రోక్ష' అని అనుజ్ఞ నిచ్చును.

౧౦. బ్రాహ్మణుఁడైనవాఁడు అధ్యయనము ఉపక్రమించునపుడు 'ఓం' అని ఉచ్చరించియే వేదాధ్యయనము నొనర్చును. ఆచార్యుఁ డగు వాఁడు అధ్యాపనముచేయఁ బోవుచు 'ఓం' అని పలికియే శిష్యునకు అధ్యయనమును బోధించును. ఇటుల ఓంకారపూర్వకముగా వేదాధ్యయనాధ్యాపనముల నొనర్చు నతఁడే తత్ఫలమును పొందును.

బ్రహ్మయజ్ఞప్రకరణమునందు అధ్యయననియమముల నన్నిఁటిని వివరించి పిదప "దక్షిణోత్తరౌ పాణీపాదౌ కృత్వా ఓమితి ప్రతిపద్యతే" అని చెప్పియుండుటచేత అధ్యయనకాలమునందు ఓంకారము నుచ్చరించి ఉపక్రమించుట శ్రుతిప్రతిపాదితమగు శిష్టాచారమేకాని కేవల శిష్టాచారము మాత్రము కాదు.

ఈవిధముగా అన్నివిషయములందు ఓంకారము ప్రప్రథమమున నుంచి తమతమపనుల నాచరించుచు సఫలీకృతమనోరథు లగుచున్నారు కావున "ఓంకారమే బ్రహ్మము" అని ఉపాసించవలయునని తాత్పర్యము.

వివరణము:—భాష్యమునందు "ఓమితి బ్రాహ్మణః ప్రవక్ష్య న్నాహ బ్రహ్మోపాప్నవానీతి" అనుమంత్రము ద్వివిధముగా వ్యాఖ్యానమొనర్చియున్నారు. "ప్రవక్ష్యన్" అనుపదము "వచపరిభాషణే" అనుధాతువు నుండియు, "వహప్రాపణే", అనుధాతువునుండియు పుట్టినది. ప్రథమధాతువు నుండి పుట్టిన శబ్దమునకు గల యర్థమే ఇదివఱకు వివరింపఁబడినది. ఇపుడు

రెండవయర్థమును వివరించెదను. 'బ్రహ్మైవ=పరమాత్మనే, ఉపాప్నవాని = పొందెదను.' ,ఇతి=ఇట్లని (అనను), ప్రవక్ష్యన్ = (బ్రహ్మమునుగూర్చి) పొందింపఁజేయుటకు ఇచ్ఛగలవాఁడై, ఓంఇతి=ఓం అని, బ్రాహ్మణః=బ్రహ్మవేత్త, ఆహ=పలికెను. అని యర్థమును చేసికొనవలయు.

౧. అను...

౨. అశ్న...

3. భా. వా...౧3౫-౧౪౨.

---

౯. నవమోఽనువాకః

(ఉపాసకధర్మములు.)

మం. ౧ ఋతం చ స్వాధ్యాయప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయప్రవచనే చ। తపశ్చ స్వాధ్యాయప్రవచనే చ। దమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। శమశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। అగ్నిహోత్రం చ స్వాధ్యాయప్రవచనే చ। అతిథయశ్చ స్వాధ్యాయప్రవచనే చ। మానుషం చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజా చ

స్వాధ్యాయప్రవచనే చ । ప్రజనశ్చ స్వాధ్యాయప్రవ
చనే చ । ప్రజాతిశ్చ స్వాధ్యాయప్రవచనే చ । సత్య
మితి సత్యవచా రాథీతరః । తప ఇతి తపోనిత్యః పౌరు
శిష్టిః । స్వాధ్యాయప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః ।
తద్ధి తపస్తద్ధి తపః ॥౧॥

ప్రజా చ స్వాధ్యాయప్రవచనే చ షట్చ ॥౯॥

టీక. ౧. ఋతంచ=ఋతమున్ను (ఋత మనఁగా శాస్త్రీయమయిన దర్శపూర్ణమాసాదికర్మజాతము), స్వాధ్యాయప్రవచనేచ=స్వాధ్యాయ ప్రవచనములున్ను (ఏతాని=ఇవి, అనుష్ఠేయాని=అనుష్ఠింపఁదగినవి.), సత్యంచ= సత్యమున్ను, స్వాధ్యాయప్రవచనేచ = స్వాధ్యాయప్రవచనములున్ను (అనుష్ఠింపఁదగినవి). తపశ్చ=కృచ్ఛ్రచాంద్రాయణాది తపస్సున్ను, స్వాధ్యాయప్రవచనేచ=స్వాధ్యాయప్రవచనములున్ను (అనుష్ఠింపఁదగినవి). దమశ్చ =బహిరింద్రియనిగ్రహము, స్వాధ్యాయప్రవచనేచ = స్వాధ్యాయప్రవచనములున్ను (అనుష్ఠింపఁదగినవి). శమశ్చ = అంతరింద్రియనిగ్రహము,స్వాధ్యాయప్రవచనేచ=స్వాధ్యాయప్రవచనములున్ను (అనుష్ఠింపఁదగినవి). అగ్నయశ్చ=అగ్నులున్ను, స్వాధ్యాయప్రవచనేచ = స్వాధ్యాయప్రవచనములున్ను (అనుష్ఠింపఁదగినవి. అనఁగా శ్రౌతాగ్న్యాధానము చేయవలయును. స్వాధ్యాయప్రవచనముల నాచరింపవలయును.), అగ్నిహోత్రంచ = అగ్నిహోత్రములున్ను, స్వాధ్యాయప్రవచనేచ = స్వాధ్యాయప్రవచనములున్ను (అనుష్ఠింపఁదగినవి). అతిథయశ్చ = అతిథులు (సత్కరింపఁదగిన

వారు), స్వాధ్యాయప్రవచనేచ = స్వాధ్యాయప్రవచనములు (అనుష్ఠింపఁదగినవి.) మానుషంచ = లౌకికసంవ్యవహారము (అనఁగా వివాహాదికాలములందు బంధువులు స్నేహితులు మున్నగువారలను శక్తికొలఁది సత్కరించుట మొదలగు వానిని చేయవలయును.), స్వాధ్యాయప్రవచనేచ = స్వాధ్యాయప్రవచనము లున్నూ (అనుష్ఠింపఁదగినవి.), ప్రజాచ = సంతానము (పొందఁదగినది.), స్వాధ్యాయప్రవచనేచ = స్వాధ్యాయప్రవచనములున్నూ (అనుష్ఠింపఁదగినవి), ప్రజనశ్చ = ఋతుకాలమునందు భార్యతో సంగమము (చేయవలయును.) స్వాధ్యాయప్రవచనేచ = స్వాధ్యాయప్రవచనములున్నూ (అనుష్ఠింపఁదగినవి.), ప్రజాతిశ్చ=ప్రజాతి అనఁగా పౌత్రోత్పత్తినిమిత్తము పుత్రునకు వివాహ మొనర్చుట (చేయఁదగినది). స్వాధ్యాయప్రవచనేచ = స్వాధ్యాయప్రవచనములు (చేయఁదగినవి.)

౨. రాథీతరః = రథీతర గోత్రోత్పన్నుఁడగు, సత్యవచాః = సత్యవచసుఁడను మహర్షి, సత్యంఇతి = సత్యమును పలుకుటయే (ఆచరణీయమని పలికెను.) పౌరుశిష్టిః = పురుశిష్టియనుమహర్షి పుత్రుఁడగు, తపోనిత్యః=తపోనిత్యుఁడను మహర్షి, తపఃఇతి = కృచ్ఛ్రచాంద్రాయణాది రూపమగు తపస్సే (ఆచరణీయమని వచించెను.) మౌద్గల్యః = ముద్గలమహర్షి పుత్రుఁడగు, నాకః= నాకుఁడను ఆచార్యుఁడు, స్వాధ్యాయప్రవచనే ఏవఇతి = స్వాధ్యాయప్రవచనములే ఆచరణీయములని (పలికెను కావున), తత్ హి=ఆస్వాధ్యాయప్రవచనములే, తపః = తపశ్శబ్దవాచ్యములు, తత్ హి = ఆస్వాధ్యాయప్రవచనములే, తపః=తపశ్శబ్దవాచ్యములు (అని గ్రహింపవలయును.)

తా. ౧. (విజ్ఞానముచేతనే అనఁగా ఉపాసనమువల్లనే స్వారాజ్యము కలుగు నను మంత్రవచన ముండుటచేత శ్రౌతస్మార్తకర్మలన్నియు నిరర్థకములేగదా అనుసంశయము కలుగుట సహజము కావున తత్సంశయాపనోదార్థము కర్మలు ఉపాసనాసహకృతములయి స్వారాజ్యసిద్ధికి సహకారములగుచున్నవనువిషయ మీయనువాకమునందు నిరూపింపఁబడుచున్నది:—

౧. ఋతమనఁగా శాస్త్రమునందు చేయఁదగినవిగా నిర్ణయింపఁబడిన దర్శపూర్ణమాసాది శ్రౌతస్మార్తకర్మలు. స్వాధ్యాయమనఁగా తాను పఠించుట. ప్రవచనమనఁగా శిష్యులకు బోధించుటయు ఈ మూఁడున్నూ అవశ్య మను ష్ఠింపఁదగినవి. ఇట్లే,

౨. సత్యమునే పలుకుట, స్వాధ్యాయప్రవచనములు. ఈమూఁడున్నూ అవశ్యము అనుష్ఠేయములు.

3. కృచ్ఛ్రచాంద్రాయణాది తపశ్చర్యను నలుపుట, స్వాధ్యాయ ప్రవచనములు, ఇవి అవశ్యానుష్ఠేయములు.

౪. దమమనఁగా బహిరింద్రియనిగ్రహము, స్వాధ్యాయప్రవచన ములు, ఇవి అవశ్యానుష్ఠేయములు.

౫. శమమనఁగా అంతరింద్రియనిగ్రహము, స్వాధ్యాయప్రవచన ములు, ఇవి అవశ్యానుష్ఠేయములు.

౬. శ్రౌతాగ్న్యాధానము, స్వాధ్యాయప్రవచనములు, ఇవి అవశ్యాను ష్ఠేయములు.

౭. అగ్నిహోత్రాచరణము, స్వాధ్యాయప్రవచనములు, ఇవి అవ శ్యానుష్ఠేయములు.

౮. అతిథిపూజనము, స్వాధ్యాయప్రవచనములు, ఇవి అవశ్యానుష్ఠే యములు.

౯. వివాహాదిశుభకర్మలందు బంధుమిత్రాదుల సత్కరించుట యనెడి మానుషవ్యవహారము, స్వాధ్యాయప్రవచనములు, ఇవి అవశ్యానుష్ఠేయములు.

౧౦. పుత్రోత్పత్త్యర్థము చేయఁబడెడి పుత్రకామేష్టి మున్నగు ప్రయత్నము, స్వాధ్యాయప్రవచనములు, ఇవి అవశ్యానుష్ఠేయములు.

౧౧. ఋతుకాలములందు స్వస్త్రీయందు వ్యవహరించుట, స్వాధ్యాయ ప్రవచనములు, ఇవి అవశ్యానుష్ఠేయములు.

౧౨. పుత్రులకు వివాహ మొనర్చుట, స్వాధ్యాయ ప్రవచనములు, ఈపైనచెప్పిన పనులన్నియు అవశ్య మాచరింపవలయును. ఈపైనిచెప్పఁబడిన పనుల నాచరించుచు స్వాధ్యాయప్రవచనములందు అధికమయిన శ్రద్ధ కలిగి వాని నాచరించుచుండవలయునని తెలుపుటకుగాను ఇన్నిపర్యాయ ములు "స్వాధ్యాయప్రవచనేచ" అని చెప్పఁబడినదిగా గ్రహింపవల యును.

స్వాధ్యాయమున్నఁగాని అర్థజ్ఞానము కలుగదు. అర్థజ్ఞానమే శ్రేయ స్సాధనభూత మగుచున్నది.

ప్రవచనము ఉత్పన్నమయిన అర్థజ్ఞానమును మరపునకు రానీయక ధర్మప్రవృద్ధిని కలుగఁజేయును కావున ఈస్వాధ్యాయ ప్రవచనములందు అతిశయమైన ఆదరమును చూపవలయునని శ్రీమచ్ఛంకరభగవత్పాదా చార్యులవారు భాష్యమునందు లిఖించియున్నారు.

౨—౧. రథీతర గోత్రోత్పన్నుఁడగు సత్యవచసుఁడను ఆచార్యుఁడు సత్యవచనమే అనుష్ఠేయమని పలికెను. (సత్యమునే పలికెడి స్వభావము గలవాఁ డగుటచేత నతనికి సత్యవచసుఁ డనుసార్థకనామము కలిగెను.)

౨. పురుశిష్టియను మహర్షియొక్క పుత్రుఁడగు తపోనిత్యుఁడను ఆచార్యుఁడు కృచ్ఛ్రచాంద్రాయణాది రూపమగు తపస్సే ఆచరణీయమని పలికెను. (ఎల్లప్పుడు తపస్సును ఆచరించువాఁడగుటచేత నతనికి 'తపోనిత్యుఁ' డనుసార్థకనామము కలిగెను.)

3. ముద్గలుఁడను మహర్షియొక్కపుత్రుఁడగు నాకుఁడను ఆచార్యుఁడు 'స్వాధ్యాయము, ప్రవచనము' అను ఈరెండు అవశ్యము ఆచరింపఁదగినవని చెప్పెను.

ఈ స్వాధ్యాయప్రవచనములే తపస్సు, ఇవియే తపస్సు కావున

అవశ్య మాచరించవలయును. ఆదరార్థము రెండుపర్యాయములు "తద్ధితపః" అని శ్రుతియందు చెప్పఁబడినదని గ్రహింపవలయును.

వివరణము:—

౧. సత్యవచాః = సత్యంవచతీతి సత్యవచాః.

(అర్థ. సత్యమునే పలుకునట్టివాఁడు.)

౨. తపోనిత్యః = తపసి నిత్యం వర్తత ఇతి తపోనిత్యః.

(అర్థ. ఎల్లప్పుడు తపస్సునం దుండువాఁడు.)

3. పౌరుశిష్టిః = పురు బహువేలం మాతృపిత్రాచార్యైః శిష్టః పురుశిష్టః, తస్యాపత్యం పౌరుశిష్టిః.

(అర్థ. పలుసారులు మాతృపిత్రాచార్యులచేత సదాచారాది శిక్షనందినవాఁడు పురుశిష్టుఁ డనంబడును. పురుశిష్టునిపుత్త్రుఁడు పౌరుశిష్టి.)

౪. మౌద్గల్యః = ముదం శాస్త్రార్థనిర్ణయరూపాం గలతి ప్రవతీతి ముద్గలః, ముద్గలస్యాపత్యం మౌద్గల్యః.

(అర్థ. శాస్త్రార్థనిర్ణయరూపమగు సంతసమును వెదలగ్రక్కునతఁడు ముద్గలుఁ డనంబడును. ముద్గలునిపుత్త్రుఁడు మౌద్గల్యుఁడు.

"తపోనిత్యః, సత్యవచాః, పౌరుశిష్టిః, మౌద్గల్యః" మున్నగునవి నామధేయములు మాత్రమే అయినను మహర్షులనామములు గుణవ్యంజకములయి యుండును. కావున వ్యుత్పత్త్యర్థమును సూచించితిమి.

ఇచట వ్రాయఁబడిన వ్యుత్పత్తులను శంకరానందదీపికనుండి సంగ్రహించితిని.

౧. అను ...

౨. అత్మ ...

3. భా. వా. ౧౪3-౧౫౦.

౧౦. దశమోఽనువాకః.

(బ్రహ్మజ్ఞానప్రకాశము.)

మం. అహం వృక్షస్య రేరివా కీర్తిః పృష్ఠం గిరేరివ।
ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృత మస్మి ద్రవిణగ్ం
సవర్చసమ్ సుమేధా అమృతోఽక్షితః। ఇతి త్రిశఙ్కో
ర్వేదానువచనమ్ ॥౧॥
అహగ్ం షట్ ।౧౦।

టీ. అహం = నేను, వృక్షస్య = సంసారవృక్షమునకు, రేరివా = అంతర్యామ్యాత్మగా ప్రేరకుఁడను, మమ = నాయొక్క, కీర్తిః = ఖ్యాతి, గిరేః = (మేరు) పర్వతముయొక్క, పృష్ఠంఇవ = శృంగమువలె (స్వర్గ వ్యాపియై) వెలయుచున్నది. ఊర్ధ్వపవిత్రః=పరమాత్మభూతుఁడను, పవిత్రుఁడను, లేక జ్ఞానప్రకాశ్యుఁడను, వాజినిఇవ = సవితయందువలె, స్వమృతం = విశుద్ధమయిన ఆత్మతత్త్వస్వరూపుఁడను, అస్మి = అగుచున్నాఁడను. సవర్చసం=దీప్తిగల, ద్రవిణం = ధనము, (అస్మి=అగుచున్నాఁడను.) సుమేధాః= సర్వజ్ఞత్వలక్షణమైన బుద్ధిగలవాఁడను, (అస్మి=అగుచున్నాఁడను.) అమృతః= మరణములేనివాఁడను, అక్షితః = అక్షతుఁడను, (అస్మి = అగుచున్నాఁడను.) లేక, అమృతోక్షితః = అమృతముచేత తడుపఁబడినవాఁడును, (అస్మి = అగుచున్నాఁడను.) అని ఒకేపదము. ఇతి = ఈవిధముగా, త్రిశంకోః = త్రిశంకువను మహర్షియొక్క, వేదానువచనం = వేదవచనము.

తా. (ఈయనువాకము ఇచట జపార్థము చెప్పఁబడినది. ఈస్వాధ్యాయజపమువలన చిత్తశుద్ధికలిగి జ్ఞానోత్పత్తికలుగును కావున ఈయనువాకము ఈయుపనిషత్ప్రకరణము ననుసరించి కర్మశేషము కాదనియు, బ్రహ్మవిద్యాసాధనభూతమనియు గ్రహించవలయును.)

త్రిశంకువను నామధేయముగల బ్రహ్మర్షి ఈచెప్పఁబోవురీతిగా పలుకుచున్నాఁడు:—వృక్షమనఁగా ఛేదించుటకు యోగ్యమయినదని తాత్పర్యము. (ప్రకరణము ననుసరించి ఇచట సంసారవృక్షముగా గ్రహించవలయును.) ఇట్టి సంసారవృక్షమునకు ప్రేరకుఁడనైన వాఁడను నేనే. బ్రహ్మవేత్త సంసారవృక్షమునకు ప్రేరకుఁ డెట్లగునని సంశయ మవసరములేదు. బ్రహ్మవేత్త సర్వాత్మకుఁడు కావున అంతర్యామిరూపమున ప్రేరకుఁ డని భావము.) పర్వతశిఖరమువలె నాకీర్తి అత్యున్నతమయినదిగా నుండును. అనఁగా ఊర్ధ్వగతి సూచనమువలన సంసారాతీతమయిన స్థితిగలవాఁడ నని భావము. జ్ఞానప్రకాశ్యుఁడను, లేక పరమాత్మభూతుఁడను, పవిత్రస్వరూపుఁడను. సూర్యునియందు అమృతస్వరూప మగుఆత్మస్వరూప మెటుల నున్నదో అట్లే నాయందును ఆత్మతత్త్వము గలదు. దీప్తిమంతమగు ధనమును నేనే అగుచున్నాఁడను. నేనే సర్వజ్ఞుఁడను. అమరణధర్ముఁడను, అక్షతుఁడను (అనఁగా షడ్భావవికారరహితుఁడను). ఇదియే త్రిశంకుమహర్షియొక్క వేదాంతవచనబోధ యని గ్రహించవలయును.

"ద్రవిణగ్ం సవర్చసం" అనువాక్యమునకు భాష్యమునందు మఱియొకవిధముగఁగూడ అర్థము చేయఁబడినది:—సవర్చసం = బ్రహ్మస్వరూపవ్యంజకమగు, ద్రవిణం=బ్రహ్మజ్ఞానము, (మయాప్రాప్తం = నాచేత పొందఁబడినది.)

"ఇతి త్రిశంకోర్వేదానువచనం" అనువాక్యము బ్రాహ్మణము.

వామదేవుఁడనుమహర్షి కృతకృత్యుఁడైనట్లు 'అహం మను రభవం' అనువాక్య మెటుల తెలుపుచున్నదో అట్లే త్రిశంకుమహర్షియు కృతకృత్యుఁ

డైనాఁడు అను విషయమును 'అహం వృక్షస్య' యనుమంత్రము బోధింపుచున్నది. కృతకృత్యతను కలుగఁజేయు బ్రహ్మవిచారమునందు ముముక్షువులకు ప్రవృత్తి కలుగుటకయి ఇచట ఈమంత్రము పఠింపఁబడినది. త్రిశంకు మహర్షి తపఃప్రభావముచేత కలిగినజ్ఞానముచేత చెప్పినాఁడు కావున ఇయ్యది విద్యాప్రకాశసామర్థ్యమయి యున్నది. తొమ్మిదవదియగు 'ఋతం చ' అను అనువాకమునందు కర్మల నాచరింపమని బోధించి వెంటనే ఈపదియవ అనువాకమునందు త్రిశంకుమహర్షియొక్క ఆర్షదర్శన విషయక వేదానువచనపాఠము చెప్పఁబడియున్నదిగదా. దీని యభిప్రాయ మేమనఁగా:—

౧. శ్రౌతస్మార్తాది నిత్యకర్మలను నిష్కామబుద్ధితో నాచరించుచు సాంసారికఫలములందు నిస్పృహుఁడై బ్రహ్మమును తెలిసికొన ప్రయత్నించు వానికి ఆత్మవిషయకము లగుదర్శనములు కలుగుననియు,

౨. శ్రౌతస్మార్తాదికర్మలను సకాముఁడై ఆచరించువానికి పితృలోకము కలుగుననియును సిద్ధించుచున్నది.

వివరణము:—ద్రవ్యము మానుషమనియు, దైవమనియు ద్వివిధము. కంటిచేత చూడఁబడెడి సువర్ణరజతాదికము మానుషద్రవ్యము. చెవులచేత వినఁబడుచు వేదాంతములందు ప్రతిపాదింపఁబడెడి బ్రహ్మజ్ఞానాదికము దైవ ద్రవ్యము. కావుననే బృహదారణ్యకమునందు ఒక ఉపాసనమునందు చక్షుశ్శ్రోత్రములకు మానుషదైవద్రవ్యదృష్టిని విధించియున్నారు:—"చక్షుర్మానుషం విత్తమ్, చక్షుషాహి తద్విందతే, శ్రోత్రం దైవమ్, శ్రోత్రేణహి తచ్ఛృణోతి" బృహ. ఉ. ౧. ౪. ౧౭. ఇచట మంత్రమునందు దైవవిత్తమునకు 'సవర్చసం' అను విశేషణమును చెప్పుటచేత దైవవిత్తము బలవత్తరమని సిద్ధించుచున్నది.

౧. అను ...

౨. ఆత్మ ...

3. భా-వా. ౧౫౧-౧౬౦.

౧౧. ఏకాదశోఽనువాకః.

(అ ను శా స న ము.)

మం. ౧వేద మనూచ్యాఽఽచార్యోఽంతేవాసిన మనుశాస్తి।
సత్యం వద। ధర్మం చర। స్వాధ్యాయాన్మా ప్రమదః।
ఆచార్యాయ ప్రియం ధన మాహృత్య ప్రజా
తంతుం మా వ్యవచ్ఛేత్సీః। ౨సత్యాన్న ప్రమదిత
వ్యమ్ ధర్మాన్న ప్రమదితవ్యమ్। కుశలాన్న ప్రమ
దితవ్యమ్। భూత్యైన ప్రమదితవ్యమ్। స్వాధ్యాయ
ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్ ॥౧॥

దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్। ౩మాతృ
దేవో భవ। పితృదేవో భవ। ఆచార్యదేవో
భవ। అతిథిదేవో భవ। ౪యాన్యనవద్యాని కర్మాణి।
తాని సేవితవ్యాని। నో ఇతరాణి। యాన్యస్మాకగ్ం
సుచరితాని। తాని త్వయోపాస్యాని ॥౨॥

నో ఇతరాణి। ౫ యే కేచాస్మచ్ఛ్రేయాగ్ంసో

బ్రాహ్మణాః। తేషాం త్వయాఽఽసనేన ప్రశ్వసితవ్యమ్। ౬ శ్రద్ధయా దేయమ్। అశ్రద్ధయాఽదేయమ్। శ్రియా దేయమ్। హ్రియా దేయమ్। భియా దేయమ్। సంవిదా దేయమ్। ౭ అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్ ।౩॥

యే తత్ర బ్రాహ్మణాస్సమ్మర్శినః యుక్తా ఆయుక్తాః అలూక్షా ధర్మకామాస్స్యుః యథా తే తత్ర వర్తేరన్। తథా తత్ర వర్తేథాః। ౮ అథాభ్యాఖ్యాతేషు। యే తత్ర బ్రాహ్మణాస్సంమర్శినః యుక్తా ఆయుక్తాః। అలూక్షా ధర్మకామాస్స్యుః। యథా తే తేషు వర్తేరన్। తథా తేషు వర్తేథాః ౯ ఏష ఆదేశః ఏష ఉపదేశః ఏషా వేదోపనిషత్। ఏతదనుశాసనమ్। ఏవముపాసితవ్యమ్ ఏవముచైతదుపాస్యమ్ ।౪॥

స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యం తాని త్వయోపాస్యాని విచికిత్సా వా స్యాత్తేషు వర్తేథా నష్ట చ ॥౧౧।

టీ. ౧. ఆచార్యః = ఆచార్యుఁడు, వేదం = వేదమును, అనూచ్య = అధ్యాపనముచేయించి (అనఁగా బోధించి), అంతేవాసినం = శిష్యుని, అనుశాస్తి=శాసించుచున్నాఁడు:—సత్యం = సత్యమును, వద = పలుకుము. ధర్మం = ధర్మమును, చర=చేయుము. స్వాధ్యాయాత్ = అధ్యయనమునుండి, మాప్రమదః=ప్రమాదమును పొందకుము. ఆచార్యాయ=ఆచార్యునికొఱకు, ప్రియం= ఇష్టమైన, ధనం = ధనమును, ఆహృత్య=తెచ్చియిచ్చి (అతనిచేత అనుజ్ఞాతుఁడవై), ప్రజాతంతుం = పుత్రపౌత్రాదిసంతతిని, మావ్యవచ్ఛేత్సీః = విచ్ఛిత్తిని చేయకుము.

౨. సత్యాత్=సత్యమునుండి, నప్రమదితవ్యమ్=ప్రమాదమును పొంద వలదు. ధర్మాత్ = ధర్మమునుండి, నప్రమదితవ్యం = ప్రమాదమును పొంద వలదు. కుశలాత్ = కుశలమునుండి (కుశలమనఁగా ఆత్మసంరక్షణరూపమగు పని), నప్రమదితవ్యం = ప్రమాదమును పొందవలదు. భూత్యై = మంగళార్థమయిన పనివల్లనుండి (పంచమ్యర్థమునందు చతుర్థి), నప్రమదితవ్యం=ప్రమాదమును పొందవలదు. స్వాధ్యాయప్రవచనాభ్యాం = అధ్యయనము అధ్యాపనము రెండిటినుండి, నప్రమదితవ్యం = ప్రమాదమును పొందవలదు. దేవపితృకార్యాభ్యాం = దేవపితృకార్యములనుండి, నప్రమదితవ్యం = ప్రమాదమును పొందవలదు.

3. మాతృదేవః=తల్లియే దైవముగాఁ గలవాఁడవు, భవ = కమ్ము. పితృదేవః=తండ్రియే దైవముగాఁ గలవాఁడవు, భవ = కమ్ము, ఆచార్యదేవః = ఆచార్యుఁడే దైవముగాఁ గలవాఁడవు, భవ=కమ్ము. అతిథిదేవః = అతిథియే దైవము ముగాఁ గలవాఁడవు, భవ=కమ్ము.

౪. యాని=ఏ, కర్మాణి = పనులు, అనవద్యాని = నింద్యములుకావో, (తాని = అట్టికర్మలే, త్వయా = నీచేత,) సేవితవ్యాని = సేవింపఁదగినవి. ఇతరాణి=నింద్యములయినవి, నో = (చేయ)వలదు. అస్మాకం=మాయొక్క, యాని

=ఏ, సుచరితాని=మంచిపనులుగలవో, తాని=ఆమంచిపనులే, త్వయా=నీచేత, ఉపాస్యాని = చేయఁదగినవి. ఇతరాణి = (మేము చేయుపనులలో) మంచివి కానివానిని, నో = (ఆచరింప) వలదు.

౩. యేకేచ = ఎవరైనా, బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, అస్మత్=మనకంటె,(లేక మాకంటే) శ్రేయాగ్ంసః=శ్రేష్ఠులో, తేషాం=వారికి, త్వయా = నీచేత, ఆసనేన = ఆసనమిచ్చుట (మొదలగుపనుల) చేత, ప్రశ్వసితవ్యం = (వారి) శ్రమను పోఁగొట్టవలయును.

౪. శ్రద్ధయా = శ్రద్ధచేత, దేయం = ఇవ్వవలయును. అశ్రద్ధయా = అశ్రద్ధచేత, అదేయం=ఇవ్వకూడదు. శ్రియా = సంపదచేత, దేయం=ఇవ్వవలయును. హ్రియా= సిగ్గుచేత, దేయం=ఇవ్వవలయును. భియా = భయముచేత, దేయం = ఇవ్వవలయును. సంవిదా = సంవిత్తుచేత, దేయం = ఇవ్వఁదగినది.

౫. అథ=పిదప, తే = నీకు, కర్మవిచికిత్సావా = కర్మను గూర్చినసందేహముగాని, వృత్తవిచికిత్సావా=ఆచారమునుగూర్చినసందేహముగాని, యది = సంభవించినయెడల, తత్ర = ఆదేశమునందు లేక ఆకాలమునందు, యే = ఏ, బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, సమర్శినః=విమర్శించుటను సమర్థులును, యుక్తాః= (ఆయాకర్మలందు) ఆసక్తిగలవారలును, ఆయుక్తాః=ఇతరప్రేరణములేక స్వయముగా నాచరించుచున్నవారలును, అలూక్షాః = క్రూరస్వభావరహితులును, ధర్మకామాః = ధర్మాభిలాషగలవారలును, స్యుః = అగుచున్నారో, తే=వారు, తత్ర = ఆవిషయమునందు, యథా = ఏవిధముగా, వర్తేరన్ = ప్రవర్తించెదరో, తథా = ఆప్రకారముగా, తత్ర = ఆవిషయమునందు, వర్తేథాః = ప్రవర్తింపుము.

౬. అథ=ఇఁక, అభ్యాఖ్యాతేషు = దోషులని సంశయింపఁబడుచున్న వారివిషయమయి,తత్ర = ఆదేశమునందులేకఆకాలమునందు,యేబ్రాహ్మణాః = ఏబ్రాహ్మణులు, సంమర్శినః=విమర్శించుటకు తగినవారలును, యుక్తాః=(ఆయా

కర్మలందు) ఆసక్తిగలవారలును, ఆయుక్తాః = ఇతరప్రేరణములేక స్వయముగా నాచరించుచున్నవారలును, అలూక్షాః=అక్రూరస్వభావులును, ధర్మకామాః=ధర్మాభిలాషగలవారలును, తే=వారు, తేషు=వారివిషయమై, యథా=ఏవిధముగా, వర్తేరన్=ప్రవర్తించెదరో, తథా=ఆవిధముగా, తేషు=వారివిషయమై, (నీవు) వర్తేథాః=ప్రవర్తించుము.

౯. ఏషః=ఈ(పైచెప్పిన) విషయము, ఆదేశః=ఈశ్వరాజ్ఞ, ఏషః=ఈవిషయము, ఉపదేశః=ఉపదేశము, ఏషా=ఈవిషయము, వేదోపనిషత్ = వేదరహస్యము, ఏతత్=ఇది, అనుశాసనం = ఈశ్వరవాక్యము. ఏవం ఉ= ఈవిధముగానే, ఉపాసితవ్యం = ఉపాసనము చేయఁదగినది. ఏవం ఉ = ఈవిధముగానే, ఏతత్=ఇది, ఉపాస్యం=ఉపాసింపఁదగినది.

తా. ౧. ఆచార్యుఁడు తనశిష్యునకు ప్రథమమున వేదమునంతయు సమగ్రముగ బోధించి తదధ్యయనానంతరము తదర్థమును సంగ్రహముగ బోధించుచున్నాఁడు. (ఈక్రిందఁ జెప్పఁబడునట్టి యుపదేశములన్నియు జ్ఞానోత్పత్తికంటె ముందు అవశ్య మాచరింపఁదగినవి. ఇవి పురుషునిచిత్తమును సంస్కరించును. కర్మలచేత సంస్కరింపఁబడిన హృదయము గలవానికి ఆత్మజ్ఞానము వెంటనే కలుగును కావున ఈచెప్పఁబోవుకర్మలు జ్ఞానోత్పత్తికి సాధకములు కావున తప్పక ఆచరింపవలయును. శాసించుచున్నాఁడు అని చెప్పుటచేత నీయనుశాసనమును అతిక్రమించునెడల పాపము కలుగుననియు తాత్పర్యము. ఈకర్మలు బ్రహ్మవిద్యకంటె పూర్వ ముపదేశింపఁబడినవి కావున విద్యోత్పత్తి యైనపిదప కర్మలవలన ఫలమేమియు లేదని ముమ్ముందుఁ జెప్పఁబోవుచున్నాఁడు కావున పూర్వ మాచరించినపాపమును బోఁగొట్టుచు జ్ఞానోత్పత్తిని కలుగఁజేయుటకే కర్మలు సమర్థము లగుచున్నవి. “అవిద్యయా మృత్యుం తీర్త్వావిద్యయాఽమృత మశ్నుతే” అనుమంత్రము ఈవిషయమునే బోధించుచున్నది. కావున సత్యవచనము మున్నగుకర్మలు

విద్యోత్పత్తికి సాధనములుకావున వానికి ఆనర్థక్యములేదు. వేదాధ్యయనానంతరము శిష్యునకు ఆచార్యుఁడీయనుశాసనమును చేయుఁటచేత 'వేదము చదివినపిదప ధర్మజిజ్ఞాసను చక్కఁగా చేసియే గురుకులమునుండి స్నాతకుఁడై రావలయుననియు, మంత్రార్థమును చక్కఁగా నెఱిఁగియే కర్మల నాచరింప వలయు ననియు' సిద్ధించుచున్నది. అని ఈవిధముగా శ్రీశంకరభగవత్పాదులవారు భాష్యమునందు విమర్శించియున్నారు.

ఆయనుశాసనము లేవి యనఁగా—

౧. సత్యమును పలుకుము.

౨. ధర్మము నాచరింపుము.

౩. వేదాధ్యయనమునుండి ప్రమాదమును పొందకుము. అనఁగా పఠించినవేదమును మఱచిపోవలదని తాత్పర్యము.

౪. ఇంతకాలము నీకు విద్యోపదేశ మొనర్చిన ఆచార్యునకు ప్రియమైన ధనము నొసంగి ప్రజాసంతానమునకు విచ్ఛిత్తిని కలుగఁజేయకుము. అనఁగా వివాహితుఁడవై సత్సంతానమును పొందుము. పుత్రోత్పత్తి కలుగని యెడల పుత్రకామేష్టి మున్నగు ప్రయత్నములను తదర్థమయి చేసితీరవలయునని భావము.

౨—౫. పొరబాటుగానైనను అసత్యవాక్యమును పలుకకుము.(అనృతమును పలికినవాఁడు సమూలముగా నశించుననియు, అనృతవచనముకంటె పాతకము మఱొక్కటి లేదనియు అభిప్రాయముగల శ్రుతి:—'యో ఽనృతం వదతి సమూలో వా ఏష పరిశుష్యతి;' (ప్రశ్నో. ౬.౧) స్మృతి:—'నసత్యాత్పరమోధర్మో నానృతాత్పాతకం పరమ్' (భార. శాంతి. ౧౬౦.౨౪.) అనుశ్రుతి స్మృతులను శ్రీమచ్ఛంకరభగవత్పాదులవారు భాష్యమునం దుదహరించినారు.)

౬. ధర్మమునుండి ప్రమాదమును పొందవలదు. ధర్మమనఁగా అవశ్యమాచరింపఁదగినది. దానినుండి ప్రమాదమును పొందుట యనఁగా అనుష్ఠానము

లేకయుండుట. అట్టిప్రమాదములేక నీవు విహితమయినధర్మము నాచరింపుము.

౭. కుశలమయిన కర్మమునుండి ప్రమాదము పొందవలదు. (కుశల కర్మయనఁగా దేహారోగ్యనిమిత్తము చేసికొనవలసిన ఔషధసేవనాదిచికిత్స యని ఎఱుంగవలయును.)

౮. భూతియనఁగా సంపద. అట్టి సంపత్సంపాదనమునకు ఆవశ్యకమగు న్యాయమైన వైదికములగు వాయవ్యేష్టి మున్నగుకర్మలను, లౌకికములగు సత్ప్రతిగ్రహములను ఆచరింపుము.

౯. స్వాధ్యాయ మనఁగా తాను చదువుట. ప్రవచనమనఁగా శిష్యులకు బోధించుట. ఈ రెండుపనులను నియమముగా చేయుము.

౧౦. దేవకార్యము లనఁగా యాగాదికర్మలు. పితృకర్మ లనఁగా శ్రాద్ధాదికర్మలు. ఈ దేవపితృకార్యములను నియమముగా చేయుము.

3—౧౧. తల్లిని దేవతఁగా భావించి పూజింపుము.

౧౨. తండ్రిని దేవతఁగా భావించి పూజింపుము.

౧3. ఆచార్యుఁడనఁగా విద్యాగురువు. అతనిని దేవతఁగా భావించి పూజింపుము.

౧౪. అతిథిని దేవతఁగా భావించి పూజింపుము.

౪—౧౫. (ఈప్రకారము శ్రౌతస్మార్తకర్మలను గుఱించి ఆచరింప వలసిన నియమములను బోధించి ఆచారప్రమాణమునందుఁ గల విశేషవిధిని ఉపదేశించుచున్నాఁడు:—శిష్టులయినవారియొక్క) నిరవద్యములు కానిపను లనే నీవు ఆచరింపుము. వారొకవేళ ప్రమాదముగా నిరవద్యములగువాని నాచరించియున్నను నీవుమాత్రము వారొనర్చిన నిరవద్యకర్మల నాచరింపవలెను.

౧౬. (వెనుక పూర్వులగుశిష్టు లాచరించిన సదాచారము నాచరించుచు దురాచారము నాచరింపవలదనిచెప్పి ప్రకృతమునందు ఆచార్యుఁడైయున్న నేను చేయుచున్నట్టి కార్యములన్నియు అనింద్యములేయని భావించి ఆచరింప వలదు. దీనియందును ప్రమాదముచేత కొన్నినింద్యములయినపను లుండ వచ్చును. నీవుమాత్రము సదాచారమునే పరిగ్రహించి దురాచారమును విడువుము. అని బోధించుచున్నాఁడు:—)ఆచార్యులమగు మాయొక్క కృత్యములలో నెయ్యవి వేదశాస్త్రములకు విరుద్ధములుకావో అట్టి కృత్యము లనుమాత్రమే నీవు ఆచరింపుము. వేదశాస్త్రములకు విరుద్ధములగునవి మే మొనర్చినను వానిని నీవు ఆచరింపవలదు.

౫—౧౭. ఆచార్యుఁడనగు నాకంటె భిన్నులయిన యోగ్యులగు బ్రాహ్మణులు ఎవ్వరైనను వచ్చినయెడల వారికి ఆయాసము తీరునటుల ఆసన దానాదిపరిచర్యనొనర్చి వారిని శక్తికొలఁది సత్కరింపుము. లేక అట్టివారలు ఏదేని శాస్త్రార్థము నొసంగుచున్నయెడల నీవు నిట్టూర్పునైనను వదలక వారు చెప్పుచున్న విషయమునందలి సారమునుమాత్రము గ్రహింపుము. (నిట్టూర్పు నైనను వదలవలదని చెప్పుటచేత అట్టి పెద్దలతో నేనుఁగూడ పండితుఁడనని గర్వించి మీశాస్త్రార్థమునందు ఇట్టి దోషమున్నదని వారితోడ వాదింపకుము అనెడిబోధ చెప్పకయే బోధింపఁబడినదని భావము.)

౬—౧౮. శ్రద్ధతో దానము నివ్వవలయును. (సత్పాత్రమునందు దానము చేయుటయే ముఖ్యము. ఒకవేళ అపాత్రులగువారలకు దాన మియ్యవలసివచ్చుట ఒకప్పుడు తటస్థించినను తాను మాత్రము శ్రద్ధకలిగియే అట్టివారలకున్ను దానమివ్వవలయును. ఈవిషయము సురేశ్వరాచార్యకృత తైత్తిరీయభాష్యవార్తికము. శీక్షావల్ల్యధ్యాయమునందు శ్లో. ౭౭.” “శ్రద్ధయైవహి దాతవ్య మశ్రద్ధాభాజనేష్వపి. అని చెప్పఁబడియున్నది.

౧౯. అశ్రద్ధతో దానము నాచరింపఁగూడదు.

౨౦. తనవిభవము ననుసరించి దానము చేయవలయును.

౨౧. లజ్జకలిగి దానముచేయవలయును. (అనఁగా తాను ఎక్కువగా ధనము నొసంగుచున్నను నేను ఏమియిచ్చుచున్నాను ఇంతకంటె ఎక్కువగా నివ్వలేకపోతినే అని సిగ్గుతో ఇవ్వవలయునని భావము.)

౨౨. పరలోకభయము కలిగి ఇవ్వవలయును.

౨౩. మిత్రులు మొదలగువారికి వివాహాదికార్యములందు చేయు సత్కారము సంవిత్తు. అట్టిసంవిత్ దాన మొనర్పవలయును.

౭—౨౪. ఈప్రకారము చరించుచున్న నీకు ఒకానొకప్పుడు శ్రౌతస్మార్తకర్మలయందుఁగాని, లేక ఆచారమునందు గాని సంశయము కలిగిన యెడల ఆయాకర్మలను యథావిధిగా నాచరించుచున్నట్టియు, సూక్ష్మదర్శులును, ఒకరిబోధలేకయే తామే స్వయముగ కర్మల నాచరించుచున్నవారలును, క్రూరస్వభావము లేనివారలును, ధర్మాసక్తులును (ధర్మాసక్తు లనఁగా అతీంద్రియమైన ధర్మఫలమును మాత్రమే అపేక్షించినవారలు. కామాసక్తులయి లాభమును సన్మానమును అపేక్షించువారలు మాత్రము కారని భావము.) అగు బ్రాహ్మణులు ఆకర్మలను ఏవిధముగా నాచరించెదరో వారే యాచారము నవలంబించెదరో నీవున్నూ అట్లే యాచరింపుము.

౮—౨౫. (పాపులని స్పష్టముగాఁ దెలిసినవారితోడ సంవ్యవహారము మున్నగునవి నిషిద్ధములనుట శాస్త్రసిద్ధమే.) ఇఁక పాపులని స్పష్టముగాఁ దెలియక సందేహాస్పదులయిన పురుషులవిషయమై యుక్తులును, ఆయుక్తులును, అలూక్షులును, ధర్మకాములును అగు బ్రాహ్మణు లెట్లు చరించెదరో ఆప్రకారము చరింపుము.

౯. ఈపైనచెప్పిన ౨౫ విషయములను ఆదేశములనుగా భావింపుము. ఆదేశమనగా విధియని తాత్పర్యము. ఇది ఉపదేశము. ఉపదేశమనఁగా

శిష్యుఁడు పుత్త్రుఁడు మున్నగువారలకు ఆచార్యుఁడు తండ్రి మున్నగువారలు వారిశ్రేయస్సుకొఱకు బోధించెడి హితబోధ. ఇదియే వేదరహస్యము. ఇదియే ఈశ్వరవచనము. (ప్రప్రథమమున "ఏష ఆదేశః" అని చెప్పియుండుట చేత ఇచట "అనుశాసన" పదమున కీయర్థము గ్రహింపఁబడినది.) పైనఁ జెప్పిన వచనములన్నియు ఈశ్వరవచనములు కావున అవియన్నియు ఆచరింపఁదగినవియే యని మనస్సునందు దృఢముగా నమ్మి ఆచరింపవలయును. ఈప్రకారము వీని నాచరింపవలయును గాని ఆచరింపక యుండఁగూడదు.

"ఏవముపాసితవ్యం, ఏవముచైతదుపాస్యమ్" రెండుపర్యాయములు చెప్పుట అవశ్య మాచరింపవలసినవిషయమని ఆదరార్థముగా గ్రహింపవలయును.

౧. అను...

౨. ఆత్మ...

౩. భా. వా...౧౬౧—౧౮౩.

విద్యాకర్మవివేకము:— కర్మలే మోక్షమునకు సాధనభూతములు, జ్ఞానము మోక్షసాధనము కాదు, లేక కర్మజ్ఞానసముచ్చయము మోక్షహేతువు అనువారిమతమును ఖండించి జ్ఞానమే మోక్షహేతువని సిద్ధాంతీకరించుట:—

౧. కేవలము కర్మలవల్లనే మోక్షము లభించునా?

౨. లేక జ్ఞానముతోఁ గూడిన కర్మలవలన మోక్షము లభించునా?

(ఇచట కర్మ ప్రధానము, జ్ఞానము అప్రదానము అని యెఱుంగునది.)

౩. విద్యాకర్మలు రెండింటిచేతను మోక్షము లభించునా?

(ఇచట విద్యయు [అనఁగా జ్ఞానము] కర్మయు సమప్రధానమని యెఱుంగునది.)

౪. కర్మతోఁ గూడిన విద్యచేతనా ?

(ఇచట జ్ఞానము ప్రధానము, కర్మ అప్రధానము అని యెఱుంగునది.)

౫. కేవలము జ్ఞానముచేతనా ?

పూర్వపక్షము.

౧. (కర్మలవల్లనే మోక్షము సిద్ధించును. అనువారియుక్తులు.)

కేవలము కర్మలచేతనే మోక్షము లభించును. ఏలయనఁగా సమస్త వేదార్థముల నెఱింగినవాఁడే కర్మాచరణమున కధికారి యగుచున్నాఁడు. అందులకు ప్రమాణము మనుస్మృతి:—౨. ౧౬౫.

శ్లో. 'వేదః కృత్స్నోఽధిగన్తవ్యః సరహస్యో ద్విజన్మనా'

మఱియు వేదమునందుఁగల 'విద్వాన్ యజతే.' తై. సం. 3-౨-౧-౧-౨. 'విద్వాన్ యాజయతి' మున్నగు వాక్యములు సైతము విద్వాంసుఁడే కర్మాధికారియని పలుకుచున్నవి. కొందఱు వేదమంతయు కర్మార్థమేయని పలుకుచున్నారు. (ఇచట కొందఱనఁగా ప్రాభాకరులని తాత్పర్యము.) కర్మలచేత మోక్షము లభించనియెడల వేదమంతయు అనర్థకమగును. (వేదము అనర్థకమగుట నీకును అనభిమతము కావున కర్మలచేతనే మోక్షము లభించునని పూర్వపక్షియొక్క నిర్ణయము.)

సిద్ధాంతము.

౧. కర్మ మోక్షసాధనముకాదు.

(కర్మ మోక్షసాధనము) కాదు. మోక్షము నిత్యము. నిత్యమయిన మోక్షమే మన కభిమతము. లోకమునందు కర్మచేత పుట్టినది అనిత్యమగుట సుప్రసిద్ధముగాఁ గనంబడుచున్నది. కర్మలచేతనే మోక్షము సిద్ధించునెడల మోక్షము అనిత్యమగును. మోక్షము అనిత్యమగుట నీకును అనభిమతమే గదా.

పూర్వపక్షము.

ప్రకారాంతరముగా పూర్వపక్షమును ఆశంకించుకొని నిరాకరించుట.

ఒకఁడు కామ్య, నిషిద్ధకర్మలను చేయక కేవల నిత్యకర్మలను మాత్రము చేయుచుండును. ప్రారబ్ధకర్మము ఈజన్మమునందు అనుభవముతో నశించిపోవును. నిత్యకర్మాచరణమువలన (తదకరణమువలన కలుగునట్టి) ప్రత్యవాయము ఉత్పన్నముకాదు కావున జ్ఞానములేకయే మోక్షము లభించును.

సమాధానము.

అట్లనరాదు. సంచితకర్మజాతమంతయు ఈజన్మమునందు అనుభవములో నశించదు. (అనేక జన్మసంచితకర్మయంతయు చేరి ఈదేహము రాలేదు కావున) కర్మశేషముకూడ నుండును. తత్కర్మానుభవనిమిత్తము శరీరోత్పత్తి తప్పక కలుగవలసియుండును. అని ఈవిషయమును పీఠికయందే నిరాకరించియున్నారము.

(ఈజన్మమునందు అనుభవింపఁగా మిగిలి కొద్దిగా కర్మము శేషించి యున్నయెడల) నిత్యకర్మాచరణమువలన ఆకర్మము నశించునుగదా యని కొందఱు తలఁచుట సరికాదు. ఏలయనఁగా నిత్యకర్మాచరణమువలన పాప కర్మము నశించునుగాని పుణ్యకర్మము నశింపదు. పుణ్యకర్మానుభవార్థము మఱల జన్మము ఆవశ్యకమగును.

సమస్తవేదార్థజ్ఞానము గలవానికే కర్మాధికారము అని వెనుకచెప్పిన విషయము సరిగాదు. (మోక్షసాధనభూతమగు) ఉపాసనము శ్రుతజ్ఞానము కంటె వేఱయినది. కర్మలకు శ్రుతజ్ఞానము మాత్రముచేతనే అధికారియగును. (శ్రుతజ్ఞానమనఁగా గురుకులమునందు వేదార్థమును తెలిసికొనుట మాత్రమే యగును.) కర్మాచరణమునకు ఉపాసన మక్కరలేదు.

ఉపాసనము మోక్షఫలకముగా శ్రుతులందు ప్రతిపాదితమయి యున్నది. శ్రుతులందు "శ్రోతవ్యః" అని వచించి అంతటితో నిలువక "మంతవ్యో నిదిధ్యాసితవ్యః" అని ఇతర ప్రయత్నములను చెప్పుటచేత (ఉపాసనము మోక్షసాధనమని శ్రుత్యనుగృహీతము.)

మనననిదిధ్యాసనములు శ్రుతజ్ఞానభిన్నము లనుట సుప్రసిద్ధమే గదా. (కావున కేవలకర్మాచరణమువలన మోక్షము లభించుననుట నిరాకరింపఁబడినది.)

౨. కర్మము ప్రధానము, జ్ఞానము అప్రధానము అనువారి పూర్వపక్షము.

ఇట్లయినయెడల (అనఁగా కర్మకార్యమగుమోక్షము అనిత్యమగునెడల) విద్యాసమన్వితములగు కర్మలవలన మోక్షము సిద్ధించును. (విద్యాసమన్వితములగు కర్మలవలన జనించినదిమాత్రము ఏల అనిత్యము కాకూడదు. అని ఆశంకించుకొని సహకారి సామర్థ్యమువలన కార్యవైచిత్ర్యమును గనంబఱుచుననువిషయమును దృష్టాంతపూర్వకముగా చెప్పుచున్నాఁడు:—)

విద్యాసహితములగు కర్మలవలన కలిగినకార్యము సహకారవిశేషము వలన కర్మజన్యమయినను నిత్యముకావచ్చును. (అందులకు దృష్టాంతము.)

విషము, పెరుగు మున్నగువస్తువులు మరణమును జ్వరమును కలుగఁజేయఁనట్టి స్వభావముగలవియే అయినను "మంత్రాభిమంత్రితమగు విషము మరణరూపమగు తన కార్యమును ఆచరింపక పుష్టిరూపమగు విచిత్రకార్యమును సలుపుచున్నది.

పెరుగును సమయవిశేషమునందు భక్షించినయెడల జ్వరమును కలుగఁ జేయుస్వభావముగలది అయినను ఆపెరుగునే బెల్లముతోడనో చక్కెర తోడనో కలిపి భక్షించినయెడల తృప్తినిమాత్రము కలిగించుచున్నది.

ఇదేవిధముగా విద్యాసమన్వితములగు కర్మలవలన మోక్షము లభించును. (ఈమోక్షము జ్ఞానసహితకర్మారబ్ధమయినను సహకారి సన్నిధానవైచిత్ర్యము చేత నిత్యమే యగును.)

౨. పూర్వపక్షనిరాసనము.

అట్లనరాదు. ఆరబ్ధమయినది అనిత్యము. అనువిషయము నిదివఱకే చెప్పి యున్నారము.

"న చ పునరావర్తతే" (ఛాం. ౮. ౯. ౧) అని చెప్పఁబడియున్నది కనుక వచనముచేత "మోక్షము ఆరబ్ధమయినను నిత్యమే" అని చెప్పఁదలఁచితి వేని అటుల చెప్పఁగూడదు. వచనము భూతార్థజ్ఞాపకముకాని లేనిదానిని సృజించునది కాదు. నూరుమాటలు చెప్పినను నిత్యమగునది ఆరబ్ధముకాదు. ఆరబ్ధమయినది (ఘటాదికము నిత్యమగుఁగాక యని నూరువచనములు పలికినను) వినాశము లేకయుండదు.

దీనిచేత విద్య అప్రధానముగను, కర్మ ప్రధానముగను కలిసి మోక్షము కలుగఁజేయును. అనువిషయము నిరాకరింపఁబడినది.

౩. విద్యయు కర్మయు సమముగ సముచ్చయమయి మోక్షమును కలుగఁజేయును. (అనుపూర్వపక్షము.)

వెనుకచెప్పిన విధముగా విద్యయు కర్మయు సమముగాఁ గలిసి మోక్షము పుట్టించునను విషయమునైతము నిరాకరింపఁబడినది.

పూర్వపక్షి:—

"విద్యాకర్మలు మోక్షప్రతిబంధహేతు వగు అవిద్యను నివర్తింపఁ జేయును" అని పూర్వపక్షి ఆశంకించుచున్నాఁడు.

3. పూర్వపక్షనిరాసము:—అట్లుకాదు. (అవిద్యానివృత్తికి విద్య యావశ్యకముగాని కర్మము అక్కరలేదు.) కర్మకు ఫలాంతరము గనంబడు చున్నది. ఉత్పత్తి, సంస్కారము, వికారము, ఆప్తి ఇవి కర్మఫలములు. మోక్షము ఉత్పత్త్యాదివిపరీతము.

పూర్వపక్షము.

శ్రు. 'సూర్యద్వారేణ తే విరజాః ప్రయాన్తి.' ముం. ఉ. ౨. ౧౧.

శ్రు. 'తయోర్ధ్వమాయ న్నమృతత్వమేతి.' ఛాం. ఉ. ౮. ౬. ౬.

ఇది మొదలగు శ్రుతులవలన మోక్షముసైతము 'ఆప్యము' (పొందఁబడునది) అని సిద్ధించుచున్నదిగదా.

సమాధానము.

కాదు. మోక్షము సర్వగతము. గంతకంటె భిన్నముగా లేదు. బ్రహ్మము ఆకాశాదికమునకు కారణమగుటచేత సర్వగతమగుచున్నది. జ్ఞానులందఱు బ్రహ్మముకంటె వ్యతిరిక్తులుకారు కావున మోక్షము ప్రాప్యముకాదు.

ప్రాప్య మెప్పుడును గంతకు విభిన్నమయిన ప్రదేశమనుట లోక ప్రసిద్ధము. ఏది ఏదనికంటె భిన్నముకాదో దానిని వాఁడు పొందుటలేదు. బ్రహ్మము గంతకంటె భిన్నమయినది కాదనుటకు శ్రుతిస్మృతిప్రమాణములు:—

శ్రు. 'త త్సృష్ట్వా తదేవానుప్రావిశత్.' తై. ఉ. ౨. ౬.

స్మృతి. 'క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత.'
భగవద్గీత. ౧౩. ౨.

మున్నగు శ్రుతిస్మృతులు అనేకములు గలవు.

పూర్వపక్షము.

మీరుచెప్పిన సమాధానము గత్యైశ్వర్యశ్రుతులకు విరోధముగా నున్నది.

౧. గతిశ్రుతి:—వెనుక చెప్పఁబడిన "సూర్యద్వారేణ తే విరజాః ప్రయాంతి" (ముండ. ౧. ౧౧.) ఇత్యాదికము.

౨. ఐశ్వర్యశ్రుతి:—౧. స ఏకధా భవతి త్రిధా భవతి.
ఛాం. ఉ. ౭. ౨౬. ౨.

౨. స యది పితృలోకకామో భవతి.
ఛాం. ఉ. ౮. ౨. ౧.

3. స్త్రీభిర్వా యానైర్వా. ఛాం. ఉ. ౮. ౧౨. 3.

అనుచోట చెప్పఁబడిన అర్థమును విచారించితిమేని బ్రహ్మము గంతవ్యమనియే సిద్ధించుచున్నది. (మీరుచెప్పిన సమాధానము శ్రుతివిరోధము అని పూర్వపక్షి సప్రమాణముగ పలికినాఁడు.)

తత్సమాధానము.

మీరు గనంబఱచిన శ్రుతివచనములు కార్యబ్రహ్మపరములు. కార్యబ్రహ్మయందు (అనఁగా సగుణుఁడగు హిరణ్యగర్భునియందు) స్త్రీలు మున్నగు నవన్నియు ప్రాప్తించును.

(ఈవిషయము ఛాందోగ్యము ౮-వ అధ్యాయము రెండవఖండయందు సమగ్రముగ చెప్పఁబడినది. "స యది పితృలోకకామో భవతి సంకల్పా దేవాస్య పితర స్సముత్తిష్ఠంతి తేన పితృలోకేన సంపన్నో మహీయతే" అని ఉపక్రమించి "యం యమన్తమభికామో భవతి యం కామం

కామయతే సోఽస్య సంకల్పాదేవ సముత్తిష్ఠతి తేన సంపన్నో మహీయతే” అని ఖండచివరవఱకు విపులముగ చెప్పఁబడియున్నది) కాని,

సమాధానము.

కాని

౧. ఏక మేవాద్వితీయం బ్రహ్మ. ఛాం. ఉ. ౬. ౨. ౧

౨. యత్ర నాన్య త్పశ్యతి నాన్య చ్ఛృణోతి నాన్య ద్విజానాతి స భూమా. ఛాం. ఉ. 7. ౨౪. ౧.

3. యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం పశ్యేత్. బృ. ఉ. ౪. ౫. ౧౫.

ఈశ్రుతులవలన గత్యైశ్వర్యశ్రుతులు కార్యబ్రహ్మపరములు కాని కారణబ్రహ్మపరములు కావని సిద్ధించును.

విద్యాకర్మలకు విరోధము కావున విద్యాకర్మ సమసముచ్చయము సైతము పొసఁగదు. మఱియు విద్య, కర్తృకర్మాదికారకశూన్యము, కర్మమన్ననో కర్తృకర్మాదికారకసాధ్యము, ఒకే వస్తువు వాస్తవముగా కర్తృకర్మాదికము కలిగియున్నదనియు, కర్తృకర్మాదిశూన్యమనియు ద్వివిధముగానున్నదనుట న్యాయము కాఁజాలదుగదా. ఇందేదియో ఒకటి మిథ్యయయి తీరవలయును.

ఏదియో యొకటి మిథ్యయయి యుండునను విషయము నంగీకరించినపుడు స్వాభావికాజ్ఞానమునకు విషయభూతమగు ద్వైతమే మిథ్యయనుట యుక్తము.

ఇందులకు శ్రుతిప్రమాణములు:—

౧. యత్రహి ద్వైత మివ భవతి. (బృ. ఉ. ౪. ౧౫. ౧౫)

౨. మృత్యోస్స మృత్యుమాప్నోతి. (కఠ. ఉ. ౨. ౧౦.)

3. అథ యత్రాన్యత్పశ్యతి తదల్పమ్. (ఛాం. ఉ. 7. ౨౪. ౧.)

౪. అన్యో ఽసా వన్యో ఽహ మస్మీతి న స వేద.

(బృ. ఉ. ౧. ౪. ౧౦.)

౫. ఉదరమన్తరం కురుతే, అథ తస్య భయం భవతి.

(తై. ఉ. ౨. ౭.)

(అర్థ. ౧. ఏయవిద్యాసమయమునందు మిథ్యయగు జగము భేదముగాఁ గనంబడునో అపుడు 'ఒకఁడు ఒకనిని చూచును' అని అచటి శ్రుతికి అర్థము. ద్వైతశబ్దముచేత జగత్తు గ్రహింపఁబడును. ఇవశబ్దము మిథ్యావాచకము. సాదృశ్యవాచకముగాదు.)

౨. (బ్రహ్మమునందు మిథ్యాభూతమగు) జగత్తును కల్పించువాఁడు మృత్యువువల్లనుండి మృత్యువును పొందును. (అనఁగా అనర్థపరంపరలు వానికి కలుగునని చెప్పఁబడి యున్నది కావున ద్వైతదర్శనము న్యాయము కాదనుట.)

3. 'భూమ' యనుదానిలక్షణమును చెప్పి పిదప తద్విపరీతముగ ఎచట మఱొకదానిని గాంచునో అది అల్పము.

౪. ఎవఁడు పరమాత్మ వేఱు, నేను వేఱు అని భావించునో వాఁడు పరమాత్మ నెఱుఁగనివాఁడు.

౫. ఆత్మయందు కొంచెముగనైనను భేదబుద్ధిని గాంచునేని వానికి భయము కలుగును.)

(ఇదివఱకు ద్వైతమునకు నింద చెప్పఁబడినది. ఇఁక ఏకత్వము యథార్థమని బోధించు శ్రుతుల నుదహరించుచున్నారము:—)

౧. ఏకధైవానుద్రష్టవ్యమ్. (బృ. ఉ. ౪. ౪. ౨౦.)

౨. ఏకమేవాద్వితీయమ్. (ఛాం. ఉ. ౬. ౨. ౧.)

3. బ్రహ్మైవేదగ్ంసర్వమ్. (నృ. ఉ. తా. ఉ. ౭.

౪. ఆత్మైవేదగ్ం సర్వమ్. (ఛాం. ఉ. ౭. ౨౫. ౨.)

అర్థ. ౧. ఒక్కటియేయని చూచునది.

౨. ఒక్కటియేగాని రెండవదిలేదు.

3. ఇదంతయు బ్రహ్మమే.

౪. ఇదంతయు ఆత్మయే.

ఇట్టియర్థముగల శ్రుతు లనేకములు గలవు,

మఱియు కర్మ, కర్తృ, సంప్రదానాది కారక భేదబుద్ధి యున్నఁగాని కర్మ సిద్ధించఁజాలదు. విద్యావిషయమునందు అన్యత్వమును చూచుట తగదను వచనములు వేలకొలఁది గనంబడుచున్నవి. కావున విద్యాకర్మలకు (అనఁగా జ్ఞానమునకు కర్మాచరణమునకు) విరోధము అని సుస్పష్టము కావున విద్యాకర్మసముచ్చయమువలన మోక్షము సిద్ధించదు. కనుక విద్యాకర్మలు కలసి మోక్షమును కలుగఁజేయుననుట అనుపపన్నము.

మఱొకసందేహము

(ద్వైతము మిథ్య కావున ద్వైతశ్రుతులు ప్రమాణము కావు) అని యందువేని 'కర్మలు ఆచరణీయములు' అని విధించిన శ్రుతులకు విరోధము గదా.

(ఎట్లనఁగా) సర్పాదికము భ్రాంతియని ఎఱుంగుటచేత సర్పభ్రాంతి జ్ఞానమును మిథ్యగానొనర్చి రజ్జ్వాదివిషయజ్ఞాన మేవిధముగా గలిగినదో అట్లే, కర్తృకర్మసంప్రదానాది విశేషమును మిథ్యగాఁజేసి ఆత్మైకత్వ విజ్ఞానమునే శ్రుతులు బోధించుచున్నవనునెడల కర్మవిధిశ్రుతులు నిర్విషయము లగుచున్నవి. కర్మలు శ్రుతులందు విధింపఁబడి యున్నవి. శ్రుతులు ప్రమాణములు కావున తచ్ఛ్రుతివిరోధము న్యాయము కాదు.

సమాధానము

(కర్మబోధక) శ్రుతులు పురుషార్థ (మార్గ)ము నుపదేశించును. విద్యోపదేశశ్రుతి సంసారమునుండి పురుషుని విముక్తుని చేయవలయునని (తలంచి) సంసారమునకు హేతుభూతమగు అవిద్యవల్లనుండి జ్ఞానముచేత నివృత్తుని చేయును. కావున కర్మప్రకాశక జ్ఞానప్రకాశక శ్రుతులకు విరోధ మేమియులేదు.

మఱొకసందేహము

విద్యాశ్రుతి కర్మశ్రుతులకు విరోధము లేదని సాధించినను కర్తృ, కర్మసంప్రదానాది కారకసద్భావమును ప్రతిపాదించునట్టి శ్రుతి (ద్వైతము నంగీకరించనట్టి విద్యాశ్రుతికి) విరోధమగుచున్నది గదా.

సమాధానము

కర్మశ్రుతి భ్రాంతిసిద్ధమగు కర్మకర్త్రాదికారకము నంగీకరించి ఉపాత్తదురితక్షయార్థము ముముక్షువులకు నిత్యకర్మలను, ఫలార్థులకు కామ్యకర్మలను విధించుచున్నది కాని కర్మకర్త్రాదిద్వైతబుద్ధి సత్యమని బోధించుటకు గాను చెప్పఁబడలేదు.

పాపప్రతిబంధ మున్నవానికి విద్యోత్పత్తి గలుగదు. ఇయ్యది శాస్త్రప్రసిద్ధము. తత్పాపము నశించిన జ్ఞానోత్పత్తి యగును. జ్ఞానోత్పత్తివలన అవిద్య నశించును. అవిద్యానాశమువలన సంసారనివృత్తి కలుగును.

ప్రకారాంతరసమాధానము

(ఇదివఱకు ఆత్మ ఏకమగుటచేతను, అనేకత్వమున్నఁగాని కర్మలు అనుష్ఠేయములుకావు కనుకను, విద్యాకర్మసముచ్చయము నిరాకరింపఁబడినది.

ఇప్పుడు ప్రకారాంతరముగా విద్యాకర్మలకు విరోధమును గనంబఱుచు చున్నాఁడు:—)

ఆత్మకాని దేహమునందు ఆత్మత్వమును గాంచి స్వవ్యతిరిక్తములగు కామ్యపదార్థములుగలవని భావించువానికి తద్విషయకమగు కామము కలుగును, కామియై కర్మలనాచరించును, చేయఁబడిన కర్మఫలము ననుభవించుటకు శరీరమును పొందును, (ఇటుల) సంసారము (సిద్ధించును). (ఇది కామియగువాని విషయము.)

(జ్ఞానికి) దేహాదికమునందు ఆత్మబుద్ధిలేక ఆత్మైకత్వమునే గాంచుచుండు వానికి కోరఁదగిన విషయాంతరము లేదు. కావున కామమే లేదు. ఆత్మయందు అన్యత్వ (భ్రాంతి) నివృత్తియగుటచేత కామమే కలుగదు కావున ఆత్మావస్థానమే మోక్షము.

ఇందువలనను విద్యాకర్మలుకలసి మోక్షమును గలుగఁజేయు ననుటయు న్యాయముకాదు.

ప్రకారాంతరపూర్వపక్షము

౪. జ్ఞానము ప్రధానము, కర్మము అప్రధానము. ఇటుల మోక్షమును కలుగఁజేయును.

తన్నిరసనము

(కర్మయు, జ్ఞానము సమప్రధానమనుపక్షమునందు పరస్పరము విరోధమగుటచేత తగదని యెటుల నిర్ణయింపఁబడినదో అట్లే జ్ఞానము ప్రధానము, కర్మ సహకారము అను పక్షము సైతము) విరోధము అగుటచేత జ్ఞానము మోక్షమునిమిత్తము కర్మల నపేక్షింపదు.

నిత్యకర్మలు అనేకజన్మసంచితదురితములను, ప్రతిబంధకములను

సాధనమొనర్చి జ్ఞానోత్పత్తిని కలుగఁజేయుటకు హేతుభూతములుమాత్రమగును, అందులకే ఈవేదాంతశాస్త్రప్రకరణమునందు కర్మలు చెప్పఁబడినవను విషయమును మేమిదివఱకు చెప్పియుంటిమి. ఈవిధముగా చెప్పుటచేత కర్మవిధి శ్రుతులకు విరోధములేదు. (అనఁగా శ్రుతులందు విధింపఁబడిన కర్మాచరణమువలన ఉపాత్తదురితప్రతిబంధకములు నశించి జ్ఞానోత్పత్తి కలుగుననియు, జ్ఞానమువలన మోక్షముకలుగుననియు, మోక్షహేతుభూతమగు జ్ఞానమునకు ప్రతిబంధకమగు పాపమును నశింపఁజేయు నిమిత్తము కర్మలు విధింపఁబడినవనియు, సమన్వయించుకొనుటవలన కర్మవిద్యాశ్రుతులకు విరోధమే లేదు.)

జ్ఞానముచేతనే మోక్షమను సిద్ధాంతము.

౫. (అందువలన మోక్షమునందు కేవల కర్మలుగాని విద్యాకర్మసముచ్చయముగాని నిషేధింపఁబడినది కావున ననియర్థము.) కేవలము జ్ఞానముచేతనే మోక్షము సిద్ధించును.

మఱొకసందేహము

కర్మలు విద్యోత్పత్తియందు హేతుభూతములగునెడల ఆశ్రమాంతరములు (అనఁగా నైష్ఠికబ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాసాశ్రమములు) అనావశ్యకములగును. విద్యోత్పత్తికి కర్మలేగదా నిమిత్తము. కర్మలు గృహస్థాశ్రమికే విధింపఁబడినవి కావున ఒకగృహస్థాశ్రమమే గ్రాహ్యము. 'యావజ్జీవ మగ్నిహోత్రం జుహోతి' మున్నగు శ్రుతులు (ఆయువున్నంతవఱకు అగ్నిహోత్రము నొనర్పుము అని చెప్పుచున్నవి కావున గృహస్థాశ్రమమే జీవితముండునంతదనుక గ్రహింపవలయుననుటకు) అనుకూలతరములగును.

తత్సమాధానము

అట్లుకాదు. కర్మ లెన్నోవిధములు. అగ్నిహోత్రాదికములుమాత్రమే కర్మలు కాదు. ఇతరాశ్రమములకువిధించిన బ్రహ్మచర్యము, తపస్సు, సత్యవచనము, శమము, దమము, అహింస మున్నగు అసంకీర్ణములగు కర్మము లెన్నో విద్యోత్పత్తికి ప్రధానసాధనములయియున్నవి. ధ్యాన, ధారణ, సమాధి లక్షణములగు కర్మలు సైతము విద్యోత్పత్తికి ప్రధానసాధనములు. 'తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ' అని ముమ్మందు ఈయుపనిషత్తునందే చెప్పఁబడఁగలవు. పూర్వజన్మకృత పుణ్యకర్మ (పరిపాక) మువలన గార్హస్థ్యాశ్రమముకంటె ముందే జ్ఞానము కలుగవచ్చును. గార్హస్థ్యాశ్రమము కర్మాచరణార్థమే కావున కర్మసాధ్య మగు జ్ఞానమున్నవానికి గార్హస్థ్యాశ్రమప్రాప్తి నిష్ఫలము.

(మఱియు) పుత్త్రులు (కర్మ) మున్నగునవి లోకార్థము. "సోఽయం మనుష్యలోకః పుత్రేణైవ జయ్యః నాన్యేన కర్మణా కర్మణా పితృలోకః" బృ. ఉ. ౧-౫-౧౬. అనిశ్రుతి. ఇట్టిలోకములనుండి నివృత్తకాముఁడై నిత్యసిద్ధమగు ఆత్మను అనుసంధానముచేసికొనుచు కర్మయందు ప్రయోజనము లేదని తలంచువానికి కర్మలనుండి నివృత్తియే కలుగును,

శ్రు. 'ప్రవ్రజిష్య న్వాఅరేఽహ మస్మాత్ స్థానా దస్మి.' బృ. ఉ. ౪-౫-౨. అనిశ్రుతి ఈవిషయమునే బోధించుచున్నది.

(శ్రుత్యర్థము. అరే = ఓమైత్రేయీ! అహం = నేను, అస్మాత్ = ఈ, స్థానాత్ = గృహస్థాశ్రమమునుండి, ప్రవ్రజిష్యన్ వా = పారివ్రజ్యాశ్రమమును స్వీకరించు అభిప్రాయముగలవాఁడనే, అస్మి = అగుచున్నాఁడను. అని విద్వాంసుఁడగు యాజ్ఞవల్క్యుఁడు మైత్రేయితో చెప్పెను.)

మఱొకసందేహము

అగ్నిహోత్రాదికర్మలను గూర్చి శ్రుతి ప్రయత్నపూర్వకముగ బోధించియున్నది. కర్మాచరణమునం దెంతయో ఆయాసముగలదు. అగ్ని

హోత్రాదికర్మల నాచరించుటకు అనేకసాధనములు ఆవశ్యకములు. బ్రహ్మచర్యము, తపస్సు, అహింస మున్నగు ఇతరాశ్రమధర్మము లనునవి గృహస్థులకును ఒకవిధముగ నుండియే యున్నవి. ఇతరాశ్రమకర్మలకు ఋత్విగాదులును వ్రీహ్యాజ్యాదిద్రవ్యములును అపేక్షలేదు. కావున (బహ్వాయాస సాధ్యమగు) గృహస్థాశ్రమమునకు (అల్పాయాససాధ్యములగు ఇతరాశ్రమములకు) సమానవికల్పము చెప్పుట సరిగాదు.

సమాధానము

అట్లనరాదు. జన్మాంతరకృత సుకృతపరిపాకమువలన (అట్టిజ్ఞానము సిద్ధించును.) కర్మలవిషయమై శ్రుతి అత్యధికప్రయత్నము కలిగియుండుట తప్పుకాదు. జన్మాంతరమునందు చేయఁబడిన అగ్నిహోత్రాదిలక్షణరూప (మగు కర్మపరిపాక)ము బ్రహ్మచర్యాదిలక్షణరూప(మగు కర్మపరిపాక)ము విద్యోత్పత్తికి హేతుభూత మగుచున్నది.

ఏలయనఁగా:—కొందఱు పుట్టుకనుండియే విరక్తికలిగియున్నారు. కొందఱు కర్మల నాచరించుచున్నను విరక్తిలేనివారలయి (మీఁదు మిక్కిలి) జ్ఞానమును ద్వేషించుచున్నారు.

కావున జన్మాంతరకృతపుణ్యకర్మపరిపాకమువలన (ప్రతిబంధకరూపమగు దురితమునశించుటచేత) విరక్తులయినవారలకు (కర్మల నాచరించవలసిన గార్హస్థ్యాశ్రమముకంటె భిన్నమయిన) సన్యాసాశ్రమప్రాప్తియే తగియున్నది.

పుత్ర (ప్రాప్తి), స్వర్గ (ప్రాప్తి), బ్రహ్మవర్చస (ప్రాప్తి) మున్నగు ఫలములు అసంఖ్యాకములగుటచేతను, అట్టిఫలములనుగూర్చి పురుషులకు కోరికలు నైతము మిక్కుటమగుటచేతను అట్టిఫలములను పొందింపఁజేయుటకయి శ్రుతి కర్మలవిషయమై ఎక్కువ ప్రయత్నమునే చేయుట తగియున్నది. అభి

మతఫలముల యసంఖ్యేయత సిద్ధమయి యుండుటచేత "ఇది నాకుకావల యును. ఇది నాకుకావలయును" అని తత్సాధనానుష్ఠానమునైతము గృహ స్థాశ్రమమున నుండియేతీరును. విద్యకు కర్మాచరణము ఉపాయభూతము కావున తప్పక యత్నాతిశయము అవశక్యమే. "ఉపాయమునందు అధిక యత్న మావశ్యకముకాని ఉపేయమునందు గాదు."

మఱొకసందేహము.

జ్ఞానమునకు (పూర్వార్జితదురితరూప ప్రతిబంధకనివృత్తిద్వారా) కర్మాచరణము హేతువగుటచేత యత్నాంతరము వ్యర్థము కావున కర్మా చరణముచేతనే పూర్వజన్మార్జిత దురితరూప ప్రతిబంధనివృత్తివలన జ్ఞాన ముత్పన్నమగును. కర్మలకంటె వేఱుగా ఉపనిషచ్ఛ్రవణమనననిదిధ్యాసనాది కము అనావశ్యకము.

తత్సమాధానము.

అట్లనరాదు. అట్టినియమ మెచ్చటను లేదు. ప్రతిబంధభూతమగు దురితము నశించుటచేతనే జ్ఞానముకలుగును. 'ఈశ్వరానుగ్రహాభూత ఉప నిషచ్ఛ్రవణాదికముచేతను, తదోధ్యానాదికముచేతను జ్ఞానము కలుగదు' అను నియమ మెచ్చటనులేదు. (మఱియు) అహింసా బ్రహ్మచర్యాదికము విద్యకు అంతరంగసాధనభూతమయినను సాక్షాత్కారణ మగుటచేత ఉప నిషచ్ఛ్రవణమనన నిదిధ్యాసాదికము (వైవానికంటె) అత్యావశ్యకమయి యున్నది. కావున (అనఁగా శాస్త్రవిహిత మగుటచేతను బహిరంగసాధన భూతములగు అగ్నిహోత్రాదికముకంటె ఉపనిషచ్ఛ్రవణమననాదికము జ్ఞానమునకు సాక్షాత్సాధన మగుటచేతను అని భావము.) ఆశ్రమాంతర ములు నైతము సిద్ధించుచున్నవి. సర్వాశ్రమములకు బ్రహ్మవిద్యయందు - అధి కారముగలదు.

మోక్షము కేవలజ్ఞానమువల్లనే సిద్ధించును. అనువిషయము సిద్ధాంతితము.

వివరణము:—శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్యులవారు మోక్షము కర్మలచేత సిద్ధించునా? లేక జ్ఞానముచేత సిద్ధించునా? యని ఇచట చాలవఱకు విమర్శించి యున్నారు. కర్మలచేతనా? జ్ఞానసహితకర్మలచేతనా? కర్మజ్ఞానముల రెంటిచేతనా? కర్మసహితజ్ఞానముచేతనా? లేక జ్ఞానముచేతనా? యని ప్రశ్నములు వైచికొని చివరకు జ్ఞానముచేతనే మోక్షము లభించునని నిర్ణయించిరి. వీనిలో ప్రథమద్వితీయపక్షముల గుఱించి పీఠికయందు వివరించియున్నారు. తద్వివరణ మచట వ్రాయఁబడియున్నది. ఇపుడు విద్యాకర్మ సమసముచ్చయమునుగుఱించి వివరింపఁబడుచున్నది:— విద్యయు కర్మయుకలసి అవిద్యను నశింపఁజేయునని పూర్వపక్షిపలుకఁగా అవిద్యానాశనమునకు విద్య యావశ్యకముగాని కర్మమాత్రముకాదు. కర్మయవిద్యానివర్తకముకాదు. కర్మఫలములు, ఉత్పత్తి, సంస్కారము, వికారము, ఆప్తి అనునవి యగుచున్నవికాని అవిద్యానివర్తకముమాత్రము కాదు.

౧. కర్మవలన పురోడాశము మున్నగునవి ఉత్పత్తి యగుచున్నవి.
౨. కర్మవలన వ్రీహి మున్నగునవి సంస్కరింపఁబడుచున్నది.
3. కర్మవలన సోమలతనుండి తద్వికారమగురసము ఏర్పడుచున్నది.
४. కర్మవలన పయస్సు ప్రాప్తమగుచున్నది.
ఇవియే కర్మఫలములు.

పూర్వపక్షము.

సూర్యద్వారముగ నిష్పాపులయి బయలువెడలి పోవుచున్నారు. అని శ్రుతి గలదు. కావున బ్రహ్మముసైతము పైనిచెప్పిన ఉత్పత్త్యాది చతుష్టయములో ఆప్యమగుచున్నది.

సమాధానము

బ్రహ్మము సర్వగతము కావున గంతకంటె యభిన్నముగ నున్నది కావునను ప్రాప్యము కాదు.

పూర్వపక్షము.

ఆయాయుపనిషత్తులందు 'సూర్యద్వారముగా పోవుదురు.' మున్నగు వాక్యములు, స్త్రీలతోడను యానములతోడను కలసియుందురు అను గత్యైశ్వర్యశ్రుతులకు మీరుచెప్పెడి యంశము విరుద్ధముగదా.

సమాధానము

ఆవాక్యములు కార్యబ్రహ్మపరములు. కార్యబ్రహ్మమనఁగా హిరణ్యగర్భుఁడు. సత్యలోకవాసి. సగుణబ్రహ్మోపాసకులగువారలు సత్యలోకస్థ కార్యబ్రహ్మమును పొందెదరని చెప్పినవాక్యముగాని నిర్గుణబ్రహ్మోపాసకులగువారలు పరబ్రహ్మమును పొందెదరని చెప్పెడి వాక్యముమాత్రము కాదు. స్త్రీలు, వాహనములు మున్నగువిషయములు కార్యబ్రహ్మపరముగా సమన్వయమొనర్చిన ఇచట న్యాయముగా నుండునుగాని లేనియెడల యుక్తమని తోఁచవుగదా.

---

౧౨. ద్వాదశోఽనువాకః

మం. ౧శం నో మిత్రశ్శం వరుణః। శం నో భవత్వర్యమా।
శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణురురుక్రమః।

౨నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ
ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మవాది
షమ్! ఋతమవాదిషమ్। సత్యమవాదిషమ్। తన్మా
మావీత్। తద్వక్తారమావీత్। ఆవీన్మామ్। ఆవీద్వక్తా
రమ్। ఓం శాన్తిః శాన్తిః శాన్తిః ॥౨॥

సత్యమవాదిషం పంచచ ॥౧౨॥

టీ. ౧. మిత్రః = మిత్రుఁడు (ప్రాణవృత్తికిని పగటికి అభిమాని యగు దేవత), నః = మాకు, శం = సుఖమును (కలుగఁజేయువాఁడు అగుఁగాక). వరుణః = వరుణుఁడు (అపానవృత్తికిని రాత్రికిని అభిమానియగు దేవత), శం = సుఖమును (కలుగఁజేయువాఁడు అగుఁగాక.) అర్యమా = అర్యముఁడు (సూర్యమండలమునకును నేత్రములకును అభిమానియగుదేవత), నః = మాకు, శం = సుఖమును (కలుగఁజేయువాఁడు), భవతు = అగుఁగాక. ఇంద్రః = ఇంద్రుఁడు (బలాభిమానియగు దేవత), నః = మాకు, శం = సుఖమును (కలుగఁజేయువాఁడు అగుఁగాక). బృహస్పతిః = బృహస్పతి (వాక్కునకును బుద్ధికిని అభిమానియగుదేవత సుఖకరుఁడు అగుఁగాక). ఉరుక్రమః = త్రివిక్రమావతారమునందు విపులమయిన పాదక్రమణముగల, విష్ణుః = విష్ణువు (పాదాభిమానియగుదేవత), నః = మాకు, శం = సుఖమును (కలుగఁజేయువాఁడు).

౨. బ్రహ్మణే = వాయుస్వరూపునికొఱకు, నమః = నమస్కారము. వాయో = ఓవాయూ! తే = నీకొఱకు, నమః = నమస్కారము. త్వం ఏవ = నీవే, ప్రత్యక్షం=ప్రత్యక్షమయిన, బ్రహ్మఅసి=బ్రహ్మము అగుచున్నాఁడవు. త్వాం ఏవ=నిన్నే, ప్రత్యక్షం=ప్రత్యక్షముగ, బ్రహ్మ=బ్రహ్మము అని,

ఆవాదిషం = పలికితిని, ఋతం = ఋతముగా (మనఃపూర్వకముగా), ఆవాదిషం = పలికితిని. సత్యం = సత్యముగా, ఆవాదిషం=పలికితిని. తత్ = అందువలన, మాం = నన్ను, ఆవీత్=రక్షించెను. వక్తారం = వక్తయగు ఆచార్యుని, ఆవీత్ = రక్షించెను. మాం = నన్ను, ఆవీత్ = రక్షించెను. వక్తారం=వక్తయగు ఆచార్యుని, ఆవీత్ = రక్షించెను. ఓంశాంతిః శాంతిః శాంతిః = ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపత్రయము ఉపశమించుఁగాక.

తా. ప్రథమానువాకమునందు విపులముగ తాత్పర్యము వ్రాయఁబడియున్నది. అచట చూడఁవలయును. అచట లేనివిశేషముల నిచట సంగ్రహముగ తెలిపెదము.

"త్వామేవప్రత్యక్షం బ్రహ్మవదిష్యామి" అని భవిష్యదర్థకమగు "వదిష్యామి" అను లకారము ప్రథమానువాకమునం దుండఁగా నిచట "త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మావాదిషమ్" అని అందులకు భిన్నముగ భూతకాలికములగు లకారములే ఇచట శాంతియందు చెప్పఁబడియున్నవి. దీనివలన ఇచట తాత్పర్య మీవిధముగా నగును:—

ఓ బ్రహ్మస్వరూపుఁడవగు వాయూ! నిన్నే నేను ప్రత్యక్షబ్రహ్మము అనితలంచి కొనియాడితిని. (నాస్తోత్రముచేత సంతుష్టుఁడవైన నీవు) నన్ను నాయాచార్యుని సంరక్షించితివి అని తనకు బ్రహ్మవిద్యాసమయమునందు విఘ్నములు కలుగకుండఁ జేసినందులకు కృతజ్ఞతాపూర్వకముగ పరమేశ్వరుని పరామర్శము నిచట ముముక్షువు చేయుచున్నాఁడని భావించునది.

ప్రథమానువాకమునకు టీకయు, తాత్పర్యమును వ్రాయునపుడు కొన్నివిషయములను వివరించియున్నాఁడను. కావున అచ్చటనే వివరమును గూర్చి చూడవలయును.

౧. అను...

౨. ఆత్మ...

3. భా. వా... ౧౮౪ - ౧౮౬.

శ్రీమదాచార్యులవారు ఈశాంతిపాఠమును అనుసరించియే ముందు చెప్పఁబోవునట్టి, "సహనావవతు" అనుశాంతిమంత్రమును పఠించి వెంటనే భాష్యమును లిఖించియున్నారు. ఆంధ్రసంప్రదాయపాఠమునందు అట్టి పాఠము లేకపోవుటచేత నేను ఇచట "సహనావవతు" అనెడి శాంతిపాఠమును లిఖించి తద్వివరణమును ముద్రించలేదు. బ్రహ్మవల్లియొక్క ఆరంభమునందు ఆశాంతిమంత్రమును పఠించి తద్వివరణము వివరింపఁగలను.

ఉత్తరశాంతిపాఠము.

మం. శం నో మిత్ర శ్శం వరుణః। శం నో భవత్వర్యమా। శం న ఇంద్రో బృహస్పతిః। శం నో విష్ణు రురుక్రమః। నమో బ్రహ్మణే। నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి। త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మావాదిషమ్। ఋతమవాదిషమ్। సత్యమవాదిషమ్। తన్మామావీత్। తద్వక్తారమావీత్। ఆవీన్మామ్। ఆవీద్వక్తారమ్॥ ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః॥

(శంన శ్శీక్షాగ్ం సహ నౌ యశ్ఛన్దసాం భూ స్సయః పృథివ్యామిత్యృతం చాహం వేదమనూచ్య శంనో ద్వాదశ.

శం నో మహా ఇత్యాదితో నో ఇతరాణి త్రయో-
విగంశతిః ॥

*ద్రావిడాస్తుశిక్షావల్ల్యానన్దవల్లీ భృగువల్లీ త్రయస్యైక
ప్రపాఠకత్వమఙ్గీకృత్య "సత్యమవాదిషం పఞ్చ చ"
ఇత్యుత్తరం "సహ నావవతు" ఇత్యాద్యేవ పఠన్తి ॥

హరిః ఓం శ్రీకృష్ణార్పణమస్తు.

సమాప్తా చేయం శిక్షావల్లీ

శ్రీరస్తు

తైత్తిరీయోపనిషత్

౨. బ్రహ్మవల్లీ—ఆనందవల్లీ

ఆంధ్రటీకాతాత్పర్యసమన్వితము

శాంతిపాఠః

హరిః ఓమ్

మం. సహ నా వవతు । సహ నౌ భునక్తు । సహవీర్యం కరవావహై । తేజస్వి నా వధీత మస్తు మా విద్విషావహై । ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః ।

టీక. నౌ = (శిష్యాచార్యులమగు) మమ్ములనిద్దఱను, సహ = కూడా, అవతు = (బ్రహ్మము) సంరక్షించుఁగాక. నౌ = (శిష్యాచార్యులమగు) మమ్ముల నిద్దఱను, సహ = కూడా, భునక్తు = (బ్రహ్మము) పరిపాలించుఁగాక. వీర్యం = విద్యానిమిత్తమగు సామర్థ్యమును, సహ = కూడా, కరవావహై = (మేము) చేసెదము గాక. నౌ = మాయొక్క, అధీతం = అధ్యయనము చేయఁబడి

ఉపనిషద్విద్య, తేజస్వి = తేజోవంతమయినది, అస్తు = అగుఁగాక. మావి ద్విషావహై = (ప్రమాదకృతాపరాధాదికమువలన మాయిద్దఱకు) ద్వేషము కలుగకుండుఁగాక. ఓం శాంతి శాంతిః శాంతిః = ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక తాపత్రయశాంతి కలుగుఁగాక.

తా. శిష్యాచార్యులమగు మమ్ముల నిద్దఱను పరబ్రహ్మము సంరక్షించుఁ గాక. మమ్ములనిద్దఱను పరబ్రహ్మము పరిపాలించుఁగాక. మేమిద్దఱమును విద్యాసంబంధమగు సామర్థ్యమును కలిగియుందుముగాక. శిష్యాచార్యులమగు మాచేత అధ్యయనము చేయఁబడినది అర్థజ్ఞానయోగ్యమగుఁగాక. మేమిద్ద ఱము పరస్పరము ద్వేషములేక యుందుముగాక. విద్యాగ్రహణసమయము నందు శిష్యునకు ఆచార్యునకు ప్రమాదముచేత సంభవించునట్టి అపరాధము వలన ద్వేషముకలిగిన అట్టి ద్వేషము పోవుఁగాక యని 'మావిద్విషావహై' అని చెప్పఁబడినది. మేమిద్దఱమును పరస్పరము ద్వేషములేక యుందుము గాక. శాంతిశబ్దము ముమ్మారు పఠింపఁబడినది కావున ఆధ్యాత్మిక, అధి భౌతిక, అధిదైవిక తాపత్రయము శాంతించుఁగాక యని భావము.

ఈశాంతి చెప్పఁబోవునట్టి నిర్గుణబ్రహ్మవిద్యోపదేశసమయమునందు విఘ్నములు కలుగకుండుటకయి చెప్పఁబడినది. ఆత్మవిద్యాప్రాప్తివలననే నిర తిశయమగు మోక్షము లభించుచున్నది. కావున అట్టి బ్రహ్మవిద్య నిర్విఘ్న ముగ లభించునిమిత్తమయి ఈశాంతిపాఠము పఠింపఁబడినది.

వివరణము:—'సహ నౌ భునక్తు భోజయతు' అని భాష్యమునం దుం డుటచేతను, వ్యాఖ్యాతలు 'పాలయిత్వావ్యర్థః' అని వ్రాయుటచేతను "పరి పాలించుఁగాక" అని వ్రాయఁబడినది. "గురువేవిధముగా ఆలస్యములేక ఉపదేశించునో, ఆయుపదేశించిన విషయమును నేను అజ్ఞానముచేత గ్రహింపలేకపోవుటగాని, లేక విపరీతజ్ఞానముచేత వేఱుగాగాని గ్రహింపక

చక్కఁగా గ్రహించునట్లుచేసి మమ్ములను పరిపాలించుఁగాక." అని వ్యాఖ్యాత వివరించియున్నాఁడు.

వీర్యమనఁగా విద్యానిమిత్తమయిన సామర్థ్యము అనఁగా ఊహాపోహాదికము, విషయపరిగ్రహణపాటవము మున్నగునవి యని గ్రహించునది.

---

౧. ప్రథమోఽనువాకః

బ్రహ్మసూత్రం, అనువ్యాఖ్యానం, లక్షణాదికంచ.

మం. బ్రహ్మవిదాప్నోతి పరమ్ । తదేషాఽభ్యుక్తా । సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్ । సో ఽశ్నుతే సర్వా న్కామా న్త్సహ । బ్రహ్మణా విపశ్చితేతి । తస్మా ద్వా ఏతస్మా దాత్మన ఆకాశ స్సంభూతః ఆకాశా ద్వాయుః । వాయో రగ్నిః । అగ్నే రాపః । అద్భ్యః పృథివీ । పృథివ్యా ఓషధయః । ఓషధీభ్యో ఽన్నమ్ । అన్నా త్పురుషః । స వా ఏష పురుషో ఽన్నరసమయః । తస్యేద మేవ శిరః । అయం దక్షిణః పక్షః ।

అయ ముత్తరః పక్షః అయ మాత్మా ఇదం పుచ్ఛం
ప్రతిష్ఠా తదప్యేష శ్లోకో భవతి ।౧।

టీక. బ్రహ్మవిత్ = బ్రహ్మవేత్త, పరం = మోక్షమును, ఆప్నోతి = పొందుచున్నాఁడు. తత్ = ఆవిషయమునుగూర్చి, ఏషా = ఈచెప్పఁబోవు నట్టి మంత్రము, అభ్యుక్తా=చెప్పఁబడినది. బ్రహ్మ = బ్రహ్మము, సత్యం = సత్యమనియు, జ్ఞానం = జ్ఞానమనియు, అనన్తం = అనంతమనియు (చెప్పఁబడును.) యః=ఎవ్వఁడు, గుహాయాం=బుద్ధిగుహయందు, (గల) పరమేవ్యోమన్=శ్రేష్ఠమయిన హృదయాకాశమునందు, నిహితం=ఉన్నట్టి (ఆత్మను) వేద=ఎఱుంగునో, సః=వాఁడు, సర్వాన్ కామాన్ = సకలమనోరథములను, విపశ్చితా బ్రహ్మణా=బ్రహ్మవిదాత్మస్వరూపముతో, సహ అశ్నుతే=ఒక్కపర్యాయమే అనుభవించుచున్నాఁడు. ఇతి=ఈమంత్రము సమాప్తమయినది.

తస్మాత్=ఆ, ఏతస్మాత్=ఈ, ఆత్మనః=బ్రహ్మమువల్లనుండి, ఆకాశః=ఆకాశము, సంభూతః = పుట్టెను, ఆకాశాత్ = ఆకాశమువల్లనుండి, వాయుః=వాయువు (పుట్టెను) వాయోః=వాయువువల్లనుండి, అగ్నిః=అగ్ని (పుట్టెను). అగ్నేః=అగ్నివల్లనుండి, ఆపః=జలములు (పుట్టెను). అద్భ్యః = జలములవల్లనుండి, పృథివీ=భూమి (పుట్టెను). పృథివ్యాః=భూమివల్లనుండి, ఓషధయః = ఓషధులు (పుట్టెను). ఓషధీభ్యః = ఓషధులవల్లనుండి, అన్నం= అన్నము (పుట్టెను). అన్నాత్ = అన్నమువల్లనుండి, పురుషః = పురుషుఁడు (పుట్టెను). సః=ఆ, ఏషః=ఈ, పురుషః = పురుషుఁడు, అన్నరసమయః= అన్నరసవికారము గలవాఁడు. తస్య = ఆపురుషునకు, ఇదంఏవశిరః = ఈ శిరస్సే శిరస్సు, అయం దక్షిణః పక్షః = ఈకుడిచెయ్యి, దక్షిణపక్షము, అయం ఉత్తరః పక్షః = ఈఎడమచెయ్యి, ఉత్తరపక్షము, అయం = ఈ మధ్యభాగము, ఆత్మా=ఆత్మ, ఇదం=ఈ, పుచ్ఛం = నాభికి దిగువభాగము,

ప్రతిష్ఠా = ప్రతిష్ఠ, తదపి = ఆవిషయమునుగూర్చి, ఏష శ్లోకః = ఈచెప్పఁబోవుశ్లోకము - మంత్రము, భవతి = అగుచున్నది.

తా. శిక్షాప్రశ్నమునందు కర్మలకు విరుద్ధములు కానట్టియు, జ్ఞానసాధనములును అగు సంహితాద్యుపాసనములు క్రమమున చెప్పఁబడినవి. తరువాత వ్యాహృత్యాద్యుపాసనలచేత మోక్షమే ఫలముగాఁగల సోపాధికాత్మదర్శనము బోధింపఁబడినది. ఇట్టి సోపాధికాత్మదర్శనముచేత సంసారబీజమగు అవిద్యనిశ్శేషముగ నశింపఁజాలదు కావున సకలోపద్రవములకు బీజభూతమగు అజ్ఞానము నశించుట కొఱకు నిరుపాధికాత్మ ప్రదర్శనరూపమగు "బ్రహ్మవిదాప్నోతి పరం" మున్నగు మంత్రసముదాయముగల "ఆనందవల్లి లేక బ్రహ్మవల్లి" యను అధ్యాయము ప్రారంభింపఁబడు చున్నది.

బ్రహ్మవిద్యాప్రయోజనము అవిద్యానివృత్తియే, కావున ఈఅధ్యాయప్రతిపాదితమగు బ్రహ్మవిద్యకు కూడ ప్రయోజనము అవిద్యానివృత్తియే. అవిద్యానివృత్తిచేతనే జననమరణరూపమగు సంసారము నిశ్శేషముగ నశించును. ఈవిషయమే ముందు:—

విద్వాన్ నబిభేతి కుతశ్చన (తై. బ్రహ్మవల్లి: అను ౯.) అని ఈ యుపనిషత్తునందే చెప్పఁబడఁగలదు. జననమరణరూప సంసారమునకు నిమిత్తమగు అవిద్య నిశ్శేషముగ నశింపనియెడల ఈయుపనిషత్తునందు చెప్పఁబడిన "అభయం ప్రతిష్ఠాం విందతే." (తై. బ్రహ్మ. అను. ౭.) కృతాకృతే పుణ్యపాపే న తపతః (బ్రహ్మ. అ. ౯.) అనువచనములకు సార్థకత్వము లేదు. కావునసర్వాత్మబ్రహ్మ విషయకమగు నిరుపాధిక బ్రహ్మాత్మ విజ్ఞానము వలనఆత్యంతిక మగు అవిద్యానివృత్తి కలుగును. ఈవిషయముఉపనిషత్తుయొక్క ప్రారంభమునందే "బ్రహ్మవిదాప్నోతి పరమ్" అని నిరుపాధికాత్మ విజ్ఞానప్రయోజనము చెప్పఁబడినది. ఉపనిషత్ప్రారంభమునందే "బ్రహ్మవేత్త

మోక్షము పొందును" అను అర్థముగల 'బ్రహ్మవిదాప్నోతి పరం' అను వాక్యము చెప్పుటచేత ఆదియందే విద్యాసంబంధప్రయోజనము లివియని తెలుపఁబడినవి. బ్రహ్మ విద్యయొక్క సంబంధ ప్రయోజనము లివియని తెలిసినయెడల ముముక్షువులు బ్రహ్మవిద్యాశ్రవణ గ్రహణధారణాభ్యాసార్థము ప్రవర్తింతురు.

శ్రు. శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః (బృహ. ఉ. ౨: ४. ౫)

అను శ్రుతియు బ్రహ్మవిద్య శ్రవణమనననిదిధ్యాసాభ్యాసాదికము చేత పొందఁదగినదని ప్రతిపాదించుచున్నది.

బ్రహ్మమన నేమియో ముందు చెప్పఁబడును. బ్రహ్మమన మిక్కిలి వృద్ధిగలది, అట్టి బ్రహ్మము నెఱింగినవాఁడగు బ్రహ్మవిదుఁడు నిరతిశయమును పరమును అగు బ్రహ్మమును పొందును. బ్రహ్మమే ఇచట "పర" మని చెప్పఁబడినది. ఒకదానిని తెలిసికొనిన యింకొకదానిని పొందునని చెప్పుట యుక్తమే కాదు కావున ఇచట పరమనఁగా బ్రహ్మమే, బ్రహ్మవేత్తకు బ్రహ్మప్రాప్తియే కలుగుననుటకు శ్రుతిప్రమాణము:—

"స యో హ వై తత్పరమం బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి"

(ముండకోపనిషత్తు. 3. ౨. ౯.)

(ఎవఁడు నిరతిశయబ్రహ్మము నెఱుంగునో వాఁడు బ్రహ్మమే తానగుచున్నాఁడని యర్థము.)

పూర్వపక్షము

బ్రహ్మము సర్వాత్మభూతమని ముందుఁ జెప్పఁబోవుచున్నారుగదా. అంతట నిండియున్న బ్రహ్మమును పొందుటయనునది సంభవింపదుగదా. లోకమునందు పరిచ్ఛిన్నమును భిన్నమును అగు వస్తువును పొందుచుండుట అనుభవసిద్ధముకదా. కావున అపరిచ్ఛిన్నమును సర్వాత్మకమును అగు బ్రహ్మమును పొందునని చెప్పుట అసంగతము.

సమాధానము

బ్రహ్మమును పొందుచున్నాఁడని చెప్పుటయందు దోషమేమియు లేదు. పొందుట యనునది యిట ఔపచారికముగాని పారమార్థికము కాదు. ఎట్లనఁగా ఇచట పొందుట పొందకపోవుటయనునవి తెలిసికొనుట, తెలిసికొనకపోవుట, యను నర్థమునందు ప్రయుక్తములయి యున్నవి. జీవుఁడనుకొను తాను వాస్తవముగ బ్రహ్మస్వరూపుఁ డయినప్పటికిన్ని, పంచీకృతములును, అపంచీకృతములును అగు భూతాంశములచేత చేయఁబడినట్టియు, బాహ్యములయినట్టియు, అన్నమయాదికోశములనే ఆత్మనుగా భావించి తదాసక్తచిత్తుఁడగువానికి "తనకంటె బాహ్యులయిన—వేఱయిన వారిని. లెక్కించుటయందే ఆసక్తిగల చిత్తముగలవాఁడగుటచేత ప్రకృతసంఖ్యాపూరకుఁడగు—దశమ సంఖ్యాపూరకుఁడగు తాను అచ్చటనే ఉన్నప్పటికిన్ని ౧౦-వ వాఁడు లేదని ఎటుల దుఃఖించుచున్నాఁడో" అట్లే పరమార్థమయిన బ్రహ్మస్వరూపమును తెలిసికొనఁజాలకపోవుటయే లక్షణముగాఁగల యవిద్యచేత అనాత్మలగు అన్నమయాది కోశములను ఆత్మనుగా తలంచుటచేత అన్నమయాదికోశములకంటె తాను వేఱని తలంచుటలేదు, అవిద్యచేత యీవిదముగా బ్రహ్మము ఆత్మభూతము—తానే అయినప్పటికిన్ని పొందఁబడనిది యగుచున్నది. అవిద్యచేత బ్రహ్మస్వరూపమును పొందనివానికి అజ్ఞానముచేత ౧౦-వ వాఁడగు తాను లేనటుల దుఃఖించుచున్నవానికి ఒకానొకని యొక్క యథార్థోపదేశముచేత తానే ౧౦-వ వాఁడని తెలిసికొనుట పొందుట యెట్లగుచున్నదో, అట్లే శ్రుత్యుపదిష్టమయిన సర్వాత్మబ్రహ్మము తానే యని యెఱుఁగుటయే యిట విద్యచేత పొందఁబడినదని గ్రహించునది.

ఈ ఆనందవల్లి కంతయు "బ్రహ్మవిదాప్నోతిపరం" అనునది సూత్రభూతమగు సారాంశము. "బ్రహ్మవిదాప్నోతిపరం" అను వాక్యముచేత బ్రహ్మమనునది ఒకటిగలదనియు, అది తెలిసికొనఁదగినదనియు, సూత్రప్రాయ-

ముగ చెప్పఁబడినది. కాని ఆబ్రహ్మ మిట్టిస్వరూపముగలదని (ఇదివఱకు) తెలుపఁబడియుండలేదు. కనుక అట్టి బ్రహ్మముయొక్క లక్షణమిట్టిదనిచెప్పి బ్రహ్మస్వరూపనిర్ధారణకొఱకును, ముందుముందు చెప్పఁబోవు లక్షణముగల బ్రహ్మమిట్టిదని తెలిసినపిదప ఆబ్రహ్మము ప్రత్యగాత్మయేగాని తద్భిన్నము గాదని తెలిసికొనుటకొఱకును, బ్రహ్మవేత్తయగు వానికి బ్రహ్మవిద్యవలన లభించునట్టిఫలము పరమాప్తిలక్షణరూపమేయని ఎయ్యది చెప్పఁబడినదో అట్టి సర్వాత్మభావమనునది సర్వసంసారాతీతమగు బ్రహ్మస్వరూపభావమే గాని అన్యముగాదని చెప్పుటకొఱకును, ఈచెప్పఁబోవు "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ.....బ్రహ్మణావిపశ్చితేతి"యను మంత్రము సమామ్నాతమయినది—చెప్పఁబడినది.

బ్రహ్మముయొక్క లక్షణము

"సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అనువాక్యము 'బ్రహ్మవిదాప్నోతి పరం' అనువాక్యమునందు ప్రథమమునఁగల 'బ్రహ్మ' మనుపదమున కర్థమిదియని చెప్పెడి లక్షణవాక్యము, సత్యము, జ్ఞానము, అనంతము, అను మూడు పదములు తెలిసికొనఁదగినదిగా చెప్పఁబడిన విశేష్యమగు బ్రహ్మమునకు విశేషణపదములు; కాఁబట్టియే 'సత్యం, జ్ఞానం, అనంతం' అని పదములన్నియు ఒకేవిభక్తికలిగి సమానాధికరణములయి యున్నవి. 'సత్య, జ్ఞాన, అనంతములను మూఁడువిశేషణములచేత చెప్పఁబడుచున్న బ్రహ్మము తదితరవిశేష్యములనుండి వేఱుచేయఁబడినది అగుచున్నది. 'నీలం మహత్ సుగంధి ఉత్పలం, (=నల్లగ ఉన్నట్టియు, పరిమళముగలట్టియు పెద్దకలువ) అని చెప్పినయెడల తద్భిన్నములయిన సకలవిశేష్యములకంటె వేఱుగ చెప్పఁబడినది యగుచున్నదిగదా.

వ్యతిరేకపూర్వపక్షము

లోకమునందు ఒక్కజాతికి సంబంధించిన ద్రవ్యములు అనేకవిశేషణములకు తగినవి యున్నప్పుడు వ్యతిరేకవిశేషణమును నిరసించుటకయి విశేషణము సార్థకమగుచున్నది.

ఉదాహరణము:—నీలోత్పలము అని చెప్పినయెడల రక్తోత్పలము కాదు అను విషయమును తెలుపును కావున 'నీల' మను విశేషణము సార్థకమగుచున్నది. కాని ఒకేవస్తువునందు వ్యతిరేకవిశేషణమే సంబంధించజాలదు. "అసౌ ఏక ఆదిత్యః" అని చెప్పినయెడల వ్యతిరేకసూర్యుడు లేడు. కావున ఆవిశేషణమెటుల సార్థకముగాదో ఆదేవిధముగ నీలోత్పల రక్తోత్పలములవలె గాక బ్రహ్మమొక్కటేగాని అనేకబ్రహ్మములు లోకమున లేవు గావున బ్రహ్మమునకు విశేషణములు చెప్పుట నిరర్థకము.

సమాధానము

మీరు చెప్పినది సరికాదు. ఏలయందురా? ఈవిశేషణములు లక్షణార్థమే ప్రధానముగాఁ గలవిగాని విశేషణప్రధానము గలవిగావు. లక్షణమునకు విశేషణమునకు భేదముగలదు. లక్షణలక్ష్యములకును విశేషణవిశేష్యమునకుఁ గలభేద మేమనఁగా?

విశేషణము:—సమానజాతీయములగు విశేష్యములకంటె విశేష్యము భిన్నమయినదని తెలుపుటచేత విశేషణము సార్థకమగుచున్నది. ఉదా.—ఎఱ్ఱగలువ. కలువయను సమానజాతియందుఁగల నల్లగలువ కంటె భిన్నమయినదను విషయమును "ఎఱ్ఱ" యను విశేషణము తెలుపుచున్నది.

లక్షణము:—దీనికంటె భిన్నములగు అన్నిటికంటె భేదమును తెలుపునది యగుచున్నది.

ఉదాహరణము:— ఆకాశము అవకాశముగలది. అట్లనుటచేత అవకాశవత్త్వమె భూజలాగ్నివాయువులకంటె విలక్షణమయినదని సిద్ధించుచున్నది.

ఈ సత్య, జ్ఞాన, అనంత, శబ్దములు పరస్పరము విశేషణవిశేష్యభావము గలవికావు. తెలిసికొనఁదగినదని చెప్పఁబడిన బ్రహ్మమునకు విశేషణభూతములు కావున సత్యం, జ్ఞానం, అనంతం, అను ఒక్కొకశబ్దము పరస్పరసంబంధము లేక బ్రహ్మశబ్దమునకే సంబంధము గలిగియున్నది. అనఁగా సత్యం బ్రహ్మ, జ్ఞానం బ్రహ్మ, అనంతం బ్రహ్మ, అని; ఏది ఏరూపముచేత నిశ్చితమయి తర్వాత తద్రూపమునుండి వేఱుబాటును పొందదో అది సత్యము, ఎయ్యది ఒకరూపముచేత నిశ్చితమయి తర్వాత తద్రూపమును వదలుచున్నదో అది అనృతమనియు నిశ్చయింపఁబడియున్నది. కావున వికారము అనృతము, వాచాఽఽరంభణం వికారో నామధేయం, మృత్తికేత్యేవ సత్యం" (ఛాందో. ౬. ౧. ౪) అను శ్రుతి ప్రమాణానుసారము సత్తే సత్యమయినదని నిర్ణీతము కావున 'సత్యం బ్రహ్మ' యని బ్రహ్మము వికారమునుండి వారించుచున్నది. కావున బ్రహ్మము సర్వమునకు కారణభూతమగుచున్నది. కారణమని చెప్పినప్పుడు కారకత్వమగుచున్నది. ఎప్పుడు కారకత్వమగుచున్నదో అప్పుడు మృత్తికవలె అచిద్రూపత్వము కావలసివచ్చుచున్నది. తన్నిరాసార్థము 'జ్ఞానం బ్రహ్మ' అని చెప్పఁబడినది. జ్ఞానమనఁగా ఇచట జ్ఞప్తి-అవబోధము ఇచ్చటి జ్ఞానశబ్దము భావసాధనముగాని జ్ఞానకర్తృకము గాదు. సత్య, అనంతశబ్దములు ఎట్లు బ్రహ్మవిశేషణములో, అట్లే యీ జ్ఞానశబ్దమున్ను బ్రహ్మమునకు విశేషణమగుచున్నది. జ్ఞానకర్తృకమయినయెడల సత్యత్వ, అనంతత్వములు ఉపపన్నము కాఁజాలవు; ఎప్పుడు జ్ఞానకర్తృత్వమగునో అప్పుడు వికారించును కావున వికారించునది సత్యమున్ను అనంత్యమున్ను ఎన్నటికిన్నీ కాఁజాలదు. ఎయ్యది దేనివల్లనుండియు విభజించుటకు వీలు

కాదో అయ్యది అనంతమని చెప్పఁబడును. జ్ఞానకర్తృత్వమయినయెడల జ్ఞేయ జ్ఞానములతో ప్రవిభక్తమయి తీరవలయును. అట్టి ప్రవిభక్తమగునది అనంత మెన్నటికిని కాఁజాలదు. "యత్ర........నాన్యద్విజానాతి సభూమా, అథ...యత్ర...అన్యద్విజానాతి తదల్పం (ఛాందో. ౭. ౨. ౪. ౧.) అను శ్రుతియుం వైయర్థమునే ప్రతిపాదించుచున్నది.

'నాన్యద్విజానాతి' అను శ్రుతి విశేషమును ప్రతిషేధించుటచేత ఆత్మను తెలిసికొనునది అని చెప్పుట యుక్తముకావచ్చునుగదా యనునెడల అట్లనరాదు. "యత్ర నాన్యద్విజానాతి స భూమా" అను శ్రుతివాక్యము 'భూమలక్షణ విధిపరమయియున్నది. 'యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి సభూమా' ఎచ్చట మఱొకదానిని చూడదో మఱొక దానిని వినదో మఱొకదానిని తెలిసికొనదో అదిభూమ) అనునది భూమ లక్షణము. ఒకఁడు మఱొకదానిని చూచుట లోకప్రసిద్ధము, లోకప్రసిద్ధ మయిన ఈ భేదమును అనువదించుచు అట్టి విషయము ఏవస్తువునకు లేదో అది భూమయని భూమస్వరూపము తెలుపఁబడినది. అన్యగ్రహణము ప్రాప్త ప్రతిషేధార్థమేగాని ఆత్మయందు క్రియాస్తిత్వపరముగాదు. భూమలక్షణ వాక్యమునందు ఆత్మయందుభేదము లేదు కావున విజ్ఞానమునకు అనుపపత్తి యగుచున్నది. (బ్రహ్మము జ్ఞానకర్మకమయినయెడల వచ్చునట్టి విరోధమేమం దువా!) ఆత్మవిజ్ఞేయము—తెలిసికొనఁదగినది అయినయెడల జ్ఞాతలేక పోవును గదా.

ఒక ఆత్మయే జ్ఞేయుఁడును, జ్ఞాతయు అని ద్వివిధముగా నుండ వచ్చును (అసలీమతము భాట్టమతమువారిది. వారు ఆత్మ చిజ్జడ రూపాంశ ములు గలవాఁడనియు, చిదంశచేత జ్ఞాతగను జడాంశచేతజ్ఞేయముగను ఉండ వచ్చును అనియుందురు. అనునెడల అది అసంగతము. విభాగములేకపోవుట చేత అట్టిస్థితి సంభవించజాలదు. అవయవవిహీనమయినది ఒకసారిజ్ఞేయము

గను జ్ఞాతగను ఉండఁజాలదు. ఆత్మఘటాదికమువలె తెలిసికొనఁదగినయెడల జ్ఞానోపదేశము సార్థకము కాఁజాలదు. జ్ఞాతృత్వము నంగీకరించినయెడల, అనంతత్వము ఉపపన్నము కాదు. జ్ఞానకర్తృత్వాదివిశేషణముగలది సన్మాత్రముకాజాలదు. తత్సత్యం (తై. ఉ. ౨. ౬. ౮. ౭.) అను శ్రుతి సన్మాత్రమే సత్యమని చెప్పుచున్నది. ఇచట గల జ్ఞానశబ్దము సత్య, అనంత' శబ్దములతో చేర్చి ప్రయోగింపఁబడుటచేత యీ జ్ఞానశబ్దము 'భావసాధనము, 'జ్ఞానం బ్రహ్మ' అను ప్రయోగమిచట కర్తృత్వాదికారకనివృత్త్యర్థము మృదాదికమువలె జడరూపనివారణార్థము ప్రయుక్తమయినది.

'జ్ఞానం బ్రహ్మ' యని ఇచట చెప్పఁబడినది. లౌకికజ్ఞానము అంతవత్తు అగుటవలన జ్ఞానశబ్దవాచ్యమగు బ్రహ్మముకూడ అంతవత్తేయని సిద్ధించుచుండఁగా తన్నిరాసార్థము 'అనంతం' అని చెప్పఁబడినది.

పూర్వపక్షము

సత్యాదిశబ్దములు, అనృతనివృత్తిపరములుగాఁ గనఁబడుచుండుటచేతను విశేష్యమగు బ్రహ్మము ఉత్పలాదికమువలె ప్రసిద్ధమయినది గాకపోవుట చేతను.

శ్లో. మృగతృష్ణాంభసి స్నాతః ఖపుష్పకృతశేఖరః,
ఏష వంధ్యాసుతో యాతి శశశృంగధనుర్ధరః.

అను ప్రమాణమువలె సత్యాదిశబ్దములు శూన్యార్థప్రతిపాదకములే కావలసివచ్చుచున్నవి.

సమాధానము

అట్లనరాదు. ఇచట చెప్పఁబడిన సత్య, జ్ఞాన, అనంతశబ్దములు లక్షణార్థకములు. సత్యాదిశబ్దములు విశేషణములయినప్పటికిన్ని లక్షణార్థప్రధానములని యిదివఱకే చెప్పియున్నారము. లక్ష్యము శూన్యమగునెడల

లక్షణప్రవచనము నిరర్థకమగునుగదా. సత్యాదిశబ్దములు లక్షణార్థప్రధాన పరములగుటచేత శూన్యార్థప్రతిపాదకములనుట పొసగదు, సత్యాదిశబ్దములు విశేషణార్థపరములయినప్పటికిన్ని స్వార్థపరిత్యాగమిటలేదు. సత్యాదిశబ్దములు శూన్యార్థ ప్రతిపాదకము లగునెడల విశేష్యమునందు నియంతృత్వమును పొందఁజాలవు. సత్యాదిపదములు శూన్యార్థప్రతిపాదకములుగాక అర్థవత్త్వములగునెడల తద్విపరీతధర్మములుగల విశేష్యములనుండి విశేష్యమయిన బ్రహ్మమునకు నియంతృత్వ ముపపన్న మగుచున్నది. బ్రహ్మశబ్దముకూడ స్వార్థముచేత ఇచట సార్థకమగుచున్నది.(అనఁగా బ్రహ్మము 'బృహబృంహి వృద్ధౌ" అను ధాతువువల్లనుండి పుట్టినది కావున నిరతిశయమహత్త్వధర్మసంపన్నమయినది అను అర్థముగలది యగుచున్నది) అనంతశబ్దము అంతవత్త్వమును ప్రతిషేధించుచు బ్రహ్మమునకు విశేషమగుచున్నది. సత్యజ్ఞానశబ్దములు స్వార్థసమర్పణముగ విశేణములగుచున్నవి.

'తస్మాద్వా ఏతస్మా దాత్మనః' (తై. ఉ. ౨. ౧.) అని మున్ముందు బ్రహ్మమునకు ఆత్మశబ్దమును ప్రయోగించి యుండుటచేత వేదితయొక్క ఆత్మయే బ్రహ్మము. 'ఏతమానందమయ మాత్మాన ముపసంక్రామతి' అని ఆత్మత్వమును శ్రుతియే గనంబఱుచుచున్నది. (తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్. (తై. ఉ. ౨-౬) ఆయాత్మయే జీవరూపముతో శరీరమును ప్రవేశించినటుల శ్రుతి ప్రతిపాదించుచున్నది. కనుక వేదితయొక్క స్వరూపమే బ్రహ్మము.

పూర్వపక్షము

బ్రహ్మమన్నను ఆత్మయన్నను ఒక్కటియేయగునెడల అనఁగా బ్రహ్మము ఆత్మయగునెడల జ్ఞానమునకు కర్తృత్వము వచ్చి తీరును. ఆత్మజ్ఞాతయనుట సుప్రసిద్ధముగదా. 'సోఽకామయత' (తై. ఉ. ౨. ౬. బృహ. ౧. ౨. ౪.) యను శ్రుతి ఆత్మ కామించినటుల తెలుపుచున్నది. కామి యనఁగా జ్ఞానకర్త యని ప్రసిద్ధము. జ్ఞానకర్తృత్వమగుటవలన జ్ఞప్తిబ్రహ్మమనుటకుపపన్నమ

గాదు. మఱియు అనిత్యముకూడ అగుచున్నది. ఒకవేళ జ్ఞప్తి - జ్ఞానము భావరూపత్వమును బ్రహ్మమున కంగీకరించునెడల అప్పటికిన్ని అనిత్యత్వము పోఁజాలదు. పారతంత్ర్యమునుకూడ బ్రహ్మమునకు అంగీకరించితీరవలయును.

సమాధానము.

అట్లనరాదు. ఆత్మస్వరూపముకంటె వేఱుగాని జ్ఞప్తియందు కార్యత్వము ఔపచారికముగాని వాస్తవముకాదు. ఆత్మయొక్క స్వరూపమగు జ్ఞప్తి ఆత్మకంటె భిన్నమనుటకు ప్రమాణములేదుకావున నిత్యమేయగుచున్నది. అయినప్పటికిన్ని ప్రత్యగాత్మోపాధిభూతమయినట్టియు, చక్షురాదిద్వారములచేత విషయాకారముగ పరిణమించినట్టి బుద్ధియొక్క విషయభూతములయిన యేశబ్దాద్యాకారావభాసములు పుట్టుచున్నవో, అవి ఆత్మజ్ఞానమునకు విషయభూతములయి పుట్టింపఁబడుచున్నవానివలె ఆత్మవిజ్ఞానముచేత వ్యాప్తములయి పుట్టుచున్నవి. ఆత్మజ్ఞానభాస్యములును, విజ్ఞానశబ్దవాచ్యములును, ధాత్వర్థభూతములును అగు ఆధర్మములు ఆత్మయొక్క వికారరూపములేయని అవివేకులు తలంచుచున్నారు. బ్రహ్మముయొక్క విజ్ఞానము మాత్రము సూర్యప్రకాశమువలెను అగ్న్యుష్ణత్వమువలెను బ్రహ్మస్వరూపముకంటె వేఱుగానిస్వరూపమేగాని బ్రహ్మస్వరూపమునకు వేఱయినది మాత్రము కాఁజాలదు. నిత్యాత్మస్వరూపమగుటవలన కారణాంతరాధీనము కాఁజాలదు. సకలపదార్థములు ఆబ్రహ్మముకంటె వేఱయిన దేశకాలవిభాగములు లేనివగుటవల్లను, కాలాకాశాదికమునకు కూడ ఆ బ్రహ్మమే కారణమగుటవల్లను, నిరతిశయ సూక్ష్మస్వరూపుఁడగుటవల్లను ఆబ్రహ్మముకంటె వేఱయినది తెలిసికొన శక్యముకానిది, సూక్ష్మమయినది, సమీపమునందున్నది, దూరమునందున్నది భూతవర్తమానభవిష్యత్కాలములందుండజాలదు. కావుననే ఆబ్రహ్మము సర్వజ్ఞము. ఈ విషయమునే యీ క్రిందిశ్రుతులు ప్రతిపాదించుచున్నవి:—

౧. మం. అపాణిపాదో జవనో గ్రహీతా
పశ్యత్యచక్షు స్సశృణోత్యకర్ణః,
సవేత్తి వేద్యం నచతస్యాస్తి వేత్తా
తమాహు రగ్ర్యం పురుషం మహాన్తమ్. శ్వేతాశ్వ. ౩-౧౯.

౨. న హి విజ్ఞాతు ర్విజ్ఞాతే ర్విపరిలోపో విద్యతేఽవినాశిత్వాన్నతు తద్ద్వితీయ మస్తి. బృహదార. ౪-౩-౩౦.

విజ్ఞాతృ స్వరూపముకంటె వేఱుగాకపోవుటవల్లను, కరణాదిసాధన సమగ్రియొక్క అపేక్ష లేకపోవుటవల్లను బ్రహ్మ జ్ఞానస్వరూపమయి నప్పటికిన్ని నిత్యత్వముగలదియని ప్రసిద్ధిగలదు. అందువలన ఆ బ్రహ్మము ధాత్వర్థము కాదు, మఱియు క్రియారూపమున్నూ గాదు. అందువల్లనే జ్ఞాన కర్తృకముకాదు.

బ్రహ్మము శబ్దవాచ్యముకాదు.

అందువల్లనే బ్రహ్మము జ్ఞానశబ్దవాచ్యముకూడ కాజాలదు. అయినప్పటికిన్ని జ్ఞానాభాసవాచకమయినట్టియు, బుద్ధిధర్మవిషయమైనట్టియు, జ్ఞానశబ్దముచేత ఆబ్రహ్మము సూచింపఁబడుచున్నది కాని చెప్పఁబడుట లేదు. బ్రహ్మము శబ్దప్రవృత్తిహేతుభూతమయిన జాత్యాదిధర్మరహితమగుటచేత శబ్దముచేత ప్రతిపాదింపఁబడశక్యముకాదు. ఇట్లే సత్యానంతశబ్దములవిషయమునుకూడ గ్రహించవలయును. బ్రహ్మము సర్వవిశేషప్రత్యస్తమితస్వరూపముగలది యగుటచేత బాహ్యసత్తాసామాన్యవిషయకమయిన సత్యశబ్దముచేత బ్రహ్మము సూచింపఁబడుచున్నది కాని సత్యశబ్దవాచ్యము మాత్రము బ్రహ్మముకాఁజాలదు. ఇటుల సత్యాదిశబ్దములు ఇతరేతరసన్నిధియందు అన్యోన్యము నియమ్యనియామకభావమును పొందినవై సత్యాదిశబ్దవాచ్యము

నుండి నివర్తకములయి బ్రహ్మముయొక్క లక్షణార్థము గల వగుచున్నవి. అందువల్లనే.

౧. యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ.

తై. ఉ. ౨. ౪. ౯.

౨. అనిరుక్తేఽనిలయనే. తై. ఉ. ౨. ౭.

అను శ్రుత్యనుసారము, బ్రహ్మము శబ్దార్థవాచ్యము కాఁజాలదని సిద్ధించును. మఱియు బ్రహ్మము నీలోత్పలమువలె వాక్యార్థముకూడ కాఁజాలదు, పైనచెప్పఁబడిన లక్షణముగల బ్రహ్మమును గుహాయందు ఉన్నదానినిగా ఎవ్వఁడెఱుంగుచున్నాఁడో అట్టివాఁడు సకలకామములను పొందును, ఇచట గుహాశబ్దము 'గుహాసంవరణే'. అను ధాతువువల్లనుండి పుట్టినది, "నిగూఢా అస్యాం జ్ఞానజ్ఞేయజ్ఞాతృపదార్థా ఇతి గుహా-బుద్ధిః=జ్ఞానజ్ఞేయ జ్ఞాతృపదార్థ త్రయము దేనియందు లీనమైయున్నదో అది గుహ—అనగా బుద్ధి (బుద్ధి నిరోధసమయమునందు జ్ఞాత్రాదిపదార్థములు భేదముగాఁ గనంబడుట లేదు గావున దానియందు (బుద్ధియందు) లీనమయియున్నదని తలంచవలయును, (గుహాశబ్దమునకేమఱొకవ్యుత్పత్తి చెప్పఁబడుచున్నది) లేక "నిగూఢా అస్యాం భోగాపవర్గా పురుషార్థా ఇతివా"—(భోగాపవర్గములను పురుషార్థములు దీనియందు లీనమయియున్నవి కనుక గుహయనఁబడును, భోగాపవర్గములు బుద్ధి పరిణామములగుటచేతఁ ఆవిబుద్ధియందు నిలీనములయియున్నవనిభావము) ఆబుద్ధి యను గుహాయందుగల పరమమయిన ఆకాశమునందు—అవ్యాకృతాఖ్యమునందు—అవ్యాకృతాకాశము పరమవ్యోమమగును గాని భూతాకాశము పరమవ్యోమశబ్దవాచ్యము కాదు. 'ఏతస్మిన్ను ఖల్వక్షరే గార్గ్యాకాశః' (బృ. ౩-౮-౧౧) అను శ్రుతి పైవిషయమును సూచించుచున్నది.

లేక 'గుహాయాం వ్యోమన్' అని సామానాధికరణ్యము చేసి పరమ వ్యోమయనఁగా అవ్యాకృతాకాశమనే గుహాయందు ఉన్నటువంటి బ్రహ్మము

నెవ్వఁడెఱుంగునో అనియు అర్థమును గ్రహించవచ్చును. గుహాశబ్దమును అవ్యాకృతాకాశపరముగా అర్థమును చెప్పినప్పుడు ఆగుహాశబ్దమునకు "నిగూఢాః సర్వే పదార్థాః త్రిషు కాలేషు కారణత్వాత్ సూక్ష్మతరత్వాచ్చ" అనివ్యుత్పత్తి. ఇచ్చట ద్వివిధమయిన వ్యుత్పత్తిని ఆచార్యులవారు భాష్యమునందు చెప్పియున్నను రెండవయర్థమును ఇతరులు చెప్పెడిపక్షమును అనువదించుటకు చెప్పిరిగాని వారి స్వాభిప్రాయము ప్రథమవ్యుత్పత్తియందే యని స్పష్టము కనుక హార్దమయిన పరమవ్యోమయని చెప్పుటయే న్యాయము. ఏలయనఁగా ఇచట 'హృదయాకాశము విజ్ఞానాంగముగా వివక్షితమయియున్నది. హృదయాకాశమే పరమవ్యోమయని శ్రుత్యంతరముకూడగలదు:—

యో వై స బహిర్ధా పురుషాదాకాశః...యో వై సోఽంతః పురుష ఆకాశః...యోఽయ మంతర్హృదయ ఆకాశః.

ఛాందో. 3. ౧౨. ౭, ౮, ౯.

(హృదయాకాశమునందున్న ఇట్టి బ్రహ్మము నెవ్వఁడెఱుంగునో వాఁడు బ్రహ్మస్వరూపముతో సకలానందముల ననుభవించును. ఇచట హృదయాకాశమునే గుహాయని శ్రుతి ప్రతిపాదించెను. స్థూలదేహమే అన్నమయకోశము, దానిలోపల ప్రాణమయకోశము, ప్రాణమయకోశము లోపల మనోమయకోశము, మనోమయకోశములోపల విజ్ఞానమయకోశము, విజ్ఞానమయకోశములోపల ఆనందమయకోశము, ఈపంచకోశపరంపరయే గుహ యనంబడుచున్నది. ఈ పంచకోశగుహయందున్న సర్వకారణమగు ఏ యవిద్యగలదో అదియే హృదయాకాశము. అదియే పరమవ్యోమ.) అట్టి బుద్ధిగుహయందు బ్రహ్మము స్ఫుటముగా పొందఁబడును. (అనఁగా బుద్ధిగుహయందు ద్రష్టృ, శ్రోతృ, మంతృ, విజ్ఞాతృ, మున్నగు విశేషములతోఁ

గనంబడు నని భావము) లేనియెడల బ్రహ్మము సర్వగతమగుటచేత విశిష్ట దేశకాలసంబంధము గలదని చెప్పుట యుక్తము కాదు గదా.

ఎవ్వఁ డీవిధముగా బ్రహ్మము నెఱుంగునో వాఁడు సకల భోగములను పొందుచున్నాఁడు, ఇచట భోగములను పొందుటయనఁగా అస్మదాదుల వలె దారాపుత్రధనస్వర్గాదిభోగము లను అభిప్రాయముకాదు, బ్రహ్మభూతుఁ డయిన విద్వాంసుఁడు సూర్యప్రకాశమువలె నిత్యమయినట్టియు, బ్రహ్మ స్వరూపమునకు వేఱుకానట్టియు, జ్ఞానస్వరూపముతో సకలకామములను ఒకేపర్యాయము పొందును. లోకమునందు సాంసారికులగు జీవులు ధర్మాది నిమిత్తాపేక్షములును, చక్షురాది కరణాపేక్షములును, అగు కామములను క్రమముగా ఎటుల పొందుచున్నారో అట్లుగాక సర్వజ్ఞుఁడును సర్వగతుఁ డును నిత్యబ్రహ్మస్వరూపుఁడును అగు ఆత్మతో ధర్మాదినిమిత్తాపేక్షములు కానట్టియు, చక్షురాదీంద్రియముల నపేక్షింపనట్టియు, సకలకామములను మేధావియగు బ్రహ్మముతోఁడ సర్వజ్ఞస్వరూపముతో పొందుచున్నాఁడు. ఇతిశబ్దము మంత్రము సమాప్తమయినదని సూచించును.

౧. బ్రహ్మసత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ.

౨. విత్ = యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్.

3. ఆప్నోతి = సోఽశ్నుతే సర్వాన్కామాన్ సహ.

౪. పరమ్ = బ్రహ్మణా విపశ్చితేతి.

అను నాల్గుపదములకు నాల్గువాక్యములు వ్యాఖ్యానరూపములని యెఱుంగ వలయును.

సంగ్రహముగ "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" యను మంత్రము చేత వ్యాఖ్యానము చేయఁబడిన విషయమునే విస్తారముగ వ్యాఖ్యానము చేయుటకుఁ "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశ స్సంభూతః" మున్నగు గ్రంథ మారంభింపఁబడినది.

'బ్రహ్మవిదాప్నోతి పరం' అని సూత్రితమయిన వాక్యమునకు వివరణభూతమయిన 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' యని మంత్రప్రథమపాదమునందు చెప్పఁబడియున్నది. ఆమంత్రమునందు చెప్పఁబడిన సత్యము, ఆనంత్యము అనుటయెట్లు? అందు అనంతత్వము దేశ, కాల, వస్తుసంబంధముచేత త్రివిధము. ఉదాహరణము—దేశసంబంధముచేత అనంతమున కుదాహరణము ఆకాశము. ఆకాశమునకు దేశసంబంధముచేత పరిచ్ఛేదములేదుగదా. కాని ఆకాశముకార్యమగుటచేతకాలముచేతను, వస్తువుచేతను (ఆకాశమునకు) పరిచ్ఛిన్నత్వమున్నది. బ్రహ్మము అకార్యమగుటచేత ఆకాశమువలె కాల, వస్తువులచేత పరిచ్ఛిన్నమగునదికాదు. కార్యమయినవస్తువు కాలముచేత పరిచ్ఛిన్నమగును, బ్రహ్మము అకార్యమగుటచేత కాలపరిచ్ఛిన్నము కాఁజాలదు. ఆదేవిధముగా బ్రహ్మము వస్తుపరిచ్ఛిన్నముకూడ కాఁజాలదు. వస్తుపరిచ్ఛిన్నము కాని దనుట యెట్లనఁగా సర్వస్వరూపమయినదగుటవలన, భిన్నమయినవస్తువు వస్త్వంతరమునకు అంతమగుచున్నది. వస్త్వంతరబుద్ధి మఱొకవస్తుప్రసక్తమయినప్పుడు నివృత్తియగుచున్నది. దేనివల్లనుండి దేనియొక్కబుద్ధి నివృత్తి యగుచున్నదో అది దానికి అంతమని చెప్పవలయును. అదెట్లనఁగా గోత్వబుద్ధి అశ్వత్వమును చూడగనే నివృత్తి యగుచున్నది కావున గోత్వము అశ్వత్వాంతమని అంతముగలది యగుచున్నది. ఇట్టి అంతవత్త్వము భిన్నములయిన వస్తువులందుఁ గనంబడుచున్నది, బ్రహ్మమునకిట్టి భేదములేదు కావున బ్రహ్మము వస్తుత్వముచేతకూడ అనంతమని గ్రహించవలయును.

ప్రశ్న:—బ్రహ్మమునకు సర్వానన్యత్వమనుట యెట్లు?

సమా:—చెప్పెదము, బ్రహ్మము కాలాకాశాదిసర్వవస్తువులకు కారణభూతమయియున్నది. కార్యాపేక్షచేత వస్తువునకు అంతవత్త్వము కలుగకూడదా? యనునెడల అట్లనరాదు. కార్యమగువస్తువు అనృతముగదా? నిజమునకు చూడఁగా కార్యమనునది కారణముకంటె భిన్నముగా వాస్తవ

ముగా లేదుగదా. 'వాచాఽరంభణం వికారోఽనామధేయం మృత్తికేత్యేవ సత్యం (ఛాందో. ౬. ౧. ౪.) అను యీవిషయమునే శ్రుతి ప్రతిపాదించు చున్నది. ఇదేవిధముగ 'సదేవ......సత్యం' అను శ్రుతియు గలదు. ఆకాశాదిక మునకు కారణభూతమగుటవలన 'దేశతః' అనంత్యము బ్రహ్మమునకు సంభ వించును. ఆకాశము 'దేశతః' అనంతమని లోకమునందు ప్రసిద్ధికూడఁ గలదు. గదా. అట్టి యాకాశమునకుకూడ బ్రహ్మము కారణమగుటచేత బ్రహ్మము కూడ 'దేశతః' అనంతమని సిద్ధమగుచున్నది, లోకమునందుకూడ సర్వగతము కాని దానివల్లనుండి సర్వగతమగునది పుట్టుచుండుట లేదుగదా. కావున బ్రహ్మము దేశతః-నిరతిశయముగ అనంత్యమని యంగీకరించితీరవలయును. అకార్యమగుటచేత కాలతః - అనంత్యమగుచున్నది. బ్రహ్మముకంటె భిన్న మయిన వస్త్వంతరము లేకపోవుటచేత వస్తుతః-అనంత్యము సిద్ధమగుచున్నది. అందువల్ల బ్రహ్మము నిరతిశయసత్యమయినది.

సృష్టివిషయము.

'తస్మాత్ వా ఏతస్మాత్ ఆత్మనః' అను మంత్రమునందుఁగల 'తస్మాత్' అను పదమువలన 'బ్రహ్మవిదాప్నోతి పరం' అను సూత్రభూతమూలమం త్రమునందు సూచింపఁబడిన బ్రహ్మము పరామర్శింపఁబడుచున్నది. 'ఏతస్మాత్' అను పదమువలన 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ'యను మంత్రవాక్యముచేత లక్షితమయిన బ్రహ్మ ముపలక్షితమగుచున్నది. అనఁగా ఏ బ్రహ్మము ఆదియందు 'బ్రహ్మవిదాప్నోతి పరం' యను బ్రాహ్మణవాక్యముచేత సూత్రితమైనదో, ఏ బ్రహ్మము తరువాత 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' యని లక్షణనిరూపణచేత లక్షితమైనదో, అట్టి యీ బ్రహ్మము ఆత్మశబ్దవాచ్యము, ఆ బ్రహ్మము సర్వ మునకు ఆత్మభూతము 'తత్సత్యం స ఆత్మా. (ఛాందో. ౬. ౮. ౭.) అను శ్రుతి యీవిషయమును తెలుపుచున్నది. కావున బ్రహ్మమే ఆత్మ.

అట్టి బ్రహ్మమువల్లనుండి శబ్దగుణము గలదియు, మూర్తద్రవ్యములకు అవకాశము నొసంగునదియు నగు ఆకాశము జనించెను.

అట్టి యాకాశస్వరూపమును పొందిన బ్రహ్మమువల్లనుండి వాయువు జనించెను. ఈవాయువు స్పర్శగుణముగలది. ఈవాయువునకు కారణమగు ఆకాశముయొక్క గుణమగు శబ్దగుణముగూడ కలసి వాయువు ద్విగుణమగుచున్నది.

అట్టి వాయుస్వరూపమును పొందిన బ్రహ్మమువల్లనుండి అగ్ని పుట్టెను. ఈ అగ్నికి స్వగుణము రూపము, వెనుకటి ఆకాశవాయువులయొక్క గుణములగుశబ్దస్పర్శములతోడఁగలసి మూఁడుగుణములు గలది యగ్ని యగుచున్నది.

ఇట్టి యగ్నిస్వరూపమును పొందిన బ్రహ్మమువల్లనుండి జలము పుట్టెను. ఈ జలమునకు స్వగుణము రసము. వెనుకటి ఆకాశము వాయువు అగ్నుల యొక్క గుణములగు శబ్దస్పర్శరూపములను మూఁడుగుణములతోడఁగలసి జలము నాల్గు గుణములు గలది యగుచున్నది.

ఇట్టి జలస్వరూపమును పొందిన బ్రహ్మమువల్లనుండి పృథివిపుట్టెను. ఈ పృథివియొక్క స్వగుణము గంధము. వెనుకటి ఆకాశ, వాయు, అగ్ని, జలములయొక్క గుణములగు శబ్ద, స్పర్శ, రూప, రసములను నాల్గుగుణములతోడఁ గలసి ౫ గుణములుగలది పృథివి యగుచున్నది.

బ్రహ్మస్వరూపమును పొందిన ఇట్టి పృథివివల్లనుండి ఓషధులు పుట్టెను.

ఓషధులనుండి అన్నము కలిగెను.

(ఇట్లె సర్వత్ర గ్రహించునది.)

రేతోరూపముగ పరిణమించిన అన్నమువల్లనుండి కరచరణాద్యవయవ విశిష్టుఁడగు పురుషుఁడు జన్మించెను. లోకమునందుఁగల సకలప్రాణులును ఆ పురుషుఁడును అన్నరసమయులే గదా.

పూర్వపక్షము:—బ్రహ్మమునుండి ఆకాశాదిక్రమముగ అందఱు జన్మించియుండుటచేత అందఱు బ్రహ్మవంశమునకు చేరియున్నారుగదా. అట్టిస్థితిలో "పురుషుఁడు అన్నరసమయుఁడు" అని ఏల గ్రహించినారు ?

సమాధానము:—ప్రాణులందఱు బ్రహ్మవంశమునకు చేరినవారైనను కర్మజ్ఞానాధికారియగు పురుషుఁడు ప్రాధాన్యము కావున 'సవా ఏష పురుషః' అని పురుషుఁడు చెప్పఁబడినాఁడు.

పురుషునియందు ఆత్మజ్ఞానాతిశయరూపముగ ప్రకటముగ నుండుననియు, తదితరగవాశ్వాది ప్రాణిజాతమునందు ఇట్టి ప్రకటస్థితి యుండదనియు, అకలిదప్పులుమాత్రమవి ఎఱిఁగి తన్నివారణార్థముమాత్రము ప్రయత్నించుననియు ఐతరేయశ్రుతి యీవిధముగ వచించుచున్నది:—

పురుషేత్వేవాఽఽవిస్తరామాత్మా; సహి ప్రజ్ఞానేన సంపన్నతమో విజ్ఞాతం వదతి, విజ్ఞాతంపశ్యతి, వేద శ్వస్తనం, లోకాలోకౌ, మర్త్యేనామృత మీప్సత్యేవం సంపన్నః; అథేతరేషాం పశూనా మశనాపిపాసే ఏవాఽభివిజ్ఞానమ్, న విజ్ఞాతం వదంతి న విజ్ఞాతం పశ్యంతి నవిదు శ్వస్తనం న లోకాలోకౌ త ఏతావంతో భవంతి యథాప్రజ్ఞంహి సంభవాః.

(ఐత. ఆరణ్య. ౨-3-౨.)

అట్టి కర్మజ్ఞానాధికారియగు పురుషుఁడు బ్రహ్మవిద్యాసహాయముచేత ఆత్మ నెఱుంగుటకు ప్రయత్నించుచున్నాఁడు. ఈ పురుషుఁడు ఆత్మగాని అన్నమయాదికోశములను ఆత్మనుగా స్వభావముగా తలంచుచున్నాఁడు. చిరకాలమునుండి ఇట్టి యభిప్రాయముతో నున్నవానికి ఒకేపర్యాయము నిరాలంబనమగు ఆత్మస్వరూపమును బోధించుట అశక్యము కావున శాఖాచంద్రన్యాయరీతిగ క్రమముగ ఆత్మను బోధింపఁదలఁచి 'తస్యేదమేవశిరః' ఇత్యాదికముగ అన్నరసమయుఁడగు పురుషునకు శిరస్సు మున్నగునవి ఇవి యివి యని చెప్పుచున్నాఁడు-శిరస్సు భుజములు దేహమధ్యభాగము పుచ్ఛ

భాగము కలిగి పక్షియుండును కావున అట్లే బ్రహ్మస్వరూపానుసంధానార్థము పక్ష్యాకారముతో ఉపాసించవలసిన అన్నమయరసరూపపరమాత్మకు ప్రాణమయాద్యాత్మసందర్భమునందు శిరస్సు, పక్షము కానివానియందు శిరస్త్వపక్షత్వాదికము ముందుముందు శ్రుతియందు విధింపబడియున్నది. కావున ఇచ్చట కూడ అట్లే యగునేమో అని తలంచి అట్టిది లేదనుటకయి ఈ గనంబడు మనశిరస్సే శిరస్సనియు, కుడిచెయ్యి కుడిరెక్కయనియును, ఎడమచెయ్యి యెడమరెక్కయనియు, దేహమధ్యభాగము ఆత్మయనియు, (మధ్యం హ్యేషామంగానామాత్మా. ఐత. అర. ౨. ౩. ౫. అని శ్రుతి.) నాభికంటె క్రిందిభాగము పుచ్ఛమనియు, ఇటుల భావించి యుపాసించవలయును. అన్నరసమయుండును స్థూలదేహాత్మకుండును అగు ఉపాసించదగిన పక్షిస్వరూప పరమాత్మకు శిరఃకల్పనమునందు శిరస్సును చెప్పుట సరిపోవుచున్నది. ముందుముందు చెప్పంబోవు ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయాత్మలకు శిరఃపక్షాది కల్పనము రూపకముగ చెప్పంబడుచున్నది. మూసయందు కరిగించిపోసిన తామ్రాదికము ఆమూసయందు సంఘటితమయియున్న ప్రతిమాదిస్వరూపము నెట్లు పొందుచున్నదో అట్లే అన్నమయకోశములోపల, ప్రాణమయకోశము, దానిలోపల మనోమయకోశము, ఆమనోమయకోశము లోపల విజ్ఞానమయకోశము, ఆవిజ్ఞానమయకోశము లోపల ఆనందమయకోశము ఇటుల తదాకారమును భజించుచున్నదనిభావము.

ఈ అన్నమయాత్మను గూర్చియే ఒకమంత్రము—పై యనువాకము "అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే" అనునది చెప్పంబడం బోవుచున్నది.

వివరణము:—౧. సాయణాచార్యులవారు తానొనర్చిన ఉపనిషద్భాష్యమునం దీయుపనిషత్తుల గురించి ఇట్లు వ్రాసిరి:—

"సేయం తైత్తిరీయోపనిషత్ త్రివిధా—సాంహితీ, వారుణీ, యాజ్ఞికీచేతి, తత్ర ప్రథమప్రపాఠకే సంహితాధ్యాయస్యోక్తత్వాత్ తద్రూ

పోపనిషత్ సాంహితీ; ద్వితీయ తృతీయయోః ప్రపాఠకయోః యా బ్రహ్మ విద్యా అభిహితా తస్యాః సంప్రదాయ ప్రవర్తకో వరుణః, తస్మాత్తదుభయ రూపోపనిషత్ వారుణీ, చతుర్థప్రపాఠకే యజ్ఞోపయుక్తా అపి మంత్రాః తత్రతత్ర ఆమ్నాతాః, అతః తద్రూపోపనిషత్ యాజ్ఞికీ (మహానారాయ ణోపనిషత్) తాసాం తిసృణాం మధ్యే వారుణీ ముఖ్యా; తస్యాం పరమపురుషా ర్థస్య బ్రహ్మప్రాప్తి లక్షణస్య సాక్షాదేవ సాధనభూతాయాః బ్రహ్మవిద్యా యాః ప్రతిపాదితత్వాత్" యాతుదేశవిశేషే 'బ్రహ్మవిత్' ఇత్యారభ్య నవానువాకా ఇతి ప్రసిద్ధిః సా త్వధ్యాపకైః పాఠసౌకర్యాయ పరికల్పితా, నత్వర్థానుసారిణీ, తేహి తదప్యేష శ్లోకో భవతి, ఇత్యస్యాః ప్రతిజ్ఞాయాః శ్లోక పాఠస్యచ మధ్యే తంత మనువాకం సమాపయంతి, నచైతద్యుక్తం కస్యచిదప్య ర్థస్య పర్యవసానాభావాత్, తస్మాదితరదేశగతాధ్యాపక ప్రసిద్ధ్యా కృత్స్నో వ్యయమేక ఏవానువాకః... యేషాం పునర్నవానువాకకల్పనా తేషామప్యేక వల్లీప్రసిద్ధిరస్తి 'బ్రహ్మవల్లీ' ఇత్యేవం తైః అపివ్యాహృతత్వాత్, భగవద్భిః భాష్యకారైరపి 'ఆనందవల్లీ' ఇత్యేవం వ్యాహృతం. అతో బహుస్కంధ యుక్తవల్లీవత్ బహువిధావాంతర పాఠభేదయుక్తోఽప్యేక ఏవాయమను వాకః" (ఈ తైత్తిరీయోపనిషత్తు సాంహితి, వారుణి, యాజ్ఞికి, అని త్రివి ధము. వీనిలో మొదటి ప్రపాఠకమునందు 'సంహితాధ్యాయవిషయము ప్రతిపాదింపఁబడియుండుటచేత అది 'సాంహితి' యని చెప్పఁబడినది. ద్వితీ యతృతీయ ప్రపాఠకములందు ప్రతిపాదింపఁబడిన బ్రహ్మవిద్యయొక్క సంప్రదాయప్రవర్తకుఁడు వరుణుఁడగుటచేత ఆ ప్రపాఠకద్వయము 'వారు ణి' యని చెప్పఁబడినది. చతుర్థప్రపాఠకమునందు యజ్ఞోపయుక్తములగు మంత్రములుకూడ చెప్పఁబడియుండుటచేత 'యాజ్ఞికి' అని చెప్పఁబడినది. ఈ మూఁడింటిలో 'వారుణియే' ముఖ్యమయినది. 'బ్రహ్మవిదాప్నోతి పరం' అను నది నవానువాకము లని అధ్యాపకులు పాఠసౌకర్యార్థము విభజించి చెప్పుచున్నారు కాని అయ్యది ఒక్క అనువాకమనుటయే యుక్తియుక్తము.

ఈ ప్రపాఠకమును శ్రీశంకరభగవత్పాదుల వారు 'ఆనందవల్లి' యని వ్యవహరించిరి.

౨. బ్రహ్మణః విశేషాః సత్యాదయః; తైః యదా బ్రహ్మవిశేషితం తదా సత్యాది విరుద్ధేభ్యః అసత్యజాడ్యపరిచ్ఛిన్నేభ్యః నిరాకృతం బ్రహ్మ సిద్ధ్యతి, యథా—నీలం ఉత్పలం, రక్తం ఉత్పలం, ఇత్యాది ప్రయోగే వ్యక్త్యంతరేభ్యః వ్యావృత్త ముత్పల మవగమ్యతే, తథా యదన్యేభ్యః అసత్యాదిభ్యః అవధార్యతే తద్బ్రహ్మ-ఇత్యేవం వ్యావృత్తత్వే సతి సచ్చిదేకతానం పరిపూర్ణం తదితి జ్ఞాతం భవతి, వ్యావృత్తిశ్చేన్న జ్ఞాయతే తదా అనృతాదిభ్యః వ్యావృత్త్యసిద్ధేః నబ్రహ్మ జ్ఞాతం స్యాదిత్యర్థః.

(అర్థ. అసత్య, జాడ్య, పరిచ్ఛిన్నములయిన దానికంటె వ్యావృత్తమయినది - భిన్నమయినది బ్రహ్మమనుటకు, సత్య, జ్ఞాన, అనంతశబ్దములు ఇచట విశేషితములయినవని భావము.

3. లక్షణమునుగూర్చి శాస్త్రజ్ఞుల యభిప్రాయము:—

'సర్వం హి లక్షణ మితరపదార్థవ్యవచ్ఛేదకమ్'.

(న్యాయవార్తిక. ౧. ౧. ౧౪.)

వ్యావృత్తి ర్వ్యవహారోవా లక్షణస్య ప్రయోజనమ్, తత్ర వ్యవహారః =శబ్దవ్యవహారః=శబ్దశక్తి గ్రహః లక్షణజ్ఞానస్య ప్రయోజనం యథా - సాస్నాదిమాన్ గౌః-ఇతి లక్షణజ్ఞానేసతి యాయం సాస్నాదిమంతం పిండంపశ్యతి తంతం గోశబ్దవాచ్యం ప్రత్యేతి. ఇతి వ్యావృత్తేః ప్రయోజనవత్త్వే (అభిధేయత్వవ్యావర్తకత్వాదివర్జం) వ్యతిరేకి హేతుర్భవతి ఏతచ్చ 'వ్యావృత్తి ర్వ్యవహారోవాలక్షణస్య ప్రయోజనమ్' ఇతి పరోక్తమేకం పక్షమాశ్రిత్యోక్తం, నతు స్వమతం. లక్షణవాక్యమాత్రస్య సిద్ధాంతిభిః అఖండార్థతాభ్యుపగమాత్. ఈవిషయమునుగూర్చి సంక్షేపశారీరకగ్రంథమునందు. ౧. ౫౧౫-౫౩౦. శ్లోకముల గాంచునది.

౪. "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశ స్సంభూతః" ఇత్యాది సందర్భమునందు ఆకాశాది పురుషాంతమగు సృష్టిమంత్రమునందు ప్రతిపాదింపఁబడియున్నది. కాని యీసృష్టి ప్రదర్శనము ఆత్మకంటె భిన్నముగ ఆకాశాదికము వాస్తవముగ నున్నది అని తెలుపుటకుఁగాను చెప్పఁబడియుండలేదు. కార్యమెప్పుడున్ను కారణముకంటె భిన్నమయిన సత్తగలది కాదు. బ్రహ్మ మెప్పుడు జగద్రూపకార్యమునకు కారణమనిచెప్పినారమో అప్పుడే అద్వయత్వము స్ఫుటమగుచున్నది. పరిణామియగు కారణముయొక్క గుణములు కార్యమునందు గనంబడుట సహజమయియున్నది. జ్ఞానము ఆత్మగుణ మగు నెడల ఆత్మకార్యములగు భూతములందు గుణముకూడ కనంబడుచుండును. కాని జ్ఞానము ఆత్మస్వరూపముగాని గుణముకాదు. కనుక ప్రపంచమునకు పరమాత్మ వివర్తోపాదానకారణ భూతుఁడగుచున్నాఁడు. వివర్తోపాదానత్వముకల్పితమయిన మాయాశబలితరూపముచేత అగుచున్నది.

శ్రుతియం దచ్చటచ్చట చెప్పఁబడిన సృష్టివిషయకానువాదము బ్రహ్మావబోధమునకు ద్వారభూతముగ తెలుపఁబడినది కాని సృష్టిని ఉపాసించుటకుగాని జ్ఞేయమనికాని ప్రదర్శించి యుండలేదు. గౌడపాదాచార్యులవారుకూడ మాండూక్యకారికలయం దిట్లే తెలిపియున్నారు:—

శ్లో. మృల్లోహ విస్ఫులింగాద్యైః సృష్టిర్యాచోదితాఽన్యథా,
ఉపాయస్సోఽవతారాయ నాస్తిభేదః కథంచన.

మాండూక్యకారికా. 3. ౧౫.

బృహదారణ్యభాష్యవార్తికమునందు కూడ సృష్టివిషయమిట్లే అంగీకృతమయినది:—

శ్లో. యథా యథాభవేత్పుంసాం వ్యుత్పత్తిః ప్రత్యగాత్మని,
సా సైవ ప్రక్రియేహస్యాత్సాధ్వీ సాచానవస్థితా.

బృహదారణ్య. భా. వార్తిక. ౧. ౪. ౪౦౨.

సూతసంహితయందు బ్రహ్మగీతలయం దిట్లే చెప్పఁబడినది. వ్యాఖ్యా సహితముగ నీశ్లోకమును పాఠకులు పఠించిన చాల విషయములను గ్రహింపఁగలరు:—

శ్లో. బ్రహ్మరూపాత్మన స్తస్మా దేతస్మా చ్ఛక్తిమిశ్రితాత్,
అపంచీకృత ఆకాశః సంభూతో రజ్జుసర్పవత్. ౩. ౩౪.

బ్రహ్మసూత్రములం దీక్రింది సూత్రములం దీవిషయము విమర్శింపఁబడియున్నది. ఈసూత్రములయొక్క శంకరభాష్యమునం దీవిషయము విపులముగ విమర్శింపఁబడియున్నది కావున నచట గాంచునది:—

సూ. ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాంతానుపరోధాత్. (౧. ౪. ౨౩.)
,, నవియదశ్రుతేః. ౨. ౩. ౧—౭.
,, కృత్స్నప్రసక్తి ర్నిరవయవత్వశబ్దకోపో వా. (౨. ౧. ౨౬)
౩. పదియగువాఁడు లేడని దుఃఖించుటయనఁగా:—

పరమానందయ్యగారి శిష్యులు ౧౦ రు కలసి ఒకయూరికిఁ బోవుచు దారిలో ఒకనది ప్రవహించుచుండఁగా వారానదిని దాటి అందఱు ఆవతలి యొడ్డునకు చేరిరి. ౧౦ రము చేరితిమో లేదో యని వారిలో నొకఁడు ఇతరుల నందఱను లెక్కించి తన్ను మఱచి ౧౦ వ వాఁడు ప్రవాహమున కొట్టుకొనిపోయెనని ఏడ్వసాగెను. తక్కినవారందఱు మొదటివానివలెనే తన్నువదలి లెక్కపెట్టుకొని ౧౦ గురిలో ఒకఁడు కొట్టుకొని పోయెనని ఏడ్చుచుండఁగా త్రోవను బోవుచున్న నేర్పరి యొకఁడు వీరిరోదనమునకు కారణము తెలిసికొని వీరి తెలివితక్కువకు చింతించి వారిని వేర్వేఱుగ నిలువఁబెట్టి లెక్కించి ౧౦ గురు సుఖముగా నున్నారని తెలుపగా ౧౦ గురము సుఖముగా నున్నామని తర్వాత వారందఱు సంతసించిరఁట. ఆకథను యిచట దృష్టాంతముగఁ గైకొనవలయును.

౫. శాఖాచంద్రన్యాయమనఁగా:—విదియనాటి చంద్రుఁడతి సూక్ష్మముగ నుండుటచేత నందఱకుఁ గనంబడుట కష్టము. అట్టి చంద్రుని చూచినవాఁడు చంద్రుని చూడఁదలఁచిన మఱియొకనికి అదుగో చంద్రుఁడని చెప్పిన నీప్రదేశమున చంద్రుఁడున్నాఁడని తెలిసికొనజాలఁడు కావున అతనికి ఒకవృక్షమును చూపి ఆ వృక్షముయొక్క పశ్చిమదిశయందున్న ఒకానొక కొమ్మనుచూపి అచ్చట చంద్రుఁడున్నాఁడని చెప్పును. ఆ శాఖయందతని దృష్టి చక్కఁగా చేరిన పిదప ఆ కొమ్మయందున్న మఱియొకరెమ్మను చూపి క్రమక్రమముగ చంద్రుఁడిచట నున్నాఁడని బోధించును. అదేవిధముగ అన్నరసమయాత్మకమగు శరీరమే బ్రహ్మమని బోధించిన తద్భిన్నమగు పుత్రకళత్రాదికమునందు ఆత్మబుద్ధి నశించును. ఇదేవిధముగ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయకోశములను ఆత్మలని నిరూపించినప్పుడు ప్రాణమయకోశమును బోధించినప్పుడు అన్నమయకోశమునందు ఆత్మబుద్ధి నశించును. మనోమయకోశమును బోధించినప్పుడు ప్రాణమయకోశమునందును, విజ్ఞానమయకోశమును బోధించినప్పుడు మనోమయకోశమునందును, ఆనందమయకోశమును బోధించినప్పుడు విజ్ఞానమయకోశమునందును ఆత్మబుద్ధి నశించును. పిదప ఆనందమయకోశమునకున్న ప్రతిష్ఠాభూతమగు బ్రహ్మమును బోధించినప్పుడు ఆనందమయకోశమునందు బ్రహ్మాత్వబుద్ధి నశించుచున్నది.

౧. జీవునకు 3 శరీరములుండును, వానిలో అన్నరసపరిణామరూపమును, పంచవింశతితత్త్వాత్మకమును, షాట్కౌశికమును (త్వక్, అసృక్, మాంస, మేదో, ఽస్థి, మజ్జాత్మకము) అగుస్థూలదేహము అన్నమయకోశమని చెప్పఁబడుచున్నది.

౨. ఈస్థూలదేహమధ్యభాగమునందు సప్తదశతత్త్వాత్మకమగు సూక్ష్మశరీరముగలదు. ఈ సూక్ష్మశరీరమునందు ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయకోశములు అంతర్భూతములయియున్నవి.

3. ఈ స్థూలసూక్ష్మశరీరములకు హేతుభూతమగు మలినసత్త్వ ప్రధానమగు అవిద్య సుషుప్తియందు ప్రకాశించుచుండును. ఆయవిద్యయే కారణశరీరమనంబడును. ఈ కారణశరీరము ఆనందమయకోశ మనం బడును.

౬. ఇచట అన్నరసమయశబ్దము చెప్పఁబడినను అంతమునందు 'యే ఽన్నం బ్రహ్మోపాసతే' అని ధ్యానము నుపదేశించియుండుటచేతను, శిర ఆదికల్పన ముండుటచేతను, విరాడాత్మనుగా గ్రహించుటయే యుక్తమని విమర్శకులు తలంచుచున్నారు.

ఈబ్రహ్మవల్లియందు అన్నబ్రహ్మ, ప్రాణబ్రహ్మ, మనోబ్రహ్మ, విజ్ఞాన బ్రహ్మ, ఆనందబ్రహ్మల యుపాసనము చెప్పఁబడినప్పటికిన్ని ఉపక్రమాది షల్లింగవిచారానుసారము ఉపనిషత్తాత్పర్యమును పరిశీలించి చూచినయెడల నిరుపాధిక బ్రహ్మప్రాప్తియే ఉపనిషత్తాత్పర్యమని సిద్ధించుచున్నది.

షల్లింగసూచక బ్రహ్మవల్లీ వాక్యములు.

౧. అ. ఉపక్రమము:—బ్రహ్మవిదాప్నోతిపరమ్ (౧-౧).

౧. ఆ. ఉపసంహారము:—ఆనందో బ్రహ్మేతివ్యజానాత్ (3-౬).

౨. అభ్యాసము:—సయశ్చాయంపురుషే (౨-౮).

3. అపూర్వత:—యో వేద నిహితం గుహాయామ్ (౨-౧).

౪. ఫలము:—అథయం ప్రతిష్ఠాం విన్దతే, అథసోఽభయంగతో భవతి (౨-౭).

౫. అర్థవాదము:—సోఽకామయత.

౬. ఉపపత్తిః—అసన్నేవసభవతి, అసద్బ్రహ్మేతి వేదచేత్

(౨-౬).

కోహ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్ (౨-౫).

ఈ అనువాకమునకుసంబంధించిన ఇతరగ్రంథములు.

భాష్యవార్తికము:—బ్రహ్మ. శ్లో. ౧-౫౬.

అనుభూతిప్రకాశము. అధ్యా. ౨. శ్లో. ౧—౪౮.

ఆత్మపురాణము. అధ్యా. ౧౦. శ్లో. ౧—౧౦౮.

---

౨. ద్వితీయోఽనువాకః.

అన్నమయకోశవివరణమ్

మం. అన్నాద్వై ప్రజాః ప్రజాయన్తే। యాః కాశ్చ పృథివీగ్ంశ్రితాః। అథో అన్నేనైవ జీవన్తి। అథైనదపి యన్త్యన్తతః। అన్నగ్ం హి భూతానాం జ్యేష్ఠమ్ తస్మాత్సర్వౌషధ ముచ్యతే। సర్వం వై తేఽన్నమాప్నువన్తి। యేఽన్నం బ్రహ్మోపాసతే అన్నగ్ంహి భూతానాం జ్యేష్ఠమ్ తస్మాత్సర్వౌషధముచ్యతే। అన్నాద్భూతాని జాయన్తే। జాతాన్యన్నేన వర్ధన్తే అద్యతేఽత్తి చ భూతాని। తస్మాదన్నం తదుచ్యత ఇతి। తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్। అన్యోఽన్తర ఆత్మా ప్రాణమయః। తేనైష పూర్ణః। సవా ఏష పురుషవిధ ఏవ। తస్య పురుషవిధతామ్। అన్వయం పురుషవిధః। తస్య ప్రాణ ఏవ శిరః। వ్యానో దక్షిణః

పక్షః । అపాన ఉత్తరః పక్షః । ఆకాశ ఆత్మా । పృథి
వీపుచ్ఛం ప్రతిష్ఠా । తదప్యేష శ్లోకో భవతి ॥౨॥

టీ. యాః కాః చ = ఏయవి, పృథివీం=భూమిని, శ్రితాః = ఆశ్రయించియున్నవో, (తాః=ఆసమస్తమయిన,) ప్రజాః = స్థావరజంగమాత్మక ప్రజలు, అన్నాత్ = (రసాదిభావముగా పరిణమించిన) అన్నమువలన, ప్రజాయంతేవై = పుట్టుచున్నారు. అథో=మఱియు, అన్నేనైవ = అన్నముచేతనే, జీవంతి = (ప్రాణములను ధరించి) వృద్ధిని పొందుచున్నారు. అథ = తరువాత, ఏనత్ = ఈ యన్నమునుగూర్చి, అపియంతి = లయమును పొందుచున్నారు. (యస్మాత్ = ఎందువలన,) అన్నం = అన్నము, భూతానాం = ప్రాణులలో, జ్యేష్ఠం = శ్రేష్ఠమయినదో, తస్మాత్ = అందువలన, (అన్నం = అన్నము) సర్వౌషధం = అందఱకు (క్షుద్బాధానివారకమగు) ఔషధమని, ఉచ్యతే = చెప్పఁబడుచున్నది.

యే=ఎవరు, అన్నం = అన్నమును, బ్రహ్మ, = బ్రహ్మమునుగా, ఉపాసతే = ఉపాసించుచున్నారో, తే=వారు, సర్వం = సకలమయిన, అన్నం = అన్నమును, అప్నువంతి = పొందుచున్నారు. (యస్మాత్ = ఎందువలన,) అన్నం = అన్నమే, భూతానాం = భూతములలోపల, జ్యేష్ఠంహి = ప్రథమముననే పుట్టినదో, తస్మాత్ = అందువలన, (అన్నం = అన్నము) సర్వౌషధం = సర్వౌషధమని, ఉచ్యతే = చెప్పఁబడుచున్నది. యే=ఎవ్వరు, అన్నం బ్రహ్మ = అన్నబ్రహ్మమును, ఉపాసతే=ఉపాసించుచున్నారో, తే = వారు, సర్వం = సమస్తమును, ఆప్నువంతివై = పొందుచున్నారుగదా. అన్నాత్ = అన్నమువలన, భూతాని = ప్రాణులు, జాయంతే=పుట్టుచున్నవి, జాతాని = పుట్టిన(ప్రాణులు) అన్నేన=అన్నముచేత, వర్ధన్తే=వృద్ధినిపొందుచున్నవి, అద్యతే=(అన్నము)భూతములచేత భక్షింపఁబడుచున్నది, భూతాని = భూతములు.

అత్తిచ = (అన్నమును) తినుచున్నవి, తస్మాత్ = అందువలననే, తత్ = అది, అన్నం = అన్నము అని, ఉచ్యతే = చెప్పఁబడుచున్నది, ఇతి = (అన్నమయ కోశవిషయమును వివరించినమంత్రము) సమాప్తిని పొందినది.

తస్మాత్ = ఆ, ఏతస్మాత్ = ఈ, అన్నరసమయాత్ = అన్నరసవికార మయిన ఆత్మకంటె, అన్యః = ఇతరుఁడగు, ప్రాణమయః = ప్రాణమయుఁడగు, అంతరః = అభ్యంతరుఁడగు, ఆత్మా=ఆత్మ, కలఁడు. తేన=అట్టిప్రాణమయాత్మ చేత, ఏషః=ఈ అన్నరసమయమగు ఆత్మ, పూర్ణః=పరిపూర్ణుఁడు.

సః=ఆ, ఏషః = ఈ ప్రాణమయాత్మ, పురుషవిధః ఏవవై = పురుషా కారుఁడే గదా. తస్య = ఆ అన్నరసమయునియొక్క, పురుషవిధతాం = పురుషవిధత్వమును, అను = అనుసరించియే, అయం = ఈ ప్రాణమయాత్మ, పురుషవిధః = పురుషవిధుఁ డగుచున్నాఁడు.

తస్య = ఆ ప్రాణమయ పురుషునకు, ప్రాణఃఏవ = ముఖమునుండియు నాసికమునుండియు వెడలెడి వాయురూపమగు ప్రాణమే, శిరః = శిరస్సు, వ్యానః = వ్యానవాయువు, దక్షిణఃపక్షః = దక్షిణపుబాహువు, (కుడిచేయి) అపానః = అపానవాయువు, ఉత్తరఃపక్షః = ఎడమచేయి, ఆకాశః = సమాన వాయువు, ఆత్మా=మధ్యభాగము, పృథివీ=భూమి, ప్రతిష్ఠా = అవస్థానభూత మగు, పుచ్ఛం=పుచ్ఛము, తదపి = ఆవిషయమునుగూర్చి, ఏషః = ఈ చెప్పఁ బోవునట్టి, శ్లోకః=శ్లోకము-మంత్రము, భవతి = అగుచున్నది.

తా. రసాదిభావముగా పరిణమించిన అన్నమువల్లనుండి స్థావరజంగ మాత్మకమగు ప్రజాసమూహము పుట్టుచున్నది. మఱియు ఏయవి అవశిష్ట ములయి భూమినాశ్రయించియున్నవో అవన్నియు అన్నమువల్లనుండియే జన్మించుచున్నవి. అట్లు జన్మించినవన్నియు అన్నముచేతనే జీవించుచున్నవి. మఱియు జీవనలక్షణమగువృద్ధి అయినపిదప అన్నమునందే లీనమయి పోవు చున్నవి.

అన్నము ప్రాణులకంటె ముందుగా జన్మించినది కావున అన్నమయము లగు ఇతర భూతములన్నింటికిని అన్నము కారణము, కావున ప్రజలందఱు అన్నమునుండి పుట్టినవారు, అన్నమే జీవనముగాఁ గలవారలు, అన్నమే ప్రలయముగాఁ గలవారలు. అన్నము సకలప్రాణులకును ఔషధము - అనఁగా జఠరాగ్నికృతక్షుద్దాహమును శమింపఁజేయునది, అని చెప్పఁబడును.

ఎవ్వరీవిధముగా అన్నబ్రహ్మము నుపాసింతురో వారు సకలవిధమగు అన్నజాతమును పొందెదరు. ఎట్లనఁగా:—

నేను అన్నజుఁడను, అన్నాత్మకుఁడను, అన్నప్రలయుఁడను, కావున అన్నము బ్రహ్మము. అన్నాత్మోపాసనమువలన సర్వాన్నప్రాప్తిరూపఫల మెట్లు కలుగుననఁగా చెప్పఁబడుచున్నది:—

అన్నమే భూతములకంటె జ్యేష్ఠము. అనఁగా భూతములకంటె ముందు పుట్టినది కావున జ్యేష్ఠమగుచున్నది. అందువలననే "సర్వౌషధ" మనియుం చెప్పఁబడుచున్నది. కావున అన్నబ్రహ్మోపాసనకు సర్వాన్నప్రాప్తి ఉపపన్నమే యగుచున్నది.

అన్నమువల్లనుండియే భూతములన్నియు పుట్టుచున్నవనియు, పుట్టిన భూతములు అన్నముచేతనే వృద్ధిని చెందుచున్నవనియు, ఉపసంహారార్థము మఱల చెప్పఁబడినది.

ఇఁక అన్నశబ్దనిర్వచనము చెప్పఁబడుచున్నది:—భూతములచేత భక్షింపఁబడుచున్నది కనుకను, భూతములను భక్షించుచున్నది కావునను అన్నమని చెప్పఁబడుచున్నది. మూలమునందు "తస్మా దన్నం తదుచ్యత ఇతి" అనుచోటగల 'ఇతి' శబ్దము అన్నమయకోశవిషయమయిన మంత్రము సమాప్తమయినదని సూచించుచున్నది.

అన్నమయము మొదలుకొని ఆనందమయమువఱకు గల (కల్పిత) ఆత్మలకంటె అభ్యంతరతమమగు బ్రహ్మమును జ్ఞానముచేత ప్రత్యగాత్మగా

శాస్త్రము గనంబఱుచ దలంచి పెక్కుపొఱలుగల కొఱ్ఱబియ్యముపై ఉండు పొరలను తీసివేసి బియ్యమునుగనంబఱచునటుల అవిద్యాకృత పంచకోశము లను క్రమముగా (ఆత్మయని ప్రథమమున బోధించి పిదప) ఆత్మ గాదని నిరసించుచున్నది.

ఆ ఈ అన్నరసమయపిండముకంటె భిన్నమయి, అభ్యాంతరమై, పిండము వలె మిథ్యాపరికల్పితమగు ఆత్మ ప్రాణమయమైనది గలదు. ప్రాణమనఁగా వాయువు, తన్మయమనఁగా తత్ప్రాయము, తద్వికారమని భావము.

ఆ ప్రాణమయాత్మచేత ఈ అన్నరసమయాత్మ వాయువుచేత తిత్తి వలె పరిపూర్ణమయి యున్నది. ఆ ఈ ప్రాణమయాత్మకు శిరః, పక్ష, మధ్య పుచ్ఛాదికము (చెప్పఁబడియుండుట)చేత పురుషాకారము గలవాఁడే.

అన్నరసమయాత్మకు శిరఃపక్షాదికము ఎటుల సుప్రసిద్ధమో అట్లే (ఈ ప్రాణమయాత్మకు శిరఃపక్షాదికము) స్వయముగా లేదు కాని ఆ అన్న రసమయాత్మయొక్క పురుషాకారము ననుసరించి మూసయందు సంలగ్నమగు ప్రతిమవలె ఈ ప్రాణమయాత్మ పురుషవిధుఁడైయున్నాఁడు. స్వయముగా మాత్రము (పురుషాకారముగలవాఁడు) కాఁడు. ఈ విధముగా పూర్వ పూర్వ పురుషాకారమున ననుసరించి ఉత్తరోత్తరమగు పురుషాకారము అగును. పూర్వపూర్వమగు ఆత్మ ఉత్తరోత్తరమగు ఆత్మచేత పూర్ణమయి యుండును. (అనఁగా ప్రాణమయాత్మచేత అన్నమయాత్మ ఎటుల పూర్ణమయినదో, అట్లే ప్రాణమయాత్మ మనోమయాత్మచేత, మనోమయాత్మ విజ్ఞానమయాత్మచేత, విజ్ఞానమయాత్మ ఆనందమయాత్మచేత, పూర్ణమయినదని భావము.)

ఈ ప్రాణమయాత్మకు పురుషవిధత్వ మెట్లనఁగా:—

౧. ప్రాణమయమయిన అనఁగా వాయువికారమగు ఆత్మకు ప్రాణము అనఁగా ముఖమునుండియు నాసికాద్వారములనుండియు బయలువెడలెడి

నిశ్వాసమే 'శిరస్సు' అని కల్పించబడుచున్నది. (ఇటుల కల్పించుటకు నియామక మేమనఁగా) వచనమే-వేదవాక్యమే (ఇందులకు ప్రమాణము.) ముస్ముందు పక్షాదికల్పనము సైతము వచనముచేతనే-వేదవాక్యముచేతనే,

౨. వ్యానమనఁగా-వ్యానవాయువృత్తివిశేషము దక్షిణపక్షము.

3. అపానవాయువృత్తివిశేషము ఉత్తరపక్షము.

౪. ఆకాశము అనఁగా ఆకాశమునందు 'సమాన' మను పేరుగల ఏవృత్తివిశేషము గలదో అయ్యది ఆత్మ. ప్రాణవృత్త్యధికారమువలన (ఇచట ఆకాశమనఁగా సమానమని గ్రహించవలయును) ఈసమానవాయువృత్తి మధ్యస్థమగుటచేత ఇతరత్ర ఉండువృత్తులకంటె గణనీయమై ఆత్మయగుచున్నది. "మధ్యంహ్యేషా మఙ్గానా మాత్మా" శ్రు. ఐ. ఆరణ్యా. ౨. 3. ౫. అను శ్రుతియందు ఆత్మ మధ్యమునం దుండునది అనుట సుప్రసిద్ధము.

౫. పృథివీదేవత ఆధ్యాత్మికమగు ప్రాణమయాత్మను ధరించునది. కావున అనఁగా స్థితిహేతువగుటచేత పుచ్ఛము-ప్రతిష్ఠ యగుచున్నది. ఇందులకు శ్రుతిప్రమాణము:—

శ్రు. (పృథివ్యాం యా దేవతా) సైషా పురుషస్యాపాన మవష్టభ్య,
ప్రశ్నోపనిషత్. 3. ౮.

(అర్థ. పృథివియందు, ఏదేవత గలదో ఆదేవత పురుషునియొక్క అపానమును (అనఁగా ప్రాణమయకోశమును) అవలంబించి.)

లేనియెడల (అనఁగా పృథివీదేవత అవష్టంభనముజేసి శరీరమును నిలిపియుంచనియెడల) ఉదానవాయువృత్తిచేత ఊర్ధ్వగమనముగాని, గురుత్వముచేత పతనముగాని శరీరమునకు సంభవించును. కావున ప్రాణమయాత్మకు పృథివీదేవత ప్రతిష్ఠాహేతువగు పుచ్ఛము, ఈ ప్రాణమయాత్మ విషయమునందు ఒకశ్లోకము (మంత్రము) చెప్పఁబడుచున్నది.

వివరణము:—౧. 'తదప్యేషశ్లోకోభవతి' అని ప్రథమానువాకాంతమునం దొకవాక్యము గలదు. ఆ యనువాకాదియందు చెప్పఁబడిన "బ్రహ్మవిదాప్నోతి పరం" యను 'సూత్రభూతార్థమునకు వివరణప్రాయముగ 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' యని ఒక మంత్రము చెప్పఁబడినది. ఆ ఋక్కుతో సముచ్చయముగ 'తదప్యేషశ్లోకః' అని అపిశబ్దము చెప్పఁబడినది. ఈ "అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే" అను శ్లోకము—మంత్రము ౧౮ పాదములు కలిగియున్నది. లోకమునం దిన్ని పాదములుగల మంత్రము ప్రసిద్ధిలేకపోయినను దీనిని వైదికమయిన అతిచ్ఛందస్సునుగా గ్రహించవలయును.

౨. సత్త్వరజస్తమోగుణాత్మకమాయాకార్యము లగుటచేత పంచభూతములు గుణత్రయాత్మకము లగుచున్నవి. అందు ఆకాశాది పంచభూతములయొక్క ఏరజోంశములు గలవో ఆట్టి రజోంశములచేత వాక్పాణిపాదపాయూపస్థలను పంచకర్మేంద్రియములు ఆరబ్ధములయినవి. తద్రజోంశ సముదాయారబ్ధమయి, ప్రాణాపానాది క్రియాహేతువయి, క్రియాశక్త్యాత్మకమయినది ప్రాణము:—లింగశరీరమునందు జ్ఞానశక్తి, క్రియాశక్తి యని శక్తిద్వయముగలదు. వానిలో క్రియాశక్తి కార్యభూతమయినది ప్రాణము. దానికి ప్రాణాపానాది పంచవృత్తులు వ్యాపారవిశేషములు. ఇటుల పంచప్రాణ కర్మేంద్రియరూప ప్రాణమయకోశవిశిష్టమయిన ఆత్మను "తస్మాద్వా ఏతస్మాత్" అని శ్రుతి ఉపదేశించి బాహ్యమయిన ఆత్మను—స్థూలదేహమును అనాత్మయని ప్రతిపాదించుచున్నది. ప్రాణమయాత్మయందు "అహం ప్రాణిమి, అహం ఉచ్ఛ్వసిమి" మున్నగు ఆత్మధర్మములు ఆరోపితములయి యుండుటచేత ఆత్మత్వము నెఱుఁగవలయును. మఱియు దేహమధ్యమునందుండి ప్రాణమయాత్మ అనుభవించుచున్నాఁడు కావున బాహ్యమయిన స్థూలదేహముకంటె వేఱుగా ప్రాణమయాత్మను ఉపాయముచేత నెఱుంగవలయును. కత్తికి ఒర వలె అన్నమయమయిన యీ స్థూ

దేహము ప్రాణమయాత్మకు ఆచ్ఛాదకమగుటచేత కోశమని చెప్పఁబడినది. ఇట్లే, మనోమయాత్మ నుపదేశించినప్పుడు మనోమయాత్మకంటె బాహ్యమయిన పూర్వపూర్వ ప్రాణమయాదికమును కోశములుగా గ్రహించవలయును.

3. అన్నమయకోశమునకు శిరస్సు మున్నగు అవయవము లున్నవి. ప్రాణమయకోశము పురుషాకారముగలది కాకపోవుటచేత స్వయముగా శిరస్సు మున్నగు అవయవము లుండఁజాలవు. అయినను ఉపాసనాసౌకర్యార్థము శిర ఆద్యవయవకల్పనమును శ్రుతి కల్పించియున్నది.

శ్రుతియందు "ఆకాశ ఆత్మా" యని గలదు. ఆవాక్యమునకు శ్రీశఙ్కరాచార్యులవారు వ్యాఖ్యానమొనర్చుచు "ఆకాశ ఆత్మా, య ఆకాశస్థో వృత్తి విశేషః సమానాఖ్యః స ఆత్మేవ ఆత్మా. ప్రాణవృత్త్యధికారాత్" అని చెప్పియున్నారు. దాని ననుసరించియే మేము "సమానవృత్తి" యని గ్రహించితిమి. కాని "పృథివీ పుచ్ఛం ప్రతిష్ఠా" అను శ్రుతివాక్య వ్యాఖ్యానమును "పథివీతి పృథివీదేవతా ఆధ్యాత్మికస్య ప్రాణస్యధారయిత్రీ స్థితిహేతుత్వాత్" అని వ్యాఖ్యాన మొనర్చి యున్నారు.

శ్రీసాయనాచార్యులవారు మాత్రము "పృథివీశబ్దేన అవశిష్ట ఉదానవాయు రుపలక్ష్యతే. ముఖ్యార్థస్వీకారేహిప్రాణమయకోశాధికారో బాధ్యేత, యథా పృథివీ ప్రాణినాం అవస్థానహేతుత్వాత్ ప్రతిష్ఠా, తథైవోదానవాయుః ప్రాణాదివాయూనాం దేహే అవస్థానహేతుః, యావదయ ముదానవాయు రుత్క్రాంతిం న జనయతి తావ త్ప్రాణాపానాదీనాం దేహే అవస్థానం" అని వ్యాఖ్యాన మొనర్చి యున్నారు.

దీనివలన 'పృథివి' యనఁగా ప్రాణమయకోశాధికారము ననుసరించి ఉద్గానవాయువని గ్రహించవలసినదని సాయణాచార్యాభిప్రాయమై యున్నది.

వార్తికకారులగు సురేశ్వరాచార్యులవారు:—

శ్లో. "పృథివీదేవతాపుచ్ఛం సైషేతిశ్రుతిదర్శనాత్,
అసౌ రాధ్యాత్మికస్యైషాస్థితిహేతుః ప్రకీర్తితా."

వార్తిక. ౨. ౩. ౭౬.

అని చెప్పియున్నారు. వార్తికారులవారు భాష్యకారవచనము ననుసరించియే వ్రాసియున్నారు.

దీనివలన శ్రీశంకరభగవత్పాద సురేశ్వరాచార్యుల యభిప్రాయము నకు సాయణా చార్యాభిప్రాయము విరుద్ధముగ నున్నదని స్ఫురించుచున్నను, ఈ విరోధాభాసమునకు ఒకవిధముగ పరిహారము గలదు—

శ్రీశంకరానందులవారు శ్రుతులకు వ్యాఖ్యానరూపముగ తా మొనర్చిన ఆత్మపురాణగ్రంథమునందు ఈ శ్రుతివాక్యమున కీవిధముగా వ్యాఖ్యాన మొనర్చిరి. అయ్యది ఈ విరోధమునకు పరిహారరూపమని చెప్ప వచ్చును:—

శ్లో. "ప్రాణరూపేచ కోశే ఽస్మిన్ శిరః ప్రాణ ఉదీరితః,
అపాన ఉత్తరః పక్షో వ్యానో దక్షిణఏవచ. ౧౨౯
ఆకాశేన స్సమానో య ఉదరం సతు కీర్తితః,
పృథివీన ఉదానోఽయం ప్రతిష్ఠా పుచ్ఛ మీరితః. ౧౩౦
ఉదాననిర్గమా ద్యాతి ప్రాణ స్సర్వో బహి ర్యతః,
ఉదాన స్తత ఏవాయం ప్రతిష్ఠా పరికీర్తితః." ౧౩౧

ఆత్మపురాణ. అధ్యా. ౧౦.

ఉదానవృత్తి ఊర్ధ్వగమనహేతుకమనుటకు శ్రుతిప్రమాణము:—

అథైకయోర్ధ్వ ఉదానః పుణ్యేన పుణ్యంలోకం నయతి పాపేన పాప ముభాభ్యామేవ మనుష్యలోకమ్. ప్రశ్నోపనిషత్. ౩. ౭.

ఇతరగ్రంథభాగములు.

భాష్యవార్తికము:—బ్రహ్మ. ౫౭-౭౭.

అనుభూతి:—అధ్యా. ౨. ౪౮-౫౦

ఆత్మపురాణము:—అధ్యా. ౧౦ శ్లోక. ౧౦౯-౧౨౪

3. తృతీయోఽనువాకః

ప్రాణమయకోశః, మనోమయకోశః, తస్యోపాస్యస్వరూపమ్.

మం. ప్రాణం దేవా అను ప్రాణన్తి । మనుష్యాః పశవశ్చ యే ।
ప్రాణో హి భూతానా మాయుః । తస్మా త్సర్వా
యుష ముచ్యతే । సర్వమేవ త ఆయు ర్యన్తి । యే
ప్రాణం బ్రహ్మోపాసతే । ప్రాణో హి భూతానా మా
యుః । తస్మా త్సర్వాయుష ముచ్యత ఇతి । తస్యైష
ఏవ శారీర ఆత్మా । యః పూర్వస్య । తస్మా ద్వా
ఏతస్మా త్ప్రాణమయాత్ । అన్యోఽన్తర ఆత్మా మనో
మయః తేనైష పూర్ణః । స వా ఏష పురుషవిధ
ఏవ । తస్య పురుషవిధతామ్ । అన్వయం పురుషవిధః ।
తస్య యజురేవ శిరః । ఋగ్దక్షిణః పక్షః । సామో
త్తరః పక్షః । ఆదేశ ఆత్మా । అథర్వాఙ్గిరసః పుచ్ఛం
ప్రతిష్ఠా । తదప్యేష శ్లోకో భవతి ॥3॥

టీ. దేవాః = అగ్ని మున్నగుదేవతలు, ప్రాణం = వాయ్వాత్మకుఁడును ప్రాణశక్తియుక్తుఁడునగు ప్రాణమును, అను = అనుసరించి, ప్రాణన్తి = ప్రాణనకర్మను చేయుచున్నారు. లేక, దేవాః = ఇంద్రియములు, ప్రాణం అను = ముఖ్యప్రాణమునుగూర్చి, ప్రాణంతి = చలించుచున్నవి. యే=ఏ, మనుష్యాః పశవః చ=మనుష్యులు పశువులు గలరో, (తేప్రాణం అనుప్రాణంతి = వారును ప్రాణము ననుసరించియే చలించుచున్నారు.) ప్రాణః = ప్రాణము, భూతానాం = భూతములకు, ఆయుః = జీవనము, తస్మాత్ = అందువలన, సర్వాయుషం = అందఱకు జీవనమని, ఉచ్యతే = చెప్పఁబడుచున్నది. ఇతి = (ప్రాణమయకోశమునకు సంబంధించినమంత్రము) సమాప్తమయినది.

తస్య=ఆవెనుకఁ జెప్పఁబడిన, పూర్వస్య=అన్నమయాత్మునకు, శారీరః = అన్నమయశరీరమునందు పుట్టిన, యః ఏషః = ఏ ఈప్రాణమయుఁడుగలఁడో, సః = వాఁడే, ఆత్మా = ఆత్మ.

తస్మాత్ = ఆ, ఏతస్మాత్ = ఈ, ప్రాణమయాత్ = ప్రాణమయాత్మకంటె, అన్యః = వేఱయిన, మనోమయః ఆత్మా = మనోమయుఁడగు ఆత్మ, అంతరః = లోపలనుండువాఁడు (గలఁడు), తేన = ఆమనోమయాత్మచేత, ఏషః=ఈప్రాణమయాత్మ, పూర్ణః = పరిపూర్ణుఁడైనాఁడు.

సః ఏషః = ఆ ఈ ప్రాణమయాభ్యంతరాత్మయగు మనోమయాత్మ, పురుష విధః ఏవ=పురుషాకారము గలవాఁడే, తస్య పురుషవిధతాం అను = ఆప్రాణమయాత్మయొక్క పురుషాకారము ననుసరించి, అయం పురుష విధః = ఈ మనోమయాత్మ పురుషాకారము గలవాఁడు. తస్య = ఆ మనోమయాత్మునకు, యజుః = యజుస్సు, శిరః=శిరస్సు, ఋక్ = ఋక్కు, దక్షిణః పక్షః = దక్షిణపుపక్షము, సామ = సామము, ఉత్తరః పక్షః = ఉత్తరపు పక్షము, ఆదేశః=విధి - అనఁగా బ్రాహ్మణము, ఆత్మా = ఆత్మ, అథర్వాంగిరసః = అథర్వాంగిరో మహర్షిచేత గనుఁగొనఁబడిన మంత్రబ్రాహ్మణములు,

పుచ్ఛంప్రతిష్ఠా = ప్రతిష్ఠావహమగు పుచ్ఛము, తత్ అపి = ఆవిషయమును గూర్చి, ఏవశ్లోకః = ఈ చెప్పంబోవుశ్లోకము = మంత్రము, భవతి = అగుచున్నది.

తా. అగ్న్యాదిదేవతలు వాయుస్వరూపము కలిగి ప్రాణశక్తిగల ప్రాణము ననుసరించియే తదాత్మగలవారలయి ప్రాణనకర్మను చేయుచున్నారు, ప్రాణక్రియచేత క్రియగలవారలుఅగుచున్నారు. (ఈయర్థము శబ్దశక్తిని పట్టి చెప్పంబడినది.) ఇది అధ్యాత్మప్రకరణము కావున దేవశబ్దము ఇంద్రివాచకము. కనుక ఇంద్రియములు ముఖ్యప్రాణము ననుసరించి చేష్టలు కలిగియున్నవి. అట్లే మనుష్యులు పశువులు మున్నగు ప్రాణులు ప్రాణకర్మచేతనే చేష్టలుగలవారలయి గనంబడుచున్నారు. కావున ప్రాణిసమూహము కేవలము పరిచ్ఛిన్నమైన అన్నమయాత్మచేతనే ఆత్మవంతులయి యుండలేదు. ఇంక నేమనంగా తదన్నమయదేహమునకు అంతర్గతుండైనట్టియు, సాధారణముగ సకలదేహములందు వ్యాపించియున్నట్టియు ప్రాణమయాత్మచేత మనుష్యాదులందఱు ఆత్మవంతులయి గనంబడుచున్నారు. ఈవిధముగా పూర్వపూర్వమును వ్యాపించినట్టియు, ఉత్తరోత్తరముసూక్ష్మములయినట్టియు, అవిద్యాకృతములయినట్టియు, ఆకాశాది భూతారబ్ధములయినట్టియు, మనోమయాదికమును, ఆనందమయాంతమును అగు కోశసంఘముచేత సకల ప్రాణులు అనేకములగు పొరలుగల కొఱ్ఱగింజవలె ఆత్మవంతులయి యున్నారు.

అట్లే స్వాభావికమైనట్టియు, ఆకాశాదికమునకు కారణమయినట్టియు, నిత్యమయినట్టియు, అవికృతమయినట్టియు, సర్వగతమయినట్టియు, సత్యజ్ఞానానంతలక్షణమయినట్టియు, పంచకోశాతిగమయినట్టియు సర్వాత్మచేత (సర్వప్రాణులు) ఆత్మవంతులయి యున్నారు. (ఏలయనంగా) అతండే యథార్థముగా అందఱకు ఆత్మయనువిషయమే స్ఫుటముగా చెప్పంబడినది అగుచున్నది.

"ప్రాణం దేవా అను ప్రాణంతి" మున్నగు శ్రుతివాక్యములు చెప్పఁబడినవి. ఇట్లేల చెప్పఁబడినది? ఇందులకు సమాధానము:—ప్రాణమే సకల ప్రాణులకు జీవనభూతము. ఇందులకు శ్రుతిప్రమాణము:—

శ్రుతి. "యావద్ధ్యస్మిన్ ఛరీరే ప్రాణో వసతి తావ దేవాయుః"

కౌషీతక్యుపనిషత్. 3. ౨.

అందఱకు ఆయువగునది సర్వాయు వనంబడును. ఆ సర్వాయువే సర్వాయుష మనంబడును. అందువలన ప్రాణమే సర్వాయుష మనంబడును.

ప్రాణములు పోవుట యనఁగా మరణించుటయని లోకమునందు ప్రసిద్ధముగదా. ప్రాణమునకు సర్వాయుష్ట్వము లోకమునందు సుప్రసిద్ధియేగదా. అందువలన బాహ్యమయినట్టియు, అసాధారణమయినట్టియు అన్నమయాత్మను పరిత్యజించి, ఆంతరమయినట్టియు సాధారణమయినట్టియు ప్రాణమయాత్మరూపుఁడును అగు బ్రహ్మమును "సర్వభూతములయొక్క జీవనమునకు హేతుభూతమగు ప్రాణమే నేను" అని ఎవ్వరు ఉపాసనమును సలిపెదరో వారు ఆయుస్సునంతయు (అనఁగా ౧౦౦ సంవత్సరముల ఆయుస్సును) ఈ లోకమునందు పొందెదరు, నిర్ణీతమగు ఆయుస్సునందుఁగాక (ఈ లోపల) అపమృత్యువుచేత చావరు. శ్రుతియందు "శతాయుః పురుషః" అని ప్రసిద్ధియుండుటచేత మూలమునందుగల 'సర్వమాయుః' అనుపదమునకు "నూరుసంవత్సరములు" అని అర్థము చెప్పుట న్యాయమే. ఏలయనఁగా:—ప్రాణమే భూతములకు ఆయుస్సుగదా. అందువల్లనే ప్రాణము 'సర్వాయుష' మని చెప్పఁబడుచున్నది. ఎవ్వఁడు ఏగుణము గలవానినిగా బ్రహ్మము నుపాసించుచున్నాఁడో వాఁడు అట్టి గుణములను పొందినవాఁ డగుచున్నాఁడు, అని విద్యాఫలమును పొందుననుటకు హేతువుగా "ప్రాణో హి భూతానా మాయుః" అని మఱల చెప్పఁబడినది.

ఆ వెనుక చెప్పఁబడిన అన్నమయాత్మకు అన్నమయశరీరమునందు పుట్టిన ఆత్మ ప్రాణమయాత్మయే.

మనోమయకోశ వివరణము.

ఆ ఈ ప్రాణమయాత్మకంటె అభ్యంతరుఁడై మనోమయాత్మ గలఁడు. మనస్సనఁగా సంకల్పవికల్పాత్మకమగు అంతఃకరణము. తన్మయుఁడనఁగా తద్వికారుఁడు, ఆ మనోమయుఁడు ప్రాణమయునకు అభ్యంతరాత్మ.

౧. ఆ మనోమయాత్మునకు యజుస్సు (యజుర్వేదము) శిరము.

౨. ఋక్కు (ఋగ్వేదము) దక్షిణపక్షము.

3. సామము (సామవేదము) ఉత్తరపక్షము.

౪. అథర్వాంగిరిస్సులు (అధర్వణవేదము) ప్రతిష్ఠావహమగు పుచ్ఛము.

యజుస్సనగా పాదమునకు ఇన్ని అక్షరములని నిర్ణయములేని మంత్రవిశేషము. అట్టిధర్మముగల మంత్రములందు యజుశ్శబ్దము వర్తించును. అట్టి మంత్రము శిరస్సు. యాగాదికమునందు స్వస్వరూపముగ ఉపకారము చేయునట్టి అంగము యజుస్సగుటచేత (ఇతరవేదములకంటె ప్రధానమగుటచేత (శిరస్సనుట యుక్తమే) యజుర్వేదమంత్రముచేతనే స్వాహాకారమును పలికి హవిస్సు హుతమొనర్పఁబడును. ఇచట శిరస్సు, దక్షిణపక్షము మున్నగు కల్పనము శ్రుతియందు ప్రతిపాదింపఁబడినది. ఇట్లే సర్వత్ర గ్రహించునది.

మనస్సువల్లనుండి స్థాన, ప్రయత్న, నాద, స్వర, వర్ణ, పద, వాక్య, విషయమయినట్టియు, తత్సంకల్పనాత్మకమును అగు వృత్తివిశేషము తద్భావితమై శ్రోత్రకరణమార్గముచేత యజుస్సంకేత విశిష్టమగుటచేత యజుస్సని చెప్పఁబడుచున్నది.

ఇట్లే ఋక్, సామ అనుపదములనుగూర్చి ఎఱుంగునది. ఈ విధముగా మంత్రములు మనోవృత్తిరూపములగుటచేత మంత్రముల ఆవృత్తియే (అనఁగా సంఖ్యాక్రమముగ మంత్రములు ఆవర్తింపఁబడినయెడల) 'మానస-జపము' అగుచున్నది! లేనియెడల ఘటాదికమువలె మంత్రావృత్తియే జరుగఁజాలదు. అప్పుడు మానసమగు జపమే లేకపోవును.

అసంఖ్యాకము లగుకర్మలందు "మంత్రావృత్తి" (శాస్త్రములందు) చెప్పఁబడియున్నది.

అక్షరవిషయకమగు స్మృతిని ఆవృత్తిచేసినను మంత్రావృత్తి యగునని యనునెడల అట్లనరాదు. అటుల అక్షరావృత్తిని చేయునెడల ముఖ్యార్థము నాచరించినట్లు కాదు.

మఱియు.—

శ్రు. త్రిః ప్రథమా మన్వాహ త్రిరుత్తమామ్.

తై. సం. ౨. ౫. ౭. ౧.
శత. బ్రా. ౧. ౩. ౨. ౬.
ఐత. బ్రా. ౧. ౩. ౨. ౫.

అను శ్రుతి ఋగావృత్తిని విధించుచున్నదిగాని అక్షరావృత్తిని విధించుటలేదు. అక్షరావృత్తియని యర్థమును గ్రహించినయెడల "త్రిః ప్రథమా మన్వాహ" అను మంత్రమునందు విధించిన ముఖ్యార్థమును పరిత్యజించినట్లగును.

కావున మనోవృత్త్యుపాధిపరిచ్ఛిన్నమును, మనోవృత్తినిష్ఠమును అగు ఆత్మచైతన్యము, ఆద్యంతరహితము, యజుశ్శబ్దవాచ్యమగు ఆత్మవిజ్ఞానమే మంత్రములని చెప్పఁబడుచున్నవి. కావుననే వేదములు నిత్యములు అని సుప్రసిద్ధి ఉపపన్నమగుచున్నది.

లేనియెడల (అనఁగా వేదములు మనోవృత్తిమాత్రము లనిగాని శబ్ద రాశిమాత్రములు అనిగాని తలంచినయెడల) రూపాదికమువలె అనిత్యము కావలసివచ్చును. అయ్యది యుక్తముకాదుగదా.

"సర్వే వేదా యత్రైకం భవంతి, సర్వే హోతారో యత్రైకం భవంతి, స మానసీన ఆత్మా". తై. అర. 3. ౧౧. ౧.

అను శ్రుతి ఋగాదివేదములు నిత్యాత్మవలెనే నిత్యములని చెప్పుచున్నది. (అట్లయిననేగాని పైశ్రుతి) యుక్తముకాదు.

"ఋచో అక్షరే పరమే వ్యోమన్ యస్మిన్ దేవా అధి విశ్వే నిషేదుః" (తై. బ్రా. 3. ౧౦, ౯.) అను మంత్ర మీవిషయమునే ప్రతిపాదించుచున్నది. ఆదేశమనఁగా ఇచట బ్రాహ్మణము, ఇందు చెప్పఁదగిన విశేషముల నతిదేశించుటచేత బ్రాహ్మణభాగము (ఆదేశమనఁబడుచున్నది) అథర్వాంగిరసునిచేత దృష్టములగుమంత్రములున్ను, బ్రాహ్మణమున్ను శాంతికపౌష్టికాదిప్రతిష్ఠాహేతుకర్మప్రధానములగుటచేత ఆ మనోమయాత్మకు పుచ్ఛమువలె ప్రతిష్ఠాహేతుక మగుచున్నవి. ఆ విషయమును గూర్చియే శ్లోకము—మంత్రము మనోమయాత్మప్రకాశకము చెప్పఁబడుచున్నది.

వివరణము:—౧. ఈప్రాణమయవివరణరూపమగు మంత్రము అష్టపాదాత్మకమగు అతిచ్ఛందస్సని గ్రహించునది-

౨. "పూర్వపూర్వమును వ్యాపించినట్టియు..." మున్నగువాక్యము యొక్క వివరణము.

కోశములు—అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయములు అని ఐదు. అందు—

౧. అన్నమయకోశము ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములచేత వ్యాప్తమయియుండును.

౨. ప్రాణమయకోశము మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములచేత వ్యాప్తమయియుండును.

3. మనోమయకోశము విజ్ఞానమయ, ఆనందమయ కోశములచేత వ్యాప్తమయియుండును.

౪. విజ్ఞానమయకోశము ఆనందమయ కోశముచేత వ్యాప్తమయియుండును.

అనఁగా అన్నమయకోశము ౪ కోశములచేతను, ప్రాణమయకోశము 3 కోశములచేతను, మనోమయకోశము ౨ కోశములచేతను, విజ్ఞానమయ కోశము ౧ కోశముచేతను వ్యాప్తమయియుండును.

ఈ యర్థమునే భాష్యవార్తికకారులు ఇటుల చెప్పిరి:—

శ్లో. కోశై శ్చతుర్భిః సంవ్యాప్తో యథైవాన్నమయః పురా,
జానీయా దుత్తరా నేవం త్రిద్వ్యేకార్థ సమన్వయాత్.

తైత్తి. భాష్య. వార్తి. బ్రహ్మ. ఖండ. ౨. ౭౧.

ఇతర గ్రంథభాగములు.

భాష్యవార్తికము.	బ్రహ్మవల్లి. శ్లో. ౭౮-౧౦3
అనుభూతిప్రకాశము.	అధ్యా. ౨. శ్లో. ౫౧-౫౮
ఆత్మపురాణము.	అధ్యా. ౧౦. శ్లో. ౧౨౫-౧3౬

౪. చతుర్థోఽనువాకః

మనోమయశ్లోకః, విజ్ఞానమయకోశః, తస్య ఉపాస్యస్వరూపః.

మం. యతో వాచో నివర్తంతే । అప్రాప్య మనసా సహ ।
ఆనందం బ్రహ్మణో విద్వాన్ । న బిభేతి కదాచనేతి ।
తస్యైష ఏవ శారీర ఆత్మా । యః పూర్వస్య । తస్మా
ద్వా ఏతస్మాన్మనోమయాత్ అన్యోఽన్తర ఆత్మా
విజ్ఞానమయః । తేనైష పూర్ణః । స వా ఏష పురుష
విధ ఏవ । తస్య పురుషవిధతామ్ । అన్వయం పురుష
విధః । తస్య శ్రద్ధైవ శిరః । ఋతం దక్షిణః పక్షః ।
సత్య ముత్తరః పక్షః । యోగ ఆత్మా । మహః పుచ్ఛం
ప్రతిష్ఠా తదప్యేష శ్లోకో భవతి।

టీక. యతః = ఏయానందస్వరూపునివల్లనుండి, వాచః = వాక్కులు, మనసా సహ = మనస్సుతోకూడా, అప్రాప్య = పొందక, నివర్తన్తే = మఱలు చున్నవో (అట్టి), బ్రహ్మణః = బ్రహ్మముయొక్క (స్వరూపభూతమగు),

ఆనందం = ఆనందమును (మనోమయాత్మయొక్క శిరఃపక్షాది రూపమగు దానిని), విద్వాన్ = ఉపాసించుచున్నవాఁడు, కదాచన = ఒకప్పుడును, న బిభేతి = భయంపడఁడు, ఇతి = మనోమయకోశమును వివరించినమాత్రము సమాప్తమయినది.

తస్య=ఆ, పూర్వస్య = పూర్వుఁడయిన ప్రాణమయాత్మునకు, శారీరః= ప్రాణమయశరీరమునందు పుట్టిన, ఆత్మా ఏషః ఏవ = మనోమయాత్మ ఇతఁడే.

తస్మాత్ = ఆ, ఏతస్మాత్ = ఈ, మనోమయాత్ = మనోమయాత్మ కంటె, అన్యః = వేఱయినట్టి, అంతరః ఆత్మా = అభ్యంతరుఁడగు ఆత్మ, విజ్ఞానమయః వై = విజ్ఞానమయుఁడు గదా, తేన = ఆవిజ్ఞానమయాత్మ చేత, ఏషః = ఈమనోమయాత్మ, పూర్ణః = పరిపూర్ణుఁడై యున్నాఁడు.

సః=ఆ, ఏషః = ఈవిజ్ఞానమయాత్మ, పురుషవిధః ఏవ = పురుషవిధము గలవాఁడే, తస్య = ఆమనోమయాత్మయొక్క, పురుషవిధతాం అను = పురుషవిధత్వము ననుసరించి, అయం = ఈవిజ్ఞానాత్మ, పురుషవిధః = పురుష విధుఁ డగుచున్నాఁడు. తస్య = ఆవిజ్ఞానమయాత్మకు, శ్రద్ధా ఏవ=శ్రద్ధయే, శిరః = శిరస్సు, ఋతం = ఋతము, దక్షిణః పక్షః = దక్షిణపక్షము, సత్యం= సత్యము, ఉత్తరః పక్షః = ఉత్తరపక్షము, యోగః = సమాధానము, ఆత్మా = ఆత్మ, మహః = మహత్తత్త్వము, పుచ్ఛం ప్రతిష్ఠా = ప్రతిష్ఠావహ మగుపుచ్ఛము.

తదపి = ఆవిజ్ఞానమయుని గూర్చి, ఏషః శ్లోకః = ఈచెప్పఁబోవునట్టి శ్లోకము—మంత్రము, భవతి = కలదు.

తా. ఏయానందాత్మను గుఱించి వర్ణింపఁదలఁచి వాక్కు మనస్సు సైతము ఆయానందాత్మను పొందకయే వెనుకకు మరలుచున్నవో, అట్టి బ్రహ్మ మునుయొక్క ఆనందస్వరూపమును ఉపాసించువానికి దేనివల్లనుండియు భయములేదు, ఆవెనుక చెప్పఁబడిన ప్రాణమయాత్మునకు ప్రాణమయశరీరము

నందు పుట్టినవాఁడు మనోమయాత్మయే. ఆయీమనోమయాత్మకంటె వేఱయి, మనోమయాత్మకు అభ్యంతరుఁడై, విజ్ఞానమయాత్మగలఁడు, వెనుకటి యనువాకమునందు మనోమయుఁడు వేదాత్మయని చెప్పఁబడినది. వేదార్థవిషయమగు బుద్ధి నిశ్చయాత్మక మగునెడల విజ్ఞాన మనఁబడును. నిశ్చయాత్మకమైన ఆ విషయపరిచ్ఛేదమే అంతఃకరణముయొక్క ధర్మము. నిశ్చయవిజ్ఞానములను ప్రమాణస్వరూపములచేత నిర్ణయింపఁబడినవాఁడే విజ్ఞానమయుఁడగు ఆత్మ.

లోకమునందు యజ్ఞాదికర్మజాతము ప్రమాణభూతమగు విజ్ఞానము కలిగియే ఆచరింపఁబడుచున్నది. విజ్ఞానముచేతనే యజ్ఞాదిక మాచరింపఁబడుచున్నదని పైయనువాకమునందే చెప్పఁబడఁగలదు.

౧. అట్టి నిశ్చయజ్ఞానముగలవానికి చేయఁదగినపనులయందు ప్రథమమున ఏశ్రద్ధ జనించునో అట్టిశ్రద్ధ చేయఁదగినవాని కన్నిఁటి కంటె మొట్టమొదటిది కావున అయ్యది శిరమువలె శ్రేష్ఠమగుటచేత శిరమని చెప్పంబడుచున్నది. (గురువుచేతను శాస్త్రముచేతను చెప్పఁబడిన తత్త్వమునందును, దానిని తెలిసి కొనుటయందును, తదుపాయములందును గల పరమవిశ్వాసము శ్రద్ధ యనంబడును. శ్రద్ధాదులు వృత్తిరూపము లగుటచేత మనోమయుని యొక్క కార్యములయినప్పటికిన్ని విజ్ఞానమయుఁడు కర్తయగుటచేత మనోవృత్తులుకూడ విజ్ఞానమయసంబంధములయినవి కావచ్చునను అభిప్రాయముతో విజ్ఞానమయునకు శ్రద్ధయే శిరస్సని చెప్పఁబడుట ఇట ఉపపన్నమయినది.)

౨. ఋతము దక్షిణపక్షము. (ఋత మనఁగా శాస్త్రానుసారము కర్తవ్యమని నిశ్చయింపఁబడిన విషయము).

3. సత్యము ఉత్తరపక్షము. (పయిన చెప్పఁబడినఋతము వాక్కాయములచేత అనుష్ఠితమయినది సత్య మనంబడును.)

४. యోగము అనఁగా సమాధి ఆత్మ. దేహికి బాహ్వాది అవయవము లున్నయెడల తత్తత్కార్యము లెటుల సానుకూలములయి యుండునో అట్లే సమాధిస్థుఁడగు వానికి శ్రద్ధా, ఋత, సత్యము లనునవి బ్రహ్మప్రాప్తికి సాధనభూతములయి యుండును. (దేహావయవములలోపల మధ్య కాయ మెటుల ప్రధానమో, అట్లే బ్రహ్మప్రాప్తికి సాధనభూతములగు శ్రద్ధ, ఋతము, సత్యము మున్నగువానిలో సమాధి ప్రధానమయిన దని గ్రహించు నది.) కావున విజ్ఞానమయాత్మునకు సమాధానము—అనఁగా యోగము మధ్యావయవము.

౫. మహత్తత్త్వము అనఁగా హిరణ్యగర్భుఁడు ప్రతిష్ఠ. మహత్తత్త్వమే మొట్టమొదటపుట్టినది. ఇందులకు శ్రుతిప్రమాణము:—

శ్రు. మహ ద్యక్షం ప్రథమజం వేద. బృ. ఉ. ౫. ४. ౧.

కార్యములకు కారణము ప్రతిష్ఠ యగుచున్నది. లోకమునందు లతలకు వృక్షములకు పృథివి ప్రతిష్ఠ యగుట ప్రత్యక్షానుభవసిద్ధముగదా. అదే విధముగా సర్వబుద్ధివిజ్ఞానములకు మహత్తత్త్వము కారణము కావున ఆ విజ్ఞానమయాత్మకు మహత్తత్త్వము ప్రతిష్ఠ యగుచున్నది. ఆవిజ్ఞానమయాత్మనుగురించినవర్ణనము ఈ క్రిందిమంత్రమునం దిటుల చెప్పఁబడుచున్నది. అన్నమయాదికోశములనుగురించిన మంత్రము లిదివఱకు ఎటుల చెప్పఁబడినవో అదేవిధముగా విజ్ఞానమయాత్మను గురించియు మంత్రము గలదు.

---

౫. పంచమోఽనువాకః.

విజ్ఞానమయేశ్లోకః, ఆనందమయకోశః, తస్యోపాస్యస్వరూపః.

మం. విజ్ఞానం యజ్ఞం తనుతే కర్మాణి తనుతేఽపి చ।
విజ్ఞానం దేవాః సర్వే। బ్రహ్మ జ్యేష్ఠ ముపాసతే।
విజ్ఞానంబ్రహ్మ చేద్వేద। తస్మాచ్చే న్న ప్రమాద్యతి।
శరీరే పాప్మనో హిత్వా। సర్వా న్కామాన్త్సమశ్ను
తఇతి। తస్యైష ఏవ శారీర ఆత్మా। యః పూర్వస్య।
తస్మాద్వా ఏతస్మా ద్విజ్ఞానమయాత్। అన్యోఽన్తర
ఆత్మాఽఽనన్దమయః। తేనైష పూర్ణః। స వా ఏష
పురుషవిధ ఏవ। తస్య పురుషవిధతామ్। అన్వయం
పురుషవిధః। తస్యప్రియ మేవ శిరః। మోదో దక్షిణః
పక్షః। ప్రమోద ఉత్తరః పక్షః। ఆనంద ఆత్మా।
బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా। తదప్యేష శ్లోకో భవతి।

టీక. విజ్ఞానం = విజ్ఞానము, యజ్ఞం = యజ్ఞమును, తనుతే = చేయు చున్నది. అపిచ=మఱియున్నూ, కర్మాణి=లౌకికకృత్యములను, తనుతే = చేయు

చున్నది, సర్వేదేవాః = దేవతలందఱున్నూ, జ్యేష్ఠం = అందఱికంటె పెద్దది అయినట్టి, విజ్ఞానంబ్రహ్మ = విజ్ఞానమను బ్రహ్మమును, ఉపాసతే = ఉపాసించుచున్నారు. విజ్ఞానం బ్రహ్మ = విజ్ఞానబ్రహ్మమును, వేద చేత్ = ఎఱింగి, తస్మాత్ = ఆవిజ్ఞానబ్రహ్మమునుండి, న ప్రమాద్యతి చేత్ = ప్రమాదమును పొందనియెడల, శరీరే = శరీరమునందుఁగల, పాప్మనః = పాపములను, హిత్వా=వదలి, సర్వాన్ కామాన్ = సమస్తకామములను, సమశ్నుతే = పొందుచున్నాఁడు.

యః = ఏ విజ్ఞానమయుఁడు (ఇపుడు చెప్పఁబడినాఁడో), (సః = ఆ), ఏషః ఏవ = ఈ విజ్ఞానమయుఁడే, తస్య = ఆ, పూర్వస్య = వెనుక చెప్పఁబడిన మనోమయునకు, శారీరః = మనోమయశరీరమునందు పుట్టిన, ఆత్మా = ఆత్మ.

తస్మాత్ = ఆ, ఏతస్మాత్ = ఈ, విజ్ఞానమయాత్ = విజ్ఞానమయుని కంటె, అన్యః = ఇతరుఁడగు, ఆనందమయః = ఆనందమయుఁడు, అంతరః = అంతరుఁడగు, ఆత్మా = ఆత్మ, తేన = ఆంతరుఁడగు ఆయానందమయుని చేత. ఏషః = ఈ విజ్ఞానమయుఁడు, పూర్ణః = పూర్ణముగా వ్యాప్తుఁడయి యున్నాఁడు.

స ఏషః=ఆ ఈ ఆనందమయుఁడు, పురుషవిధఃఏవవై = పురుషాకారము గలవాఁడే అగుచున్నాఁడు. తస్య = ఆవిజ్ఞానమయునియొక్క, పురుషవిధతాం = పురుషాకారత్వమును, అను = అనుసరించియే, అయం = ఈ యానందమయుఁడు, పురుషవిధః = పురుషాకారము గలవాఁ డగు చున్నాఁడు.

తస్య = ఆ యానందమయునకు, ప్రియంఏవ = ప్రియమే, శిరః = శిరస్సు, మోదః = మోదమే, దక్షిణః పక్షః=దక్షిణపుపక్షము, ప్రమోదః = ప్రమోదము, ఉత్తరః పక్షః=ఉత్తరపుపక్షము, ఆనందః=ఆనందము, ఆత్మా =

ఆత్మ, బ్రహ్మ = బ్రహ్మము, పుచ్ఛం ప్రతిష్ఠా = పుచ్ఛమువలె ప్రతిష్ఠావహము, తత్ అపి = ఆయానందమయునిగూర్చి, ఏషశ్లోకము = ఈ చెప్పఁబోవు నట్టి శ్లోకము—మంత్రము, భవతి = కలదు.

తా. లోకమునందు విజ్ఞానవంతుఁడే శ్రద్ధాభక్తులు కలిగి యజ్ఞము నాచరించుచున్నాఁడు కావున విజ్ఞానమే యజ్ఞమును చేయుచున్నది. (అని చెప్పఁబడినది.) మఱియు విజ్ఞానమే లౌకికములగు పనులను చేయుచున్నది. లోకమునందు చేయఁబడుచున్న సకలకార్యజాతమును విజ్ఞానమే ఆచరించు చున్నది. కావున విజ్ఞానమయుఁడే ఆత్మ—అనఁగా బ్రహ్మమనుట యుక్తము.

మఱియు ప్రథమమున పుట్టినదగుటచేత జ్యేష్ఠము అగు విజ్ఞాన బ్రహ్మమునే ఇంద్రాదిదేవతలందఱు ఉపాసించుచున్నారు—అనఁగా ఆ విజ్ఞానమయమగు బ్రహ్మమునందు అభిమానముగలిగి యుపాసించుచున్నారని భావము. ఆ ఇంద్రాదిదేవతలు అట్టి బ్రహ్మము నుపాసించుటచేతనే జ్ఞానైశ్వర్యవంతులయి యున్నారు.

అట్టి విజ్ఞానబ్రహ్మమును చక్కఁగా ఉపాసించినను, కేవలము ఉపాసించుటయే గాదు, ఆ విజ్ఞానబ్రహ్మమునుండి ప్రమాదమును పొందకపోయినను, విజ్ఞానబ్రహ్మమునందు ప్రమాదమును పొందుట యనఁగా బాహ్యములును అనాత్మములును అగు అన్నమయాదికోశములందు ఆత్మయను తలంపు కలుగుటయే. కావున అన్నమయాదికోశములందు ఆత్మభావమును వదలి కేవలము విజ్ఞానమయబ్రహ్మమునందే బ్రహ్మభావమునుంచి ఉపాసించుచున్న యెడల శరీరాభిమాననిమిత్తకములగు సకలపాపములను జీవించియున్నప్పుడే వదలి విజ్ఞానమయబ్రహ్మస్వరూపమును పొందినవాఁడయి ఆ విజ్ఞానమయాత్మస్వరూపముచేత సకలాభిలాషలను పొందుచున్నాఁడు.

శరీరాభిమాననిమిత్తమువలన సకలపాపములు కలుగుచున్నవి. అట్టి సకలపాపములు విజ్ఞానమయుఁడు బ్రహ్మ మని తలంచుటవలన నిమిత్తము

లేకపోవుటవలన గొడుగుపోయినయెడల గొడుగుయొక్క నీడ సైతము ఎటుల లేకపోవునో, అదేవిధముగా నశించుచున్నవి. కావున సకలపాపములు నశించును. శరీరాభిమాననిమిత్తములయినట్టియు, శరీరప్రభవములయినట్టియు సకలపాపములను ఆ శరీరమునందే వదలినవాఁడయి, విజ్ఞానమయ బ్రహ్మ స్వరూపమును పొందినవాఁడై, ఆ విజ్ఞానమయ బ్రహ్మమునందున్న సకల కామములను తదాత్మకుఁడయి చక్కఁగా అనుభవించును.

పూర్వోక్తమగు ఆ మనోమయశరీరమునకు ఈ మనోమయశరీరము నందు పుట్టిన విజ్ఞానమయుఁడే ఆత్మ.

ఈ చెప్పఁబడిన విజ్ఞానమయునికంటె వేఱుగా అభ్యంతరుఁడయి ఆనందమయుఁడు కలఁడు. ఆ యా యానందమయునిచేత ఈ విజ్ఞానమయ కోశము పూర్ణమయి యున్నది.

ఆనందమయ నిర్ణయము.

ఇచట చెప్పఁబడిన ఆనందమయశబ్దము కార్యబ్రహ్మవాచకము. ఇందులకు ఉపపత్తులు ఏవియనఁగా:—

౧. ప్రకరణము ననుసరించి ఇచట చెప్పఁబడిన ఆనందమయశబ్దము కార్యబ్రహ్మవాచకము (జీవవాచకము) గాని పరమాత్మవాచకముగాదు. ఏల యనఁగా ఇచట అన్నమయ, ప్రాణమయాదిభౌతికకార్యాత్మలే యీప్రకరణమునందు చెప్పఁబడియున్నవి.

౨. ఆనందమయశబ్దమునందుఁగల మయట్ శబ్దమువలన ఆనందమయ శబ్దము పరమాత్మవాచకముగాదు. మయట్ శబ్దము వికారవాచకము. అన్నమయము అనునప్పుడు అన్నవికారము అనెడి అర్థము ఎటుల స్ఫురించుచున్నదో అదేవిధముగా ఆనందమయుఁడనఁగా ఆనందవికారుఁడగు కార్యాత్మయే అని గ్రహింపవలయును.

3. సంక్రమణము—అనఁగా 'ఆనందమయ మాత్మాన ముపసంక్రామతి' అని పైనఁ జెప్పఁబడగలదు. కార్యాత్మకులయిన అన్నాత్మకులకే సంక్రమణము—పొందుట ఉపపన్నమగుచున్నది. ఆనందమయ ఆత్మను ఇచట మంత్రమునందు సంక్రమణమునకు కర్మగా శ్రుతి చెప్పుచున్నది. ఆత్మకే సంక్రమణ మనుట ప్రకృతమునకు సంగతముకాదు. మఱియు నిది యసంభవము, బ్రహ్మము సంక్రమణము చేయువానికి ఆత్మభూత మగుటచేతను,

౪. శిర ఆదికల్పనము అనుపపత్తి యగుటచేతను—అనఁగా సత్యజ్ఞానానంతలక్షణముగాఁగల అకార్యబ్రహ్మమునందు శిర ఆద్యవయవరూప కల్పనము ఉపపన్నము కాఁజాలదు. మఱియు అకార్యబ్రహ్మము—నిర్గుణ బ్రహ్మమును శ్రుతులు—

౧. అదృశ్యే అనాత్మ్యే అనిరుక్తే అనిలయనే. తై. ఉ. ౨. ౭.

౨. అస్థూల మనణు. బృహ. 3. ౮. ౮.

3. నేతినేత్యాత్మా. బృహ. 3. ౯. ౨౬.

ఇత్యాది విశేషనిషేధపూర్వకముగ తెలుపుచుండుటచేతను,

౫. ఇదియునుఁగాక ఇందే ముందు 'అసన్నేవసభవతి, అసద్బ్రహ్మేతి వేదచేత్. (తై. ఉ. ౨౬.) అని చెప్పఁబడుచున్నది, ప్రియశిర ఆద్యవయవ విశిష్టుఁడగు ఆనందమయాత్మబ్రహ్మము ప్రత్యక్షముగాఁ గనంబడుచుండఁగా 'బ్రహ్మము లేదను' ఆశంకకు అవకాశమే లేదు. అప్పుడు 'అసన్నేవసభవతి, అసద్బ్రహ్మేతివేదచేత్.' అను మంత్రమును చెప్పుటకు 'అవకాశమే ఉండఁజాలదు. మఱియు 'బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా' అని వేఱుగా బ్రహ్మమును ప్రతిష్ఠగా గ్రహించుటయు ఉపపన్నము కాఁజాలదు.

కావున ఇచట చెప్పఁబడిన ఆనందమయుఁడు కార్యబ్రహ్మముగాని పరమాత్మ కాఁజాలఁడు.

ఆనందమయకోశవివరణము:—

౧. ప్రియము శిరస్సు

౨. మోదము దక్షిణపక్షము

౩. ప్రమోదము ఉత్తరపక్షము

౪. ఆనందము ఆత్మ

౫. బ్రహ్మము ప్రతిష్ఠావహమగు పుచ్ఛము

వివరణము:—సగుణబ్రహ్మవేత్తకు దేహపాతముకంటె ముందే పుణ్య పాప పరిత్యాగము కలుగు ననువిషయము బ్ర. సూ. ౩. ౩. ౨౭. "సాంప రాయేత ర్తవ్యాభావా త్తథాహ్యన్యే" అని సాంపరాయాధికరణమునందు నిర్ణయింపఁబడినది.

ఈమంత్రము ౧౮ పాదములుగల వైదికమయిన అతిచ్ఛందస్సునకు సంబంధించినది.

౬. షష్ఠోఽనువాకః.

౧. అసన్నేవ స భవతి । అస ద్బ్రహ్మేతి వేద చేత్ ।
అస్తి బ్రహ్మేతి చేద్వేద । సంత మేనం తతో విదు
రితి । తస్యైష ఏవ శారీర ఆత్మా । యః పూర్వస్య ।
అథాతోఽనుప్రశ్నాః । ఉతావిద్వా నముం లోకం
ప్రేత్య । కశ్చన గచ్ఛతీ3 । ఆహో విద్వా నముం
లోకం ప్రేత్య । కశ్చి థ్సమశ్నుతా3 ఉ । సోఽకామ
యత । బహు స్యాం ప్రజాయేయేతి । స తపోఽత
ప్యత । సతప స్తప్త్వా ఇదగ్ం సర్వ మసృజత । యది
దం కించ । తత్సృష్ట్వా । తదేవాను ప్రావిశత్ । తద
నుప్రవిశ్య । సచ్చ త్యచ్చాభవత్ । నిరుక్తం చాని
రుక్తంచ । నిలయనం చానిలయనం చ । విజ్ఞానం చా
విజ్ఞానం చ । సత్యం చానృతం చ సత్య మభవత్ ।
యదిదం కించ । తత్సత్యమిత్యాచక్షతే । తదప్యేష
శ్లోకో భవతి ॥౬॥

టీక. (యః=ఎవ్వఁడు) బ్రహ్మ = బ్రహ్మము, అసత్=లేదు. ఇతి=అని, వేదచేత్ = తెలిసికొనినయెడల, అసన్ ఏవ = లేనివాఁడే, సః = వాఁడు, భవతి = అగుచున్నాఁడు. బ్రహ్మ = బ్రహ్మము, అస్తిఇతి=కలదని, వేద చేత్= తెలిసికొనినయెడల, తతః = అందువలన, సంతం = ఉన్నవానినిగానే, విదుః= తెలిసికొనుచున్నారు. ఇతి = ఈమంత్రము సమాప్తమయినది.

(లేక మఱొకవిధముగా అర్థము).

[యః=ఎవ్వఁడు), బ్రహ్మ=బ్రహ్మము, అసత్ = లేదు. ఇతి=అని, వేద చేత్ = తెలిసికొనినయెడల, సః = వాఁడు, అసన్ ఏవ = దుర్మార్గుఁడే, భవతి= అగుచున్నాఁడు. బ్రహ్మ = బ్రహ్మము, అస్తిఇతి = కలదని, వేదచేత్=తెలిసి కొనినయెడల, ఏనం = వీనిని, తతః = అందువలన, సంతం = సత్పురుషునిగా, విదుః = తెలిసికొనుచున్నారు. ఇతి = మంత్రము సమాప్తమయినది.]

యః = ఏయానందమయుఁడు గలఁడో, సః = ఆ, ఏషః ఏవ = ఈ యానందమయుఁడే, తస్య = ఆ, పూర్వస్య = పూర్వుఁడగు విజ్ఞానమయునకు, శారీరః = శరీరభవుఁడగు, ఆత్మా = ఆత్మ.

అథ = పిమ్మట, అతః = (ఆచార్యోపదేశానంతరము శిష్యునకు కొన్ని సంశయములు కలుగవచ్చును) కావున, అనుప్రశ్నాః = అనుప్రశ్నములు, (వివరింపఁబడుచున్నవి.)

(౧-వ ప్రశ్న) అవిద్వాన్ = అవిద్వాంసుఁడు, ప్రేత్య = మరణించి, అముంలోకం = ఈ పరమాత్మను, గచ్ఛతీ 3 ఉత = పొందునా? లేక పొందఁడా?

(౨-వ ప్రశ్న) కశ్చిత్ విద్వాన్ = విద్వాంసుఁడగువాఁడు, ప్రేత్య = మరణించి, అముంలోకం = ఈ పరమాత్మను, అహోసమశ్నుతా 3 ఉ = పొందునా? లేక పొందఁడా?

సః=ఆబ్రహ్మము, బహు = అనేకముగా, స్యాం=కావలయును, ప్రజాయేయ=పుట్టవలయును, ఇతి=ఈవిధముగా, అకామయత=కోరెను.

సః=ఆబ్రహ్మము, తపః = తపస్సును, అతప్యత = చేసెను. సః=ఆబ్రహ్మము, తపః = తపస్సును, తప్త్వా = ఒనర్చి, ఇదం = ఈకనంబడుచున్న, సర్వం= సమస్తమును అగు జగత్తును, అసృజత = సృజించెను. యత్=ఏ, ఇదం కించ= ఈసృజింపబడినది గలదో, తత్ = దానిని, సృష్ట్వా = సృజించి, తత్ ఏవ = ఆసృజించినదానినే, అను ప్రావిశత్ = అనుసరించి ప్రవేశించెను.

తత్ = ఆసృజింపబడిన ప్రపంచమును, అనుప్రవిశ్య = ప్రవేశించి, సత్ చ=మూర్తమును (మూర్తమనగా పృథివి, జలము, అగ్ని అనుభూత త్రయము), త్యత్ చ = అమూర్తమును (అమూర్తమనగా వాయువు, ఆకాశము అనుభూతద్వయము), అభవత్=ఆయెను. (ఈక్రింద చెప్పబోవునవి ఈమూర్తామూర్తములయొక్క విశేషణములే యని గ్రహించునది.)

నిరుక్తం చ = దేశకాలవిశిష్టముగ ఇది యని చెప్పబడినదియు, అనిరుక్తంచ = తద్విపరీతమయినదియు, నిలయనంచ = ఆశ్రయముగలదియు, అనిలయనంచ = ఆశ్రయవిహీనమైనదియు, విజ్ఞానంచ = చేతనసంయుతమగు జంగమాదికమును, అవిజ్ఞానం చ = చైతన్యవిరహితమగు పాషాణాదికమును, సత్యంచ = వ్యవహారసత్యముగలదియు, అనృతం చ = వ్యవహారసత్యము లేని ఎండమావులు మున్నగునవియు, సత్యం = బ్రహ్మము, అభవత్=ఆయెను. యత్ = ఏ, ఇదం కించ = ఈచెప్పబడిన మూర్తామూర్తాదికమంతయుగలదో, తత్ = అదియే, సత్యం ఇతి = బ్రహ్మము అని, ఆచక్షతే= బ్రహ్మవేత్తలు పలుకుచున్నారు. తత్ అపి = ఆవిషయమునందే, ఏషః = ఈ, శ్లోకః = శ్లోకము-మంత్రము, భవతి = కలదు.

తా. ఎవ్వడు బ్రహ్మములేదని భావించునో వాడును (వంధ్యాపుత్రునివలె) లేనివాడే యగుచున్నాడు. వానికి పురుషార్థసంబంధమేమియు

నుండఁజాలదు, బ్రహ్మములేదని తలఁపక తద్విరుద్ధముగా బ్రహ్మము సర్వ ప్రవృత్తికి బీజభూతమనియు, సర్వవికల్పాస్పదమనియు, సర్వవిశేషశూన్య మనియు తెలిసికొనుచున్నాఁడో, వానిని సదాత్మస్వరూపునిగ తలంతురు.

ప్రశ్న:—మీకు బ్రహ్మము లేదని సంశయమేల కలిగినది?

సమా:—బ్రహ్మము వ్యవహారము నతిక్రమించినది కావున (ఉన్నదా లేదా! యని సంశయించుట యుక్తమే,) వాచారంభణమాత్రమైన వ్యవహార విషయమునందు అస్తిత్వబుద్ధియు, వ్యవహారాతీతమయిన విషయమునందు నాస్తిత్వబుద్ధియు, లోకమునందు సహజముగాఁ గనంబడుచున్నది. లోకము నందుకూడ వ్యవహారవిషయముగా నున్నఘటాదికము సత్త (ఉన్నద)నియు, తద్విపరీతమయిన వంధ్యాపుత్రాదికము అసత్త (లేనిద)నియు ప్రసిద్ధముగదా. కనుక ఆదేవిధముగా (వ్యవహారవిషయముగాని) బ్రహ్మమునందుకూడ నాస్తి త్వబుద్ధికలుగుటకు అవకాశమున్నది. కనుకనే 'అస్తిబ్రహ్మేతిచేద్వేద' అని చెప్పఁబడినది. బ్రహ్మమున్నదని తెలిసికొన్నయెడల బ్రహ్మమున్నదని తెలిసి కొన్నవానికేమి లాభము కలుగును? బ్రహ్మవేత్తలు వీనినికూడ పరమార్థ సదాత్మస్వరూపునిగ భావింతురు. అనఁగా బ్రహ్మమున్నదని తలంచువాఁడు బ్రహ్మమువలె ఇతరులకు తెలిసికొనఁదగినవాఁడగును?

ఇందులకు మఱొకవిధముగాకూడ అర్థము చెప్పఁబడుచున్నది:—

ఎవ్వఁడు బ్రహ్మమేలేదని తెలిసికొనునో వాఁడున్నా లేనివాఁడే యగును. ఎవ్వఁడు బ్రహ్మముగలదని తెలుసుకొనునో అట్టివానిని బ్రహ్మ వేత్తనుగా విద్వాంసులు పరిగ్రహించుచున్నారు. లేక ఎవ్వఁడు బ్రహ్మమే లేదని భావించుచున్నాఁడో, అట్టివాఁడు బ్రహ్మప్రాప్తికి సాధనభూతమును, వర్ణాశ్రమవ్యవస్థారూపమును అగు సన్మార్గమును గూడ అంగీకరించనివాఁ డగుచున్నాఁడు. వేదశాస్త్రసిద్ధాంతనిశ్చితమగు అట్టివ్యవస్థను అంగీకరిం చని నాస్తికశిఖామణి లోకమునందు దుర్మార్గుఁడని ప్రసిద్ధి కెక్కును.

లోకశాస్త్రవిరుద్ధమగు ఇట్టి నాస్తికాభిప్రాయమును విడిచి ఎవ్వఁడు బ్రహ్మమును ఉన్నదానినిగా భావించునో వాఁడు తద్బ్రహ్మప్రాప్తికి సాధనభూతమగు వర్ణాశ్రమవ్యవస్థాపరిపాలనరూపమగు సదాచారమును శ్రద్ధాపూర్వకముగ నాచరించును. కావున లోకమునందు సన్మార్గుఁడని ప్రసిద్ధిని గాంచును. ఈవిజ్ఞానమయునకు ఆనందమయుఁడు శారీరాత్మ యగుచున్నాఁడు.

శిష్యుఁ డాచార్యుని కొన్నిసంశయములను ప్రశ్నించుచున్నాఁడు. ఇవి అనుప్రశ్నలని శ్రుతి వచించినది. ఆచార్యుఁడు చెప్పినదాని ననుసరించి శిష్యుఁడు ప్రశ్నించుచున్నాఁడు కావున ఇవి అనుప్రశ్నలు.

ఆకాశాదికమునకు కారణమయిన బ్రహ్మము విద్వాంసునకు అవిద్వాంసునకు కూడ సాధారణము కావున అవిద్వాంసునకుకూడ బ్రహ్మప్రాప్తి కలిగితీరవలయు నను ససంశయముతో ప్రశ్నము చేయఁబడుచున్నది.

౧. అ. అవిద్వాంసుఁడు మరణించిన పిదప బ్రహ్మమును పొందునా?
౨. ఆ. లేక పొందఁడా?
౧. అ. విద్వాంసుఁడు మరణించిన పిదప బ్రహ్మమును పొందునా?
౨. ఆ. లేక పొందఁడా?

అవిద్వాంసుఁడు ఆకాశాదికమునకు సామాన్యకారణమగు బ్రహ్మమును పొందనియెడల విద్వాంసుఁడుకూడ బ్రహ్మమును పొందునా! పొందఁడా యని సంశయించుట కవకాశము గలదు కావున ఈ క్రింది ప్రశ్నలు విద్వాంసునకు సంబంధించినవి.

౧. అవిద్వాంసుఁడు ఆకాశాదికమునకు సామాన్యకారణమగు బ్రహ్మమును పొందనియెడల విద్వాంసుఁడుగూడ బ్రహ్మమును పొందునా? పొందఁడా? యని ప్రశ్న.
౨. లేక బ్రహ్మవేత్తయగు విద్వాంసుఁడు మరణించినపిదప బ్రహ్మమును పొందునా?

3. లేక అవిద్వాంసు డెటుల బ్రహ్మమును పొందఁడో, అట్లే విద్వాం సుఁడుకూడ బ్రహ్మమును పొందఁడా ?

లేక

విద్వ దవిద్వ ద్విషయముగా రెండే ప్రశ్నలనుగా గ్రహించవచ్చును. 'అథాతోఽనుప్రశ్నాః' అని బహువచనము శ్రుతియందు చెప్పియున్నది గదా, రెండు ప్రశ్నలెట్లు ? అని సంశయింప నక్కఱలేదు. బహువచనము సామర్థ్యప్రాప్తములయిన ఇతరప్రశ్నల నుద్దేశించి చెప్పఁబడినది. 'అసత్ బ్రహ్మ ఇతి చేత్ వేద' = బ్రహ్మము అసత్తు—శూన్యమయినది అని తెలిసి కొనినయెడల, అస్తి బ్రహ్మ ఇతి చేత్ వేద = బ్రహ్మము సద్వస్తువు అని తెలిసి కొన్నయెడల ; అని ద్వివిధముగా శ్రుతియందు చెప్పఁబడి యుండుటచేత (సత్తా ? అసత్తా?) అని సంశయము, తరువాత అర్థప్రాప్తము.—

౧. బ్రహ్మమునకు పక్షపాతము లేదు కావున విద్వాంసునకు బ్రహ్మప్రాప్తి కలదా ? లేదా ? అని మొదటిప్రశ్న.

౨. అవిద్వాంసునకు బ్రహ్మప్రాప్తి కలదా ? లేదా ? యని రెండవ ప్రశ్న.

బ్రహ్మమునకు పక్షపాతము లేదు కావున అవిద్వాంసునకు బ్రహ్మప్రాప్తి యెట్లు లేదో, అట్లే విద్వాంసునకుకూడ బ్రహ్మప్రాప్తి లేదని శంకించుకొని—

3. విద్వాంసుఁడు బ్రహ్మము పొందునా ? పొందఁడా ? యని మూఁడవప్రశ్న.

ఈ ప్రశ్నలకు సమాధానార్థ ముత్తరగ్రంథము ప్రారంభింపఁబడు చున్నది.—

బ్రహ్మము యొక్క 'అస్తిత్వమే = ఉండుటయే' అంగీకరింపఁబడు చున్నది. ఉపనిషత్తునందు బ్రహ్మముయొక్కలక్షణము 'సత్యం జ్ఞాన మనంతం

బ్రహ్మ' అని చెప్పఁబడియున్నది. బ్రహ్మము సత్యము, జ్ఞానము, అనంతమని మంత్రార్థము. 'సదేవ సత్యం' అని ఉపనిషత్తులందు చెప్పఁబడియుండుటచేత సత్తన్నను సత్యమని చెప్పినను ఒక్కటియే. ఇచ్చట ఈ యర్థమున్నటుల ఎట్లు తెలియవచ్చుచున్నది ? అని సంశయింపనక్కరలేదు. ఉత్తరత్ర చెప్పఁబడిన శబ్దము లీయర్థమునే సూచించుచున్నవి. ఉత్తరవాక్యములందీసత్యాది శబ్దములు "తత్సత్య మిత్యాచక్షతే ; యదేష ఆకాశ ఆనందో న స్యాత్' ఇత్యాదికములు పైవిషయమునే ప్రతిపాదించుచున్నవి.

పూర్వపక్షము.

బ్రహ్మ సద్వస్తువు కాదు. సద్వస్తువే అయినయెడల ఘటాదివస్తువుల వలెఁ గనంబడును. అసద్వస్తువగు శశవిషాణము (కుందేటికొమ్ము) ఎటుల కనంబడుటలేదో, అట్లే బ్రహ్మము గనంబడుటలేదు కావున బ్రహ్మము సద్వస్తువు కాఁజాలదు.

సమాధానము.

బ్రహ్మము సద్వస్తువు. ఏలయనఁగా ఆకాశాదికార్యజాతమంతయు బ్రహ్మమువల్లనుండి యేర్పడినదని శ్రుతి బోధించుచున్నది. దేనివల్లనుండి ఒకటి పుట్టుచున్నదో అది యున్నదనియే గ్రహించుట యుక్తము. ఘటమును చూచి మృత్తికను, అంకురమునుచూచి బీజమును మనము ఎట్లు గ్రహించుచున్నామో, అట్లే ఆకాశాదికార్యమునుచూచి తత్కారణరూపమగు బ్రహ్మము ఉన్నదని గ్రహించుటయే న్యాయము. లోకమునందు శూన్యమునుండి ఏకార్యము ఏర్పడుటలేదు. నామరూపాదికార్యమునకు కారణము శూన్యమగునెడల మనకు గోచరమేకాదు. నామరూపాదిప్రపంచకార్యము మనకు గోచరమగుచున్నది కావున తత్కారణముకూడ సద్వస్తువేగాని శూన్యము కాదు. "కథ మసతః స జ్జాయేత" అను (ఛాందో. 3. ౨. ౨.) శ్రుతి అసత్తునుండి సత్పదార్థము పుట్టఁజాలదని నిషేధించుచున్నది.

పూర్వపక్షము.

మృత్తిక, బీజములు, ఘట, అంకురములకు ఏవిధములుగా కారణ భూతములో, అట్లే బ్రహ్మము నామరూపసమన్వితమగు ప్రపంచమునకు కారణభూతమగునెడల బ్రహ్మమున్నూ మృద్బీజములవలె అచేతనమే గదా ?

సమాధానము.

బ్రహ్మము అచేతనముకాదు. "సోఽకామయత" అని శ్రుతి చెప్పుట చేత బ్రహ్మము కామయితృత్వము (కోరుట) గలది అగుచున్నది, కామయితృత్వము అచేతనముకు అసంభవము కావున బ్రహ్మము అచేతనముకాదు. బ్రహ్మము సర్వజ్ఞమని ఇదివఱకే చెప్పియున్నారము కనుక కామయితృత్వము బ్రహ్మమునకు ఉపపన్న మగుచున్నది.

పూర్వపక్షము.

కామయితృత్వముండుటచేత అచేతనము కాకపోవచ్చును. కాని అస్మదాదులవలె బ్రహ్మమున్నూ అనాప్తకామత్వము (వలయు కోరికల నన్నిఁటిని పొందనిది.) గలదియే గదా ?

సమాధానము.

బ్రహ్మము అస్మదాదులవలె అనాప్తకామత్వముగలదిగాదు. అస్మదాదులకామములు ధర్మాదినిమిత్తాపేక్షములు, స్వాత్మవ్యతిరిక్తములు, కార్యకారణసాధనాంతరాపేక్షము లెట్లగుచున్నవో, అట్టినిమిత్తము బ్రహ్మమునకు లేదు. ఇఁక నేమనఁగా స్వాత్మకంటె వేఱుకానివి, సత్యజ్ఞానలక్షణమగు బ్రహ్మము తత్తత్ప్రాణిజాతముయొక్క కర్మ ననుసరించి సృష్ట్యాదిరచనను నిర్వహించుచుండును, కావున మనవంటి అనాప్తకామత్వము బ్రహ్మమునకు లేదు. సాధనాంతరములుకూడ బ్రహ్మమునకు లేవు. కావున అనాప్తకామత్వము మున్నగునవి బ్రహ్మమునందు ఘటింపవు.

ఇట్టి దేశకాలనామరూపాత్మకమును స్థావరజంగమాత్మకమును అగు ప్రపంచమును ప్రాణికర్మానుసారముగ సృజించి దానియందు తాను ప్రవేశించెను.

ప్రవేశము ఎట్లను విషయము చెప్పఁబడుచున్నది:—

'సోఽకామయత' అయాత్మ—అనఁగా ఎవనివల్లనుండి ఆకాశము పుట్టినదో, అట్టి యాత్మ కోరెను ; ఏమని ? 'బహు స్యామ్' అని (విస్తారముగా కావలయునని) ఒకఁడు మఱొకదానిని ప్రవేశించనియెడల విస్తారము ఎట్లు కాఁగలఁడు ? ఆ విషయమే చెప్పఁబడుచున్నది. ప్రజాయేయ = పుట్టవలయునని. ఇచట బహుభవనము అనఁగా విస్తారముగా అగుట పుత్రోత్పత్తి మున్నగు వానివలన అని గాదు, ఇంక నేమనఁగా తనయం దనభివ్యక్తములయి యున్న నామరూపాభివ్యక్తిచేత ; ఎప్పుడు తనయందు దాగియున్న నామ రూపములను ప్రకటనము చేయుచున్నాఁడో, అప్పుడు ఆత్మస్వరూపమునకు పరిత్యాగము లేనివిధముగనే బ్రహ్మమునుండి సర్వావస్థయందున్నూ అప్రవిభక్తదేశకాలములుగల నామరూపములు వెలువడుచున్నవి. ఈ విధముగనే చెప్పుట ఉపపన్నముగాని లేనియెడల అవయవశూన్యమయిన బ్రహ్మమునకు బహుభవనముగాని అల్పత్వముగాని ఉపపన్నము కాఁజాలదు. ఆకాశమునకు బహుత్వముగాని అల్పత్వముగాని వస్త్వంతరాధీన మెట్లగుచున్నదో, అట్లే ఇచ్చటను గ్రహించునది. కావున నామరూపద్వారముచేతనే ఆత్మకు బహుభవనము ఉపపన్న మగుచున్నది. ఆత్మకంటె వేఱయినది— అనఁగా అనాత్మభూతమయినది, సూక్ష్మమయినది. సమీపమయినది, దూరమయినది, భూతభవిష్య ద్వర్తమానములందు ప్రవిభక్తదేశకాలములు గలవి యయి ఉండుటలేదు. కనుక నామరూపములు సర్వావస్థలందు బ్రహ్మముచేతనే ఆత్మభూతములయి యున్నవి. బ్రహ్మమాత్రము నామరూపాత్మకముకాదు. ఆ నామరూపములు ఆ బ్రహ్మమును ప్రత్యాఖ్యానముచేసిన

యెడల ఉండఁజాలవు కావున తదాత్మకములని చెప్పఁబడినవి. ఆ నామరూపోపాధులచేతనే జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయ శబ్దార్థాది సర్వవ్యవహారభావభాక్కయిన బ్రహ్మముయొక్క బహుభవనము (అనఁగా బుద్ధ్యుపాధికమయిన బ్రహ్మము జ్ఞాతృవ్యవహారభాక్కు, బుద్ధివృత్త్యుపాధికమయిన బ్రహ్మము జ్ఞేయవ్యవహారభాక్కు, నామోపాధికమయిన బ్రహ్మము శబ్దవ్యవహారభాక్కు, సామాన్యముగ జడోపాధికమయిన బ్రహ్మము బ్రహ్మార్థవ్యవహారభాక్కు, ఆదిపదము కర్త్రాదిసంగ్రహార్థము; ఇటుల బ్రహ్మము సర్వవ్యవహారభాక్కనిభావము) అట్టి యాత్మ ఇట్టికోరిక గలదియై—అనఁగా బహుభవనాభిలాషగలదియై తపము సల్పెను. యస్య జ్ఞానమయంతపః (ముండ. ౧-౧-౯.) అను శ్రుత్యనుసారము ఇచట జ్ఞానమే తపస్సు—అనఁగా సృజింపఁదలఁచిన జగద్రచనాది విషయకమయిన ఆలోచనము సలిపెనని భావము. ఆయాత్మ ఇటుల ఆలోచించి తత్తత్ప్రాణికర్మాది నిమిత్తానురూపముగ దేశ కాల నామ రూపములచేత అందఱిచేత సర్వావస్థలందు అనుభవింపఁబడుచున్న యీజగత్తును సృజించెను. ఈయాత్మ ఇటుల జగమును సృజించినదై సృజించిన యీ జగమునందు తాను ప్రవేశించెను.

ఇచట యీవిషయమొకింత విచారింపఁబడుచున్నది:—

'తదేవ అనుప్రవిశత్' అని గదా శ్రుతియందు చెప్పఁబడినది. ఎవఁడు స్రష్టయో అతఁడే స్వకీయ ఆత్మతో ప్రవేశించెనా? లేక స్వవికారమయిన మఱొకఆత్మతో ప్రవేశించెనా? ఈపక్షద్వయమునం దేది యుక్తముగా నుండును? సృష్ట్వా=సృజించి అని 'క్త్వా' ప్రత్యయము శ్రుతియందు గనంబడుచుండుటవలన ఎవఁడు స్రష్టయో అతఁడే అనుప్రవేశించె ననుటయే యుక్తమగుచున్నది.

పూర్వపక్షము:—నీవు చెప్పిన సిద్ధాంతము యుక్తముగా లేదు. ఘటమునకు మృత్తిక యెట్లు కారణమో, అట్లే బ్రహ్మమున్ను జగత్తునకు

కారణముగదా. కార్యమనఁగా కారణాత్మకమేదా? కారణమే కార్యాత్మగా పరిణమించుట లోకమునందు సుప్రసిద్ధము. కార్యోత్పత్తికంటె ముందు కార్యమునందు ప్రవేశింపకయున్న కారణము కార్యోత్పత్త్యనంతరము కార్యమునందు ప్రవేశించుచున్నదనుట యుక్తముగా లేదు. లోకమునందుకూడ ఘటమునకు కారణమగు మృత్తిక ఘటరూపపరిణామముకంటె వేఱుగ ఘటమునందు తిరిగి ప్రవేశించుట సంభవముగ లేదు. ఘటపరిణామముకంటె భిన్నముగ మృత్తికఘటమునందు ప్రవేశించుట లోకమునందు లేదుగదా.

లేక వికారభూతమయిన మఱొకయాత్మతో నామరూపకార్యమునందు ఆత్మప్రవేశించెనని యందుమని చెప్పితివేని "అనేన జీవేనాత్మనాఽను ప్రవిశ్య. (ఛాందో. ౬. 3. ౨.) అను శ్రుతి యీయాత్మయే ప్రవేశించెనని చెప్పుటచేత అదియు ఉపపన్నముకాదు. కనుక ఆత్మ తాను సృజించిన జగత్తునందు ప్రవేశించెననుట ఉపపన్నముగా లేదు.

తన్నిరాకరణము:—బ్రహ్మమొక్కటియే యగుటచేత నీవన్నమాట-అనఁగా మఱొక ఆత్మరూపముతో జగమునందు ప్రవేశించె ననుమాట ఉపపన్నము కాఁజాలదు. మృచ్చూర్ణము సావయవమగుటచేతను, అనేకమగుటచేతను, అప్రవిష్టదేశము కలదియగుటచేతను, ఘటమునందు చూర్ణాత్మకముగ ప్రవేశించుట యుక్తమే. అద్వితీయుఁడగు ఆత్మ నిరవయవుఁడగుటవల్లను, అతఁడు ప్రవేశించనిదేశమే లేకపోవుటవల్లను, అతఁడు ప్రవేశించెననుట అసంగతమగుచున్నది. అట్లయినయెడల 'తదేవాను ప్రావిశత్' అని శ్రుతియందు ప్రవేశించెనని చెప్పుచున్నది గదా, ఇందులకేమి సమాధానము చెప్పెదవు? ఒకవేళ నిరవయవమగుటచేత ప్రవేశశ్రుతి విరోధించును కావున సావయవమే అని అంగీకరించి ముఖమునందు హస్తప్రవేశమువలె నామరూపకార్యమునందు జీవాత్మరూపమున అనుప్రవేశము యుక్తము కావచ్చునని యందువా?

అట్లనరాదు—బ్రహ్మము అంతటా ప్రవేశించియే యున్నది, కావున బ్రహ్మము క్రొత్తగా ప్రవేశించఁదగిన ప్రదేశమే లేదు. లోకమునందు కార్యాత్మకముగ పరిణమించిన నామరూపకార్యదేశములకు వ్యతిరేకముగ ఆత్మశూన్యమయిన ప్రదేశమే లేదుగదా. అట్టి ప్రదేశమొకటి యున్నపుడుగదా అచ్చట జీవాత్మగా ప్రవేశించుట ఉపపన్నమగును. లేక కార్యభూతుఁడయిన జీవుఁడే కారణమయిన బ్రహ్మమును ప్రవేశించెనని చెప్పెదమందువా? అదియు పొసగదు. ఏలయనఁగా ఘటము మృత్తికయందు ప్రవేశించుట యనఁగా ఘటత్వమును వదలుటయే యగుచున్నది. అట్లే కారణమగు బ్రహ్మమునందు జీవుఁడు ప్రవేశించెనని చెప్పునెడల అప్పుడతఁడు జీవత్వమునే వదలు ననవలసివచ్చుచున్నది. మఱియు 'తదేవాను ప్రావిశత్' అను శ్రుత్యర్థమును పరికించి చూచినయెడల కారణానుప్రవేశము యుక్తముగా లేదు.

శంక:—కార్యాంతరమే అగుచున్నాఁడు. అనఁగా 'తదేవానుప్రావిశత్' అను శ్రుతి జీవాత్మరూపమయిన కార్యము, నామరూపపరిణతమయిన కార్యాంతరమును పొందినది అని చెప్పుచున్నాము. (అని చెప్పునెడల)

తన్నిరాకరణము—అట్లనరాదు. ఏలయనఁగా ఘటము ఘటాంతరభావమును పొందుననుట లోకసిద్ధముగా లేదు. ఈవిషయమును అనేకశ్రుతులు నిషేధించుచున్నవి—అనఁగా జీవుఁడు నామరూపకార్యముకంటె వేఱయినవాఁడు అని చెప్పెడి అనేక శ్రుతులుగలవు. కావున ఆశ్రుతులకీవిషయము విరుద్ధము కావున ప్రమాణము కాఁజాలదు.

నిజముగా దేహాదిభావమునే జీవుఁడు పొందుచున్నాఁడను అర్థమునే చెప్పఁదలఁచిన మఱిలోకవిరోధముకూడ గలదు. అప్పుడు మోక్షమనునదియే ఆతనికి కలుగఁజాలదు. దేనిని వదలవలయునో దానినే పొందుచున్నాఁడనుట ఉపపన్నము కాఁజాలదుగదా.

ఆ బ్రహ్మమే బాహ్యాంతర్భేదములచేత పరిణమించినదని చెప్పిన యెడల అనఁగా ఆకారణమగు బ్రహ్మమే బాహ్యమయిన శరీరాద్యాధారభూతముగను, ఆశరీరమునకు లోపల ఆధేయమగు జీవాత్మభూతముగను పరిణమించినదను నెడల.—

అట్లనరాదు—ఏలయనఁగా ప్రవేశించుట యనునది వెలుపలనుండు వానికేగాని, లోపలనున్న వానికి ప్రవేశించుట యనునది ఉపపన్నము కాఁజాలదు. ఎవఁడు ఎవ్వనియొక్క లోపలనుండునో వానిని ప్రవేశించెనని చెప్పుట సంభవముగాలేదు. అనుప్రవేశము బహిష్ఠునికేగదా. "గృహం కృత్వా ప్రావిశత్ = ఇల్లుకట్టుకొని ప్రవేశించెను" మున్నగుశబ్దము లీయర్థమునందే రూఢిగా ప్రయోగింపఁబడుచున్నవి. లేక నీటియందు ప్రతిబింబించినట్టుల ప్రవేశము నిచట గ్రహించుచున్నామని యందురా?

ఆత్మ అపరిచ్ఛిన్నుఁడును, అమూర్తుఁడును, అగుటవలన అట్లనరాదు పరిచ్ఛిన్నమును మూర్తమును అగు వస్తువు ప్రసాదస్వభావముగల జలాశయాదికమునందు ప్రతిబింబించుట ఉపపన్నముగా నుండునుగాని ఆకాశాదికమునకు కారణమయిన ఆత్మ సర్వవ్యాపకమగుటచేత ప్రతిబింబించెననుటయు ఉపపన్నముగాలేదు. బ్రహ్మముకంటె భిన్నమయినట్టియు, విప్రకృష్టదేశ ప్రతిబింబాధారభూతవస్త్వంతరము లేకపోవుటబట్టియు, ప్రతిబింబించెననుటయు యుక్తముకాదు.

శంక—విచారించి చూడఁగా ప్రవేశించెననుటకు ఉపపత్తి ఏమియు లేదు. కాని అతీంద్రియమయిన విషయము నెఱుఁగుటకు మనకు శ్రుతిగదా పరమప్రమాణము. అట్టిశ్రుతి 'తదేవానుప్రావిశత్' అని స్పష్టముగా ప్రవేశించెనని చెప్పుచున్నదే. ఇంతవఱకు మనము విచారించిన విమర్శవలన ప్రవేశించెననుట ఉపపన్నము కాదని సిద్ధాంతితమాయెనుగదా. అప్పుడు 'తత్సృ

ష్ట్వాతదేవాను ప్రావిశత్’ అను శ్రుతివాక్యము విరుద్ధార్థబోధకము కావున పరిత్యాజ్యమనియే గదా తేలుచున్నది.

సమాధానము—శ్రుతివాక్య మెన్నటికి పరిత్యాజ్యము కాఁజాలదు; కాని ఆ శ్రుతివాక్యతాత్పర్యమును మాత్రము నీవు సరిగా గ్రహించలేదు. ఆ యర్థ మిదుగో, ఇచ్చట శ్రుతి “బ్రహ్మవిదాప్నోతి పరం” అని ప్రతిజ్ఞ చేసినది, “సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ” అని బ్రహ్మముయొక్క లక్షణము వివరించినది, “యో వేద నిహితం గుహాయాం” అని బ్రహ్మవిజ్ఞానము చెప్ప ప్రారంభించినది, ఇచట మనకు ప్రకృతము బ్రహ్మవిజ్ఞానమును—బ్రహ్మస్వరూపమును బోధించుటకొఱకయి ప్రథమమున ఆకాశాద్యన్నమయాంతమగు కార్యజాతమును ప్రదర్శించినది, తరువాత బ్రహ్మమును తెలుపుట కుపక్రమించినది, ఆ విషయమునందే అన్నమయాత్మకంటె వేఱుగ అంతరుఁడగు ప్రాణమయుఁడుగలఁడనియు, ఆ ప్రాణమయాత్మకులోపల మనోమయాత్మ గలఁడనియు, ఆమనోమయాత్మకు లోపల విజ్ఞానమయుఁడు గలఁడనియు, ఆ విజ్ఞానగుహాయందు ఆనందమయుఁడను విశిష్టాత్మ గలఁడనియుం ప్రదర్శించినది. తరువాత ఆనందమయ లింగాధిగమద్వారముగ ఆనందవృద్ధ్యవసానభూతుఁడగు ఆత్మను—బ్రహ్మమును. ‘పుచ్ఛం ప్రతిష్ఠ’ అనియుం తెలుపుచు,సర్వవికల్పాస్పదుఁడును, నిర్వికల్పుఁడును అగు బ్రహ్మము ఈగుహాయందే పొందఁదగినవాఁడనియు చెప్పినది. ఇచటనే ప్రవేశము ప్రకల్పితమయినది. నిర్విశేషముగుటచేత బ్రహ్మము బుద్ధికంటె వేఱయినచోట లభింపఁజాలదు. చంద్రసూర్య సంబంధము లేనిచోట రాహు వెటుల గనంబడఁజాలఁడో, చంద్రసూర్య సంబంధ మున్నచోటుల నెటుల రాహువు గనంబడునో, అట్లే సంనికర్ష సంబంధమువలన అంతఃకరణగుహాసంబంధమువలన బ్రహ్మము ఉపలబ్ధము—పొందఁబడునది అగుచున్నది. అంతఃకరణము అవభాసాత్మకమనుట ప్రసిద్ధముగదా. లోకమునందు ఘటాద్యుపలబ్ధికి అంతఃకరణసంబంధ

మెట్లో, అట్లే ఆత్మోపలబ్ధియు బుద్ధి ప్రత్యయాలోకవిశిష్టమయినదే అగుచున్నది. అందువలన ఉపలబ్ధిహేతువగు గుహాయందు నిహితమగు బ్రహ్మమునుగూర్చి చెప్పుటయే ప్రకృతమగుచున్నది. ముందు చెప్పఁబోవు మంత్రమంతయు వృత్తిస్థానీయ మగుటచేత పౌనరుక్తి శంకలేక 'తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్' అని చెప్పఁబడినది.

ఆకాశాదికమున కంతటికిని కారణభూతమయిన ఆపరమాత్మయే యీ గనంబడుచున్న కార్యజాతమును సృజించి దానియందు ప్రవేశించినదాని వలె హృదయకమలమునందున్న బుద్ధిగుహాయందు ద్రష్ట, శ్రోత, మంత, విజ్ఞాత, మున్నగు విశేషములతో స్ఫురించుచున్నాఁడు, ద్రష్టృ, శ్రోతృ, మంతృ, విజ్ఞాత్రాది విశేషస్ఫురణమే ప్రవేశశబ్దార్థము కావున ఆకాశాది కారణమగు బ్రహ్మము ఉన్నదనియే గ్రహించుట యుక్తము. కావున బ్రహ్మ మున్నదనియే గ్రహించవలయును. ఆకాశాదికమునకు కారణమగు అట్టి బ్రహ్మము సత్తు-అనఁగా మూర్తము, త్యత్తు-అనఁగా అమూర్తము ఆయెను. అవ్యాకృతనామరూపములుగా ఆత్మయందున్న ఆనామరూపములు అంతర్గతమయిన ఆత్మచేత వ్యాకృతము లాయెను. మూర్తామూర్తవాచ్యములయిన ఆనామరూపములు వ్యాకృతములయి ఆత్మతోడ అప్రవిభక్తదేశకాలములు గలవి యగుటచేత, బ్రహ్మమే ఆమూర్తామూర్తము లాయెనని యిచట చెప్పఁబడినది. మఱియు ఆబ్రహ్మమే నిరుక్తమున్నూ అనిరుక్తమున్నూ ఆయెను. నిరుక్త మనఁగా సమానఅసమానజాతీయములయిన వానివల్ల దేశకాలవిశిష్టముగా వేఱుచేసి ఇది అదియని చూపింపఁబడినది. అనిరుక్తమనఁగా తద్విపరీతమయినది. నిరుక్తానిరుక్తములున్నూ మూర్తామూర్తములకే విశేషణములు, సత్తు త్యత్తు అనునవి ఎట్లు ప్రత్యక్షపరోక్షము లగుచున్నవో అట్లే ప్రత్యక్షపరోక్షములగు నిలయనమున్నూ అనిలయనమున్నూ బ్రహ్మమేయగుచున్నవి. నిలయనమనఁగా నివాసము ఆశ్రయము, మూర్తధర్మము, అనిల

యనమనఁగా తద్విపరీతము అమూర్తధర్మము. త్యత్, అనిరుక్త, అనిలయనములు అమూర్తధర్మములయినప్పటికిన్ని సర్గోత్తరకాలభావ విషయకములుగా శ్రుతియందు చెప్పఁబడుచుండుటచేత వ్యాకృతవిషయములుగనే ఇచట గ్రహించవలయును. త్యత్ అనఁగా ఆకాశప్రాణాద్యనిరుక్తము. అదియే అనిలయనమున్నూ కావున ఇచటగల త్యత్ అనిరుక్త, అనిలయనమును అమూర్త విశేషణములు, వ్యాకృతవిషయములనియే గ్రహించవలయును. అట్లే, విజ్ఞానమనఁగా చేతనమున్నూ, అవిజ్ఞానమనఁగా చేతనరహితమగు పాషాణాదికమున్నూ బ్రహ్మమే, సత్యమనఁగా ఇచట ప్రకరణము ననుసరించి వ్యవహార విషయకమగు సత్యమునే గ్రహించవలయునుగాని పారమార్థికసత్యమును గ్రహింపరాదు. పరమార్థసత్యమగు బ్రహ్మమెప్పుడు ఒక్కటియే. ప్రకృతము నందుపయుక్తమయిన సత్యశబ్దము ఎండమావులందుఁగల అనృతజలముకంటె భిన్నమయిన వ్యవహారవిషయకమయిన ఆపేక్షికసత్యమగు జలాదివాచకమని గ్రహించవలయును. అనృతమనఁగా పూర్వోక్తమునకు విపరీతమయినది, ఈ చెప్పఁబడినదంతయు సత్యమే—అనఁగా పరమార్థసత్యమే అయినది. పరమార్థసత్యమనఁగానేమి ? బ్రహ్మమే పరమార్థసత్యము. 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అని బ్రహ్మమే ఇచట ప్రకృతము కావున బ్రహ్మము సత్యశబ్ద వాచ్యము. సత్, త్యత్ మున్నగు శబ్దవాచ్యమును, మూర్తామూర్తమును అగు నీపదార్థసమూహమంతయు ఏకమయిన సచ్ఛబ్దవాచ్యమగుచున్నది కావున నామరూపములు సచ్ఛబ్దవాచ్య బ్రహ్మవ్యతిరేకముగ లేవు. ఇందువలన అంతయు బ్రహ్మమే యగుచున్నది, ఇందువలననే బ్రహ్మవేత్తలు ఆ బ్రహ్మమును సత్యమని పలుకుచున్నారు. ఇచట ప్రకృతము 'అస్తి నాస్తి' (బ్రహ్మమున్నదా లేదా?) అను ప్రశ్న కావున ఆ ప్రశ్నకు సమాధాన మీ విధముగా చెప్పఁబడుచున్నది. ఆత్మ అనేకముగా కావలయునని కోరెను. ఆ యాత్మ సత్యసంకల్పుఁడు కావున తాను కోరినవిధముగా సత్, త్యత్, నిరుక్త, అనిరుక్త ఇత్యాదిలక్షణముగల ఆకాశాది కార్యజాతమును సృజించి

దానియందు తాను ప్రవేశించి చూచుచున్నవాఁడై, వినుచున్నవాఁడయి, తలఁచుచున్నవాఁడయి, తెలిసికొనుచున్నవాఁడయి, అటుల అనేకముగా అయెను. అందువలన ఆకాశాదికార్యజాతమునకు కారణభూతమును, కార్యకారణసంఘాతమునందు సాక్షిభూతము నయి ఉన్నదియును, పరమవ్యోమయందు—అనఁగా హృదయాకాశమునందు తత్ప్రత్యయావభాసమానవిశేషోపలభ్యమును అగు బ్రహ్మము ఉన్నదనియే ఎఱుఁగవలయును. ఈ చెప్పఁబడినవిషయమునందు ఈ చెప్పఁబోవు శ్లోకము—మంత్రముగలదు అనఁగా ఇదివఱకు అన్నమయాద్యాత్మపంచకమును ప్రకాశింపఁజేయునట్టి శ్లోకములు—మంత్రము లెట్లు తెలుపఁబడినవో, అట్లే సర్వాంతరభూతమయిన ఆత్మ ఒక్కటి గలదనువిషయమును ప్రకటించునట్టి శ్లోకము—మంత్రముకూడ గలదని ముందు చెప్పఁబడుచున్నది.

వివరణము:—"స తపస్తప్త్వా, ఇదగ్ం సర్వమసృజత" అనువిషయమును గూర్చి ఇచట భాష్యమునందెట్లు శంకరాచార్యులవారు వివరించిరో ఇట్లే బ్రహ్మసూత్రశంకరభాష్యమందు 'జన్మాద్యస్య యతః. బ్రసూ.౧-౧-౨'నందును వివరించిరి. దానినికూడ గమనించుట యుక్తము. "అస్య జగతో నామరూపాభ్యాం వ్యాకృతస్య, అనేకకర్తృభోక్తృసంయుక్తస్య, ప్రతినియతదేశకాలనిమిత్తక్రియాఫలాశ్రయస్య, మనసాఽప్యచింత్యరచనారూపస్య, జన్మస్థితిభంగం యతః సర్వజ్ఞాత్ సర్వశక్తేః కారణాద్భవతి తద్ బ్రహ్మ" అని గలదు.

ఈభాష్యపంక్తి భామతియందు విపులముగ ఇట్లు వ్యాఖ్యాతమైనవి:—చేతనోహి బుద్ధ్యా వాలిఖ్య నామరూపేషు ఇతి నామ్నారూపేణచ కంబుగ్రీవాదినా బాహ్యం ఘటం నిష్పాదయతి, ఏవమేవ మూలకారణమపి నామరూపాభ్యాం స్వబుద్ధ్యా వాలిఖ్యతమేవ సర్వం పశ్చాత్ వ్యనక్తీతి నామరూపాభ్యాం ఇత్థం భూతం వ్యాకృత మిత్యుచ్యతే, కేచిత్ కర్తారో భవంతి, సూదర్త్విగాదయః, నభోక్తారః; కేచిత్తు భోక్తారః, యథా శ్రాద్ధ

వైశ్వానరీమేష్ట్యాదిషు పితా పుత్రాదయః, న కర్తారః; కేచిత్ఫలు ప్రతినియత దేశోత్పాదాః, యథా కృష్ణమృగాదయః; కేచిత్ ప్రతినియతకాలోత్పాదాః - యథా కోకిలరవాదయః; కేచి త్ప్రతినియతనిమిత్తాః,—యథా నవాంబుదధ్వానాది నిమిత్తా బలాకాగర్భాదయః; కేచిత్ ప్రతినియత క్రియాః, యథా బ్రాహ్మణానాం యాజనాదయః, నేతరేషాం; ఏవం ప్రతినియతఫలాః, యథా కేచిత్సుఖినః, కేచిత్ దుఃఖినః, ఏవం య ఏవ సుఖినః, త ఏవ కదాచిత్ దుఃఖినః; సర్వమేత దాకస్మికాపరనామ్ని యాదృచ్ఛికత్వే చ, స్వాభావికత్వే చ, అసర్వశక్తికర్తృకత్వే చ న ఘటతే."

గ్రంథవిస్తరభీతిచేత ఆంధ్రతాత్పర్యము వ్రాయలేదు.

ఇతరగ్రంథభాగములు.

తైత్తి. భాష్యవార్తికము, బ్రహ్మవల్లి, ౭ ఖండ. శ్లో. ౧-౭౯.

అనుభూతిప్రకాశ, ౨ అధ్యా. శ్లో. ౮౬ - ౧౧౩.

ఆత్మపురాణము, ౧౦ అధ్యా. శ్లో. ౧౭౭-౨౩౦.

౭. సప్తమోఽనువాకః.

మం. అసద్వా ఇదమగ్ర ఆసీత్ । తతో వై సదజాయత ।
తదాత్మానగ్ం స్వయమకురుత । తస్మా త్త త్సుకృత
ముచ్యత ఇతి । యద్వై తత్సుకృతమ్ । రసో వై సః ।
రసగ్ం హ్యేవాయం లబ్ధ్వాఽఽనన్దీ భవతి । కో
హ్యేవాన్యాత్కః ప్రాణ్యాత్ । యదేష ఆకాశ
ఆనన్దో న స్యాత్ । ఏష హ్యేవానన్దయాతి । యదా
హ్యేవైష ఏతస్మి న్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽని
లయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే । అథ సోఽభ
యం గతో భవతి । యదా హ్యేవైష ఏతస్మిన్నుదర
మన్తరం కురుతే । అథ తస్య భయం భవతి । తత్త్వేవ
భయం విదుషోఽమన్వానస్య । తదప్యేష శ్లోకో భవతి ।

టీక. ఇదం = ఈ (నామరూపవిశేషాత్మకమగు) ప్రపంచము, అగ్రే= ప్రపంచసృష్టికిముందు, అసత్ వై = అవ్యాకృతనామరూపవిశేషములు గల బ్రహ్మముగ, ఆసీత్ = అయియుండెను. తతః=ఆయవ్యాకృతనామరూపవిశేషము గల అసత్తునుండి, సత్ = నామరూపప్రవిభక్తమగు ప్రపంచము, అజాయత= పుట్టెను. (యస్మాత్ = ఎందువలన) తత్ =ఆయవ్యాకృత నామరూపములుగల బ్రహ్మము, ఆత్మానం—నామరూపాత్మకమగు ప్రపంచమును, స్వయం అకురుత = తానుగాచేసెనో, తస్మాత్ =ఆందువలన, తత్ = ఆబ్రహ్మమే, సుకృతం ఇతి = స్వయం కర్తృకమని, ఉచ్యతే = చెప్పఁబడుచున్నది.

సుకృతం = స్వకర్తృకమగు, తత్ = ఆబ్రహ్మము, యత్ వై = ఏది గలదో, సః= అది, రసః=రసస్వరూపము, అయం = ఈప్రాణి, రసం హి ఏవ= రసమునే, లబ్ధ్వా = పొంది, ఆనందీ = ఆనందముగలవాఁడు, భవతి = అగుచున్నాఁడు. యత్ = ఎందువలన, ఏషః = ఈ, ఆనందః=ఆనందము, ఆకాశే= హృదయాకాశమునందు, న స్యాత్ = లేనియెడల, కః హి ఏవ = ఎవ్వఁడు, అన్యాత్ = అపానచేష్టను చేయును, కః=ఎవ్వఁడు, ప్రాణ్యాత్ =ప్రాణచేష్టను చేయును, ఏషః హి ఏవ= ఈయాత్మయే, ఆనందయాతి = (లోకమును) సుఖపెట్టుచున్నాఁడు. ఏషః = ఈసాధకుఁడు, యదాహి ఏవ =ఎప్పుడైతే, అదృశ్యే = కనఁబడినట్టియు, అనాత్మ్యే = శరీరరహితుఁడైనట్టియు, అనిరుక్తే = వికారరహితుఁడైనట్టియు, అనిలయనే = ఆధారరహితుఁడైనట్టియు, ఏతస్మిన్ = ఈపరమాత్మయందు, అభయం = భయములేని, ప్రతిష్ఠాం=(ఆత్మభావ) స్థితిని, విందతే = పొందుచున్నాఁడో, అథ = తర్వాత, సః=ఆసాధకుఁడు, అభయం= అభయమును, గతఃభవతి = పొందినవాఁ డగుచున్నాఁడు. యదా = ఎప్పుడు, ఏషః = వీఁడు, ఏతస్మిన్ = ఈపరబ్రహ్మమునందు, ఉదరం = స్వల్పమయినను, అంతరం = భేదమును, కురుతే హి=చేయుచున్నాఁడో, అథ = పిమ్మట, తస్య = ఆసాధకునకు, భయం = భయము. భవతి = అగుచున్నది, అమన్వా

నస్య=బ్రహ్మముకంటె భిన్నముగాలేదు అను తలంచని, విదుషః = విద్వాంసున కున్నూ, తత్ తు ఏవ భయం = అదేభయము, (భవతి = అగుచున్నది.) తత్ = ఆవిషయమునుగూర్చి, ఏషః = ఈ, శ్లోకః అపి=శ్లోకమున్నూ-మంత్ర మున్నూ, భవతి = కలదు.

తా. 'అస ద్వా ఇద మగ్ర ఆసీత్' అని మంత్రముయొక్క ప్రారంభము, ఇచ్చట 'అసత్' అనఁగా వ్యాకృతమయిన నామరూపవిశేషములకు విపరీతమయినరూపముగల అవ్యాకృతబ్రహ్మము అని గ్రహించవలయును. కాని అత్యంతమయిన అసత్తు అని తలంచకూడదు. ఏలయనఁగా: అత్యంతాసత్తు అయినదానివల్లనుండి 'సత్తు' అయినది పుట్టఁజాలదు గదా. మూలమునందు గల 'ఇదం' అను పదము నామరూపవిశేషములుగ వ్యాకృతమయిన జగద్వాచకము. అగ్రమునందు అనఁగా సృష్టికంటె పూర్వమునందు అసచ్ఛబ్దవాచ్య మగు బ్రహ్మమే అయి ఉండెను. అట్టి అసచ్ఛబ్దవాచ్యమయిన బ్రహ్మమునుండియే 'సత్తు' అనఁగా ప్రవిభక్తనామరూపవిశేషములు గల జగత్తు ఉత్పన్నమాయెను. తండ్రివలన జన్మించినపుత్త్రుఁడు తండ్రికంటె ఎట్లు భిన్నుఁ డగుచున్నాఁడో, అట్లే బ్రహ్మకార్య మగు జగత్తుకూడ ఆ బ్రహ్మముకంటె భిన్నమా? యేమి? అను ప్రశ్న రాగా అట్టిభేదము లేదనియు అసచ్ఛబ్దవాచ్యమగు ఆబ్రహ్మము స్వయముగనే ఆత్మనే చేసినదాయెను. ఎందువలన ఆత్మనే జగద్రూపముగ నొనర్చియున్నదో, అందువల్లనే ఆ బ్రహ్మము సుకృతమని చెప్పఁబడుచున్నది. లోకమునందుకూడ బ్రహ్మమే సర్వకారణ మగుటచేత "స్వయంకర్తృ" అను ప్రసిద్ధినికూడ వహించియున్నది.

బ్రహ్మమే సుకృతము—పుణ్యము.

౧. ఏకారణముచేత బ్రహ్మము సర్వమయిన జగత్తును స్వాకారము చేతనే సృజించియున్నదో అట్టి పుణ్యరూపముచేతకూడ ఆ కారణరూపమగు బ్రహ్మము సుకృతమనియు చెప్పఁబడును. లోకమునందుకూడ స్వర్గాదిఫల

సంబంధమునకు కారణభూత మగు పుణ్యముకూడ సుకృతశబ్దవాచ్యమయి ప్రసిద్ధిని వహించియున్నది. కాబట్టి అట్టి చేతన కారణమయిన బ్రహ్మమున్నప్పుడే అది ఉపపన్నమగుచున్నది. కావున బ్రహ్మముగలదు. ఆ బ్రహ్మము సుకృతమను ప్రసిద్ధి కలిగియున్నది.

బ్రహ్మమే అతీంద్రియమయిన రసస్వరూపము.

౨. బ్రహ్మము కలదనుటకు మఱొక హేతువుకూడఁ గలదు. ఏలయనఁగా రసస్వరూపుఁడగుటవలన, బ్రహ్మమునకు 'రసత్వ ప్రసిద్ధికలదా ?' యని ఆశంకించి కలదని శ్రుతియే నిరూపించుచున్నది—"యద్వైతత్సుకృతం। రసో వై సః॥ ఎయ్యది సుకృతమో అదియే రసముగదా" అని శ్రుతి. లోకమునందుకూడ తృప్తిహేతువును ఆనందకరమును అగు మధురామ్లాదికమునకు రసము అని ప్రసిద్ధికూడ గలదుగదా. ప్రాణులుకూడ రససదృశమయిన ఆత్మానందమును వృత్తిద్వారముగ పొందియే ఆనందము గలవార లగుచున్నారు. అసత్తునకు ఆనందహేతుత్వము లోకమునం దెచ్చటను గనంబడుటకూడ లేదు. బాహ్యానంద సాధనరహితులును, అనీహులును, నిరేషణులును అగు బ్రహ్మవేత్తలగు విద్వాంసులుకూడ బాహ్యరసలాభమువలనవలె ఆనందసహితులయి గనంబడుచున్నారు. నిశ్చయముగా వారికి బ్రహ్మమే రసముగదా. కావున అట్టి నిరేషణులగు వారలకుకూడ ఆనందకారణమును, రసస్వరూపమును అగు బ్రహ్మము కలదనియే గ్రహించవలయును.

బ్రహ్మమే దేహాదిచేష్టకును, వైషయికానందమునకు హేతుభూతము.

బ్రహ్మమున్నదనుటకు మఱొక ఉపపత్తికూడ గలదు. ప్రాణనాది క్రియలు గనంబడుచుండుటచేతకూడ బ్రహ్మమున్నదనియే అంగీకరించి తీరవలయును. జీవద్దశయందు దేహమునందు ప్రాణాపానాదిక్రియలు జరుగుచు-

న్నవిగదా. అదేవిధముగా వాయుసంబంధమయినట్టియు, ఇంద్రియసంబంధమైనట్టియు చేష్టలుసైతము సంహతములయిన కార్యకరణములచేత నియతముగా జరిపించబడుచున్నవి. చేతనసంబంధములేక ఏకార్థవృత్తిత్వసంహననము—అనఁగా ఒక్కనియొక్క నిమిత్తమయి కలిసియుండుట ఉండఁజాలదు—లోకమునందుకూడ గృహప్రాసాదాది సంహననము చేతనస్వామిసంబంధము లేక గనంబడుటలేదు. కనుక ఈఆనందస్వరూపుఁడు పరమవ్యోమయందు—అనఁగా హృదయకమలాంతర్వర్తియగు గుహాయందు లేనియెడల లోకమునం దెవ్వఁడు ప్రాణనకర్మను చేయును? ఎవ్వఁడు అపానచేష్టను చేయును? కాఁబట్టి ఎవ్వని 'నిమిత్త మీకార్యకరణ సంఘాతము—శరీరము ప్రాణాపానాదిక్రియలను చేయుచున్నదో, అట్టి బ్రహ్మమున్నదనియే అంగీకరించవలయును. లోకమునందుగల ఆనందముకూడ ఆ యాత్మానందకృతమే, ఏలయనఁగా ఈ పరమాత్మయే వారివారి కర్మానుసారము ఆయాప్రాణులను ఆనందింపఁ జేయుచున్నాఁడు. ఆనందస్వరూపుఁడగు ఆయాత్మయే అవిద్యచేత ఆచ్ఛాదితుఁడయి లోకులచేత నానావిధముగ అనుభవింపఁబడుచున్నాఁడు.

విద్వాంసులకును అవిద్వాంసులకును అభయహేతువును, భయహేతువును అగుటచేత బ్రహ్మము కలదనియే గ్రహించవలయును. సద్వస్తువును ఆశ్రయించుటచేత అభయము అగుచున్నది. అసద్వస్తువు నాశ్రయించుటచేత భయనివృత్తి కలుగఁజాలదు.

విద్వాంసునకే బ్రహ్మప్రాప్తి.

అభయహేతు వెట్లో చెప్పఁబడుచున్నది:—

సాధకుఁడగువాఁ డెప్పుడు అదృశ్యమును, అనాత్మ్యమును, అనిరుక్తమును, అనిలయమును అగు బ్రహ్మమునందు అభయమనఁగా భయములేనటుల ప్రతిష్ఠను-స్థితిని పొందుచున్నాఁడో (దృశ్యమనఁగా చూడఁదగినది-వికార

జాతము; అదృశ్యమనఁగా వికారరహితము అవిషయభూతము; అనాత్మ్య మనఁగా అశరీరము, అదృశ్యము కావున అనాత్మ్యము యుక్త మగుచున్నది. ఎప్పుడు అనాత్మ్యమో—అశరీరమో, అప్పుడు అనిరుక్త మగుచున్నది. నిరుక్త మనఁగా విశేషరహితము—లేక వికారరహితము. సర్వవికారములకు హేతుభూతమగుటవలన బ్రహ్మము అనిరుక్త మనుట యుక్తయే. అనిరుక్త మగుటచేత అనిలయనము—నిలయనమనఁగా ఆశ్రయము - ఆధారము, ఇట్టి (అనఁగా అదృశ్యమును అనాత్మ్యమును అనిరుక్తమును అనిలయమును సర్వ కార్యధర్మవిలక్షణమును అగు బ్రహ్మమునందు అని భావము.) అభయ మనునది క్రియావిశేషణము, అనఁగా భయములేనటుల ప్రతిష్ఠను పొందు చున్నాఁడు, లేక ఛాందసము కావున అభయమను పదమును ప్రతిష్ఠయను దానికి విశేషణముగా గ్రహించి భయరహితమయిన ప్రతిష్ఠను పొందుచు న్నాఁడు, అనఁగా ఆత్మభావమును పొందుచున్నాఁడు. ఎప్పుడు అట్టి ఆత్మ భావమును పొందునో అప్పుడు ఆబ్రహ్మమునందు అవిద్యాకృతమయిన నానాత్వభావము నశించుచున్నది కావున అభయమును పొందినవాఁ డగు చున్నాఁడు. ఎప్పుడు సాధకుఁడగువాఁడు స్వరూపప్రతిష్ఠుఁ డగుచున్నాఁడో అప్పుడు అన్యమును చూచుటలేదు, అన్యమును వినుటలేదు, అన్యమును ఎఱుం గుటలేదు, కావున భయకారణమే ఇతనికిలేదు. అన్యునివలన అన్యునకు భయముగలుగుట లోకప్రసిద్ధముకాని ఆత్మవలన ఆత్మకుభయముకలుగుట లోకప్రసిద్ధముగ లేదు కావున ఆత్మయే ఆత్మకు అభయకారణము. భయ హేతువు లున్నప్పటికిన్నీ భయమునుండి రక్షించు బ్రహ్మముయొక్క స్వరూపభూతులు తాము అగుటచేతనే బ్రహ్మవేత్తలు నిర్భయులయి చరించు చున్నారు. కావున—అనఁగా బ్రహ్మవేత్తలు నిర్భయులయి యుంటున్నారు కావున అభయకారణమగు బ్రహ్మమున్నదనియే అంగీకరించి తీరవలయును. సాధకుఁ డగువాఁడెప్పుడు అభయమును పొందుచున్నాఁడనఁగా ఎప్పుడు

అన్యమును గాంచఁడో, ఆత్మయందు అంతరమును—అనఁగా భేదమును గాంచఁడో, అప్పుడు అభయమును పొందుచున్నాఁడని అభిప్రాయము.

భేదదర్శనమే భయమునకు కారణము.

అక్షిదోషముచేత రెండవచంద్రుని గాంచినటుల అవిద్యావస్థయం దెప్పుడు వస్త్వంతరమును గాంచుచున్నాఁడో, అనఁగా ఆత్మయందు-బ్రహ్మమునందు స్వల్పముగనైనను భేదమును గాంచుచున్నాఁడో, అట్టి భేదదర్శనమే భయకారణ మగుచున్నది. అట్టి భేదదర్శన మల్పమయినప్పటికిన్ని భయహేతువే అగుచున్నది. అట్టి భేదదర్శనమువల్లనే వానికి ఆత్మవల్లనుండి భయమగుచున్నది కావున అవిద్వాంసుఁడగు వానికి ఆత్మయే భయకారణమీవిధముగా అగుచున్నది.

భేదదర్శియగు విద్వాంసునకు బ్రహ్మము భయకారణము.

ఈశ్వరుఁడు నాకంటె భిన్నుఁడు, నేను ఈశ్వరభిన్నుఁడగు సంసారిని అని తలంచెడి భేదదర్శియగువిద్వాంసునకు బ్రహ్మమే భయహేతువగుచున్నది. ఆత్మ తనకంటె భిన్నమయినదని తలంచెడి—అనఁగా ఆత్మైకత్వమును తలంచని విద్వాంసునకు ఆభేదభావన అల్పమయినప్పటికిన్ని అతఁడు విద్వాంసుఁడు కాఁజాలఁడు. ఏలయనఁగా అతఁడు వాస్తవముగా ఏకమును అభిన్నమును అగు ఆత్మతత్త్వమును చూడలేదుకావున (అతఁడు విద్వాంసుఁడనుట యుక్తముకాదు) ఉచ్ఛేదహేతుభూతమగు బ్రహ్మమున్నదని తలంచుచున్నాఁడు కావునను, లోకమంతయు భయంపడుచున్నది కావునను, అట్టిభయహేతువగు బ్రహ్మ మున్నదనియే అంగీకరించితీరవలయును. స్వయముగా తాను నశించక ఇతరమును నశింపఁజేయునట్టి ఒకమహాత్తత్త్వమున్నదనియు, అట్టిదానినిగాంచి జగమంతయు భయంపడుచున్నదనియు సిద్ధించుచున్నది.

ఈవిషయమునుగూర్చి—అనఁగా సర్వమునకు భయహేతువగు ఒకపదార్థము కలదనువిషయమయి ఒకశ్లోకము—మంత్రము చెప్పఁబడుచున్నది:—

వివరణము.—వెనుకటి యనువాకమునందుఁగల ౩ ప్రశ్నములకు ఇచట సమాధానము చెప్పఁబడినది.

౧. విద్వాంసుఁడు ఆత్మయందు ప్రతిష్ఠను పొందినయెడల అతఁడే బ్రహ్మస్వరూపుఁడయి అభయమును పొందుచున్నాఁడు. కావున బ్రహ్మవేత్తకు బ్రహ్మప్రాప్తి సిద్ధాంతభూతమే.

౨. అవిద్వాంసుఁడు భేదదృష్టి కలిగియుండుటచేతను, భేదదృష్టి జన్మజరామరణరూప మగు సంసారమును కలుగఁజేయును కావునను అవిద్వాంసునకు బ్రహ్మప్రాప్తి లేదు.

బ్రహ్మజ్ఞానము గలదేవాదులకుఁ గూడ సంతతముగ ఆత్మజ్ఞాననిష్ఠ దృఢముగ అనుభవమునకు రానందుచేతనే వారందఱు భయముకలిగి ప్రవర్తించుచున్నా రనువిషయమును తెలుపుటకయి ఒకమంత్ర ముదహరింపఁబడుచున్నది.

ఇతరగ్రంథభాగములు.

తైత్తి. భాష్యవార్తికము, బ్రహ్మవల్లి, ఖండ. ౭. శ్లో. ౧౫-౨౮.
అనుభూతిప్రకాశము, ౨-వ అధ్యా. శ్లో. ౧౦౩-౧౨౦.
ఆత్మపురాణము, ౧౦-వ అధ్యా. శ్లో. ౨౩౧-౨౭౧.

౮. అష్టమోఽనువాకః.

(ఆనందమీమాంసా)

మం. ౧. భీషాఽస్మాద్వాతః పవతే । భీషోదేతి సూర్యః
భీషాఽస్మాదగ్నిశ్చేంద్రశ్చ । మృత్యుర్ధావతి
పంచమ ఇతి ॥

౨. సైషాఽఽనందస్య మీమాగ్ంసా భవతి । యు
వా స్యాత్సాధు యువాఽధ్యాయకః । ఆశిష్ఠో
ద్రఢిష్ఠో బలిష్ఠః । తస్యేయం పృథివీ సర్వా విత్త
స్య పూర్ణా స్యాత్ । స ఏకో మానుష ఆనందః ।

3. * శ్రోత్రియస్య చాకామహతస్య । తే యే శతం
మానుషా ఆనందాః । స ఏకో మనుష్యగంధ
ర్వాణామానందః । శ్రోత్రియస్య చాకామహ
తస్య ।

---

* మానుషానందపర్యాయే శ్రోత్రియస్యేతి వాక్యం శాంకరపాఠే నాస్తి.

౪. తే యే శతం మనుష్యగంధర్వాణా మానన్దాః । స ఏకో దేవగంధర్వాణా మానందః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

౫. తే యే శతం దేవగంధర్వాణా మానందాః । స ఏకః పితృణాం చిరలోకలోకానా మానందః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

౬. తే యే శతం పితృణాం చిరలోకలోకానా మానందాః । స ఏక ఆజానజానాం దేవానా మానందః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

౭. తే యే శత మాజానజానాం దేవానా మానందాః । స ఏకః కర్మదేవానాం దేవానా మానందః । యే కర్మణా దేవా నపి యంతి । శ్రోత్రియస్య చాకామహతస్య ।

౮. తే యే శతం కర్మదేవానాం దేవానా మానందాః । స ఏకో దేవానా మానందః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

౯. తే యే శతం దేవానా మానన్దాః । స ఏక ఇంద్ర
స్యానందః । శ్రోత్రియస్య చాకామహతస్య ।

౧౦. తే యే శతమిన్ద్రస్యానన్దాః । స ఏకో బృహస్పతే
రానందః । శ్రోత్రియస్య చాకామహతస్య

౧౧. తే యే శతం బృహస్పతే రానన్దాః । స ఏకః
ప్రజాపతే రానందః । శ్రోత్రియస్య చాకామ
హతస్య ।

౧౨. తే యే శతం ప్రజాపతే రానందాః । స ఏకో
బ్రహ్మణ ఆనందః । శ్రోత్రియస్య చాకామహ
తస్య ।

౧౩. స య శ్చాయం పురుషే । యశ్చాసా వాదిత్యే ।
స ఏకః ।

౧౪. స య ఏవం విత్ । అస్మా ల్లోకా త్ప్రేత్య ।
ఏత మన్నమయ మాత్మాన ముపసంక్రామతి ।
ఏతం ప్రాణమయ మాత్మాన ముపసంక్రామతి ।

ఏతం మనోమయ మాత్మాన ముపసంక్రామతి ।

ఏతం విజ్ఞానమయ మాత్మాన ముపసంక్రామతి ।

ఏత మానన్దమయ మాత్మాన ముపసంక్రామతి ।

౧౫. తదప్యేష శ్లోకో భవతి ॥

టీక. ౧. అస్మాత్ = ఈపరబ్రహ్మము వల్లనుండి (పుట్టిన), భీషా=భయముచేత, వాతః = వాయువు, పవతే = వీఁచుచున్నది, సూర్యః=సూర్యుఁడు, భీషా = (ఆపరమాత్మవల్లనుండి పుట్టిన) భయముచేత, ఉదేతి = ఉదయించుచున్నాఁడు, అగ్నిః చ = అగ్నియును, ఇంద్రః చ = ఇంద్రుఁడును, అస్మాత్ = ఈపరమాత్మవల్లనుండి అయిన, భీషా=భయముచేతనే (ప్రవర్తించుచున్నారు). పంచమః = అయిదవవాఁడగు, మృత్యుః = మృత్యుదేవతయు, ధావతి = (స్వకార్యమునందు ఆతనివల్లనుండి కలిగిన భయముచేతనే) వ్యాపృతుఁడగుచున్నాఁడు.

౨. ఆనన్దస్య = ఆయానందముయొక్క, సా = ఆ, ఏషా = ఈ మీమాంసా = విచారణ, భవతి = అగుచున్నది. యువా = యౌవనముగలవాఁడును, సాధుయువా = యువవాఁడై సాధుత్వము కలిగియుండువాఁడును, అధ్యాయకః = వేదాధ్యయనమొనర్చినవాఁడును, ఆశిష్ఠః = భోగ్యవస్తువులను సకాలమునం దనుభవించువాఁడును, ద్రఢిష్ఠః = దృఢతముఁడును, బలిష్ఠః = బలవత్తముఁడును, స్యాత్ = కలిగియుండ[illegible]ట్టి దేహదార్ఢ్యాధికము గలవానికి, ఇయం పృథివీ = ఈభూమి, సర్వా = అంతయును, విత్తేన = దృష్టాదృష్టరూపమగు ఉపభోగసాధనముచేత, పూర్ణా = పూర్ణమయినది స్యాత్ = అగును. (అట్టివానికిగల్గు, యః = ఏ, ఆనందముగలదో) సః = ఆ,

ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందము, మానుషః = మానుషమగును (అనఁగా సార్వభౌమునకుఁగల ఆనందము ఒకమానుషానందము).

3. తే = ఆ (సార్వభౌమసిద్ధములగు), మానుషాః = మనుష్యసంబంధములగు, ఆనందాః = ఆనందములు, శతం = నూరుసంఖ్యగలవి, యే = ఏయవి (గలవో), సః = ఆయానందసమూహము, మనుష్యగంధర్వాణాం = మనుష్యగంధర్వులకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందమగుచున్నది.

అకామహతస్య = కామముచేత హతుఁడుకాని, శ్రోత్రియస్యచ = శ్రోత్రియునకును (అట్టియానందము కలుగుచున్నది).

४. మనుష్యగంధర్వాణాం = మనుష్యగంధర్వులయొక్క, తే = ఆ, ఆనందాః = ఆనందములు, శతం = నూరుసంఖ్యగలవి, యే = ఏయవిగలవో, సః=ఆయానందసమూహము, దేవగంధర్వాణాం = దేవగంధర్వులకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందము (అగును).

అకామహతస్య = కామముచేత హతుఁడు కాని, శ్రోత్రియస్య చ = శ్రోత్రియునకును (ఇట్టియానందము కలుగుచున్నది).

౫. దేవగంధర్వాణాం = దేవగంధర్వులయొక్క. తే=ఆ, ఆనందాః = ఆనందములు, శతం = నూరుసంఖ్యగలవి, యే=ఏయవిగలవో, సః=ఆయానంద సమూహము, చిరలోకలోకానాం = చిరలోకలోకులకు, పితౄణాం = పితరులకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందము (అగును).

అకామహతస్య = కామముచేతహతుఁడుకాని, శ్రోత్రియస్యచ=శ్రోత్రియునకును (ఇట్టియానందము కలుగుచున్నది).

౬. చిరలోకలోకానాం = చిరలోకలోకులకు, పితౄణాం=పితరులకు, తే=ఆ, ఆనందాః = ఆనందములు, శతం=నూరుసంఖ్యగలవి, యే=ఏయవి గలవో, సః = ఆయానందసమూహము, ఆజానజానాం=ఆజానజులకు, దేవానాం = దేవతలకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందము (అగును).

అకామహతస్య = కామముచేతహతుఁడుకాని, శ్రోత్రియస్యచ=శ్రోత్రియునకును (ఇట్టియానందము కలుగును).

౭. ఆజానజానాం = ఆజానజులగు, దేవానాం=దేవతలకు, తే=ఆయానందములు, శతం = శతసంఖ్యగలవి, యే = ఏయవిగలవో, సః = ఆయానంద సమూహము, కర్మదేవానాం = కర్మదేవులగు, దేవానాం = దేవతలకు, ఏకః= ఒకటియగు, ఆనందః = ఆనందము (అగును).

అకామహతస్య = కామముచేత హతుఁడుకాని, శ్రోత్రియస్యచ = శ్రోత్రియునకును (ఇట్టియానందము కలుగును).

౮. కర్మదేవానాం = కర్మదేవులగు, దేవానాం=దేవతలకు, తే=ఆయానందములు, శతం = శతసంఖ్యగలవి, యే = ఏయవిగలవో, సః = ఆయానంద సమూహము, దేవానాం = దేవతలకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందమగును.

అకామహతస్య = కామముచేత హతుఁడుకాని, శ్రోత్రియస్యచ = శ్రోత్రియునకును (ఇట్టి యానందము కలుగును).

౯. దేవానాం = దేవతలయొక్క, తే = ఆయానందములు, శతం = శతసంఖ్యగలవి, యే=ఏయవిగలవో, సః=ఆయానందసమూహము, ఇంద్రస్య= ఇంద్రునకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందము (అగును).

అకామహతస్య = కామముచేత హతుఁడుకాని, శ్రోత్రియస్యచ = శ్రోత్రియునకును (ఇట్టి యానందము కలుగును).

౧౦. ఇంద్రస్య = ఇంద్రునియొక్క, తే = ఆయానందములు, శతం= శతసంఖ్యగలవి, యే = ఏయవిగలవో, సః = ఆయానందసమూహము, బృహస్పతేః=బృహస్పతికి, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందము(అగుచున్నది).

అకామహతస్య = అకామహతుఁడగు, శ్రోత్రియస్యచ = శ్రోత్రియునకును (ఇట్టి ఆనందము కలుగుచున్నది).

౧౧. బృహస్పతేః = బృహస్పతియొక్క, తే = ఆయానందములు, శతం = శతసంఖ్యగలవి, యే = ఏయవిగలవో, సః = ఆయానందసమూహము, ప్రజాపతేః = త్రైలోక్యశరీరుఁడగు విరాట్పురుషునకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందమగుచున్నది.

అకామహతస్య = కామముచేత హతుఁడుకాని, శ్రోత్రియస్యచ = శ్రోత్రియునకును (ఇట్టి యానందము కలుగుచున్నది).

౧౨. ప్రజాపతేః = విరాట్పురుషునియొక్క, తే = ఆయానంద ములు, శతం = శతసంఖ్యగలవి, యే = ఏయవిగలవో, సః = ఆయానంద సమూహము, బ్రహ్మణః = హిరణ్యగర్భునకు, ఏకః = ఒకటియగు, ఆనందః = ఆనందము (అగుచున్నది).

అకామహతస్య = కామముచేత హతుఁడుకాని, శ్రోత్రియస్యచ = శ్రోత్రియునకును (ఇట్టి యానందము కలుగుచున్నది).

౧౩. పురుషే = పురుషునియందు, అయం = ఈయానందస్వరూపమగు పరమాత్మ, యః = ఎవఁడో, సః చ = వాఁడును, యశ్చ అదిత్యే = ఎవ్వఁడు సూర్యునియందున్నాఁడో, సః చ = వాఁడును, ఏకః = ఒక్కఁడే.

౧౪. యః = ఎవ్వఁడు, ఏవంవిత్ = ఈవిధముగా తెలిసికొను చున్నాఁడో, సః=వాఁడు, అస్మాత్=ఈ, లోకాత్ = లోకమునుండి, ప్రేత్య= మఱలి (విషయములం దపేక్షలేనివాఁడై), ఏతం = ఈ, అన్నమయం = అన్న మయుఁడగు, ఆత్మానం=ఆత్మను, ఉపసంక్రామతి=పొందుచున్నాఁడు. ఏతం= ఈ, ప్రాణమయం = ప్రాణమయుఁడగు, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రామతి= పొందుచున్నాఁడు. ఏతం = ఈ, మనోమయం = మనోమయుఁడగు, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రామతి = పొందుచున్నాఁడు. ఏతం = ఈ, విజ్ఞానమయం = విజ్ఞానమయుఁడగు, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రామతి =

పొందుచున్నాఁడు. ఏతం = ఈ, ఆనందమయం = ఆనందమయుఁడగు, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రామతి = పొందుచున్నాఁడు.

౧౫. తత్ అపి = ఆవిషయమును గూర్చి, ఏషశ్లోకః= ఈమంత్రము, భవతి = అగుచున్నది.

తా. ఈపరబ్రహ్మమునకు భయపడియే వాయువు వీచుచున్నాఁడు. సూర్యుఁ డుదయాస్తమయము లందుచున్నాఁడు. అగ్నియు ఇంద్రుఁడును భయపడియే తమతమ కృత్యముల నిర్వహించుచున్నారు. ఐదవవాఁడగు మృత్యువుసైతము ఆయుస్సు క్షీణించినవాని సమీపమునకుఁ బోయి తనలోకమునకు వారిని కొంపోవుచున్నాఁడు. పూజ్యతములగు వాయువు అగ్నిమున్నగువారలు సైతము తాము స్వయముగ దిగధీశ్వరులయినను, 'వీచుట, ప్రకాశించుట' మున్నగు ఆయాసకరము లగుకార్యములందు నియతముగ ప్రవర్తించుచున్నారు. వారట్టిభీతితో చరించుటకు కారణము తమకంటె మిన్నయై తమ్ము శాసించునట్టి బ్రహ్మము ఒకవస్తువుండుటచేతనే గదా. రాజును గాంచి భృత్యు లేవిధముగా భయపడుదురో (అట్లే బ్రహ్మమును గాంచి వీరున్నూ భయపడుచున్నారు).

ఏబ్రహ్మమువల్లనుండి భయపడి వాయ్వాదులు తమతమ కృత్యముల నొనర్చుచున్నారో, అట్టి భయకారణమయిన ఆనందాత్మక బ్రహ్మము ఏది గలదో ఆబ్రహ్మముయొక్క ఆనందముయొక్క వివర మిచట మీమాంస చేయఁబడుచున్నది.

ఆనందమును గుఱించి ఏమి విచారించవలసి యున్నది ?

చెప్పెదను వినుఁడు. (బ్రహ్మస్వరూప మని చెప్పఁబడిన) ఆ యానందము లౌకికానందమువలె విషయవిషయిసంబంధముచేత జనించెనా ? లేక స్వాభావికమా ? అను విషయమే ఇచట మీమాంస్యము.

లౌకికమగు ఆనందము బాహ్యసాధనము (లగువిషయము) ల యొక్కయు, ఆధ్యాత్మిక సాధనము (లగుయావనాదికము) యొక్కయు, మేలనముచేత మిన్నయయియుండును. బ్రహ్మానంద మిట్టిదని ఊహించుటకుఁగాను లౌకికానందమున ఇట్టిదని మొదట నిర్దేశింపఁబడుచున్నది. సుప్రసిద్ధమగు ఈ లౌకికానందముచేత విషయనివృత్తినందినబుద్ధిచేత పొందఁదగిన బ్రహ్మానందము ఊహింప శక్యమగుచున్నది.

ఆనందమనఁగా బ్రహ్మానందమే. ఆయానందముయొక్క అంశమే లౌకికానందమున్నూ అగుచున్నది. అవిద్యతోటి సంబంధము దృఢమగుచున్నకొలఁది విజ్ఞానము తగ్గుచుండును. ఆయావిషయములు సాధనములు వీని సంబంధముచేత ఆనంద మొకప్పుడు ప్రాదుర్భవించి సాధనవైకల్యసమయమున నశించుచు లౌకికానందమగుచున్నది. అవిద్య, కామము, కర్మలు వీనియొక్క ప్రాబల్యము తగ్గినకొలఁదియు క్రమక్రమముగ ఆయానందము మానుషానంద, మనుష్యగంధర్వానందాది హిరణ్యగర్భానందాంతము ఉత్తరోత్తరము ఆనందాభివృద్ధినందుట ఇచట చెప్పఁబడినది. ఇట్టియానందము, అకామహతుఁడును, శ్రోత్రియుఁడును అగు బ్రహ్మవేత్తకే అనుభవసిద్ధము. అవిద్యతోటి సంబంధము ఏమాత్రములేనిదియే స్వాభావికమగు పరిపూర్ణానందము. ఇట్టి యానందమే అద్వైతము. విద్యచేత అవిద్యాకృతమును, విషయవిషయి విభాగము గలదియు నగు ఆనందము నిరాకృతమయినది అగుచుండఁగా స్వాభావికమయినట్టియు, పరిపూర్ణమైనట్టియు, ఏకమైనట్టియు, అద్వైతమయినట్టియు ఆనంద మేర్పడునని ప్రతిపాదింపఁదలఁచి వివరించుచున్నాఁడు.—

పరబ్రహ్మము ఆనందస్వరూపుఁడు కావున అట్టియానంద మిట్టిదిగానుండునని యూహించుటకుఁగాను లౌకికమగు మానుషానందమును దృష్టాంతముగా గనంబఱిచి అట్టి మానుషానందముకంటె ౧౦౦మడుంగులు మనుష్యగంధర్వానందమనియు, మనుష్యగంధర్వానందముకంటె ౧౦౦ వంతులు

అధికముగ దేవగంధర్వానందమనియు ఇటుల క్రమముగ వివరింపఁబడుచున్నది.

(మానుషానంద మిట్టిదని తెలుపుటకుఁగాను శ్రీశంకరానందులవారు ఆత్మపురాణమునం దిటుల వచించియున్నారు:—

శ్లో. యావనేనాభిసంపన్నో రూపశీలాదిసంయుతః,
పురాణన్యాయ మీమాంసా ధర్మశాస్త్రాంగ మిశ్రితాః. ౨౭౭
వేదాః స్థానాని విద్యానాం ధర్మస్య చ చతుర్దశ,
సర్వాణ్యేతాన్యధీయాన ఊహాపోహవిశారదః. ౨౭౮
మాత్రా పిత్రా తథాఽఽచార్యై శ్శిక్షితో వినయాన్వితః,
వజ్రసారసమానాఙ్గో బలవాన్ బలభి ద్యథా. ౨౭౯
తస్యేయం పృథివీ సర్వా సప్తసాగరమేఖలా,
సహైవ ద్వీపైశ్చ సంపూర్ణా న భికాంచనపర్వతా,
స్వాధీనా చే ద్భవే త్సోఽయ మానందో మానుషః పరః. ౨౮౦)

౧. మానుషానందము.

౧. యువ యనఁగా మంచియౌవనము గలవాఁడు, సాధుయువ యనఁగా సాధువయిన యువకుఁడని యువకునకు సాధుశబ్దము విశేషము. యువకుఁడయి అసాధువు కావచ్చును, సాధువయి అయువకుఁడు కావచ్చును. అట్టి విభేదమును తొలఁగించుటకు 'సాధుయువ' యని చెప్పఁబడినది. అధ్యాయకుఁ డనఁగా అధీతవేదుఁడు—సాంగాధ్యయన మొనర్చినవాఁడు. ఆశిష్ఠుఁ డనఁగా ఎట్టిపనినైనను అవలీలగా త్వరలో చేయువారిలో శ్రేష్ఠుఁడు. ఇట్లే ద్రఢిష్ఠుఁడు, బలిష్ఠుఁడు, యౌవనము కలిగి మంచిప్రవర్తనముగలవాఁడై దేహసంబంధములగు రోగములుగాని, మనస్సంబంధములగు ఆధులుగాని, లేక విద్వాంసుఁడై బలిష్ఠుఁడయి జగమునంతయు ఏకచ్ఛత్రాధి

పత్యముగ నేలునట్టి సార్వభౌమునకుగల యానందము ఒక మానుషానంద మనంబడును.

౨. మనుష్యగంధర్వానందము.

౨. ఇట్టి మానుషానందమునకు నూరుమడుంగులు ఆనందము మనుష్య గంధర్వుల యానందము. మనుష్యగంధర్వులనఁగా మనుష్యులయియుండి తా మాచరించిన పుణ్యకర్మలచేతను యోగబలముచేతను గంధర్వత్వమును పొందిన వారలు. వారు మనుష్యులవలె పరిమితశక్తులుకాక అంతర్ధాన, ఆకాశగమ నాదిశక్తులు కలిగియుందురు. కామరూపు లగుటచేత వారికి సాధారణ ముగ ప్రతిఘాతము లేవియు నుండఁజాలవు. ఒకవేళ సంభవించినను స్వా ద్వప్రతిఘాతశక్తి సాధనసంపత్తి కలిగియుందురు. అనఁగా కష్టములు వచ్చిన వానిని నివారించుకొనుటకు తగినసామర్థ్యము కలిగియుందురు, సుఖ సాధనము లెన్నిగలవో ఆ సాధనముల నన్నిటిని సమగ్రముగఁ గలిగి యుందురు. మనుష్యగంధర్వునకు ఇట్టి సాధనసంపత్తి యుండును కావున వానికి చిత్తప్రసాద ముండును. చిత్తప్రసాదమువలన సుఖవిశేషాభివ్యక్తి కలిగియుండును. ఇట్టి మనుష్యగంధర్వునకు ఎట్టి ఆనందముగలదో అట్టి యానందము అకామహతుఁడగు శ్రోత్రియున కుండును. అకామహతుఁ డనఁగా—మనుష్య విషయకమయిన విషయభోగములం దాసక్తిలేనివాఁడు. శ్రోత్రియుఁ డనఁగా సాంగవేదాధ్యేత. సాంగవేదాధ్యేతయై విషయభో గాసక్తి లేని నిష్కామునియొక్క ఆనందము మనుష్యగంధర్వానందము తో సమానమై యుండును. ఇచట 'సాధుయువాఽధ్యాయకః' అనునది యు గ్రహింపఁబడును, అనఁగా శ్రోత్రియుఁడును, పాపాచరణము లేని వాఁడును అని గ్రహించునది. 'శ్రోత్రియస్య చామకాహతస్య' అనువాక్యము, మనుష్యగంధర్వాది హిరణ్యగర్భాంతానందముల చివరవఱకు అనువృత్త మగుచున్నది. కావున సర్వత్ర 'సాధుయువాఽధ్యాయకః' అను విశేష

ణమును—అనఁగా శ్రోత్రియత్వ అపాపిత్వములు గలవాఁడు అనియు అనువృత్తము చేసుకొనవలయును.

3. దేవగంధర్వానందము.

3. ఇట్టి మనుష్యగంధర్వులకు గల ఆనందమునకు నూరింతలయిన ఒక దేవగంధర్వుని యానందమగును. సాధుయువయగు అకామహతశ్రోత్రియునకుకూడ ఇట్టియానంద ముండును. ఇట్లే సర్వత్ర గ్రహించునది. దేవగంధర్వుఁడనఁగా సృష్టికాలమునందే దేవలోకమునందు గంధర్వుఁడై జన్మించినవాఁడు.

౪. చిరలోకలోకపిత్రానందము.

౪. ఇట్టి దేవగంధర్వులకుఁ గల ఆనందమునకు నూరింతలయిన చిరలోకలోకుఁడగు ఒక పితరుని యానందమగును. చిరలోకలోకుఁడనఁగా చిరకాల ముండునట్టి లోకమును గాంచెడివాఁడు.

౫. ఆజానజదేవానందము.

౫. అట్టి చిరలోకలోకులగు పితరుల యానందమునకు నూరింతలయిన ఒక ఆజానజుఁడగు దేవవిశేషముయొక్క ఆనందమగును. ఆజానజ మనఁగా పితృలోకముకంటె ఊర్ధ్వభాగమునందున్న దేవలోకవిశేషము. ఆ లోకమునం దుత్పన్నులయిన వారలు ఆజానజులు. స్మార్తకర్మవిశేషాచరణము చేత దేవలోకమునందు పుట్టినవారలని శంకరభాష్యమునందు గలదు.

౬. కర్మదేవానందము.

౬. అట్టి ఆజానజులగు దేవతల యానందమునకు నూరింతలయిన యానందము ఒక్క కర్మదేవునియొక్క యానందమగును. ఆజానజదేవభో

గముకంటె మిక్కుటమగు భోగమును పొందుటకయి వైదికమగు అగ్నిహోత్రాదికము ననుష్ఠించినవారలు కర్మదేవులు.

౭. దేవానందము.

౭. అట్టి కర్మదేవుల యానందమునకు నూరింతలయిన ఒక దేవత యొక్కయానందమగును. దేవతలనఁగా హవిర్భుక్కులగు 33 దు దేవతలు.

౮. ఇంద్రానందము.

౮ అట్టి దేవతలకుఁ గల యానందమునకు నూరింతలయిన ఒక ఇంద్రునియొక్క యానందమగును. ఇంద్రుఁడనఁగా దేవతలకు ప్రభువు.

౯. బృహస్పత్యానందము.

౯. అట్టి ఇంద్రునకుఁగల యానందమునకు నూరింతలయిన ఒక బృహస్పతియొక్క ఆనందమగును. బృహస్పతియనఁగా ఇంద్రునకు ఆచార్యుఁడు.

౧౦. ప్రజాపత్యానందము.

౧౦. అట్టి బృహస్పతికిఁ గలయానందమునకు నూరింతలయిన ప్రజాపతియొక్క ఆనందమగును. ప్రజాపతి యనఁగా త్రైలోక్యశరీరుఁడగు విరాట్పురుషుఁడు.

౧౧. హిరణ్యగర్భానందము.

౧౧. అట్టి విరాట్పురుషునకుఁగల యానందమునకు నూరింతలయిన ఒక హిరణ్యగర్భానంద మగును. ఇచట హిరణ్యగర్భుఁ డనఁగా వ్యష్టిసమష్టి రూపుఁడగు సూత్రాత్మ. ఇతఁడే శరీరులలో ప్రథముఁడు. 'హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే' అని వేదము చెప్పుచున్నదిగదా.

ఈవిధముగా ఆనందతారతమ్యము ౧౧ పర్యాయములుగా చెప్పఁబడియున్నది. ప్రథమపర్యాయమునందుమాత్రము 'శ్రోత్రియస్యచాకామహతస్య' అను వాక్యము శంకరభాష్యానుసారము లేదు గాని తక్కిన ౧౦ పర్యాయములందును ఈవాక్యము తప్పక అంతమునందు చేరియే యున్నది. కొందఱు మొట్టమొదటకూడ 'శ్రోత్రియస్యచాకామహతస్య' అని పఠించుచున్నారు.

(మొట్టమొదట మానుషానందమును చెప్పినప్పుడు 'శ్రోత్రియస్యచాకామహతస్య' అనువాక్యము ఏలచెప్పఁబడియుండలేదనుటకు సమాధానము:— శ్రోత్రియుఁడును, సదాచారశీలుఁడును, కోరికలులేనివాఁడును అగువాని యొక్క ఆనందము, మానుషానందముకంటె నూరంతలు ఎక్కువయని తెలుపుటకుఁ గాను ప్రథమపర్యాయమున 'శ్రోత్రియస్యచాకామహతస్య' అను వాక్యము ప్రయోగింపఁబడియుండలేదు.

మనుష్యగంధర్వులకు ఎట్టియానందముగలదో అట్టి యానందము' సదాచారశీలుఁడును అకామహతుఁడును అగు శ్రోత్రియునకుఁ గలుగుచున్నది.' ఇట్లే దేవగంధర్వులకును, చిరలోక లోకపితరులకును, ఆజానజదేవులకును, కర్మదేవులకును, దేవతలకును, ఇంద్రునకును, బృహస్పతికిని, ప్రజాపతికిని, హిరణ్యగర్భునకును ఎట్టియానందము గలదో అట్టియానందము 'సాధువును, అకామహతుఁడును అగుశ్రోత్రియునకుఁ గలుగును' అనుతలంపుతో మనుష్యగంధర్వానందాదివాక్యములకు చివర 'శ్రోత్రియస్యచాకామహతస్య' అను వాక్యము చేర్పఁబడియున్నది.)

కాని ఇచ్చట మనుష్యగంధర్వానందముకంటె దేవగంధర్వానందము ౧౦౦ తలు అధికమనియు, దేవగంధర్వానందముకంటె నూరంతలు చిరలోక లోకపితరులయానందము అధికమనియు, ఉత్తరోత్తరము, వృద్ధిగా చెప్పఁబడియుండఁగా అకామహతశ్రోత్రియానందము మనుష్యగంధర్వాద్యానంద

ముతో సమాన మెట్లగు ? నను సంశయము కలుగుట న్యాయ్యమగుచున్నది.
ఇందులకు సమాధాన మేమనఁగా:—అకామహతత్వమునందు తరతమ భావము లుండునని తలంచవలయును. మానుషానందపర్యాయమున చెప్పఁబడిన శ్రోత్రియునకు మానుషానందమునందు తుచ్ఛత్వబుద్ధితో కోరికలేని వాఁడనియు, దేవగంధర్వానందపర్యాయమున చెప్పఁబడిన శ్రోత్రియునకు మనుష్యగంధర్వానందమునందు తుచ్ఛత్వబుద్ధి కలిగి దానియందు కోరికలేని వాఁడనియు ఇటుల హిరణ్యగర్భానందపర్యాయమువఱకు గ్రహించునది.

ఆనందము ననుభవించుటకు సాధనములు—సదాచారము, అకామహతత్వము, శ్రోత్రియత్వము అని మూఁడు చెప్పఁబడినవి. సదాచార శ్రోత్రియత్వములు మాత్రము ౧౦ పర్యాయములు చెప్పఁబడినవారికి సమానములే.

'అకామహతత్వము' మాత్రము అవిద్యాసంబంధముయొక్క తరతమ భావము ననుసరించి ప్రథమపర్యాయమునందు గల శ్రోత్రియుని కంటె ద్వితీయపర్యాయమునందుఁగల శ్రోత్రియునకు అవిద్యాసంబంధము స్వల్పమనియు, అంతకంటె తృతీయపర్యాయ పఠిత శ్రోత్రియునకు అవిద్యాసంబంధము తక్కువయనియు ఇట్లే క్రమముగ నెఱుంగవలయును.

ఇటుల క్రమక్రమముగ శతగుణాధికముగ హిరణ్యగర్భానందము వఱకు చెప్పఁబడిన ఆనందముకంటె శ్రేష్ఠమగు బ్రహ్మానందము యేదిగలదో, అది వాఙ్మనస్సులకు కూడ అగోచరము కావున భగవతి యగు శ్రుతి సముద్రతుల్యమగు బ్రహ్మానందమునందు బిందువుతో సమానమగు హిరణ్యగర్భానంద మిట్టిదని మనకు సూచించి అంతకంటె విస్పష్టముగ సూచించుటకు అశక్యమని ఉపరమించినది. సముద్రమునకు సముద్రజలబిందువునకు అభేద మెట్లు లోకప్రసిద్ధియో అట్లే ఇక్కడ ఆనందమునకు ఆనందికి అభేదమును గ్రహించునది.

అట్టి హిరణ్యగర్భానందముకంటె అధికమగు ఆనందమే స్వరూపముగాఁగల స్వప్రకాశమానుఁడును, పంచకోశాత్మకుఁడును అగు పురుషునియందు బ్రహ్మపుచ్ఛశబ్దవాచ్యుఁడై యున్నవాఁడును, ఆదిత్య మండలాంతర్వర్తియై యున్నవాఁడును ఒక్కఁడే. ఇట్టి యభేదమగు బ్రహ్మానందమును అనుభవముగా నెఱిఁగిన విద్వాంసుఁడు అన్నమయాత్మను పొందుచున్నాఁడు ఇట్లే ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయాత్మలను పొందుచున్నాఁడు. అని శ్రుతి బోధించుచున్నది. శ్రుతియందుఁగల 'ఉపసంక్రామతి' అనుశబ్దమునకు 'పొందుట'అను అర్థమును పరిగ్రహించినయెడల ఆత్మవేఱు, ఆత్మను పొందువాఁడు వేఱు అను విరోధము ఏర్పడుచున్నది. కావున అన్నమయాదికములగు అనాత్మలయందు కలిగిన అవిద్యావిభ్రమము నశించుటయే ఇచట సంక్రమణ శబ్దార్థముగ గ్రహించుట యుక్తము.

ఆనందమీమాంసాఫలము ఉపసంహరింపఁబడుచున్నది:—

'స య శ్చాయం పురుషే'అను మంత్రమునందుగల 'సః యః' అను పదములయొక్క అర్థమేమనఁగా—ఎవ్వఁడు పరమవ్యోమ యనంబడు హృదయకమలాంతర్వర్తియగు గుహయందున్నవాఁడయి, ఆకాశాదికమును అన్నమయాంతమును అగు కార్యజాతమును సృజించి ఆకార్యమునందు తానే ప్రవేశించియున్నాఁడో, అతఁడే ఇచట నిర్దేశింపఁబడుచున్నాఁడు. అతఁడెవ్వఁడు?

ఈ పురుషునియం దెవ్వఁడున్నాఁడో, ఎవ్వఁ డీగనంబడుచున్న ఆదిత్యునియం దున్నాఁడో, పరమానందస్వరూపభూతుఁడుగను, శ్రోత్రియ ప్రత్యక్షుఁడుగను ఎవ్వఁడు నిర్దేశింపఁబడియున్నాఁడో, ఏ పరమానందము యొక్క ఏకదేశమును సుఖార్హ్యమగు బ్రహ్మాదిభూతజాత మనుభవించుచున్నదో, అతఁడే 'యశ్చాసావాదిత్యే' అని నిర్దేశింపఁబడుచున్నాఁడు. ఈ పురుషునియం దున్నవాఁడున్నూ, ఆదిత్యమండలాంతర్వర్తి యగువాఁడున్నూ,

భిన్నప్రదేశములందున్న ఘటాకాశ మహాకాశములవలె ఏకమే గాని వేఱు కాదు.

శంక:—ఆత్మను నిర్దేశించునప్పుడు వివరము చెప్పక ఊరక 'సయశ్చాయం పురుషే' అని దేహమునందున్న పురుషుడని నిర్దేశించి చెప్పుట యుక్తముగా లేదు. 'య శ్చాయం దక్షిణేఽక్షన్ పురుషః' అని చెప్పిన యుక్తముగా ఉండును. (ఉపనిషత్తులందు పలుతావుల యోఽయందక్షిణే ఽక్షన్పురుషః. బృ. ౫. 3. ౫. అని చెప్పఁబడి యుండుట) ప్రసిద్ధిగా ఉన్నదిగదా.

సమా:—అట్లనరాదు. ఇది పరాధికారము—అనఁగా ఇచట వివక్షితుఁడు పరుఁడగు ఆత్మగాని అపరబ్రహ్మకాదు. "అదృశ్యే ఽనాత్మ్యే; భీషాఽస్మాద్వాతఃపవతే; సైషాఽఽనందస్య మీమాగ్ంసాభవతి" మున్నగు శ్రుతులు పరమాత్మను గూర్చియే ప్రతిపాదించుచున్నవి. ఇట్టి సందర్భమునందు మధ్యలో సోపాధికబ్రహ్మమును గూర్చి చెప్పుట సంగతముగా నుండదుగదా. పరమాత్మవిజ్ఞానము ప్రకృతమగుటచేత 'స ఏకః' అని పరమాత్మయే ఇట చెప్పఁబడినాఁడు.

శంక:—ఇచ్చట ఆనందమీమాంసప్రకృతము. కావున ఆయానంద మీమాంస ఇచట ఉపసంహరింపఁబడవలసియున్నది. అభిన్నస్వాభావికానందమే పరమాత్మ. విషయవిషయిసంబంధ జనితమయిన ఆనందము పరమాత్మ కాఁజాలదు.

"స యశ్చాయం పురుషే, యశ్చాసావాదిత్యే, స ఏకః" అను శ్రుతి భిన్నాధికరణములందున్న విశేషణములను నిరసించి 'ఈపురుషునియందు ఎవ్వఁడున్నాఁడో, ఆదిత్యునియందున్న ఎవ్వఁడున్నాఁడో, వారిద్దఱు ఒకఁడే యని స్పష్టముగా తెలిపినది.

శంక:—కాని 'యశ్చాసావాదిత్యే, స ఏకః' అని ఆదిత్యుని గ్రహించుట యుక్తముగాలేదు.

సమాధానము:—అట్లనరాదు. అట్లు చెప్పినది సార్థకమే. ఏలయనఁగా, అట్లు చెప్పుట ఉత్కర్షాపకర్షలు లేవని చెప్పుటకు అని గ్రహించునది. మూర్తామూర్తలక్షణమయిన ద్వైతమునకు, ఆదిత్యమండలాంతర్గతుఁడగు పురుషుఁడు పరమోత్కృష్టుఁడు. అతనితో పోల్చిచూచినయెడల జీవుఁడు చాల నికృష్టుఁడయినవాఁడు. పురుషగతమయిన విశేషణమును నిరసించిన యెడల పరమానందవిషయమున ఉభయులు సములగుచున్నారు. అట్టి స్థితికి వచ్చినవానికి ఉత్కర్షాపకర్షలనునవి లేనేలేదు. అందువలన 'అభయం ప్రతిష్ఠాం విందతే' అని శ్రుతి వచించినది యుక్తమేయగుచున్నది.

పూర్వోత్తరగ్రంథసంగతి.

"అస్తి నాస్తి" యను అనుప్రశ్నమును చర్చించి—అనఁగా బ్రహ్మము అనునది ఉన్నదా లేదాయని విచారించి కామ్య, రసలాభ, ప్రాణన, అభయ ప్రతిష్ఠా, భయదర్శనముల ను ఉపపత్తుల ననుసరించి ఆకాశాదికమునకు కారణభూతమగు బ్రహ్మము గలదని సిద్ధాంతపఱుచుటచేత (అస్తివా? యను) ఒక ప్రశ్న నిరాకృతమయినది. ఇంక ౧. విద్వాంసుఁడు బ్రహ్మమును పొందునా? ౨. అవిద్వాంసుఁడు బ్రహ్మమును పొందఁడా? యను రెండు అనుప్రశ్నలు గలవు. విద్వాంసుఁడు బ్రహ్మమును పొందునా? లేక పొందఁడా? యనునది అంత్యమయిన అనుప్రశ్న. అంత్యమయిన అనుప్రశ్నకు సమాధానము చెప్పినయెడల మధ్యమమయిన అనుప్రశ్నకు సమాధానము చెప్పినట్లే యగును కావున తదర్థము ప్రయత్నించుటలేదు.

ఎవ్వఁడయితే ఈవిధముగా యథోక్తమయిన—అనఁగా సత్యజ్ఞానానందలక్షణమయిన బ్రహ్మమును ఉత్కర్షాపకర్షలను వదలి అద్వైతము, సత్యము,

జ్ఞానము, అనంతము అగు బ్రహ్మమే నే నయితినని తెలిసికొనుచున్నాఁడో, అట్లు తెలిసికొన్నవాఁడు ఈలోకమునుండి—అనఁగా దృష్టాదృష్ట ఇష్టవిషయ సముదాయముగల ఈలోకమునుండి బయలుదేరినవాఁడయి, నిరపేక్షుఁడయి యథావ్యాఖ్యాతమయిన యీయన్నమయాత్మను ఉపసంక్రమించుచున్నాఁడు—అనఁగా విషయజాతమంతయు అన్నమయాత్మకమగు పిండాత్మకంటె వేఱని తలంపఁడు, అనఁగా స్థూలభూతమునంతయు అన్నమయాత్మనుగాఁ గాంచుచున్నాఁడు. తరువాత ఈయన్నమయాభ్యంతరుఁడగు ప్రాణమయాత్మనుఁగా అన్నమయుని గాంచుచున్నాఁడు. తదభ్యంతరుఁడగు మనోమయునిగా ప్రాణమయుని గాంచుచున్నాఁడు. తదభ్యంతరుఁడగు విజ్ఞానమయునిగా మనోమయుని చూచుచున్నాఁడు. తదభ్యంతరుఁడగు ఆనందమయునిగా విజ్ఞానమయుని గాంచుచున్నాఁడు. తరువాత 'అదృశ్యే, అనాత్మ్యే, అనిరుక్తే, అనిలయనే, అభయం ప్రతిష్ఠాం విందతే' అను శ్రుతి ప్రమాణానుసారము బ్రహ్మమునందు ప్రతిష్ఠను పొందుచున్నాఁడు.

ద్వైత, అద్వైతచర్చ.

మంత్రమునందుఁగల ౧. ఏవం విత్' అనువాఁ డెవ్వఁడు?

౨. సంక్రమణము నెటుల నొనర్చును?

అనునది విచారించుట ఇట అత్యావశ్యకము.

శంక:—ఇచట సంక్రమించువాఁడు పరమాత్మకంటె భిన్నుఁడయిన మఱొకఁడా? లేక పరమాత్ముఁడేనా? మీకు ఈచర్చవలన కలుగఁగల లాభ మేమందురా? ఆవిషయమును సావధానముగ వినుఁడు. ఉపసంక్రమించువాఁడు—అనఁగా పొందువాఁడు పరమాత్మకంటె భిన్నుఁడయిన యెడల అనేక శ్రుతులకు విరోధము ఏర్పడుచున్నది.

శ్రుతులను కొన్నిఁటిని పేర్కొనియెదను.—

౧. తత్సృష్ట్వా । తదేవాను ప్రావిశత్. (తై. ఉ. ౨౬.)
౨. అన్యో౽సా వన్యో౽హ మస్మీతి న స వేద. (బృహ. ౧౪.౧౦.)
౩. ఏకమేవాద్వితీయమ్. (ఛాందో. ౬. ౨. ౧.)
౪. తత్త్వమసి. (ఛాందో. ౬. ౮. ౭.)

లేక ఆపరమాత్మయే 'ఆనందమయ మాత్మాన ముపసంక్రామతి'=ఆనంద మయాత్మను పొందుచున్నాఁడు. అని చెప్పినయెడల ఒక్కఁడే కర్మగను కర్తగను ఉండుననుట యుక్తముకాదు. పరమాత్మునకు సంసారిత్వముండునని అంగీకరించవలసి యుండును, లేదా పరమాత్ముఁడయినను లేకపోవలసివచ్చును, ఇటుల రెండు పక్షములందును—అనఁగా ఉపసంక్రమణకర్త పరుఁడన్నను, జీవుఁడన్నను, దోష మేర్పడుచున్నది కావున పరిహసించుటకు సాధ్యము కాఁజాలదు కావున ఇచట విమర్శించుట వ్యర్థము.

లేక మఱొకపక్షమునందు దోషము లేవందువా? (అనఁగా పరాపరులను భేదమున్నూ అభేదమున్నూ రెండున్నూ వాస్తవములే అనెడి భాస్కరాదుల యభిప్రాయము ననుసరించి యిట ఆశంకచేయఁబడినది.) ఆమూఁడవ పక్షమే శాస్త్రార్థము కావున ఇచట విమర్శ అనవసరము.

సమాధానము:—అట్లనరాదు. ఏదిశాస్త్రసమ్మతమో దానిని నిర్ణయించుచున్నారము కావున విమర్శ సార్థక మగుచున్నది. ఉపసంక్రమణకర్త పరుఁడా? లేక జీవుఁడా? అను పక్షద్వయమునందున్నూ దోషము సంభవించినమాట వాస్తవమే. ఈరెండుపక్షములందున్నూ కనఁబడుచున్న దోషమును పరిహరించుట ఆవశ్యకమనుటయు సత్యమే. మూఁడవపక్షము నిదివఱకెవ్వరయిన నిర్ణయించియున్నయెడల మేము మఱల విమర్శించి నిర్ణయించుటకు ప్రారంభించుట వ్యర్థముకావచ్చును, కాని అట్టి నిర్ణయము నిదివఱ

కెవ్వరును చేసియుండలేదు కావున తన్నిర్ణయార్థము మేము విమర్శింపఁ దలఁచితిమి కావున మేము చేయఁదలఁచిన విమర్శ సార్థకమే గాని నిరర్థకము కాఁజాలదు.

పూర్వ:—వేదప్రతిపాదితమయిన సిద్ధాంతమును నిర్ణయింపఁదలఁచితివి కావున నీవు చేయఁదలఁచిన విమర్శ సార్థకమే కావచ్చును కాని నీవు ఆలోచించి ఏదియో కొంత చెప్పఁగలవు కాని 'ఇదమిత్థ' మని నిర్ణయింపఁజాలవు.

సిద్ధా:—ఏమీ? వేదవచనముల సిద్ధాంతము నిర్ణయించుటకు వలను పడని దనియా నీతలంపు.

పూర్వ:—నే నట్లనుటలేదు.

సిద్ధాంతి:—అట్లయితే నీవన్నమాటకు అర్థమేమి?

పూర్వ:—నీకు ప్రతిపక్షు లనేకులున్నారు. నీవన్నదో ఒక్క వేదార్థమును మాత్రమే పట్టుకొని పాకులాడునట్టి ఏకత్వవాదివి, ఏకాకివి, నీకు ప్రతిపక్షు లనేకులున్నారు—వేదబాహ్యులయిన నానాత్వవాదు లనేకులు నీ సిద్ధాంతమును అంగీకరింపకున్నారు, కనుక నీవు నిర్ణయింపలేవని నా యభిప్రాయము.

సిద్ధాంతి:—అట్లనా! నీవు "వేదార్థమాత్రశరణుఁడవైన ఏకత్వవాదివైన నాకు వేదబాహ్యులయిన నానాత్వవాదు లనేకులు ప్రతిపక్షులున్నారని" చెప్పినాఁడవే, అదియే నాకు పరమసంతోషము, ఫరవా లేదు. వారి నందఱను జయించగలను. ఇఁక విమర్శించుటకు ప్రారంభించెదను.

ద్వైతము అవిద్యాకృతము కావున అద్వైతమే పరమార్థము.

('స ఏవ తు స్యాత్, తద్భావస్యతు, వివక్షితత్వాత్' అని భాష్యకారులవారు చర్చను ప్రారంభించిరి. ఇచట భేదపక్షమును, భేదాభేదపక్ష

మును అవధారణ, తు శబ్దములచేత క్రమముగ నిరాకరించి సిద్ధాంతము చేసి యున్నారు.)

ఇచట తద్భావము వివక్షితము కావున ఉపసంక్రమణకర్త పరుఁడే యగుచున్నాఁడు. ఇచట మూలమునందు 'బ్రహ్మవిదాప్నోతి పరం' అని చెప్పఁబడియున్నది. తద్విజ్ఞానముచేత పరమాత్మభావము చెప్పఁబడియున్నది. కావున పరమాత్మయే ఇచట గ్రహింపఁబడినటుల ఎఱుంగవలయును.

ఒకఁడు ఇంకొకఁడుగా అగుట లోకమునందు ప్రసిద్ధిలేదుగదా. కనుక పరుఁడే ఇచట వివక్షితుఁడు.

శంక:—బ్రహ్మవేత్తకు బ్రహ్మభావాపత్తి కలుగునని చెప్పుట ఉపపన్నము కాఁజాలదుగదా.

సమా:—ఇందనుపపత్తి ఏమియులేదు. అవిద్యాకృతమయిన ఆత్మగాని దానియందు గల అపోహను తీసివేయుటకే ఇట్లు చెప్పఁబడినది—ఇచట బ్రహ్మవిద్యచేత స్వాత్మప్రాప్తి కలుగుచున్నదని ఎయ్యది చెప్పఁబడుచున్నదో, ఆ యాత్మప్రాప్తియనునది ఏమనఁగా అవిద్యాకృతమయిన అన్నాది విశేషములుఁగల అనాత్మలను ఆత్మనుగా ఆరోపించుకొనియున్నాఁడు కావున, అట్టి అనాత్మలందు ఆత్మబుద్ధిని తొలఁగించుకొనుటయే "తద్భావాపత్తి" గాని వేఱుకాదు.

శంక:—ఆత్మప్రాప్తి యనఁగా అనాత్మలందుగల ఆత్మభావ నిరసనమే ఇచట ఆత్మప్రాప్తి యనుటకు అర్థమని నీ కెట్లు తెలిసినది?

సమా:—'బ్రహ్మవిత్' అని విద్యామాత్రమునే—అనఁగా తెలిసికొన్నవాఁడని మాత్రమే, శ్రుతి చెప్పుటవలన (ఆత్మప్రాప్తియనఁగా అనాత్మలందుగల ఆత్మభావనిరసనమే యని తెలియవచ్చుచున్నది) విద్యయొక్క కార్యము అవిద్యానివృత్తియని సుప్రసిద్ధము, కావున ఇక్కడ ఆత్మప్రాప్తికి విద్యామాత్రము—అనఁగా తెలిసికొనుటయే సాధనముగ ఉపదిష్టమైనది.

శంక:—'బ్రహ్మవిదాప్నోతిపరం' అను ఉపదేశము గ్రామముయొక్క మార్గ మిదియని చెప్పుటవలెనని అన్నయెడల—అనఁగా తదాత్మభావమును పొందుటకు విద్యామాత్రసాధనోపదేశము హేతువు కాఁజాలదు. దేశాంతరప్రాప్తియందు మార్గవిజ్ఞానోపదేశము లోకమునందు గనంబడుచున్నది గదా.

సమా:—అట్లనరాదు, గ్రామమే గంత (గ్రామమునుగూర్చి పోవువాఁడు) కాఁడుగదా. మీరిచ్చిన దృష్టాంతము సరిగాదు, అచట గ్రామవిషయకమయిన జ్ఞానము నుపదేశించుటలేదు. తత్ప్రాప్తికి హేతుభూతమయిన మార్గవిషయజ్ఞానము మాత్రము ఉపదేశింపఁబడుచున్నది. అట్లనే ఇచట బ్రహ్మజ్ఞానముకంటె భిన్నముగ బ్రహ్మజ్ఞానప్రాప్తికి సాధనభూతమయిన విజ్ఞానమేమియు ఉపదేశింపఁబడి యుండలేదు.

పూర్వ:—ఇదివఱకు చెప్పఁబడిన కర్మాదిసాధనాపేక్ష కలిగిన బ్రహ్మజ్ఞానము పరప్రాప్తికి సాధనముగా చెప్పఁబడినది (అని చెప్పినయెడల)

సిద్ధాంతి:—అట్లనరాదు. మోక్షము నిత్యము అగుటచేత కర్మాదిసాధనాపేక్షము కాదని మే మిదివఱకే యీ విషయమును నిరాకరించియున్నారము.

'తత్సృష్ట్వా, తదేవాను ప్రావిశత్' అను శ్రుతి కార్యస్థుఁడగు జీవునకు తదాత్మభావమును ప్రతిపాదించుచున్నది. అప్పుడే అభయప్రతిష్ఠయు యుక్తమగుచున్నది. విద్యావంతుఁడు స్వాత్మకంటె భిన్నమయినదానిని చూడనియెడల అప్పుడే అభయప్రతిష్ఠను పొందుననుటయు యుక్తమగుచున్నది. భయహేతువగు ఇతరము లేకపోవుటయే అభయప్రతిష్ఠకు హేతువు గదా. అవిద్యచేత వస్త్వంతరమున్నటుల తోఁచినయెడల వాస్తవమునకు అవి వస్తువుకాదనుటయే యుక్తము. నేత్రరోగము లేని వానికన్నులకు గనంబడక పోవుటచేతనే రెండవచంద్రుఁడు లేడని మనము అంగీకరించుచున్నాము.

పూర్వ:—నీవు చెప్పిన దృష్టాంతము సరిగాలేదు. ద్వితీయచంద్రుని వలె గాక విద్యావంతునకు కూడ వ్యావహారికముగ ద్వైతము గనంబడుచునే యున్నదిగదా.

సిద్ధాంతి:—అట్లనరాదు. సుషుప్తి సమాధులయందు ద్వైతము గ్రహింపఁబడుట లేదు కావున ద్వైతము వాస్తవము కాఁజాలదు.

పూర్వ:—సుషుప్తియందు గ్రహణము లేకపోవుట అన్యాసక్తమయి యుండుటచేత కావున అది యొక ఉపపత్తి కాఁజాలదు.

సమా:—అట్లనరాదు. సుషుప్తియందు అన్యాసక్తత్వములేదు, సుషుప్తియందు సర్వాగ్రహణమే గాని అన్యాసక్తత్వములేదు.

పూర్వ:—జాగ్రత్స్వప్నములందు అన్యగ్రహణ ముండుటవలన ద్వైతము వాస్తవముగా నున్నది.

సమా:—జాగ్రత్స్వప్నకృతమయిన అన్యవస్తుగ్రహణము అవిద్యాకృతమగుటచేతనే అని గ్రహించవలయును. విద్యాభావమునందు జాగ్రత్స్వప్నములందు అన్యవస్తుగ్రహణము గనంబడుట లేదు. కావున అన్యవస్తుగ్రహణము మిథ్యాభూతమని గ్రహించవలయును.

ద్వైతాగ్రహణమే ఆత్మకు స్వతస్సిద్ధము.

శంక:—సుషుప్తియందు అన్యాగ్రహణము అవిద్యాకృతము కావచ్చును.

సమా:—అట్లనరాదు, అదియే స్వాభావికము, వికారరహితమయి యుండుటయే పరానపేక్షము కావున అదియే వస్తువుయొక్కతత్త్వము. పరాపేక్షమయి యుండునట్టి వికార మెప్పుడున్ను యథార్థము కాఁజాలదు. వస్తువుయొక్క తత్త్వ మెప్పటికిన్ని కారకాపేక్షమయి యుండఁ

జాలదు. సత్తునకు కారకాపేక్షము విశేష మనంబడును. విశేష మెప్పుడున్ను వికారమేగాని వాస్తవము కాఁజాలదు. జాగ్రత్స్వప్నములందు అన్యవస్తు గ్రహణము విశేషము కావున అది వస్తుతత్త్వమెన్నటికి కాఁజాలదు. అన్యాపేక్షమయినది తత్త్వమెన్నటికి కాఁజాలదు. కావున స్వాభావికమగుటచేత జాగ్రత్స్వప్నములందువలె సుషుప్తియందు విశేషముండఁజాలదు.

భేదపక్షమునందు అభయప్రతిష్ఠ లేదు.

ఎవరు జీవునికంటె ఈశ్వరుఁడు—అనఁగా పరమాత్మ వేఱు, జగత్తు వేఱు అని తలంచెదరో వారి కెప్పుడున్ను భయనివృత్తి లేనే లేదు. ఏల యనఁగా భయహేతు వెప్పుడున్ను అన్యనిమిత్తమేగదా.

శంక:—సాపేక్షమయిన బ్రహ్మమే భయహేతుకము (అనఁగా సత్కర్మల నాచరింపక దుష్కృత్యముల నాచరించినవానికే ఈశ్వరుఁడు పాపఫలమగు నరకాదిరూపదండనము నొసంగుచున్నాఁడు కావున అట్టి వానికి బ్రహ్మము భయహేతువగుటయందు దోషమేమియు లేదు.)

నిరాకరణము:—అట్లనకాదు. ఎట్లయినను ఒకటియే, అధర్మాచరణాది సహాయము నపేక్షించి—అనఁగా నిత్యమో అనిత్యమో అగు కర్మజాతము ననుసరించి వేఱయిన భయకారణము ఉన్నయెడల అప్పటికిన్ని ఆత్మలాభము లేదుగదా.

ఏకత్వపక్షమునం దీయనుపపత్తి ఏమియులేదు. ఏలయనఁగా వారు సనిమిత్తమయిన సంసారమును అవిద్యాపరికల్పితమునుగా భావించుచున్నారు కనుక వారికి అనుపపత్తి ఏమియులేదు. నేత్రరోగముచేత ఒకనికి ద్వితీయచంద్రుఁడు గనంబడె నని తలంచుఁడు. అతఁడు నేత్రరోగముపశమించిన తర్వాత చంద్రుఁడొక్కఁడైనాడని తలంచును. అట్టి తైమిరిక దోషదృష్టుఁడగు చంద్రునియొక్క లాభముగాని నాశముగాని వాస్తవముగా లేదుగదా.

విద్యాఽవిద్యలు ఆత్మధర్మములుకావు.

పూర్వ:—విద్యావిద్యలు రెండున్నూ ఆత్మధర్మములు.

సిద్ధాంతి:—ప్రత్యక్షములగుటవలన ఆత్మధర్మములు కాఁజాలవు. ఏల యనఁగా వివేక, అవివేకములు రూపాదికమువలె అంతఃకరణధర్మములుగా తెలియఁబడుచున్నవి. ప్రత్యక్షముగా ఉన్నరూపము ద్రష్టృధర్మమనుట ఉపపన్నము కాఁజాలదు. అవిద్య స్వానుభవముగ నిరూపింపఁబడుచున్నది—నేను మూఢుఁడను, నాకు బాగుగా యీ విషయము తెలియలేదు. (అని అవిద్య నిరూపింపఁబడుచున్నది) అదేవిధముగా విద్యావిశేషములు కూడ లోకమునందు స్ఫుటముగ నిరూపింపఁబడుచున్నవి—ఆత్మజ్ఞానమెఱింగినవాఁడితరులకు ఆత్మవిద్యను బోధించుచున్నాఁడు. అతఁడు చెప్పిన దానిని ఇతరు లెఱుంగుచున్నారు. కనుక (అనఁగా విద్యావిద్యలు ఆత్మధర్మములుకాఁజాలవు కనుక) నామరూప పక్షమునకు చేరినవే విద్యాఽవిద్యలు—(అనఁగా విద్యాఽవిద్యలు నామరూపాంతఃపాతిఅయిన అంతఃకరణధర్మములే గాని ఆత్మధర్మములు కాఁజాలవు.) నామరూపములు ఆత్మధర్మములు కాఁజాలవని "నామరూపయో ర్నిర్వహితా తే యదంతరా తద్బ్రహ్మ (ఛాందో. ౮. ౧౪. ౧.) అను శ్రుతి ప్రతిపాదించుచున్నది. ఆ నామరూపములు సూర్యునకు ఉదయాస్తమయములవలె ఆత్మయందు కల్పితములే గాని పరమార్థముగా లేవు.

సంక్రమణమనఁగా విజ్ఞానము.

శంక:—అభేదపక్షమునందు "ఏత మానందమయ మాత్మాన ముప సంక్రామతి" అని శ్రుతి చెప్పుచున్నదిగదా. కర్మకర్తృత్వములు తెలియుచున్నవిగదా, ఇటులంగీకరించిన అసంగత మగునుగదా.

సమా:—ఇచట సంక్రమణమనఁగా విజ్ఞానమాత్రమే, జలూకవలె సంక్రమణము ఇట శ్రుత్యభిప్రేతము కాదు. ఇఁక నేమనఁగా విజ్ఞానమే సంక్రమణశ్రుతికి తాత్పర్యము.

శంక:—'ఉపసంక్రామతి' అని శ్రుతియందు ముఖ్యమయిన సంక్రమణమే చెప్పఁబడియున్నది గదా.

సమా:—అట్లనరాదు. ముఖ్యసంక్రమణము అన్నమయమునందు కనంబడుటలేదు గదా—బాహ్యమయిన యాలోకమునుండి (అనఁగా పుత్రభార్యాదిలక్షణమయిన బాహ్యమయిన యాలోకమునుండి) అన్నమయము జలూకవలె (జలగవలె) గాని, మఱొకవిధముగాఁగాని ఉపసంక్రమించుట—అనఁగా పొందుట లోకమునందు గనంబడుటలేదు గదా.

శంక:—బహిర్నిర్గతుఁడయిన మనోమయునకు గాని విజ్ఞానమయునకుఁగాని మఱల వచ్చి ప్రవేశించుటయే ఆత్మసంక్రమణము—(అనునెడల)

నిరాకరణము—అట్లనరాదు. స్వాత్మయందు స్వయముగ ప్రవేశించుట అనునది క్రియావిరోధమగుచున్నది. అన్యుఁడగువాఁడు, అన్యమయిన అన్నమయునను ఉపసంక్రమించుచున్నాఁడు అని ప్రారంభించి మనోమయుఁడుగాని విజ్ఞానమయుఁడుగాని స్వాత్మనే ఉపసంక్రమించుచున్నాఁడు అనుట విరోధమగుచున్నది. అట్లే ఆనందమయునకు ఆత్మసంక్రమణము ఉపపన్నము కాఁజాలదు. కావున ఇచట ఉపసంక్రమణమనఁగా ప్రాప్తి—పొందుట అను అర్థమును గ్రహింపకూడదు. (స్వాత్మని క్రియావిరోధాత్ అనున్యాయము ననుసరించి ఆనందమయసంక్రమణము ఆనందమయకర్తృకము కాకపోవుటయేగాక అన్నమయాద్యన్యతమకర్తృకము అగుఁగాక యని చెప్పునెడల అట్లని శ్రుతియందు చెప్పఁబడలేదు కావున) అన్నమయాద్యన్యతమకర్తృకముకూడ కాఁజాలదు. ఇఁక పరిశేషన్యాయముచేత అన్నమయా

ద్యానందమయాంతాత్మవ్యతిరిక్త జ్ఞానమాత్రమే ఇచట సంక్రమణశబ్దార్థమని గ్రహించుట యుక్తము. ఉపసంక్రమణమనఁగా జ్ఞానమాత్రమని అర్థమును గ్రహించినప్పుడే సర్వాంతరుఁడయిన ఆత్మయే ఆనందమయాంతస్థుఁడును అయియున్నాఁడు కావున అతఁడు ఆకాశాద్యన్నమయాంతమగు కార్యమును సృజించి దానియందు ప్రవేశించినవాఁ డాయెను, హృదయగుహాభిసంబంధమువలన అన్నమయాద్యనాత్మలయందు అతనికి ఆత్మవిభ్రమము కలుగుట సహజము, సంక్రమణాత్మకమయిన అట్టి ఆత్మవిజ్ఞానోత్పత్తిచేత అట్టి విభ్రమము నశించుట ఉపపన్నమగుచున్నది. ఆయా అవిద్యావిభ్రమవినాశమునందు ఉపసంక్రమణశబ్దము గౌణముగ గ్రహింపఁబడుచున్నది. లేనియెడల ఆత్మకు వాస్తవమయిన ఉపసంక్రమణము సిద్ధింపఁజాలదు. వస్త్వంతరమున్నగదా ఉపసంక్రమణము సిద్ధించును. తననే తాను పొందుట అనునది అసంగతము. జలూక (జలగ) మఱొకదానిని పట్టుకొనుచున్నది కాని తననే తాను పట్టుకొనఁజాలదు గదా.

"సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అని లక్షితమయిన బ్రహ్మమును తెలిసికొనుటకే బహుభవన, సర్గప్రవేశ, రసలాభ, అభయ, సంక్రమణాదికము సర్వవ్యవహారావిషయమయిన బ్రహ్మమునందే పరికల్పితము కాని వాస్తవముగా చూడ నిర్వికల్పమయిన బ్రహ్మమునందు ఒక్కవికల్పముకూడ వాస్తవముగ లేదు.

ఆ ఈ నిర్వికల్పుఁడగు ఆత్మను ఈవిధముగ నెఱింగినయెడల

శ్రు. న బిభేతి కుతశ్చన,

అభయం ప్రతిష్ఠాం విందతే.

అను విషయమునం దొక శ్లోకము-మంత్రము గలదు. ఈచెప్పఁబోవుమంత్రము

ఈ ఆనందవల్లియందు ప్రతిపాదించిన సకలవిషయజాతముయొక్క సారభూత
మయి విరాజిల్లుచున్నది.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయభాష్యవార్తికము, బ్రహ్మ. శ్లో. ౮౦-౯౪.
అనుభూతిప్రకాశిక, ౨-అధ్యా. శ్లో. ౧౨౧ - ౧౩౫.
ఆత్మపురాణము, ౧౦-అధ్యా. శ్లో. ౨౩౭-౨౯౭.

౯. నవమోఽనువాకః.

మం. యతో వాచో నివర్తంతే । అప్రాప్య మనసా సహ । ఆనందం బ్రహ్మణో విద్వాన్ । న బిభేతి కుతశ్చనేతి । ఏతగ్ం హ వావ న తపతి । కిమహగ్ం సాధు నాకరవమ్ । కిమహం పాప మకరవమితి । స య ఏవం విద్వా నేతే ఆత్మానగ్ం స్పృణుతే । ఉభే హ్యేవైష ఏతే ఆత్మానగ్ం స్పృణుతే । య ఏవం వేద । ఇత్యుపనిషత్ ॥

ఉత్తర శాంతిపాఠః.

సహ నా వవతు । సహ నౌ భునక్తు । సహవీర్యం కరవావహై । తేజస్వి నావధీత మస్తు మా విద్విషావహై । ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥

(బ్రహ్మవిదిదమయమిద మేకవిగ్ంశతి రన్నాదన్న రసమయా, త్ప్రాణో వ్యానోఽపాన ఆకాశః పృథివి పుచ్ఛగ్ం షడ్విగ్ంశతిః; ప్రాణం యజుర్ ఋక్సామా

ర్దేశోఽథర్వాంగిరసః పుచ్ఛం ద్వావిగ్ంశతిః; ర్యతశ్శ్ర
ద్ధర్తగ్ం సత్యం యోగో మహోఽష్టాదశ; విజ్ఞానం
ప్రియం మోదః ప్రమోద ఆనన్దో బ్రహ్మ పుచ్ఛం
ద్వావిగ్ంశతిః; రసన్నైవాఫాష్టావిగ్ం శతిః; రష్టో
దశ; భీషాఽస్మాన్మానుషో మనుష్యగంధర్వాణాం దేవ
గంధర్వాణాం పితౄణాం చిరలోకలోకానామాజాన
జానాం కర్మదేవానాం యే కర్మణా దేవానా మింద్ర
స్య బృహస్పతేః ప్రజాపతే ర్బ్రహ్మణ స్స య శ్చ సం
క్రామ త్యేకపఞ్చాశ; ద్యతః కుతశ్చనైతమేకాదశ
నవ ॥౯॥

(బ్రహ్మావిన్నవ.)

తైత్తిరీయోపనిషది ద్వితీయః ప్రశ్నః సమాప్తః.

బ్రహ్మవల్లీ (ఆనందవల్లీ) సమాప్తా.

టీక. యతః = (సర్వకారణభూతుఁడు నిర్వికల్పుఁడును అగు) ఏ ఆనం దాత్మక బ్రహ్మమునుండి, వాచః = ద్రవ్యాదిసవికల్పకవస్తువిషయములగు వాక్కులన్నియు, మనసా సహ = మనస్సుతోడ, అప్రాప్యైవ = (ఆయా నందస్వరూపుని) పొందకయే, నివర్తంతే=మఱలుచున్నవో(అట్టి), బ్రహ్మణః= బ్రహ్మముయొక్క, ఆనందం = ఆనందమును, విద్వాన్ = ఎఱింగినవాఁడు,

కుతశ్చన = దేనివల్లనుండియు, న బిభేతి = భయంపడఁడు. ఇతి = (ఆనంద విషయకశ్లోకము) సమాప్తము.

(మరణకాలము సమీపించినదగుచుండఁగా) అహం = నేను, సాధు = పుణ్యకర్మలను, కిం నాకరవం = ఏల చేయకపోతిని? అహం = నేను, పాపం = పాపకర్మను, కిం అకరవం = ఏల చేసితిని? ఇతి=ఇట్లనెడి (చింత), ఏతం=ఇట్టి బ్రహ్మవేత్తను, న తపతి హ వావ = తపింపఁజేయఁజాలదు గదా.

యః = ఎవ్వఁడు, ఏవం = ఈవిధముగా, విద్వాన్ = ఎఱుంగునో, సః = వాఁడు, ఆత్మానం = ఆత్మను, స్పృణుతే = బలపఱుచుచున్నాఁడు. (ఈ పుణ్యపాపములను రెంటిని పరమాత్మబుద్ధితోఁ గాంచు నని భావము).

యః = ఎవ్వఁడు, ఏవం = ఈవిధముగా, వేద=తెలిసికొనుచున్నాఁడో, సః ఏషః = ఆ ఇతఁడు, ఏతే ఉభే = ఈపుణ్యపాపములు రెంటిని, ఆత్మానం= ఆత్మనుగూర్చి, స్పృణుతే = బలపఱుచుచున్నాఁడు.

ఉపనిషత్ = ఉపనిషత్తు, ఇతి = సమాప్తమైనది.

తా. ద్రవ్యాది సవికల్పకవస్తువులను గుఱించి చెప్పఁబడెడి వాక్కులు వస్తుసామాన్యబుద్ధితో అద్వయుఁడగు బ్రహ్మమునందు ఆ బ్రహ్మమును ప్రకాశింపఁ జేయుటకుగాను ప్రయోగింపఁబడుచున్నవి. కాని ఆ (బ్రహ్మమును ప్రకాశింపఁ జేయుటకు) ప్రయోగింపఁబడిన వాక్కులు ఆ బ్రహ్మమును ప్రకాశింపఁజేయు సామర్థ్యములేనివయి, నిర్వికల్పుఁడును, సత్యజ్ఞానానంద లక్షణుఁడును, ఆనందాత్మకుఁడును అగు బ్రహ్మము పొందఁజాలకయే అచటినుండి మనస్సుతోడ మఱలుచున్నవి—అనఁగా స్వసామర్థ్యవిహీనములగుచున్నవి.

విద్యయే భయనాశహేతువు.

ఇచట మనస్సనఁగా శబ్దజన్యజ్ఞానము, మనస్సు అతీంద్రియమగు విషయమునందు ప్రవేశించునపుడు ఎచ్చట (శబ్దశక్తి) అభిధానము ప్రవర్తిం

చునో అచటనే ప్రకాశనముకూడను ప్రవేశించును. ఎచ్చట విజ్ఞానమో అచ్చటనే వాక్ప్రవృత్తియు కలుగును. విద్వాంసుడున్నూ, పాపరహితుడున్నూ, నిష్కాముడున్నూ, సర్వేషణా వినిర్ముక్తుడున్నూ అగువానికి ఆత్మభూత మయినట్టిదియు, విషయవిషయి సంబంధ వినిర్ముక్త మయినట్టియు, స్వాభావికమయినట్టియు, నిత్యమయినట్టియు, అంతట అవిభక్తమయినట్టియు పరమానందమును వెనుక జెప్పబడినవిధముగా తెలిసికొనినవాడు భయనిమిత్తము లేకపోవుటవలన దేనివల్లనుండియు భయపడజాలడు.

అట్టి విద్వాంసుడగు వానికంటె భిన్నమగువస్తువే లేదు. కావున ఆతనికి భయమేలేదు. అవిద్యచేత ఎప్పుడు కొద్దిగనైనను భేదబుద్ధిని పొందునో అప్పుడు ఆతనికి భయముకలుగును, అని ఇదివఱకు చెప్పియే యున్నారము.

నేత్రరోగమువలన చంద్రులిద్దఱున్నటుల కనంబడునటుల అవిద్య వలన వస్త్వంతరము ఉన్నటుల తెలియవచ్చును. అట్టి అవిద్య విద్వాంసునకు నశించును. కావున ఆత్మకంటె భిన్నమగువస్తువే లేదు. కావున భయనిమిత్తమే లేదు. భయనిమిత్తము లేనప్పుడు భయము పుట్టకపోవుటయు యుక్తమే గదా.

“యతో వాచో నివర్తంతే” అనెడి ఈ మంత్రము మనోమయ కోశవివరణస్థలమునందొకపర్యాయము పఠింపబడియున్నది. అచట మనస్సు బ్రహ్మవిజ్ఞానమునకు సాధనమగుటవలన మనస్సునందు బ్రహ్మత్వమును ఆరోపించి ఆ మనస్సును స్తుతించుటకుగాను “న బిభేతి కదాచన” యని భయమేమియు కలుగజాలదని భయము మాత్రము నిషేధింపబడినది.

ఇచట “న బిభేతి కుతశ్చన” అని అద్వైతవిషయమునందు భయపడుటకు తగిన నిమిత్తమే లేదని నిమిత్తమే ప్రతిషేధింపబడినది.

పూర్వ:—భయపడుటకు తగిన నిమిత్తమే లేదనుట సరికాదు. లోకమునందు మనుష్యులందఱు యావనావస్థయందు ఎటుల చరించుచున్నను కొంచెము తల నరిసి మరణకాలము సమీపించుచున్నదని ఎఱింగినప్పుడు, అయ్యో! నేను పుణ్యకార్యముల నాచరింపకపోతినే! పాపకృత్యముల నాచరించియుంటినే అని సంతాపము కలుగునుగదా? కావున భయపడుటకు దగిననిమిత్తముండియే యున్నది.

సమా:—అట్లనరాదు. నేను పాపకృత్యముల నేల ఆచరించితిని? పుణ్యకార్యముల నేల సలుపలేదు? నాకు నరకబాధ సంభవించునే అనెడి విచారము మూఢునకుం గాని విద్వాంసునకు సంభవింపదు. ఏలయనంగా విద్వాంసుఁడగువాఁడు ఈ పుణ్యకృత్యములను, పాపకృత్యములను ఆత్మకంటె భిన్నములయినవానినిగాం జూడక ఆత్మభావముతోడనే గాంచుచున్నాఁడు.

విద్వాంసుఁ డీరెంటిని ఆత్మభావముతోడనే గాంచుచు పుణ్యపాపరూపజడాంశమును వానియందు గాంచక చిదంశస్వరూపమునే భావించును. ఈవిధముగా అద్వయమును ఆనందాత్మకమును అగు బ్రహ్మము నెఱింగినవానికి పుణ్యపాపములు ఆత్మభావముతోఁ జూడఁబడును. కావున (దగ్ధబీజమువలె) నిర్వీర్యములయి జన్మారంభకములు కాఁజాలవు. ఇట్టి రహస్యవిషయములను ప్రతిపాదించునట్టి బ్రహ్మవిద్య ఈ ఆనందవల్లియందు చెప్పఁబడినది. ఇయ్యది సకలవిద్యలకంటె పరమరహస్యభూతమయినది. ఉపనిషత్తనఁగా రహస్యభూతమగు విద్యయనిభావము. లేక శ్రేష్ఠమగు శ్రేయస్సు ఈవిద్యయందు కలదు కావున ఉపనిషత్తనుటయు తగును కావున అట్టియుపనిషత్తు సమాప్తమయినది.

వివరణము:—"యతో వాచో నివర్తన్తే" అనుమంత్రము ఇది ఇటను ౪-వ అనువాకమునందు మనోమయకోశవివరణరూపముగ చెప్పఁబడి

నది. లోకమునందు సామాన్యముగ బ్రహ్మవిద్యను తెలిసికొనఁదలఁచిన వార లకు మనస్సు సాధనభూతమగుటచేత అట్టి మనస్సునందు బ్రహ్మత్వమును ఆరోపించి తదుపాసనమును స్తుతించుటకుఁగాను భయమేమియు లేదనియు, ఒకవేళ కలిగినను తత్ప్రతీకారముకలదు కావున భయముకలుగఁజాలదనియు నిషేధింపఁబడినది. ఇచట అద్వయబ్రహ్మమును ప్రమాణములచేత నెఱింగిన వానికి భయనిమిత్తమే లేదని నిషేధింపఁబడినది.

భయ మెప్పుడున్నూ "ద్వితీయాద్వై భయం భవతి" అనెడి శ్రుతి ప్రమాణమువలన తనకంటె భిన్నమగు వస్తువున్నప్పుడు కలుగు నను ప్రసిద్ధమయియున్నది.

అద్వయమని బోధించుటచేత భయహేతువే నిషిద్ధమయినదని భావము. "నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటిశతైరపి" అని న్యాయము ననుసరించి పుణ్యపాపకర్మ లనుభవముచేతఁ గాని నశింపఁజాలవు గదా. అప్పుడు భయనిమిత్తమే లేదనుట ఎట్లు పొసఁగును? అనుసంశయము జనిం చునుగాని ఆన్యాయము బ్రహ్మజ్ఞానవిరహితుల విషయముగాని బ్రహ్మజ్ఞానుల యొక్క విషయముకాదు.

"జ్ఞానాగ్నిస్సర్వకర్మాణి భస్మసాత్కురుతే ఽర్జున" అను భగవ ద్గీతాప్రమాణము ననుసరించి పుణ్యపాపరూప కర్మలన్నియు జన్మాంతరారంభ మునకు బీజభూతములు గాక నశించునని భావము.

జ్ఞానాత్పూర్వము సంచితమగు కర్మయందు అనారబ్ధఫలముగల కర్మయంతయు ఇటుల నశించును.

ఆరబ్ధమగు కర్మము మాత్రము శ్రుత్యనుభవములచేత తత్త్వవేత్తకు సైతము కలదు కావున దేహప్రాణవియోగానంతరము తత్త్వవేత్త నిర్విశేష బ్రహ్మాత్మకుఁ డగును.

ఆరబ్ధఫలమగు దేహాది సంసారముంపుటచేతనే తత్త్వవేత్తయగు ఆచార్యుఁడు ఉపదేష్టగుగుటయు, శిష్యులు తదుపదేశాదికమువలన తరించుటయు లోకమునందు శాస్త్రీయసంప్రదాయము వృద్ధిచెందుటకు మార్గభూతమగుచున్నది. అవిద్వాంసుఁ డెప్పుడును ఉపదేశకుఁడు కాఁజాలఁడు గదా.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయ భాష్యవార్తికము, బ్రహ్మ. శ్లో. ౭౫-౧౫౦.
అనుభూతిప్రకాశము, అధ్యా-౨. శ్లో. ౧౩౯-౧౪౨.
ఆత్మపురాణము, అధ్యా-౧౦. శ్లో. ౨౭౮-౩౦౯.

బ్రహ్మవల్లి సమాప్తము.

శ్రీ ర స్తు

శ్రీమచ్చిదానందగురుపరబ్రహ్మణే నమః.

తైత్తిరీయోపనిషత్తులు

౩. భృగువల్లీ

అనువాకాః = దశ.

(బ్రహ్మమీమాంసా) వారుణీదేవతా ఉపనిషత్

ఆంధ్రటీకాతాత్పర్యసమన్వితము.

శాంతిపాఠః.

హరిః ఓమ్. (సహ నావవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై । తేజస్వి నావధీత మస్తు మా విద్విషావహై । ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః॥)

---

౧. ప్రథమోఽనువాకః.

(పురాణం - ఉపాఖ్యానమ్.)

మం. భృగు ర్వై వారుణిః । వరుణం పితర ముపససార ।
అధీహి భగవో బ్రహ్మేతి । తస్మా ఏతత్ప్రోవాచ ।
అన్నం ప్రాణం చక్షు శ్శ్రోత్రం మనో వాచ మితి ।
తగ్ం హోవాచ । యతో వా ఇమాని భూతాని
జాయన్తే యేన జాతాని జీవన్తి । యత్ప్రయ న్త్యభి
సంవిశన్తి । త ద్విజిజ్ఞాసస్వ । త ద్బ్రహ్మేతి । స తపో
ఽతప్యత । స తప స్తప్త్వా ॥౧॥

టీక. వారుణిః = వరుణునిపుత్త్రుఁడగు, భృగుః = భృగువనువాఁడు, భగవః = ఓపూజ్యుఁడా! బ్రహ్మ = బ్రహ్మమును, అధీహి ఇతి = ఉపదేశింపుమని, పితరం వరుణం = తండ్రియగువరుణుని, ఉపససార వై = సమీపించెను. (పిదప ఆవరుణుఁడు) తస్మై = (బ్రహ్మజిజ్ఞాసకలిగి తనసమీపమునకు వచ్చిన) ఆపుత్త్రునికొఱకు, అన్నం ప్రాణం చక్షుః శ్రోత్రం మనః వాచం ఇతి = అన్నము ప్రాణము చక్షుస్సు శ్రోత్రము మనస్సు వాక్కు ఇవి బ్రహ్మప్రాప్తికి ద్వారభూతములని, ఏతత్ = ఈవిషయమును, ప్రోవాచ = పలికెను.

యతః = ఎవనివలన, ఇమాని = ఈ, భూతాని = భూతములు, జాయంతే = పుట్టుచున్నవో, జాతాని = పుట్టినభూతములు, యేన = ఎవనిచేత, జీవంతి =

జీవించుచున్నవో (ప్రళయకాలమునందు), యత్ ప్రయంతి = దేనిని పొందు చున్నవో, అభిసంవిశంతి = తాదాత్మ్యమును పొందుచున్నవో, తత్ = అది, బ్రహ్మ ఇతి = బ్రహ్మము అని, తం = ఆభృగువునుగూర్చి, ఉవాచహ = (పైబ్రహ్మలక్షణమును) చెప్పెను.

(ఈవిధముగా తండ్రియగు వరుణుడు ఉపదేశించినపిదప) సః = ఆ భృగువు, తపః అతప్యత = తపస్సునాచరించెను, సః = ఆభృగువు, తపః తప్త్వా = (ఈవిధముగా) తపము నాచరించి;

భృగువల్లి భాష్యోపోద్ఘాతము.

ఆనందవల్లీతాత్పర్యార్థము.

ఆనందవల్లియనెడి నామాంతరము కల బ్రహ్మవల్లియనుగ్రంథభాగము నందు ఇదివఱకు చెప్పఁబడినవిషయ మేమనఁగా:—సత్యజ్ఞానానంతాత్మకమగు బ్రహ్మము ఆకాశాదికమును అన్నమయాంతమును అగుకార్యజాతమును సృజించి తానందు ప్రవేశించి సాంసారికధర్మములు గలదానివలె గనఁబడు చున్నది, కావున సర్వకార్యవిలక్షణమును అదృశ్యాదిధర్మముగల ఆనందమే నేనను విషయమును తెలిసికొనవలయును.

"తత్సృష్ట్వా । తదేవానుప్రావిశత్" అనుచోటగల 'అనుప్రవేశము' అనుశబ్దము ఈయర్థముతోనే ప్రయుక్తమయినది. జీవబ్రహ్మములకుఁగల ఇట్టి యభేదమును ఎఱింగినవానికి శుభాశుభకర్మలు పుణ్యపాపజన్మములను కలుగఁ జేయఁజాలవు అనియు చెప్పఁబడియున్నది. బ్రహ్మవిద్యయు పరిసమాప్తి నందినది.

భృగువల్లీ ఉపనిషత్ ప్రవృత్తినిమిత్తము.

ఇఁక బ్రహ్మవిద్యా సాధనమగు తపస్సు, అన్నాదివిషయకములగు ఉపాసనములు చెప్పఁబడి యుండలేదు. కావున తదర్థ మీభృగువల్ల్యుపనిషత్తు

ఆరబ్ధమయినది. (ఆవిషయమును చెప్పఁబోవుచు) భృగువను పుత్త్రునకు వరుణుఁడను తండ్రి ఈవిషయమును బోధించినటుల ఆఖ్యాయిక చెప్పఁబడినది. ఆఖ్యాయిక విద్యాస్తుతికొఱకుఁగాను చెప్పఁబడును. (విద్యాస్తుతి ఎట్లనఁగా:—తండ్రి తనప్రీతిపాత్రుఁడగు పుత్త్రునకు ఉపదేశించెడి విద్యశ్రేష్ఠమయి యుండును గాని సామాన్యముగా నుండఁజాలదు. కావున మనమిట్టి శ్రేష్ఠవిద్యయందు ఉపేక్షచేయరాదు అని యస్మదాదులగుముముక్షువులు ఉత్సాహపూర్వకముగ తత్ప్రాప్తికయి ప్రయత్నించుటకు పురికొల్పును.) ఇఁక ప్రకృతము.

అన్నప్రాణాదికములు ఉపలక్షకములు.

వరుణుని పుత్త్రుఁడును సుప్రసిద్ధుఁడును అగు భృగువను మహర్షి తన తండ్రియగు వరుణుని సమీపమునకు బ్రహ్మజిజ్ఞాస కలిగి పోయి "అధీహి భగవో బ్రహ్మ" యని ప్రార్థించెను. అంతట తండ్రియగు వరుణుఁడు జిజ్ఞాస కలవాఁడు బ్రహ్మోపదేశార్థము ఎటుల సద్గురువు నాశ్రయింపవలయునో ఆవిధముగా తన్ను సమీపించిన తనపుత్త్రునకు అన్నము, ప్రాణము, చక్షుస్సు, శ్రోత్రము, మనస్సు, వాక్కు—అన్నమనఁగా శరీరము, ప్రాణమనఁగా శరీరాభ్యంతరమును, అత్తయు అనఁగా అన్నభక్షకమును అగు ప్రాణమును తరువాత జ్ఞానప్రాప్తికి సాధనభూతములగు చక్షుశ్శ్రోత్రమనోవాక్కులను నివి బ్రహ్మప్రాప్తికి ద్వారభూతములని ఉపదేశించెను. బ్రహ్మప్రాప్తికి ఇవి ద్వారభూతములని—అన్నాదికములను చెప్పి బ్రహ్మముయొక్క లక్షణమును సైతము భృగువునకు ఉపదేశించెను. ఆ లక్షణ మేమనఁగా:—ఎవనివల్ల నుండి బ్రహ్మాదిస్తంబపర్యంతములగు భూతములు పుట్టుచున్నవో, పుట్టినవి ఎవనివల్లనుండి జీవించుచున్నవో—అనఁగా ప్రాణములను ధరించుచు వృద్ధిని పొందుచున్నవో, ప్రళయకాలమునందు మఱల ఎవనినిగూర్చిపొందుచున్నవో మఱియు తాదాత్మ్యమును. పొందుచున్నవో (అనఁగా బ్రహ్మమునందు లీనమగుచున్నవని భావము.) అనఁగా భూతములు ఉత్పత్తిస్థితిలయకాలము

లందు దేనిలో సంబాధించి తదాత్మకములయి యుండునో అది బ్రహ్మము నకు లక్షణము. అట్టి జగత్కారణ మగునదియే బ్రహ్మము.

బ్రహ్మజిజ్ఞాస.

అట్టి బ్రహ్మమునే విశేషించి తెలిసికొనుము. ఇట్టిలక్షణముగల బ్రహ్మ మును "అన్నము, ప్రాణము, చక్షుస్సు, శ్రోత్రము, మనస్సు, వాక్కు" అను ద్వారముల రూపముగా పొందుము.

అన్నము మున్నగునవి బ్రహ్మప్రాప్తికి ద్వారభూతము లనుటకు శ్రుతి సైతము ప్రమాణముగాఁ గలదు.

శ్రు. "ప్రాణస్య ప్రాణ ముత చక్షుష శ్చక్షు రుత శ్రోత్రస్య శ్రోత్ర మన్నస్యాన్నం మనసో యే మనో విదుః తే నిచిక్యు ర్బ్రహ్మ పురాణ మగ్ర్యమ్." బృహ. ౪. ౪. ౧౮.

(అర్థ. ప్రాణమునకు ప్రాణభూతుఁడును, మఱియు నేత్రములకు నేత్రభూతుఁడును, శ్రోత్రములకు శ్రోత్రభూతుఁడును, అన్నమునకు అన్న భూతుఁడును, మనస్సునకు మనోభూతుఁడును అగువానిని ఎవ్వరెఱుంగుదురో వారు సృష్టికంటె ముందున్నట్టి బ్రహ్మమును ఆత్మగా ఎఱుంగఁగలరు.)

బ్రహ్మప్రాప్తికి ఆధ్యాత్మికమగు తపస్సే ప్రధానసాధనము.

ఈవిధముగా భృగుమహర్షి తనతండ్రివల్లనుండి బ్రహ్మమును పొందు టకు అన్నాదికములగుద్వారములను, బ్రహ్మలక్షణమును. ఆకర్ణించి బ్రహ్మోప లబ్ధికి తపస్సు సాధనము కావున తపమొనర్చెను. భృగుమహర్షి అనుపదిష్ట మయిన తపమునే బ్రహ్మోపలబ్ధికి సాధనముగా నేల గ్రహించెను?

(అన్నాదికము బ్రహ్మోపలబ్ధికి ద్వారమనియు, బ్రహ్మకు లక్షణము జగత్కారణత్వమనియు చెప్పినాఁడేకాని) స్వరూపముగా సాక్షాత్తుగా బ్రహ్మ మును నిర్దేశించి చెప్పలేదు. అందువలన (బ్రహ్మవిజ్ఞానమునకు వెనుక చెప్పినవి

గాక) సాధనాంతరము లపేక్షితములని తెలియవచ్చుచున్నది. సాక్షాత్తుగా నిర్దేశించి చెప్పుటకు వీలులేనిది కావుననే ఇటుల సావశేషముగ తన ప్రియ పుత్త్రునకు బోధించెనుగాని వీలున్నయెడల సాక్షాత్తుగానే బ్రహ్మ మిట్టిదని బోధించియుండును.

తపస్సు, అసాధ్యమగుదానిని సాధించుకొనుటకు వీలగునట్టి సాధనములలో శ్రేష్ఠతమమయిన దను విషయము లోకమునందు సుప్రసిద్ధము కావున కనతండ్రి బ్రహ్మవిజ్ఞానార్థము తపమొనర్పుము అని చెప్పకపోయినను లోక ప్రసిద్ధిచేత నెఱింగి తప మొనర్చెను.

తపస్సనగా బాహ్యాంతఃకరణ సమాధానాత్మకము, తద్ద్వారకముగనే బ్రహ్మమును పొందవలయును. ఇందులకు స్మృతిప్రమాణము—

శ్లో. "మనసశ్చేంద్రియాణాం చ హ్యైకాగ్ర్యం పరమం తపః,
తజ్జ్యాయ స్సర్వధర్మేభ్యః స ధర్మః పర ఉచ్యతే."
[భారత. మోక్షధర్మ. ౨౫౦-౪.]

(అర్థ. మనస్సుయొక్కయు ఇంద్రియములయొక్కయు ఏకాగ్రత శ్రేష్ఠమగు తపస్సు, ఇయ్యదియే సకలధర్మములకంటె అధికమగునది, ఇదియే శ్రేష్ఠమయిన దర్మము) ఆభృగు వీవిధముగా తపమొనర్చె.

౧. వివరణము:—'భృగుర్వై వారుణిః' అను ఒక ఆఖ్యాయిక అది యందు చెప్పఁబడినది, ఇట్టి ఆఖ్యాయికలు పారిప్లవార్థములా? లేక విద్యోప యోగములా? అను విషయము బ్రహ్మసూత్రములందు పారిప్లవాధికరణము నందు—

సూ. పారిప్లవార్థా ఇతిచేన్న విశేషితత్వాత్. ౨౩
తథాచైకవాక్యతోపబంధాత్. ౨౪ బ్ర. సూ. ౩. ౪.

అనుసూత్రములతో నిర్ణీతమయినది.

శ్రీశంకరులవారు భాష్యమునందు "అసతిచ పారిప్లవార్థత్వే ఆఖ్యానానాం సన్నిహిత విద్యాప్రతిపాదనోపయోగిత్వైవన్యాయ్యా" అని నిర్ణయించిరి.

౨. మూలమునందుగల "అభిసంవిశన్తి" యనుపదము "ప్రయంతి" యను పదముయొక్క వివరణరూపమని ఎఱుంగునది.

3. భృగువు "అధీహి భగవో బ్రహ్మ" యని బ్రహ్మజిజ్ఞాసగలవాఁడై పృచ్ఛఁజేయఁగా "యతో వా ఇమాని భూతాని" మున్నగువానిచేత జగత్కారణము నెఱుఁగుమని ఆచార్యుఁడగు వరుణుఁడు చెప్పుట న్యాయమేనా? అని సంశయమును చెంద నక్కరలేదు, "తద్బ్రహ్మ" అని శ్రుతియే జగత్కారణమయినదే బ్రహ్మమని చెప్పియున్నది. కావున ప్రశ్నసమాధానములు రెండును యుక్తములే.

౪. తపశ్శబ్దవివరణము ఇదివఱకు భాష్యోదాహృతమహాభారతవచనము ననుసరించి చేసియున్నారము. ఇప్పుడు వార్త్తికకారాద్యభిమతమయిన నిర్వచనము చెప్పఁబడుచున్నది:—

శ్లో. "మనసశ్చేంద్రియాణాం చేత్యేవమాధ్యాత్మికం తపః,
ఇహాన్యాయం ప్రసిద్ధం తు హ్యారాదుపకరోతి నః,
అన్వయవ్యతిరేకాదిచింతనం వా తపో భవేత్,
అహం బ్రహ్మేతి వాక్యార్థబోధాయాలమిదం యతః."

తైత్తి. భాష్య. వార్త్తి. భృగు. ౧. ౧౪. ౧౯.

సూతసంహితాయాం పరమేశ్వరేణోక్తమ్:—

శ్లో. "కోఽహం? ముక్తిః కథం? కేన సంసారం ప్రతిపన్నవాన్?
ఇత్యాలోచన మర్థజ్ఞా స్తప శ్శంసన్తి పండితాః."

అర్థ. నే నెవఁడను? ముక్తి ఎట్టిది? దేనిచేత సంసారమును పొందితిని? ఈవిషయమును పరిశీలించుటయే తపస్సని పండితులు పలుకుచున్నారు

౫. 'తద్విజిజ్ఞాసస్వ । 'తద్బ్రహ్మేతి' అని చెప్పఁబడియుండుటచేత బ్రహ్మసూత్రములందు ఆదియందుగల—

౧. అథాతో బ్రహ్మజిజ్ఞాసా. ౧-౧-౧.
౨. జన్మాద్యస్య యతః. ౧-౧-౨.
౩. శాస్త్రయోనిత్వాత్. ౧-౧-౩.
౪. తత్తు సమన్వయాత్. ౧-౧-౪.

అను నాలుగుసూత్రములకు యీశ్రుతి ఆధారభూతమని తలంచుచున్నారు.

దీనికి సంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయభాష్యవార్తికము, భృగువల్లీ. ౧-౨౨.
అనుభూతిప్రకాశము. అధ్యా. ౨. శ్లోక. ౧౪౫.
ఆత్మపురాణము, అధ్యా-౧౦. శ్లో. ౩౦౭-౩౩౫.

౨. ద్వితీయోఽనువాకః.

(బ్రహ్మజ్ఞానే ప్రథమపర్యాయః—అన్నస్య బ్రహ్మత్వమ్.)

మం. అన్నం బ్రహ్మేతి వ్యజానాత్ । అన్నాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే । అన్నేన జాతాని జీవన్తి । అన్నం ప్రయన్త్యభిసంవిశన్తీతి । తద్విజ్ఞాయ । పునరేవ వరుణం పితరముపససార । అధీహి భగవో బ్రహ్మేతి । తగ్ం హోవాచ । తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ । తపో బ్రహ్మేతి । స తపోఽతప్యత । స తపస్తప్త్వా ॥ ౨ ॥

టీక. ఇమాని = ఈ, భూతాని = భూతములు, అన్నాత్ ఏవ = అన్నమువల్లనుండియే, జాయంతే ఖలు = పుట్టుచున్నవి గదా, జాతాని = పుట్టిన భూతములు, అన్నేన = అన్నముచేతనే, జీవన్తి = జీవించుచున్నవి గదా, అన్నం = అన్నమును గూర్చియే, ప్రయంతి = (లయకాలమునందు) లీనమగుచున్నవి. అభిసంవిశన్తి = తాదాత్మ్యమును పొందుచున్నవి, ఇతి = ఈహేతువువలన, అన్నం = అన్నమును, బ్రహ్మఇతి = బ్రహ్మము అని, వ్యజానాత్ = తెలిసికొనెను. తత్ = ఆవిధముగా అన్నము బ్రహ్మము అనువిషయమును, విజ్ఞాయ = ఎఱింగి, పునః = మఱల, పితరం వరుణం = తండ్రి

యగు వరుణుని 'అధీహి భగవో బ్రహ్మ' ఇతి = ఓ భగవంతా! బ్రహ్మమును గూర్చి నాకు ఉపదేశించుము అని, ఉపససార ఏవ = సమీపించినవాఁడాయెను. తం = ఆవిధముగా తన్ను సమీపించిన పుత్త్రుని గాంచి, తపసా = తపస్సుచేత, బ్రహ్మ = బ్రహ్మమును, విజిజ్ఞాసస్వ = తెలిసికొనుము, తపః = తపస్సే. బ్రహ్మేతి = బ్రహ్మము అని, ఉవాచహ = (వరుణుఁడు) పలికెను. సః = ఆభృగువు, తపః అతప్యత = తపమొనర్చెను. సః = ఆభృగువు, తపః తప్త్వా = తపమొనర్చి.

తా. (తండ్రి బ్రహ్మముయొక్క లక్షణమును తత్ప్రాప్తిద్వారమును ఉపదేశించిన పిదప సాధ్యసాధనమునకు తపస్సు శ్రేష్ఠతమమగు సాధనమను విషయము జగద్విదితము కావున భృగువు తప మొనర్చెను. ఇటుల తప మొనర్చి) అన్నమును బ్రహ్మముగా నెఱిఁగెను. బ్రహ్మమునకు లక్షణముగా చెప్పిన సకలవిషయములు అన్నమునకు సరిపోవుచున్నవి. ఎట్లనఁగా—అన్నము వల్లనే సమస్తజీవజాతము పుట్టుచున్నది, వృద్ధిని పొందుచున్నది, నశించుచున్నది. ఈవిధముగ లక్షణోపపత్తులచేత నెఱిఁగియు మఱల సంశయము గలవాఁడై, తండ్రిని సమీపించి మఱల 'అధీహి భగవో బ్రహ్మ' అని ప్రార్థించెను. సంశయము కలుగుటకు హేతువు ఏమనఁగా—అన్నమునకు ఉత్పత్తి గనఁబడుచున్నది. ఉత్పత్తిగలది నిత్యముకాదు. (బ్రహ్మము నిత్యవస్తువు)

ఇటుల సంశయావిష్టుఁడై బ్రహ్మజిజ్ఞాసతో తన్ను సమీపించిన భృగువునకు తండ్రియగు వరుణుఁడు "తపస్సుచేత బ్రహ్మమును తెలిసికొనుము, తపస్సే బ్రహ్మము" అని యుపదేశించెను. తండ్రి యుపదేశించిన పిదప భృగువు మఱల తపమొనర్చెను, ఇటుల తపమొనర్చి;

వివరణము:—౧. అన్నమును బ్రహ్మము అని ఎఱుంగుటకు బ్రహ్మలక్షణము శ్రుతియందే "యతో వా ఇమాని భూతాని జాయంతే" అని చెప్పఁ

బడియున్నది. అన్నమువల్లనే సమస్తభూతములు సృజింపఁబడి వర్ధిల్లి లయమును పొందుచున్నవనుటకు బ్రహ్మవల్లియందే శ్రుతి ఇట్లు గలదు:—

శ్రు. అన్నాద్వై ప్రజాః ప్రజాయంతే, యాః కాశ్చ పృథివీగ్ంశ్రితాః, అథో అన్నేనైవ జీవన్తి, అథైనదపి యన్త్యన్తతః.

౨. ఉపపత్తి = అన్నశబ్దవాచ్యమగు విరాట్టు ఉపాస్యమని వేదములందు పలుతావులఁ జెప్పఁబడియున్నది. బ్రహ్మముకానిది ఉపాసించుటకు యోగ్యము కాకపోవుటచేత అన్నమును బ్రహ్మమునుగా భావించుటకు ఉపపత్తియగును.

3. "తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ" అని ప్రతిపర్యాయము చెప్పుట బ్రహ్మజ్ఞానసాధనములలోపల తపస్సే శ్రేష్ఠతమమను విషయమును దృఢీకరించుటకని ఎఱుంగునది.

౪. 'తపో బ్రహ్మ' అని చెప్పుట శ్రేష్ఠతమసాధనమగుటచేత తపముసే ఆచరించుము అని బోధించుచున్నాఁడు కావున తపస్సుయొక్క స్తుతినిమిత్తమయి చెప్పఁబడినది.

ఎంతపర్యంతము బ్రహ్మముయొక్క లక్షణము సంపూర్ణముగా తెలియఁబడదో, అంతపర్యంతము జిజ్ఞాస నివర్తించదు. అట్టి జిజ్ఞాస పోవుటకు శ్రేష్ఠసాధనము తపస్సుగాని మఱొకటికాదు.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయభాష్యవార్తికము, భృగువల్లీ, ౨, 3, ౪, ౫. ఖండ. ౨3-౭౯.
అనుభూతిప్రకాశము, ...
ఆత్మపురాణము, అధ్యా-౧౦. శ్లో. 33౬-3౪౧.

౩. తృతీయోఽనువాకః.

(బ్రహ్మవిజ్ఞానే ద్వితీయపర్యాయః).

మం. ప్రాణో బ్రహ్మేతి వ్యజానాత్ । ప్రాణాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే । ప్రాణేన జాతాని జీవన్తి । ప్రాణం ప్రయన్త్యభిసంవిశన్తీతి । తద్విజ్ఞాయ । పునరేవ వరుణం పితర ముపససార । అధీహి భగవో బ్రహ్మేతి । తగ్ం హోవాచ । తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ । తపో బ్రహ్మేతి । స తపో ఽతప్యత । స తపస్తప్త్వా ॥3॥

టీక. ప్రాణాత్ ఏవ = ప్రాణమునుండియే, ఇమాని భూతాని = ఈ సకలభూతములు, జాయంతే ఖలు హి=పుట్టుచున్నవి గదా, జాతాని=పుట్టిన భూతములు, ప్రాణేన = ప్రాణముచేత, జీవన్తి=జీవించుచున్నవి, ప్రాణం=ప్రాణమునే, ప్రయంతి అభిసంవిశన్తి = ప్రళయకాలమునందు పొందుచున్నవి, ఇతి=ఈహేతువువలన, ప్రాణః=ప్రాణము, బ్రహ్మఇతి = బ్రహ్మము అని, వ్యజానాత్ = తెలిసికొనెను. తత్ = ప్రాణమే బ్రహ్మమనువిషయమును, విజ్ఞాయ=తెలిసికొని (సంశయముగలవాడై), పునః=మఱల, అధీహి భగవో బ్రహ్మ ఇతి = భగవన్తా బ్రహ్మము నుపదేశింపుమని, పితరం వరుణం ఉపససార = తండ్రియగు వరుణుని సమీపించెను, తం = (ఆవిధముగా బ్రహ్మజిజ్ఞాస కలిగి తన్ను సమీపించిన) పుత్రునిగూర్చి, తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ

తపః బ్రహ్మ ఇతి=తపస్సుచేత బ్రహ్మమును తెలిసికొనుము, తపస్సే బ్రహ్మము అని, ఉవాచహ = పలికెను.

(పిదప) సః = ఆభృగువు, తపః అతప్యత = తపమొనర్చెను, సః = ఆభృగువు, తపః తప్త్వా = తపమొనర్చి.

తా. తండ్రి యుపదేశానుసారము బ్రహ్మనిర్ణయార్థము తపమొనర్చిన భృగుమహర్షి జగత్సృష్టి స్థితిలయములు ప్రాణాధీనములయి యుండుట తెలిసికొనినవాడై ప్రాణము బ్రహ్మమని గ్రహించెను. అయినను ప్రాణము జడమగుటచేతను, బ్రహ్మము చైతన్యపరిపూర్ణమగుటచేతను, ప్రాణము బ్రహ్మము కాజాలదను సంశయముకలవాడై 'బ్రహ్మము నుపదేశింపు' మని మఱల తండ్రిని సమీపించెను, వరుణుడును వెనుకటివలెనే మఱల తపస్సుచేత బ్రహ్మమును తెలిసికొనుము, తపస్సే బ్రహ్మము అని పుత్రునకు బోధించెను. తదనుసారము భృగుమహర్షి మఱల తపమొనర్చినవాడై.

వివరణము:—ప్రాణము భూతోత్పత్తి స్థితిలయములకు కారణభూతమనుటకు ప్రమాణభూతములగు శ్రుతుల నుదహరించుచున్నాడను.

౧. న హవా ఋతే ప్రాణా ద్రేత స్సిచ్యతే యద్వా ఋతే ప్రాణా
ద్రేత స్సిచ్యేత పూయే న్న సంభవేత్. ఐతరేయోపనిషత్తు.

౨. యావదస్మిం చ్ఛరీరే ప్రాణో భవతి తావదాయుః.

కౌషీతక్యుపనిషత్. 3. ౨.

3. ప్రాణోత్క్రాంతి సమయము-అనగా దేహమునకు లయమనుట జగత్ప్రసిద్ధమే కావున ప్రమాణ మనావశ్యకము.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు

తైత్తిరీయభాష్యవార్తికము, భృగువల్లీ ...
అనుభూతిప్రకాశము ... ...
ఆత్మపురాణము, ౧౦-అధ్యా. శ్లో-3౮౫.

౪. చతుర్థోఽనువాకః.

(బ్రహ్మవిజ్ఞానే తృతీయపర్యాయః.)

మం. మనో బ్రహ్మేతి వ్యజానాత్ । మనసో హ్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే । మనసా జాతాని జీవన్తి । మనః ప్రయన్త్యభిసంవిశన్తీతి । తద్విజ్ఞాయ । పునరేవ వరుణం పితర ముపససార । అధీహి భగవో బ్రహ్మేతి । తగ్ం హోవాచ । తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ । తపో బ్రహ్మేతి । స తపోఽతప్యత । స తపస్తప్త్వా ॥౪॥

టీక. ఇమాని భూతాని = ఈ భూతములు, మనసః జాయంతే హి ఖలు = మనస్సువల్లనుండియే పుట్టుచున్నవి కదా, జాతాని = పుట్టినవి, మనసా జీవన్తి = మనస్సుచేత జీవించుచున్నవి, మనః ప్రయాంతి అభిసంవిశంతి = ప్రళయకాలమునందు మనస్సునందు ఐక్యమగుచున్నవి, ఇతి = ఈ హేతువువలన, మనః బ్రహ్మ ఇతి = మనస్సు బ్రహ్మము అని, వ్యజానాత్ = గ్రహించెను.

తత్ విజ్ఞాయ=మనస్సు బ్రహ్మము అనువిషయము నెఱింగి (సంశయముగలవాఁడై), పునః=మఱల, 'అధీహి భగవో బ్రహ్మ ఇతి'=ఓభగవన్తా! బ్రహ్మము నుపదేశింపుమని, పితరం వరుణం ఉపససార ఏవ = తండ్రియగు వరుణుని సమీపించెను.

తం = అట్టిపుత్రునిగూర్చి, తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ, తపః బ్రహ్మ ఇతి = తపస్సుచేత బ్రహ్మము తెలుసుకొనుము, తపస్సే బ్రహ్మము అని, ఉవాచహ = (వరుణుఁడు) పలికెను.

సః = ఆభృగుమహర్షి, తపః అతప్యత = తపమొనర్చెను. సః=అతఁడు, తపః తప్త్వా = తపమొనర్చి.

తా. తపమొనర్చిన పిదప జగత్సృష్టిస్థితిలయములు మనస్సుచేత - అనఁగా సంకల్పముచేతనే కలుగుచున్నవి, కావున మనస్సే బ్రహ్మమని గ్రహించెను, ఆవిధముగా తెలిసికొనిన పిదప మఱల మనస్సు బ్రహ్మము కాఁజాలదను సంశయముగలవాఁడై మఱల 'బ్రహ్మము నుపదేశింపుము' అని తండ్రిని సమీపించగా తండ్రి తపస్సుచేత బ్రహ్మము నెఱుంగుము, తపస్సే బ్రహ్మము అని పుత్రున కుపదేశించెను. పుత్రుఁడు తదనుసారము మఱల తపమొనర్చెను.

వివరణము:—

జగత్సృష్టిస్థితిలయములు మనఃకృతములనుటకు శ్రుతిప్రమాణములు:—

శ్రు. ౧. అథహైనం కౌసల్యశ్చాశ్వలాయనః పప్రచ్ఛ;
భగవ న్కుతఏష ప్రాణో జాయతే?
కథ మాయాత్యస్మిఞ్ శరీరే? (ఇతి ఆశ్వలాయనప్రశ్నః)
ప్రశ్నోపనిషత్.

(అర్థ. ఈశరీరమునందు ప్రాణము ఎటుల ప్రవేశించును? అనిప్రశ్నము)
(సమా.—మనఃకృతేనాయాత్యస్మిఞ్ఛరీరే.

(ఇతిపిప్పలాదస్యోత్తరం.)

అర్థ. ఇట్టిదేహమును పొందెదను అనెడి సంకల్పముచేత ప్రాణ మీ శరీరమునందు చేరుచున్నది.

౨. కృషివాణిజ్యాది సకలజీవనోపాయకర్మలు మనస్సునకు అధీనములు కావున మనస్సు జీవనహేతువనుట సుప్రసిద్ధము.

3. మరణకాలమునందు వాగాదీంద్రియవృత్తు లన్నియు మనస్సునందు ప్రవేశించుచున్నవి కావున మనస్సు లయహేతు వగుచున్నది.

ఈ విషయమునుగూర్చి విపులముగ తెలిసికొనఁగోరువారు ప్రశ్నోపనిషత్తు తృతీయప్రశ్న, తచ్ఛంకరభాష్యములను, బృహదారణ్యకోపనిషత్తునందుగల "తద్యథా తృణజలూకా తృణస్యాంతం గత్వా" (౪-౪-3) అను ఉపనిషద్వాక్యమును గాఁచునది. ఇవి మనస్సు బ్రహ్మమనుటకు హేతువులు.

మనస్సు బ్రహ్మముకాదను సంశయమునకు హేతువు ఏమనఁగా— మనస్సు నేత్రము మున్నగు ఇంద్రియములవలె కరణభూత మగుచున్నది. కరణ మెప్పుడున్ను కర్తృపరతంత్రమగునుగాని స్వతంత్రముగాదు. కావున మనస్సు బ్రహ్మము కాదని తలంచినవాఁడయి విషయగ్రహణార్థము మఱల తప మొనర్చినాడని భావము.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయభాష్యవార్తికము ...

అనుభూతిప్రకాశము ...

ఆత్మపురాణము, అధ్యా-౧౦. శ్లో. 3౫౦-3౫౨.

౫. పంచమోఽనువాకః.

(బ్రహ్మవిజ్ఞానే చతుర్థపర్యాయః.)

మం. విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్ । విజ్ఞానాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే । విజ్ఞానేన జాతాని జీవంతి । విజ్ఞానం ప్రయంత్యభి సంవిశంతీతి । తద్విజ్ఞాయ । పునరేవ వరుణం పితర ముపససార । అధీహి భగవో బ్రహ్మేతి । తగ్ంహోవాచ । తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ । తపో బ్రహ్మేతి । స తపోఽతప్యత । స తప స్తప్త్వా ॥౫॥

టీక. ఇమాని భూతాని = ఈభూతములన్నియు, విజ్ఞానాత్ ఏవ = విజ్ఞానమువల్లనుండియే, జాయంతే హి = పుట్టుచున్నవిగదా, జాతాని=పుట్టిన భూతములు, విజ్ఞానేన = విజ్ఞానముచేత, జీవన్తి = జీవించుచున్నవి, ప్రయంతి విజ్ఞానం అభిసంవిశన్తి = ప్రళయకాలమునందు విజ్ఞానమునందే లీనమగుచున్నవి, ఇతి = ఈహేతువువలన, విజ్ఞానం = విజ్ఞానమును, బ్రహ్మఇతి = బ్రహ్మము అని, వ్యజానాత్ = తెలిసికొనెను.

తత్ = విజ్ఞానమే బ్రహ్మమను విషయమును, విజ్ఞాయ = తెలిసికొని, (మఱల సంశయముగలవాఁడై), 'అధీహి భగవో బ్రహ్మఇతి' = పూజ్యుఁడా! బ్రహ్మము నుపదేశింపుము అని, పునః = మఱల, పితరం వరుణం ఉపససార

ఏవ = తండ్రియగు వరుణుని సమీపించెను. (ఆవరుణుఁడు) తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ తపః బ్రహ్మఇతి = 'తపస్సుచేత బ్రహ్మము నెఱుంగుము, తపస్సే బ్రహ్మము' అని, తం ఉవాచ హ = ఆభృగువును గూర్చి పలికెను.

సః=ఆభృగువు, తపః అతప్యత = తపమొనర్చెను, సః తపః తప్త్వా = అతఁడు తపమొనర్చి;

తా. విజ్ఞానమువల్లనుండియే జగత్సృష్టిస్థితిలయములు కలుగుచుండుట చేత విజ్ఞానమే బ్రహ్మమని భృగువు తపస్సువలన తెలిసికొనెను. తరువాత విజ్ఞానము సైతము బ్రహ్మముకాఁజాలదను సంశయముగలవాఁడై మఱల 'బ్రహ్మము నుపదేశింపుము' అని తండ్రిని సమీపించెను. తండ్రియు వెనుకటి వలెనే 'తపస్సుచేత బ్రహ్మము నెఱుంగుము, తపస్సే బ్రహ్మము' అని పుత్త్రుని గూర్చి పలుకగా భృగువు మఱల తపమొనర్చెను. ఈ విధముగా తప మొనర్చి.

విజ్ఞానము బ్రహ్మముకాదనుటకు అతనికి తోఁచినసంశయమేమనఁగా:—

'విజ్ఞానం యజ్ఞం తనుతే' ఇత్యాదిశ్రుతిచేత విజ్ఞానము కర్త యగుచున్నది, కర్తృత్వము, క్లేశసమన్వితము, బ్రహ్మము అకర్త, క్లేశరహితుఁడు.

విజ్ఞానమువలన కర్మద్వారా దేహోత్పత్తిమాత్రము కలుగవచ్చును గాని ఆకాశాదిభూతములన్నియు పుట్టుటలేదు, కనుక విజ్ఞానము బ్రహ్మము కాఁజాలదని భృగువునకు స్ఫురించెను.

వివరణము:—విజ్ఞానము జగత్సృష్టిస్థితిలయములకు హేతుభూత మనుటకు శ్రుతిప్రమాణము:—

౧. 'విజ్ఞానం యజ్ఞం తనుతే' ఇత్యాదిశ్రుతియు, "యత్కర్మ కురుతే తదభిసంపద్యతే, పుణ్యో వా పుణ్యేన కర్మణా భవతి పాపః పాపే

వ" (బృహ. ౩. ౨. ౧౩) అనుశ్రుతియు ప్రసిద్ధత్వమును ప్రతిపాదించు చున్నవి.

౨. విజ్ఞానము లౌకికములగు కృష్యాదికర్మలకు కర్త యగుటచేత జీవనహేతుత్వము సుప్రసిద్ధమేగదా.

౩. మరణకారణములగు యుద్ధాదికములందును విజ్ఞానముచేత ప్రవర్తించును కావున లయకారణమనుటయు స్ఫుటముగానే తెలియుచున్నది.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయభాష్యవార్తికము ...

అనుభూతిప్రకాశము ...

ఆత్మపురాణము, అధ్యా-౧౦. శ్లో. ౩౫౩-౩౬౧.

౬. షష్ఠోఽనువాకః.

(బ్రహ్మవిజ్ఞానే పంచమపర్యాయః.)

మం. ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ । ఆనందా ద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే । ఆనందేన జాతాని జీవంతి । ఆనందం ప్రయంత్యభిసంవిశంతీతి । సైషా భార్గవీ వారుణీ విద్యా । పరమే వ్యోమ న్ప్రతిష్ఠితా । య ఏవం వేద ప్రతితిష్ఠతి । అన్నవానన్నాదో భవతి । మహా న్భవతి ప్రజయా పశుభి ర్బ్రహ్మవర్చసేన । మహాన్కీర్త్యా ॥౬॥

టీ. ఆనందాత్ ఏవ = ఆనందమువల్లనుండియే, ఇమాని భూతాని = ఈభూతములు, జాయంతేహి ఖలు=పుట్టుచున్నవి గదా, జాతాని ఆనందేన జీవన్తి = పుట్టినవి ఆనందముచేత జీవించుచున్నవి, ఆనందంప్రయంతి అభిసంవిశన్తి = ప్రళయకాలమునందు ఆనందమునందు లయమయి తాదాత్మ్యము పొందుచున్నవి. ఇతి=ఈ హేతువువలన, ఆనందః బ్రహ్మఇతి = ఆనందము బ్రహ్మము అని, వ్యజానాత్ = భృగుమహర్షి తెలిసికొనెను.

సా ఏషా=ఆ ఈ సుప్రసిద్ధమయిన, విద్యా = విద్య వారుణీ=వరుణునిచేత చెప్పఁబడినది, భార్గవీ = భృగుమహర్షిచేత తెలిసికొనఁబడినది, పరమేవ్యోమన్ = శ్రేష్ఠమయిన హృదయాకాశమునందు, (అనఁగా దానియందున్న బుద్ధిగుహాయందుగల ఆనందరూపమయిన అద్వైతమయినబ్రహ్మమునందు) ప్రతిష్ఠితా = పరిసమాప్తి నందినది.

యః=ఎవ్వఁడు, ఏవం = ఈవిధముగా తపమొనర్చి, వేద=(క్రమముగా అన్నాదికమును నిరసించుకొని ఆనందమునే బ్రహ్మముగా) తెలిసికొనునో, సః=వాఁడు, ప్రతితిష్ఠతి = (ఆనందమునందు అనఁగా బ్రహ్మమునందు) ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు. (బ్రహ్మమే అగుచున్నాఁడు) అన్నవాన్=అన్నము గలవాఁడు, భవతి=అగుచున్నాఁడు, అన్నాదః=దీప్తాగ్ని గలవాఁడు (భవతి = అగుచున్నాఁడు), ప్రజయా = పుత్త్రపౌత్త్రాదికము చేతను, పశుభిః = గోవృషభాదిపశుగణముచేతను, బ్రహ్మవర్చసేన = శమదమఘ్ఞానాదికమువలన జనించిన బ్రహ్మతేజస్సుచేతను, మహాన్=శ్రేష్ఠుఁడు, భవతి = అగుచున్నాఁడు, కీర్త్యా = సదాచారముగలవాఁడను కీర్తిచేత, మహాన్ = గొప్పవాఁడు (భవతి=అగుచున్నాఁడు.)

తా. ఈవిధముగా తపస్సుచేత విశుద్ధాత్ముఁయగు భృగుమహర్షి అన్న ప్రాణ మనో విజ్ఞాన కోశములందు బ్రహ్మలక్షణము సమగ్రముగఁ గనంబడక పోవుటచేతను, క్రమముగ ఈకోశములు పూర్వాపేక్షయా ఉత్తరకోశము అంతరమగుటను ఎఱింగినవాఁడై చివరకు తపస్సుచేతనే సర్వాంతరతమమగు ఆనందమును బ్రహ్మమునుగా నెఱింగెను. కావున బ్రహ్మజిజ్ఞాసువగు నతఁడు బాహ్యాంతఃకరణ సమాధానరూప మగు తపస్సను సాధనముచేతనే బ్రహ్మము నెఱుంగవలయునని శ్రుతి బోధించుచున్నది. ఇంతటితో ఆఖ్యాయిక సమాప్తమాయెను. ఈ సంగతిని శ్రుతియే స్వయముగా బోధించుచున్నది. ఇదియే వరుణుఁడు చెప్పినట్టియు, భృగువు తెలిసికొనినట్టియు విద్య, అన్నమయకోశము మొదలుకొని హృదయాకాశగుహాంతర్వర్తియగు ఆనంద స్వరూపమువఱకు ప్రవర్తించినది. (భృగు వేవిధముగా తపస్సుచేత ఆనంద మునే బ్రహ్మముగా నెఱిఁగెనో) అట్లే ఇతరుఁ డెవ్వఁడైనను తపస్సాధనము చేత అన్నాదిక్రమముగా బ్రహ్మలక్షణమును భావించుకొని తపఃపరిపాకము చేత అయ్యది కాజాలదని ఎఱింగి ఆనందమే బ్రహ్మమని చివరకు నెఱుంగునో అతఁడు ఆనందబ్రహ్మమునందు ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు, అనఁగా బ్రహ్మమే అగుచున్నాఁడని భావము, ఇది అదృష్టఫలము.

ఇఁక దృష్టఫలము చెప్పఁబడుచున్నది:—

౧. ప్రభూతమయిన అనఁగా అతిశయమైన అన్నముగలవాఁ డగుచున్నాఁడు. (ఇచట అన్నశబ్దమునకు ప్రభూతము అని విశేషణము చెప్పని యెడల జీవించియున్న వారందఱు అన్నవంతులే కావున విద్వాంసునకు సాధారణునకు భేదమే లేక పోవును.)

౨. అన్నాదుఁడగును (అనఁగా దీప్తమగు జఠరాగ్నిగలవాఁ డగును.)

౩. పుత్రపౌత్రాది ప్రజలచేతను, గోమహిష్యాది పశుసంపత్తిచేతను, శమదమ జ్ఞానాదినిమిత్తమగు బ్రహ్మవర్చస్సుచేతను, శ్రేష్ఠుఁడగుచున్నాఁడు.

౪. సదాచారనిరతుఁ డగు కీర్తిచేత పూజ్యుఁడగును.

వివరణము:—మూలమునందులేని "ప్రభూతము" అను అన్నవిశేషణము సమన్వయార్థము భాష్యకారాదృతమయినది, అన్నాదశబ్దమునకు 'దీప్తాగ్ని' యనునర్థమును సైతము ఇట్లే యని గ్రహించునది.

"అన్నవాన్ అన్నాదః, ప్రజయా పశుభిః బ్రహ్మవర్చసేన, కీర్త్యా మహాన్ భవతి." మున్నగుఫలములు కృతకృత్యుఁడగు బ్రహ్మవిదునకు అనావశ్యకములుగదా. పోనీ అతనికి అనావశ్యకములయినను ఇవి నియమముగా బ్రహ్మవిదులందఱకు తప్పక కలుగు ననిగాని లోకమునందు దృష్టాంతము లేదు గదా. అని సంశయము కొందఱకుఁ గలుగవచ్చును, అయినను ఛాందోగ్యప్రతిపాదిత భూమవిద్యయందు భూమవిద్యాస్తుతినిమిత్తము సగుణబ్రహ్మవిద్యాఫలమగు విషయమునే భూమవిద్యాఫలముగా ఎటుల చెప్పఁబడియున్నదో అట్లే బ్రహ్మవిద్యాస్తుతినిమిత్త మిచట ఫలసంకీర్తన మని ఎఱుంగునది.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు

తైత్తిరీయభాష్యవార్తికము, భృగువల్లీ, ౬వ ఖండ, శ్లో. ౩౦-౩౯.
అనుభూతి ప్రకాశము ...
ఆత్మపురాణము, అధ్యా-౧౦. శ్లో. ౩౬౩-౩౭౨.

౭. సప్తమోఽనువాకః.

(అన్నబ్రహ్మోపాసకవ్రతనియమాః.)

మం. అన్నం న నిన్ద్యాత్ । తద్వ్రతమ్ । ప్రాణో వా అన్నమ్ । శరీర మన్నాదమ్ । ప్రాణే శరీరం ప్రతిష్ఠితమ్ । శరీరే ప్రాణః ప్రతిష్ఠితః । తదేత దన్న మన్నే ప్రతిష్ఠితమ్ । స య ఏత దన్న మన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి । అన్నవా నన్నాదో భవతి । మహా న్భవతి ప్రజయా పశుభి ర్బ్రహ్మవర్చసేన । మహా న్కీర్త్యా ॥

టీక. అన్నం = అన్నమును, న నింద్యాత్ = నిందింపఁగూడదు, తత్ = అది, వ్రతం = బ్రహ్మవేత్తకు వ్రతము, ప్రాణఃవా = ప్రాణమే, అన్నం = అన్నము, శరీరం = శరీరము, అన్నాదం = అన్నాదము, ప్రాణే = ప్రాణమునందు, శరీరం = శరీరము, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠితమయియున్నది, శరీరే = శరీరమునందు, ప్రాణః = ప్రాణము, ప్రతిష్ఠితః = ప్రతిష్ఠితమయియున్నది, తత్ = అందువలన, ఏతత్ = ఈయన్నము ప్రాణము అనెడి యుభయవిధమగు అన్నము, అన్నే = అన్నమునందు, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠిత మగుచున్నది, యః = ఎవ్వఁడు, ఏతత్ = ఈశరీరము, ప్రాణము అనెడి ఉభయవిధమగు, అన్నం = అన్నము, అన్నే = అన్నమునందు, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠితమయినదని, వేద = ఉపాసించుచున్నాఁడో, సః = వాఁడు, ప్రతితిష్ఠతి = ప్రతిష్ఠితుఁడగుచున్నాఁడు.

అన్నవాన్ = అన్నవంతుఁడును, అన్నాదః = అన్నాదుఁడున్నూ, భవతి = అగుచున్నాఁడు, ప్రజయా = సంతానముచేతను, పశుభిః = పశువులచేతను, బ్రహ్మవర్చసేన = బ్రహ్మవర్చస్సుచేతను, మహాన్ = గొప్పవాఁడు, భవతి = అగుచున్నాఁడు, కీర్త్యా = కీర్తిచేతను, మహాన్ (భవతి) = గొప్పవాఁ డగుచున్నాఁడు.

తా. ద్వారభూతమగు అన్నబ్రహ్మోపాసనముచేతనే బ్రహ్మజ్ఞానము ప్రాప్తించినది కావున గురువును వలె అన్నమును ఎప్పుడున్నూ నిందింపఁదగదు. ఇటుల నిందింపకుండుట బ్రహ్మవేత్తకు వ్రతము, వ్రతము అని చెప్పుట అన్నముయొక్కస్తుతి నిమిత్తము, అన్నమునకు అట్టిస్తుతి కలుగుటకు కారణము బ్రహ్మవిజ్ఞానమునకు ప్రథమమున ఉపాయమగుటచేత నని తెలిసికొనవలయును.

శరీరమునందు లోపల ఉండుటచేత ప్రాణము అన్న మనంబడును, లోకమునందు ఏయది దేనియొక్కలోపలనుండునో అది దానికి అన్నమని చెప్పఁబడుచున్నదిగదా.

శరీరమునందు ప్రాణము ప్రతిష్ఠితమయియున్నది, కావున ప్రాణము అన్నము, శరీరము అన్నాదము, అదేవిధముగా శరీరమున్నూ అన్నము, ప్రాణము అన్నాదము, ఏలయనఁగా ప్రాణమునందు శరీరము ప్రతిష్ఠితమయియున్నది, (అనఁగా) శరీరస్థితికి ప్రాణము నిమిత్తము అని భావము.

కావున ఈ శరీరము ప్రాణము ఈ రెండున్నూ అన్నమున్నూ అన్నాదమున్నూ అగుచున్నవి.

పరస్పర మొకటి ఒకదానియందు ప్రతిష్ఠితమయి యుండుటచేత అన్నమనియూ, ఒక్కొకటి ఒక్కొకదానికి ప్రతిష్ఠగానుండుటచేత అన్నాదమనియు భావము.

కావున ప్రాణము శరీరము ఈ రెండున్నూ అన్నమున్నూ అన్నాదమున్నూ అగుచున్నవి.

ఎవ్వఁ డీవిషయము నెఱింగి ఉపాసించుచున్నాఁడో, వాఁడు మిక్కుట మగు అన్నము గలవాఁడున్నూ, అన్నాదుఁడున్నూ పుత్రపౌత్రాది

ప్రజలచేతను, గోమహిష్యాది పశుసంపత్తిచేతను, శమదమజ్ఞానాదినిమిత్త బ్రహ్మవర్చస్సుచేతను, కీర్తిచేతను లోకమునందు వన్నె కెక్కును.

వివరణము:—శరీరముయొక్క లోపల మనము భుజించిన యన్నముండును గదా, అదేవిధముగా శరీరమధ్యభాగమునందు ఉండుటచేత ప్రాణము అన్న మనంబడును.

మధ్యవర్తి యగు ప్రాణరూపాన్నమును శరీరము ధరించియున్నది కావున శరీరము అన్నాద మనంబడును.

గృహమధ్యవర్తియగు స్తంభము గృహమును ఎటుల ధరించుచున్నదో, అదేవిధముగా దేహమధ్యవర్తియగు ప్రాణము దేహమును ధరించుచున్నది, కావున ప్రాణమునందు శరీరము ప్రతిష్ఠితమయియున్నదని చెప్పఁబడినది.

ప్రాణము దేహమును ధరించియున్న విషయము ప్రశ్నోపనిషత్తునందు ప్రాణసంవాదమునం దిట్లు చెప్పఁబడియున్నది:—

శ్రు. అహ మేవైత త్పంచధా ఽఽత్మానం ప్రవిభజ్యైత ద్బాణ మవష్టభ్య విధారయామి. ప్రశ్నోపనిషత్. అ. 3.

శరీరము ప్రాణమునకు ఆధారమగుట సుప్రసిద్ధమే గదా.

ఇటుల అన్యోన్యాధారత్వమును తెలిసికొనవలయును, శరీరము అన్న కార్యమగుటచేత అన్న మగుచున్నది, శరీరము ప్రాణము ఈరెండును్నూ అన్నమగుటవలనను పైన చెప్పినరీతిగా పరస్పరాధారము లగుటచేతను, అన్నమే అన్నమునందు ప్రతిష్ఠితమయి యున్నదనియు ఎఱుంగునది.

అన్నమును నిందింపఁగూడదు అను నియమ మిచట ఉపదేశింపఁబడినది.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయభాష్యవార్తికము, భృగు, 2-వ ఖండ. శ్లో. ४०, ४०.

అనుభూతిప్రకాశము ...

ఆత్మపురాణము ...

౮. అష్టమోఽనువాకః.

(అన్నబ్రహ్మోపాసకవ్రతనియమాః.)

మం. అన్నం న పరిచక్షీత । తద్వ్రతమ్ । ఆపో వా
అన్నమ్ । జ్యోతి రన్నాదమ్ । అప్సు జ్యోతిః ప్రతిష్ఠి
తమ్ । జ్యోతిష్యాపః ప్రతిష్ఠితాః । తదేత దన్న
మన్నే ప్రతిష్ఠితమ్ । స య ఏత దన్న మన్నే ప్రతి
ష్ఠితం వేద ప్రతితిష్ఠతి । అన్నవా నన్నాదో భవతి ।
మహా న్భవతి ప్రజయా పశుభి ర్బ్రహ్మవర్చసేన । మహాన్
కీర్త్యా ॥౮॥

టీక. అన్నం=అన్నమును, న పరిచక్షీత=పరిహరింపఁగూడదు, తత్ = అది, వ్రతం=వ్రతము, ఆపః = ఉదకములు, అన్నంవై = అన్నముగదా, జ్యోతిః = జ్యోతిస్సు, అన్నాదం = అన్నాదము, అప్సు = జలములందు, జ్యోతిః = జ్యోతిస్సు, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠితమయియున్నది, జ్యోతిషి= జ్యోతిస్సునందు, ఆపః = ఉదకములు, ప్రతిష్ఠితాః = ప్రతిష్ఠితములయి యున్నవి.

తత్=అందువలన, ఏతత్ = ఈయుభయమును (అనఁగా ఆపో జ్యోతులు రెండున్ను) అగు, అన్నం=అన్నము, అన్నే = అన్నమునందు, ప్రతిష్ఠితం=ప్రతిష్ఠితమగుచున్నది.

యః=ఎవ్వఁడు, ఏతత్ = ఈఆపోజ్యోతీరూపమగు, అన్నం=అన్న-ము‌ను, అన్నే=అన్నమునందు, ప్రతిష్ఠితం=ప్రతిష్ఠితమయినదానినిగా, వేద= ఉపాసించుచున్నాఁడో, సః=వాఁడు, ప్రతితిష్ఠతి ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు, అన్నవాన్=అన్నవంతుఁడున్నూ, అన్నాదః = అన్నాదుఁడున్నూ, భవతి = అగుచున్నాఁడు, ప్రజయా = సంతానముచేతను, పశుభిః=పశువులచేతను, బ్రహ్మవర్చసేన = బ్రహ్మవర్చస్సుచేతను, మహాన్ = గొప్పవాఁడు, భవతి = అగుచున్నాఁడు, కీర్త్యా = కీర్తిచేతనున్నూ, మహాన్ = గొప్పవాఁడు, (భవతి=) అగుచున్నాఁడు.

తా. త్రాగినజలములు ఉదరాగ్నిచేత జీర్ణము చేయఁబడుచున్నవి కావున జలములు అన్నమగుచున్నవి, జ్యోతిస్సు అన్నాద మగుచున్నది, వర్షోదకము లందు వైద్యుతాగ్నియుండుటచేతను, దేహసంతాపముచేత దేహమునందు చెమట గనంబడుటచేతను, జలజ్యోతిస్సులు, పరస్పరప్రతిష్ఠితము లగుచున్నవి, కావుననే పరస్పరాన్నములు అగుచున్నవి, ఇట్టివిషయము నెఱింగి యుపాసించువానికి వెనుకటివలెనే అన్నము చక్కఁగా లభించుట, ప్రదీప్తమయిన జఠరాగ్ని కలిగియుండుట, మున్నగు ఫలములు కలుగును.

ఈ యనువాకమునందు భోజనకాలమునందు ప్రాప్తమయిన అన్నమును మంచిదికాదని తలంచి పరిహరింపఁదగదను నియమము వ్రతముగా విధింపఁబడినది.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయభాష్యవార్తికము, భృగు, ఖండ. ౭-౪౨.

అనుభూతిప్రకాశము ...

ఆత్మపురాణము ...

౯. నవమోఽనువాకః.

(అన్నబ్రహ్మోపాసకవ్రతమ్.)

౨౭. అన్నం బహు కుర్వీత । తద్వ్రతమ్ । పృథివీ వా అన్నమ్ । ఆకాశోఽన్నాదః । పృథివ్యా మాకాశః ప్రతిష్ఠితః । ఆకాశే పృథివీ ప్రతిష్ఠితా । తదేత దన్న మన్నే ప్రతిష్ఠితమ్ । స య ఏత దన్న మన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి । అన్నవా నన్నాదో భవతి । మహా న్భవతి ప్రజయా పశుభి ర్బ్రహ్మవర్చసేన । మహా న్కీర్త్యా ।౯॥

టీ. అన్నం=అన్నమును, బహు = విస్తారముగా, కుర్వీత=సంపాదించవలయును, తత్=అది, వ్రతం=వ్రతము, పృథివీ=భూమి, అన్నంవై=అన్నముగదా, ఆకాశః = ఆకాశము, అన్నాదః = అన్నాదము, పృథివ్యాం = భూమియందు, ఆకాశః = ఆకాశము, ప్రతిష్ఠితా = ప్రతిష్ఠితమయియున్నది, ఆకాశే = ఆకాశమునందు, పృథివీ = భూమి, ప్రతిష్ఠితా = ప్రతిష్ఠితమయియున్నది, తత్ ఏతత్=ఆ ఈ యుభయవిధమగు, అన్నం = అన్నము, అన్నే = అన్నమునందు, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠితమయియున్నది, యః = ఎవ్వఁడు, ఏతత్ = ఈయుభయవిధమగు, అన్నం = అన్నము, అన్నే=అన్నమునందు, ప్రతిష్ఠితం= ప్రతిష్ఠితమయియున్నదని, వేద = ఉపాసించుచున్నాఁడో, సః = వాఁడు,

ప్రతితిష్ఠతి=ప్రతిష్ఠితుఁ డగుచున్నాఁడు. అన్నవాన్ = అన్నవంతుఁడున్నూ, అన్నాదః = అన్నాదుఁడున్నూ, భవతి = అగుచున్నాఁడు, ప్రజయా = ప్రజచేతను, పశుభిః = పశువులచేతను, బ్రహ్మవర్చసేన = బ్రహ్మవర్చస్సుచేతను, మహాన్ = గొప్పవాఁడు, భవతి=అగుచున్నాఁడు, కీర్త్యా=కీర్తిచేతను, మహాన్ = గొప్పవాఁడు, భవతి = అగుచున్నాఁడు.

తా. అన్నమును అతిథుల కొఱకుగుటకయి మిక్కుటముగ సంపాదింపవలయును, ఇది వ్రతము, క్రిందను మీఁదను ఉన్నఆకాశముయొక్క మధ్యభాగమునం దుండుటచేత పృథివి అన్నమగుచున్నది, ఆకాశము అన్నాద మగుచున్నది.

పామరదృష్టిచేత భూమికి పైభాగమునందు ఆకాశము గనంబడు చుడుటచేత ఆకాశమునకు పృథివి యాధారమగుచున్నది, విచారదృష్టిచేత ఆకాశము ఆధారభూత మగుచున్నది, ఇటుల పరస్పరాధారత్వమును, పరస్పరాన్నత్వాదికమును ఊహించుకొనవలయును.

ఇటుల నెఱింగి ఉపాసించువానికి వెనుకటివలె ప్రభూతాన్నవత్త్వము, అన్నాదత్వము, ప్రజాపశుకీర్త్యాదిలాభము తప్పక కలుగును.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయభాష్యవార్తికము, భృగు, ఖండ-౯. శ్లో. ౪-౨.
ఆత్మపురాణము ...
అనుభూతిప్రకాశము ...

౧౦. దశమోఽనువాకః

(వ్రతవిశేషాః.)

౫౦. న కంచన వసతౌ ప్రత్యాచక్షీత । తద్వ్రతమ్ । తస్మా
ద్యయా కయా చ విధయా బహ్వన్నం ప్రాప్నుయా
త్ । అరాధ్యస్మా అన్న మిత్యాచక్షతే । ఏతద్వై
ముఖతోఽన్నగ్ం రాద్ధమ్ । ముఖతోఽస్మా అన్నగ్ం
రాధ్యతే ఏతద్వై మధ్యతోఽన్నగ్ం రాద్ధమ్ ।
మధ్యతోఽస్మా అన్నగ్ం రాధ్యతే । ఏతద్వా అన్త
తోఽన్నగ్ం రాద్ధమ్ అన్తతోఽస్మా అన్నగ్ం
రాధ్యతే ॥౧॥

య ఏవం వేద । క్షేమ ఇతి వాచి । యోగక్షేమ
ఇతి ప్రాణాపానయోః । కర్మేతి హస్తయోః । గతి రితి
పాదయోః । విముక్తి రితి పాయౌ । ఇతి మానుషీ
స్సమాజ్ఞాః । అథ దైవీః । తృప్తి రితి వృష్టౌ । బలమితి
విద్యుతి ॥౨॥

యశ ఇతి పశుషు । జ్యోతి రితి నక్షత్రేషు ।
ప్రజాతి రమృత మానన్ద ఇత్యుపస్థే । సర్వ మిత్యా
కాశే । తత్ప్రతిష్ఠేత్యుపాసీత । ప్రతిష్ఠావా న్భవతి ।
తన్మహ ఇత్యుపాసీత । మహా న్భవతి । తన్మన ఇత్యు
పాసీత । మానవా న్భవతి ॥౧౨॥

తన్నమ ఇత్యుపాసీత నమ్యన్తే ఽస్మై కామాః ।
తద్బ్రహ్మేత్యుపాసీత । బ్రహ్మవా న్భవతి । తద్బ్రహ్మణః
పరిమర ఇత్యుపాసీత । పర్యేణం మ్రియన్తే ద్విషన్త
స్సపత్నాః । పరి యే ఽప్రియా భ్రాతృవ్యాః । స య
శ్చాయం పురుషే । యశ్చాసా వాదిత్యే । స ఏకః ॥౧౩॥

స య ఏవం విత్ । అస్మా ల్లోకా త్ప్రేత్య । ఏత
మన్నమయ మాత్మాన ముపసంక్రమ్య । ఏతం ప్రాణ
మయ మాత్మాన ముప సంక్రమ్య । ఏతం మనోమయ
మాత్మాన ముప సంక్రమ్య ఏతం విజ్ఞానమయ మా
త్మాన ముపసంక్రమ్య । ఏత మానన్దమయ మాత్మాన
ముప సంక్రమ్య । ఇమా న్లోకా న్కామాన్నీ కామ

రూప్యనుసంచరన్ । ఏత థ్సామ గాయ న్నాస్తే ।
హా3వు హా3వు హా3వు ॥౧౪॥

అహమన్న మహమన్న మహమన్నమ్ । అహ మన్నా
దో3௨హ మన్నాదో 3௨హ మన్నాదః । అహగ్ం
శ్లోకకృ దహగ్ం శ్లోకకృ దహగ్ం శ్లోకకృత్ । అహ
మస్మి ప్రథమజా ఋతా3స్య । పూర్వం దేవేభ్యో
అమృతస్య నా3భాఇ । యో మా దదాతి స ఇదేవ
మా3௨௨వాః । అహ మన్న మన్న మద న్త మా3ద్మి ।
అహం విశ్వం భువన మభ్యభవా3మ్ । సువర్ణజ్యోతీః ।
య ఏవం వేద । ఇత్యుపనిషత్ ॥౧౫॥

(శ్రాధ్యతే విద్యుతి మానవా న్నభవ త్యేకో హా3వు
య ఏవం వేదైకం చ ॥౧౦॥

భృగు స్తస్మై యతో విశ న్తి తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మే
హ్మేతి తత్త్రయోదశాన్నం ప్రాణో మనో విజ్ఞాన
మితి విజ్ఞాయ తం తపసా ద్వాదశ ద్వాదశావన్న ఇతి
సైషా దశాన్నం న నిన్ద్యా త్ప్రాణ శ్శరీరమన్నం న

పరి చక్షీతాపో జ్యోతిరన్నం బహుకుర్వీత పృథివ్యా
కాశ ఏకాదశైకాదశ న కంచ నైకషష్టిర్దశ ॥౧౦॥

భృగు ర్య ఏవం వేద పఞ్చదశ ॥౧౫॥

ఉత్తరశాంతిపాఠము.

సహ నా వవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం
కరవావహై । తేజస్వి నా వధీత మస్తు మా విద్విషా
వహై । ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః).

భృగుస్త్రయోదశా న్నం ప్రాణో మనో విజ్ఞాన
మితి విజ్ఞానం ద్వాదశ ద్వాదశా న్నో దశాన్నం న
నిన్ద్యా దన్నం న పరిచక్షీతాన్నం బహు కుర్వీత పృథి
వ్యాకాశ ఏకాదశైకాదశ న కంచనైకషష్టిర్దశ ॥౧౦॥

సహనావవత్విత్యేతన్నాత్ర ద్రావిడాః పఠన్తి ।
భృగుస్త్రయోదశేత్యారభ్య న కంచనైకషష్టిరిత్యన్తం
తు పాఠద్వయేఽపి సమానమ్ ॥ తతః;

శం నో మిత్రః సహ నా య శ్ఛన్దసాం భూ స్స

యః పృథివ్యామిత్యృతం చాహం వేద మనూచ్యశం
న స్సహ నావవతు బ్రహ్మవి ద్భృగుః పఞ్చదశ ॥

శం నో మహ ఇత్యాదితో వ్య నో ఇతరాణ్యస న్నే
వాన్నం న నిన్ద్యాచ్చతుశ్చత్వారిగ్ంశత్ ॥౪౪॥
ఇతి ద్రావిడానాం పాఠః॥

౧. వసతౌ=గృహమునందు నివసించుటకు వచ్చిన, కంచన=ఎవ్వనిని, నప్రత్యాచక్షీత = నిషేధింపఁగూడఁదు, తత్=అటుల నిషేధింపకుండుట, వ్రతం=(ఈపృథివ్యాకాశోపాసకునకు,) వ్రతం=వ్రతము, తస్మాత్=అందువలన, యయాకయాచవిధయా=శాస్త్రీయ మగుట ఏదియోఒకవిధానము (వృత్తి)చేత, అన్నం=అన్నమును, బహు=మిక్కుటముగా, ప్రాప్నుయాత్ = సంపాదించవలయును.

అస్మై=గృహాగతుఁడగు అతిథికొఱకు, అన్నం = అన్నము, అరాధి=సిద్ధముగానున్నది, ఇతి=అని, ఆచక్షతే=పలుకుచున్నారు, అన్నం=అన్నము, ఏతత్ ఈరాద్ధం = ఇదుగో సిద్ధమయినది, అని ముఖతః=ప్రథమవయస్సునందు - లేక అడిగినవెంటనే ఉత్తమోపచారములతో (ఎవ్వఁడు) ఇచ్చుచున్నాఁడో, (అట్టి)అస్మై=వీనికొఱకు, ముఖతః=ముఖ్యముగా పూర్వవయస్సునందే, అన్నం=అన్నమును, రాధ్యతే=పొందఁబడుచున్నది.

అన్నం = అన్నము, ఏతత్ రాద్ధం = ఇదుగో సిద్ధమయినది (అని) మధ్యతః = మధ్యమవయస్సునందు మధ్యమోపచారములతో (ఎవ్వఁడు) ఇచ్చుచున్నాఁడో, అస్మై=అట్టి వీనికొఱకు, మధ్యతః=మధ్యమవయస్సునందు మధ్యమోపచారములతో, అన్నం=అన్నము, రాధ్యతే=పొందఁబడుచున్నది.

అంతతః=ముసలితనమునందు, లేక చివరకు (ఎవ్వఁడు) ఏతత్ రాద్ధం= సిద్ధమయినదని, అన్నం = అన్నమును (ఇచ్చుచున్నాఁడో), అస్మై = అట్టి వీనికొఱకు, అంతతః=ముసలితనమునందు జనులోపచారములతో, అన్నం = అన్నము, రాధ్యతే=పొందఁబడుచున్నది.

యః=ఎవ్వఁడు, ఏవం=ఈవిధముగా, వేద=తెలిసికొనుచున్నాఁడో, (వాఁడు అట్టిఫలమును పొందును.)

(ఇఁక బ్రహ్మముయొక్క ఉపాసనాప్రకారము చెప్పఁబడుచున్నది.)

౨. 1. (బ్రహ్మము) వాచి=వాక్కునందు, క్షేమః ఇతి = క్షేమరూపమున నున్నదని (ఉపాసింపవలయును.)

2. (బ్రహ్మము) ప్రాణాపానయోః = ప్రాణాపానములందు, యోగక్షేమ ఇతి=యోగక్షేమరూపమున నున్నదని (ఉపాసింపవలయును.)

3. (బ్రహ్మము) హస్తయోః=హస్తములందు, కర్మ ఇతి = కర్మాత్మకముగ నున్నదని (ఉపాసింపవలయును.)

4. (బ్రహ్మము) పాదయోః=పాదములందు, గతిః ఇతి=గత్యాత్మకముగ నున్నదని (ఉపాసింపవలయును.)

5. (బ్రహ్మము) పాయౌ=పాయువునందు, విముక్తిః ఇతి=విసర్జనాత్మకముగ నున్నదని (ఉపాసింపవలయును.)

ఇతి=ఇవి, మానుషీః=ఆధ్యాత్మికములగు, సమాజ్ఞాః = జ్ఞానములు- అనఁగా ఉపాసనములు.

అథ=ఇఁక, దైవీః=అధిదైవికోపాసనములు (చెప్పఁబడుచున్నవి.)

3. 1. (బ్రహ్మము) వృష్టౌ = వృష్టియందు, తృప్తిః ఇతి=తృప్తిస్వరూపముతో ప్రతిష్ఠితమయి యున్నదని (ఉపాసింపవలయును.)

2. (బ్రహ్మము) విద్యుతి=విద్యుత్తునందు, బలం ఇతి = బలాత్మకముగ ప్రతిష్ఠిత మయియున్నదని (ఉపాసింపవలయును.)

3. (బ్రహ్మము) పశుషు=పశువులందు, యశః ఇతి=కీర్త్యాత్మకముగ సున్నదని (ఉపాసింపవలయును.)

4. (బ్రహ్మము) నక్షత్రేషు = నక్షత్రములందు, జ్యోతిః ఇతి = జ్యోతిస్స్వరూపముతో నున్నదని (ఉపాసింపవలయును.)

5. (బ్రహ్మము)ఉపస్థే=జననేంద్రియమునందు, ప్రజాతిః అమృతం=పుత్రోత్పత్తి, పితృఋణ విమోచనరూపముగ తండ్రికి అమృతత్వమును కలుగుట, ఆనందః = ఆనందస్వరూపముతో నుండుట (అని ఉపాసింప వలయును.)

6. (బ్రహ్మము) ఆకాశే=ఆకాశమునందు, సర్వంఇతి = సర్వస్వరూపముతో ప్రతిష్ఠితమయియున్నదని (ఉపాసింపవలయును.)

౪. 1. తత్ = ఆబ్రహ్మస్వరూపమగు ఆకాశము, ప్రతిష్ఠా ఇతి = సర్వమునకు ప్రతిష్ఠయని, ఉపాసీత = ఉపాసింపవలయును, ప్రతిష్ఠావాన్ = ప్రతిష్ఠగలవాఁడు, భవతి = అగుచున్నాఁడు.

2. తత్ = ఆబ్రహ్మస్వరూపమగు ఆకాశము, మహః ఇతి = మహత్త్వగుణము గలదని, ఉపాసీత = ఉపాసింపవలయును, మహాన్ = మహత్త్వముగలవాఁడు, భవతి = అగుచున్నాఁడు.

3. తత్ = ఆబ్రహ్మస్వరూపమగు ఆకాశము, మనః ఇతి = మనన స్వరూపము గలదని, ఉపాసీత=ఉపాసింపవలయును. మానవాన్=మననము నందు సమర్థుఁడు, భవతి = అగును.

4. తత్=ఆబ్రహ్మస్వరూపమగు ఆకాశము, నమః ఇతి=నమనగుణము గలదని, ఉపాసీత = ఉపాసింపవలయును. అస్మై = ఈవిధముగా, ఉపాసించువానికొఱకు, కామాః=భోగ్యములగు విషయము లన్నియు, నమ్యంతే= లోఁబడుచున్నవి.

5. తత్ = ఆ బ్రహ్మస్వరూపమగు ఆకాశము, బ్రహ్మ ఇతి = విస్తార రూపమని (విరాడాత్మకమని), ఉపాసీత = ఉపాసింపవలయును, బ్రహ్మవాన్ = విస్తారగుణముగలవాఁడు (లేక) తత్ = ఆ బ్రహ్మస్వరూపమగు ఆకాశము, బ్రహ్మ ఇతి = వేదస్వరూపమని, ఉపాసీత = ఉపాసింపవలయును, బ్రహ్మవాన్ = స్వాధీనమగు వేదముగలవాఁడు, భవతి = అగుచున్నాఁడు.

6. తత్ = ఆ బ్రహ్మ స్వరూపమగు ఆకాశము, బ్రహ్మణః = బ్రహ్మమునకు, పరిమరఇతి = పరిమరమని, ఉపాసీత = ఉపాసింపవలయును, పరి ఏనం = ఈవిధముగా ఉపాసించువానిని, ద్విషంతః = ద్వేషించునట్టి, సపత్నాః = శత్రువులు, మ్రియంతే = చనిపోవుచున్నారు, అప్రియాః = అప్రియులగు, భ్రాతృవ్యాః = శత్రువులున్నూ, పరిమ్రియంతే = చనిపోవుచున్నారు.

౭. పురుషే = పురుషునియందు, యః చ = ఏయాత్మగలఁడో, సః అయం = ఆ ఈ యాత్మయు, ఆదిత్యే = ఆదిత్యునియందు, యః చ = ఏయాత్మ గలఁడో, అసౌ = ఈయాత్మయు, సః = ఆయుభయము, ఏకః = అద్వితీయమగు ఒక ఆత్మయే.

యః = ఎవ్వఁడు, ఏవంవిత్ = ఈవిధముగా నెఱుంగునో, సః = వాఁడు, అస్మాత్ లోకాత్ = ఈలోకమునందుండి, ప్రేత్య = మరణించి, ఏతం = ఈ, అన్నమయం = అన్నమయుఁడగు, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రమ్య = పొంది, ఏతం = ఈ, ప్రాణమయం = ప్రాణమయుఁడగు, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రమ్య = పొంది, ఏతం = ఈ, మనోమయం = మనోమయుఁడగు, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రమ్య = పొంది, ఏతం = ఈ, విజ్ఞానమయం = విజ్ఞానమయుఁడగు, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రమ్య = పొంది, ఏతం = ఈ, ఆనందమయం = ఆనందమయుఁడగు, ఆత్మానం = ఆత్మను, ఉపసంక్రమ్య = పొంది, ఇమాన్ = ఈ, లోకాన్ = భూరాది లోకములను, అనుసంచరన్ = సంచరించుచున్నవాఁడయి, కామాన్నీ = కామానుసారమగు అన్నముగలవాఁడయి,

కామరూపీ = కామరూపియై, అనుసంచరన్ = సంచరించుచు, ఏతత్ = ఈచెప్పఁబోవునట్టి, సామ = సామను, గాయన్ = గానముచేయుచు, ఆస్తే = ఉండును.

(ఆసామ చెప్పఁబడుచున్నది:—)

ఉ. హా3వు = ఆశ్చర్యముగదా, హా3వు = ఆశ్చర్యముగదా, హా3వు = ఆశ్చర్యముగదా (ఆయాశ్చర్యమేమియో చెప్పఁబడుచున్నది).

1. అహం = నేను (అద్వయుఁడును నిరంజనుఁడును అగు ఆత్మ స్వరూపుఁడను మాత్రమే అయినను), అన్నం = అన్నస్వరూపుఁడను అగుచున్నాఁడను.

2. అహం = నేను, అన్నం = అన్నస్వరూపుఁడ నగుచున్నాఁడను.

3. అహం = నేను, అన్నం = అన్నస్వరూపుఁడ నగుచున్నాఁడను.

1. అహం = నేను, అన్నాదః = అన్నాదుఁడను అగుచున్నాఁడను.

2. అహం = నేను, అన్నాదః = అన్నాదుఁడను అగుచున్నాఁడను.

3. అహం = నేను, అన్నాదః = అన్నాదుఁడను అగుచున్నాఁడను.

1. అహం = నేను, శ్లోకకృత్ = శ్లోకకృత్తు అగుచున్నాఁడను.

2. అహం = నేను, శ్లోకకృత్ = శ్లోకకృత్తు అగుచున్నాఁడను.

3. అహం = నేను, శ్లోకకృత్ = శ్లోకకృత్తు అగుచున్నాఁడను.

అహం = నేను, ఋతస్య = మూర్తామూర్తరూపమగు ఈజగత్తు కంటెను, దేవేభ్యః = దేవతలకంటె, పూర్వం = పూర్వమున్నా, ప్రథమజాః = మొదటఁపుట్టినవాఁడను, అస్మి = అగుచున్నాఁడను.

అమృతస్య = అమృతమునకు, నాభిః = నాభిమాత్రుఁడను అగుచున్నాఁడను.

యః=ఎవ్వఁడు, మా = అన్నరూపుఁడనగునన్ను, దదాతి = అన్నార్థులకొఱకు ఇచ్చుచున్నాఁడో, స ఇత్ = వాఁడే. ఏవం = ఈవిధముగా నన్ను, ఆవాః = సంరక్షించును.

అహం = నేను, అన్నం=అన్నమును (అన్నార్థులకు ఇవ్వక), అన్నం= అన్నమును, అదంతం = తినువానిని, అద్మి = తినుచున్నాఁడను.

అహం = నేను, విశ్వం = సమస్తమయిన, భువనం = భువనమును, అభ్యభవాం = (ఈశ్వరరూపముతో) తిరస్కరించుచున్నాఁడను.

(నాయొక్క ప్రకాశము) సువర్ణజ్యోతీః = ఆదిత్యప్రకాశమువలె స్వయంప్రకాశమయినది.

యః = ఎవ్వఁడు, ఏవం = ఈవిధముగా, వేద=ఉపాసించుచున్నాఁడో, (వానికి ఈవెనుక చెప్పఁబడిన ఫలము కలుగుచున్నది.)

ఉపనిషత్ = తైత్తిరీయోపనిషత్తు, ఇతి = సమాప్తము.

తా. ౧. (పృథివ్యాకాశోపాసకునకు వ్రతవిశేషము చెప్పఁబడుచున్నది:—)

పృథివ్యాకాశోపాసకుఁడగువాఁడు తన యింటియందు నివసించుట కెవ్వరయినను వచ్చినయెడల వారిని రావద్దని చెప్పకూడదు, అనఁగా నివసించుటకు వచ్చినవారిని పొమ్మనకూడదని భావము, తనయింటియం దుండుటకు అంగీకరించినపుడు వారికి అవశ్యముగా అన్నమును సైతము పెట్టవలయును, (ఇంటియందు నివసించువారికి అన్నమును సైతము పెట్టుట న్యాయము) కావున (శాస్త్రీయజీవికావృత్తులంగా॥) ఏదియైన నొకవృత్తిచేత అన్నమును విశేషముగ సంపాదింపవలయును. లోకమునందు సాధారణముగ అన్నవంతులగు విద్వాంసులు అన్నార్థియయి తనగృహమునకు వచ్చిన అభ్యాగతునికొఱకు "లెండి అన్నము సిద్ధమయినది, మడికట్టుకొనుఁడు" అని చెప్పుదురు కాని "మాయింట అన్నములేదు మఱొకచోటికి పొండు" అని చెప్పరు కావున అన్నమును విశేషముగ సంపాదింపవలయునని చెప్పఁబడినది.

మఱియు అన్నదానమాహాత్మ్యము చెప్పఁబడుచున్నది. అన్న మేకాలమునం దెట్టిభావముతో నొసంగిన ఆకాలమునం దదేవిధముగ మఱల మనకు లభించుచున్నది, ఎట్లనఁగా:—

అన్నార్థియయి తనగృహమునకు వచ్చినవానికి వెంటనే తగినసత్కార మొనర్చి తనకు ఉన్నంతలో గౌరవముగా అన్నమును పెట్టినయెడల వానికి జన్మాంతరమునందు బాల్యమునందే శ్రమపడ నక్కరలేకయే గౌరవముగా అన్నాదికము లభించుచున్నది.

ఇదే విధముగా వచ్చిన అభ్యాగతునకు కొంతకాలమునకు ఇఁక తప్పదని తెలిసినతర్వాత సామాన్యముగ సత్కారమొనర్చి అన్నము నొసంగిన యెడల జన్మాంతరమందు మధ్యమవయస్సునందు సామాన్యశ్రమతో అన్నాదికము లభించుచున్నది.

వచ్చిన అభ్యాగతుని పొమ్మని పరిభవించి చివరకు విధిలేక తిరస్కారపూర్వకముగ అన్నము నొసంగిన వానికి మరుజన్మమునందు అంత్యదశయందు అతికష్టముతో అన్నాదికము లభించుచున్నది.

ఎవ్వఁడీవిధముగా అన్నముయొక్కయు, అన్నదానము యొక్కయు, మాహాత్మ్యము నెఱుంగునో వానికి ఈ జెప్పఁబడినఫలము కలుగును.

౨. ఇఁక బ్రహ్మముయొక్క ఉపాసనాప్రకారము చెప్పఁబడుచున్నది:—

1. క్షేమమనఁగా ఉన్నదానిని సంరక్షించుకొనుట, బ్రహ్మము వాక్కునందు క్షేమరూపముతో ప్రతిష్ఠితమయియున్నదని (భావించి ఆ క్షేమరూపముతో) బ్రహ్మము నుపాసింపవలయును.

2. యోగమనఁగా పొందనిదానిని పొందించుకొనుట, క్షేమమనఁగా పొందినదానిని సంరక్షించుకొనుట, ఈయోగక్షేమములు రెండున్నూ ప్రాణాపానములున్నప్పుడే సిద్ధించును. అట్టి యోగక్షేమములు ప్రాణాపాననిమిత్తకములయినను ప్రాణాపాననిమిత్తములు కావు, (ఏలయనఁగా) సర్వఫలదాత బ్రహ్మము అని సకలశాస్త్రములు చెప్పుచున్నవి, కావున బ్రహ్మము యోగక్షేమాత్మకముగ ప్రాణాపానములందు ప్రతిష్ఠిత మయి యున్నదని ఉపాసింపవలయును.

3. కర్మాచరణము సైతము బ్రహ్మనిర్వార్త్యము కావున బ్రహ్మము హస్తములందు కర్మాత్మకముగ ప్రతిష్ఠితమయియున్నదని ఉపాసింపవలయును.

4. బ్రహ్మము పాదములందు గత్యాత్మకముగ ప్రతిష్ఠితమయి యున్నదని ఉపాసింపవలయును.

5. బ్రహ్మము గుదమునందు మలవిసర్జనాత్మకముగ ప్రతిష్ఠితమయి యున్నదని ఉపాసింపవలయును.

ఈచెప్పఁబడినవి మానుషములగు సమజ్ఞలు—జ్ఞానములు, అనఁగా మనుష్యదేహమునందు బ్రహ్మమును ఉపాసించుటకు విధించిన ఉపాసనలు అని భావము.

3. ఇఁక దైవికములగు ఉపాసనలు చెప్పఁబడుచున్నవి:—

1. వర్షము ఓషధ్యాదులు పుట్టుటకు హేతుభూత మగుచున్నది కావున అన్నాదిద్వారముగ తృప్తికి హేతుభూతమగుచున్నది, బ్రహ్మమే తృప్త్యాత్మకముగ వృష్టియందు వ్యవస్థితమయియున్నదని ఉపాసింపవలయును.

2. బ్రహ్మమే విద్యుత్తునందు బలాత్మకముగ ప్రతిష్ఠితమయి యున్నదని బలాత్మకముగ బ్రహ్మమునే ఉపాసింపవలయును.

3. బ్రహ్మమే పశువులందు కీర్తిరూపముచేత ప్రతిష్ఠితమయియున్నదని కీర్త్యాత్మకముగ బ్రహ్మమునే ఉపాసింపవలయును.

4. బ్రహ్మము నక్షత్రములందు ప్రకాశాత్మకముగ ప్రతిష్ఠితమయి యున్నదని ప్రకాశాత్మకముగ బ్రహ్మమునే ఉపాసింపవలయును.

5. ప్రజాతియనఁగా పుత్రోత్పత్తి అమృతమనఁగా పుత్రోత్పత్త్యనంతరము పితృఋణవిముక్తికలుగుట, ఆనందమనఁగా సుఖము, బ్రహ్మము

ఉపస్థేంద్రియమునందు ప్రజాతి, అమృత, ఆనంద సుఖాత్మకముగ ప్రతిష్ఠిత మయియున్నదని ఆబ్రహ్మమునే ఉపాసింపవలయును.

(ఇది ఆధ్యాత్మిక ఉపాసనములందు చేర్పఁదగినది.)

6. అంతయు ఆకాశమునందు ప్రతిష్ఠితమయియున్నది, అంతయు ఆకాశమునందు ప్రతిష్ఠితమయియున్నది కావున ఆయాకాశమే బ్రహ్మమని ఆకాశాత్మకముగ బ్రహ్మము నుపాసింపవలయును.

౪. 1. కావున బ్రహ్మాత్మకమగు ఆయాకాశము అంతకు ప్రతిష్ఠాత్మకము అని ఉపాసింపవలయును, ఆత్మప్రతిష్ఠాగుణము గలవాఁడని ఉపాసించుటవలన ప్రతిష్ఠావంతుఁ డగుచున్నాఁడు. ఇట్లే సర్వత్ర గ్రహించునది. ఇచ్చట ఫలము పొందఁబడినయెడల అది బ్రహ్మమే, తదుపాసనమువలన అదిగలవాఁ డగుచున్నాఁడు. (తం యథాయథోపాసతే తదేవభవతి (ముద్గల-3) అని శ్రుతిగలదు. (ఈవిషయమయి సూ. అప్రతీకాలంబనాన్నయతీతి బాదరాయణ ఉభయథాఽదోషాత్తత్క్రతుశ్చ. బ్ర. సూ. ౪. 3. ౧౫. అను బ్రహ్మసూత్రమును, ఏతత్సూత్రశంకరభాష్యమును గాంచునది.)

2. బ్రహ్మాత్మకమగు ఆయాకాశము మహత్త్వగుణముగలదని ఉపాసింపవలయును. మహత్త్వగుణముగలదని ఉపాసించుటవలన గొప్పవాఁ డగుచున్నాఁడు.

3. బ్రహ్మాత్మకమగు ఆయాకాశము మననగుణముగలదని ఉపాసింపవలయును. మననగుణముగలదని ఉపాసించుటవలన మననమునందు సామర్థ్యముగలవాఁ డగుచున్నాఁడు.

4. బ్రహ్మాత్మకమగు ఆయాకాశము నమనగుణము గలదని ఉపాసింపవలయును. నమనమనఁగా లోఁబడియుండుట. నమనగుణముగలదని ఉపాసించుటవలన ఈయుపాసకునకు సకలవిధములగు కామములు లోఁబడుచున్నవి, అనఁగా లభించునని భావము, కామములనఁగా భోగ్యవిషయములు-

5. బ్రహ్మాత్మకమగు ఆయాకాశము బ్రహ్మమని అనఁగా మిక్కిలి పెద్దది అని ఉపాసింపవలయును, అనఁగా బ్రహ్మమని (మిక్కిలి పెద్దది అని) ఉపాసించుటవలన అట్టి గుణవిశేషముగలవాఁ డగుచున్నాఁడు.

(లేక బ్రహ్మాత్మకముగా ఆయాకాశమును వేదమునుగా భావించి ఉపాసింపవలయును, అందువలన స్వాధీనమయిన వేదముగలవాఁ డగుచున్నాఁడనియు చెప్పవచ్చును.)

6. బ్రహ్మాత్మకమగు ఆయాకాశము పరిమరగుణము గలదియని ఉపాసింపవలయును, పరిమరమనఁగా వాయువు. "పరి మ్రియంతే అస్మిన్ పంచ దేవతా విద్యుత్, వృష్టిః. చంద్రమాః, ఆదిత్యః, అగ్నిః, ఇతి పరిమరః" అని వ్యుత్పత్తి. విద్యుత్, వృష్టి, చంద్ర, ఆదిత్య, అగ్ని దేవతాపంచకము దీని యందు లీనమగుచున్నది, కావున వాయువు పరిమర మనంబడును. వాయువు పరిమరమనుటకు శ్రుత్యంతరప్రసిద్ధి గలదు. ఆవాయువు ఆకాశకార్యమగుటచేత కారణమగు ఆకాశముకంటె అన్యము కాఁజాలదు, కావున ఆకాశము బ్రహ్మమునకు పరిమర మగుచున్నది. వాయ్వాత్మకమగు ఆయాకాశమును బ్రహ్మమనకు పరిమరమునుగా ఉపాసింపవలయును. ఈవిధముగా నుపాసించు వానిని ద్వేషించునట్టిశత్రువులు అందఱు చనిపోవుచున్నారు. శత్రువులలో ద్వేషించువారలును, ఉదాసీనముగా నుండు వారలును కలరు గనుక ద్వేషించునట్టి శత్రువులు అని విశేషించి చెప్పఁబడినది. మఱియు ద్వేషింపక ఉండెడి శత్రువులు సైతము నశింపఁగలరు.

ఈయుపాసనములందు పొందఁబడునట్టి ఫలముసైతము బ్రహ్మమే, అట్టి యుపాసనమువలన దానిని పొందుచున్నాఁడని తెలిసికొనవలయును.

శ్రుతి:—తం యథాయథోపాసతే తదేవ భవతి. ముద్గల. ఉ. 3. అను శ్రుతి ఈ విషయమునే బోధించుచున్నది. (ఈవిషయము ఈ ఉ కిన్ని పమానమని ఎఱుంగునది.)

ఆత్మ అసంసారియని సిద్ధించుచున్నది

'ప్రాణోవా అన్నం, శరీర మన్నాదం' అని ఉపక్రమించి ఆకాశాత్మకమగు కార్యమునకే అన్నత్వమును, అన్నాదత్వమును శ్రుతి వచించినది. సరియే శ్రుతిచెప్పినది, దానివలన ఏమి? అనఁగా చెప్పఁబడుచున్నది:—

లోకమునందు భోగ్యము, భోక్తయనెడి సంసారమంతయు కార్య విషయమే గాని ఆత్మయందేమియులేదు, ఆత్మయందు మాత్రము భ్రాంతి చేత ఉన్నటుల తలంచుచున్నారు.

పూర్వ:—జీవుఁడున్నూ పరమాత్మయొక్క కార్యమే కావున ఆత్మకు సైతము సంసారము గలదు.

సమా:—"తత్సృష్ట్వా, తదేవానుప్రావిశత్" అనుశ్రుతి ఆకాశాదికారణుఁడును, అసంసారియునగు పరమాత్మయే కార్యమునందు ప్రవేశించి నటుల చెప్పుచున్నది, కావున ఆత్మకు సంసారముగలదని చెప్పరాదు. "సృజించి అనుప్రవేశించెను." అనెడి క్రియలు రెండున్నూ సమాన కర్తృకములయి గనంబడుటచేత కార్యస్రష్టయు, అనుప్రవిష్టుఁడున్నూ ఒక్కఁడేయనియు సిద్ధించుచున్నది. సృష్టిని సృజించిన వాఁడున్నూ, ప్రవేశించినవాఁడున్నూ ఒక్కఁడయినగాని "సృష్ట్వా" అనియెడి "క్త్వా" ప్రత్యయము అచట పొసఁగనేరదు.

పూర్వ:—కార్యమునందు ప్రవేశించినపిదప భావాంతరమును పొందియుండ వచ్చును గదా.

సమా:—ప్రవేశించెను అనుపదమునకు అచట 'ఆత్మపొందఁబడుచున్నాఁడు' అనువిషయమే న్యాయసిద్ధమయినదని "తత్ సృష్ట్వా, తదేవాను ప్రావిశత్" అను చోట మేము నిరూపించియున్నాము కావున మీపూర్వపక్ష మసంగత మగుచున్నది.

పూర్వ:—అనేన జీవేనాత్మనాఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి (ఛాం. ౬-3-౨.) అను శ్రుతిచేత జీవరూప ధర్మాంతరుఁడయి ప్రవేశించెననుటయే యుక్తముగా నున్నది.

సమా:—'తత్త్వమసి' అని ఉపదేశించియుండుటచేత జీవుఁడు ఆకాశాదికమువలె వికారరూపుఁడనుట తగియుండదు.

పూర్వ:—జీవరూపభావాంతరమును పొందిన పరమాత్మకు సంసారిత్వము ప్రాప్తించుచుండఁగా అట్టియూహను తీసివేయుటకయి (బ్రహ్మవ్యతిరిక్తుఁడయిన వానికే రాగాపోహార్థము పరస్త్రీయందు మాతృబుద్ధి నుపదేశించిన విధముగా) 'తత్త్వమసి' అని ఉపదేశింపఁబడినది.

సమా:—"తత్సత్యం, స ఆత్మా, తత్త్వమసి" (ఛాందో-౬-౮-౭.) అని సామానాధికరణ్యముగ జీవాత్మపరమాత్మలు ఏకస్వరూపులే యని యుపదేశింపఁబడియున్నది కావున పైవిధముగా చెప్ప వలనుపడదు.

పూర్వ:—లోకమునందు జీవునకు (నేను సుఖిని, దుఃఖిని అనియెడి) సంసారిత్వము అనుభవసిద్ధముగా గనంబడుచున్నదే.

సమా:—సుఖదుఃఖాదికమునకు ద్రష్టయగుచైతన్యము సుఖదుఃఖాదికమునకు విషయమనుట భ్రాంతిగాని యథార్థముమాత్రము కాదు.

పూర్వ:—మీరు చెప్పిన నిర్ణయము కపిలకణాదాదిమహర్షి నిబద్ధతర్కశాస్త్రమునకు విరుద్ధముగనున్నది. (కావున అటుల చెప్పఁదగదు.)

సమా:—వారిసిద్ధాంతమునకు స్వతంత్రప్రమాణమగు వేదప్రమాణమువంటి మూలప్రమాణమేమియు లేకపోవుటవలనను, పురుషబుద్ధి భ్రాంతి సమన్వితమనుట న్యాయము కావునను, వారిసిద్ధాంతమునకు విరోధమువచ్చునని శ్రుతిసిద్ధాంతమును వేఱుగా సమన్వయింపవలసినపని లేదు, కావున శ్రుత్యుపపత్తులచేత ఆత్మ అసంసారి యనియు, ఒక్కఁడే యనియు సిద్ధించుచున్నది.

పూర్వ:—(ఆత్మకు అసంసారిత్వము శ్రుత్యుపపత్తులచేత సిద్ధించుచున్నమాట వాస్తవమే) కాని ఏకత్వము ఎటుల సిద్ధించుచున్నది?

సమా:—"సయశ్చాయం పురుషే, యశ్చాసావాదిత్యే, స ఏకః" అనెడి శ్రుతియే 'ఆత్మ ఒక్కఁడే' అనువిషయమును బోధించుచున్నది. ఈ విషయమునంతయు ఇదివఱకే వివరించియున్నారము.

అట్టి బ్రహ్మవేత్త ఈవిధముగా అన్నమయాత్మనుపొంది పిదప ప్రాణమయాత్మను, తరువాత మనోమయాత్మను, తరువాత విజ్ఞానమయాత్మను, అనంతరము ఆనందమయాత్మను, పొందినవాఁడయి ఈచెప్పఁబోవు సామమును గానముచేయుచు ఆనందపరవశుఁడయి యుండును:—

ఈ ఆనందవల్లి 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అనెడి ఋక్కుయొక్క వివరణభూతమయినది కావున తదర్థము వివరముగ నిట తెలుపఁబడినది. ఆ ఋక్కుయొక్క ఏకదేశమగు "సో ఽశ్నుతే సర్వా న్కామాన్సహ బ్రహ్మణా విపశ్చితా" అనెడి ఫలవాక్యముయొక్క అర్థము విస్తరముగ నిదివఱకు వివరింపఁబడలేదు, కావున ఇప్పుడు

౧. ఆకామము లెట్టివి? ఏవిషయము గలవి?

౨. బ్రహ్మముతోడ వాని నెటుల పొందును?

అనువిషయము చెప్పవలయును, కావున ఆవిషయ మిఁక ఆరంభింపఁబడుచున్నది:—

బ్రహ్మవిద్యాశేషభూతమగు ఈ పితృపుత్రాఖ్యాయికయందుగల భృగువరుణసంవాదమునందు తపస్సు బ్రహ్మవిద్యాసాధనభూతమని చెప్పఁబడినది, ప్రాణము మొదలుకొని ఆకాశము దనుక గల కార్యజాతమంతయు అన్నముగను, అన్నాదముగను విని యుక్తమయియున్నదనియు చెప్పఁబడినది, బ్రహ్మవిషయకములగు ఉపాసనములు పైతము చెప్పఁబడినవి.

అనేక సాధనసాధ్యములును, అయాయుపాసనములవలన పొందఁ దగినవియు, అగు ఏయే కామములు గలవో అవి యన్నియు ఆకాశాది కార్యభేదవిషయములే యనియు వివరింపఁబడియున్నది.

సంశ:—సకలవిధమగు భేదజాతము ఆత్మభూతమే యగుటచేత ఒక్కటియే కావున, కామములుండుట వానిని అభిలషించువాఁడుండుట యుక్తముగ లేదుగదా, అప్పుడు బ్రహ్మస్వరూపముచేత ఒక్క పర్యాయముగా సకలకామములను ఇట్టి బ్రహ్మవేత్త ఎటుల పొంద గలఁడు ?

సమా:—సమాధానమును చెప్పుచున్నాఁడను, సర్వాత్మభావమును పొందు చున్నాఁడు కావున ఇందు అనుపపత్తి ఏమియుఁలేదు. సర్వాత్మభావ మును ఎటుల పొందుచున్నాఁడనఁగా అందులకు శ్రుతిప్రమాణము చెప్పఁబడుచున్నది:—

జీవాత్మకున్నూ, ఆదిత్యమండలాంతర్గతుఁడగు పరమాత్మకున్నూ గల అభేదము నెఱుంగుటచేత ఉత్తమ నీచభావములను వదలి అవిద్యాపరికల్పిత ములును, అన్నమయాదికములును, ఆనందమయాంతములును అగు ఆత్మలను క్రమముగ పొంది, అదృశ్యాది ధర్మములు కలిగినట్టియు, స్వాభావికమును, ఆనందమును, అజమును, అభయమును, అమృతమును, అద్వైతమును, సత్య జ్ఞానానందాత్మకమును, ఫలభూతమును అగు బ్రహ్మమే తానయి, భూరాది కములగు ఈ లోకములను సంచరించుచు, కామానుసారమగు అన్నమును, కామరూపమును గలవాఁడయి, ఈలోకములన్నియు తానేయని భావించుచు, సర్వానన్యత్వరూపముగల బ్రహ్మమును గూర్చి లోకమునందు బోధించుచు, తాను కృతార్థుఁడయినను లోకానుగ్రహార్థము తనయనుభవమును ఈక్రింది సామగానములో ప్రఖ్యాపనము నొనర్చుచున్నాఁడు:—

ఉ. (ఇచట మూలమునందు:—'హా3వు, హా3వు, హా3వు' అనునది

అహో అను ఆశ్చర్యవాచకశబ్దమునకు గానసమయమునందు వచ్చినరూపము, ముమ్మాఱు చెప్పుట అత్యంతవిస్మయమును బోధించును. (ఇదేవిధముగా ముమ్మారు చెప్పఁబడినతావులందు గ్రహించునది.)

ఆవిస్మయమేదియో చెప్పఁబడుచున్నది:— నేను నిరంజనుఁడును, అద్వయుఁడును, అగు ఆత్మయే యైనను అన్నమును అన్నాదుఁడును అగుచున్నాఁడను. మఱియు నేనే శ్లోకకృత్తు,శ్లోకకృత్తనఁగా అన్నముయొక్కయు అన్నాదులయొక్కయు సంఘాతమునకు కర్తయగు చేతనుఁడు సర్వజ్ఞుఁడు. "అహం అన్నం, అహం అన్నం, అహం అన్నం" అనియును, "అహం అన్నాదః, అహం అన్నాదః, అహం అన్నాదః" అనియును, "అహం శ్లోకకృత్, అహం శ్లోకకృత్, అహం శ్లోకకృత్" అనియును ముమ్మారు చెప్పుట విస్మయాతిశయఖ్యాపనార్థము.

మూర్తామూర్తాత్మకమగు ఈజగత్తుకంటెను, దేవతలకంటెను, పూర్వమునందే ప్రథమమున ఉత్పన్నుఁడనగు హిరణ్యగర్భుఁడను నేనే, నేనే అమృతమునకు ఆధారభూతుఁడను.

ఎవ్వఁడు అన్నాత్మకుఁడ నగు నన్ను అర్థుల కొసంగుచున్నాఁడో, అన్నాత్మకముగా చెప్పుచున్నాఁడో, వాఁడు ఈవిధముగా అన్నాత్మకుఁడ నగు నన్ను సంరక్షించు చున్నాఁడు.

ఎవ్వఁడు సకాలమునకు అన్నార్థులయి వచ్చినవారలకు నన్ను ఇవ్వక (అనఁగా వచ్చినవారికి అన్నము పెట్టక) యే తానే భుజించునో వానిని నేను తినివేయుచున్నాఁడను.

ప్రశ్న:—అట్లయినయెడల సర్వాత్మత్వ ప్రాప్తిరూపమగు మోక్ష మక్కరమేలేదు, అంతకంటె సంసారమే మేలు, ఏలయనఁగా ముక్తుఁడ నయిన నేను అన్నరూపుఁడ నయ్యెదను గాన అందఱిచేతను భక్షింపఁబడుదును గదా.

సమా:—భయపడకుము, అన్న అన్నాదలక్షణమయిన విషయమంతయు సంవ్యవహార విషయముగాని పరమార్థ విషయముగాదు, ఇది అవిద్యాకృతము, విద్యచేత బ్రహ్మత్వమును పొందిన విద్వాంసునకు వస్త్వంతరమే పరమార్థముగాలేదు, కావున భయంపడవలసిన అవకాశమే వానికి లేదు, కావున మోక్షమును తలంచి భయపడకుము.

ప్రశ్న:—అట్లయినయెడల "నేనే అన్నము, నేనే అన్నాదుఁడను" అని చెప్పఁబడియున్నదే, దాని తాత్పర్యమేమి?

సమా:—అన్నము, అన్నాదుఁడు అని చెప్పఁబడిన ఏవిషయము గలదో, అది (అవిద్యాకృతమగు) సంవ్యవహారమే గాని పరమార్థముగాదు.

బ్రహ్మమే కారణముగాఁగల అన్నఅన్నాదలక్షణమగు ప్రపంచము బ్రహ్మముకంటె భిన్నముగ లేకపోయినను, బ్రహ్మవిద్యకు కార్యభూతమగు బ్రహ్మభావముయొక్క స్తుతినిమిత్తము 'అహ మన్న మహ మన్న మహ మన్నం' 'అహ మన్నాదోఽహ మన్నాదో ఽహ మన్నాదః' అని చెప్పఁబడుచున్నది, కావున అవిద్యానిమిత్తమగు భయాదిదోషలేశము సైతము అవిద్యానాశమువలన బ్రహ్మభూతుఁడగు విద్వాంసునకు కలుగఁజాలదు.

బ్రహ్మాది భూతజాలముచేత ఆశ్రితమగు భూరాదిలోకజాతమును పరమేశ్వరరూపముచేత నేనే సంహరించుచున్నాఁడను.

నాయొక్క ప్రకాశము సూర్యకాంతివలె ఒకేవిధముగ ప్రకాశమానమయియున్నది. (ఇది బ్రహ్మవేత్తకుఁ గల యాత్మానుభవము) 'సువర్న జ్యోతీః' అనుచోట గల 'న' కారము ఉపమార్థము.

వల్లీద్వయ సమన్వితమగు ఈపరమాత్మ విజ్ఞానరూపమగు ఉపనిషత్తు సమాప్తమయినది.

"శాంతో దాంత ఉపరత స్తితిక్షుః సమాహితో భూత్వా." (బృహ. ౪౪-౨౩) అను శ్రుత్యనుసారము, ఈయుపనిషత్తును అట్టి శాంతుఁడు, దాంతుఁడు, ఉపరతుఁడు, తితిక్షువు, సమాహితుఁడు నయి భృగువువలె గొప్పతపమొనర్చి ఎవ్వఁ డెఱుంగునో వానికన్ని యీచెప్పిన బ్రహ్మభావ లక్షణమగు మోక్షమను ఫలము సిద్ధించును.

భృగువల్లి సమాప్తము.

దీనికిసంబంధించిన ఇతరగ్రంథభాగములు.

తైత్తిరీయభాష్యవార్తికము, భృగువల్లి. ఖం. ౧౦-శ్లో. ౪౩-౯౧.

అనుభూతిప్రకాశిక, అధ్యా-౨. శ్లో. ౧౪౩-౧౪౫.

ఆత్మపురాణము, అధ్యా-౧౮. శ్లో. ౩౭౦-౩౮౧.

శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్య భాష్యముననుసరించి వ్రాయఁబడిన
తైత్తిరీయోపనిషత్తుయొక్క
ఆంధ్రటీకాతాత్పర్యములు సమాప్తములు.

శ్రీరస్తు

శ్రీమచ్చిదానందగురుపరబ్రహ్మణే నమః.

తైత్తిరీయోపనిషత్

ఆంధ్రపాఠానుసారీ

౪. నారాయణప్రశ్నః

(యాజ్ఞిక్యుపనిషత్.)

ఆంధ్రటీకాతాత్పర్యసమన్వితము

అస్మిన్ ప్రపాఠకే ద్రావిడాంధ్రభేదేన పాఠద్వయమస్తి। తత్ర ప్రాయశో ద్రావిడపాఠో భట్టభాస్కరభాష్యానుసారీ। ఆంధ్రపాఠస్తు మాధవీయానుసారీ । సకలమంత్రాణాం సత్వాత్ ఆంధ్రపాఠఏవ అస్మాభి రత్ర స్వీకృతః.

అనువాకాః ౮౦. కాండర్షయః = యాజ్ఞికీదేవతాః.

శాంతిపాఠః.

హరిః ఓమ్ ॥ (సహ నా వవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై। తేజస్వి నావధీత మస్తు మా విద్విషావహై। ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥)

౧. ప్రథమోఽనువాకః.

మం. అమ్భస్యపారే భువనస్య మధ్యే
నాకస్య పృష్ఠే మహతో మహీయాన్ ।
శుక్రేణ జ్యోతీగ్ంషి సమను ప్రవిష్టః
ప్రజాపతి శ్చరతి గర్భే అంతః * ॥౧॥

టీక. (అయం = ఈపరమేశ్వరుఁడు) అంభస్య = (పలువిధము లగు సముద్రములందున్న) ఉదకములయొక్క, పారే = అవతలిభాగమునందు, మహతః = (ఉన్న)గొప్పది యగు (లోకాలోక పర్వతము మున్నగు) దానికంటె, మహీయాన్ = గొప్పవాఁడు, భువనస్య = భూగోళముయొక్క, మధ్యే=మధ్యభాగమునందు, (మహతః = (ఉన్న) గొప్పదగు (మేరుపర్వతము మున్నగు) దానికంటె, మహీయాన్ = గొప్పవాఁడు.) నాకస్య = స్వర్గలోకముయొక్క, పృష్ఠే = ఊర్ధ్వభాగమునందు, మహతః = (ఉన్న) గొప్పదగు (బ్రహ్మలోకము మున్నగు) లోకములకంటె, మహాన్ = గొప్పవాఁడు. (సః = ఆపరమాత్మ) శుక్రేణ = (జీవచైతన్యరూపమైన) ప్రకాశము

---

* ఆంధ్రపాఠము, ద్రావిడపాఠము అను పాఠభేదములతో ఈ నారాయణప్రశ్నము సంప్రదాయానుసారము ద్వివిధముగ పఠింపఁబడుచున్నది. అన్నిమంత్రము లుండుటచేత మేమిచట ఆంధ్రపాఠమును గ్రహించితిమి. పూనా ఆనందాశ్రమగ్రంథమాలయందు పరిశిష్టమను శీర్షికతో ముద్రింపఁబడిన సాయణాచార్యభాష్యము ననుసరించి మేమిచట ఆంధ్రటీకాతాత్పర్యములను వ్రాసియున్నారము. క. మా.

చేత, జ్యోతీంషి = భాసకములగు అంతఃకరణములను, సం అనుప్రవిష్టః = ప్రవేశించెను, గర్భే = బ్రహ్మాండమునందు, అంతఃలోపల, ప్రజాపతిః = విరాడ్రూపుఁడై, సంచరతి = సంచరించుచున్నాఁడు.

వి. భా. ఈపరమేశ్వరుఁడు బహువిధసముద్రజలములయొక్క అవతలివైపుననుండు లోకాలోకపర్వతముకంటె మహత్తరుఁడైనవాఁడు, అట్లే భూగోళముయొక్క మధ్యభాగమునందు అత్యున్నతమై యుండు మేరుపర్వతము మున్నగుదానికంటె అత్యున్నతమైనవాఁడు, స్వర్లోకమునకు ఊర్ధ్వభాగమునందుండు బ్రహ్మలోకము మున్నగుదానికంటె అత్యున్నతమైనవాఁడు. ఈవిషయమునే ఛందోగు లిట్లని పలికిరి:—

౧. 'జ్యాయా న్పృథివ్యా జ్యాయా నన్తరిక్షా జ్జ్యాయా న్దివో జ్యాయా నేభ్యో లోకేభ్యః' ఇతి. ఛాందోగ్య. 3-౧౪-3.

అర్థము:—(ఆత్మ పృథివికంటె గొప్పవాఁడు, అంతరిక్షముకంటె గొప్పవాఁడు, ద్యులోకముకంటె గొప్పవాఁడు, ఈలోకములకంటె గొప్పవాఁడు.)

౨. 'స ఏవాధస్తా త్స ఉపరిష్టా త్స పశ్చాత్స పురస్తా త్స దక్షిణతః స ఉత్తరతః స ఏవేదగ్ం సర్వమ్'. ఛాందో. ౭-౨౫-౧.

అర్థ. (ఆపరమేశ్వరుఁడే) అధోభాగమునందును, ఊర్ధ్వభాగమునందును, పశ్చిమ, ప్రాక్. దక్షిణోత్తర దిశలయందును గలఁడు, ఇదంతయు అతఁడే.) ఆపరమేశ్వరుఁడే జీవచైతన్యరూప మగు ప్రకాశముచేత నిర్మలమగుటచేత భాసకములగు అంతఃకరణములను ప్రవేశించెను, "త త్సృష్ట్వా తదేవానుప్రావిశత్" అను శ్రుతి ఈయర్థమునే బోధించుచున్నది, ఆపరమేశ్వరుఁడే బ్రహ్మాండమునందు విరాడ్రూపుఁడై చరించుచున్నాఁడు. ఆథర్వణికులు విరాడ్రూపమును ఇట్లుగా పలుకుచున్నారు:—

శ్రు. "అగ్ని ర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ
దిశః శ్రోత్రే వాగ్వివృతా శ్చ వేదాః.

వాయుః ప్రాణో హృదయం విశ్వ మస్య
పద్భ్యాం పృథివీ హ్యేష సర్వభూతాంతరాత్మా.

ముండక. ౨-౧-౪.

సర్వవ్యాపి యగు పరమేశ్వరుఁ డిట్టి విరాడ్రూపము గలవాఁడు; అయినను మాయావశముచేత దేహములందు జీవరూపముతోడను, బ్రహ్మాండమునందు విరాడ్రూపముచేతను ఉంటున్నాఁడని తాత్పర్యము.

మం. యస్మి న్నిదగ్ం సం చ వి చైతి సర్వం
యస్మిన్ దేవా అధి విశ్వే నిషేదుః ।
తదేవ భూతం తదు భవ్యమా ఇదం
తదక్షరే పరమే వ్యోమన్ ॥౨॥

టీక. ఇదం సర్వం = ఈ ప్రపంచమంతయు, యస్మిన్ = మూలకారణమగు యే యవ్యాకృతమునందు, సం ఏతి చ = (సృష్టికాలమునందు ఉత్పన్నమై) కూడుకొని యుంటున్నదో, వి ఏతి చ = (ప్రళయకాలమునందు) విలీనమై పోవుచున్నదో, యస్మిన్ = ఏమూలకారణ మగు అవ్యాకృతమునందు, అధి = అధికులగు హిరణ్యగర్భ విరాడాది, విశ్వేదేవాః = దేవతలందఱు, నిషేదుః = ఆశ్రయించియున్నారో, తదేవ = అదియే (అనఁగా సృష్టి, స్థితి, సంహారకాలములందు దేవతలకు సైతము ఆధారభూతమగు ఆ యవ్యాకృతమే యనుట) భూతం = అతీతమయిన జగత్తు, తత్ ఉ = అదియే, భవ్యం = భవిష్య జ్జగత్తు, ఇదం = ఈవర్తమానజగత్తు సైతము, తత్ ఉ = అయవ్యాకృతమే, ఆ = ఈవిషయము సుప్రసిద్ధమే, తత్ = అట్టి యవ్యాకృతము, అక్షరే = వినాశరహిత మగు, పరమే = శ్రేష్ఠమగు, వ్యోమన్ = ఆకాశము వలె అమూర్తమగు పరమాత్మయందు, (వర్తతే = ఉంటున్నది.)

వి. భా. ఈప్రపంచమంతయు ఏయవ్యాకృతమూలకారణమునందు సృష్టిసమయమునందు సముత్పన్నమయి కూడుకొనియుండునో, సంహార కాలమునందు నశించి లీనమయి యుండునో, హిరణ్యగర్భుఁడు విరాట్టు మున్నగుదేవతలందఱు ఏయవ్యాకృత మూలకారణమును ఆశ్రయించి యుందురో, అట్టి యవ్యాకృతమే (అనఁగా సృష్టిసంహారకాలములందు దేవతలకు ఆధారభూతమయినది) భూతవర్తమానభవిష్యత్కాలములందుగల జగత్తను ఈవిషయము సుప్రసిద్ధము. అట్టి యవ్యాకృతము వినాశరహితమై శ్రేష్ఠమై ఆకాశమువలె అమూర్తమైన పరమాత్మ యందున్నది.

విశేషము:—ఈమంత్రమునందు, "యస్మి న్నిదగ్ం సంచవిచైతి" అనుచోట "శంచ విచైతి" అనుపాఠాంతరముగలదు. అప్పుడు "శం = (సృష్టికాలమునందుత్పన్నమునై) సుఖమును, ఏతిచ = పొందుచున్నదో" అని యర్థమును చెప్పుకొనవలయును.

మం. యేనావృతం ఖం చ దివం మహీం చ ।
యేనాదిత్య స్తపతి తేజసా భ్రాజసా చ ।
య మన్త స్సముద్రే కవయో వయన్తి
యదక్షరే పరమే ప్రజాః ॥3॥

టీక. యేన = సచ్ఛిద్రరూపమగు ఏకారణముచేత, ఖం చ = అంతరిక్షలోకము, దివం చ = ద్యులోకము, మహీం చ = భూలోకము, ఆవృతం = ఆవరింపఁబడినదో, యేన = ఏపరమాత్మచేత, (అనుగ్రహింపఁ బడినవాఁడై) ఆదిత్యః = సూర్యుఁడు, తేజసా = స్వకీయమండలాంతర్గత మగు ప్రకాశము చేతను, భ్రాజసా = కిరణరూపమయి వ్యాపించిన తేజముచేతను, తపతి = (ఈజగత్తును) తపింపఁ జేయుచున్నాఁడో, (ప్రకాశింపఁజేయుచున్నాఁడో)

కవయః = తత్త్వవేత్తలు, యం=ఏపరమాత్మను, సముద్రే అంతః=సముద్ర మనునది ఉపలక్షణము, అనఁగా జగత్తుయొక్క మధ్యమునందు, వయన్తి = తంతువులను వలె వడనుచున్నారో, తత్ =ఆ బ్రహ్మతత్త్వము, అక్షరే=వినాశ రహితమగు, పరమే=శ్రేష్ఠమగు (నిజస్వరూపమునందు ఉండి), ప్రజాః = జీవులను (ఉత్పాదయతి = పుట్టించుచున్నది.)

తా. వాజసనేయ గార్గిబ్రాహ్మణమునందు (బృహ. 3-౮-౧౧) పరమాత్మ నాశ్రయించియుండు అవ్యాకృతమును గుఱించి ఇటులఁ జెప్పఁబడినది:—

'ఏతస్మిన్ ఖల్వక్షరే గార్గ్యాకాశ ఓత శ్చ ప్రోతశ్చ' అని.

ఈమంత్రార్థమే రెండవమంత్రమునందు చెప్పఁబడినది, ఈమంత్రమునందు అవ్యాకృతసంబంధ మగు జగత్కారణచైతన్యము చెప్పఁబడుచున్నది. ఏ సచ్చిద్రూప మగు కారణముచేత అంతరిక్షలోకము, ద్యులోకము, భూలోకము అను లోకత్రయము ఆవరింపఁబడియున్నదో, ఆయాలోకములందుండు వారిదేహములందు సైతము ఆవరింపఁబడియున్నవో, అనఁగా అందఱు ఏసద్రూపముచేతనే ప్రకాశించుచున్నారో, ఏపరమేశ్వరునిచేత అనుగ్రహింపఁబడినవాఁడై ఆదిత్యుఁడు స్వమండలాంతర్గతమగు కాంతిచేతను, లోకవ్యాప్త మగు కిరణసమూహముచేతను, జగమునంతయు తపింపఁజేయుచు ప్రకాశింపఁ జేయుచున్నాఁడో, తత్త్వవేత్తలు ఏపరమాత్మను సమస్త ప్రపంచమునందును వస్త్రమునందు తంతువులనువలె గాంచుచున్నారో, అట్టి బ్రహ్మతత్త్వము శ్రేష్ఠమగు నిజరూపమునం దుండియే ప్రజలను పుట్టింపుచున్నదని తాత్పర్యము.

స్వస్వరూపావస్థానమును గుఱించి ఛందోగులు ప్రశ్నోత్తరరూపముగ నిటుల పలుకుచున్నారు:—

శ్రు. 'స భగవః కస్మిన్ ప్రతిష్ఠిత ఇతి ? స్వే మహిమ్ని' ఇతి.

ఛాందో. 7-24-1.

ఆధారాంతరములేక తనయందే ఉండునదియని తాత్పర్యము.

విశేషము:—'య దక్షరే పరమే వ్యోమన్' అనుచోట 'త దక్షరే పరమే వ్యోమన్' అను పాఠముగలదు, ఇట్లే భాష్యమునందు గలదు. మొదటిపాఠమునందు సైతము యచ్ఛబ్దమునకు తచ్ఛబ్దార్థమును చెప్పి యున్నారు.

మం. యతః ప్రసూతా జగతః ప్రసూతీ
తోయేన జీవా న్వ్యస(చ)సర్జ భూమ్యామ్ ।
యదోషధీభిః పురుషా న్పశూగ్ంశ్చ
వివేశ భూతాని చరాచరాణి ॥4॥

టీక. యతః=(అవ్యాకృతోపహితమైన) ఏచైతన్యమువలన, జగతః= జగత్తుయొక్క ప్రసూతీ = సృష్టి, ప్రసూతా = ఉత్పన్నమాయెనో (ఆ చైతన్యము), తోయేన = (ఇచట తోయమనఁగా జలము ఉపలక్షకము, పంచభూతములని యర్థము) భూతపంచకముచేత, జీవాన్ = మనుష్యులు గోవులు మున్నగు జంతువులను, భూమ్యాం=భూమియందు, వ్యచసర్జ=విశేషముగా సృజించెనో, యత్=చైతన్యరూప మాయావిశిష్టమగు ఏకారణము, ఓషధీభిః = ఓషధు లుపలక్షణము, ఓషధులు అన్నము మున్నగు రూపము గలిగి, పురుషాన్=మనుష్యులను, పశూన్ చ=పశువులను, చరాచరాణి = స్థావర జంగమ శరీరముల నన్నింటిని, వివేశ=ప్రవేశించెనో (అట్టి చైతన్యముచేతనే జగమంతయు పరిపాలింపఁబడుచున్నదని యర్థము.)

తా. పూర్వమంత్రమునందు అవ్యాకృతోపహితమగు చైతన్యము జగత్త్రయమున కుపాదాన కారణ మని చెప్పఁబడియున్నది, అవిషయమే యీమంత్రమునందు విపులముగ మఱల చెప్పఁబడుచున్నది:—

"ఆత్మన ఆకాశ స్సంభూతః, ఆకాశా ద్వాయుః, వాయో రగ్నిః, అగ్నేరాపః, అద్భ్యః పృథివీ, పృథివ్యా ఓషధయః, ఓషధీభ్యో ఽన్నం, అన్నా త్పురుషః" అను మంత్రములచే చెప్పఁబడిన జగత్సృష్టి దేనివలన కలిగెనో, ఆచైతన్యమే భూతపంచకముచేత (ఇచట మూలమునందు తోయ మని మాత్రమే చెప్పియున్నను అది ఉపలక్షణము కావున భూతపంచకమని గ్రహింపవలయును.)పశు పక్షి మనుష్యాది జీవసంఘమును సృజించెను, ఆ చైతన్యమే ఓషధులు, వడ్లు, బియ్యము, అన్నము మున్నగు రూపములు గలదై, స్థావరజంగమాత్మక శరీరములను ప్రవేశించెను, అట్టి చైతన్యముచేత నీజగత్తు పరిపాలింపఁబడుచున్న దని తాత్పర్యము.

విశేషము:—'తోయేన జీవాన్ వ్య(స)సర్జ భూమ్యామ్' అనుచోట 'తోయేన జీవా న్వ్యససర్జ భూమ్యామ్' అని పాఠాంతరముగలదు, అర్థము ఉభయత్రసమానమే.

మం. అతః పరం నాన్యదణీయసగ్ం హి
పరాత్పరం యన్మహతో మహాన్తమ్ ।
యదేక మవ్యక్త మనన్తరూపం
విశ్వం పురాణం తమసః పరస్తాత్ ॥౫॥

టీక. యత్=ఏవస్తువు, పరాత్=ఉత్కృష్టు లగు హిరణ్యగర్భాదుల కంటె, పరం=మిక్కిలి శ్రేష్ఠమయినదో, మహతః = గొప్పవగు _ ఆకాశాది

కముకంటే, మహాత్=గొప్పదియో, యత్=ఎయ్యది, ఏకం=సజాతీయ విజాతీయ స్వగతభేద శూన్యమయినదో, అవ్యక్తం = ఇంద్రియములకు అగమ్యమో, అనంతరూపం = దేశకాల వస్తుపరిచ్ఛేదశూన్యమో, విశ్వం=జగత్స్వరూపమో, పురాణం=అనాదిసిద్ధమో, తమసః=అజ్ఞానముకంటె, పరస్తాత్ = పృథక్కుగా ఉండునో, అతః = ఈవస్తువుకంటె, అన్యత్ = మఱొకటి, అణీయసం = అతిసూక్ష్మమయినది (అనఁగా దుర్లక్ష్యమయినది) యు, పరం= శ్రేష్ఠమయినదియు, న=లేదు.

తా. వెనుకటి మంత్రమునందు జగత్కారణముగా చెప్పిన శుద్ధమయిన వస్తువును ఈమంత్రమునందు నిరూపించుచున్నారు:—ఏవస్తువు శ్రేష్ఠులగు హిరణ్యగర్భుఁడు మున్నగు వారికంటె మిక్కిలి శ్రేష్ఠమయినదో, ఏవస్తువు మిక్కిలి విశాలముగల ఆకాశము మున్నగు వానికంటె విశాలమయినదో, ఏవస్తువు సజాతీయ విజాతీయ స్వగతభేద శూన్యమైనదో, ఏయది ఇంద్రియములకు గోచరము కానిదో, ఏయది అనాదిసిద్ధమో, ఏయది అజ్ఞానము కంటె విలక్షణమయినదో, అట్టి వస్తు వొక్కటి గలదు. ఆవస్తువుకంటె అత్యంతసూక్ష్మమయినట్టియు, శ్రేష్ఠమయినట్టియు, వస్త్వంతరము లేదని తాత్పర్యము.

మం. తదేవర్తం తదు సత్య మాహు
స్తదేవ బ్రహ్మ పరమం కవీనామ్
ఇష్టాపూర్తం బహుధా జాతం జాయమానం
విశ్వం బిభర్తి భువనస్య నాభిః ॥౬॥

మం. తదేవాగ్ని స్తద్వాయు స్తత్సూర్య స్తదు చన్ద్రమాః ।
తదేవ శుక్రమమృతం తద్బ్రహ్మ తదాప స్స ప్రజాపతిః ॥2॥

టీక. తత్ ఏవ = ఆవస్తువే, ఋతం = ఋతము, తత్ ఉ = ఆవస్తువే, సత్యమ్ = సత్యము, కవీనాం = వేదశాస్త్రజ్ఞులకు, పరమం=ప్రమాణార్హమయి ఆదరణీయమగునదియు, తత్ ఏవ = ఆవస్తువే, ఇష్టాపూర్తం=ఇష్టాపూర్తకర్మలును, (తత్ = ఆవస్తువే)బహుధా = పూర్వకల్ప తత్పూర్వకల్పములందు అనేక విధములుగా, జాతం=పుట్టినట్టియు, జాయమానం = పుట్టుచున్నట్టియు, విశ్వం= ప్రపంచమునంతయు, భువనస్య=ప్రపంచమునకు, నాభిః=నాభిస్థానీయుఁడగు పరమాత్మ, బిభర్తి = భరించుచున్నాఁడు.

తత్ ఏవ = ఆవస్తువే, అగ్నిః = అగ్ని, తత్ ఏవ = ఆవస్తువే, వాయుః= వాయువు, తత్ = ఆవస్తువే, సూర్యః = సూర్యుఁడు, తత్ ఉ = ఆవస్తువే, చంద్రమాః = చంద్రుఁడు, తత్ ఏవ = ఆవస్తువే, శుక్రం = ప్రకాశించునట్టి నక్షత్రాదితేజస్సు, అమృతం = దేవతలకు భోజ్యమగు అమృతము, తత్ ఏవ = ఆవస్తువే, బ్రహ్మ = హిరణ్యగర్భస్వరూపము, తత్ = ఆవస్తువే, ఆపః = జలములు (పంచభూతములును), సః = ఆవస్తువే, ప్రజాపతిః = విరాడ్రూపుఁడును (అగుచున్నాఁడు).

తా. వెనుకటిమంత్రమునందు ఏవస్తువు సర్వజగదాత్మకమని చెప్పఁబడెనో దానినే వివరించి చెప్పుచున్నాఁడు.—మనస్సునందు వస్తుస్థితిని విచారించుట ఋతమనియుఁ, వాక్కుచేత దాని నుచ్చరించుట సత్యమనియు, భావము; ఈఋతము సత్యము ఆయధిష్ఠానమే యగుచున్నది, ఇష్టాపూర్తములును ఆయధిష్ఠానరూప మయిన వస్తువే, ఇష్టమనఁగా దర్శపూర్ణమాసాది శ్రౌతకర్మలు, పూర్తమనఁగా వాపీ కూప తటాకనిర్మాణము మున్నగు స్మార్త

కర్మలు, జరిగిన పోయిన అతిప్రాచీనకల్పములందును, పూర్వకల్పమునందును జన్మించినట్టియు, ఈకల్పమునందు జన్మించినట్టియు, అనేకవిధ భేదములుగల ఈప్రపంచము నంతయు సర్వప్రపంచమునకు నాభితుల్యుఁడగు పరమాత్మయే ధరించుచున్నాఁడు.

మఱియు ఆయధిష్ఠానమయిన వస్తువే, అగ్ని, వాయు, సూర్య, చంద్ర నక్షత్రాద్యాత్మకము, దేవతలకు ఆహారభూతపదార్థమగు అమృతము సైతము ఆవస్తువే, హిరణ్యగర్భుఁడు ఆవస్తువే, పంచభూతములు ఆవస్తువే విరాడ్రూపము ఆవస్తువే యని తాత్పర్యము.

మూలమునందు "ఆపః" అని చెప్పినది ఉపలక్షణమని గ్రహింప వలయును, అవిద్యాదృష్టిచేత ఏప్రపంచము నానావిధములుగా గనఁబడు చున్నదో, అది యంతయు విద్యాదృష్టిచేత అఖండైకరసబ్రహ్మరూప మగుచున్నది, కావున దృష్టిద్వయము నవలంబించి వాజసనేయులు (బృహ. ౨. ౪. ౧౪) ఇటుల చెప్పుచున్నారు:—

శ్రు. 'యత్ర హి ద్వైత మివ భవతి తదితర ఇతరం పశ్యతి.'

అర్థ. (ఎచ్చట ద్వైతబుద్ధి కలుగునో అచ్చట ఒకఁడు ఒకదాని చూచును) అది అవిద్యాదృష్టి.

శ్రు. 'యత్ర త్వస్య సర్వమాత్మైవాభూత్తత్కేన కం పశ్యేత్?'

అర్థ. (ఎచ్చట అంతయు ఆత్మస్వరూపమే యగునో, అచట ఎవఁడు ఎవనిని చూచును?) ఇది విద్యాదృష్టి.

మం. సర్వే నిమేషా జజ్ఞిరే విద్యుతః పురుషాదధి ।
కలా ముహూర్తాః కాష్ఠాశ్చాహోరాత్రాశ్చ సర్వశః ॥
॥౮॥

మం. అర్ధమాసా మాసా ఋతవ స్సంవత్సర శ్చ కల్పన్తామ్ ।
స ఆపః ప్రదుఘే ఉభే ఇమే అన్తరిక్ష. మథో సువః ॥౯॥

టీక. విద్యుతః = స్వయం ప్రకాశుఁడగు, పురుషాత్ = పురుషుని వల్లనుండి, సర్వే = సమస్తములయిన, నిమేషాః = నిమేషములు, అధి జజ్ఞిరే=పుట్టెను, సర్వశః=సర్వవిధములయిన, కలాః=కలలు, ముహూర్తాః= ముహూర్తములు, కాష్ఠాః చ=కాష్ఠలు, అహోరాత్రాః చ=అహోరాత్రములు, అర్ధమాసాః = అర్ధమాసములు, మాసాః = మాసములు, ఋతవః= ఋతువులు, సంవత్సరః = సంవత్సరమున్నూ, కల్పంతాం = (ఆపరమేశ్వరునివల్లనుండియే) పుట్టెను, సః=ఆపరమాత్మ, ఆపః=ఇచట జలోపలక్షితమగు పృథివిని, ప్రదుఘే = పితికినవాఁడాయెను, (అట్లే) అంతరిక్షం = అంతరిక్షమును, అథో=మఱియు, సువః=స్వర్లోకమును, ఉభే = ఈలోకద్వయమును, ప్రదుఘ్నే = పిండెను, అనఁగా ఆయా లోకములకువలయు భోగ్యవస్తువులను కూడ కలుగఁజేసె నని యర్థము.

తా. ("ప్రకృతిః పురుష శ్చైవ నిత్యౌ కాల శ్చ సత్తమ" అను పురాణవచనమువలన కాలము నిత్యము అని చెప్పఁబడియున్నది కావున విద్యారూపదృష్టితో గ్రహించినను కాలమునకు బ్రహ్మరూపము లేదను విషయమును పూర్వపక్షముగా పరిగ్రహించి ఆవిషయము అవిద్యాదృష్టిపరముగా పురాణమునకు సమాధానము చెప్పుట న్యాయమని విద్యారణ్యులవారు చెప్పినారు. విద్యాదృష్టిచేత కాలమును బ్రహ్మత్వవివక్షచేయుచు కాలము బ్రహ్మమువలన పుట్టెనను విషయమును ఈమంత్రద్వయముచేత బోధించుచున్నాఁడు:—) స్వయంప్రకాశమానుఁడగు ఆపురుషునివల్లనుండియే నిమేషములు, కలలు, కాష్ఠములు, ముహూర్తములు, అహోరాత్రములు, శుక్ల కృష్ణ పక్షరూపములగు అర్ధమాసములు, చైత్రాదిమాసములు, వసం

తాదిఋతువులు, ప్రభవాదిసంవత్సరములు, మఱియు లవ, త్రుటి మున్నగు కాలవిశేషములు ఉత్పన్నములాయెను.

పిదప ఆపరమేశ్వరుఁడే భూమియందు ప్రాణులకు అపేక్షితమగు సకలభోగ్యజాతమును సృజించెను. పిదప అంతరిక్ష ద్యులోకములందు ప్రాణులకు వలసిన భోగ్యజాతమును నిర్మించెను.

ఈమంత్రములందు చెప్పఁబడిన కాలవిశేషములయొక్క పరిమాణము తెలుపునట్టి శ్లోకముల నీక్రింద నిచ్చుచున్నాఁడను:—

శ్లో. అష్టాదశ నిమేషా స్తు కాష్ఠా, త్రింశత్తు తాః కలా,
తా స్తు త్రింశ త్క్షణ, స్తే తు ముహూర్తో ద్వాదశా స్త్రియామ్,
తే తు త్రింశ దహోరాత్రః, పక్ష స్తే దశ పంచచ.

అర్థము. ౧౮ నిమేషములు ఒకకాష్ఠము; 30 కాష్ఠములు ఒక కల; 30 కలలు ఒక క్షణము; ౧౨ క్షణములు ఒక ముహూర్తము; 30 ముహూర్తములు ఒక అహోరాత్రము; ౧౫ అహోరాత్రములు ఒక పక్షము అనియు అగును.

పైశ్లోకమునందు చెప్పని కాలవిశేషమును బోధించువచనముల నీక్రింద వ్రాయుచున్నాఁడను:—

శ్లో. నలినీపత్రసంహత్యాః సూక్ష్మసూచ్యభిభేదనే,
దలే దలే తు యః కాలః స కాలో లవ వాచకః.

లవై స్త్రుటి స్యాత్త్రింశద్భిః—

(అర్థ. తామరాకులను పోగుగాపెట్టి సన్నని కొనగల సూదితో ఆ యాకులపోగును గుచ్చినయెడల ఒక్కొక ఆకుమీఁద సూదిదిగుటకు ఎంత యవకాశము పట్టునో ఆసమయము ఒక లవ మనఁబడును. అట్టి లవములు ముప్పదియయినయెడల ఒక త్రుటి యగును.)

నిమేషశబ్దమునకు ఈక్రిందివిధముగా నిరుక్తిని చెప్పియున్నారు.—
నిమియను పేరుగల ఒకరాజు ఉండెను, అతఁడు జనకమహారాజు యొక్క పూర్వపురుషుఁడు, ఇతఁడే మిథిలాధిపతులలో మొదటివాఁడు, దేవతానుగ్రహమువలన అతఁడు రెప్పపాటులం దుండునటుల వరమును పొందెను, కావుననే రెప్పపాటుకాలమునకు నిమిషమను సంజ్ఞవచ్చినది, నిమిషములే నిమేషములు.

మాస, అర్ధమాస, ఋతు, సంవత్సరాదికాలభేదము సుప్రసిద్ధము కావున ఇచట వివరించి చెప్పలేదు.

మం. నైన మూర్ధ్వం న తిర్యఞ్చం
న మధ్యే పరిజగ్రభత్ ।
న తస్యేశే కశ్చన
తస్య నామ మహ ద్యశః ॥౯॥

మం. న సందృశే తిష్ఠతి రూప మస్య
న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్ ।
హృదా మనీషా మనసా ఽభిక్లృప్తో
య ఏనం విదు రమృతా స్తే భవన్తి ॥౧౦॥

టీక. కశ్చన = ఎవ్వఁడునున్ను, ఏనం = ఈపరమాత్మను, ఊర్ధ్వం = స్తంభమువలె ఊర్ధ్వాకారముగలవానిగా, నపరిజగ్రభత్ = గ్రహింపఁజాలఁడు, తిర్యంచం = తిర్యక్కుగా ఉండువానిగాను, న = గ్రహింపఁజాలఁడు, మధ్యే = గృహాదిమధ్యభాగమునందుగాని, న = గ్రహింపఁజాలఁడు.

తస్య = అతనియొక్క, నామ = నామగ్రహణమునందు గాని, న తస్య = సమర్థుఁడు కాఁజాలఁడు, (కావుననే) మహద్యశః = మహద్యశుఁడను నామము ఆతనికి కలిగెను.

అస్య = ఈపరమాత్మయొక్క, రూపం = రూపము, సందృశే = ప్రాణులయొక్క దృష్టివిషయమునందు, న=ఉండదు, కశ్చన = ఎవ్వఁడున్ను, ఏనం = ఈపరమాత్మను, చక్షుషా=(ఈ)నేత్రముచేతను, న పశ్యతి=చూడలేడు, హృదా = హృదయపుండరీకమునం దుండునట్టియు, మనీషా = లౌకికవస్తుగోచరముగాని, మనసా = మనస్సుచేత, యే=ఏపురుషులు, ఏనం = ఈపరమాత్మను, విదుః = సాక్షాత్కారమును చేసికొనుచున్నారో, తే=వారు, అమృతాః = మరణరహితులు, భవన్తి = అగుచున్నారు.

తా. కాల లోకాది సర్వకారణ మగు పరమాత్మ అంతట అనుగతమయి యున్నాఁడు కదా, ప్రాణులందఱ కేల గనంబడుటలేదు? అను విషయమునకు దృగ్గోచరమగు రూపాదికము లేనివాఁడు కావున గనంబడఁజాలఁడను సమాధాన మీమంత్రములు చెప్పుచున్నవి:—పరమాత్మ స్తంభాదికమువలె ఊర్ధ్వాకారము కలిగినగాని, వెన్నుగాడి మొదలగుదానివలె తిర్యగాకారము కలిగిగాని, గృహాదికముయొక్క మధ్యభాగమునందుండు దేవదత్తునివలె ఒక్కచోటగాని లేడు, కావున నెవ్వఁడును ఆవిధముగా పరమాత్మను గ్రహింపఁజాలరు, మాకు గ్రహించుటకు కష్టముగానున్నది, కావున ఈవిధముగా నుండుమని పరమాత్మ నెవ్వఁడును నియమింపఁజాలఁడు కావున ఆతనికి మహద్యశుఁ డను నామము సిద్ధించినది. మిక్కిలి స్వతంత్రుఁడనెడి అతనియశస్సు అతిశయమైయున్నది కనుక అతనికి ఆపేరు తగియేయున్నది.

మఱియు ఈపరమాత్మయొక్క రూపము నీలపీతాదిరూప విశిష్టమై ప్రాణులదృష్టికి గోచరమగుటలేదు, శ్రుతులు "అశబ్ద మస్పర్శ మరూపం" అనియే పలుకుచున్నవి, ఎంతటినేర్పరి అయినను కంటిచేత పరమాత్మన

చూడఁజాలఁడు, అయినను గురుశాస్త్రోపదేశముచేత విశిష్టుఁ డయినవాఁడు మాత్రము హృదయపుండరీకమధ్యవర్తియై లౌకికవస్తుగోచరము కాని అంతః కరణముచేత మాత్రము నిశ్చయముగాఁ జూడఁగలఁడు.

యోగాభ్యాసముచేత సంస్కృతమయిన మనస్సు లౌకికములగు మనో వృత్తులను నిగ్రహించుటకు సమర్థమగును, అప్పుడు అంతర్ముఖమయిన ఏకాగ్రచిత్తముతో పరమాత్మను అనుభవించుటకు వీలగును, ఈవిషయమునే శ్రు. "దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః" అను ౨. 3. కఠ. శ్రుతియు పలుకుచున్నది. ఎవ రిట్టి పరమాత్మను మనస్సుచేత సాక్షాత్కారమును చేసికొనుచున్నారో ఆ పురుషులు మరణరహితు లగుచున్నారు. మరణమనఁగా దేహమునుండి ప్రాణములు లేచిపోవుట యని యర్థము, తత్త్వవేత్తలదేహమునుండి ప్రాణము లుత్క్రమించుట లేదు. ఇందులకు శ్రుతి (బృహ. ౪. ౪. ౬.) ప్రమాణము:—

శ్రు. 'న తస్య ప్రాణా ఉత్క్రామన్తి, అత్రైవ సమవలీయంతే'

అర్థ. (బ్రహ్మవేత్తయొక్క ప్రాణములు ఉత్క్రమించుట లేదు. ఇచటనే లీనమయి పోవుచున్నవి.)

అవ. వెనుక చెప్పఁబడిన విషయమును దృఢీకరింపఁజేయుటకయి ఇతరత్ర పఠింపఁబడిన మంత్రములయొక్క ప్రతీకలను చెప్పుచున్నాఁడు:—

మం. అద్భ్యస్సమ్భూతో, హిరణ్యగర్భ, ఇత్యష్టౌ ॥౧౧॥

టీక. అద్భ్యస్సంభూతః = 'అద్భ్యస్సంభూతః పృథివ్యైరసాచ్చ' అని ఆరణ్యకమునందు 3-వ ప్రశ్నమునందు పఠింపఁబడినయనువాకము, హిరణ్యగర్భఇతి="హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే" అను మంత్రముమొదలు అష్టౌ = ఎనిమిదిఋక్కులును (ఇయ్యవి తైత్తిరీయసంహిత నాల్గవకాండము

ప్రథమ ప్రపాఠకమునందు గలవు) ఈయనువాకము, వైబుస్కులును (ఇట్లే భగవన్మహిమను ప్రతిపాదించుచున్నవని యర్థము).

తా. ఈనారాయణానువాకమునందు పరమేశ్వరునిగుఱించిన విషయమును వివరించుచు స్థలాంతరమునందును ఈవిషయము బోధింపఁబడియున్నది యని తెలుపుటకుగాను "అద్భ్యస్సంభూత" యను అనువాకము, "హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే" అని ర మంత్రములయొక్క మొదలు ఇట్లు చెప్పఁబడినది. పాఠకులకు సౌకర్యార్థము ఈమంత్రములనుకూడ టీకాతాత్పర్య సహితముగ వ్రాయుచున్నారము.

మం. ౧. అద్భ్యస్సంభూతః పృథివ్యై రసాచ్చ ।
విశ్వకర్మణ స్సమవర్తతాధి ।
తస్య త్వష్టా విదధ ద్రూప మేతి ।
త త్పురుషస్య విశ్వ మాజాన మగ్రే ॥

టీక. (విరాడ్రూపుఁడగు నారాయణుఁడు) అద్భ్యః = జలములనుండి, సంభూతః = పుట్టెను, పృథివ్యై = భూసంబంధమగు, రసాత్ చ = సారమునుండియు (పుట్టెను), విశ్వకర్మణః = జగత్కర్తయగు పరమేశ్వరునివల్లనుండి, అధిసమవర్తత = ఆధిక్యముగా పుట్టెను, త్వష్టా = జగత్కర్తయగు పరమేశ్వరుఁడు, తస్య = ఆవిరాట్పురుషునియొక్క, రూపం=రూపభూతమగు చతుర్దశలోకసంస్థానమును, విదధత్ = పుట్టించుచు, ఏతి = ప్రవర్తించుచున్నాఁడు, పురుషస్య=పురుషసంబంధమగు, తత్=ఆ, విశ్వం = దేవమనుష్యాది రూపమగు ప్రపంచమంతయు, అగ్రే = సృష్ట్యాదియందు, ఆజానం = అంతట ఉత్పన్నమయినది.

తా. విరాడ్రూపుఁడగు నారాయణుఁ డను పురుషుఁడు జలముల

నుండి పుట్టెను, అంతట వ్యాపించియున్న జలములందు పాలయందు మీగడ వలె బ్రహ్మాండగోలక ముత్పన్నమయినది, కేవల ముదకములనుండియే గాదు, భూసంబంధమగు సారమువల్లనుండియు ఉత్పన్నమాయెను. ఈవిషయము నందు శ్రుతి ఈవిధముగాఁ గలదు:—

శ్రు. "మండస్య యోఽయం ఘనీభావ స్సపార్థివః, యే చ తన్మధ్యే ద్రవాంశా స్త ఆప్యాః, య త్కఠినం సాపృథివీ, యద్ద్రవం త దాపః" (మండమనఁగా పాలుమున్నగు వానిమీఁదనుండు మీగడ, అందలి ఘనీభావము పృథివీసంబంధ మయినది, దాని మధ్యయందుండు ద్రవాంశములు జలమయములు, కఠినమయినది పృథివి, ద్రవమయినది జలములు.)

జగత్కర్తయగు పరమేశ్వరునివల్లనుండి అధిక్యముగా బ్రహ్మాండాభిమానియు, చేతనమును అగు ఈశ్వరాంశగల యేపురుషుఁడు జన్మించెనో, అట్టి విరాట్పురుషునియొక్క భూరాది చతుర్దశభువనరూపమగు సంస్థానమును భగవంతుఁ డేర్పఱుచుచు ప్రవర్తించుచున్నాఁడు. ఆ విరాట్పురుషుని సంబంధమగు దేవమనుష్యాది రూపమగు ప్రపంచ మంతయు సృష్ట్యాదియందు అంతట ఉత్పన్నమయినది అని తాత్పర్యము.

మం. ౨. వేదాహ మేతం పురుషం మహాన్తమ్ ।
ఆదిత్యవర్ణం తమసస్తు పారే ।
తమేవం విద్వా నమృత ఇహ భవతి ।
నాన్యః పంథా విద్యతే ఽయనాయ ।

టీక. (యః = ఏపురుషుఁడు, సర్వాణి = సమస్తములయిన, రూపాణి = దేవ మనుష్య శరీరములను, విచిత్య = విశేషముగా పుట్టించి, నామాని = నామములను, కృత్వా = కల్పించి, అభివదన్ = వానిచేత పిలువఁబడుచు

ఆస్తే = ఉంటున్నాఁడో,) మహాంతం = గొప్పవాఁడును, ఆదిత్యవర్ణం = సూర్యునివంటి కాంతిగలవాఁడును, తమసః = అంధకారముకంటె, పరస్తాత్ = అవతలనుండువాఁడును (అగు), ఏతం = ఈ, పురుషం = పురుషుని, అహం = నేను, వేద = ఎఱుంగుదును, తం = ఆపురుషుని, ఏవం = ఈవిధముగా, విద్వాన్ = ఎఱింగినవాఁడు, ఇహ = ఇచ్చటనే, అమృతః = ముక్తుఁ డయినవాఁడు, భవతి = అగుచున్నాఁడు, అయనాయ = మోక్షముకొఱకు, అన్యః = మఱొక, పంథాః = మార్గము, నవిద్యతే = లేదు.

తా. ఈమంత్రద్రష్ట తనధ్యానానుభవము నీవిధముగా ప్రకటించు చున్నాఁడు:—(ఏపురుషుఁడు దేవమనుష్యతిర్యగాది భేదములుగల సకల ప్రాణుల దేహములను తాను కల్పించి వానికి నామరూపములను ఏర్పఱిచి వానితో నంతట వ్యవహరింపఁబడుచున్నాఁడో) అట్టి గొప్పవాఁడును, సూర్యునివంటి కాంతిగలవాఁడును, అంధకారమునకు వెలుపలనుండువాఁడును అగు ఈపురుషుని నేనెఱుంగుదును, అట్టిపురుషుని ఎఱింగినవాఁడు ఇచ్చటనే ముక్తుఁ డగుచున్నాఁడు, మోక్షమునకు ఇంతకంటె వేఱుమార్గములేదని తాత్పర్యము.

మం. 3. ప్రజాపతి శ్చరతి గర్భే అంతః ।
అజాయమానో బహుధా విజాయతే ।
తస్య ధీరాః పరిజానన్తి యోనిమ్ ।
మరీచీనాం పదమిచ్ఛంతి వేధసః ॥

టీక. ప్రజాపతిః = పరమేశ్వరుఁడు, గర్భే అంతః = బ్రహ్మాండము యొక్క లోపల, చరతి = (విగ్రహవంతుఁడై) చరించుచున్నాఁడు, అజాయమానః = అతఁడు వాస్తవమునకు పుట్టకపోయినను, బహుధా = స్థావర జంగమాది బహువిధరూపములచేత, విజాయతే = విశేషముగా పుట్టు

చున్నాఁడు, తస్య = ఆపరమేశ్వరునియొక్క, యోనిం = జగత్కారణరూప మగు వాస్తవస్వరూపమును, ధీరాః = యోగబలముచేత నిరుద్ధేంద్రియు లగు మహాత్ములు, పరిజానన్తి = ఎఱుంగుచున్నారు, వేధసః = సృష్టికర్తలగు బ్రహ్మలు, మరీచినాం = మరీచి అత్రి మున్నగు మహర్షులయొక్క, పదం = జగదుత్పాదకత్వరూపమగు లక్షణమును, ఇచ్ఛంతి = ఇచ్ఛయించుచున్నారు.

తా. ఈ బ్రహ్మాండరూపమగు గర్భముయొక్క మధ్యభాగమునందు పరమేశ్వరుఁడు విగ్రహవంతుఁడై చరించుచున్నాఁడు. ఆపరమేశ్వరుఁడు యథార్థమునకు "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" మున్నగు శ్రుతులవలన పుట్టుకలేనివాఁడని సిద్ధించుచున్నను, మాయిక మయినట్టి స్థావరజంగమాది బహువిధరూపములు గలవానివలె పుట్టుచున్నాఁడు, యోగాభ్యాసముచేత నిరుద్ధేంద్రియశక్తులు గల మహాత్ములు జగత్కారణరూపమగు పరమేశ్వరుని యొక్క వాస్తవ స్వరూపమును ఎఱుంగఁగలరు. జగన్నిర్మాతలగు చతుర్ముఖ బ్రహ్మలు ఆసృష్టికర్త నుపాసించియే మరీచి అత్రి మున్నగు మహర్షుల యొక్క జగదుత్పాదకత్వరూప మగు సామర్థ్యమును ఇచ్ఛయించు చున్నారని తాత్పర్యము.

మం. ౪. యో దేవేభ్య ఆతపతి ।
యో దేవానాం పురోహితః ।
పూర్వో యో దేవేభ్యో జాతః ।
నమో రుచాయ బ్రాహ్మయే ॥

టీక. యః = ఏపరమేశ్వరుఁడు, దేవేభ్యః = దేవతలకొఱకు, ఆతపతి = అంతట ప్రకాశించుచున్నాఁడో, యః = ఎవ్వఁడు, దేవానాం = దేవతలకు, పురోహితః = పురోహితుఁడు (అనఁగా బృహస్పతి) ఆయెనో, యః =

ఎవ్వఁడు, దేవేభ్యః = దేవతలకంటె, పూర్వః=పూర్వభావియై, జాతః=పుట్టెనో, (అట్టి) రుచాయ = స్వయంప్రకాశమయినట్టి, బ్రాహ్మయే = వేదప్రతిపాద్యుఁడగు వానికొఱకు, నమః = నమస్కారము.

తా. ఏపరమేశ్వరుఁడు దేవతలనిమిత్తము అంతట ప్రకాశించుచున్నాఁడో, అనఁగా దేవతలకు దేవత్వము సిద్ధించుటకుగాను వారివారి హృదయములందు చైతన్యరూపమున ప్రవేశించి వెలుంగుచున్నాఁడో అని యర్థము, ఎవఁడు దేవతాపురోహితుఁడగు బృహస్పతి స్వరూపమో, ఎవ్వఁడు దేవత లందఱికంటె ముందుగా హిరణ్యగర్భరూపమున నావిర్భవించెనో, అట్టి స్వయంప్రకాశమానుఁడును, పరబ్రహ్మస్వరూపుఁడును లేక వేదప్రతిపాద్యుఁడు నగువానికి నమస్కార మగుఁగాక.

మం. ౫. రుచం బ్రాహ్మం జనయన్తః ।
దేవా అగ్రే త దబ్రువన్ ।
యస్త్వైవం బ్రాహ్మణో విద్యాత్ ।
తస్య దేవా అసన్ వశే ।

టీక. అగ్రే = మొట్టమొదట - అనఁగా సృష్టికాలమునందు, దేవాః = సమస్తమైన దేవతలు, బ్రాహ్మం = పరబ్రహ్మసంబంధ మగు, రుచం = చైతన్యమును, జనయంతః = విద్యచేతను పుట్టించుచున్నవారలయి, తత్ = ఆబ్రహ్మతత్త్వమును (సంబోధించి), అబ్రువన్ = పలికిరి, ఆపలికిన దేమనఁగా:— "ఓపరమేశ్వరా! యః = ఏ, బ్రాహ్మణః తు=బ్రహ్మవేత్త, ఏవం = ఈవిధముగా, విద్యాత్ = తెలుసుకొనునో, తస్య = అట్టి బ్రహ్మవేత్తకు, దేవాః = సమస్తమయినదేవతలు, వశే = స్వాధీనమునందు, అసన్ = అగుచున్నారు." (అని).

తా. దేవతలందఱు ప్రప్రథమమున సృష్ట్యాదికాలమునందు బ్రహ్మ-విద్యాసంప్రదాయమును ప్రవర్తింపఁజేయుసమయమునందు విద్యాసామర్థ్యముచేత పరబ్రహ్మచైతన్యమును ప్రాదుర్భవింపఁజేయుచు ఈ చెప్పఁబోవు. వాక్యమును పలికిరి, ఆవాక్య మేమనఁగా:—

'ఓపరమేశ్వరా! ఈవిధముగా ఏబ్రహ్మవేత్త యగువాఁ డెఱుంగునో అట్టి బ్రహ్మవేత్తకు దేవతలందఱు అధీనులయి యుందురు, తాను అదేవతలకు. అంతర్యామిరూపుఁడగు పరమాత్మయే అయియున్నాఁడు కావున దేవతలు అబ్రహ్మవేత్తకు లోఁబడిన వారలు-అనఁగా అధీనులు అగుచున్నారు.' బ్రహ్మ-వేత్తకు దేవతలు ఈశ్వరులు కాఁజాలరనువిషయము బృహదారణ్యకోపనిషత్తునందు (౧. ౪. ౧౦) స్పష్టముగా నిట్లు తెలుపఁబడియున్నది:—

శ్రు. 'య ఏవం వేదాహం బ్రహ్మాస్మీతి స ఇదగ్ం సర్వం భవతి, తస్య హ న దేవాశ్చ నా భూత్యా ఈశతే, ఆత్మా హ్యేషాగ్ం స భవతి.'

అర్థ. ఎవ్వఁ డీవిధముగా "అహం బ్రహ్మాస్మి" అని తెలిసికొనుచున్నాఁడో, అతఁడే ఇది అంతయు అగుచున్నాఁడు, వానికి దేవతలు సైతము మహిమచేత అధికులు కారు, వారలకుఁగూడ—అనఁగా దేవతలకుఁగూడ. ఇతఁడే ఆత్మ యగుచున్నాఁడు.

మం. హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ । అహోరాత్రే పార్శ్వే । నక్షత్రాణి రూపమ్ । అశ్వినౌ వ్యాత్తమ్ । ఇష్టం మనిషాణ । అముం మనిషాణ । సర్వం మనిషాణ ॥

టీక. (ఓపరమేశ్వరా!) హ్రీః చ = లజ్జాభిమానిని యగుదేవతయు, లక్ష్మీః చ=ఐశ్వర్యాభిమానినియగు దేవతయు, తే=నీకు, పత్న్యౌ=భార్యలు, అహోరాత్రే=దివారాత్రములు, పార్శ్వే=పార్శ్వభాగములు, నక్షత్రాణి=-

ఆకాశమునఁ గనంబడు నక్షత్రములు, రూపం=శరీరము, అశ్వినౌ=అశ్వినీ దేవతలు, వ్యాత్తం=తెరచిననోరు, అట్టి యో విరాట్పురుషా! ఇష్టం=అస్మద పేక్షితమగు ఆత్మబోధమును, మనిషాణ = దయచేయుము, అముం = గవా శ్వాదిభూయిష్ఠమగు దీనిని (ఐహికసంపదను), మనిషాణ = ఇమ్ము, సర్వం= ఐహికాముష్మికరూపమగు సంపదనంతయు, మనిషాణ=ఇమ్ము.

తా. హ్రీ యనఁగా లజ్జాభిమానిని యగుదేవత, శ్రీ యనఁగా ఐశ్వ ర్యాభిమానిని యగుదేవత, ఓపరమేశ్వరా! హ్రీదేవతయు శ్రీదేవతయు నీకు భార్యాస్థానీయలగుచున్నారు. అహోరాత్రములు పార్శ్వద్వయస్థా నీయము లగుచున్నవి, ఆకాశమున గనంబడుచున్న నక్షత్రములు శరీరస్థాని యము లగుచున్నవి, అశ్వినీదేవతలు నీయొక్క వివృత మగు ఆస్యరూపు లగుచున్నారు, అట్టి యోవిరాట్పురుషా! మేము కోరుచున్న ఆత్మజ్ఞానమును మాకు దయచేయుము, ఈలోకమునఁ గనంబడు ఐశ్వర్యమగు గవాశ్వాది సమృద్ధిని మాకు కలుగఁజేయుము, పెక్కుమాట లెందుకు? ఐహికాముష్మిక సంబంధములగు సకలవిధ వాంఛలను మాకు సంపూర్ణముగా నొసఁగు మని తాత్పర్యము.

హిరణ్యగర్భ ఇత్యష్టౌ—

మం. ౧. హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే
భూతస్య జాతః పతి రేక ఆసీత్ ।
స దాధార పృథివీం ద్యా ముతేమాం
కస్మై దేవాయ హవిషా విధేమ ॥

టీక. అగ్రే = సృష్ట్యాదియందు, హిరణ్యగర్భః = హిరణ్యగర్భుఁడు, సమవర్తత = (ఆపరమాత్మవల్లనుండియే) పుట్టెను, జాతః = ఉత్పన్నుఁడైన

(ఆహిరణ్యగర్భుఁడు), భూతస్య = భువనసమూహమునకు, ఏకః = ఒక్కఁ డైన, పతిః=ప్రభువు, ఆసీత్ = ఆయెను, సః=ఆపరమాత్మ, పృథివీం=భూమినిఁ ఉత = మఱియు, ఇమాం = ఈ, ద్యాం = అంతరిక్షమును, దాధార = ధరించెను, (మేము ఇఁక ఆపరమాత్మకంటె భిన్నుఁడైన) కస్మై = ఏ, దేవాయ = దేవునికొఱకు, హవిషా = హవిస్సుగల యజ్ఞముచేత, విధేమ = విధుల ననుష్ఠింతుము ?

తా. పరమాత్మ సృష్ట్యాదియందు ప్రప్రథమముననే చతుర్ముఖుఁడగు హిరణ్యగర్భుని సృజించెను, ఆహిరణ్యగర్భుఁడు పైపరమేశ్వరుని యనుగ్రహమువలన ఈప్రపంచమున కంతయు ఏకాధిపత్యమును వహించెను, ఆపరమాత్మయే భూమిని మఱియు అంతరిక్షమును ధరించియున్నాఁడు, సృష్టికర్తయగు హిరణ్యగర్భుని సైతము పుట్టించి, అతనికి ప్రపంచైకాధిపత్యమును అనుగ్రహబుద్ధితో నొసంగిన ఆపరమాత్మను పరిత్యజించి ఏఇతరదేవతలకొఱకు మేము యజ్ఞయాగాదులందు హవిస్సుల నొసంగెదము ? అనఁగా ఎవ్వరికి ఇవ్వమనియు, ఆపరమేశ్వరుని ప్రీతిని సంపాదించుటకే సకల శ్రౌతస్మార్త కర్మల నొనర్తుమనియు తాత్పర్యము.

మం. ౨. యః ప్రా॒ణ॒తో ని॑మిష॒తో మ॑హి॒త్వైక॒
ఇన్ద్రాజా॒ జగ॑తో బ॒భూవ॑ ।
య ఈశే॑ అ॒స్య ద్వి॒పద॒ శ్చతు॑ష్పదః
తస్మై॑ దే॒వాయ॑ హ॒విషా॑ విధేమ ॥

టీక. యః = ఏపరమాత్మ, ప్రాణతః = చలించునట్టియు, నిమిషతః = నిమేషముగలట్టియు, జగతః = ప్రపంచముయొక్క, మహిత్వే = పూజయందు, ఏకఇత్ = ఒక్కఁడే అయిన, రాజా=ప్రభువు, బభూవ = ఆయెనో,

యః = ఎవ్వఁడు, అస్య = ఈబ్రహ్మాండముయొక్క, ద్విపదః = మనుష్యులను, చతుష్పదః = పశ్వాదికమును, ఈశే = శిక్షించుచున్నాఁడో (అట్టిపరమాత్మను పరిత్యజించి), కస్మై = ఏ, దేవాయ = దేవునికొఱకు, హవిషా = హవిస్సుగల యజ్ఞముచేత, విధేమ = విధుల ననుష్ఠింతుము ?

తా. ఏపరమాత్మ స్థావరజంగమాత్మక మగు ప్రపంచమునందు ప్రాణింపఁ దగినవారిలో తా నొక్కఁడే రాజయి యున్నాఁడో, ఎవఁడీ బ్రహ్మాండ మధ్యవర్తులయియున్న ద్విపాత్తులగు మనుష్యాదులను, చతుష్పాత్తులగు పశ్వాదులను ఆయాపనులందు శిక్షింపుచున్నాఁడో - అనఁగా సర్వప్రాణులయొక్క హృదయపుండరీకమునందు అంతర్యామియై నివసించి ఆయాపుణ్యాపాపకర్మల నాచరించుటకు ప్రేరేపించుచున్నాఁడో, అట్టి పరమాత్మను వదలి మఱి ఏదే వునిప్రీతికయి మేము యజ్ఞయాగాదివిధుల నాచరింతుము ? అనఁగా ఇతరు లెవ్వరినిగూర్చి చేయుట లేదనియు, అట్టి పరమేశ్వరుని గూర్చియే మేము యజ్ఞయాగాదిక్రతువుల నాచరించుచున్నామనియు తాత్పర్యము.

మం. 3. య ఆత్మదా బలదా యస్య విశ్వ
ఉపాసతే ప్రశిషం యస్య దేవాః ।
యస్య ఛాయాఽమృతం యస్య మృత్యుః
కస్మై దేవాయ హవిషా విధేమ ।

టీక. యః = ఎవ్వఁడు, ఆత్మదా = జీవరూపుని ఇచ్చుచున్నాఁడో, (యః = ఎవ్వఁడు)బలదా = అన్నాది పుష్టిని ఇచ్చుచున్నాఁడో, యస్య = ఎవ్వనియొక్క, ప్రశిషం = ఆజ్ఞను, దేవాః = దేవతలు (మనుష్యులును), ఉపాసతే = ఉపాసమునువలె పవిత్రముగా భావించి పరిపాలించుచున్నారో, యస్య = ఏపరమేశ్వరునియొక్క, ఛాయా = నీడ (అనఁగా వాని నాశ్ర

యించియుండుట యని యర్థము), అమృతం = మోక్షహేతువగుచున్నదో, యస్య = ఎవనియొక్క (శరణమును పొందక పోవుట), మృత్యుః = నరకమునకు హేతు వగుచున్నదో (అట్టి పరమాత్మను విడిచి), కస్మై = ఏ, దేవాయ = దేవునికొఱకు, హవిషా = హవిస్సుగల యజ్ఞాదికముచేత, విధేమ = విధుల ననుష్ఠింతుము?

తా. ఏపరమాత్మ అందఱకు జీవరూపుఁడగు ఆత్మను ఇచ్చుచున్నాఁడో, ఎవఁడు అందఱకు అన్నాది పుష్టిరూప మగు బలము నొసంగుచున్నాఁడో, ఏ పరమేశ్వరుని ఆజ్ఞను దేవతలు మనుష్యులు తలవంచి పరిగ్రహించి ఆచరించుచున్నారో, ఎవని నాశ్రయించుటయే అమృతత్వముగను అనఁగా మోక్షహేతువుగను, ఎవనియొక్క శరణము లేకపోవుటయే నరకప్రాప్తికి హేతుభూతమును అగుచున్నదో, అట్టి పరమాత్మను పరిత్యజించి మేము ఏదేవుని హవిర్దానరూపమగు యజ్ఞముచేత నారాధింతుము? అనఁగా అట్టిపరమాత్మకంటె మఱొక్కరిని మే మాశ్రయింపమని తాత్పర్యము.

మం. ౮. యస్యే॒మే హి॒మవ॑న్తో మహి॒త్వా
యస్య॑ సము॒ద్రగ్ం ర॒సయా॑ స॒హాఽఽహుః,
యస్యే॒మాః ప్ర॒దిశో॒ యస్య॑ బా॒హూ
కస్మై॑ దే॒వాయ॑ హ॒విషా॑ విధేమ ।

టీక. ఇమే = ఈ (భూమండలమునందు) గనంబడుచున్న, హిమవన్తః = హిమవత్పర్వతము (మహామేరువు, వింధ్యము, సహ్యము మున్నగు గొప్పగొప్ప పర్వతము లన్నియు), యస్య = ఏపరమేశ్వరునియొక్క; మహిత్వా = గొప్పవిభూతులో, రసయా సహ = గంగాది సకలనదులతో గూడిన, సముద్రం = సముద్రమును, యస్య = ఏపరమాత్మయొక్క,

(మహిత్వా=గొప్పగొప్పవిభూతినిగా) ఆహుః=పలుకుచున్నారో, యస్య=ఏపరమాత్మకు, ఇమాః=ఈప్రాగాది దిశలు, (అవయవములో) యస్య–ఏపరమాత్మకు, ప్రదిశః = విదిక్కులు, బాహూ = బాహువులో (అట్టి పరమేశ్వరునకుఁ గాక), కస్మై=ఏ, దేవాయ = దేవునికొఱకు, హవిషా=హవిర్దానసమన్విత మగు యజ్ఞముచేత. విధేమ=మేము పరిచర్య నొనర్తుము?

తా. ఈభూమండలమునందు గనంబడుచున్న హిమవత్పర్వతము, మేరుపర్వతము, వింధ్య, సహ్యా, త్రికూట, మందరాది పర్వతములన్నియు ఏపరమేశ్వరునియొక్క మహావిభూతులయి వెలుంగు చున్నవో, పవిత్రములగు గంగా, యమునా, సరస్వతీ, గోదావరీ మున్నగు నదులును, సప్తసముద్రములును ఏపరమేశ్వరునియొక్క విభూతులయి యున్నవో, ప్రాగాది చతుర్దిక్కులు ఏపరమేశ్వరుని అవయవములయి యున్నవో, విదిక్కులు ఎవనియొక్క బాహువులో అట్టి పరమేశ్వరుని వదలి మేమిఁక నెవ్వరినిమిత్తము యజ్ఞయాగాదివిధుల ననుష్ఠింతుము? అతనినిమిత్తమే యజ్ఞయాగాది విధుల నాచరించుచున్నార మని భావము.

మం. ౫. యం క్రందసీ అవసా తస్తభానే
అభ్యైక్షేతాం మనసా రేజమానే ।
యత్రాధిసూర ఉదితో వ్యేతి
కస్మై దేవాయ హవిషా విధేమ ।

టీక. క్రందసీ = (అతివృష్టికిని, ఉరుము మెరుపులు మున్నగువానికిని ఆధారభూతములయి, ప్రలయాధారకములగుటచేత ప్రాణులయొక్క) రోదనమునకు హేతుభూతములయినట్టియు, అవసా = రక్షణహేతువగు అన్నమును కలుగఁజేయుటచేత, తస్తభానే=జీవులకు స్థితిని కలుగఁ జేయు

నవియును, రేజమానే = ప్రకాశించుచున్నవియును అగు ద్యావాపృథివ్యులు, మనసా=నిర్మలమగు మనోవృత్తిచేత, యం=ఏపరమేశ్వరుని, అభ్యైక్షేతాం= అంతట చూచుచున్నవో, యత్ర = ఏద్యావాపృథివ్యులయొక్క అంతరాళము నందు, ఉదితః = ఉత్పన్నుఁడగు, సూరః = సూర్యుఁడు, ఉదితః=ఉత్పన్నుఁడై, విభాతి = (శింశుమారచక్రమునకు నలువైపుల) పరిభ్రమించుచున్నాఁడో, (అట్టి పరమాత్మకంటె భిన్నమయిన) కస్మై = ఏ, దేవాయ = దేవునికొఱకు, హవిషా = హవిర్దానముగల యజ్ఞముచేత, విధేమ = పరిచర్య నొనర్తుము.

తా. ఈమంత్రమునందు ప్రథమమున ద్యావాపృథివ్యులు సృష్టిస్థితి లయములకు హేతుభూతములని చెప్పఁబడినది—ఎట్లనఁగా ప్రళయకాలము నందు అతివృష్టికిని, పిడుగులు మున్నగువానికిని హేతుభూతములయి సకల ప్రాణులను రోదనమును చేయించునవి గావున ద్యావాపృథివ్యులు, "క్రందసీ" యని చెప్పఁబడినవి. దీనివలన ప్రళయము నొనర్చునవి యనుట సూచితము, జగత్స్థితికి హేతుభూతమగు అన్నము ద్యావాపృథివ్యుల యాశ్రయము లేనిది ఉత్పత్తి కాఁజాలదు కావున రక్షణహేతువు లగుచున్నవి, ఉపలక్ష ణముచేత జగదుత్పత్తికిని కారణభూతములని గ్రహింపవలయును, మఱియు ఏద్యావాపృథివ్యులయొక్క మధ్యభాగమునందు సూర్యుఁడు ఉత్పన్నుఁడై శింశుమార చక్రమునకు చుట్టు పరిభ్రమించుచున్నాఁడో, అట్టి సృష్టి స్థితి లయములకు కారణభూతములగు ద్యావాపృథివ్యులు సైతము నిర్మలమనో వృత్తితో అంతట ఏపరమాత్మను గాంచుచున్నవో, అట్టి పరమేశ్వరుని వదలి మఱి ఏదేవునకు మేము హవిస్సు నొసంగఁగలము? పరమేశ్వరునకు తప్ప మఱొకనికి ఇవ్వఁజాలమని తాత్పర్యము.

మం. ౬. యేన ద్యౌ రుగ్రా పృథివీ చ దృఢే
యేన సువ స్తభితం యేన నాకః,

యో అన్తరిక్షే రజసో విమానః
కస్మై దేవాయ హవిషా విధేమ

టీక. యేన=ఏపరమాత్మచేత, ఉగ్రా=క్రూరమయిన, ద్యౌః=ఆకాశము, పృథివీచ = భూమియు, దృఢే = దృఢములుగా చేయఁబడినవో, యేన = ఏపరమాత్మచేత, సువః = ఆదిత్యమండలము, స్తభితం = అంతరిక్షమునందు నిరాధారముగా స్థాపింపఁబడినదో, యేన = ఏపరమాత్మచేత, నాకః = పుణ్యఫలోపభోగము నిమిత్తము స్వర్గలోకము నిర్మింపఁబడినదో, యః = ఏపరమాత్మ, అంతరిక్షే = భువర్లోకమునందు, రజసః = (వృష్టిరూప) జలము యొక్క, విమానః = నిర్మాణకర్తయో (అట్టి పరమాత్మను వదలి), కస్మై=ఏ, దేవాయ = దేవునికొఱకు, హవిషా=హవిర్దానముగల యజ్ఞముచేత, విధేమ= విధ్యనుష్ఠానమును సలిపెదము ?

తా. క్రూరమయిన ఆకాశము పృథివియు ఏపరమాత్మచేత దృఢములుగా నిర్మింపబడినవో, ఆకాశమునుండి పిడుగు మున్నగునవి పడి అప్పుడప్పుడు జనులకు విపత్తును కలుగఁజేయుచుండును కావున క్రూరమని చెప్పఁబడినది, దృఢముగా నిర్మింపఁబడుట యనఁగా సమస్తప్రాణులను పోషించుట కొఱకును ధరించుటకును తగియున్నవనుట, ఏపరమేశ్వరునిచేత అంతరిక్షలోకమునందు నిరాధారముగా సూర్యమండలము స్థాపింపఁబడినదో, పరమాత్మచేత స్థాపింపఁబడుటచేతనే భూమియందు పడుటలేదు, ఏపరమేశ్వరుని చేత పుణ్యఫలోపభోగార్థము స్వర్గము నిర్మింపఁబడినదో, ఏపరమేశ్వరుఁడు భువర్లోకమునందు వృష్టిరూపజలములను సృజించి లోకులను మేలొనగూర్చుచున్నాఁడో, అట్టి పరమేశ్వరునికంటె భిన్నుఁడగు మహాదేవు నుద్దేశించి మేము శ్రౌతస్మార్తకర్మల నాచరింతుము. అనఁగా పరమేశ్వరునికంటె మఱొకని మేము హవిర్దానాదికముచేత పూజించుట లేదని తాత్పర్యము.

మం. ౭. ఆపో హ యద్బృహతీర్విశ్వ మాయం
దక్షం దధానా జనయన్తీరగ్నిమ్ ।
తతో దేవానాం నిరవర్తతాసు రేకః
కస్మై దేవాయ హవిషా విధేమ ।

టీక. ఏకః = అద్వితీయుఁడైనట్టియు, దేవానాం = బ్రహ్మాదిదేవతలకు, అసుః = ప్రాణభూతుఁడైనట్టియు పరమాత్మ, యత్ = ఎప్పుడు, (జగత్తును నిర్మాణ మొనర్పవలయునని సంకల్పించెనో) తతః = పిదప, మహతీః = పూజ్యము లయినట్టియు, లేక సముద్రాది రూపముచేత గొప్పపరిమాణము గలట్టియు, ఆయం = శుభావహమైనట్టియు, దక్షం = సమస్తప్రాణి ధారణ పోషణ సమర్థమయినట్టియు, విశ్వం = ప్రపంచమును, దధానాః = ధరించు చున్నట్టియు, అగ్నిం = అగ్నిని, జనయన్తీః = పుట్టించుచున్న, ఆపః = ఉదకములను, నిరవర్తత హ = పుట్టించెనుగదా, (అట్టి పరమాత్మను వదలి) కస్మై దేవాయ = ఏదేవునికొఱకు, హవిషా = హవిస్సుగల యజ్ఞముచేత, విధేమ = మేము విధుల ననుష్ఠింతుము?

తా. అద్వితీయుఁడును బ్రహ్మాదిదేవతలకు ప్రాణమువంటివాఁడును అగు పరమేశ్వరుఁడు జగత్తును నిర్మింపవలయునని తలంచినప్పుడు వెంటనే ఉదకములను నిర్మించెను, ఆయుదకములు ఎట్టివనఁగా పూజ్యములయినవి (లేక అతి విశాలమగు సముద్రమందంతయు వ్యాపించియుండుటచేత గొప్పపరిమాణము గలవి యని యర్థము) అంతట మేలొనగూర్చు సామర్థ్యముగలట్టియు సర్వప్రాణులను పోషించుచు ధరించుచున్న జగత్తును ధరించునట్టియు, అగ్నిని పుట్టించుచున్నట్టియునని భావము, ఇట్టి మహామహిమగలవాఁడును, ప్రపంచ ధారణపోషణములకు ఆస్పదములగు జలములను సృజించిన మహామహుఁ

డును అగు ఆపరమాత్మను వదలి మఱేదేవుని హవిర్దానాదికముచేత మేము పూజింపఁగలము? అనఁగా మఱెవ్వరిని పూజింప మనియు, ఆపరమేశ్వరునే పూజింపఁగలమనియు తాత్పర్యము.

మం. ౮. య శ్చి దాపో మహినా పర్యపశ్య
ద్దక్షం దధానా జనయ న్తీ రగ్నిమ్,
యో దేవేష్వధి దేవ ఏక ఆసీ
త్కస్మై దేవాయ హవిషా విధేమ ॥

టీక. చిత్ = చిద్రూపుఁడగు, యః = ఏపరమేశ్వరుఁడు, దక్షం = శ్రౌత స్మార్తకర్మానుష్ఠాన క్షమ మగు, అగ్నిం = అగ్నిని, జనయన్తీః = పుట్టించుచున్నట్టి, ఆపః = ఉదకములను, మహినా = మహిమచేత, పర్యపశ్యత్ = సకల జగజ్జీవన సాధనముగాఁ గాంచెనో, యః = ఏపరమేశ్వరుఁడు, దేవేషు = దేవతలందు, అధి = అధికుఁడగు, ఏకః = ఒక్కఁడగు, దేవః = దేవుఁడు, ఆసీత్ = ఆయెనో, (అట్టి పరమేశ్వరుని వినాగా) కస్మైదేవాయ = మఱేదేవుని కొఱకు, హవిషా = హవిస్సుగల యజ్ఞాదికముచేత, విధేమ = విధుల ననుష్ఠింతుము?

తా. చిద్రూపుఁడగు ఏపరమాత్మ, శ్రౌతస్మార్త కర్మానుష్ఠానక్షమమగు అగ్నిని పుట్టించుచున్నట్టి ఏజలమును మహిమచేత సకలప్రాణులజీవనమునందు సాధనభూతములయిన వని ఎఱుంగునో, ఎవఁడు సమస్తదేవతలలోపల తా నొకఁడే అధికుఁడయిన వాఁడుగా అయియున్నాఁడో, అట్టి పరమాత్మను వినాగా మఱేదేవునిగుఱించి శ్రౌతస్మార్తకర్మల ననుష్ఠింపఁగలము? ఆపరమేశ్వరుని గూర్చియే సకలశ్రౌతస్మార్త కర్మల ననుష్ఠించు చున్నారమని భావము. సముద్రజలాభ్యంతరమునందు బడబాగ్నియుండుటచేత "అగ్నిం

జుయంతీః" అని చెప్పుటయుక్తమే గదా, సప్తపాకయజ్ఞములను, సప్త హవిర్యజ్ఞములను, సప్తసోమసంస్థలను, వాపీకూపతటాకాది నిర్మాణమును, గోదాన భూదానాదికమును అనుష్ఠించి తత్ఫలమును పరమేశ్వరునకే సమర్పించెదము, ఇతరులకు సమర్పింపము అని భావము.

మం. ఏష హి దేవః ప్రదిశో௨ను సర్వాః
పూర్వో హి జాత స్సఉ గర్భే అన్తః ।
స విజాయమాన స్స జనిష్యమాణః
ప్రత్యఙ్ముఖా స్తిష్ఠతి విశ్వతో ముఖః ॥౧౪॥

మం. విశ్వత శ్చక్షు రుత విశ్వతో ముఖో
విశ్వతో హస్త ఉత విశ్వతస్పాత్ ।
సం బాహుభ్యాం నమతి సంపతత్రై
ర్ద్యావా పృథివీ జనయ న్దేవ ఏకః ॥౧౫॥

టీక. ఏషః = ఈ, దేవః = స్వప్రకాశుఁడగు పరమాత్మ, సర్వాః ప్రదిశః = ప్రాగాదిదిక్కులను అన్నింటిని, అను = ప్రవేశించియున్నాఁడు, హి = ఈవిషయము సుప్రసిద్ధము, పూర్వః జాతఃహి = హిరణ్యగర్భరూపముచేత ప్రథముఁడై పుట్టెను గదా, సః ఉ = ఆపరమేశ్వరుఁడే, గర్భే అంతః = బ్రహ్మాండరూప మగు గర్భముయొక్క మధ్యభాగమునందు (ఉంటున్నాఁడు). సః = అతఁడే, విజాయమానః = దేవతిర్యగాదిరూపముచేత ఇప్పుడు పుట్టుచున్నాఁడు, సః ఉ = అతఁడే, జనిష్యమాణః = ఇఁకమీఁద పుట్టఁగలవాఁడును, ప్రత్యఙ్ = అన్నమయాది కోశములకంటె విలక్షణుఁడైనవాఁడును,

ముఖాః = దేహేంద్రియములకు అధ్యక్షుండగుటవలన ముఖ్యుండును అగుచున్నాండు, విశ్వతోముఖః = అంతట ముఖములుగలవాండై (జగదధిష్ఠానముగా), తిష్ఠతి = ఉంటున్నాండు. ౧౪.

సః = ఆపరమేశ్వరుండు, విశ్వతః చక్షుః = అంతట నేత్రములుగలవాండు, ఉత = మఱియు, విశ్వతోముఖః = అంతట ముఖములు గలవాండు, విశ్వతోహస్తః = అంతట హస్తములు గలవాండు, ఉత = మఱియు, విశ్వతస్పాత్ = అంతట పాదములు గలవాండు, (సః=ఆపరమేశ్వరుండు) బాహుభ్యాం = బాహుసదృశము లగు ధర్మాధర్మము లను నిమిత్తకారణములచేత, సం నమతి = జగమునంతయు లోంబఱచుకొనుచున్నాండు, పతత్రైః = పతనశీలములగు పంచీకృత పంచమహాభూతములచేత, సం నమతి = జగమునంతయు సృజించుచున్నాండు, (ఈవిధముగా) ద్యావాపృథివీ = భూమ్యాకాశములను, జనయన్ = పుట్టించుచు, ఏకః = ఒక్కండే (అయియున్నాండు).

తా. హిరణ్యగర్భాదులు పరమాత్మకు ఏవిధముగా ఉపలక్షక లగుచున్నారో అట్లే ఆ పరమాత్మచేత సృజింపబడిన దిగాదికము సైతము పరమాత్మోపలక్షక మనువిషయమును రెండు మంత్రములచేత చెప్పుచున్నాండు:- విద్వాంసులగు వారలకు అనుభవమందున్న స్వప్రకాశుండగు పరమాత్మ ప్రాగాది దిక్కులను, ఆగ్నేయాది విదిక్కులను ప్రవేశించియున్నాండు, ఈ విషయము శ్రుతిప్రసిద్ధము, ఆపరమేశ్వరుండు బ్రహ్మాండమధ్యభాగమునందున్నాండు, అతండే దేవతిర్యగాదిరూపములచేత నిప్పుడు జన్మించుచున్నాండు, ఇంక జన్మింపంబోవునదియు ఆపరమాత్మయే, అతండు అన్నమయాది కోశపంచకము కంటె భిన్నమైనవాండు, దేహేంద్రియములకు అధ్యక్షుండు కావున ముఖ్యుండు, అంతట ముఖములు అనంగా రూపాద్యుపలబ్ధిద్వారములగు చక్షురాదీంద్రియములు గలవాండు, అట్టి పరమాత్మ జగదధిష్ఠానభూతుండై యున్నాండు. ౧౪. ఆపరమాత్మనే భంగ్యంతరముగా

విశేషించి చెప్పుచున్నాఁడు:—అపరమాత్మ బ్రహ్మాండరూపదేహముగలవాఁడు కావున ప్రాణులందఱు అతని దేహస్వరూపభూతు లగుచున్నారు, అప్పుడు ఆ బ్రహ్మాండాంతర్భూతు లగు జనులయొక్క చక్షురాద్యవయవములతోఁ గూడుకొన్నవాఁడని ఈ మంత్రమునందుగల "విశ్వతశ్చక్షువు, విశ్వతో ముఖుఁడు, విశ్వతోహస్తుఁడు, విశ్వతస్పాత్తు" అను పదములకు తాత్పర్యము, ఆయాలోకములందున్న ప్రాణులయొక్క నేత్రములు అచ్చటచ్చటనే యున్నను ఈ పరమాత్మసంబంధములయినవి అగును కావున "విశ్వత శ్చక్షువు" అగుచున్నాఁడు, విశ్వతోముఖత్వమును, విశ్వతోహస్తత్వమును, విశ్వతస్పాత్త్వమును, పైవిధముగానే గ్రహించవలయును, అపరమేశ్వరుఁడు హస్తసదృశములగు ధర్మాధర్మనిమిత్తకారణములచేత జగమునంతయు వశ పఱచుకొనుచున్నాడు, ఇట్లే పంచీకృతములగు పంచమహాభూతములచేత జగమును సృజించుచున్నాఁడు, ఇట్లే ద్యావాపృథ్వ్యులరెంటిని పుట్టించుచు తా నొక్కఁడై వెలయుచున్నాఁడు.

అవ. పైనచెప్పినవిషయమునందు శ్రద్ధాతిశయము కలుగుటకయి మంత్రద్వయముచేత గంధర్వవృత్తాంతము చెప్పఁబడుచున్నది:—

మం. వేన స్తత్పశ్య న్విశ్వా భువనాని విద్వాన్
యత్ర విశ్వం భవత్యేకనీళమ్ ।
యస్మి న్నిదగ్ం సంచ వి చైకగ్ం
స ఓతః ప్రోతశ్చ విభుః ప్రజాసు ॥

మం. ప్ర త ద్వోచే అమృతం ను విద్వా
న్గన్ధర్వో నామ నిహితంగుహాసు ॥3॥

త్రీణి పదా నిహితా గుహాసు
యస్తద్వేద సవితుః పితాసత్ ॥

టీక. యత్ర=ఏపరమాత్మయందు, విశ్వం = జగత్తు, ఏకనీళంభవతి= ఏకత్వమును పొందినదిగా అగుచున్నదో, తత్ =అట్టిపరమాత్మభూత వస్తువును, పశ్యన్ =గురుశాస్త్రప్రసాదముచేత చూచుచున్నవాఁడై, విశ్వా భువనాని= సమస్తలోకములను, విద్వాన్ = ఎఱింగియున్నట్టియు, యస్మిన్ = ఏపర మాత్మయందు, ఇదం = ఈప్రపంచము, సంచ విచ ఏతి = స్వయముగా పుట్టి విలీనమగుచున్నదో, ఏకః = ఒక్కఁడగు, సః=ఆపరమాత్మయే, విభుః= వ్యాపించినవాఁడై, ప్రజాసు=ప్రజలయందు, ఓతః ప్రోతః చ=ఓతప్రోత ముగా నున్నాఁడో.

గుహాసు = ప్రాణులయొక్క 'బుద్ధిగుహలయందు, త్రీణి = మూఁ డైన, పదా=జాగ్రత్ స్వప్నసుషుప్తిస్థానములు, నిహితా = అవస్థితములై యున్నవో, తత్ =ఆజాగరాద్యధిష్ఠానభూత మగువస్తువును, యః=ఏగంధ ర్వుఁడు, వేద = తెలిసికొనినాఁడో, (సః=ఆగంధర్వుఁడు), సవితుః=తనకు జనకుఁడగువానికి (సైతము), పితా సత్ = జనకుఁడగుచున్నాఁడు, (అట్టి) వేనః నామ = వేనుఁడను పేరుగల గంధర్వుఁడు, గుహాసు = సర్వప్రాణుల యొక్క బుద్ధిగుహలయందు, నిహితం = ఉన్నట్టియు, అమృతం = నాశ రహితమైనట్టియు, తత్ = ఆవస్తువును, విద్వాన్ = (స్వానుభవముచేత) తెలిసికొనినవాఁడై, ప్రవోచే ను=(తనశిష్యులకొఱకు) చెప్పెనుగదా.

తా. వేనుఁడను పేరుగల గంధర్వుఁడు సర్వప్రాణిజాతముయొక్క బుద్ధిగుహయందున్నట్టి నాశరహితమయినట్టియు వస్తువును స్వానుభవముచేత తెలిసికొనినవాఁడై తనశిష్యుల కుపదేశించెను, ఆవేనుఁడను గంధర్వుఁ డెట్టివాఁ డనఁగా ఏపరమాత్మయను వస్తువునందే ఈగనంబడు ప్రపంచమంతయు ఏక

త్వముగానుండి తదాత్మకమే యగుచున్నదో అట్టివస్తువును గురుశాస్త్రానుగ్రహముచేత సాక్షాత్కారమును చేసికొన్నవాఁడై సకలలోకముల నెఱింగి యున్నవాఁడు, ఆత్మసాక్షాత్కారము కలిగిన పిదప జగత్తంతయు తదాత్మకమే యను బోధ కలుగునుగదా, వేనిచేత కనుఁగొనఁబడిన పరమాత్మ మఱియు నెట్టివాఁడనఁగా, ఈజగమంతయు అతనియందే పుట్టి మఱియు అతనియందే లీనమగుచున్నది, అతఁ డొక్కఁడే ఈప్రజలయందు వస్త్రమునందు తంతువు ఓతప్రోతమై యున్నట్టుల నున్నాఁడు, ప్రాణులయొక్క బుద్ధిగుహాయందు జాగ్రత్తు స్వప్నము సుషుప్తియను ఏమూఁడుస్థానములు గలవో అట్టిజాగ్రదాదికమునకు అధిష్ఠానభూతుఁడగు ఆపరమాత్మ నెఱింగినవాఁడు తనకు కారణభూతుఁడైనవానికికూడ అనఁగా తనతండ్రికి కూడ తానే తండ్రియగుచున్నాఁడు.

తండ్రిపుత్రునియొక్క దేహమును మాత్రము సృజించుచున్నాఁడు, బ్రహ్మతత్త్వము నెఱింగినవారలన్ననో పరమాత్మస్వరూపులే కావున వారే సర్వజగదుత్పాదకు లగుచున్నారు, సర్వజగదుత్పాదకు లయినప్పుడు జగదంతర్గతుఁడగు స్వజనకునకు సైతము సముత్పాదకుఁ డగును. ఈవిషయమునే. "య స్తం విజానా త్స పితుః పితాసత్" అనుశ్రుత్యంతరము.

మం. స నో బన్ధు ర్జనితా స విధాతా
ధామాని వేద భువనాని విశ్వా ।
యత్ర దేవా అమృత మానశానా
స్తృతీయే ధామాన్యభ్యైరయన్త ॥

మం. పరి ద్యావాపృథివీ యన్తి సద్యః
పరి లోకా న్పరి దిశః పరిసువః ।

ఋతస్య తన్తుం వితతం విచృత్య
తదపశ్యత్తదభవత్ప్రజాసు

టీక. సః = ఆపరమాత్మ, నః=మాకందఱకు, బంధుః=బంధువు, జనితా= ఉత్పాదకుఁడు, సః = ఆపరమాత్మ, విధాతా = జగన్నిర్మాతయై, విశ్వా భువనాని = (ఉత్తమాధమ) లోకముల నన్నిటిని, ధామాని = అచ్చట యోగ్యములగు దేవతాస్థానములను, వేద = ఎఱింగియున్నాఁడు, (మఱియు) యత్ర = ఏ, తృతీయే = మూఁడవలోకమునందు, దేవాః = దేవతలు, అమృతం = అమృతమును, ఆనశానాః = పానము చేయుచున్న వారలయి, ధామాని=స్వస్థానములను, అధ్యైరయంత = పొందిరో.

(తర్వాత అచట ముముక్షువులు తత్త్వము నెఱింగినవారలయి) ద్యావాపృథివీ = భూమ్యాకాశములను లోకద్వయమును, సద్యః = వెంటనే, పరియన్తి = పొందుచున్నారు, లోకాన్ = అంతరిక్షాది లోకములను, పరి (యన్తి) = పొందుచున్నారు, దిశః = ప్రాగాది దిక్కులను, పరియన్తి=పొందుచున్నారు, సువః = స్వర్లోకభోగమును, పరియంతి = పొందుచున్నారు, ఋతస్య = పరమాత్మయొక్క, తంతు = విచ్ఛేదరహితమయిన స్థితిని, వితతం= విస్తీర్ణముగా, విచృత్య = (గురుశాస్త్రముఖముగా) నిశ్చయించుకొని, తత్ = ఆపరబ్రహ్మమును, అపశ్యత్ = (ఎవ్వఁడు) గాంచునో, (వాఁడు) ప్రజాసు = ప్రజలలోపల, తత్ = ఆబ్రహ్మతత్త్వము, అభవత్ = ఆయెను.

తా. (ఆపరమేశ్వరుఁడు వ్యవహారకాలమునందు సర్వప్రాణులకు ఉపకారకుఁడగుచున్నాఁ డనియు, పరమేశ్వరునే దర్శించునట్టి వానికి ముక్తిప్రదుఁ డగుచున్నాఁడనియును అను ఈవిషయమును ఈమంత్రద్వయము ప్రతిపాదించుచున్నది:—)ఆపరమేశ్వరుఁడే మాకందఱకు బంధువు, మేము సలిపిన సుకృతము ననుసరించి హితము కలుగఁజేయును కావున బంధువగు

చున్నాఁడు. భోక్త కావున ఉత్పాదకుఁ డగుచున్నాఁడు. అతఁడే జగన్నిర్మాతయై ఉత్తమాధమలోకములను ఆ యా లోకములందుండు దేవాదులయొక్క స్థానములను ఎఱుంగుచున్నాఁడు. ఏతృతీయలోకము నందు ఇంద్రాదిదేవతలు అమృతమును సేవించి తమతమపదవులను పొందిరో, అది అంతయు నెఱింగి, వారువారు సలిపిన కామ్యకర్మల ననుసరించి ఫలము నిచ్చుచున్నాఁడు, అనఁగా ముముక్షువు లాదటు విదితతత్త్వులయి ద్యావాపృథివీలోకములను వెంటనే పొందుచున్నారు, బంధమోక్షములను పొందుచున్నారని యర్థము, అంతరిక్షాదిలోకములను పొందుచున్నాను, ప్రాగాది దిక్కులను పొందుచున్నారు, స్వర్గలోకభోగమును పొందుచున్నారు. సర్వాత్మకుఁడు కావున అంతట వ్యాపించుట ఉపపన్నమే యగును. పరమాత్మయొక్క అవిచ్ఛేదమయిన అవస్థితిని చక్కఁగా గురుశాస్త్రముఖముగా నిశ్చయించుకొని ఆపరబ్రహ్మతత్త్వముయొక్క సాక్షాత్కారమును పొందినవాఁడు ప్రజలలోపల ఆ బ్రహ్మతత్త్వమే తా నగును. ఇదే విషయము నీక్రింది శ్రుతి బోధించుచున్నది:—

శ్రు. 'బ్రహ్మవి ద్బ్రహ్మైవ భవతి.'

అర్థ. (బ్రహ్మవేత్త బ్రహ్మమే అగుచున్నాఁడు.)

మం. పరీత్య లోకా న్పరీత్య భూతాని
పరీత్య సర్వాః ప్రదిశో దిశశ్చ ।
ప్రజాపతిః ప్రథమజా ఋతస్యా
త్మనాఽఽత్మాన మభిసంబభూవ ।

టీక. ఋతస్య = పరమాత్మయొక్క, ప్రథమజాః = ప్రథమకార్యభూతుఁడగు, ప్రజాపతిః = హిరణ్యగర్భుఁడు, లోకాన్ = భూరాదిలోక

ములను, పరీత్య = అంతట వ్యాపించి. భూతాని = దేవమనుష్యాది ప్రాణి దేహములను, పరీత్య=అంతట వ్యాపించి, ప్రదిశః = ఆగ్నేయాది దిక్కులను, దిశశ్చ=ప్రాగాదిదిక్కులను, సర్వాః = అన్నింటిని, పరీత్య=అంతట వ్యాపించి, ఆత్మనా=స్వస్వరూపముచేత, ఆత్మానం = సత్యజ్ఞానాది లక్షణుఁడగు పరమాత్మను, అభిసంబభూవ = అంతట పొందెను.

తా. ("అంభస్యపారే" అను ప్రథమమంత్రము మొదలుకొని ఇంతవఱకు చెప్పిన బ్రహ్మవిద్య నుపసంహారముచేయుటకు గాను ఈమంత్రము చెప్పఁబడుచున్నది):—

పరమాత్మచేత ప్రథమమున సృజింపఁబడిన హిరణ్యగర్భుఁడు భూరాది లోకములను, దేవమనుష్యాది ప్రాణుల దేహములను, ప్రాగాది దిశలను, ఆగ్నేయాది విదిశలను సృష్టికాలమునందు సృజించి, స్థితికాలమునందు సంరక్షించి స్వస్వరూప పరిజ్ఞానముచేత సత్యజ్ఞానానందలక్షణమయిన తనను అంతట పొందెను.

ఇంతవఱకు బ్రహ్మవిద్య ప్రతిపాదింపఁబడినది.

కర్మకాండము.

అవ. సోపాధికుఁడు అగు బ్రహ్మమును ఎఱుంగుటకు సాధనభూతములగు స్నానసంధ్యాజపాదికర్మలకు ఆవశ్యకము లగు మంత్రములు పూర్వము చెప్పఁబడనివి ఈఖిలకాండయందు చెప్పఁబడుచున్నవి:—

ప్రకృతము బ్రహ్మప్రాప్తి కయి అంతర్యామిప్రార్థనము చెప్పఁబడుచున్నది.

మం. సదసస్పతి మద్భుతం ప్రియ మిన్ద్రస్య కామ్యమ్।
సనిం మేధా మయాసిషమ్ ॥

టీక. అద్భుతం = ఆశ్చర్యరూపుఁడును, ఇంద్రస్య = దేవరాజగు ఇంద్రునకును, ప్రియం=ప్రియుఁడైన వాఁడును, (కావుననే) కామ్యం = (అందఱిచేత) అపేక్షణీయుఁడును, సనిం=కర్మఫలప్రదాతయును, మేధాం= ధారణాశక్తిని, (ప్రయచ్ఛంతం = ఇచ్చువాఁడును అగు,) సదసస్పతిం = సదసస్పతిని, అయాసిషం = నేను పొందితిని.

తా. అవ్యాకృత మగు కారణమునందు జగమంతయు ఉండును కావున సదస్సనిచెప్పఁబడును. "సీదత్యస్మి న్నవ్యాకృతే కారణే సర్వం జగదితి సదః" అని సదశ్శబ్దవ్యుత్పత్తి. అట్టి సదస్సునకు అంతర్యామి రూపముచేత పాలకుఁడైన వాఁడును, ఆశ్చర్యరూపుఁడును, మనస్సుచేతఁగూడ తలంచుటకు శక్యముకాని రచనగల జగత్తును అనాయాసముగ నిర్మించుచున్నాఁడు కావున ఆశ్చర్యరూపుఁ డనుట, ఇంద్రునకుకూడ ప్రియుఁడైన వాఁడును, ఇంద్రుఁడును అంతర్యామి నెప్పుడు పొందుదునా అని కోరుచున్నాడని భావము. ఇంద్రుఁడే ఇట్టి అభిలాష కలిగియున్నప్పుడు ఇతరు లందఱు తప్పక అతనియందు అభిలాష కలిగియుందురు కావున అందఱకు అపేక్షణీయుఁడును, కర్మఫల ప్రదాతయు, మేధను ఇచ్చువాఁడును, మేధ యనఁగా ఉపనిషదాదిగ్రంథములను పఠించిన పిదప తదర్థము మరువకుండా ధారణను చేసుకొను నట్టి శక్తి, అట్టి పరమాత్మను పొందితిని. ఇచ్చట పొందితిని అని భూతకాలమును చెప్పుటకు తాత్పర్య మేమనఁగా శీఘ్రముగా పొందితి నని తెలుపుట కని తెలిసికోవలయును.

అవ. అగ్న్యుపాధిగల పరమేశ్వరుని అభీష్టప్రాప్తికై ప్రార్థించుచున్నాఁడు:—

మం. ఉద్దీప్యస్వ జాతవేదో ఽపఘ్నన్నిరృతిం మమ ।
పశూగ్ంశ్చ మహ్య మావహ జీవనం చ దిశో దిశ ।

టీక. జాతవేదః = ప్రాణులశరీరమునందు జాఠరాగ్నిరూపముతో యున్న ఓయగ్నీ! మమ = నాయొక్క, నిరృతిం = పాపమును, అపఘ్నన్ = పోఁగొట్టుచున్నవాఁడవై, ఉద్దీప్యస్వ = ప్రకాశించుము, మహ్యం = నాకొఱకు, పశూంశ్చ = పశువులు మున్నగు భోగ్యజాతమును, జీవనంచ = దీర్ఘాయుస్సును, ఆవహ = సంపాదించుము, దిశః = నివాసయోగ్యములగు ఆయాదిం స్థానములను, దిశ = ఇమ్ము.

తా. ప్రాణులశరీరములందు జఠరాగ్నిరూపమున నుండునట్టి ఓయగ్నీ! నాకు చెరుపును చేయునట్టి పాపదేవతను నాశన మొనర్చుచు, నాయను గ్రహార్థము ప్రజ్వలించుము. నాపాపమును నాశనమొనర్చిన పిదప గవాశ్వాదికమును దీర్ఘాయుస్సును ఇతరమగు భోగ్యపదార్థసమూహమునంతయు సంపాదించి ఇవ్వుము, పిదప సుఖముగా నివసించుటకు యోగ్య మగు ప్రదేశమును ఇమ్ము.

అవ. సంపాదించిన ఐశ్వర్యమును వినాశరహితముఁగ చేయుమని అగ్నినే ప్రార్థించుచున్నాఁడు:—

మం. మా నో హిగ్ంసీ జ్జాతవేదో గామశ్వం పురుషంజగత్ ।
అబిభ్రదగ్న ఆగహి శ్రియా మా పరిపాతయ ॥

చ టీక. జాతవేదః = ఓ జాతవేదుఁడా! నః = మాయొక్క, గాం=గోవులను, అశ్వాం = అశ్వములను, పురుషం = పురుషులను, జగత్ = గవాశ్వపురుషవ్యతిరిక్త గృహక్షేత్రాదికమును, మా హింసీత్ = హింసింపకుము, అగ్నే = ఓయగ్నీ! అబిభ్రత్ = (మేమేమియైన అపరాధమును చేసియుంటిమేని దానిని హృదయమునందు) ధరింపనివాఁడవై, ఆగహి = రమ్ము, మా = నన్ను, శ్రియా = ధనధాన్యాది సంపదచేత, పరిపాతయ = అంతట పొందింపుము.

తా. జాతవేదశ్శబ్దవాచ్యుఁడవగు నోయగ్నీ! మాసంబంధ మగు గవాశ్వాది జంతుజాలమును గాని, గృహక్షేత్రాదికమును గాని, మనుష్యులనుగాని హింసింపకుము. మేమేదేని యపరాధమును చేసియుంటిమేని దానిని హృదయమందు పెట్టుకొనవలదు, మాసమీపమునకు రమ్ము, మాకు నలువైపుల ధనధాన్యాదిసంపదలను కలుగఁజేయుము.

అవ. ఇఁక ౧౨ గాయత్రీమంత్రములచేత బ్రహ్మ సాక్షాత్కారమునకు ద్వారభూతులగు ఆయా దేవతలను ముముక్షువు ప్రార్థించుచున్నాఁడు, ప్రథమమున విశ్వరూపధరుఁడగు మహాదేవుని ప్రార్థించుచున్నాఁడు:—

మం. ౧. పురుషస్య విద్మ సహస్రాక్షస్య మహాదేవస్య ధీమహి।
తన్నో రుద్రః ప్రచోదయాత్ ॥

టీక. సహస్రాక్షస్య = అనేకనేత్రములు గల, పురుషస్య = పురుషుని యొక్క (స్వరూపమును), విద్మ = తెలిసికొనుచున్నారము, మహాదేవస్య = ఆమహాదేవునియొక్క (స్వరూపమును), ధీమహి = ధ్యానము చేసెదము, తత్ = ఆధ్యానమునందు, నః = మమ్ములను, రుద్రః = విరాడ్రూపుఁడగు మహాదేవుఁడు, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁగాక.

తా. "విశ్వత శ్చక్షు రుత విశ్వతో ముఖః" అను మంత్రమునందు చెప్పఁబడిన విరాట్పురుషుఁడే ఇచట పురుషుఁడు, అతఁడు సహస్రాక్షుఁ డనుటకు ఉపపత్తియు విరాడ్రూపమగుటచేతనే సిద్ధించుచున్నది, అట్టి పురుషుని స్వరూపమును మేము తెలిసికొనుటకుఁగాను ఆపురుషుని స్వరూపమును ధ్యానించుచున్నారము, అతని ధ్యానమునందు విరాడ్రూపుఁ డగు మహాదేవుఁడు మాబుద్ధిని ప్రేరేపించుఁగాక.

మం. 2 త త్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి।
తన్నో రుద్రః ప్రచోదయాత్ ॥

టీక. (ఈతత్తద్దేవతాగాయత్రీ మంత్రములందు లింగము, విభక్తి మున్నగువానియొక్క వ్యత్యాసము తఱుచుగా నుండు నని భాష్యకారులు వ్రాసియున్నారు, కావున మేము భాష్యానుసారము అర్థమువ్రాయుచున్నార మని పాఠకులు గ్రహించెదరుగాక.) తం = ఆసుప్రసిద్ధుఁడగు, పురుషాయ పురుషుని, విద్మహే = తెలిసికొనియెదము, మహాదేవాయ = మహాదేవుని, ధీమహి = ధ్యానముచేసెదము, తత్ = ఆధ్యానమునందు, రుద్రః=రుద్రుఁడు, నః = మమ్ములను, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁగాక.

తా. ఆగమసుప్రసిద్ధుఁ డగు ఆమహాపురుషుని ఎఱుంగుటకయి అతనిని ధ్యానించెదము, అతని ధ్యానమునందు మమ్ములను మహాదేవుఁడగు రుద్రుఁడు ప్రేరేపించుఁగాక.

మం. 3. తత్పురుషాయ విద్మహే వక్రతుణ్డాయ ధీమహి।
తన్నో దన్తిః ప్రచోదయాత్ ॥

టీక. తత్ = ఆ, పురుషాయ = పురుషుని, విద్మహే = తెలిసికొను

చున్నారము, వక్రతుండాయ = వంకరయిన తుండము గలవానిని, ధీమహి= ధ్యానించుచున్నారము, తత్=ఆధ్యానమునందు, నః=మమ్ములను, దంతిః = మహాదంతముగల దేవుఁడు, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁగాక.

తా. ఈమంత్రము 'బీజాపూర గదేషు కార్ముక' అను ధ్యానశ్లోకము గల వినాయకుని వర్ణించునది:— ఆగమప్రసిద్ధుఁడగు ఆమహాపురుషుని తెలిసికొని ఆవక్రతుండుని ధ్యానము చేసెదము, వినాయకుఁడు గజముఖుఁడు కావున దీర్ఘమయిన తుండము రత్నకలశాదికము ధరించు నిమిత్తము వక్రమైనదని తాత్పర్యము, అట్టి మహాదంతముగల దేవుఁడు మాబుద్ధులను ప్రేరేపించుఁగాక.

మం. ౪. తత్పురుషాయ విద్మహే చక్రతుణ్డాయ ధీమహి।
తన్నో నందిః ప్రచోదయాత్ ॥

టీక. తత్ = (పరమశివ వాహనమగుటచేత) సుప్రసిద్ధమయినటువంటిన్ని, పురుషాయ = (కామరూపి యగుటచేత స్వేచ్ఛగా ధరింపఁబడిన పురుషవేషము గల (నన్దికేశ్వరుని), విద్మహే = తెలిసికొనియెదము, చక్రతుండాయ = చక్రమువలె ఉన్నతుండముగల అతనిని, ధీమహి=ధ్యానించెదము, తత్ = ఆధ్యానమునందు, నః=మమ్ములను, నందిః=నందికేశ్వరుఁడు, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁ గాక.

తా. పరమశివుని వాహనస్వరూపుఁడును, కామరూపి యగుటచేత ఒకప్పుడు తన వృషభాకారమును పరిత్యజించి దివ్యమంగళపురుషవిగ్రహమును ధరించినవాఁడును అగు నందికేశ్వరుని స్వరూపమును తెలిసికొనియెదము, చక్రమువంటి తుండము గల ఆ నందికేశ్వరుని ధ్యానించెదము, అనఁగా విష్ణుమూర్తియొక్క చక్రాయుధము బలదర్పితు లగు దుష్టులను

రాక్షసులను ఎటుల నిర్మూలన మొనర్చునో, అట్లే ఈశ్వరుఁడు రాక్షసులను సంహరించు సమయమునందు ఆనందీశ్వరు నధిష్ఠించి దుష్టులగు రాక్షసులను సంహరించు నని తాత్పర్యము. అట్టి నందికేశ్వరుఁడు మాకా దేవతా ధ్యానమునందు బుద్ధినిఁ కలుగఁజేయుఁగాక.

మం. ౫. తత్పురుషాయ విద్మహే మహాసేనాయ ధీమహి
తన్నష్షణ్ముఖః ప్రచోదయాత్ ॥

టీక. తత్ = ఆసుప్రసిద్ధుఁడగు, పురుషం = అంతట పూర్ణుఁడై యుండు కుమారస్వామిని, విద్మహే= తెలిసికొనుచున్నారము, మహాసేనాయ= గొప్పసేనలుగల ఆ కుమారస్వామిని, ధీమహి = ధ్యానించెదము, షణ్ముఖః= కుమారస్వామి, నః=మమ్ములను, తత్ =ఆధ్యానమునందు, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁగాక.

తా. సర్వాంతర్యామియై అంతట నిండియున్న ఆ కుమారస్వామిని మేమెఱుంగుచున్నారము, అతనిని ధ్యానించుచున్నారము, మాకట్టి ధ్యానమునందు ఆ కుమారస్వామి మాబుద్ధులను ప్రేరేపించుఁగాక.

మం. ౬. తత్పురుషాయ విద్మహే సువర్ణపక్షాయ ధీమహి
తన్నో గరుడః ప్రచోదయాత్ ॥

టీక. తత్ =ఆ, పురుషాయ = పురుషుని, విద్మహే = తెలిసికొనుచున్నారము, సువర్ణపక్షాయ=బంగారు రెక్కలుగల ఆగరుడుని, ధీమహి= ధ్యానమొనర్చెదము, తత్ = ఆధ్యానమునందు, నః=మమ్ములను, గరుడః= గరుడుఁడు, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁగాక.

తా. ఆసుప్రసిద్ధుఁడును, పురుషశబ్దవాచ్యుఁడును అగు గరుడుని

ఎటువంటి సువర్ణపక్షములుగల అతనిమూర్తిని ధ్యానించుచున్నారము, మాకట్టి ధ్యానమునందు బుద్ధిని గరుడుఁడు ప్రేరేపించుఁగాక.

మం. ౭. వేదాత్మనాయ విద్మహే హిరణ్యగర్భాయ ధీమహి ।
తన్నో బ్రహ్మ ప్రచోదయాత్ ॥

టీక. వేదాత్మనాయ = వేదాత్మకుఁడగు (బ్రహ్మదేవుని), విద్మహే = తెలిసికొను చున్నారము, హిరణ్యగర్భాయ = చతుర్ముఖబ్రహ్మస్వరూపుఁ డగు అతనిని, ధీమహి = ధ్యానించెదము, బ్రహ్మ = బ్రహ్మదేవుఁడు, నః = మాబుద్ధులను; తత్ = ఆధ్యానమునందు, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁగాక.

తా. ఏవేదము మాకు పుణ్యపాపకర్మల వివేకమును తెలుపుచున్నదో అట్టి వేదమును మేము గురుకులవాసము మున్నగు నవి సలిపి తెలుసుకొను చున్నారము, బ్రహ్మ వేదస్వరూపుఁడు, బహువిధ శాఖాభేదములుగల వేదములన్నియు అతని స్వరూపమే యని తాత్పర్యము, మఱియు హిరణ్యగర్భస్వరూపుఁడు, (ఇచట వేద హిరణ్యగర్భ స్వరూపము ఉపలక్షకము కావున సర్వాత్మకుఁ డని ఎఱుఁగవలయును.) అట్టి బ్రహ్మము మమ్ములను ధ్యానమునందు ప్రేరేపించుఁగాక యని తాత్పర్యము.

మం. ౮. నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి ।
తన్నో విష్ణుః ప్రచోదయాత్ ॥

టీక. నారాయణాయ = నారాయణుని, విద్మహే = తెలుసుకొను చున్నారము, వాసుదేవాయ = వాసుదేవుని, ధీమహి = ధ్యానించెదము, తత్ = ఆధ్యానమునందు, నః=మమ్ములను, విష్ణుః=విష్ణువు, ప్రచోదయాత్= ప్రేరేపించుఁగాక.

తా. నారాయణశబ్దార్థము:—నార మనఁగా నరసమూహము, భక్త లగు అట్టి నరసమూహమే అయన మనఁగా ఆధారముగాఁగలవాఁడు నారాయణుఁడు; వాసుదేవుఁడనఁగా వసుదేవునిపుత్త్రుఁడు; ఇట్టి విశేషణములు గల విష్ణువు మమ్ములను ధ్యానమునందు ప్రేరేపించుఁగాక.

మం. ౯. వజ్రనఖాయ విద్మహే తీక్ష్ణదగ్గంష్ట్రాయ ధీమహి।
తన్నో నారసిగ్ంహః ప్రచోదయాత్ ॥

టీక. వజ్రనఖాయ = వజ్రనఖుఁడగు (నరసింహదేవుని), విద్మహే = తెలిసికొనుచున్నారము, తీక్ష్ణదంష్ట్రాయ = తీక్ష్ణమయిన కోరలుగల నరసింహుని, ధీమహి = ధ్యానించుచున్నారము, తత్ = ఆధ్యానమునందు, నారసింహః = నరసింహమూర్తి, నః = మమ్ములను, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁగాక.

తా. ఆకస్మికముగ ఉక్కు స్తంభముచుండి నరసింహావతారరూపములో అవతరించి, తనగోళ్లతో హిరణ్యకశిపుని జఠరమును వ్రయ్యలు చేసి, వాని ప్రేగులను యజ్ఞోపవీతముగా ధరించిన నరసింహమూర్తి వజ్రనఖములను తీక్ష్ణదంష్ట్రలును కలిగి యుండుట యుక్తమేగదా, అట్టి నరసింహమూర్తి మమ్ములను ఆధ్యానమునందు ప్రేరేపించుఁగాక యని తాత్పర్యము.

మం. ౧౦. భాస్కరాయ విద్మహే మహద్ద్యుతికరాయ ధీమహి
తన్నో ఆదిత్యః ప్రచోదయాత్ ॥

టీక. భాస్కరాయ = భూలోకమును ప్రకాశింపఁజేయువాని విద్మహే = తెలిసికొనుచున్నారము, మహద్ద్యుతికరాయ = త్రిలోకగోచరమగు కాంతిగల (ఆసూర్యుని) ధ్యానించుచున్నారము, ఆదిత్యః = సూర్యుఁడు తత్ = ఆధ్యానమునందు, నః = మమ్ములను, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁగాక

తా. భూలోక ప్రకాశకుఁడగు సూర్యుని తెలిసికొనుచున్నారము, త్రిలోకప్రకాశక మగు తేజస్సు గల ఆతనిని ధ్యానించుచున్నారము, ఆసూర్యుఁడు మమ్ములను ఆధ్యానమునందు ప్రేరేపించుఁగాక-

మం. ౧౧. వైశ్వానరాయ విద్మహే లాలీలాయ ధీమహి ।
తన్నో అగ్నిః ప్రచోదయాత్ ॥

టీక. వైశ్వానరాయ = వైశ్వానరుని, విద్మహే= తెలిసికొనుచున్నారము, లాలీలాయ=సర్వదేవతాగ్రగణ్యమైన క్రీడగల ఆదేవతను, ధీమహి= ధ్యానముచేయుఁచున్నారము, తత్ = ఆధ్యానమునందు, నః=మమ్ములను, ప్రచోదయాత్ = ప్రేరేపించుఁగాక.

తా. వైశ్వానరుఁ డనఁగా జనులందఱకు హితుఁడైన వాఁడని యర్థము, అనఁగా లోకమునందున్న జనులందఱకు వైదిక లౌకికరూపము లగు సకలకర్మలకు అత్యావశ్యకుఁడై సకలురకు హితుఁడు కావున అగ్నికి వైశ్వానరపదము యుక్తమగుచున్నది. హేలాలీలయనఁగా సర్వదేవతాగ్రగణ్యత్వలక్షణమయిన క్రీడ, అదిగలవాఁడు హేలాలీలుఁడు, ఈ పదము పృషోదరాదిగణమునందు చేర్పఁదగియున్నది కావున 'హే' యను అక్షరము లోపించి ""హేలాలీలాయ" అని యుండవలసినందులకు 'లాలీలాయ'అని యున్నది. మఱికొందఱు "వైశ్వానరాయ విద్మహే లాలీలాయ ధీమహి" అని మంత్రమును పదవిభాగము చేయుచున్నారు. 'విద్మహే = అనుపదము ఆత్మనేపద మగుచున్నది. 'విద్మ' యనుపదము పరస్మైపదమగుచున్నది. "యద్వాఘా సత్య ముత య న్న విద్మ" అని మంత్రాంతరమునందు "విద్మ" అని ప్రయోగముకూడా గలదు, ఉభయత్ర బహువచనమే; అర్థముకూడ ఉభయత్ర సమానమే.

అగ్ని యను పదమునకు తనయందు హోమపూర్వకముగా ఇవ్వఁ-

బడిన హవ్యములను ఆయాభాగానుసారము తాను గ్రహించుచు ఇతరదేవత లకు ఇచ్చువాఁడని తాత్పర్యము, ఇట్టి అగ్ని మమ్ములను ప్రేరేపించుఁగాక.

మం. ౧౨. కాత్యాయనాయ విద్మహే కన్యకుమారి ధీమహి ।
తన్నో దుర్గిః ప్రచోదయాత్ ॥

టీక. కాత్యాయనాయ = రుద్రుఁడు అధిష్ఠానముగాఁగల దుర్గా దేవిని, విద్మహే = తెలిసికొనుచున్నారము, కన్యకుమారి = ఓకన్యాకుమారీ, (నిన్ను) ధీమహి = ధ్యానము చేయుచున్నారము, తత్ = ఆధ్యానము నందు, నః = మమ్ములను, దుర్గిః = దుర్గాదేవి, ప్రచోదయాత్ = ప్రేరే పించుఁగాక.

తా. ౧. కృత్తిం వస్తే ఇతికాత్యః = రుద్రః = చర్మముకప్పుకొను వాఁడు కాత్యుఁడు అనఁగా చర్మాంబరుఁడు శివుఁడని యర్థము. 'కాత్యః ఏవ అయనం అధిష్ఠానం ఉత్పాదకః యస్యాఃదుర్గాయాః సా, కాత్యాయనీ' కాత్యుఁడు అయనముగా గలది 'కాత్యాయనీ' యని యర్థము,

౨. 'కుత్సితం=అనిష్టం మారయతి=నివారయతీతి కుమారీ,=అనిష్టము లను నివారింపఁజేయునది కుమారి యనంబడును, కన్యాచాసౌ కుమారీచ కన్యాకుమారీ. రుద్రుఁడు అధిష్ఠానముగా గలది కావున కాత్యాయనీ యను నామముతో విరాజిల్లుచున్న దుర్గాదేవిని మేము తెలిసికొనుచున్నారము, ఓ కన్యాకుమారీ! నిన్ను ధ్యానించెదము, ఓదుర్గాదేవీ ! మాబుద్ధులను నీధ్యానము నందు ప్రేరేపింపుము.

'కాత్యాయని' యన్నను, 'కన్యాకుమారి' యన్నను, 'దుర్గా' య న్నను ఒక్కటియే.

అవ. ఇఁక స్నానాంగభూతములగుకొన్నిమంత్రములు చెప్పఁబడుచున్నవి:—

మం. సహస్రపరమా దేవీ శతమూలా శతాఙ్కురా ।
సర్వగ్ంహరతు మే పాపం దూర్వా దుస్స్వప్న నాశినీ ॥

టీక. సహస్రపరమా = పవిత్రహేతుభూతములగు వేలకొలఁది వస్తువుల కంటె శ్రేష్ఠమైనదియు, దేవీ = ప్రకాశించునదియు, శతమూలా = అనేకమూలములు కలిగి నట్టియు, శతాంకురా = అనేకములగు అంకురములు గలదియు, దుస్స్వప్న నాశినీ = దుష్టస్వప్నములవలన వచ్చునట్టి అనిష్టమును పోఁగొట్టునదియును అగు, దూర్వా = దూర్వ (గఱిక), మే = నా యొక్క, సర్వం = సమస్తమయిన, పాపం = పాపమును, హరతు = హరించుఁ గాక.

తా. (ఈచెప్పునట్టి మంత్రములన్నియు స్నానసంబంధము లయినవి, ఈమంత్రమును పఠించుచు స్నానకాలమునందు శిరస్సునందు మృత్తికను గఱికెను ఉంచుకొనవలయును, ఈమంత్రము దూర్వాభిమానిదేవతా ప్రార్థనారూప మని ఎఱుంగవలయును.) దూర్వాభిమానిని యగు దేవత నా యొక్క పాపమును పోఁగొట్టుఁగాక, ఆదేవత ఎట్టిదనఁగా, పవిత్రము నొనర్చుటలో మిన్నలగు వేలకొలఁది వస్తువులకంటె శ్రేష్ఠమయినదియు, ప్రకాశించునదియు, అనేకసంఖ్యాకములగు మూలములును అంకురములును గలదియు, దుస్స్వప్నములవలన కలుగునట్టి ఆపదలను నివారింపఁజేయునదియును అని తాత్పర్యము.

మం. కాణ్డాత్కాణ్డాత్ప్రరోహన్తీ పరుషః పరుషః పరి ।౨॥
ఏవానో దూర్వే ప్రతను సహస్రేణ శతేన చ ॥

టీక. దూర్వే = ఓదూర్వమా ! (నీవు) పరుషః పరుషః పరి = ప్రతి కణుపుదగ్గఱ మొలకలెత్తుచున్న దానవు, కాండాత్ కాండాత్ = ప్రతి మూలమునుండియు, ప్రరోహన్తి = మొలకలెత్తుచున్న దానవు, ఏవా = ఇటుల నీవు, నః = మమ్ములను, సహస్రేణ శతేన చ = వేలకొలఁది నూర్లకొలఁదిగ, (అనఁగా పుత్రపౌత్రాద్యనేక ప్రకారములుగా) ప్రతను = సర్వోత్కృష్టముగా విస్తరింపఁజేయుము.

తా. దూర్వమనఁగా పాపమును హింసించునదియని యర్థము, అట్టి ఓదూర్వమా (గఱికె) ! నీవు ప్రతికణుపుదగ్గఱనుండియు మూలము దగ్గఱనుండియు, మొలుచుచు అంటట ఏవిధముగా వ్యాపించుచున్నావో, అట్లే మమ్ములనుకూడ పుత్రపౌత్రాదులతో నూర్లకొలఁది వేలకొలఁది వృద్ధినిపొందునటుల విస్తరింపఁజేయుమని తాత్పర్యము, (దూర్వయొక్క స్వభావమేమనఁగా ప్రతికణుపు భూసంపర్కమువలన వేర్లుగలది యగును, అవేష్ట భూమియందు నాటుకొనినయెడల ఆకణుపే మూల మగును, ఆమూలము నుండి అంకురోదయ మగును, ఆ అంకురములే దూర్వాలత లగును, ఆలత లందు మఱల కణుపులుండును, ఆకణుపులు మఱల భూసంపర్కమువలన వేర్లు గలవియగును, ఈవిధముగా పుట్టుచు వృద్ధిని పొందును, అదేవిధముగా పుత్రులు పౌత్రులు ప్రపౌత్రులు మున్నగు అనేకపరంపరలతో మావంశవృద్ధి చేయుమనిభావము. 'ఏవం' అని ఉండవలసినదానికి 'ఏవా' అనియుండుట ఛాందసము (ద్రవిడపాఠమునం దీమంత్రము లేదు.)

మం. యా శ॒తేన॑ ప్ర॒త॒నోషి॑ స॒హస్రే॑ణ వి॒రోహ॑సి ।
తస్యా॑స్తే దేవీష్టకే వి॒ధేమ హ॒విషా॑ వ॒యమ్ ।

టీక. యా = ఏనీవు, శతేన సహస్రేణ = నూర్లకొలఁదిగను, వేలకొలఁదిగను, (స్వవంశమును) ప్రతనోషి = విస్తరింపఁజేయుచున్నావో, అట్టి, ఇష్టకే =

ఇష్టములయిన మంత్రములచేత భక్తులచేత కొనియాడఁబడుచున్న. దేవి = పిశంగవర్ణముచేత ప్రకాశించుచున్న ఓ దూర్వాదేవీ! వయం = మేము, తస్యాః=ఆ, తే = నీయొక్క (పరిచర్యను), హవిషా = హవిష్ప్రదానముల చేత, విధేమ = చేసెదము,

తా. నూర్లకొలఁదిగను వేలకొలఁదిగను స్వవంశమును వృద్ధినిచేసికొను నట్టియుఁ, భక్తులచేత ఇష్టములయిన మంత్రములచేత కొనియాడఁబడుచున్న ట్టియు, పిశంగవర్ణముగలట్టియు ఓ దూర్వాభిమానిదేవతా! మేము నీ యొక్క పరిచర్యను హవిష్ప్రదానముచేత నొనర్చెదము.

(విశేషము:—ఈమంత్రము ద్రవిడపాఠమునందులేదు.)

అవ. ఇఁక మృత్తికాభిమంత్రణమంత్రములు నాలుగు చెప్పఁబడుచున్నవి:—

మం: ౧. అశ్వక్రాన్తే రథక్రాన్తే విష్ణుక్రాన్తే వసుంధరా ।
శిరసా ధారయిష్యామి రక్షస్వ మాం పదేపదే ॥

టీ. అశ్వక్రాంతే = అశ్వములచేత (శుద్ధినిమిత్తము) ఆక్రమింపఁబడి నట్టియు. రథక్రాంతే = రథచక్రముచేత ఆక్రమింపఁబడినదియు, విష్ణుక్రాంతే = విష్ణువుచేత (త్రివిక్రమావతారకాలమునందు పాదముచేత) ఆక్రమింపఁబడి పవిత్రమయిన), ఓభూమీ! వసుంధరా = సమస్తద్రవ్యములను ధరించిన నిన్ను, శిరసా=శిరస్సుచేత, ధారయిష్యామి=ధరించుచున్నాను, మాం=నన్ను, పదేపదే = స్నానార్థము పోవునప్పుడు ప్రతిపాదక్రమణము నందు, రక్షస్వ = రక్షించుము.

తా. అశ్వక్రాంత మనఁగా అశ్వపాదములచేత త్రొక్కఁబడిన దని యర్థము, గజములపాదములచేత త్రొక్కఁబడు నెడల పవిత్రత్వము కలుగను, అగ్నిచయనమునందు ఉఖా నిర్మాణమనను ఆవశ్యక మగు మృత్తి

కను గ్రహించు ప్రదేశమునందు ప్రథమమున గుఱ్ఱములచేత ఆ ప్రదేశమును త్రొక్కించి పిదప ఆమృత్తికతో ఉఖానిర్మాణము నొనర్తురు నిర్మాణమైన ర్చిన పిదప గుఱ్ఱపుడెక్కలతో పొగవేయుదురు, కావున అశ్వపాదాక్రాంత మగునెడల పవిత్రత్వముకలుగును, రథక్రాంతమనఁగా రథచక్రములచేత వ్యాపింపఁబడినది, విష్ణుక్రాంత మనఁగా త్రివిక్రమావతారమునందు శ్రీమహావిష్ణు వొక పాదముచేత భూమిని ఆక్రమించినాఁడు, అత్యంతశుద్ధమయిన దని భావము, ఇట్టి పరిశుద్ధమయిన ఓభూమీ ! సకలవస్తువులను ధరించునట్టి నిన్ను ఈస్నాన సమయమునందు నా శిరస్సునందు ధరించుచున్నాఁడను కావున స్నానార్థము నేను పోవునపుడు అడుగు వేయునప్పుడంతయు నన్ను సంరక్షించుము అని తాత్పర్యము, భూమిని ధరించుట యనఁగా మృత్తికను ధరించుటయే యని గ్రహించవలయును.

మం. ౨. భూమిర్ధేనుర్ధరణీ లోకధారిణీ ।
ఉద్ధృతాఽసి వరాహేణ కృష్ణేన శతబాహునా ॥

టీక. భూమిః = భూమిశబ్దవాచ్యమగు ఓపృథ్వీ ! ధేనుః = కామధేనువువలె తృప్తినొందించు నట్టియు, ధరణీ = సస్యములను ధరించునట్టియు, లోకధారిణీ = ప్రాణులను ధరించునట్టియు, (నీవు) శతబాహునా = అనేక బాహువులు కలిగినట్టియు, కృష్ణేన = నల్లని, వరాహేణ = వరాహావతారుఁడగు విష్ణుమూర్తిచేత, ఉద్ధృతా = ప్రళయకాలమునందు ఉద్ధరింపఁబడిన దానవు, అసి = అయితివి.

తా. కామధేనువు సకలాభీష్టముల నెట్టుల నొసంగునో అట్లే భూమి సైతము మనకు వలసిన సకలవిషయముల నొసంగుచున్నది కావున ధేనువనంబడుచున్నది, సస్యములు భూమినుండి పుట్టుచున్నవి కావున భూమి ధరణి యనంబడుచున్నది. ప్రాణిసమూహమున కంతయు భూమియే ఆధారమగుట

చేత భూమి లోకధారిణి యనంబడుచున్నది, ఇట్టి నీవు సప్తసముద్రములు ఏకమయి ।జలమయముగానున్న ప్రళయకాలమునందు మునిఁగిపోవుచుండఁగా శ్రీమహావిష్ణువు నల్లనిరూపము నూరుచేతులుగల వరాహావతారము ధరించి నిన్ను ఉద్ధరించినాఁడని తాత్పర్యము.

(విశేషము. 'ఉద్ధృతాఽసివరాహేణ కృష్ణేన శతబాహునా' అను ఈ మంత్రభాగము ద్రవిడపాఠమునందు లేదు).

మం. 3. మృత్తికే హన మే పాపం
యన్మయా దుష్కృతం కృతమ్ ।
మృత్తికే బ్రహ్మదత్తాఽసి
కాశ్యపేనాభిమన్త్రితా ।
మృత్తికే దేహి మే పుష్టిం
త్వయి సర్వం ప్రతిష్ఠితమ్ ।౮॥

టీక. మృత్తికే = ఓమృత్తికాభిమానిదేవతా! మయా = నాచేత, యత్ = ఏ, దుష్కృతం = చేయఁదగని, పాపం = పాపము, కృతం = చేయఁబడినదో, మే = నాయొక్క (ఆపాపమును). హన = నాశముచేయుము మృత్తికే = ఓమృత్తికాదేవతా! నీవు, బ్రహ్మదత్తా = పరమాత్మ చేత స్థాపింపఁబడినదానవు, అసి=అయితివి, కాశ్యపేన = కాశ్యపమహర్షి చేతను, ఇతరమహర్షులచేతను, అభిమన్త్రితా = స్నానకాలమునందు అభిమంత్రింపఁబడినదానవై, (వారివారిపాపమును పోఁగొట్టితివి) మృత్తికే = ఓమృత్తికాదేవతా! మే=నాకు. పుష్టిం=పుష్టిని, దేహి = ఇమ్ము, త్వయి=నీయందే, సర్వం=చతుర్విధమయిన భూతజాతము, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠింపఁబడియున్నది.

తా. (ఈమంత్రము ౬ పాదములు గలది, మహాపంక్తి ఛందస్సు గలది) ఓశ్రేష్ఠమయిన మృత్తికాభిమానిదేవతా! నేను చేసినయకార్యముల వలన కలిగినపాపమును నశింపఁజేయుము, నీవు పరమాత్మచేత భూరూపమున స్థాపింపఁబడినదాన వగుచున్నావు, నన్నీవిధముగా కొనియాడుచు కశ్యపుఁడు మున్నగుమహర్షివర్యులు మున్ను స్నానముచేసియుండుటచేత వారివారిపాపము నీవు పోఁగొట్టితివి, (మూలమునందు కాశ్యపుఁడు అనిన పదము మహర్షుల కందఱకుపలక్షణము,) శిష్టులయిన కశ్యపాదిమహర్షులందఱు నిన్నభిమంత్రించి స్నానమొనర్చుచుండిరి, శిష్టాచారప్రాప్తిమూలకము గావున మేము నట్లే నిన్నభిమంత్రించి స్నాన మొనర్చుచున్నారము, మాపాపములను పోఁగొట్టుము, మఱియు మాకు పుష్టిని కలుగఁ జేయుము, పృధివీరూపమయిన నీయందే చతుర్విధభూతజాతము ప్రతిష్ఠింపఁబడియున్నది కావున నీయందు అధిష్ఠించియున్న నాకు పుష్టినిమ్ము, ఇతరపదములతో వేర్వేఱుగ సంబోధించి చెప్పక "మృత్తికే" అని ఒకేపదమును ముమ్మారుచెప్పుట భక్త్యతిశయసూచనార్థమని ఎఱుంగవలయును.

మం. మృత్తికే ప్రతిష్ఠి తే సర్వం
తన్మే నిర్ణుద మృత్తికే।
తయా హ తేన పాపేన
గచ్ఛామి పరమాం గతిమ్ ॥

టీక. ప్రతిష్ఠితే = ప్రాణులందఱకు ఆధారభూతమయిన, మృత్తికే = ఓమృత్తికాభిమానిదేవతా! తత్ = ఆప్రసిద్ధమయిన, మే = నాయొక్క, సర్వం = పాపమునంతయు, నిర్ణుద = నాశము చేయుము, మృత్తికే = ఓమృత్తికాదేవతా! తయా = ఆసుప్రసిద్ధమయిన నీచేత, పాపేన = పాపము, హతేన = హత

మయిన దగుచుండఁగా, పరమాంగతిం = మోక్షమును, గచ్ఛామి = నేను పొందుచున్నాను.

తా. ప్రాణులు దీనియందు నిలుచుందురు కావున 'ప్రతిష్ఠితా' అని పేరు భూమికి తగియున్నది. అట్టి ఓమృత్తికాదేవతా! నేనొనర్చిన పాప పుంజమును నీవు నాశనముచేయుము, సుప్రసిద్ధిగల నీచేత నాపాపమునశింపఁ జేయఁబడిన యెడల నేను మోక్షమును పొందఁగలను.

విశేషము:— 'తయా హతేన పాపేన గచ్ఛామి పరమాం గతిం' అనుమంత్రము ద్రవిడపాఠమునందు 'త్వయా హతేన పాపేన జీవామి శరదశ్శతమ్' అని యగును.

అవ. ఈ చెప్పినవిధముగా దూర్వను మృత్తికను కుడి చేతియందు పెట్టుకొని మంత్రములచేత అభిమంత్రించు విధము చెప్పి, పిదప రెండుమంత్రములచేత ఇంద్రునివల్ల నుండి అభయప్రార్థనము చేయఁబడుచున్నది:—

మం. ౧. యత ఇన్ద్ర భయామహే
తతో నో అభయం కృధి।
మఘవఞ్ఛగ్ధి తవ తన్న ఊతయే
విద్విషో విమృధో జహి ॥

టీక. ఇంద్ర = ఓయింద్రుఁడా! యతః = ఏపాపమువలన, లేక ఏశత్రువువలవ, లేక ఏనరకమువలన, (మేము) భయామహే = భయంపడు చున్నారమో, తతః = ఆపాపాదిత్రయమువల్ల నుండి, నః = మాకు, అభ

యం = అభయమును, కృధి = చేయుము, మఘవన్ = ఓఇన్ద్రుడా! తత్ = ఆపాపాదిత్రయమును. శగ్ధి=నాశముచేయుము. తవ=నీసంబన్ధులమగు, నః=మాయొక్క, ఊతయే=సంరక్షణముకొఱకు, విమృధః=పీడకలుగఁజేయునట్టి, విద్విషః = శత్రువులను, జహి = సంహరించుము.

తా. ఓఇన్ద్రుఁడా! మేము ఏపాపమునలన భయంపడుచున్నారమో అట్టి పాపమువలన మాకు చెరుపు కలుగకుండునటుల సంరక్షించుము, ఇట్లే ఏశత్రువువల్లను, నరకమువల్లను మేము భయంపడుచున్నారమో అట్టి శత్రువువల్లనుండియు నరకమువల్లనుండియు మాకు భయములేనియటుల నొనర్పుము, మఱియు వారివల్లనుండి మాకు చెరుపుకలుగకుండునటుల అభయమును మాత్రమే మేము కోరుటలేదు ఆపాపాదిత్రముయనే నాశనమొనర్పుము, భక్తుల మగుటచేత నీసంబంధులమయిన మమ్ములను రక్షించుకొఱకు పీడాకారులగు నాఅన్తర్బహిశ్శత్రువులను సైతము సంహరింపుమని తాత్పర్యము.

విశేషము:—ఈమంత్రము ద్రావిడపాఠమునందు లేదు.

మం. ౨. స్వస్తిదా విశస్పతి ర్వృత్రహా విమృధో వశీ ।
వృషేన్ద్రః పుర ఏతు న స్స్వస్తిదా అభయంకరః ॥

టీక. స్వస్తిదాః = ఇహలోకసౌఖ్యము నిచ్చునట్టియు, విశస్పతిః=భక్తప్రజాపాలకుఁడును, వృత్రహా = వృత్రసంహర్తయు, విమృధః = శత్రువులను, వశీ=స్వాధీనులనుగా చేసికొన్నవాఁడును, వృషా = వర్షింపఁజేయువాఁడును, స్వస్తిదాః = పరలోకసౌఖ్యదాతయు, అభయంకరః = అభయమును కలుగఁజేయువాఁడును అగు, ఇన్ద్రః=ఇన్ద్రుఁడు, నః=(స్నానార్థము పోవునట్టి) మాయొక్క, పురః=ముందట, ఏతు=రక్షింపుటకు వచ్చుగాక.

తా. స్నానార్థము (నద్యాదిప్రదేశమునుగూర్చి) పోవుచున్న మాకు ముంగల ఇంద్రుఁడు వచ్చి మమ్ములను రక్షించుగాక, ఆ ఇంద్రునియొక్క మహిమ ఎట్టిదనఁగా:—అతఁడు, ఇహలోకసౌఖ్యము నొసంగువాఁడు, భక్తులగువారలను పాలించువాఁడు, వృత్రాసురుని సంహరించినవాఁడు, ఎంతటి బలవంతులయిన శత్రువులయినను వారిని తనకు లోఁబఱుచుకొనువాఁడు, పుష్కరావర్తాదిమేఘములకు ఆజ్ఞనొసంగి భూమియందు సువృష్టిని కురిపించువాఁడు, మఱియు కేవల ఇహలోకసౌఖ్యము నేగాక పరలోకసౌఖ్యమునుకూడ నొసంగువాఁడు, ఎట్టివారికిని అభయము నొసంగువాఁడు; అట్టిమహిమ గలవాఁడు కావున స్నానార్థము పోవునట్టి మమ్ములను సంరక్షింప సమర్థుఁడని భావము.)

విశేషము:—ఈమంత్రము ద్రవిడపాఠమునందు లేదు.

అవ. స్నానకాలమునందు మొసళ్లు మున్నగువానివలన బాధ కలుగకుండుటకయి ఇంద్రాదిదేవతల నొక మంత్రముచేత ప్రార్థించుచున్నాఁడు:—

మం. స్వస్తి న ఇన్ద్రో వృద్ధశ్రవాః
స్వస్తి నః పూషా విశ్వవేదాః ।
స్వస్తి న స్తార్క్ష్యో అరిష్టనేమిః
స్వస్తి నో బృహస్పతి ర్దధాతు ॥

టీక. వృద్ధశ్రవాః = సమృద్ధమయిన కీర్తిగల, ఇంద్రః = ఇంద్రుఁడు, నః = మాకు, స్వస్తి = సౌఖ్యమును, దధాతు = ఇచ్చుగాక, విశ్వవేదాః = గొప్పజ్ఞానము గలట్టియు లేక గొప్పధనముగలట్టియు, పూషా = సూర్యుఁడు, నః=మాకు, స్వస్తి = సౌఖ్యమును గలుగఁజేయుఁ గాక, అరిష్ట నేమిః=అప్రతి

హతరథుఁ డగు, తార్క్ష్యః = గరుడుఁడు, నః=మాకు, స్వస్తి = సౌఖ్యమును, దధాతు = ఇచ్చుగాక, బృహస్పతిః = బృహస్పతి, నః = మాకు, స్వస్తి = సౌఖ్యమును, దధాతు = ఇచ్చుగాక.

తా. సమృద్ధి యగు కీర్తిగల ఇంద్రుఁడు, గొప్పజ్ఞానము లేక గొప్ప ధనము గల ఇంద్రుఁడు, అరిష్టనేమి యగు గరుడుఁడు, బృహస్పతి వీరలు పీడ| మున్నగునవి లేనివిధముగ నన్ను సంరక్షించి నాకు సౌఖ్యము నొసంగెదరుగాక.

(నేమి=బండిగాలు, దీనివలన రథమని సిద్ధించుచున్నది, అరిష్టమనఁగా-హింసింపఁబడని నేమిగలవాఁడు అరిష్టనేమి; ఎంతకాలము పోవుచున్నను శత్రువులయిన రాక్షసులు మున్నగువారలు అడ్డువచ్చి నిలుపుదల చేయుట లేని రథమువాఁడని భావము, అనఁగా అడ్డులేనివాఁడని ముఖ్యాభిప్రాయము)

అవ. సోముని ఇంద్రుని ప్రార్థించుచున్నాఁడు:—

మం. ఆపాన్తమన్యు స్తృపలప్రభ
ర్ధ్మాధుని శ్శిమీవాఞ్ఛరుమాఁ ఋజీషీ।
సోమో విశ్వాన్యతసా వనాని
నార్వాగిన్ద్రం ప్రతిమానాని దేభుః।౯॥

టీక. ఆపాంతమన్యుః = పైపైని కోపము కలిగినట్టియు, తృపలప్రభః = చంద్రకాంతశిలలవంటి కాంతికలిగినట్టియు, మాధునిః = వసంతునికి స్నేహితుఁడును, శిమీవాన్ = శమీపత్రములు గలవాఁడును, శరుమాన్ = అధికసౌఖ్యము గలవాఁడును, ఋజీషీ = అతిదీప్తిగలవాఁడును అగు, సోమః = చంద్రుఁడు, అతసా = (తనయొక్క) ఎడతెగని గమనముచేత, వనాని =

ఓషధులను, వృద్ధిని పొందించుచున్నాఁడు, అర్వాంచి = అర్వాచీనములగు, ప్రతిమానాని = ఉపమానములు, ఇంద్రం = ఇంద్రుని, నదేభుః = హింసింపఁ జాలవు.

తా. ఆకాశమార్గమునందు ఎల్లప్పుడు నడుచుచున్న చంద్రుఁడు భూమియందుండు ఉద్భిజ్జములగు ఓషధుల నన్నింటిని వృద్ధిని పొందించుచున్నాఁడు, ఆచంద్రుఁ డెట్టివాఁడనఁగా:—

౧. ఆపాంతమన్యువు = అనఁగా పైపైని కోపము గలవాఁడు, ఆపాంతయనుపదము ఛాందసము, "ఆపాత తః"యను అర్థమునందు ఆపాంత శబ్దము నిచట గ్రహించునది, తల్లితండ్రులు తమపుత్రాదులందు వాక్కుతో కోపమును గనంబఱచినను కాయములో కోపక్రియ నెటుల గనంబఱచరో, మనస్సునందు వారియందు కోపమును ఎట్లుతలంపరో అట్లే భగవంతుఁడగు నక్షత్రనాథుఁడు సైతము భక్తులందు వారియం దనుగ్రహబుద్ధితోడనే ఇట్టి కోపము గలవాఁడని చెప్పఁబడినది. "ఈమాట ఆపాతరమణీయమేగాని యథార్థము విచారించిన నట్లుగాదు"అను మున్నగుతావుల "ఆపాత" శబ్దమునకు 'పైపైని' అని యర్థము వచ్చుచున్నటుల ఇచ్చటఁగల "ఆపాత" శబ్దమునకు అట్టి యర్థమును గ్రహించవలయును.

౨. తృపలప్రభుఁడు = చంద్రకాంతశిలయొక్క కాంతివంటి కాంతి గలవాఁడు.

౩. మాధుని = వసంతునకు ప్రియమైనవాఁడు, వసంతకాలమునందు మేఘము, మంచు మున్నగు నవి లేకపోవుటచేత చంద్రుఁడు స్ఫుటముగా ప్రకాశించును కావున మాధుని యనంబడును.

౪. శిమీవంతుఁడు = ఈపదముఛాందసము, శమీవంతుఁడని యర్థము. బిల్వవృక్షమువలె శమీవృక్షముకూడ శివప్రియమైన వృక్షము, కావున శివభక్తులు శమీపత్రములను చంద్రశేఖరుఁడగు ఈశ్వరుని శిరమునందు పూజిం

చెదరు, అప్పుడు చంద్రుఁడును ఈశ్వరుని శిరమునందుండును కావున ఇష్ఠ
వురు ఒకస్థానమునందుండుటచేత ఇద్దఱకు అతిప్రియత్వము ఘటిల్లుచున్నది.
కావున 'శిమీవాన్' అని చెప్పఁబడినది.

౫. శరుమన్తుఁడు = అతిసౌఖ్యముగలవాఁడు.

౬. ఋజీషి = అతిదీప్తిగలవాఁడు.

ఇది చంద్రునియొక్క స్తుతి.

ఇఁక ఇంద్రునియొక్క స్తుతి:—

ఇంద్రునికంటె అర్వాచీనములయి ఉన్న ఉపమానములు ఇంద్రుని మనస్సునకు చింతాజనకములు కాఁజాలవు. అనఁగా ఇంద్రుని మఱొకనితో పోల్చుట ఇంద్రునకు దుఃఖకరముగనుండును. అనఁగా నేనే సర్వాధికుఁడను కానుగదా నాతో సమానుఁడున్నా ఉన్నాఁడుగదా అని చింతగానుండును, ఉపమానములేనియెడల తనవంటివాఁడు తానేయని సంతుష్టికలిగియుండును, ఈవిధముగ నిరుపమానుఁడును, శచీపతియు అగు ఇంద్రుఁడు మమ్ములను సంరక్షించుఁగాక యని తాత్పర్యము.

౮౯. పరమాత్మప్రార్థనము:—

మం. బ్రహ్మ జజ్ఞానం ప్రథమం పురస్తా
ద్విసీమత స్సురుచో వేన ఆవః।
స బుధ్నియా ఉపమా అస్య విష్ఠా
స్సతశ్చ యోని మసతశ్చ వివః॥

టీక. ప్రథమం = సర్వదేవతలకు మొదటిదైనట్టియు, పురస్తాత్ = ప్రాగ్దిశయందు, జజ్ఞానం = (సూర్యరూపముచేత) పుట్టునదియు, వేనః = క

నీయమును అగు, బ్రహ్మ = పరబ్రహ్మము, సురుచః = మిక్కిలి కాంతిగల త్రిలోకములను, సీమతః=చివఱవరకు, విఆవః = స్వప్రకాశముచేత వివృత ములుగా నొనర్చెను, సః = ఆపరబ్రహ్మము, అస్య = ఈజగత్తుయొక్క, విష్ఠాః = వివిధస్థానభూతములును, ఉపమాః = సావకాశములగు, బుధ్నియాః = ప్రాగాదిదిక్కులకును, సతః = విద్యమానమగు ఘటపటాదికముల యొక్కయు, అసతశ్చ = అమూర్తమగు వాయ్వాదికముయొక్కయు, యోనిం = పుట్టుకను, వివః = ప్రకాశింపఁజేయును.

తా. దేవతలందఱికంటె ముందున్నవాఁడును, ప్రాగ్దిశయందు సూర్య రూపమున జనించుచున్నట్టివాఁడును, కమనీయుఁడును అగు పరమాత్మ స్వప్ర కాశముచేత లోకత్రయమును సమగ్రముగ వ్యాపించెను, ఆపరబ్రహ్మము ఈజగత్తునకు వివిధస్థానభూతములును, అవకాశ సమన్వితములగు దిక్కుల కును, సద్రూపమగు ఘటపటాదికమునకును, అమూర్తమగు వాయ్వాకాశా దికమునకును కారణమును ప్రకాశింపఁజేయుచున్నాఁడు.

విశేషము:—బుధ్నియాః = అనఁగా దిక్కులు 'బుధ్నియావైదిశః' అని శ్రుతి.

ఉపమాః = ఉప-సమీపే, మాన్తి = తిష్ఠన్తి భూతాని యాసు తాః, ఉపమాః, సావకాశాఇత్యర్థః మాఙ్, మానే వర్తనేచ ఇతిధాతు పాఠః. (వేని సమీపమునందు భూతములుండునో అవి ఉపమ లనంబడును. విష్ఠాః = వివిధం తిష్ఠన్తి యాస్వితిః విష్ఠాః. వేనియందు వివిధములగునవి ఉండునో అవి విష్ఠ లనంబడును.)

దిక్కులను, సదసత్తులను కారణమగు దానిని బ్రహ్మమే ప్రకాశింపఁ జేయుననుటకు శ్రుతియందు గలప్రమాణము నిచట నుదహరించుచున్నా రము:—

శ్రు. 'తస్యభాసా సర్వమిదం విభాతి.' (శ్వేతా. ౬-౧౪.)

(అర్థ. ఆపరమాత్మయొక్క ప్రకాశముచేతనే ఈకనంబడు ప్రపంచ మంతయు ప్రకాశించుచున్నది.)

అవ. మృత్తికాశుద్ధినిమిత్తము రెండుమంత్రములతో మృత్తికాప్రార్థనము చేయఁబడుచున్నది:—

మం. స్యోనా పృథివి భవానృక్షరా నివేశనీ।
యచ్ఛా నశ్శర్మ సప్రథాః॥

టీక. పృథివి = విశాలమైన ఓభూదేవీ! నః = మాకు, స్యోనా = దుఃఖనాశనివి, భవా = కమ్ము, నృక్షరా = మనుష్యాది భూతచతుష్టయమును కలుగఁజేయుఁదానవు, నివేశనీ = వారిని అచ్చటచ్చట నివసింపఁజేయుదానవును నీవ, సప్రథాః = సర్వంసహా యను కీర్తితో వెలయుఁనట్టి నీవు, నః = మాకు, శర్మ = సౌఖ్యమును, యచ్ఛా = ఇమ్ము.

తా. అతివిశాలమయిన యోభూమీ! మనుష్యాది చతుర్విధభూత గ్రామమును సృజించి, ఆసృజించిన జీవసమూహమును యోగ్యతానుసారము గ్రామారణ్యాది స్థలము లందుంచి సంరక్షించుచు, మేమొనర్చునట్టి మలమూత్రపురీషోత్సర్గాది రూపాపరాధమును సహించుటచేత సర్వంసహా యనునట్టి సుప్రసిద్ధకీర్తిని వహించిన నీవు మాదుఃఖములను నాశనము పొందింపుమని తాత్పర్యము. "భవ, యచ్ఛ" అనుటకు "భవా, యచ్ఛా" అనుట ఛాందసము; ద్రావిడపాఠమునం దీ మంత్రములేదు.

మం. గన్ధద్వారాం దురాధర్షాం
నిత్యపుష్టాం కరీషిణీమ్।

ఈశ్వరీగ్ం సర్వభూతానాం
తామిహోపహ్వయే శ్రియమ్ ॥

టీక. గంధద్వారాం = గంధము అనుమాపకలింగముగాఁ గలిగినట్టియు, దురాధర్షాం = (త్రవ్వుట, పలుగులువేసి పొడుచుట మున్నగు వేలకొలఁది ప్రయత్నములచేతను) అప్రకంప్యయు, నిత్యపుష్టాం = ఎల్లప్పుడు బహువిధ సస్యాదిశోభితయు, సర్వభూతానాం = సకలప్రాణులకు, ఈశ్వరీం = నియామికయు, శ్రియం = అందఱిచేత ఆశ్రయింపఁబడునదియు అగు, తాం = ఆభూమిని, ఇహ = ఈస్నానకర్మయందు, ఉపహ్వయే = సమీపమునకు పిలుచుచున్నాఁడను.

తా. గంధగుణము కలిగినట్టియు, ఎంతటి ప్రయత్న మొనర్చినను చలింపనిగుణము గలదియు, ఎల్లప్పుడు బహువిధ గ్రామ నగర ప్రాసాదాదికముచేతను, నదీనదసముద్రాదికముచేతను, తరులతాగుల్మాదికముచేతను, బహువిధ సస్యములచేతను ప్రకాశించుచుండునదియు, బీజావాపసమయమునందు కర్షకులు భూమియందు గోమయము మున్నగువానిని పడవేసెదరు కావున అట్టి గోమయము గలదియు, మనుష్యాది చతుర్విధ భూతసంఘముచేత ఆశ్రయణీయయు అగు భూమిని స్నానకర్మమునందు నేను ఆహ్వానము చేయుచున్నాఁడను.

కరీషిణీశబ్దమునకు నానావిధములగు గవాదిపశుసమన్విత యనిగాని, లేక చతుష్పాజ్జంతువిశిష్ట యనిగాని అర్థమును చెప్పుకొనవచ్చును.

అవ. ఈమంత్రములచేత అభిమంత్రించిన మృత్తికను ఆపాదమస్తకము పూసికొని జలప్రవేశనము చేయునప్పుడు చెప్పవలసిన ప్రార్థనామంత్రములు చెప్పఁబడుచున్నవి:—

మం. శ్రీర్మే భజతు । అలక్ష్మీర్మే నశ్యతు । విష్ణుముఖా వై
దేవాశ్ఛన్దోభిరిమాన్లోకానననపజయ్యమభ్యజయన్ ।
మహాగ్ం ఇన్ద్రో వజ్రబాహుష్షోడశీ శర్మయచ్ఛతు ॥
॥ ౧౦ ॥

టీక. శ్రీః = సంపద. మే = నన్ను, (షష్ఠీవిభక్తి ఛాందసము) భజతు = పొందుగాక, మే = నాసంబంధమయిన, అలక్ష్మీః = జ్యేష్ఠాదేవి, నశ్యతు = నశించుగాక, విష్ణుముఖాః = విష్ణుప్రధానులగు, దేవాః = దేవతలు, ఛందోభిః = వేదవిహిత సాధనములచేత, ఇమాన్ = ఈ, లోకాన్ = లోకములను, అనప జయ్యం = రాక్షసనాయకులు జయించుటకు వీలుకాని పదువున, అభ్య జయన్ వై = పొందిరి గదా, వజ్రబాహుః = వజ్రము చేతియందుగల వాఁడును, మహాన్ = లోకత్రయపూజ్యుఁడును, షోడశీ = చంద్రతుల్యుఁడును అగు, ఇంద్రః = ఇంద్రుఁడు, శర్మ = సుఖమును, యచ్ఛతు = మాకు ఇచ్చుగాక.

తా. గజాంతైశ్వర్యము నాకు లభించుగాక, మాసంబంధమైన అలక్ష్మి నశించిపోవుఁగాక, అనఁగా నాకుఁగాని నాకులమువారికిఁ గాని బంధువర్గమునకు గాని మాగ్రామమునకుఁ గాని బహుయోజన పరిమితదూరమునందు గాని అలక్ష్మి లేకపోవుఁగాకయని భావము, విష్ణుప్రధాను లగు దేవతలందఱు వేద విహితము లగు సాధనములచేత మనుష్యాధీనము లగు ౧౪ లోకములనుతమ యుపభోగార్థము సంపాదించుకొనిరి, రాక్షసాదిశత్రువులు మున్నగువారలు ఎంత ప్రయత్నించినను వారు మఱల తాము జయించుకొన్నలోకములు శత్రువు లెన్నటికిని గెలువఁజాలని విధముగా నీలోకములను జయించుకొనిరి, అట్టి దేవతలు మాకు అభీష్టముల నొసంగెదరుగాక, ఈవిషయము శ్రుతి ప్రసిద్ధము.

వజ్రబాహువును, త్రిలోకపూజ్యుఁడును, చంద్రునివలె ఆహ్లాద ప్రదుఁడును అగు ఇంద్రుఁడు మాకు సౌఖ్యము నొసంగుఁగాక, షోడశి యనఁగా పదునారు కళలు గలపూర్ణిమాచంద్రుఁడనియు, అతనివలె ఆహ్లాద కరుఁడని యర్థ మిదివఱకు చెప్పఁబడినది, ఆపదమునకు అర్థాంతరము; షోడశి యనఁగా శ్రీవిద్య ఆమంత్రమును జపించువాఁడును 'షోడశి' అని చెప్పఁ బడును, ఇంద్రుఁడు ఈషోడశీ మంత్రరాజమును జపించియే ఇంద్రపదవిని పొందియున్నాఁడు కావున అట్టి ఇంద్రుఁడు మాకు సుఖము నిచ్చుగాక యనియు తాత్పర్యమును చెప్పవచ్చును.

విశేషము:—ఈమంత్రము ద్రవిడపాఠమునందు లేదు.

మం. స్వస్తి నో మఘవా కరోతు హన్తు పాప్మానం యో
ఽస్మా న్ద్వేష్టి।

టీక. మఘవా = ఇంద్రుఁడు, నః=మాకు, స్వస్తి = సౌఖ్యమును, కరోతు=చేయుఁగాక, యః=ఏపాపి, అస్మాన్=మమ్ములను, ద్వేష్టి=ద్వేషించుచున్నాఁడో, పాప్మానం = అట్టిపాపిని, హన్తు=నాశనముచేయుఁగాక.

తా. ఇంద్రుఁడు మాకు సకలసౌఖ్యములను కలుగఁ జేయుఁగాక, అకారణముగ మమ్ములను ద్వేషించునట్టి పాపాత్ములను నాశనముచేయుఁ గాక. (ఈమంత్రము ద్రవిడపాఠమునందు లేదు.)

మం. సోమానగ్గ్ం స్వరణం కృణుహి బ్రహ్మణస్పతే।
కక్షీవన్తం య ఔశిజమ్।
శరీరం యజ్ఞశమలం కుసీదం తస్మిన్థ్సీదతు యో
ఽస్మా న్ద్వేష్టి॥

టీక. బ్రహ్మణస్పతే = వేదపరిపాలకుఁడవగు ఓపరమాత్మా! (నన్ను) సోమానం=సోమలతను, స్వరణం=స్వరములను నెఱింగినవానిగను, కృణుహి= చేయుము, ఔశిజం = ఉశిగను స్త్రీయొక్క పుత్త్రుఁడగు, యః = ఏ, కక్షీవంతం = కక్షీవంతుఁ డనుమహర్షి గలఁడో అతఁడు, శరీరం = నాదేహమును, యజ్ఞశమలం=యజ్ఞార్థమయిన శ్రమను సహించు దానినిగా (చేయుఁగాక), అస్మాన్ = మమ్ములను, యః=ఎవ్వఁడు, ద్వేష్టి = ద్వేషించునో, సః=వాఁడు, తస్మిన్=ఆ, కుసీదం = నరకమునందు, సీదతు = పడియుండుఁగాక.

తా. శాఖోపశాఖలుగా లోకమునందు వ్యాపించిన వేదశాఖలను పరిపాలించునట్టి ఓపరమాత్మా! సోమలతను, యజ్ఞకాలమునందు సర్వవేదములయొక్క స్వరములను నెఱింగినవానిగా నన్నొనర్పుము, అనఁగా నీయను గ్రహమువలన నాకు వేదత్రయమును సస్వరముగ నధ్యయనము నొనర్చి సోమయాగాదికము నాచరింపఁగలసమర్థత కలుగుగాక యని తాత్పర్యము. ఉశిక్ అను ఆమెయొక్క పుత్త్రుఁడగు కక్షీవంతుఁ డను పేరుగల మహర్షి నాదేహమును యజ్ఞవిషయకశ్రమను సహించుదానిగాఁ జేయుఁగాక, నన్ను ద్వేషించువాఁడు నరకమునందే పడియుండుగాక, కక్షీవంతం, ఔశిజం పదములకు ప్రథమావిభక్త్యర్థమును చెప్పుకొనవలయును, ఇట్లే కుసీదం అను పదమునకు సప్తమ్యర్థమును చెప్పుకొనవలయును, "కుత్సితం యథా తథా సీదన్తి పాపినః అస్మిన్నితి కుసీదం" అని కుసీదశబ్దమునకు వ్యుత్పత్తి.

[illegible]తఱుచుగ విభక్తివ్యత్యయము మున్నగునవి వేదమంత్రములందు గనంబడుచుండును, భాష్యానుసారము మేమర్థమును వ్రాసెదము, ప్రతిచోట ఛాందసముగావున ఇటుల తటస్థించినది అని మేము వ్రాయకపోయినను పాఠకు లీవిషయమును మరువకుందురు గాక, ద్రవిడపాఠమునందు ఈ మంత్రమున్నదా లేదా అనువిషయమును గూడ ఇక మేము వ్రాయఁ దలఁచలేదు.

అవ. మోకాలిబంటి నీటియందు నిలుచుండి జపించ వలసిన మంత్రద్వయము చెప్పఁబడుచున్నవి:—

మం. ౧. చరణం పవిత్రం వితతం పురాణం
యేన పూత స్తరతి దుష్కృతాని।
తేన పవిత్రేణ శుద్ధేన పూతా
అతి పాప్మాన మరాతిం తరేమ॥

టీక. యత్ = ఏ, పవిత్రం = పవిత్రమగు, చరణం = చరణము, వితతం = విస్తారమయినదో, పురాణం = పురాతనమయినదో, యేన = ఏపవిత్రమగు చరణముచేత, పూతః = పవిత్ర మొనర్పఁబడిన మనుష్యుఁడు, దుష్కృతాని = పాపములను, తరతి = దాటుచున్నాఁడో, పవిత్రేన = పవిత్రమగు, శుద్ధేన=శుద్ధమయిన, తేన=ఆశ్రీమహావిష్ణువుయొక్క పాదము చేత, పూతాః=పవిత్ర మొనర్పఁబడినవారలమై, అరాతిం = నరకహేతు వగుటచేత శత్రుభూతుఁడగు, పాప్మానం = పాపమును, అతితరేమ = అతిక్రమించెదము గాక.

తా. ఈమంత్రము శ్రీమహావిష్ణువుయొక్క చరణారవిందస్తుతి పరము:—శ్రీమహావిష్ణువు త్రివిక్రమావతారసమయమునందు భూమ్యంతరిక్ష స్వర్గములను తనపాదముచేత వ్యాపించినాఁడు కావున శ్రీమహావిష్ణువు యొక్క పాదము విస్తృత మనంబడుచున్నది, శ్రీమహావిష్ణువు పురాణపురుషుఁడు కావున తదవయవభూతమగు పాదముసైతము పురాణమగును గదా, ఏచరణము పవిత్రమును, విస్తృతమును, పురాణమును అగుచున్నదో, ఏపాదముచేత పవిత్ర మొనర్పఁబడినవాఁడు పాపముల నతిక్రమించుచున్నాఁడో, అట్టి శ్రీమహావిష్ణువుయొక్క పవిత్రమయిన పాదముచేత మేము

పవిత్రతులమయి - నరకహేతువగుటచేత శత్రువునివంటిదగు పాపమును అతిక్రమించెదము గాక.

ఈమంత్రము బ్రాహ్మణులయొక్క పాదప్రక్షాళన సమయమునందు వినియోగింపఁబడుచున్నది,

మం. ౨. సజోషా ఇన్ద్ర సగణో మరుద్భి
స్సోమం పిబ వృత్రహాచ్ఛూర విద్వాన్ ।
జహి శత్రూగ్ంరపమృధో నుదస్వా
థాభయం కృణుహి విశ్వతో నః ॥

టీక. వృత్రహన్ = వృత్రహంతవును, శూర=శూరుఁడవును అగు, ఇంద్ర = ఓయింద్రుఁడా! నీవు, సజోషాః = సమానమయిన ప్రీతిగలవాఁడవై, సగణః = పరిచరగణసమేతుఁడవై, విద్వాన్ = సర్వజ్ఞుఁడవై, మరుద్భిః=దేవతలతోఁడ, సోమం = సోమమును, పిబ = పానముచేయుము, శత్రూన్ = శత్రువులను, జహి=చంపుము, మృధః = యుద్ధములను, అపనుదస్వ = నాశనముచేయుము, అథ=పిదప, నః=మాకు, విశ్వతః = నలువైపుల, అభయం = అభయమును, కృణుహి = చేయుము.

తా. వృత్రహంత వగుటచేత శూరశబ్దయోగ్యుఁడ వగు నోఇంద్రా! మాహృదయమునందు నీయందు ఎట్టి ప్రీతి మాకుఁగలదో అట్టిప్రీతినే మాయందును గనంబఱుచువాఁడవై, నీవు సర్వజ్ఞుఁడవైన నీవు పరిచారులతోఁడ మేము సలుపునట్టి సోమయాగములందు సన్నిహితుఁడవై అగ్నియందు నిన్నుద్దేశించి హోమముచేయఁబడునట్టి సోమరసమును దేవతలతో కలసి స్వీకరింపుము, మాశత్రువులను నాశనమొనర్చుచు, యుద్ధములు లేకయుండుటకయి

యుద్ధములనే నాశనముచేయుఁము, మాకందఱి వల్లనుండి అభయమును కలుగఁ చేయుఁము.

అవ. నాభిమాత్ర జలమునందు నిలుచుండి జపించవల సినమంత్రములు చెప్పఁబడుచున్నవి:—

మం. సుమిత్రా న ఆప ఓషధయస్సన్తు దుర్మిత్రా స్తస్మై
భూయాసు ర్యోఽస్మాన్ద్వేష్టి యం చ వయం ద్విష్మః ॥

టీక. నః=మమ్ములనుగూర్చి, ఆపః=జలములు, ఓషధయః=ఓషధులు, సుమిత్రాః=మంచిమిత్రములు, సంతు=అగుఁగాక, యః=ఎవ్వఁడు, అస్మాన్ = మమ్ములను, ద్వేష్టి = ద్వేషించుచున్నాఁడో, యం చ=ఎవ్వనిని, వయం = మేము, ద్విష్మః = ద్వేషించుచున్నారమో, తస్మై = వానికి, దుర్మిత్రాః = దుర్హృదయము గలమిత్రములు, భూయాసుః = అగుఁగాక,

తా. జలములు ఓషధములు మున్నుగునవి మాకు మిత్రములయి అనఁగా అనుకూలఫలప్రదములయి యుండుఁగాక, ఎవఁడు మమ్ములను ద్వేషించునో, ఎవనిని మేము ద్వేషించెదమో వానికి ఆఓషధీజలాభిమానిదేవతలు దుఃఖప్రదములు అగుఁగాక.

మం. ౧. ఆపో హి ష్ఠా మయోభువస్తా న ఊర్జే దధాతన ॥౧౧॥
మహే రణాయ చక్షసే ॥

మం. ౨. యో వశ్శివతమో రసస్తస్య భాజయతేహ నః ।
ఉశతీరివ మాతరః ॥

మం. 3. తస్మా అరం గమామ వో యస్య క్షయాయ జిన్వథ।
ఆపో జనయథా చ నః॥

టీక. ౧, ఆపః=ఓ ఉదకములారా! హి=ఏకారణమువలన (మీరు), మయోభువః=స్నానపానాది హేతువులవలన సుఖకారకములు, స్థ=ఐనారో, తాః=అట్టిమీరు, నః=మాకు, ఊర్జే=బలముకొఱకు, మహే = పూజనీయమైనట్టియు, రణాయ = రమణీయమైనట్టియు, చక్షసే = పరమాత్మ దర్శనము కొఱకు, దధాతన = పోషించుఁడు.

౨. (మఱియు) నః=మీయొక్క, యః=ఏ, శివతమః = కల్యాణతమమయిన, రసః=రసముగలదో, తస్య=ఆరసమునకు, ఇహ = ఈభూమి యందు, నః=మమ్ములను, ఉశతీః = అపత్యవృద్ధిని కోరునట్టి, మాతరః ఇవ = తల్లులవలె, భాజయత = పాత్రుల నొనర్పుఁడు.

3. ఆపః = ఓయుదకములారా! యస్య = ఏపాపముయొక్క, క్షయాయ=క్షయము కొఱకు, జిన్వథ=(మీరు) ప్రీతిని చేయుచున్నారో, తస్మై = ఆపాపక్షయముకొఱకే, వః=మిమ్ములను, అరం=మిక్కిలి, గమామ = (మేము శరణును) పొందితిమి, నః=మమ్ములను, జనయథా చ = పుత్రదుహిత్రాదిజననసమర్థులనుఁగా చేయుఁడు.

తా. ౧. ఓజలంబులారా! ఏకారణమును బట్టి మీరు ఎల్లకొఱకు స్నానపానాదులకు కారణంబగుచున్నారో ఆకారణమును బట్టి మిమ్ములను భజియించునట్టి మమ్ములను పూజనీయమును రమణీయమును అగు పరమాత్మ దర్శనము నిమిత్తము పోషింపుఁడు, ముక్తి యను గొప్ప ప్రయోజనము కొఱకు మీభక్తుల మగు మమ్ములను పోషింపుఁడు (మోక్షార్థము కాని జీవనము వ్యర్థమని యభిప్రాయము).

౨. మఱియు ఓజలములారా! మిగుల కల్యాణమయి మాధుర్యరూప మగు మీయేరసము కలదో ఆరసమునకు ఈభూలోకమునందు (మనుజరూప మున) వర్తిల్లు మమ్ములను పాత్రులం జేయుఁడు, అట్టి రసమునకు మమ్ము లను స్థానభూతులనుగా నొనర్పుఁడని తాత్పర్యము. పాత్రమునందు జలము ఏవిధముగా నిండియుండునో అట్లే మీ యనుగ్రహము మాయందుండుగాక యని భావము, ఇందులకు దృష్టాంతము:—తమ సంతానాభివృద్ధిని కోరుచు పుత్త్రుల యెడల మనుమలయందును ప్రీతిని గనంబఱచు ప్రేమగలతల్లులు తమతమ పిల్లలకు మంచిబెల్లము లోనగు (హిత) పదార్థములను పెట్టెడి విధ ముగా మీయనుగ్రహమునకు మమ్ములను పాత్రులనుగా నొనర్పుఁడని భావము.

౩. మఱియు ఓజలములారా! మీరు మాసంబంధమగు ఏపాపమును నాశన మొనర్పవలయునని తలంపు కలిగియున్నారో, అట్టి పాపముయొక్క నాశనముకొఱకే మిమ్ములను మేము శరణం బొచ్చియున్నారము, మీరు భక్తులందు అనురాగము కలవారు కావున మాపాపముల నాశన మొనర్చు టకే ప్రయత్నించుచున్నవారలు, మేమున్ను ఇందు కొఱకే మిమ్ములను శరణు పొంది యున్నవారము, అట్లు మేము శరణమును పొందకున్న మాపాతకం బును నాశన మొనర్చుటకయి మీరు ఉద్యమించుట ఎట్లు! అని భావము.

ఓ జలదేవతలారా! మమ్ములను పుత్రదుహిత్రాది జననసమర్థులను చేయుఁడు.

అవ. ఇఁక మంత్రద్వయము జలాధిదేవత యగు వరు ణుని ప్రార్థనాపరమగునది చెప్పఁబడుచున్నది:—

మం. ౧. హిరణ్యశృఙ్గం వరుణం ప్రపద్యే
తీర్థం మే దేహి యాచితః ।

యన్మయా భుక్తమసాధూనాం
పాపేభ్యశ్చ ప్రతిగ్రహః ॥

మం. ౧. యన్మే మనసా వాచా
కర్మణా వా దుష్కృతం కృతమ్ ।
తన్న ఇంద్రో వరుణో బృహస్పతి
స్సవితా చ పునంతు పునఃపునః ॥

టీక. ౧. హిరణ్యశృంగం = బంగారు కిరీటముగల, వరుణం = వరుణుని, ప్రపద్యే=శరణు జొచ్చుచున్నాఁడను, ఓవరుణ దేవా! యాచితః = నాచేత యాచింపఁబడిన వాఁడవై, తీర్థం=అవతరణ స్థానమును, మే=నాకు, దేహి=ఇమ్ము, మయా=నాచేత, అసాధూనాం = పాపులయొక్క గృహములందు, యత్=ఎయ్యది, భుక్తం = భుజింపఁబడినదో, పాపేభ్యశ్చ = పాపులయొక్క సమీపము నుండి, ప్రతిగ్రహః (కృతః)=ప్రతిగ్రహింపఁబడినదో.

౨. మే=నాయొక్క, మనసా = మనస్సుచేతను, వాచా = వాక్కుచేతను, కర్మణావా = కర్మచేతను, యత్=ఏ, దుష్కృతం = దురితము, కృతం = చేయఁబడినదో, నః=మాయొక్క, తత్ = ఆపాపమునంతయు, ఇంద్రః = ఇంద్రుఁడును, వరుణః = వరుణుఁడును, బృహస్పతిః = బృహస్పతియు, సవితాచ = సవితయు, పునఃపునః = మాటిమాటికి, పునన్తు = శోధించెదరుగాక.

తా. ౧. హిరణ్యశృంగుఁ డనఁగా బంగారువికార మగు పర్వతశృంగమువలె పయినుండు కిరీటము గలవాఁడగు వరుణుని అనుగ్రహము నఖిల

క్షించి దరిచేరుచున్నాఁడను, నాచేత ప్రార్థింపఁబడిన ఓవరుణదేవా! ఈ నద్యాదికమునందు సుఖావగాహనార్థము నిమ్నోన్నతములు లేని రేవును నాకొసంగుము, మఱియు పాపాత్ములగృహమునందు భుజించుటచేత వచ్చిన దోషమును, పాపాత్ములవలన పొందిన ప్రతిగ్రహమువలనఁ గలిగిన దోషమును ఈరెంటిని పోఁగొట్టి నన్ను పునీతుని చేయుదువుగాక.

౨. నేను మనోవాక్కాయకర్మములచేత చేసిన పాపముల నన్నింటిని ఇంద్రుఁడు, బృహస్పతి, సవిత వీరందఱు ఎప్పటి కప్పుడే తొలఁగించి నన్ను పవిత్రునిగా నొనర్తురుగాక.

అవ. జలములందున్న దేవతలయొక్క నమస్కారమంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. నమోఽగ్నయేఽప్సుమతే నమ ఇన్ద్రాయ నమో వరుణాయ నమో వారుణ్యై నమోఽద్భ్యః ॥౧౨॥

టీక. అప్సుమతే = జలములుగల, అగ్నయే = అగ్నికొఱకు, నమః= నమస్కారము, ఇంద్రాయ = ఇంద్రునికొఱకు, నమః=నమస్కారము, వరుణాయ=వరుణునికొఱకు, నమః=నమస్కారము, వారుణ్యై = వరుణదేవతాపత్నికి, నమః=నమస్కారము, అద్భ్యః = జలములకొఱకు, నమః = నమస్కారము.

తా. జలమధ్యమునందు నిగూఢమయి యుండు అగ్నికిని, ఇంద్రుని కొఱకును, వరుణుని కొఱకును, వరుణపత్నికిని, జలాధిదేవతల కొఱకును నమస్కారమని తాత్పర్యము.

అవ. స్నానప్రదేశమునందుండు దుష్టజలమును తీసి వేయునట్టి మంత్రము చెప్పుచున్నాఁడు:—

మం. యదపాం క్రూరం యదమేధ్యం యదశాన్తం తదప గచ్ఛతాత్ ॥

టీక. అపాం = జలసంబంధమయిన, యత్ = ఏ, క్రూరం = మరణ కారణ మగు సుడిగుండము మున్నగునవి గలవో, యత్ = ఏయది, అమేధ్యం = ఉమ్మిలోనగు అపవిత్రవస్తువు గలదో, యత్ = ఏయది, అశాంతం= వాతశ్లేష్మాదికమును కలుగఁజేయునో, తత్ = అదియంతయు, అపగచ్ఛతాత్ = (ఈప్రదేశమునుండి) తొలఁగిపోవుఁగాక.

తా. నేను స్నానముచేయు ఈజలములందు సుడిగుండము మున్నగు క్రూరరూపము, ఉమియుట లోనగు అపవిత్రత, వాతశ్లేష్మాది జనకమయిన అశాంతత ఇవియన్నియు ఈప్రదేశమునుండి తొలఁగి పోవుఁగాక.

అవ. ఇఁక స్నానమంత్రములు:—

మం. ౧. అత్యాశనాదతీపానాద్యచ్చ ఉగ్రాత్ప్రతిగ్రహాత్ ।
తన్నో వరుణో రాజా పాణినా హ్యవమర్శతు ॥

మం. ౨. సోఽహమపాపో విరజో నిర్ముక్తో ముక్తకిల్బిషః ।
నాకస్య పృష్ఠమారుహ్యగచ్ఛేద్బ్రహ్మ సలోకతామ్ ॥

టీక. ౧. అత్యాశనాత్ = అత్యాశనము వల్లనుండియు, అతీపానాత్ = అతీపానమువల్ల నుండియు, ఉగ్రాత్ = స్వేచ్ఛాచారియైచరించు వారివల్లనుండి పొందిన, ప్రతిగ్రహాత్=ప్రతిగ్రహమునుండియు, యచ్చ= ఏపాపము కలుగుచున్నదో, తత్=ఆపాపమును, రాజా=రాజగు, వరుణః= వరుణుఁడు, పాణినా = చేతిచేత, అవమర్శతు = తీసివేయుఁగాక.

౨. అపాపః=పాప రహితుఁడనై, సః=ఆ, అహం=నేను, విరజః = రజోగుణరహితుఁడనై, నిర్ముక్తః = రాగద్వేషాదిదోషములచేత వదలఁబడిన వాఁడనై, ముక్తకిల్బిషః = చేసినట్టియు చేయఁబోవు నట్టియు పాపములు లేనివాఁడనై, నాకస్య = స్వర్గముయొక్క, పృష్ఠం = ఉపరిభాగమును, ఆరుహ్య = అధిష్ఠించి, బ్రహ్మసలోకతాం = హిరణ్యగర్భునితోడి సమాన లోకత్వమును, గచ్ఛేత్ = పొందెదను.

తా. ౧. అత్యాశనమనఁగా దేవయజ్ఞ, పితృయజ్ఞ, భూతయజ్ఞ, మనుష్యయజ్ఞ, బ్రహ్మయజ్ఞముల నాచరింపక చేయునట్టి భోజనము.

అతీపాన మనఁగా దేవ, ఋషి, పితృతర్పణముల నాచరింపక చేయు నట్టి జలపానమగును.

ఉగ్రు డనఁగా శాస్త్రానుసారముగ చరింపక తనయిచ్ఛానుసారము చరించువాఁడు, అట్టివారివల్లనుండి ప్రతిగ్రహమనఁగా ధనాదికమును గ్రహించుట ఉగ్రప్రతిగ్రహ మనబడును.

ఇట్టి అత్యాశన, అతీపాన, ఉగ్రప్రతిగ్రహముల నాచరించుటవలన కలిగిన పాపమును వరుణదేవుఁడు తనచేతితో తీసివైచుఁ గాక.

౨. అందువలన పాపరహితుఁడనై రజోగుణాదికమును విడిచి సంసార కారణమగు రాగద్వేషాదికము తొలఁగి నిర్ముక్తుఁడ నగుదును, నాచేత అనుష్ఠితములును అనుష్ఠాస్యమానములును అగు పాపములను తొలఁగి పిదప స్వర్గము నధిష్ఠించి తరువాత బ్రహ్మసాలోక్యమును పొందెదనని తాత్పర్యము.

మం. యశ్చాప్సు వరుణ స్స పునాత్వఘమర్షణః ॥

టీక. అప్సు=జలములందు, యః చ వరుణః=ఏవరుణుఁడు గలఁడో అఘమర్షణః = పాపనాశకుఁడగు, సః=ఆవరుణుఁడు, పునాతు = (నన్ను) పవిత్రునిగాఁ జేయుఁగాక.

తా. సప్తసముద్రజలములందును, నానావిధంబు లగు మహానదుల జలంబులందును, నదంబుల జలంబులందును, దిగుడుబావుల జలంబులందును, నూతుల జలంబులందును అధిష్ఠితుండై వర్తిల్లుచు (ఉపాసకుల) మహాపాతకంబులఁ బోఁగొట్టుచుండు వరుణదేవుఁడు నన్ను పరిశుద్ధునిగాఁ జేయుఁగాక.

అవ. తీర్థభూతములగు గంగాదినదుల ఆవాహనమంత్రమును చెప్పుచున్నాఁడుః—

మం. ఇమం మే గంగే యమునే సరస్వతి
శుతుద్రి స్తోమగ్ం సచతా పరుష్ణియా ।
అసిక్నియా మరుద్వృధే
వితస్తయార్జీకీయే శృణుహ్యాసుషోమయా ॥

టీక. గంగే=ఓ గంగానదీ! యమునే = ఓయమునానదీ! సరస్వతి= ఓసరస్వతీనదీ! శుతుద్రి = ఓశుతుద్రీనదీ! మే=నాయొక్క, ఇమం=ఈ స్తోమం = స్తుతిని, శృణుహి = వినండి, మరుద్వృధే = ఓమరుద్వృధయనునదీ! పరుష్ణియా = పరుష్ణియను నదితోడ, అసిక్నియా=అసిక్ని యను నదితోడను, ఆర్జీకీయే = ఓయార్జీకీయయనునదీ! వితస్తయా = వితస్తానదితోడను, సుషోమయా = సుషోమయను నదితోడను, ఆసచత = (ఈప్రదేశమునకు) రండు.

తా. శ్రీవిశ్వనాథుని రాజధానియగు కాశీనగరరాజమునందుండు ఓగంగానదీ! సూర్యతనయవగు ఓయమునానదీ! నదీరూపమున నున్న బ్రహ్మపత్ని వగు ఓసరస్వతీ! ఓశుతుద్రీనదీ! ఓయార్జీకీయానదీ! ఓమరుద్వృధా

నదీ! మీరందఱును పరుష్ణి, అసిక్ని, వితస్తా, సుషోమలను నదులతోడను (దయ చేసి) నాచేత మనఃపూర్వకముగ పఠింపఁబడుచున్న మంత్రసముదాయమును వినుఁడు, విని నన్ను పావనముచేయుటకును నేనుకోరునది ఒసంగుటకొఱకును మీమీస్థానంబులనుండి బయలువెడలి నేను స్నానమొనర్చు తావున జల మధ్యభాగమునకు రండు, నాకు మీసన్నిధి నొసంగుఁడు, ప్రార్థించు వాని యభిప్రాయ మిది:—

నే నీమంత్రంబులందు పేర్కొనినవియు, పేర్కొననవియు నగు మహానదుల తీరములకు పోయి అచ్చట చిరకాలమువసించి స్నానమొనర్చుచు ఆయాపుణ్యనదీజలములఁ ద్రాగుచు దివసంబులగడుప నసమర్థుఁడను, అయినను నేను ఎందేని ఒక మడుగుయొక్క నీటియందుఁగాని కూపాదికముయొక్క జలములందుఁగాని స్నానమాచరించుచు నీమంత్రముచేత గంగాదినదుల నుప స్థానంబు (ఉపస్థానమనఁగా నిలుచుండి ప్రార్థించుట) చేయుచున్నాఁడను, నా యుపస్థానము నాలకించి నేను స్నానమొనర్చు ఈ జలంబులందు మీరలు సాన్నిధ్య మొసంగుఁడు, సాన్నిధ్యమొసంగి నే నొనర్చిన మహః పాతకముల వినాశమొనర్చి "నీవు మాచేత పూతుఁడవైతివి, కావున పరిశుద్ధుండవు, సకుటుంబుఁడవై సపరివారుఁడవై సాత్త్రితుఁడవై భూమి యందుఁ గల భోగంబుల ననుభవించి పిదప దేహావసానసమయంబున పుణ్య కర్మల నాచరించువారలు పొందు పుణ్యలోకముల నీ ఇచ్ఛానుసారము పొందుము" అని నన్నాశీర్వదింపుఁడు అని తాత్పర్యము.

౮౧. జలమునందు మునిఁగినవానికి ప్రాణాయామా ర్థము అఘమర్షణసూక్తము చెప్పఁబడుచున్నది:—

మం. ౧. ఋతం చ స॒త్యం చా॒భీద్ధా॒త్తప॒సోఽధ్య॑జాయత ।
తతో॒ రాత్రి॑రజాయత॒ తత॑స్సము॒ద్రో అ॑ర్ణ॒వః ॥౧౩॥

మం. ౨. సముద్రాదర్ణవాదధి సంవత్సరో అజాయత।
అహోరాత్రాణి విదధద్విశ్వస్య మిషతో వశీ ॥

మం. 3. సూర్యాచన్ద్రమసౌ ధాతా
యథాపూర్వ మకల్పయత్ ।
దివం చ పృథివీం చాన్తరిక్షమథో సువః।

టీక. ౧. అభీద్ధాత్=అంతటఁ బ్రకాశించు పరమాత్మవలన, ఋతం=జ్ఞానోదయపర్యంతము సత్యముగాఁదోఁచు పృథివ్యాది భూతపంచకము, సత్యం చ=జ్ఞానోదయపర్యంతము సత్యముగాఁదోఁచు ౧౪ భువనములు, తపసోఽధి= పర్యాలోచనమయిన పిదప, అజాయత=పుట్టెను, తతః=(భూతపంచక చతుర్దశభువనసృష్టి) అయిన పిదప, రాత్రిః=రాత్రి, అజాయత=పుట్టెను, తతః=పిదప, సముద్రః=సముద్రము, అర్ణవః=వాపీకూపతటాకాదికము, అజాయత=పుట్టెను.

౨. సముద్రాత్ అర్ణవాత్ అధి=సముద్ర వాపీకూపతటాకాదికము పుట్టిన పిదప, అహోరాత్రాణి = అహోరాత్రాదికమును, విదధత్=చేయుచున్నట్టియు, మిషతః=నిమేషము చేయుచున్నట్టి (చేయనట్టి)యు, జగతః=జగత్తుయొక్క, వశీ = స్వాధీనకర్తయగు, సంవత్సరః=సంవత్సరము, అజాయత = పుట్టెను.

3. ధాతా = పరమేశ్వరుఁడు, సూర్యాచంద్రమసౌ = సూర్యచంద్రులను, దివంచ = ద్యులోకమును, పృథివీంచ=భూలోకమును, అంతరిక్షం = అంతరిక్షలోకమును, అథో = అధోభాగమునందుండు లోకసప్తకమును, సువః = లోకత్రయమునకు వలయు భోగ్యజాతమును, యథాపూర్వం = గతించిన కల్పాదికమునందువలె, అకల్పయత్ = సృజించెను.

తా. ఈమూఁడు ఋక్కులకు పదయోజన మొకటియే "ఞిఇన్ధీ" యనుధాతువు దీప్త్యర్థకము, ఆధాతువువల్లనుండి ఇద్ధశబ్దము పుట్టినది, అభి= అంతట, ఇద్ధము=ప్రకాశించునది, అభీద్ధము=పరమాత్మ, అట్టిపరమాత్మవలన ఋతఁబన జ్ఞానోత్పన్నమగునంతదనుక సత్యముగాఁ దోఁచు పృథివ్యాది భూతపంచకము ఉత్పన్నమాయెను, సత్యంబనఁగా జ్ఞానోదయమగు వఱకు సత్యముగాఁ దోఁచు చతుర్దశభువనములును ఉత్పన్నమాయెను, పంచభూతములును చతుర్దశభువనములును బ్రహ్మజ్ఞాన ముదయించు దనుకనే సత్యంబులగుటంజేసియు జ్ఞానోత్పత్త్యనంతరము (సర్వము బ్రహ్మాకారంబుగాఁ దోచును గావున) నిదియెల్ల మిథ్యగా నంగీకరించుటం జేసియు, జ్ఞానోదయంబు దనుక యని చెప్పఁబడినది. 'ఋతం+చ. సత్యం+చ' అని ఈ పదములందు గల చకారమువలన పంచభూతములు అందుండు ప్రాణిసముదాయము, చతుర్దశభువనములు, అందలి ప్రాణిసముదాయము అని యర్థము, ఈ భూతపంచకము, చతుర్దశభువనములు ఎప్పు డుత్పన్నమయిన దందు రేని వినుఁడు, తప మనఁగా పర్యాలోచనము, అయిసమీఁద ఉత్పన్నమాయెను. "నేను ఈ బ్రహ్మాండమును ఈవిధముగాఁ జేసెదను, ఈవిధముగా జీవయుతముగా నొనర్చెదను" అని పర్యాలోచన మొనర్చిన పిదప ఉత్పన్నములయినవని యర్థము. ఇట్లని శ్రుతిగలగు:—"సోఽకామయత బహుస్స్యాం...యదిదం కించ"" అని (అర్థము. ఆపరమాత్మ ము సంకల్పించెను, ఏమని? నామరూపంబుల బహుళముగా నగుదునని అతఁడు పర్యాలోచనముచేసెను, చేసి పరిదృశ్యమానం బగు నీసర్వంబును మనకంటికి నగపడనట్టి ఆసర్వంబును సృజించెను.) తపధాతువు పర్యాలోచన వాచకమయియున్నది, లోకానుభవము సైతమిట్లే:—కుమ్మరి "కుండను చేసెదను" అని ఆలోచించి కుండను జేయును. "శరావమును జేసెదను" అని ఆలోచించి శరావమును (మూఁకుడు) చేయునుగదా.

భూతపంచకము చతుర్దశభువనములును పుట్టినపిదప రాత్రి పుట్టెను, ఇచట రాత్రి యుపలక్షకము, పగలుకూడా పుట్టెనని గ్రహించవలయును. పిదప సప్తవిధసముద్రములు పుట్టెను, అర్ణంబులనఁగా జలములు, అవి గల్గి యుండునది అర్ణవము, వాపీకూపతటాకాదికము జన్మించెను.

౨. సముద్రము, అర్ణవములు పుట్టిన పిదప ఏకాదశ, ద్వాదశ, త్రయోదశ మాసాత్మకమగు సంవత్సరముపుట్టెను, ఆసంవత్సర మెట్టిదనఁగా పగలు, రేయి, గడియలు, ముహూర్తములు, జాములు లోనగు కాలవిభాగమును గలుగఁజేయునది, మఱియు నిమిషంబుల నొనరించునట్టియు నిమిషముల నొనరింపనట్టియు అనఁగా వ్యాపారము నొనర్చునట్టియుఁ వ్యాపారమును చేయనట్టియు (చరాచరాత్మక మగు) జగత్తును స్వాధీనమొనర్చుకొన్నదని భావము.

3. ఆధారభావమును ఆధేయభావమునై కనంబడు బ్రహ్మాండమునెల్ల పరమాత్మ సృజియించెనని చెప్పఁబడినదిగదా, దాని నేయాకృతితో సృజించెననఁగా వినుఁడు:—పరమేశ్వరుఁడు సూర్యుని, చంద్రుని, భూమిని, ఆకాశమును, దివమును, సువర్లోకము మూఁడులోకములలోను భోగ్యపదార్థజాతమును, దిగువనుండు నేడులోకములను పూర్వపూర్వములగు కల్పములం దెటులఁ గల్పించెనో ఆయాప్రకారంబుల నీకల్పమునందును కల్పించెను అని తాత్పర్యము. "దివం+చ, పృథివీం+చ," అని యిందుగల చకారద్వయంబువలన మంత్రోక్తంబును అనుక్తంబును అగు సర్వము సముచ్చితంబైనదని గ్రహింపవలయును.

కొందఱు ఋతమనఁగా యథార్థభాషణ మనియు, సత్యం బనఁగా యథార్థసంకల్పమనియు వ్యాఖ్యానమును చేసెదరు, వారివ్యాఖ్యానమున భూతంబులయొక్కయు భువనంబులయొక్కయు ఉత్పత్తికి పిదప అని మొదట అధ్యాహారము చేసికొనవలయును, అట్లుగాక భూతలంబులును భువ

నంబులును ఉత్పన్నములు కానియెడల ప్రాణులెక్కడ? వాఙ్మానసాదివ్యాపారమెక్కడ? సముద్రాదులయుత్పత్తి ఎక్కడ? కావున మే మొనర్చిన వ్యాఖ్యానమే విశ్వసింపఁదగినది. (అని సాయణాచార్యులవారు వేదభాష్యమునందు వ్రాసివారు.)

విశేషము:—'అహోరాత్రాణి విదధత్' అనియు పాఠాంతరము గలదు.

అవ. అఘమర్షణసూక్తమయినపిదప స్నానార్థమయిన మంత్రములు చెప్పఁబడుచున్నది:—

మం. ౧. యత్పృథివ్యాగ్ం రజస్స్వమాన్తరిక్షే విరోదసీ।
ఇమాగ్ం స్తదాపో వరుణః పునాత్వఘమర్షణః ॥

మం. ౨. పునన్తు వసవః పునాతు వరుణః
పునాత్వఘమర్షణః।
ఏష భూతస్య మధ్యే భువనస్య గోప్తా ॥

మం. 3. ఏష పుణ్యకృతాం లోకా
నేష మృత్యోర్ హిరణ్మయమ్।
ద్యావాపృథివ్యోర్ హిరణ్మయగ్ం
సగ్ం శ్రితగ్ం సువః ॥౧౪॥

స న స్సువ స్సగ్ం శిశాధి ॥

టీక. పృథివ్యాం = భూమియందున్న (మాకు), యత్=ఏ, రజః= పాపము, స్వం=స్వకీయమైనది (గలదో), అన్తరిక్షే = అన్తరిక్షలోకము నందు, విరోదసీ = ద్యావాపృథ్వ్యలందును, యేపాపము మాసంబంధమైనది గలదో, తత్=ఆసమస్తమైన పాపమును, ఇమాన్ = ఈమమ్ములను, ఆపః= జలరూపుఁడును, అఘమర్షణః = పాపవినాశకుఁడును అగు, వరుణః = వరుణుఁడు, పునాతు = పవిత్రునిచేయుఁగాక.

౨. వసవః=అష్టవసువులు, పునంతు=(మమ్ములను) పవిత్రునిచేసెదరుగాక, వరుణః=వరుణుఁడు, పునాతు=పవిత్రులఁజేయుఁగాక, అఘమర్షణః= అఘమర్షణ మహర్షి, పునాతు=పవిత్రులఁజేయుఁగాక, ఏషః=ఈవరుణుఁడు, భూతస్య = అతీతమయిన, మధ్యే = పుట్టఁబోవునట్టి, భువనస్య = ప్రాణిసమూహముయొక్క, గోప్తా = రక్షకుఁడు.

3. ఏషః=ఇతఁడు పుణ్యకృతాం = పుణ్యాత్ములకు, లోకాన్ = లోకములను, (ప్రయచ్ఛతి = ఇచ్చును) ఏషః=ఇతఁడు, మృత్యోః = మృత్యుసంబంధ మయిన, హిరణ్మయం=లోకవిశేషమును, (పావులకు కలుగఁజేయుచున్నాడు) ద్యావాపృథివ్యోః = ద్యులోక పృథివీలోకములకు, సంశ్రితం=సంబంధమయిన, హిరణ్మయం=హిరణ్మయమగు ఏలోకము గలదో, సువః=అట్టి స్వర్గలోకమును, సః=ఆనీవు, నః=మమ్ములనుగూర్చి, సంశిశాధి= లెస్సగ ననుగ్రహింపుము.

తా. ౧. పృథివీలోకంబునఁ జరించు నస్మత్సంబంధి యగుపాపమును, అంతరిక్షలోకమునందును, పృథివీలోకంబునందును, స్వర్గలోకమునందును అన్నిలోకములందును (మేము సంపాదించిన, పాతకమును) అనఁగా స్వర్గమర్త్యపాతాళలోకములందెల్లెడల జనియించి ఆయాజన్మంబులందుఁ జేసిన సకలపాపంబులను రూపుమాపి అట్టి పాతకంబుల నొనరించిన మమ్ములను వరుణుఁడు పరిశుద్ధులను జేయుఁగాక. (ఈమంత్రంబునందుండు "విరో

డసీ" అనుపదమునకు భూమియు, దివియు రెండును అర్థంబు లగుటచేతను, మఱల ద్యులోకభూలోకంబులను వేఱుగాఁ జెప్పియుండుటచేతను మొదటఁ గల పృథివీశబ్దమునకు పృథివికి దిగువభాగమున వర్తించు పాతాళలోక మర్థముగా నిట గ్రహింపవలయును.) జలస్వామియగుటచేత జలరూపమున నున్నవాఁడును, పాపములను వినాశ మొనరించువాఁడును అగువరుణుఁడు నన్ను పరిశుద్ధునిఁ జేయుఁగాక.

౨. మఱియు వసువు లెనమండ్రుగురును, మాపాపంబులను తొలఁగించి మమ్ములను పరిశుద్ధులను చేయుదురుఁగాక, వరుణుఁడు మమ్ములను పరిశుద్ధులనుఁగా చేయుఁగాక. అఘమర్షణమహర్షి మమ్ముల పరిశుద్ధులఁ జేయుఁగాక. ఈవరుణుఁడు భూతకాలమందలి ప్రాణుల సంరక్షించినవాఁడు, వర్తమాన కాలమునందలి ప్రాణుల సంరక్షించుచున్నవాఁడు, భావికాలమునందలి ప్రాణుల సంరక్షింపఁగలవాఁడు.

3. ఈవరుణుఁడే జ్యోతిష్టోమాదికము లగు పుణ్యకర్మల నొనర్చిన వారికి తత్తత్కర్మానురూపము లగు పుణ్యలోకముల నిచ్చువాఁడు, ఈవరుణుఁడే పాపాత్ములకు సర్వప్రాణిమారకమును మృత్యుసంబంధియు నగు "హిరణ్మయము" అను లోకము నొసంగువాఁడు, ద్యులోకభూలోకములందు సంశ్రితమైయుండు స్వర్గమను పేరుగలదియు బ్రహ్మాండరూపమును అగు హిరణ్మయలోకము నొసంగువాఁడు, ఓ వరుణదేవా! అట్టి నీవు మాకట్టి స్వర్గమును లెస్సగ ననుగ్రహింపుమని తాత్పర్యము.

అవ. స్నానమొనర్చిన పురుషునకు ఆచమనమంత్రములు. చెప్పఁబడుచున్నది:—

౧. మం. ఆర్ద్రం జ్వలతి జ్యోతిరహమస్మి ॥

౨. మం. జ్యోతిర్జ్వలతి బ్రహ్మాహమస్మి ॥

3. మం. యోఽహమస్మి బ్రహ్మాహమస్మి ॥

౪. మం. అహమస్మి బ్రహ్మాహమస్మి ॥

౫. మం. అహమేవాహం మాం జుహోమి స్వాహా ॥

టీక. ౧. ఆర్ద్రం = ఎయ్యది ఉదకరూపమై తడిదిగా ఉన్నదో అట్టి యార్ద్రము, జ్వలతి = ప్రకాశించుచున్నది, అహం = నేను, జ్యోతిః = చైతన్యరూపమయిన జ్యోతిని, అస్మి = అగుచున్నాఁడను.

౨. జ్యోతిః=జ్యోతిస్సు, జ్వలతి = ప్రకాశించుచున్నది. బ్రహ్మ = బ్రహ్మము, అహం = నేను, అస్మి=అయితిని.

3. యః=ఏజీవరూపుఁడను, అహం = నేను, అస్మి = అయితినో, అట్టి అహం=నేను, బ్రహ్మ=బ్రహ్మము, అస్మి=అయితిని.

౪. అహం=నేను, అస్మి = అహంకారమునకు సాక్షిభూతుఁడ నగుచున్నాఁడను. అహం=నేను, బ్రహ్మ=బ్రహ్మము, అస్మి=అగుచున్నాఁడను.

౫. అహం=నేను, అహం ఏవ = పూర్వసిద్ధమయిన నేనే, మాం=జుస్వరూపుఁడ నగునన్ను, జుహోమి = (ఉదరాగ్నియందు) ఉంచుచున్నాఁడను, స్వాహా=స్వాహాకారమగుఁగాక.

తా. ఉదకరూప మగుటచేత తడిదగు నీయార్ద్రము స్వాధిష్ఠాన మగు చైతన్యముచేత ప్రకాశించుచున్నది, ఆ యధిష్ఠానచైతన్యరూపమగు జ్యోతియే నే నగుచున్నాఁడను, ఆవిషయమే చెప్పఁబడుచున్నది:—ఏ జ్యోతి ప్రకాశింపఁబడుచున్నదని చెప్పఁబడియున్నదో ఆజ్యోతియే బ్రహ్మము, కావున జ్యోతియే నేనగుదు నను వాక్యమునకు భావము బ్రహ్మమే నే నగుదుననియే, జీవాత్మకు సృష్టితో సిద్ధమగు స్వరూపమునకింది బ్రహ్మస్వ మనియెడి రూపాంతరము సిద్ధించుచున్నదని మాత్రము కాదు, మఱేమనఁగా

మునుపు జీవుఁడనైయున్న నేనే ఇప్పుడు బ్రహ్మ మగుచున్నాఁడను, వాస్తవ ముగా బ్రహ్మస్వరూపుఁడనగు నాయందు అజ్ఞానముచేత జీవత్వము ఆరోపితమయ్యెను, వివేకముచేత ఆయజ్ఞానము తొలఁగింపఁబడినది కావున పూర్వసిద్ధమగు బ్రహ్మరూపమునే నేననుభవించుచున్నాఁడను కాని నూతనమగు బ్రహ్మత్వ మేమియు నాకు రాలేదు, నేను అహంకారమునకు సాక్షిభూతుఁడను గాని అహంకార స్వరూపుఁడను గాను, నేను బ్రహ్మము కావున బ్రహ్మత్వానుభవవేళయందును పూర్వసిద్ధుఁడనగు నేనే జలరూపుఁడ నగు నన్ను, ఉదరాగ్నియందు హోమముచేయుచున్నాఁడను, (ఇందు చెప్పఁబడిన బ్రహ్మత్వము ఛాందోగ్యోపనిషత్తునందు పంచాగ్నివ్యాప్తియందు చెప్పిన తెఱఁగున ౧ ద్యులోక ౨ పర్జన్య ౩ పృథివీ ౪ పురుష ౫ యోషిత్తులను పంచాగ్నులనుగా ధ్యానించుమని చెప్పినప్పుడు యోషిత్పురుష పృథివీ పర్జన్య ద్యులోకములందు అగ్నిత్వము గౌణ మెటుల నయినదో, అదేవిధముగా నాయందుకలిగిన బ్రహ్మత్వము గౌణముకాదని భావము. స్వాహాపదము హవిర్దానవాచి కావున నాదేహమున వర్తించు ప్రాణాద్యభిమానులగు దేవతలకు జలరూపమగు హవి స్సీయఁబడుచున్నదని తాత్పర్యము.

౨౯. ఆచమనానంతరము మఱల స్నానమంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. అకార్యకార్యవకీర్ణీ
స్తేనో భ్రూణహా గురుతల్పగః।
వరుణో౽పామఘమర్షణ
స్తస్మా త్పాపా త్ప్రముచ్యతే॥

టీక. అపాం = ఉదకములయొక్క (ప్రభువున్నూ), అఘమర్షణః = పాపనాశకుఁడును అగు, వరుణః = వరుణుఁడు, అకార్యకారీ = అకృత్యములను చేయువాఁడును, అవకీర్ణీ = నిషిద్ధస్త్రీగమనముచేత క్షతవ్రతుఁడును, స్తేనః = బ్రాహ్మణసువర్ణమును హరించినవాఁడును, భ్రూణహా = భ్రూణహత్యను చేసినవాఁడును, గురుతల్పగః = గురుతల్పమును పొందినవాఁడును, (ఇట్టి పాపములను చేసిన నన్నుకూడ) తస్మాత్ = ఆ, పాపాత్ = పాపములవల్ల నుండి, ప్రముచ్యతే = వదలించుఁగాక.

తా. శాస్త్రనిషిద్ధములయిన పనులనే సర్వదా చేయువాఁడును, దుష్ట స్త్రీగమనముచేత వ్రతభంగము గలవాఁడును, బ్రాహ్మణ సువర్ణమును దొంగిలినవాఁడును వేదవేత్తయగు బ్రాహ్మణుని గాని, లేక గర్భమునుగాని హత్య చేసినవాఁడును, గురుభార్యాగమనము చేసిన వారలును మహాపాతకు లనంబడుదురు, ఇట్టి మహాపాతకములను నేనొనర్చియున్నను ఆ పాపములనన్నింటిని నాశన మొనర్చువాఁడును, జలాధిపతియు నగు వరుణుఁడు నన్ను పాపములనుండి విముక్తుని చేయుఁగాక.

అవ. రహస్యకృతపాపక్షయార్థమగు మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. రజో భూమి స్త్వమాగ్ం రోదయస్వ ప్రవదంతి ధీరాః ॥

టీక. (అహం = నేను) రజోభూమిః = పాపమునకు స్థానభూతుఁడను (అయినను), త్వం=నీవు, మాం=నన్ను, (న) రోదయస్వ = ఏడ్పింపకుము, ధీరాః = శాస్త్రజ్ఞులు, ప్రవదన్తి = పలుకుచున్నారు.

తా. ఓపరమాత్మా! నేను పాపమునకు స్థానభూతుఁడ నైనను నీవు మాత్రము నన్ను పాపఫలములు అనుభవింపఁజేయుటకుఁ గాను నన్ను దుఃఖ

పెట్టవలదు, శాస్త్రజ్ఞులు చెప్పినవిధముగా పాపాత్ముఁడ నగు నేనుకూడ నా పాపముల పోఁగొట్టి సంరక్షించుమని నిన్ను ప్రార్థించుచున్నాఁడను కావున నీవున్నూ నాపాపమును పోఁగొట్టి నన్ను సంరక్షింపుము.

'త్వం' అనుపదమునకు అనుస్వారలోపము ఛాందసము, నకారము అధ్యాహృతము.

విశేషము:—ద్రవిడపాఠమునందు ఈయజుర్మంత్రముతోడ "పునంతు ఋషయః పునాతు వసవః పునాతు వరుణః పునా త్వఘమర్షణః" అని కలిపి పఠింపఁబడుచున్నది.

౭౮. స్నానానంతరము జపింపవలసిన మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ఆక్రాన్థ్సముద్రః ప్రథమే విధర్మ
ఞ్జనయ న్ప్రజా భువనస్య రాజా।
వృషా పవిత్రే అధి సానో అవ్యే
బృహత్సోమో వావృధే సువాన ఇందుః ॥౧౪॥

మం. పరస్తా ద్యశో గుహాసు మమ చక్రతుండాయ ధీమహి
తీక్ష్ణదగ్గ్ంష్ట్రాయ ధీమహి పరి ప్రతిష్ఠితం దేభు ర్య
చ్ఛతు దధాతనా ద్భోఖ్య అర్ణవ స్సువో రాజైకం చ॥
॥౧౫॥

మం. రుద్రో రుద్రశ్చ దంతిశ్చ నంది షణ్ముఖ ఏవ చ।
గరుడో బ్రహ్మ విష్ణుశ్చ నారసిగ్ంహ స్తథైవ చ
ఆదిత్యో ఽగ్నిశ్చ దుర్గిశ్చ క్రమేణ ద్వాదశాఙ్భసి।
మ మ వ చ మ సు వె నా వ భా వై కా త్యా యనాయ ॥

ప్రథమానువాక స్సమాప్తః

టీక. సముద్రః = పరమాత్మ, విధర్మన్ = వివిధధర్మోద్భోధకాలముగు, ప్రథమే = సృష్ట్యాదికాలమునందు, ప్రజాః=ప్రజలను, జనయన్ = సృజించుచు, అక్రాన్ = అంతట వ్యాపించెను, (సః=ఆపరమాత్మ) భువనస్య = ప్రపంచమునకు, రాజా = రాజు, వృషా = భక్తులకు కోర్కులను వర్షించువాడు, పవిత్రే = పవిత్రమైనట్టియు, అధి=శ్రేష్ఠమయినట్టియు, అవ్యే = పాలన హేతువగు, సానో=హృదయ పుండరీకమునందు, సోమః = పార్వతీ సమేతుఁడై, బృహత్ = గొప్పగా, వవృధే=వృద్ధిని పొందెను, (సః=ఆపరమాత్మ) సువానః – సర్వప్రేరకుఁడు, ఇందుః = సర్వాహ్లాదకరుఁడు.

తా. ఆసంగాత్మ సముద్రమువలె ప్రాథమై పరమానందస్వభావముగా నుండుటవలన సముద్రశబ్దవాచ్యుఁ డగుచున్నాఁడు, ఆట్టి పరమాత్మ సృష్ట్యాదికాలమునందు జనులను సృజించుచు లోకమంతయు వ్యాపించెను, సృష్ట్యాది కాల మెట్టిదనఁగా, ప్రాణులచేత పూర్వకల్పమునందు అనుష్ఠింపఁబడిన సకలధర్మములు ఫలములొసంగుటకు ఎప్పుడు అభిముఖము లగునో ఆది విధర్మము, ఆట్టి సృష్ట్యాదికాలమునందని యర్థము, ఆపరమాత్మ జగత్పాలకుఁడు, మరియు భక్తుల కభీష్టములను ఒసంగువాఁడు, ఇట్టి పరమాత్మ అంతటవ్యాపించెను, సాను వనఁగా కొండయొక్క పార్శ్వభాగము, శ్రుత్యంతరమునందు "తం బ్రహ్మగిరి రిత్యాచక్షతే" అని చెప్పఁబడియుండుట

చేత బ్రహ్మావబోధమునకు యోగ్యమయిన దేహము 'బ్రహ్మగిరి' యని చెప్పఁబడును, అట్టి దేహమునందలి అవయవమగు హృదయపుండరీకము సానుశబ్ద వాచ్యమగును, అట్టి హృదయ పుండరీకము బాహ్యావయవములవలె ఉచ్ఛిష్ట స్పర్శ మున్నగుదోషములు లేకయుండును కావున పవిత్ర మని చెప్పఁబడుచున్నది. మోక్షపురుషార్థమునకు హేతుభూత మగు ధ్యానాదిక మొనర్చుటకు యోగ్యమయినది కావున ఇతరావయవములకంటె అధికమయినది, ధ్యానించువారలను రక్షించునది కావున అవ్య మని చెప్పఁ బడుచున్నది.

హిమవ త్పుత్రికయగు గౌరి బ్రహ్మవిద్యాభిమాని దేవత కావున గౌరీ వాచకమగు ఉమాశబ్దము బ్రహ్మవిద్యను స్ఫురింపఁజేయుచున్నది, తలవకారో (కేనో) పనిషత్తునందు బ్రహ్మవిద్యామూర్తి వర్ణన మీవిధముగఁ జెప్పఁబడియున్నది:—

శ్రు. 'బహు శోభమానా ముమాం హైమవతీం తాం హోవాచ.'

అట్టి ఉమతో కలసియుండువాఁడు సోముఁడు, పరమాత్మ యగుచున్నాఁడు, అట్టి పరమాత్మ హృదయపుండరీకమునందు వృద్ధి ఎటుల అగునో ఆవిధముగా వృద్ధిని పొందెను, పూర్వ మవిద్యావశముచేత సంకుచితుఁడై జీవ శబ్దముతో నున్నవాఁడు బ్రహ్మవిద్యచేత అవిద్య నశింపఁ జేయఁ బడఁగా బ్రహ్మవిర్భావము కలుగుటచేత వృద్ధిని పొందిన వానివలె గనంబడుచున్నాఁడని భావము, అట్టి సోముఁడే అనఁగా పరమాత్మయే మమ్ములను ధర్మాధర్మములందు ప్రేరేపించు వాఁడు, ఇందుః = ఫలప్రదుఁడై ఆహ్లాదమునకు హేతు వగు చున్నాఁడు అని తాత్పర్యము.

ప్రథమానువాకము సమాప్తము.

౧. "పురస్తా ద్యశో గుహాసు" మున్నగునవి ఈయనువాకమునందున్న పదేసి వాక్యములుగా విభజింపఁబడిన కండికలయొక్క చివరపదములు, కొన్నిచోట్ల ఒక్కొకపదము, కొన్నిచోట్ల వాక్యముకూడ నుండును.

---

౨. ద్వితీయోఽనువాకః

అవ. అనిష్టపరిహారార్థము జపింపవలసిన మంత్రములు చెప్పఁబడుచున్నవి:—

మం. జాతవేదసే సునవామ సోమ
మరాతీయతో నిదహాతి వేదః।
సనః పర్షదతి దుర్గాణి విశ్వా
నావేవ సిన్ధుం దురితాఽత్యగ్నిః॥

టీక. జాతవేదసే = జాతవేదుఁడగు అగ్నికొఱకు, సోమం = (యాగకాలమునందు) సోమలతను, సునవామ = అభిషుతము నొనర్చుచున్నారము, వేదః=అగ్ని, లేక పరమాత్మ, అరాతీయతః = మాయందు శత్రుత్వమును చేయఁదలఁచిన పురుషులను, నిదహాతి = మిక్కిలి కాల్చివేయుఁగాక, సః=ఆయగ్ని (లేక పరమాత్మ), నః=మాయొక్క, విశ్వాదుర్గాణి= ఆపదలనన్నింటిని, అతిపర్షత్=నాశనమొనర్చుచు, (నావికుఁడు) నావా= నావచేత, సింధుం ఇవ = సముద్రమునువలె, అగ్నిః = అగ్నిహోత్రుఁడు, దురితా=మాపాపములను, అతి=మిక్కిలి (నశింపఁజేయుఁగాక).

తా. జ్ఞానంబు లెవనియుండి కలుగునో అతఁడు జాతవేదుఁడని చెప్పఁబడును, ఆధానమొనర్చి అగ్నిహోత్రములను సంపాదించుకొనినయెడల ఆయా కాలములం దొనర్పవలసిన దర్శపూర్ణమాసాది విషయక జ్ఞానములుకలుగుచుండును కావున అగ్ని జాతవేదుఁడని చెప్పఁబడును, ఇట్టి యగ్నికొఱకు మేము సోమలతను కొనివచ్చి అభిషవమొనర్చి తద్రసము నతని కొసంగుచున్నా

రము, సకలవిషయములను ఎఱుంగు సామర్థ్యముగల యగ్నిహోత్రుఁడు మా కపకారము చేయవలయునని ఏపురుషులు ప్రకటముగను గూఢముగను తలంచుచున్నారో, అట్టివారలను కాల్చి భస్మావశేషుల నొనర్చుఁగాక, ఆయగ్నిదేవుఁడు మాకు సంభవించునట్టి ఆపదల నన్నిటిని నశింపఁజేయుఁగాక, నావికుఁడు ఓడచేత సముద్రమును దాటించురీతిగా అగ్నిహోత్రుఁడు మా యొక్క పాపముల నన్నింటిని తరింపఁజేయుఁగాక, సముద్రమువలె దుస్తరములగు పాపములను సైతము నశింపఁజేయుఁగాక యని భావము.

మం. ౨. తా మగ్ని వర్ణాం తపసా జ్వలన్తీం
వైరోచనీం కర్మఫలేషు జుష్టామ్ ।
దుర్గాం దేవీగ్ం శరణ మహం ప్రపద్యే
సుతరసి తరసే నమః ॥

టీక. అగ్నివర్ణాం = అగ్నితో సమానమయిన వర్ణముగలిగినట్టియు, తపసా = స్వకీయమయిన కాంతిచేత, జ్వలన్తీం = మాశత్రువులను దహించుచున్నట్టియు, వైరోచనీం = పరమాత్మ సంబంధమైనట్టిదగు, కర్మఫలేషు = కర్మఫలముల నిమిత్తమై, జుష్టాం = సేవింపఁబడుచున్నట్టియు, తాం = ఆవనదుర్గాకల్పాది మంత్రశాస్త్రములందు సుప్రసిద్ధిగల, దుర్గాందేవీం = దుర్గాదేవిని, అహం = నేను, శరణం = శరణమును, ప్రపద్యే = పొందుచున్నాఁడను, సుతరసి = సంసార తరణమునకు చక్కని హేతువయినట్టి ఓదేవీ! తరసే = తరింపఁజేయునట్టి నీకొఱకు, నమః = నమస్కారము.

తా. వనదుర్గాకల్పము మున్నగు మంత్రశాస్త్రగ్రంథములందు ఏ దుర్గాదేవి వర్ణింపఁబడియున్నదో · అట్టిదుర్గాదేవిని గుఱించి ఈమంత్రము చెప్పుచున్నది:—అగ్నితో సమానమయిన దేహముయొక్క రంగు కలిగిన

దియు, తన దేహకాంతిచేత భక్తులయిన మాయొక్క శత్రువులయినవారిని కాల్చివైచునదియును, పరమాత్మ సంబంధమైనదియును, స్వర్గపశుపుత్రాదినిమిత్తభూతములగు కర్మఫలములనుగూర్చి ఉపాసకులచేత సేవింపఁబడునదియును అగు మంత్రశాస్త్రములందు ప్రసిద్ధిగా వర్ణింపఁబడియున్న దుర్గాదేవిని నేను శరణు పొందుచున్నాఁడను, శరణన్న భక్తులను సంసారమునుండి తరింపఁజేయునట్టి ఓదుర్గాదేవీ! తరింపఁజేసెడి నీకొఱకు నమస్కారమగుఁగాక యని తాత్పర్యము.

వైరోచనీ శబ్దవ్యుత్పత్తి:—విశేషేణ రోచతే స్వయమేవప్రకాశత ఇతి విరోచనః పరమాత్మా, తేన దృష్టత్వాత్, వైరోచనీ, అని. కావున వైరోచనియనఁగా పరమాత్మసంబంధమయినది అని చెప్పఁబడినది.

మం. 3. అగ్నే త్వం పారయా నవ్యో అస్మా
న్థ్స్వస్తిభి రతి దుర్గాణి విశ్వా।
పూశ్చ పృథ్వీ బహులా న ఉర్వీ
భవా తోకాయ తనయాయ శంయోః ॥

టీక. అగ్నే=ఓయగ్నీ! నవ్యః = కొనియాడఁ దగిన, త్వం=నీవు, అస్మాన్ = మమ్ములను, స్వస్తిభిః = క్షేమంకరములగు ఉపాయములచేత, విశ్వా = సమగ్రములయిన, దుర్గాణి=ఆపదలను, అతి=మిక్కిలి, పారయ= దాటింపుము, నః=మాయొక్క, పూః=నివాసభూతమగు పట్టణము, పృథ్వీ= విశాలమైనది యగుఁగాక, ఉర్వీ=చక్కనిధాన్యము పండునట్టి భూమియు, బహులా = అధికమయినది అగుఁగాక, (త్వం=నీవు) తోకాయ=మాపుత్రులకొఱకును, తనయాయ = పౌత్రులకొఱకును, శంయోః = సుఖమును కలుగఁజేయువాఁడవు, భవ=కమ్ము.

తా. ఓయగ్నీ! నీవందఱిచేతను కొనియాడఁదగినవాఁడవు, మాకు సంభవించునట్టి ఆపదల నన్నింటిని శుభకరము లగు ఉపాయములచేత దాఁటింపఁజేయుదువు, మేము నివసించియుండు నగరము నీయనుగ్రహముచేత విశాలమైనది యగుఁగాక, మాకు ధాన్యములు పండునట్టి భూమి అధికమగు గాక, మాకు మాత్రమే గాక మాపుత్రులకును పౌత్రులకును సుఖమును కలుగఁజేయువాఁడవు కమ్ము అని తాత్పర్యము.

మం. ౪. విశ్వాని నో దుర్గహా జాతవేద
స్సింధుం న నావా దురితాఽతిపర్షి
అగ్నే అత్రివ న్మనసా గృణానో
ఽస్మాకం బోధ్యవితా తనూనామ్ ॥

టీక. దుర్గహా = ఆపదలనన్నింటిని హరించునట్టియు, జాతవేదః = జాతవేదుఁడవగు నోఅగ్నీ! నావా=ఓడచేత, సింధుం న=సముద్రమునువలె, నః=మాయొక్క, విశ్వా దురితా = పాపములనన్నింటిని, అతిపర్షి = మిక్కిలి తరింపఁజేయుము, అగ్నే=ఓయగ్నీ! అత్రివత్=అత్రిమహర్షివలె, (నీవును), మనసా=మనస్సుచేత, గృణానః=పలుకుచున్నవాఁడవై, అస్మాకం= మాయొక్క, తనూనాం = శరీరములకు, అవితా = రక్షకుఁడవు అయి, బోధి=తెలిసికొనుము, (సావధానుఁడవు కమ్మని యర్థము.)

తా. ఆపత్సమూహముల నన్నింటిని నశింపఁజేయునట్టియు, జాతవేదుఁడవును అగు ఓయగ్నీ! మాయొక్క పాపములనన్నింటిని ఓడచేత సముద్రమును దాటించురీతిగా నీవు పాపసముద్రమునుండి మమ్ము తరింపఁజేయుము, మఱియు ఓయగ్నీ! అత్రియను పేరుగల జీవన్ముక్తుఁ డగు మహర్షివలె నీవును సర్వదా మాకు శుభము సుఖము మున్నగునవి కలుఁగు గాక యని పలుకుచు మాదేహములకు సంరక్షకుఁడవు కమ్ము.

అత్రిశబ్దనిర్వచనము:—ఆధ్యాత్మికాదితాపత్రయరహితత్వేన అత్రిః న+త్రిః=అత్రిః = ఆధ్యాత్మికాది తాపత్రయములు లేనివాఁడనుట, ఇట్టి మహర్షి. "ఆత్మౌపమ్యేన భూతేషు దయాం కుర్వీత మానవః" అను శాస్త్రము ననుసరించి ఎల్లప్పుడు

"సర్వే చ సుఖిన స్సంతు సర్వే సంతు నిరామయాః."

(అర్థ, అందఱు సుఖవంతులయి యుందురుగాక, అందఱు ఆరోగ్య వంతులయి యుందురుగాక.)

అని పలుకుచునుండును, జీవన్ముక్తుఁ డగు ఆయత్రిమహర్షి అందఱు సుఖులును నిరోగులు నయి యుండవలయు నని ఎల్లప్పుడు మనస్సునందు ఏవిధముగా స్మరించుచుండునో, అట్లనే నీవును స్మరించుచున్నవాఁడవయి మాదేహములకు రక్షకుఁడవై మా విషయమును చక్కఁగా తెలిసికొనుము, అనఁగా సావధానచిత్తముతో మాస్థితిగతుల నెఱింగి మమ్ములను సంరక్షింపుమని తాత్పర్యము.

మం. ౫. పృతనాజితగ్ం సహమాన ముగ్ర
మగ్నిగ్ం హువేమ పరమా త్సధస్థాత్ ।
స నః పర్షదతి దుర్గాణి విశ్వా
క్షామ ద్దేవో అతి దురితా ఉత్యగ్నిః ॥

టీక. పృతనాజితం=శత్రుసేనలను జయించునట్టియు, (కాఁబట్టియే) సహమానం = శత్రువులను తిరస్కరించునట్టియుఁ, ఉగ్రం = భయమునకు హేతువైనట్టియుఁ, అగ్నిం=అగ్నిని, పరమాత్ = శ్రేష్ఠమయిన, సధస్థాత్ = భృత్యులతోఁడ నివసించియున్న తావునుండి, హువేమ = పిలుచుచున్నారము, సః = ఆయగ్ని, నః = మా యొక్క, విశ్వాదుర్గాణి = అన్నిదుఃస్థితు

అతిపర్షత్ = మిక్కిలినశింపఁజేయుఁగాక, దేవః = దేవుఁడగు, అగ్నిః = అగ్ని, క్షామత్ = మాయపరాధములను క్షమించుచు, అతిదురితా = మిక్కుటము లగు మాపాపములను, అతి = అతిక్రమింపఁజేయుఁగాక.

తా. శత్రుసైన్యములను జయించునట్టియు, శత్రువులను పరాభవింపఁ జేయునట్టియు, శత్రువులకు భయంకరుఁడును అగు అగ్నిని స్వకీయులగు భృత్యులు మున్నగు వారితోడ కలిసి యుండు శ్రేష్ఠమగు ప్రదేశమునుండి ఇచటికి ఆహ్వాన మొనర్చుచున్నారము, మాయాహ్వానము నంగీకరించి అట్టి అగ్నిదేవుఁ డిచటికి వచ్చి మాకు సంభవించునట్టి ఆపదలను నాశన మొనర్చుఁ గాక, మఱియు మే మొనర్చిన బ్రహ్మహత్యాది మహాపాతకముల నైతము నశింపఁజేయుఁగాక యని తాత్పర్యము.

మం. ౬. ప్రత్నోషి క మీడ్యో అధ్వరేషు
సనా చ్చ హోతా నవ్య శ్చ సత్సి ।
స్వాం చాగ్నే తనువం పిప్రయస్వా
స్మభ్యం చ సౌభగ మాయజస్వ ॥

టీక. అగ్నే=ఓయగ్నీ ! నీవు, అధ్వరేషు=యాగములందు, ఈడ్యః= కొనియాడఁదగినవాఁడవై, కం=సుఖమును, ప్రత్నోషి = విస్తరింపఁ జేయుచున్నాఁడవు. సనాత్ చ-కర్మఫలము నిచ్చువాఁడవయ్యును, హోతా = హోమనిష్పాదకుఁడవును, నవ్యః=స్తుతికి అర్హుఁడవైనవాఁడవై, సత్సి=యాగ ప్రదేశమునందుందువు, (అందువలన ఓయగ్నీ) స్వాం = స్వకీయమగు, తనువం = దేహమును, పిప్రయస్వ = నేనొసంగుహవిస్సుచేత నిండించు కొనుము, అస్మభ్యం = మాకొఱకు, సౌభగం = ఐశ్వర్యాదికమును, ఆయజస్వ=అంకట నొసంగుము.

తా. ఓయగ్నీ ! నీవు యజ్ఞయాగాది కర్మలందు కొనియాడఁబడిన వాఁడవై కొనియాడునట్టి భక్తులకు మిక్కుటముగా సుఖమును కలుగఁజేసె దవు, మఱియు కర్మఫలము నొసంగువాఁడవయ్యును హోమనిష్పాదకుఁడ వగుచున్నాఁడవు, కొనియాడుటకు యోగ్యుఁడవయ్యును యాగప్రదేశము నందే యుందువు, కావున ఓయగ్నీ ! నేను ఒసంగునట్టి హవిస్సుచేత నీదేహ మును నిండించుకొనుము, పిదప సకలైశ్వర్యములను మాకు కలుగఁజేయుము అని తాత్పర్యము,

మం. ౭. గోభి ర్జుష్ట మయుజో నిషి క్తం
తవేన్ద్ర విష్ణో రనుసంచరేమ।
నాకస్య పృష్ఠ మభిసంవసానో
వైష్ణవీం లోక ఇహ మాదయన్తామ్ ॥౧౬॥ ౨।

టీక. ఇంద్ర = ఓయింద్రుఁడా! (వయం=మేము) గోభిః = గోవుల చేత సేవింపఁబడినట్టియు, నిషిక్తం = (అమృతధారల చేత) తడుపఁబడిన (మహాభాగ్యము నుద్దేశించి), అయుజః = పాపముల చేతను దుఃఖముల చేతను కూడుకొనఁబడనట్టియు, విష్ణోః=సర్వవ్యాపకుఁడవగు, తవ=నిన్ను, అనుసంచ రేమ = భృత్యులవలె అనుసరించెదము, నాకస్య = స్వర్గముయొక్క, పృష్ఠం అభి = ఊర్ధ్వభాగమునందు, సంవసానః = నివసించుచున్న దేవతలందఱు, వైష్ణవీం = విష్ణుభక్తిగల నన్ను, ఇహలోకే = భూలోకమునందు, మాద యన్తాం = అభీప్సితముల నొసంగి సంతోషింపఁ జేయుదురు గాక,

తా. ఓయింద్రుఁడా! మేము గోవులు మున్నగునవి కలిగినట్టియు, అమృతధారచేత ఆప్యాయమానముగ తడుపఁబడుచున్నట్టియు. మహైశ్వ ర్యము నభిలషించిన వారలమును, పాపములుగాని దుఃఖములుగాని లేనట్టియు,

సకలవిధములగు యజ్ఞములందు వ్యాపకుఁడవును అగు నిన్ను భృత్యులవలె అనుసరించుచున్నారము, స్వర్గమునందు నివసించియున్న దేవతలందఱు ఈ భూలోకమునందు శ్రీమహావిష్ణువునందు భక్తికలిగియున్న మాకు అభిమతార్థములొసంగి సంతోషమును కలుగఁజేసెదరుగాక యని తాత్పర్యము.

---

3. తృతీయోఽనువాకః

అన్నకామస్యహోమమన్త్రాః.

మం. ౧. భూరన్నమగ్నయే పృథివ్యై స్వాహా,

మం. ౨. భువోఽన్నం వాయవేఽన్తరిక్షాయ స్వాహా,

మం. 3. సువరన్నమాదిత్యాయ దివే స్వాహా,

మం. ౪. భూర్భువస్సువరన్నం చన్ద్రమసే దిగ్భ్యస్స్వాహా,

మం. ౫. నమో దేవేభ్యస్స్వధా పితృభ్యో భూర్భువస్సువరన్నమోమ్ ॥౧౪॥ 3॥

టీక. ౧. భూః='భూః' అను మంత్రప్రతిపాద్యుఁడగు, అగ్నయే=అగ్నికొఱకును, పృథివ్యై=తన్మంత్రప్రతిపాద్యమగు పృథివీదేవతకొఱకును, అన్నం = (ఈ) యన్నము, స్వాహా = సుహుతమగుఁగాక.

౨. భువః = 'భువః' అను మంత్రప్రతిపాద్యుఁడగు, వాయవే = వాయుదేవతకొఱకును, అంతరిక్షాయ = (తన్మంత్రప్రతిపాద్యుఁడగు) అంతరిక్షదేవతకొఱకును, అన్నం=(ఈ) అన్నము, స్వాహా=సుహుతమగుఁగాక.

3. సువః='సువః' అను మంత్రప్రతిపాద్యుఁడగు, ఆదిత్యాయ = సూర్యునికొఱకును, దివే=(తన్మంత్రప్రతిపాద్యమగు) ద్యులోకదేవతకొఱకును, అన్నం=(ఈ) అన్నము, స్వాహా=సుహుతమగుఁగాక.

4. భూః భువః='భూః, భువః, సువః' అను మంత్రములచేత ప్రతిపాదింపఁబడునట్టి, చంద్రమసే = చంద్రునికొఱకును, దిగ్భ్యః=(తన్మంత్రప్రతిపాద్యములగు) దిగ్దేవతలకొఱకును, అన్నం=(ఈ) అన్నము, స్వాహా= సుహుతమగుఁగాక.

5. దేవేభ్యః=దేవతలకొఱకును, నమః=నమస్కారము, పితృభ్యః= పితరులకొఱకు, స్వధా=స్వధాకారము, భూః భువః సువః=ఓభూర్భువస్సువర్దేవతలారా! ఓం=మేమొసంగినదానిని అంగీకరించుఁడు.

తా. 'భూః' అను మంత్రముచే ప్రతిపాదింపఁబడుచున్న అగ్ని పృథివీ దేవతలకొఱకును, 'భువః' అను మంత్రముచేత ప్రతిపాదింపఁబడుచున్న వాయు అంతరిక్ష దేవతలకొఱకును 'సువః' అను మంత్రముచేత ప్రతిపాదింపఁబడుచున్న ఆదిత్య ద్యులోకదేవతలకొఱకును, భూర్భువస్సువర్మంత్రములచేత ప్రతిపాదింపఁబడుచున్న చంద్రదిగ్దేవతలకొఱకును నేను హుతమొనర్చుచున్న ఈయన్నము సుహుతమగుఁగాక, దేవతలకొఱకును పితరులకొఱకును నమస్కారము, ఓ భూర్భువస్సువర్దేవతలారా! ఇట్లు ప్రార్థించుచున్న మాప్రార్థనము నంగీకరించి యన్నాదికమును అట్లే మీకొసఁగెదమని అంగీకరింపుఁడని తాత్పర్యము.

ఈ యనువాకమునకు మఱొకవిధముగా గూడ వ్యాఖ్యానము గలదు:—

౧. భూః=పృథివ్యధిష్ఠానదేవత, (నాకు) అన్నం=అన్నమును (ఇచ్చుగాక), (తన్నిమిత్తము నాచేత) అన్నం=(ఇవ్వఁబడిన చరురూపమగు) అన్నము అగ్నయే = పృథివినధిష్ఠించియుండు అగ్నికొఱకును, పృథివ్యై = అగ్న్యధిష్ఠాత్రియగుపృథివికొఱకును, స్వాహా = సుహుతమగుఁగాక.

ఇట్లే తక్కినవానికి గ్రహింపనలయును.

విశేషవివరణము:—ఈ యనువాకమునందలి మంత్రములందు మాత్రము అన్నమునుగాని ఆజ్యమునుగాని గ్రహించి హోమముచేయవలయును, తక్కినమంత్రములందేమియు గనంబడకపోవుటచేత హోమసాధారణ ద్రవ్యమగు ఆజ్యముచేతనే హోమము చేయవలయును, ఫలవిశేషము ఏమియు చెప్పఁబడియుండలేదు కావున పాపక్షయమే ఫలమగుచున్నది, భూసంస్కారాది ఆజ్యసంస్కారాంతమగుకర్మను స్వగృహ్యోక్తవిధి ననుసరించి యొనర్చి 'భూరగ్నయే, భువో వాయవే, సువరాదిత్యాయ, భూర్భువస్సువశ్చంద్రమసే' అను ౪ మంత్రములచేత ఆజ్యముతో హోమ మొనర్పవలయును. ప్రధానహోమములయినపిదప స్విష్టకృద్ధోమ మొనర్చి ప్రాఙ్ముఖుఁడై "నమో దేవేభ్యః" అను మంత్రముచేత దేవతలను; దక్షిణాభిముఖుఁడై 'స్వధాపితృభ్యః' అను మంత్రముచేత పితరులను ఉపస్థానమొనర్పవలయును, స్వధాశబ్దము పితరులకు ప్రియకరమగు ఉపచారవాచకము, స్వధాశబ్దము పిండదానాది పైతృకప్రకరణమునందు పఠింపఁబడినప్పుడు పితరుల నుద్దేశించి ఇవ్వఁబడిన ఈకవ్యము సునిహిత మగు గాక యని యర్థమగును.

---

౪. చతుర్థోఽనువాకః

మహావ్యాహృతిమంత్రములు.

మం. ౧. భూ రగ్నయే పృథివ్యై స్వాహా,

మం. ౨. భువో వాయవేఽంతరిక్షాయ స్వాహా,

మం. 3. సువ రాదిత్యాయ దివే స్వాహా,

మం. ౪. భూ ర్భువ స్సువ శ్చంద్రమసే దిగ్భ్య స్స్వాహా,
మం. ౫. నమో దేవేభ్య స్స్వధా పితృభ్యో భూ ర్భువ
స్సువర్మహ రగ్న ఓమ్ ॥౧౮॥ ౪॥

టీక. భూః='భూః' అను మంత్రముచేత ప్రతిపాదింపఁ బడునట్టి, అగ్నయే = అగ్నికొఱకును, పృథివ్యై = (ఆ 'భూః' అను మంత్రముచేతనే ప్రతిపాదింపఁబడునట్టి) పృథివీదేవత కొఱకును (హుత మొనర్పఁబడిన ఈ యాజ్యాహుతి), స్వాహా = సుహుతమగుఁగాక.

౨. 'భువః = 'భువః' అను మంత్రముచేత ప్రతిపాదింపఁ బడునట్టి, వాయవే = వాయువుకొఱకును, అంతరిక్షాయ = (తన్మంత్ర ప్రతిపాద్య మగు) అంతరిక్ష దేవతకొఱకును (హుత మొనర్పఁబడిన ఈయాజ్యాహుతి), స్వాహా = సుహుతమగుఁగాక.

3. సువః = 'సువః' అను మంత్రముచేత ప్రతిపాదింపఁ బడునట్టి, ఆదిత్యాయ = సూర్యునికొఱకును, దివే=ద్యులోక దేవతకొఱకును (హుత మొనర్పఁబడిన ఈయాజ్యాహుతి), స్వాహా = సుహుతమగుఁగాక.

౪. భూర్భువస్సువః = 'భూః భువః సువః' అను మంత్రములచేత ప్రతిపాదింపఁబడునట్టి, చంద్రమసే = చంద్రునికొఱకును, దిగ్భ్యః=దిగ్దేవతలకొఱకును (హుతమొనర్పఁబడిన ఈయాజ్యాహుతి), స్వాహా = సుహుత మగుఁగాక.

౫. దేవేభ్యః = దేవతలకొఱకు, నమః=నమస్కారము, పితృభ్యః = పితృదేవతలకొఱకు, స్వధా = స్వధాకారము, భూః భువః సువః=భూర్భువ స్సువర్మంత్ర ప్రతిపాద్యుఁడవగు, అగ్నే = ఓయగ్నీ ! ఓం=నాయీప్రార్థనమును అంగీకరింపుము.

తా. భూః భువః సువః అను మూఁడుపదములు అవ్యయములు, ఆయవ్యయపదములగు భూరాదికములు అగ్న్యాదిదేవతాప్రతిపాదకములు, అప్పు డీవిధముగా అర్థము అగును:—'భూః' అను మంత్రముచేత ప్రతిపాద్యుఁడగు అగ్నికొఱకును, తన్మంత్రప్రతిపాద్యమగు పృథివీదేవత కొఱకును నేను హుత మొనర్చుచున్నట్టి యీయాజ్యాహుతి సుహుతమగుఁగాక. 'భువః' అను మంత్రముచేత ప్రతిపాద్యమగు వాయుదేవతకొఱకును, తన్మంత్రప్రతిపాద్యమగు అంతరిక్షదేవతకొఱకును నేను హుత మొనర్చుచున్నట్టి ఈయాజ్యాహుతి సుహుత మగుఁగాక. 'సువః' అనుమంత్రముచేత ప్రతిపాదింపఁబడునట్టి ఆదిత్యునికొఱకును, తన్మంత్ర ప్రతిపాద్యమగు ద్యులోకదేవత కొఱకును నేను హుతమొనర్చుచున్నట్టి ఈయాజ్యాహుతి సుహుత మగుఁగాక. భూ ర్భువస్సువర్మంత్రములచేత ప్రతిపాదింపఁబడునట్టి చంద్రుని కొఱకును, తన్మంత్రములచేత ప్రతిపాదింపఁబడునట్టి దిగ్దేవతకొఱకును నేను హుతమొనర్చుచున్న ఈయాజ్యాహుతి సుహుతమగుఁగాక. దేవతలకొఱకు నమస్కారము, పితరులకొఱకు నమస్కారము, భూ ర్భువ స్సువ ర్మంత్ర ప్రతిపాద్యమగు ఓయగ్నీ! నీవున్నూ దీనిని అంగీకరింపుము.

---

౫. పంచమోఽనువాకః

మం. ౧. భూ రగ్నయేచ పృథివ్యై చ మహతే చ స్వాహా,

మం. ౨. భువో వాయవేఽన్తరిక్షాయ చ మహతే చ స్వాహా,

మం. 3. సువ రాదిత్యాయ చ దివే చ మహతే చ స్వాహా,

మం. ౪. భూ ర్భువ స్సువ శ్చన్ద్రమసే చ నక్షత్రేభ్య శ్చ
దిగ్భ్య శ్చ మహతే చ స్వాహా,

మం. ౫. నమో దేవేభ్య స్స్వధా పితృభ్యో భూ ర్భువ
స్సువ ర్మహరోమ్ ||౧౯|| ౫||

టీక. భూః='భూః' అను మంత్రప్రతిపాద్యుఁడగు, అగ్నయే= అగ్నికొఱకును, చ=(ఆయగ్నియొక్క సేవకులగు) దేవతలకొఱకును, పృథివ్యై= (తన్మంత్రప్రతిపాద్యమగు) పృథివీదేవతకొఱకును, చ=తత్సేవకులకొఱకును, మహతే = పూజ్యుఁడగు హిరణ్యగర్భునికొఱకును, చ=తత్సేవకులగు దేవతలకొఱకును, (ఈహుతమొనర్పఁబడిన ఆజ్యాహుతి) స్వాహా = సుహుతమగుఁగాక.

౨. భువః='భువః' అను మంత్రప్రతిపాద్యుఁడగు, వాయవే=వాయువుకొఱకును, చ=తత్పరిచారకులగుదేవతలకొఱకును, అంతరిక్షాయ= (తన్మంత్రప్రతిపాద్యమగు) అంతరిక్షలోకాభిమానిదేవతకొఱకును, చ=తత్సేవకులకొఱకును, మహతే = పూజ్యుఁడగు హిరణ్యగర్భునికొఱకును, చ=తత్సేవకులకొఱకును, (ఈహుతమొనర్పఁబడిన ఆజ్యాహుతి) స్వాహా = సుహుతమగుఁగాక.

3. సువః='సువః' అను మంత్రప్రతిపాద్యుఁడగు, ఆదిత్యాయ=ఆదిత్యునికొఱకును, చ=తత్సేవకులకొఱకును, దివే = (తన్మంత్రప్రతిపాద్యమానమగు) ద్యులోకాభిమానదేవతకొఱకును, చ = తత్సేవకులకొఱకును, మహతే = పూజ్యుఁడగు హిరణ్యగర్భునికొఱకును, చ=తత్సేవకులకొఱకును, 'ఈహుతమొనర్పఁబడిన ఆజ్యాహుతి) స్వాహా = సుహుతమగుఁగాక.

౪. భూః భువః సువః = భూర్భువస్సువర్మంత్రములచేత ప్రతిపాద్యమానుఁడగు, చంద్రమసే=చంద్రునికొఱకును, చ=తత్సేవకులకొఱకును, నక్షత్రేభ్యః = (తన్మంత్రప్రతిపాద్యులగు) నక్షత్రములకొఱకును, చ=తత్సేవకులకొఱకును. దిగ్భ్యః = (తన్మంత్రప్రతిపాద్యులగు) దిగ్దేవతలకొఱకును, చ=తత్సేవకులకొఱకును, మహతే = పూజ్యుఁడగు హిరణ్యగర్భునికొఱకును, చ=తత్సేవకులకొఱకును, (ఈహుతమొనర్పఁబడిన ఆజ్యాహుతి) స్వాహా= సుహుతమగుఁగాక.

౫. దేవేభ్యః = దేవతలకొఱకు, నమః=నమస్కారము, పితృభ్యః= పితరులకొఱకు, స్వధా = నమస్కారము, భూః భువః సువః=ఈభూర్భువస్సువర్లోకములందు, మహః = పూజను, ఓం=పొందుచున్నాఁడను.

తా. 'భూః' అనుమంత్రముచేత ప్రతిపాదింపఁబడుచున్న అగ్నికొఱకును పృథివీదేవతకొఱకును పూజ్యుఁడగు హిరణ్యగర్భుని కొఱకును నేను హుత మొనర్చుచున్న ఈ యాజ్యాహుతి సుహుత మగుఁ గాక. 'అగ్నయే చ పృథివ్యై చ మహతే చ' అని చకారము ప్రయోగింపఁబడి యుండుటచేత వారివారి పరిచారకు లగు దేవతలు ఇచట గ్రహింపఁ బడుచున్నారు. ఇట్లే 'భువః' అను మంత్రముచేత ప్రతిపాదింపఁ బడునట్టి వాయువు, అంతరిక్షదేవత, పూజ్యుఁ డగు హిరణ్యగర్భుఁడు వీరి ముగ్గురి యొక్క పరిచారకులు, 'సువః' అను మంత్రముచేత ప్రతిపాదింపఁబడుచున్న ఆదిత్యుఁడు, ద్యులోకాధిదేవత, పూజ్యుఁడగు హిరణ్యగర్భుఁడు వీరి యొక్క పరిచారకులు, భూర్భువస్సువర్మంత్రములచేత ప్రతిపాదింపఁబడుచున్న చంద్రుఁడు, నక్షత్రములు, దిగ్దేవతలు, పూజ్యుఁడగు హిరణ్యగర్భుఁడు వీరియొక్క పరిచారకులు (వీరికొఱకు నే నొసంగిన ఈ యాజ్యాహుతులు సుహుతమగుఁ గాక, దేవతలకొఱకు నమస్కారము, పితరులకొఱకు నమస్కారము, (పితరులకు స్వధాశబ్దము ప్రీతిదాయకము, వారికి కవ్యము నిచ్చు

నప్పుడుగాని, తదితరసమయమునందుగాని స్వధాశబ్దము నుచ్చరించిన వారికి అధికసంతోషము కలుగును, ప్రకరణము ననుసరించి ఇచట స్వధాశబ్దమునకు నమస్కారమని అర్థమును గ్రహించుట యుక్తము.) నేను భూలోక భువర్లోక సువర్లోకములందు పూజను పొందెదను గాక యని తాత్పర్యము.

---

౬. షష్ఠోఽనువాకః

జ్ఞానప్రాప్త్యర్థమంత్రములు.

అవ. 'భూ రగ్నయే' అను అనువాకమునందు గల మంత్రములు సర్వసాధారణముగ పాపక్షయార్థములు. ఇఁక జ్ఞాన ప్రాప్తికి ప్రతిబంధకములగు పాపములు నశించి జ్ఞానము ప్రాపించుటకుఁగాను సాధనభూతములగు మంత్రములు చెప్పఁబడుచున్నవి:—

మం. ౧. పాహి నో అగ్న ఏనసే స్వాహా,

మం. ౨. పాహి నో విశ్వవేదసే స్వాహా,

మం. 3. యజ్ఞం పాహి విభావసో స్వాహా,

మం. ౪. సర్వం పాహి శతక్రతో స్వాహా ॥౨౦॥ ౬॥

టీక. ౧. అగ్నే = ఓయగ్నీ ! నః=మమ్ములను. ఏనసే=పాపమువల్లనుండి, పాహి=సంరక్షించుము, (నీయందు హుతమొనర్పఁబడిన ఈయాజ్యాహుతి) స్వాహా = సుహుతమగుఁగాక.

౨. నః=మాకు, విశ్వవేదసే = తత్త్వజ్ఞానమంతయు సిద్ధించుటకొఱకు, పాహి=(తగినసాధనములను కలుగఁజేసి) సంరక్షింపుము, (తదర్థము నీయందు హుతమొనర్పఁబడిన ఈయాజ్యాహుతి) స్వాహా=సుహుతమగుఁగాక.

౩. విభావసో = విశేషకాంతిగల ఓయగ్నీ! యజ్ఞం = (వివిదిషాహేతువగుటచేత మేము అనుష్ఠించునట్టి) యజ్ఞమును, పాహి = (నిర్విఘ్నముగా సమాప్తినొందించి) సంరక్షింపుము, (తదర్థము నీయందు హుతమొనర్పఁబడిన యీయాజ్యాహుతి) స్వాహా=సుహుతమగుఁగాక.

౪. శతక్రతో=శతసంఖ్యగలక్రతువులకు నిష్పాదకుఁడవగు ఓయగ్నీ! సర్వం = (జ్ఞానమునకు సాధనభూతమగు గురుశాస్త్రము మున్నగువానిని) సకలమును, పాహి=సంరక్షింపుము.

తా. ౧. ఓయగ్నీ! మమ్ములను జ్ఞానప్రతిబంధకభూత మగు పాపమువల్లనుండి సంరక్షింపుము, నీకు మేమొసంగునట్టి యీయాజ్యాహుతి సుహుతమగుఁగాక.

౨. మాకు తత్త్వజ్ఞానము అంతయు ప్రాప్తించునటుల తత్సాధనములను కలుగఁజేసి నన్ను సంరక్షింపుము, తత్త్వజ్ఞానమంతయు నాకు ప్రాప్తించవలయు నను తలంపుతో నేను నీయందు హుతమొనర్చిన యీయాజ్యాహుతి సుహుత మగుఁగాక.

౩. విభావసుశబ్దవ్యుత్పత్తి:—విశేషేణభానం విభా సైవ వసు-ధనం యస్యాగ్నేః సోఽయం విభావసుః-అగ్నిః. విశేషమగు కాంతి విభ యగును, అట్టి కాంతియే ధనముగాఁ గలవాఁడు విభావసుఁడు—అగ్ని, అట్టి ఓయగ్నీ! వివిదిషాహేతు వగుటచేత మేము చేయుచున్నట్టి యజ్ఞమును నిర్విఘ్నముగా పరిపూర్ణమొనర్చి మమ్ములను పరిపాలించుము, అట్టి తలంపుతో నీయందు హుతమొనర్పఁబడిన యాయాజ్యాహుతి సుహుత మగుఁగాక.

౪. శతక్రతుః—శతసంఖ్యాకాః క్రతవః యేనాగ్నినా నిష్పాద్యన్తే సోఽయం శతక్రతుః. నూర్లకొలంది సంఖ్యలుగల క్రతువులు యే యగ్నిచేత నివర్తింపఁబడుచున్నవో ఆయగ్ని శతక్రతు వనంబడును, అట్టి ఓయగ్నీ ! నీవు జ్ఞానసాధనభూత మగు దానినంతయు సంరక్షింపుము, అనఁగా నన్ను నాయాచార్యుని శాస్త్రములను అన్నిఁటిని సంరక్షింపుమని తాత్పర్యము.

---

౭. సప్తమోఽనువాకః

మం. పాహి నో అగ్న ఏకయా । పాహ్యుత ద్వితీయయా ।
పాహ్యూర్జం తృతీయయా । పాహి గీర్భి శ్చతసృభి
ర్వసో స్వాహా ॥

టీక. వసో = జగన్నివాసమునకు హేతుభూతుఁడవగు, అగ్నే = ఓయగ్నీ ! (నీవు) ఏకయా=ఋగ్వేద సంబంధమగు వాక్కుచేతను కొనియాడఁబడినవాఁడవై, నః=మమ్ములను, (పాపము వల్లనుండి) పాహి=సంరక్షింపుము, ఉత = మఱియు, ద్వితీయయా = రెండవదియగు (యజుర్వేదసంబంధమగు), గిరా=వాక్కుచేత కొనియాడఁబడినవాఁడవై, పాహి=పాపమువల్లనుండి సంరక్షింపుము, తృతీయయా = మూఁడవదియగు (సామవేద సంబంధమగు వాక్కుచేత కొనియాడఁబడినవాఁడవై), పాహి = సంరక్షింపుము, చతసృభిః = ఋగ్యజుస్సామాథర్వణరూపములగు, గీర్భిః = వాక్కులచేత, (కొనియాడఁబడినవాఁడవై), పాహి=నన్ను సంరక్షింపుము, (ఇట్టియుద్దేశముతో మీకొసంగిన యీయాజ్యాహుతి) స్వాహా=సుహుతమగుఁగాక.

తా. ఓయగ్నీ! నీవీ జగ మీవిధముగా నిలిచియుండుటకు హేతుభూతుఁడవు, అట్టి నిన్ను మేము ఋగ్యజుస్సామాథర్వములను పేరుగల నాల్గువేదములయొక్క మంత్రములచేత కొనియాడి యాజ్యాహుతుల నొసఁగు చున్నారము, నీవీవిధముగా మాచేత కొనియాడఁబడినవాఁడవై మమ్ములను, మాయన్నరసమును కాపాడుమని తాత్పర్యము.

---

౮. అష్టమోఽనువాకః

అవ. జ్ఞానమును ప్రతిపాదించునట్టి సకలోపనిషత్సారమును పొందఁదలఁచువాఁడు జపింపవలసిన మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. యశ్ఛన్దసా మృషభో విశ్వరూప
శ్ఛన్దోభ్య శ్ఛన్దాగ్ంస్యావివేశ।
సచాగ్ం శిక్యః పురోవాచోపనిష దిన్ద్రో జ్యేష్ఠ ఇన్ద్రి
యాయ ఋషిభ్యో నమో దేవేభ్య స్స్వధా పితృ
భ్యో భూ ర్భువ స్సువ శ్ఛన్ద ఓమ్ ॥౨౨। ౮॥

టీక. విశ్వరూపః = సర్వజగదాత్మకమగు, యః = వి ప్రణవము, ఛందసాం = వేదములకు, ఋషభః = శ్రేష్ఠమయియున్నదో, (సః=ఆ ప్రణవము) ఛందోభ్యః=వేదములనుండి (ఆవిర్భవించెను), ఛందాంసి=గాయత్రిమున్నగు ఛందస్సులు (గలమంత్రములందు), ఆవివేశ = ప్రవేశించెను, సచాం సత్పురుషులకు, శిక్యః = (కర్మానుష్ఠాతలచేతను, ఉపాసకులచేతను, జ్ఞానుల

చేతను) పొందుటకు శక్యమైన వాఁడును, జ్యేష్ఠః = అందఱికంటె పెద్ద వాఁడును, ఇంద్రః = ఇంద్రుఁడు, ఋషీణాం = ఋషులకు, జ్ఞానసామర్థ్యముగలుగుటకొఱకు, ఉపనిషత్ = ఈవేదాంతసిద్ధాంతమును, పురా = పూర్వమునందు, ఉవాచ = ఉపదేశించెను. (తత్ప్రతిబంధనివారణార్థము) దేవేభ్యః = దేవతల కొఱకు, నమః = నమస్కారము, పితృభ్యః = పితరుల కొఱకు, స్వధా = నమస్కారము, భూః భువః సువః = భూర్భువస్సువర్లోకములందున్న, ఛందః = మంత్రబ్రాహ్మణాత్మకమగు వేదమును, ఓం = పొందుచున్నాఁడను.

తా. సర్వజగదాత్మక మగు ఓంకారము వేదములలోపల శ్రేష్ఠమయి యున్నది, ఈప్రణవము సర్వజగదాత్మక మనియును, వేదములలోపల శ్రేష్ఠ మయినదనియును సాంహిత్యుపనిషత్తునందు (అనఁగా శీక్షావల్లియందు) చెప్పఁబడియున్నది, అట్టి ప్రణవము వేదములవల్లనుండి ఆవిర్భవించెను, అనఁగా వేదములలోపల ప్రణవము సారభూతమని స్ఫురించెను, ఆప్రణవము గాయత్ర్యాది ఛందస్సులను ప్రవేశించెను, ఛందశ్శబ్దముచేత ఉపలక్షకము లగుచున్న మంత్రములందు అని గ్రహింపఁబడుచున్నది, ఈ ప్రణవము సకలమంత్రములయొక్క ఆదియందు గ్రహింపఁబడఁ దగినదని ప్రపంచసారమున చెప్పఁబడియున్నది:—"అస్యతు వేదాదిత్వా త్సర్వమనూనాం ప్రయుజ్యతే వ్యాదౌ" అట్టి ప్రణవప్రతిపాద్యుఁడగు ఇంద్రుఁడు ఈ వేదాన్త సిద్ధాంతమును మున్ను వచించెను, ఆ యింద్రు డెట్టివాఁడనఁగా కర్మానుష్ఠాతలచేతను, ఉపాసకులచేతను, జ్ఞానులచేతను పొందుటకు వీలయినవాఁడు, మఱియు సర్వజగత్తునకు కారణభూతుఁ డగుటచేత శ్రేష్ఠుఁడయినవాఁడు, ఇట్టి ఇంద్రుఁడు జిజ్ఞాసువులగు మహర్షులకు జ్ఞానసామర్థ్యము కలుగుట కొఱకు ఉపనిషద్విద్యను బోధించెను, ఆ జ్ఞానసామర్థ్యమునకు ప్రతిబంధకములు లేకపోవుటకుఁగాను నేను దేవతలకొఱకును పితరులకొఱకును నమ

స్కారము నాచరించుచున్నాఁడను, భూరాదిలోకత్రయమునందుఁగల మంత్ర బ్రాహ్మణాత్మక మగు వేదమంతయు నన్ను పొందుఁగాక, స్వధాశబ్దము పితృప్రీతివాచకము కావున ఇచట స్వధాశబ్దమునకు పితృప్రీతిజనకమగు నమస్కారమని అర్థము గ్రహింపఁబడినది.

---

౯. నవమోఽనువాకః

అవ. చదువఁబడిన వేదములు మరచిపోకుండా నుండుటకు జపింపవలసిన మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. * నమో బ్రహ్మణే ధారణం మే అస్త్వనిరాకరణం ధారయితా భూయాసం కర్ణయోః శ్రుతం మా చ్యోఢ్వం మమాముష్య ఓమ్ ॥౨౩॥ ౯॥

టీక. బ్రహ్మణే = జగత్కారణుఁడగు బ్రహ్మముకొఱకు, నమః = నమస్కారము, మే=నాయొక్క, (చిత్తమునందు) ధారణా = గ్రంథ తదర్థములయొక్క ధారణము, అస్తు = అగుఁగాక, అనిరాకరణం = నిరాకరణములేనివిధముగా, ధారయితా = ధరించువాఁడను, భూయాసం = అయ్యెదనుగాక, అముష్య=ఈ (విధముగా ప్రార్థించుచున్న దేవదత్తాది నామముగల), మమ = నాయొక్క, కర్ణయోః = కర్ణములందు (వినఁబడిన వేదశాస్త్రాదికము), మాచ్యోఢ్వం = నాశనమొనర్పకుము, (పిదప నేను స్థిరమైనధారణను) ఓం=పొందెదను.

---

* ఈమంత్రము 'శ్రుతధరీవిద్య'అని మంత్రశాస్త్రములో వాడఁబడుచున్నట్లు తోఁచుచున్నది.

తా. జగత్కారణ మగు బ్రహ్మమునకు నమస్కారము, అట్టి బ్రహ్మముయొక్క అనుగ్రహమువలన నాచిత్తమునందు గ్రంథతదర్థములయొక్క ధారణము కలుగుగాక, అనగా నేనిదివఱకు పఠించినవేదములు మరుపులే యుండుగాక, గురుసమీపమున గ్రహించిన తదర్థము సైతము మరుపులే యుండుగాక, నేను చదివిన విద్యను మరపులేకుండా నేను ధరించెదనుగాక ఈవిధముగా ప్రార్థించుచున్న...నామధేయముగల నేను ప్రసంగవశముగా ఒకపర్యాయము వినిన ఎట్టివేదశాస్త్రసిద్ధాంతము నైనను మరువకుండా ఉంచె దనుగాక, నీవిటుల నొసర్చినయెడల నేను స్థిరమయిన ధారణను పొందెదనని తాత్పర్యము.—'మమాముష్య' అనుచోట ఈమంత్రమును జపించువాడు తన పేరును 'అముష్య' అను శబ్దస్థానమునందు చెప్పుకొనవలయును, బ్రహ్మ యజ్ఞమునందు ఈ మంత్ర మీవిధముగనే పఠింపఁబడుచున్నది.

---

౧౦. దశమోఽనువాకః

అవ. చిత్తైకాగ్రత యనఁగా తపస్సు, అయ్యది జ్ఞానమునకు సాధనము, ఆతపస్సే శ్రౌతస్మార్తసకలకర్మరూపము అని ప్రశంసించుచు అట్టి తపస్సిద్ధినిమిత్తము జపింపవలసిన మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ఋతం తప స్సత్యం తప శ్శ్రుతం తప శ్శాన్తం తపో
దమ స్తప శ్శమ స్తపో దానం తపో యజ్ఞం తపో భూ
ర్భువ స్సువ ర్బ్రహ్మై తదుపాస్స్వై త త్తపః ॥౨౪॥ ౧౦॥

టీక. ఋతం = ఋతము, తపః = తపస్సు, సత్యం = సత్యము, తపః = తపస్సు. శ్రుతం = శ్రుతము, తపః=తపస్సు, శాంతం = శాంతము, తపః=తపస్సు, దమః = దమము, తపః = తపస్సు. శమః = శమము, తపః = తపస్సు, దానం = దానము, తపః = తపస్సు, యజ్ఞం = యజ్ఞము, తపః = తపస్సు, ఓముముత్తువా !) భూర్భువస్సువః = భూర్భువస్సువర్లోకాత్మక విరాడ్రూపదేహధారియగు, బ్రహ్మ = బ్రహ్మమును, ఉపాస్య = ఉపాసించుము, ఏతత్ = ఈ ఉపాసించుటయు, తపః = తపస్సే (అగుచున్నది).

తా. ఈఋత సత్య శ్రుతాదు లన్నియు తపస్సు లగు చున్నవి, ఋతాదులయొక్క వివరణము:—

౧. ఋతము:—మనస్సుచేత యథార్థవస్తుచింతనము,

౨. సత్యము:—వాక్కుచేత యథార్థమును పలుకుట.

3. శ్రుతము:— వేదముయొక్క పూర్వభాగమునందుగల సంశయాది విషయములను పోగొట్టునట్టి పూర్వమీమాంసాశాస్త్రమును, ఉత్తరభాగమగు ఉపనిషత్తునందలి సంశయాదివిషయములను పోగొట్టునట్టి ఉత్తర మీమాంస యొక్కయు అధ్యయనము.

౪. శాంతము:—బాహ్యేంద్రియములయొక్కయు అంతరింద్రియ ములయొక్కయు ఉపరతి.

౫. దమము:—శాస్త్రీయము లగు ఉపవాసాదికముచేసి దేహమును కృశింపజేయుట.

౬. శమము:—శత్రువులందును క్రోధములేకయుండుట.

౭. దానము:—ధనమును యోగ్యులగు పరులకు ప్రత్యుపకారబుద్ధి లేక ఇచ్చుట.

౮. యజ్ఞము:—అగ్నిహోత్రాద్యాచరణము.

౯. భూరాదిలోకములే దేహముగాఁగల విరాట్పురుషుఁడగు బ్రహ్మమును ఉపాసించుము, ఉపాసన యనఁగా విజాతీయప్రత్యయము లేక ఎల్లప్పుడు సజాతీయప్రత్యయప్రవాహముతో నుండుట, అనఁగా ఇతరాందోళనము మాని సర్వదా ఆదేవతను గురించిన చింతనము నందుండుట, ఇట్టి ఉపాసనము సైతము తపస్సే అని తాత్పర్యము.

---

౧౧. ఏకాదశోఽనువాకః

. అవ. విహితానుష్ఠానరూప మగు పుణ్యకర్మాచరణమును జ్ఞానసాధనమునుగా ప్రశంసించుచు నిషిద్ధాచరణము జ్ఞానప్రతిబంధకారణమని నిందించుచున్నాఁడు:—

మం. యథా వృక్షస్య సంపుష్పితస్య దూరా ద్గన్ధో వా
త్యేవం పుణ్యస్య కర్మణో దూరా ద్గన్ధో వాతి
యథాఽసిధారాం కర్తేఽవహితా మవక్రామే య
ద్యువే యువే హవా విహ్వాయిష్యామి కర్తం పతిష్యా
మీత్యేవ మమృతా దాత్మానం జుగుప్సేత్ ॥౨౪॥

టీక. సంపుష్పితస్య = బాగుగా వికసించిన, వృక్షస్య = చంపకము మున్నగు వృక్షములయొక్క, గంధః = గంధము, దూరాత్ = దూరదేశము వఱకును, యథా = ఏవిధముగా, వాతి = వీచుచున్నదో, ఏవం = ఈ విధముగా, పుణ్యస్య = జ్యోతిష్టోమాదికమగు పుణ్యమైన, కర్మణః = కర్మము యొక్క, గంధః = గంధము, దూరాత్ = దూరమువఱకును, వాతి = వీచు

చున్నది, కర్తే=గర్తమునందు, అవహితాం=అడ్డముగావేయఁబడిన, అసిధారాం=అసిధారను, అవక్రామేత్=పాదములతో నడుచుటకు ఇచ్ఛయించునో (అప్పు డాతఁ డిట్లు తలంచును), యువే యువే యత్=పాదమును గర్తమునకు అడ్డముగావేసియుండెడి (అసిధారయందు) మిశ్రణముచేసి గమనాగమనములను చేసినయెడల, (అప్పుడు) విహ్వాయిష్యామి హ్వై=పాదచ్ఛేదమగుటచేత, వ్యాకులము గలవాఁడ నగుచున్నాఁడను గదా, (పాదములతో అసిధారను స్పృశించనియెడల), కర్తం = గర్తమును గూర్చి, పతిష్యామి= పడగలను, ఇతి=ఈవిధముగా చింతించును, ఏవం = ఇదేవిధముగా, అమృతాత్ = మోక్షప్రాప్తిహేతువగుటవలన, ఆత్మానం=తన్ను, జుగుప్సేత్ = పాపమువల్లనుండి జుగుప్సను పొందవలయును.

తా. ఉద్యానవనము మున్నగు తావులందు బాగుగా వికసించిన చంపకము మున్నగు సుగంధివృక్షముయొక్క పరిమళము ఆవృక్షసమీపస్థలమునందేగాక చాలదూరమువఱకు ఏవిధముగా తన పరిమళమును వెదజల్లుచుండునో, ఆదేవిధముగా జ్యోతిష్టోమాది సత్కర్మల నాచరించుటవలన కలుగు సత్కీర్తిసైతము దూరదూరప్రదేశమువఱకు వ్యాపించును, అనఁగా మనుష్యలోకములోనుండి దేవలోకము దనుక వ్యాపించును, కావున పుణ్యకర్మల ననుష్ఠింపవలయును, ఇఁక పాపకర్మల ననుష్ఠింపవలదనుటకు దృష్టాంతమును వచించుచున్నాఁడు:—

ప్రభువులు మున్నగువారి వినోదార్థము బొమ్మరి గడలు మున్నగువాని కొనయందు నిలుచుండి దుర్ఘటము లగు కార్యముల నాచరించువాఁడై ఒక అగాధమగు కూపముయొక్క పైన తీక్ష్ణధారగల కత్తులను పరిచి దానిమీఁద నడునడలఁచినప్పుడు వాఁడీవిధముగా అనుకొనును-నేనికత్తులయొక్క అంచుమీఁద పాదమును మోపి అవతలకు నడిచిపోయితినేని నా పాదములు తెగిపోవును, కత్తులు తగులకుండా అవతలకు నడిచి పోయితినేని

అగాధమగు బావియందు పడిపోవుదును, ఈ రెంటివల్లను దుఃఖమే కలుగుచున్నది, అని చింతించుచు, అట్లే ముముక్షువు సైతము అంతఃకరణము స్థిరమొనర్చుకొని మోక్షము నిమిత్తము పాపకృత్యముల నాచరింపక వాని యందు నింద్యబుద్ధికలిగి వానిని విడువవలయును, పాపము ప్రకటముగా నాచరించిన ఇహలోకమునందు అందఱును వీనిని నిందించెదరు, పరలోకమునందు పాపము గలుగును, లేక పాపమును గూఢముగా ఆచరించినయెడల పరలోకమునందు పీడ కలుగును, రహస్యముగా పాపము నాచరించినను, ప్రకటముగా పాపము నాచరించినను దానివలన చెడుగు సంభవించుచున్నది కావున తప్పక పాపము నాచరించుట మాని పుణ్యకర్మల ననుష్ఠించిన ఈ మనుష్యలోకమునందే కాక స్వర్గలోకమునందును కీర్తిసౌఖ్యములు తప్పక ప్రాప్తించుచున్నవి, కావున సత్కర్మల నాచరింపవలయునని తాత్పర్యము.

---

౧౨. ద్వాదశోఽనువాకః

అవ, వెనుక చెప్పినవిధముగా పుణ్యకర్మల నొనర్చుచు, నిషిద్ధకర్మల పరిత్యజించుచు, పరిశుద్ధాంతఃకరణుఁడై యుండు వానికి తత్త్వోపదేశము నిమిత్తము ఈయనువాకము చెప్పఁ బడుచున్నది:—

మం. ౧. అణో రణీయా న్మహతో మహీయా
నాత్మా గుహాయాం నిహితో ఽస్య జన్తోః ।
త మక్రతుం పశ్యతి వీతశోకో
ధాతుః ప్రసాదా న్మహిమాన మీశమ్ ॥

టీక. ఆత్మా=పరమాత్మ, అణోః=అణువుకంటె, అణీయాన్=మిక్కిలి సూక్ష్మమైనవాఁడు, మహతః=గొప్పవయిన ఆకాశదిగాదికముకంటె, మహీయాన్=మిక్కిలి గొప్పవాఁడు, (అట్టి పరమాత్మ) అస్య=ఈ, జంతోః = దేవమనుష్యాది ప్రాణిజాతముయొక్క, గుహాయాం = హృదయపుండరీక మధ్యవర్తియగు బుద్ధిగుహయందు, నిహితః=విద్యచేత లభించుచు, ధాతుః = పరమేశ్వరునియొక్క, ప్రసాదాత్ = అనుగ్రహమువలన, అక్రతుం = సంకల్పరహితుఁడును, మహిమానం=మిక్కిలి గొప్పవాఁడును (అగు), తం= ఆ, ఈశం=పరమేశ్వరుని, పశ్యతి = సాక్షాత్కారము చేసికొనుచున్నాఁడు (చేసికొని) వీతశోకః = జన్మమరణాది శోకరహితుఁడు (అగుచున్నాఁడు).

తా. సచ్చిదానంద రసస్వరూపుఁ డగుపరమేశ్వరుఁడు, సర్వాధిష్ఠానుఁడై జగమునకంతయు స్వరూపభూతుఁ డగుటచేత ఆత్మశబ్దముచేతఁ జెప్పఁబడుచున్నాఁడు, ఆత్మశబ్దము స్వరూపవాచి యనుట సుప్రసిద్ధము, మాయాకార్యమయిన లౌకికవ్యవహారమునందు సూక్ష్మమని వ్యవహారమునందున్నది పరమాణు ద్వ్యణుకాదికము, అట్టి పరమాణు ద్వ్యణుకాదికముకంటె ఆత్మ మిక్కిలి సూక్ష్మమయినవాఁడు కావున అణీయ శ్శబ్దవాచ్యుఁ డగును. లోకమునందు ఆకాశదిగాదికము పరమాణాధిక్యము కలది కావున లోకమునందు మహచ్ఛబ్దవాచ్యములగుచున్నవి, అట్టి ఆకాశదిగాదికముకంటె ఈ పరమాత్మ మిక్కిలి గొప్పవాఁడు కావున మహీయ శ్శబ్దవాచ్యుఁ డగుచున్నాఁడు. పరమాణు ద్వ్యణుకాదికము అస్మదాదుల నేత్రములకు గోచరముకాకపోయినను యోగిజనుల నేత్రములకు గోచరము లగును, పరమాత్మ మాత్రము అట్టి యోగీశ్వరుల నేత్రములకు సైతము గనఁబడఁడు కావున "అణో రణీయాన్" అని చెప్పఁబడుచున్నాఁడు, గొప్పవని తలఁపఁబడు ఆకాశదిగాదికము ఒక బ్రహ్మాండమునందు మాత్రమే గోచరించుచున్నది కావునను, పరమాత్మమాత్రము అట్టి బ్రహ్మాండము లనేకకోటి సంఖ్యాకములగు వానికి అధి-

స్థానభూతుఁడు కావున "మహతో మహీయాన్" అని చెప్పఁబడినది. అట్టి పరమాత్మ దేవమనుష్యాదిరూప మగు జంతుజాలము యొక్క హృదయగుహ యందు లభ్యుఁడగుచున్నాఁడు, గుహ యనఁగా హృదయపుండరీకాంతర్వర్తి యగు బుద్ధియని గ్రహింపఁబడుచున్నది, గుహాశబ్దము 'గుహూసంవరణే' అను ధాతువునుండి పుట్టినది, బుద్ధి హృదయపుండరీకమును ఆవరించియున్నది కావున తన్మధ్యవర్తియని చెప్పఁబడుచున్నది, అట్టి బుద్ధియందు పరమాత్మ నిహితమై యున్నాఁడనఁగా విద్యచేత పొందఁబడుచున్నాఁడని యర్థము అగును కాని బుద్ధి యందు ఆధేయ మయి యున్నవాఁడని మాత్రముకాదు, అట్లయినయెడల సర్వజగదాధారత్వము పరమాత్మకు సంభవింపఁజాలదు, అట్టి పరమాత్మను శమదమాది గుణవిశిష్టుఁడగు అధికారి సాక్షాత్కారమును చేసి కొనుచున్నాఁడు, అట్టిసామర్థ్యము పరమేశ్వరుని యనుగ్రహమువలననే కలుగవలయును, పరమాత్మ జగమునంతయు చేయువాఁడు కావున "ధాత" యనంబడుచున్నాఁడు, ఈశ్వరానుగ్రహమువల్లనే ఇట్టి స్థితి కలుగునను టను పూర్వాచార్యులవా రీవిధముగ వచించిరి:—

శ్లో. 'ఈశ్వరానుగ్రహాదేవ పుంసామద్వైతవాసనా,
మహాభయకృతత్రాణా ద్విత్రాణాం యది జాయతే.'

(అర్థ. ఇద్దఱికో, ముగ్గుఱికో జన్మజరామరణాదిరూప మగు మహాభయ మును పోఁగొట్టి సంరక్షించునట్టి అద్వైతవాసన ఏర్పడినయెడల అయ్యది ఈశ్వరానుగ్రహముచేతనే (కలిగినది) అని తాత్పర్యము. పరమాత్మ ఎట్టి వాఁడనఁగా అక్రతువు అనఁగా సంకల్పరహితుఁడు. స్నానపానాది భోగ జాతము మంచిది అను సంకల్పము జీవునకేగాని ఈశ్వరునకు లేదు, సంకల్ప మునకు హేతుభూత మగు అంతఃకరణోపాధి పరమాత్మకు లేదు, నిరుపాధి కుఁడు కావున మిక్కిలి గొప్పవాఁడగుచున్నాఁడు, ఇట్టి పరమాత్మను విద్య చేత సాక్షాత్కారము చేసికొన్నవాఁడు, జన్మజరామరణాది శోకవిరహితుఁ డగుచున్నాఁడు.)

మం. ౨. స॒ప్త ప్రా॒ణాః ప్ర॒భవ॑న్తి॒ తస్మా॑
త్స॒ప్తార్చిష॑ స్స॒మిధ॑ స్స॒ప్త జి॒హ్వాః ।
స॒ప్త ఇ॒మే లో॒కా యే॒షు చర॑న్తి
ప్రా॒ణా గు॑హా॒శయా॒ న్నిహి॑తా స్స॒ప్త స॒ప్త ॥

టీ. గుహాశయాత్ = గుహాయందున్న, తస్మాత్ = ఆ పరమాత్మ వలన, సప్త = సప్తసంఖ్యగల, ప్రాణాః = ప్రాణములున్నూ, సప్తార్చిషః= సప్తసంఖ్యగల ప్రకాశనశక్తులున్నూ, సప్తసమిధః = సప్తసంఖ్యాకములగు విషయములను సమిధలున్నూ, సప్తజిహ్వాః = సప్తసంఖ్యాకములగు జిహ్వ లున్నూ, ప్రభవంతి = ఉత్పన్నములాయెను, యేషు = ఏలోకములందు, ప్రాణాః = (దేవమనుష్యాదిశరీరగతములగు) ప్రాణములు, చరంతి = సంచ రించుచున్నవో, (అట్టి) ఇమే=ఈ, లోకాః = భూరాదిలోకములు, సప్త సప్త = (సప్తర్షులుమున్నగు) ఏడేసి ఏడేసి పదార్థములు, తస్మాత్ = ఆపరమాత్మవల్లనుండి, నిహితాః = ఉత్పన్నము లాయెను.

తా. వెనుకటిమంత్రమునందు శుద్ధాంతఃకరణము గలవారిచేత ఏపర మాత్మ తెలిసికొనఁ దగినవాఁడని చెప్పఁబడెనో అట్టి పరమాత్మకు శాఖా చంద్రన్యాయముగా జగత్కారణత్వమును చెప్పుచున్నాఁడు, మాయాశక్తి విశిష్టుఁ డగు ఆపరమాత్మవల్లనుండి సప్తసంఖ్యగల ప్రాణములు పుట్టుచున్నవి, వేదమునందే మఱొకచోట "సప్త వై శీర్షణ్యాః ప్రాణాః" అని చెప్పఁబడి యున్నది కావున శిరమునందున్న సప్త ఛిద్రగతములగు చక్షురాదిసప్త సంఖ్యగల ప్రాణములు పరమేశ్వరునివల్లనుండి పుట్టుచున్నవి, రెండుకండ్లు, రెండు ముక్కులు, రెండు చెవులు, నోరు, ఇవి 7 అగుచున్నవి, ఆచక్షురాది

సప్తేంద్రియములయొక్క స్వస్వవిషయప్రకాశనశక్తులే సప్తార్చిస్సులు, ఆ సప్తార్చిస్సులచేత గ్రహింపఁబడుచున్నవి కావున సప్తసంఖ్యగల విషయములే సమిధలు అగుచున్నవి, విషయములచేత ఇంద్రియములు ప్రకాశయుక్తములుగా చేయఁబడుచున్నవి, కావున విషయములు సమిధ లగుచున్నవి, ఒక్కటియగు నేత్రేంద్రియమునకే గోళక భేదముచేత ద్విత్వసంఖ్యవలె వామ దక్షిణ రూపమును నిర్ణయించు చక్షుర్భేదమువలన ద్విత్వమును గ్రహించవలయును. ఇదేవిధముగ శ్రోత్ర నాసికేంద్రియ గ్రాహ్యములగు శబ్దగంధములకు కూడ ద్విత్వమును గ్రహించితిమేని ముఖేంద్రియవిషయములతోడ కలిసి సప్తవిషయములగుచున్నవి, లేక సమిచ్ఛబ్దమును సప్తశబ్దముతో కలిపి చెప్పక "సమిధః జిహ్వాః సప్త ప్రభవంతి" అని యర్థము నైనను చెప్పవలయును. అప్పుడు ప్రకాశప్రయుక్తములగు సప్తజిహ్వాలు పుట్టినవని అర్థమగును, అగ్నియొక్క జిహ్వాలు సప్తసంఖ్యగలవని ఆథర్వణికు లిటుల చెప్పిరి:—

'కాళీ కరాళీ చ మనోజవాచ సులోహితా యా చ సుధూమ్రవర్ణా, స్ఫులింగినీ విశ్వరుచీచ దేవీ వేలాయమానా ఇతి సప్త జిహ్వాః.' (అర్థము, కాళి, కరాళి, మనోజవ, సులోహిత, సుధూమ్రవర్ణ, స్ఫులింగిని, విశ్వరుచి, ఈప్రకాశించునట్టి ఏడున్నూ అగ్నియొక్క సప్తజిహ్వాలు ఈ సప్తజిహ్వాలు పరమాత్మవల్లనుండి పుట్టినవి, ఏసప్తలోకములందు దేవమనుష్యాది శరీరగతము లగు ప్రాణములు చలించుచున్నవో, అట్టి భూరాదిసప్తలోకములును పుట్టినవి, మఱియు గుహాశయుఁ డగు ఆపరమాత్మమునుండియే సప్తసంఖ్యగల సప్తర్షులు మున్నగు పదార్థవిశేషము లుత్పన్నములాయెను, గుహాయనఁగా బుద్ధి, దానియందు శయనించువాఁడు కావున గుహాశయుఁ డనంబడును, పరమాత్మ గుహాశయుఁడను విషయము 'ఆత్మా గుహాయాం విహితోఽస్య జంతోః' అని వెనుకటిమంత్రమునందు చెప్పఁబడినది.)

మం. 3. అత స్సముద్రా గిరయ శ్చ సర్వే
ఽస్మా త్స్యందంతే సింధవ స్సర్వరూపాః ।
అత శ్చ విశ్వా ఓషధయో రసా చ్చ
యేనై ష భూత స్తిష్ఠత్యంతరాత్మా ॥

టీక. అతః = ఈపరమాత్మ వలన, సర్వే = సకలవిధములయిన, సముద్రాః=సముద్రములున్ను, (సర్వే) గిరయః = (సమస్త) పర్వతములున్ను, (జాతాః = ఉత్పన్నములాయెను) అస్మాత్ = ఈపరమాత్మ వల్లనుండి, సర్వరూపాః = నానాదిగభిముఖములగు, సింధవః = నదులు, స్యందంతే = ప్రవహించుచున్నవి, ఏషః=అహంప్రత్యయగమ్యమానుఁడగు, అంతరాత్మా= స్థూలదేహచిదాత్మలకు మధ్యవర్తియగు లింగదేహి, యే ఓషధిరసముచేత, భూతః = అధిష్ఠింపఁబడినదై, తిష్ఠతి = నిలిచియుంటున్నదో, (అట్టి) విశ్వా = సమస్తములైన, ఓషధయః = ఓషధులు, రసాత్ = విద్వదనుభవనీయుఁడగు, అతశ్చ = ఈపరమాత్మమునుండియే (పుట్టినవి).

తా. క్షీరసముద్రము దధిసముద్రము మున్నగు సప్తసముద్రములును, మేరువు మందరము మున్నగు సర్వపర్వతములున్ను, ఈపరమేశ్వరుని వల్లనుండియే పుట్టినవి, నానాదిగభిముఖము లగు నదులున్ను ఈ పరమాత్మ వల్లనుండియే ప్రవహించుచున్నవి, రసస్వరూపుఁడగు ఆపరమాత్మ వల్లనుండియే వ్రీహియవాది రూప మగు ఓషధిజాతమంతయు ఉత్పన్నమాయెను, ఓషధిజాత మెట్టిదనఁగా స్థూలదేహచిదాత్మలకు మధ్యవర్తియైన సూక్ష్మదేహి యీఓషధి రసముచేత పోషింపఁబడియే నిలిచియుండుటకు వీలగుచున్నదని తాత్పర్యము.

మం. ౪. బ్రహ్మా దేవానాం పదవీః కవీనా
మృషి ర్విప్రాణాం మహిషో మృగాణామ్ ।

శ్యేనో గృధ్రాణాగ్ం స్వధితి ర్వనానాగ్ం
సోమః పవిత్ర మత్యేతి రేభన్ ॥

టీక. (పరమాత్మ) దేవానాం = దేవతలలోపల, బ్రహ్మా = బ్రహ్మ (యగుచున్నాఁడు), కవీనాం = కావ్యనాటకాదిప్రబంధకర్తలగు కవులలో, పదవీః=శాస్త్రజ్ఞులగు వ్యాసవాల్మీకాదికవిస్వరూపుఁడై యున్నాఁడు, విప్రాణాం = వైదికమార్గప్రవర్తకులగు బ్రాహ్మణులలోపల, ఋషిః=వసిష్ఠాదిగోత్రప్రవర్తక మహర్షిరూపుఁడైయున్నాఁడు, మృగాణాం = మృగములలోపల, మహిషః = మహిషమై యున్నాఁడు, గృధ్రాణాం = పక్షులలోపల, శ్యేనః = డేగయైయున్నాఁడు, వనానాం=వనములయొక్క ఛేదనార్థము, స్వధితిః = పరశువైయున్నవాఁడు, సోమః=సోమలతాత్మకుఁడై, రేభన్ = మంత్రశబ్దయుక్తుఁడగుచు, పవిత్రం=శుద్ధికారణమగు గంగాది పవిత్రజలమును, అత్యేతి = అతిక్రమించుచున్నాఁడు.

తా. అంతర్భాగమునందుండు ప్రాణాదికముయొక్కయు, బాహ్యమునందుండు సముద్రాదికముయొక్కయు, అచేతనములగు వానియొక్కయు సృష్టిని వచించిన పిదప చేతనములందు పరమేశ్వరుఁడు శ్రేష్ఠుఁడై యుండు విషయ మిప్పుడు చెప్పఁబడుచున్నది:— పరమేశ్వరుఁడు ఇంద్రుఁడు అగ్ని మున్నగు దేవతలలోపల చతుర్ముఖ బ్రహ్మారూపమున దేవతలకు నియామకుఁడై యుంటున్నాఁడు, కావ్యనాటకాది ప్రబంధనిర్మాతలగు కవులలోపల పదవియై ఉంటున్నాఁడు, పదవి యనుపదమునకు వివరణము:—వ్యాకరణసిద్ధమగు సుశబ్దము పదమనంబడును, అట్టిపదమును పొందువాఁడు "పదవీః" యనంబడును, "పదం వ్యేతి గచ్ఛతీతి పదవీః" అని వ్యుత్పత్తి, సుశబ్దాదికము నెఱింగిన వ్యాసవాల్మీకాది కవిశ్రేష్ఠులు 'పదవీః' అను శబ్దమునకు అర్థులు, విప్రులనఁగా వేదమార్గానుసారము చరించు బ్రాహ్మణులు, అట్టి

బ్రాహ్మణులలోపల గోత్రప్రవర్తకు లగు కశ్యపవసిష్ఠాదిమహర్షిస్వరూపుఁడై యున్నాఁడు, పక్షులలోపల శ్రేష్ఠమగు డేగయై యున్నాఁడు, వృక్షసమూహరూపములగు వనములయొక్క ఛేదనము నిమిత్తము పరశురూపుఁడై యున్నాఁడు, సోమయాగములందు ప్రధానముగ గ్రహింపఁబడు సోమవల్లీలతాత్మకుఁడై మంత్రధ్వనిసమన్వితుఁడై శుద్ధికారణ మగు గంగాజలము దర్భములు మున్నగు ద్రవ్యజాతము కంటె అధికమయినపవిత్రత కలవాఁ డగుచున్నాఁడు.

మం. ౫. అ॒జా మేకాం॒ లోహి॑తశుక్లకృ॒ష్ణాం
బ॒హ్వీం ప్ర॒జాం జ॒నయ॑న్తీ॒గ్ం సరూ॑పామ్ ।
అ॒జో హ్యేకో॑ జు॒షమా॑ణో॒ఽను శే॑తే॒
జహా॑త్యేనాం భు॒క్తభో॑గా॒ మ॒జో॑ఽన్యః ॥౨౬॥

టీక. అజాం=జన్మములేనట్టియు, ఏకాం = ఒక్కటి అయినట్టియు, లోహిత శుక్లకృష్ణాం=రజస్సత్త్వతామస గుణాత్మికయు, సరూపాం=సమానమయినరూపముగల, బహ్వీం=అనేకమయిన, ప్రజాం=ప్రజను, జనయంతీం = పుట్టించుచున్నట్టి మాయను, ఏకః = ఒకఁడగు, అజః = ఆసక్తిగల జీవుఁడు, జుషమాణః = ప్రీతిపూర్వకముగా సేవించుచు. అనుశేతే = అనుసరించుచున్నాఁడు, అన్యః = మఱొకఁడగు, అజః = విరక్తిగలజీవుఁడు, భుక్తభోగాం=భుక్తభోగ యగు, ఏనాం=ఈమాయను, జహాతి=వదలుచున్నాఁడు.

తా. వ్యవహారదశయందు చతుర్ముఖబ్రహ్మాదుల శరీరమునందు పరమాత్మకు విశేషావస్థానము వెనుకటిమంత్రమునందు చెప్పఁబడినది, ఇఁక ఈమంత్రమునందు జగత్సృష్టికి మూలకారణభూతమగు మాయాశక్తి ననుసరించి బద్ధముక్తపురుషవ్యవస్థను ఈమంత్రమునందు చెప్పఁబడుచున్నది:—అజ

యనఁగా పుట్టుకలేనిది, అనఁగా మూలప్రకృతిరూప మగు మాయ, అనాది యగు మూలప్రకృతికి పుట్టుకలేదు కావున అజ యని చెప్పఁబడుచున్నది, ఆమాయయే ఒక్కటియని చెప్పఁబడుచున్నది, దృగ్గోచర మగు ప్రపంచ మంతయు ప్రకృతికార్యము కావున మూలప్రకృతి ఒక్కటియే యని చెప్పఁబడుచున్నది, ఆమూలప్రకృతి తేజస్సు, జలము, అన్నము అను మూడు రూపములను పుట్టించి తద్రూపయై ఎప్పుడు ఉండునో అప్పుడు లోహిత శుక్ల కృష్ణ వర్ణోపేతయై యుండును, ఈవిషయము ఛాందోగ్యోపనిషత్తునందు ఇటులఁ జెప్పఁబడియున్నది:—

'య దగ్నే రోహితగ్ం రూపం తేజసస్త ద్రూపం, య చ్ఛుక్లం త దపాం, య త్కృష్ణం త దన్నస్య,' ఛాందో. ౬-౪-౧

అనఁగా మాయ గుణత్రయాత్మిక యగుచున్నది, ఆమాయ దేవతిర్య ఙ్మనుష్యాదిరూపమును గుణత్రయాత్మక మగుటచేత బహువిధమయిన ప్రజను జనింపఁజేయుచున్నది. అజుఁ డనఁగాఁ పుట్టుకలేనివాఁడు—ఇతఁడే జీవుఁడు, జీవుఁడును మాయవలె అనాదియయినవాఁడు కావున ఇతనికిని ఉత్పత్తిలేదు, ఆట్టిజీవుఁడు ద్వివిధముగా నున్నాఁడు, ఇతఁడు ఆసక్తుఁడనియు, విరక్తుఁడనియు ద్వివిధము. ఆద్వివిధజీవులలో ఒకఁడగు ఆసక్తజీవుఁడు వెనుక చెప్పఁబడిన మాయను ప్రీతిపూర్వకముగ సేవించుచున్నవాఁడై ఆమాయను అనుసరించియే యుండును, అనఁగా విషయసుఖముల ననుభవించుచు వివేకరహితుఁడై జన్మ మరణప్రవాహరూపమగు సంసారమును పొందియుండును, విరక్తుఁడయిన జీవుఁడుమాత్రము భుక్తభోగయగు ఈమాయను పరిత్యజించును, విరక్తికంటె ముందే భోగములను అనుభవించి యుండును. పిదప అనుభవింపఁడు కావున 'భుక్తభోగ' యని చెప్పఁబడుచున్నది.

అవ. వివేకవంతుఁడై మాయను పరిత్యజించిన వాని

కంతయు బ్రహ్మరూపముగనే గనంబడునను విషయము చెప్పఁబడుచున్నది:—

మం. ౬. హగ్ంస శ్శుచిష ద్వసు ర న్త రిక్షస
ద్ధోతా వేదిష దతిథి ర్దురోణసత్ ।
నృష ద్వరస దృతస ద్వ్యోమస దబ్జా
గోజా ఋతజా అద్రిజా ఋతం బృహత్ ॥

టీక. హంసః = ఆదిత్యుఁడు, శుచిషత్ = శుద్ధమగు జ్యోతిర్మండలమునందుండువాఁడు, వసుః=సూత్రాత్మరూపము గలవాఁడై, అంతరిక్షసత్ = అంతరిక్షమునందుండువాఁడు, హోతా = హోమనిష్పాదకములగు ఆహవనీయాగ్నిస్వరూపము గలవాఁడు, వేదిషత్ = వేదియందుండువాఁడు, అతిథిః = అతిథిరూపమున, దురోణసత్ = (ఇతరుల) గృహమునందుండువాఁడు, నృషత్ = (కర్మాధికారులగు) మనుష్యులందు జీవరూపమున నుండువాఁడు, వరసత్ = శ్రేష్ఠములగు కాశి ద్వారవతి మున్నగు పుణ్యనగరములందు నివసించువాఁడు, ఋతసత్ = సత్యములగు వైదికకర్మలందు ఫలరూపమున నుండువాఁడు, వ్యోమసత్ = ఆకాశమునందు నక్షత్రాదిరూపమున నుండువాఁడు, అబ్జాః = ఉదకములందు శంఖమకరాది రూపమున పుట్టువాఁడు, గోజాః = గోవులవల్లనుండి క్షీరాదిరూపమున పుట్టినవాఁడు, ఋతజాః = సత్యవచనమునుండి కీర్తిరూపమున పుట్టినవాఁడు, అద్రిజాః = కొండలవల్లనుండి వృక్షాదిరూపమున పుట్టినవాఁడు, ఋతం = వెనుకచెప్పఁబడిన సత్యమగు జగజ్జాతమంతయు, బ్రహ్మ = బ్రహ్మమే.

తా. అజ్ఞానదృష్టిచేత జగత్తుగాఁ గనంబడినదంతయు జ్ఞానదృష్టిచేత బ్రహ్మమే యని చెప్పుచున్నాఁడు:—ఈ ఆదిత్యరూపుఁడగు పరబ్రహ్మమే జ్యోతిర్మయ మగు మండలమునందు వస్వాదిశబ్దవాచ్యుఁడైయున్నాఁడు.

అవ. భోగజాతమును, జ్ఞానయోగ్య దేహానుకూల త్వను ప్రార్థించి జ్ఞానసాధనమగు యాగాదికమునకు హేతు భూతుఁ డగు అగ్నియొక్క ఆనుకూల్యమును ప్రార్థించు చున్నాఁడు:—

మం. ౭. ఘృతం మిమిక్షిరే ఘృత మస్య యోని
ర్ఘృతే శ్రితో ఘృత ము వస్య ధామ।
అనుష్వధ మావహ మాదయస్వ
స్వాహాకృతం వృషభ వక్షి హవ్యమ్॥

టీక. (పూర్వులగు యజమానులు ఆహవనీయాది రూపముగల అగ్ని యందు) ఘృతం = ఆజ్యమును, మిమిక్షిరే = చల్లుచుండిరి, ఘృతం = ఆ ఘృతము, అస్య = ఈయగ్నిహోత్రునకు, యోనిః = ఉత్పత్తికారణము, (ఈయగ్ని) ఘృతే = ఘృతమునందు, శ్రితః = ఆశ్రయించియుండును, అస్య = ఈయగ్నికి, ఘృతం ఉ = ఆజ్యమే, ధామ = స్థానము, (ఓయగ్నీ) అనుష్వధం = (మేము హుతమొనర్చెడి) హవిస్సు ననుసరించి, ఆవహ = దేవతల నిచటికి తీసికొనిరమ్ము, మాదయస్వ = (తీసికొనివచ్చి) సంతోష పెట్టుము, వృషభ = శ్రేష్ఠుఁడవగు ఓయగ్నీ! స్వాహాకృతం = స్వాహాకార మొనర్చి మాచేత ఇవ్వఁబడిన, హవ్యం = హవిస్సును, వక్షి = దేవతలకు గూర్చి పొందింపుము.

తా. సృష్ట్యాదికాలమునుండి యజ్ఞయాగాది క్రతుజాలము నాచ రించెడి యజమానులు ఆహవనీయ గార్హపత్య దక్షిణాగ్ని మున్నగు భేద ములుగల అగ్నియందు ఆజ్యమును వ్రేల్చుచుండిరి. ఈఘృతమే అగ్నికి ఉత్పత్తికారణ మగుచున్నది. (ఆజ్యము పోసినకొలది అగ్నికి జ్వాలాభివృద్ధి

గనంబడుచున్నది కావున అగ్నికి ఆజ్య ముత్పత్తికారణ మగుచున్నది) కావున అగ్ని ఘృతమునాశ్రయించి యున్నాఁడు, ఆజ్యమే అగ్నికి స్థాన మగుచున్నది. ఓయగ్నీ ! మాసంబంధమగు హవిస్స్వరూపము ననుసరించి దేవతల నిచటికి తీసికొని రమ్ము, తీసికొనివచ్చి వారిని సంతోష పెట్టుము, శ్రేష్ఠుఁడ వగు ఓయగ్నీ ! స్వాహాకారముతో మే మొసంగిన హవ్యమును దేవతలనుగూర్చి పొందింపుము అని తాత్పర్యము.

మం. ౮. సముద్రా దూర్మి ర్మధుమాగ్ం
ఉదార దుపాగ్ంశునా స మమృతత్వ మానట్ ।
ఘృతస్య నామ గుహ్యం య దస్తి
జిహ్వా దేవా నా మమృతస్య నాభిః ।

టీక. సముద్రాత్ = (మిక్కిలి విస్తారముగ వ్యాపించియున్న) పరమేశ్వరుని వల్లనుండి, మధుమాన్ = మాధుర్యముగల, ఊర్మిః = అలతో సమానమగు ప్రపంచము, ఉదారత్ = పుట్టెను, ఘృతస్య = స్వయంప్రకాశకుఁ డగు బ్రహ్మము యొక్క, గుహ్యం = రహస్యమగు, యత్ = ఏ, నామ = ప్రణవ మను నామము, అస్తి = కలదో, ఉపాంశునా = (ధ్యానకాలమునందు) మెల్లఁగా ఉచ్చరింపఁబడు ఆప్రణవముచేత, అమృతత్వం = ఉత్పత్తి వినాశరహితమగు బ్రహ్మత్వమును, సం ఆనట్ = చక్కఁగా పొందుచున్నాఁడు. (ఆప్రణవము) దేవానాం = దేవతలకు, జిహ్వా = నాలుక, అమృతస్య = మోక్షమునకు, నాభిః = బండికుండునడిమితూమువలె ఆశ్రయభూతమయినది.

తా. మిక్కిలి విస్తృతమయిన పరమాత్మవల్లనుండి సముద్రమునుండి అలలువలె భోగ్యత్వ మగుటచేత మాధుర్యసమన్విత మగు ప్రపంచము ఉత్పన్న మాయెను, లోకమునందు సముద్రమునుండి తరంగము లెట్లు ఉద్భ

వించునో అట్లే చిదేకరసస్వరూపుఁడగు పరమాత్మవల్లనుండి జడమగు భోగ్యజాత ముత్పన్నమాయెను, 'ఘృ'ధాతువు క్షరణమునందును దీప్తియందును చెప్పఁబడినది, కావున ఆధాతువువల్లనుండి పుట్టిన ఘృతశబ్దము దీప్తివాచకము, ఘృతమనఁగా స్వయంప్రకాశక మగు బ్రహ్మము, ఆబ్రహ్మముయొక్క రహస్యమగు నామ మెయ్యదిగలదో ఆనామము అనఁగా ప్రణవము, ఈ ప్రణవమే బ్రహ్మముయొక్క నామ మని వేదములందు చెప్పఁబడియున్నది.

'సర్వే వేదా యత్పద మా మనన్తి' అని యుపక్రమించి "తత్తే పదం సంగ్రహేణ బ్రవీమ్యో మి త్యేతత్" అని (కఠ. ౨-౧౫) కాఠక శ్రుతియందు గలదు.

ధ్యానకాలమునందు ఉపాంశువుగా ఉచ్చరింపఁ బడుచున్న ఆప్రణవముచేత ఉత్పత్తివినాశరహితమగు బ్రహ్మతత్త్వమును చక్కఁగా పొందుచున్నాఁడు, ఆప్రణవము దేవతలకు నాలుకవంటిది, అనఁగా ధ్యానాసక్తులగు దేవతలు ఈప్రణవమును ఎల్లప్పుడు ఉచ్చరించుచున్నారు, కావున ముఖమధ్యమునందు నాలుక ఎట్లున్నదో అట్లే ఈప్రణవముకూడ ముఖమధ్యమునం దుండును కావున దేవతలకు నాలుక యని తాత్పర్యము, మఱియు ఈప్రణవము అమృత మనఁగా వినాశరహితమగు మోక్షమునకు నాభివంటిది, నాభి.యనఁగారథచక్రమధ్యవర్తియగు రంధ్రము,రథచక్రమునకు నాభియెటుల ఆశ్రయమో అటుల మోక్షమునకు ప్రణవము ఆశ్రయము, ఈప్రణవముచేత ముక్తియను ఫలము లభించును, ఇట్లే కఠశ్రుతియందుఁ గలదు.

శ్రు. "ఏతదేవాక్షరం (జ్ఞాత్వా)యో యదిచ్ఛతి తస్య తత్." ఈమంత్రమునందు మోక్షమునకు ప్రణవము సాధన మను విషయము చెప్పఁబడినది.

మం. ౯. వయం నామ ప్రబ్రవామా
ఘృతే నాస్మిన్ యజ్ఞే ధారయామా నమోభిః ।
ఉపబ్రహ్మా శృణవ చ్ఛస్యమానం
చతుశ్శృఙ్గో ఽవమీ ద్గౌర ఏతత్ ॥

టీక. వయం=జ్ఞానార్థులము అగు మేము, అస్మిన్=ఈ, యజ్ఞే = జ్ఞానయజ్ఞమునందు, ఘృతేన = స్వప్రకాశ మగు బ్రహ్మముచేత, నామ = ప్రణవనామమును, ప్రబ్రవామ = సర్వదా ఉచ్చరించుచున్నారము, నమోభిః = నమస్కారములతోడ, ధారయామ = (చిత్తమునందు) ధరించు చున్నారము.

చతుశ్శృంగః = అకార ఉకార మకార నాదరూపములగు శృంగ చతుష్టయము కలిగినట్టియు, సస్యమానం = మాచేత, కొనియాడఁబడు చున్నట్టియు, ఉప శృణవత్ = సమీపమునందున్న బ్రహ్మవేత్తలచేత వినఁ బడుచున్నట్టియు, గౌరః = శ్వేతవర్ణముగల ప్రణవమనియెడి వృషభము, అవమీత్ = బ్రహ్మతత్త్వమును ప్రతిపాదించెను.

తా. పురుషులమును జ్ఞానార్థులమును అగు మేము ఈ జ్ఞానయజ్ఞము నందు చక్కఁగా వెలుఁగుచున్న స్వయంప్రకాశమును బ్రహ్మతత్త్వమునకు నిమిత్తభూతమును అగు ప్రణవనామమును ఎల్లప్పుడు పలుకుచున్నారము, పిదప ఆ బ్రహ్మతత్త్వమునకు సర్వదా నమస్కారము లొనర్చుచు చిత్తమునం దా బ్రహ్మతత్త్వమును ధరించెదము, జ్ఞానమునకు యజ్ఞత్వమును శ్రీకృష్ణ భగవానులవారు గీతలయందు (౪. ౨౮.) చెప్పియేయున్నారు:—

"స్వాధ్యాయధ్యానయజ్ఞాశ్చ యతయ స్సంశితవ్రతాః."

మాచేత ఎల్లప్పుడు కొనియాడఁబడుచున్నట్టియు, పార్శ్వవర్తులగు

తత్త్వవేత్తలచేత ఆకర్షింపఁబడుచున్నట్టియు ఈ బ్రహ్మతత్త్వమును అకార ఉకార మకార నాదరూప శృంగచతుష్టయము కలిగినట్టియు శ్వేతవర్ణము అగు ప్రణవాఖ్యఋషభము ప్రతిపాదించెను.

అకారాదిమాత్రలు ప్రణవమునకు శృంగములని విషయము ఉత్తర తాపనీయోపనిషత్తునందిట్లు చెప్పఁబడియున్నది:—

శృంగేష్వశృంగం సంయోజ్య.

∵ ప్రణవము నిష్కాములగువారిచేత ధ్యానింపఁబడుచున్నది కావున 'గౌర'ము అని చెప్పఁబడినది, ప్రణవమునకు వృషభరూపత్వము సంహితోపనిషత్తునందిట్లు చెప్పఁబడియున్నది:—యశ్ఛందసామృషభో విశ్వరూపః;

మం. ౧౦. చత్వారి శృంగా త్రయో అస్య పాదా
ద్వే శీర్షే సప్తహస్తాసో అస్య ।
త్రిధా బద్ధో వృషభో రోరవీతి
మహో దేవో మర్త్యాగ్ం ఆవివేశ ।౨౭॥

టీక. అస్య = ఈ ప్రణవస్వరూపుఁడగు బ్రహ్మమునకు, శృంగాః = శృంగములు, చత్వారి = నాలుగు (అకార ఉకార మకార నాదములను అక్షరములనుట.) పాదాః = పాదములు, త్రయః = మూఁడు, శీర్షే = శీర్షములు, ద్వే = రెండు, హస్తాసః = హస్తములు, సప్త = ఏడు, త్రిధా = మూఁడువిధములుగా. బద్ధః = కట్టఁబడిన, వృషభః = ప్రణవము, మహః = బ్రహ్మతత్త్వమును, రోరవీతి = ప్రతిపాదించుచున్నది, దేవః = పరమేశ్వరుఁడు, మర్త్యాన్ = మనుష్యదేహములను, ఆవివేశ = ప్రవేశించెను.

తా. ప్రణవము బ్రహ్మతత్త్వమును మిక్కుటముగా ప్రకాశింప జేయుచున్నది, ఆ ప్రణవ మెట్టి దనఁగా;

౧. నాల్గు శృంగములుగలది, అకార ఉకార మకార నాదములే ౪ గు శృంగములు.

౨. మూఁడు పాదములుగలది, విశ్వ తైజస ప్రాజ్ఞులు 3 (ముగ్గురు) పాదములు ఈ ముగ్గురు అధ్యాత్మమునకు విరాట్, హిరణ్యాగర్భ, అవ్యాకృతులు.

అధిదైవికమునకు - పాదశబ్దవ్యుత్పత్తి:—పద్యతే = గమ్యతే బ్రహ్మతత్త్వమేభిరితిపాదాః, బ్రహ్మతత్త్వము నెఱుంగుటకు విశ్వ తైజస ప్రాజ్ఞులు ద్వారభూతులగుచున్నారు కావున పాదము లనంబడుచున్నారు.

3. రెండు శీర్షములు, చిదచిద్రూపములగు శక్తిద్వయమే శీర్షద్వయము.

౪. ఏడుహస్తములు భూర్భువస్స్వరాది లోకసప్తకము హస్తములు.

౫. త్రివిధముగా బద్ధమయినది, అనఁగా అకార ఉకార మకారములందు విశ్వ తైజస ప్రాజ్ఞులచేతను, విరాట్టు హిరణ్యాగర్భ అవ్యాకృతులచేతను త్రివిధముగా బద్ధమయినది.

ఇట్టి వృషభము—అనఁగా ప్రణవము తేజోరూపమగు బ్రహ్మతత్త్వమును అతిశయముగా ప్రతిపాదించుచున్నది.

ఆప్రతిపాదించిన విషయమే మఱల స్పష్టీకరింపఁబడుచున్నది:—

పరమేశ్వరుఁడు మనుష్యదేహములం దంతట ప్రవేశించెను, ఈ విషయమునే

శ్రు. "స వా ఏష ఇహ ప్రవిష్ట ఆనఖాగ్రేభ్యః." అనెడి (బృహ. ౧-౪-౭) శ్రుతియు బోధించుచున్నది.

మనుష్యులయందు నఖశిఖపర్యంతము పరమేశ్వరుఁ డావరించియున్నాఁడని తాత్పర్యము.

మం. ౧౧. త్రిధా హితం పణిభి ర్గుహ్యమానం
గవి దేవాసో ఘృత మన్వవిన్దన్ ।
ఇంద్ర ఏకగ్ం సూర్య ఏకం జజాన
వేనా దేకగ్ం స్వధయా నిష్టతక్షుః ॥

టీక. త్రిధా = మూఁడువిధములుగా (శరీరమునందు విశ్వ, తైజస, ప్రాజ్ఞులను పేరులతోడను, బ్రహ్మాండమునందు విరాట్, హిరణ్యగర్భ, అవ్యాకృతులను పేరులతోడను), హితం = ఉన్నవాఁడును, పణిభిః=స్తోతల చేతను (అనఁగా బ్రహ్మవేత్తలచేతను), గుహ్యమానం = పరమరహస్యముగ కాపాడఁబడునదియును అగు, ఘృతం = స్వయంప్రకాశమగు బ్రహ్మతత్త్వమును, దేవాసః = సాత్త్వికులగు బ్రహ్మవేత్తలు, గవి=తత్త్వమస్యాది మహా వాక్యజాతమందు, అన్వవిందన్ = అనుక్రమముగ పొందిరి.

ఇంద్రః = పరమైశ్వర్యయుక్తుఁడగు విరాట్పురుషుఁడు, ఏకం = ఒక దానిని (అనఁగా జాగరణరూపమును, జజాన = కలుగఁజేసెను, సూర్యః= సూర్యుఁడు), తేజస్వి యగుటచేత హిరణ్యగర్భుఁడు, ఏకం=మఱొకదానిని (అనఁగా స్వప్నరూపమును), జజాన = కలుగఁజేసెను, వేనాత్=సర్వదుఃఖ రహితుఁడగుటచేత కమనీయుఁడగు అవ్యాకృతునివలన, ఏకం=మఱొకటి (అనఁగా సుషుప్తిరూపము కలిగెను), ఈవిధముగా, ఇంద్ర సూర్య వేనులు= విరాట్ హిరణ్యగర్భ అవ్యాకృతులు, స్వధయా = అనన్యాశ్రయమగు బ్రహ్మశక్తిచేత, నిష్టతక్షుః=జాగరణ స్వప్న సుషుప్తి రూపములను పుట్టించిరి.

తా. శరీరమునందు విశ్వతైజసప్రాజ్ఞులను నామములతోడను, బ్రహ్మాండమునందు విరాట్టు హిరణ్యగర్భుఁడు అవ్యాకృతుఁడు అను పేరులతోడను ఉన్నట్టియు, బ్రహ్మవేత్తలచేతను రహస్యముగ గ్రహింపఁబడుచున్నట్టియు

బ్రహ్మతత్త్వమును బ్రహ్మవేత్తలు తత్త్వమస్యాది మహావాక్యానుసంధానముచేత పొందిరి.

పరమైశ్వర్యయుక్తుఁడగు విరాట్పురుషుఁడు, జాగరణరూపమును సృజించెను. తేజోవంతుఁడగు హిరణ్యగర్భుఁడు స్వప్నరూపమును సృజించెను, కమనీయుఁడగు అవ్యాకృతుఁడు, సుషుప్తిరూపమును సృజించెను, ఈ విరాట్ హిరణ్యగర్భ అవ్యాకృతులు స్వప్రతిష్ఠగల బ్రహ్మరూపచైతన్యశక్తి విశిష్టులయ్యె యీజాగరణ స్వప్న సుషుప్తి రూపములను సృజించిరి.

☞ ఈ ౧౦-౧౧ ఋక్కులచేత ప్రణవము, ప్రణవప్రతిపాదితములును వివరింపఁబడినవని ఎఱుంగునది.

మం. ౧౨. యో దేవానాం ప్రథమం పురస్తా
విశ్వాధియో రుద్రో మహర్షిః।
హిరణ్యగర్భం పశ్యత జాయమానగ్ం
స నో దేవ శ్శుభయా స్మృత్యా స్సంయునక్తు।

టీక. యః=ఏదేవుఁడు, దేవానాం = అగ్నీంద్రాది దేవతలకు, ప్రథమం=ఆదిభూతుఁడును, పురస్తాత్=ఆయగ్నీంద్రాదులకంటె ముందుగా, జాయమానం=పుట్టుచున్న, హిరణ్యగర్భం = హిరణ్యగర్భుని, పశ్యత = చూచుచున్నాఁడో, విశ్వాధియః=జగత్తునకు కారణభూతుఁడగుచేత అధికుఁడో, రుద్రః=వేదశబ్దప్రతిపాద్యుఁడో, మహర్షిః=అతీంద్రియద్రష్టలగు వారిలోపల అధికుఁడో, సః=ఆ, దేవః=దేవుఁడు, నః=మమ్ములను, శుభయా = శుభమగు, స్మృత్యా=తత్త్వానుస్మృతిచేత, సంయునక్తు=సంయుక్తులనుగాఁ జేయుఁగాక.

తా. ఏపరమాత్మ అగ్నీంద్రాదిదేవతలకంటె ఆదిభూతుఁడును, మఱియు వారికంటె ముందుగా జన్మించినట్టి హిరణ్యగర్భుని చూచుచున్నాఁడో—

అనఁగా అగ్నీంద్రాది దేవతలు పుట్టుటకంటె ముందుగనే హిరణ్యగర్భుఁడు పుట్టినాఁడనిభావము, అట్టి హిరణ్యగర్భుని కూడ చూచినవాఁడనఁగా అతని కంటె ముందే ఉన్నవాఁ డనువిషయము సిద్ధించుచున్నది. మఱియు అపర మాత్మ ప్రపంచమున కంతటికిని కారణుఁడు కావున విశ్వాధికుఁ డని చెప్పఁబడుచున్నాఁడు, ఛాందసము కావున "విశ్వాధికః" అని యుండవలసిన శబ్దము "విశ్వాధియః" అని చెప్పఁబడినది, 'రుద్' అనఁగా వైదికశబ్దము దానిని పొందువాఁడు రుద్రుఁడు, అనఁగా వేదమంత్రప్రతిపాద్యుఁ డని భావము. అతీంద్రియము లగు విషయములను గ్రహించువారలు ఋషులు, వారిలో పల గొప్పవాఁడు సర్వజ్ఞత్వాదిగుణములు గలవాఁడని శ్రుతిచేత ప్రతిపాదింపఁబడుచున్నవాఁడని యర్థము. అట్టి పరమేశ్వరుఁడు మిమ్ములను సర్వసంసార నివర్తక మగు శోభనమయిన బ్రహ్మతత్త్వము ననుసరించువారలనుగాఁ జేయుఁగాక.

ఈమంత్రము బ్రహ్మవిద్యోపలబ్ధికొఱకు జపింపవలసినదని మంత్రలింగమువలనఁ దెలియుచున్నది.

మం. ౧౩. యస్మా త్పరం నాపర మ స్తి కిఞ్చి
ద్యస్మా న్నాణీయో న జ్యాయో ఽస్తి కశ్చిత్ ।
వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠ త్యేక
స్తేనేదం పూర్ణం పురుషేణ సర్వమ్ ॥

టీక. యస్మాత్ = దేనికంటె, పరం = శ్రేష్ఠమయినదియు, అపరం = నికృష్టమైనదియు, కించిత్ = కొంచెమైనను, న అస్తి = లేదో, యస్మాత్ = దేనికంటె, అణీయః = సూక్ష్మమయినది. కశ్చిత్ = ఒకటియైనను, న అస్తి = లేదో, జ్యాయః = గొప్పదియు, న = లేదో, (అట్టి) ఏకః = ఒక్కఁడగు

పరమాత్మ, వృక్ష ఇవ=వృక్షము వలె, స్తబ్ధః = నిశ్చలుఁడై; దివి = స్వప్ర. కాశరూపమునందు, తిష్ఠతి = ఉంటున్నాఁడు. తేన=ఆ, పురుషేణ = పురుషునిచేత, ఇదం సర్వం = ఈగనంబడు ప్రపంచమంతయు, పూర్ణం=పూర్ణమయి యున్నది.

తా, ఏబ్రహ్మతత్త్వముకంటె శ్రేష్ఠమయినట్టి గాని, లేక హీనమయినట్టి గాని మఱొకవస్తువు కొంచెమైనను లేనేలేదో, ఏబ్రహ్మతత్త్వముకంటె అల్పమైనట్టిగాని, లేక అధికమయినట్టిగాని ఒక్కవస్తువైనను లేదో (మూలమునందు ప్రథమమున చెప్పఁబడిన పర, అపర శబ్దములవలన గుణోత్కర్ష గుణాపకర్ష ఇవి గ్రహింపఁబడినవి, తరువాత చెప్పఁబడిన జ్యాయోఽణీయ శ్శబ్దములవలన పరిమాణాధిక్యత పరిమాణాపకర్షత ఇవి గ్రహింపఁ బడినవనియు గ్రహింపవలయును. ఉత్కర్షయున్నను అపకర్షయున్నను అద్వితీయత్వము సిద్ధించదు, కావున పరాపరములు జ్యాయోఽణీయస్త్వములు కూడలేవని చెప్పఁబడినది, వృక్షము గమనాగమనములు లేక ఒక్కప్రదేశమునందే నిలిచియుండు విధముగా అద్వితీయుఁడగు ఈపరమేశ్వరుఁడే నిర్వికారుఁడై స్వప్రకాశరూపుఁడై నిలిచియుండును, చిదేకరసాత్మకుఁడగు ఇట్టి పరమాత్మచేత జగమంతయు వ్యాపింపఁబడినది, అనఁగా జగదాకారముగ లేక బ్రహ్మతత్త్వముమాత్రము నిలిచియున్న దని తాత్పర్యము.

అవ. అట్టి బ్రహ్మతత్త్వస్మరణమునకు అంగభూత మగు సర్వత్యాగరూప మగు సాధనము విధింపఁబడుచున్నది:—

మం. ౧౪. న కర్మణా న ప్రజయా ధనేన
త్యాగేనైకే అమృతత్వ మానశుః।
పరేణ నాకం నిహితం గుహాయాం
విభ్రాజ దేత ద్యతయో విశన్తి॥

టీక. కర్మణా = అగ్నిహోత్రాదికర్మాచరణముచేత, న = (మోక్షమును) పొందలేదు, ప్రజయా = సంతానముచేత, న=(మోక్షమును) పొందలేదు, ధనేన = ధనముచేత (న=మోక్షమును పొందలేదు) ఏకే= కొందఱు త్యాగేన=త్యాగముచేతనే, అమృతత్వం = మోక్షమును. ఆనశుః= పొందిరి, యతయః=యతీశ్వరులు, (యత్=ఏ యమృతత్వమును), విశన్తి= పొందుచున్నారో (తత్=ఆ) ఏతత్=ఈయమృతత్వము, నాకం=స్వర్గముకంటె, పరేణ = శ్రేష్ఠమయి, గుహాయాం=ఏకాగ్రమయిన స్వకీయబుద్ధిగుహాయందు, నిహితం = ఉన్నదై, విభ్రాజత్ = ప్రకాశించుచున్నది.

తా. అగ్నిహోత్రము మొదలుకొని సహస్రసంవత్సర సత్త్రాంతము దనుక గల ఏ యే కర్మలు గలవో వాని నాచరించుటచేత ముక్తి లభింపదు, 'ప్రజయా పితృభ్యః' అనుశ్రుతి సంతానము పితృఋణవిముక్తి నొనర్చునని చెప్పుచున్నది కావున అట్టి సంతానమువలన మోక్షము లభింపదు. "దానే సర్వం ప్రతిష్ఠితం తస్మాద్దానం పరమం వదన్తి" అను శ్రుతి ధనదానము బహువిధము లగు ఫలములకు సాధనమని బోధించుచున్నది కావున అట్టి దానము ధనమున్నఁగాని చేయఁజాలము కావున అట్టిధనముచేతను గూడ మోక్షము లభింపదు, ఇఁక మోక్ష మేరీతిగా లభించుననఁగా:—కర్మప్రజా ధనాదికము లగు లౌకిక వైదిక సర్వవ్యాపారములను వదలుటచేతనే కొందఱు అంతర్ముఖులు మోక్షమును పొందిరి, ఇంద్రియనియమన శీలురగు వారలే అట్టి మోక్షమును పొందుచున్నారు, ఆ మోక్ష మనునది స్వర్గముకంటె శ్రేష్ఠమైనదై ఏకాగ్రమైన స్వకీయబుద్ధియందు ఉండి ప్రకాశించుచున్నది, అట్టి దాని అంతర్ముఖు లగువారలే యెఱుంగఁగలరు.

అవ. పూర్వమంత్రమునందు త్యాగము మోక్షసాధనమను విషయము చెప్పఁబడినది. ఈమంత్రమునందు-౧. శ్రుతి. "తరతి శోక మాత్మవిత్". (ఛాందో. ౭-౧-౩) ౨. స్మృతి.

"జ్ఞానా దేవతు కైవల్యం ప్రాప్యతే యేన ముచ్యతే" మున్నగు శ్రుతిస్మృతులు జ్ఞానమునకే మోక్షహేతుత్వమును చెప్పు చున్నవి కావున వెనుకటిమంత్రమునకును, ఇప్పు డుదహరించిన శ్రుతిస్మృతులకున్ను విరోధము తటస్థించుచున్నది కావున తద్విరోధపరిహారార్థము జ్ఞానసన్న్యాసములు మోక్షమునకు వేర్వేఱుగ ఉపకరించు నని చెప్పఁబడుచున్నది:—

మం. ౧౫. వేదాంతవిజ్ఞాన సునిశ్చితార్థా
స్సన్న్యాసయోగా ద్యతయ శ్శుద్ధసత్త్వాః ।
తే బ్రహ్మలోకే తు పరాంతకాలే
పరామృతా త్పరిముచ్యంతి సర్వే ॥

టీక. (యే=ఎవరు) వేదాన్తవిజ్ఞానసునిశ్చితార్థాః - వేదాన్త=ఉపనిషద్వాక్యముచేత ఉత్పన్నమైన, విజ్ఞాన = విజ్ఞానముచేత, సునిశ్చిత=నిశ్చయింపఁబడిన, అర్థాః=(జీవబ్రహ్మైక్యలక్షణ)విషయముగల వారలయి, సన్న్యాసయోగాత్ = త్యాగయోగములవలన, శుద్ధసత్త్వాః = శుద్ధమయినచిత్తము గలవారలు అయి, యతయః = నియమశీలురగుచున్నారో, తే సర్వే=వారందఱు, బ్రహ్మలోకేతు=బ్రహ్మసాక్షాత్కారము గలిగినపిదప, పరాన్తకాలే=పరాంతకాలమునందు, పరామృతాత్=అవ్యక్తమువల్లనుండి, పరిముచ్యన్తి=వదలఁబడుచున్నారు.

తా. వేదాంతములనఁగా ఉపనిషద్వాక్యములు, అట్టివానిని ఆచార్య సమీపమున పఠించుటచేత సంసారనివర్తకమగు జ్ఞానము కలుగుచున్నది, అట్టి జ్ఞానముచేత జీవబ్రహ్మైక్యలక్షణము పురుషులచేత ప్రాప్తమగుచున్నది, ఇట్టి సునిశ్చితమయిన బుద్ధిగలవారలు ప్రజాదిత్యాగపూర్వకమగు సన్న్యాసము

వలనను, చిత్తవృత్తినిరోధపూర్వకమగు యోగమువలనను విషయభోగపరాఙ్ముఖు లగుచున్నారు, కావుననే నియమశీలు రగుచున్నారు.

దీనిచేత జ్ఞానము తత్త్వప్రకాశనపూర్వకముగా అవిద్యానివర్తక మనియు, త్యాగము విషయభోగనివృత్తిద్వారా చిత్తశుద్ధికి హేతుభూత మనియు వేఱువేఱుగ ఉపయోగము చెప్పఁబడినది.

బ్రహ్మసాక్షాత్కారము కలిగినపిదప సంసారవిలక్షణభూతులగు వార లందఱు పరాంతకాలమునందు సంసారబంధమువల్లనుండి విముక్తు లగుచున్నారు, జ్ఞానులవిషయమందు మనుష్యత్వదేవత్వాదికృత అధమమధ్యమోత్తమత్వాదిభావము విశేషమును కలుగఁజేయఁజాలదను విషయమును సూచించుటకయి 'తే సర్వే' యని మన్త్రమునందు చెప్పఁబడినది.

అజ్ఞాన మున్నప్పుడు మనుజునకు కలిగెడి దేహపాతసమయము 'అపరాంతకాల' మనఁబడును, ఏలయనఁగా మఱల వానికి దేహప్రాప్తికి అవకాశమున్నది.

అజ్ఞానము నశించిన పిదప కలిగెడి దేహపాతము 'పరాంతకాల' మనఁబడును, ఏలయనఁగా మఱల దేహగ్రహణము కలుగఁజాలదు.

అజ్ఞానులు నైతము ప్రళయకాలమునందు స్థూలసూక్ష్మ శరీరద్వయ బంధనమువల్లనుండి విముక్తులగుచున్నారుగదా, ఇఁక జ్ఞానులకును అజ్ఞానులకును భేదమేమి? యనఁగా పరామృతుఁ డగు అవ్యాకృతునివల్లనుండియు విరక్తు లగుచున్నారు.

అజ్ఞానులగువారికి స్థూలసూక్ష్మశరీరబంధవిముక్తియున్నది కాని అవ్యాకృత (కారణశరీర) బంధమునుండి విముక్తులు కాఁజాలరు.

జ్ఞానులు మాత్రము దేహపాతావసరమునందు అట్టి అవ్యాకృతునివల్లనుండియు (కారణశరీరబంధమునుండియు) విముక్తులగుచున్నారు.

అజ్ఞానులకున్నూ జ్ఞానులకున్నూగల విశేష మిదియే.

ఈమంత్రమునందు అవ్యాకృత్యునకు 'పరామృత' అనుశబ్దము ప్రయోగింపఁబడినది. తదర్థమిది:—

జగత్కారణముగ శ్రేష్ఠుఁ డగుటచేత పరుఁడనంబడును.

తత్త్వజ్ఞానముకంటె ఇతరములగు ఉపాయములచేత వినాశమును పొందఁజాలఁడు కావున అమృతుఁ డనంబడును.

అవ. తత్త్వజ్ఞానము నెఱుంగుట కసమర్థుఁ డగువానికి సూక్ష్మోపాయము చెప్పఁబడుచున్నది:—

మం. ౧౬. దహ్రం విపాపం పరమేఽశ్మభూతం
యత్పుణ్డరీకం పురమధ్యసగ్ంస్థమ్ ।
తత్రాపి దహ్రం గగనం విశోక
స్తస్మిన్ యదన్తస్తదుపాసితవ్యమ్ ॥

టీక. దహ్రం = అల్పమయినట్టియు, విపాపం = శుద్ధమైనట్టియు, పరమేశ్మభూతం = పరమాత్మకు స్థానభూతమయినట్టియు, పుర మధ్య సగ్ స్థం = శరీరమధ్యభాగమునందున్న, యత్ = ఏ, పుండరీకం = అష్టదళమగు హృదయకమలము (అస్తి = కలదో), తత్రాపి = ఆదహరపుండరీకమునం దున్న, దహ్రం = అతిసూక్ష్మ మయినట్టియు, గగనం = ఆకాశమువలె, అమూర్తమగు, విశోకః=శోకరహిత మగు పరబ్రహ్మము (గలదు), తస్మిన్ = (ఆహృదయ) కమలమునందు, అంతః = లోపల, యత్ = ఎయ్యదిగలదో, తత్ =అయ్యది, ఉపాసితవ్యం=ఉపాసింపఁదగినది.

తా. అత్యల్పమయినట్టియు, శరీరసంబంధము లగు దోషములు లేకపోవుటచేత పరిశుద్ధమైనట్టియు, ఆత్మకుగృహమువలె స్థానభూతమైనట్టియు, పరమాత్మ యెల్లప్పు డచ్చట నివసించియుండును కావున గృహమువంటిది

యని చెప్పఁబడినది, 'పరవేశ్మభూతం' అనుటకు 'పరమేశ్మభూతం' అను ఛాందసము. రాజునకు పట్టణమధ్యభాగమందు ప్రాసాద మెట్లుండునో అట్లే పరమాత్మావాసభూత మగు దహ్ర మను హృదయపుండరీకము శరీరమధ్యమునం దున్నదని భావము, ఆదహరపుండరీకమునందు అతి సూక్ష్మము నట్టియు ఆకాశమువలె అమూ_ర్త నుయినట్టియు బ్రహ్మము గలదు, బ్రహ్మము సర్వగతమయినను ఘటాకాశమువలె పుండరీకస్థానముకంటె అల్పమయినట్టిది అను విషయము యోగ్యమగును, ఈ యర్థమును తెలిపెడి శ్రుతి ఒకటి గలదు:—

శ్రుతి, 'య దిద మస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మ దహరేఽస్మి న్నన్త రాకాశ స్తస్మి న్యద న్త స్తదన్వేష్టవ్యం తద్వావ విజిజ్ఞాసితవ్యమ్.' (ఛాందో. ౮-౧-౧)

దహరాధికరణమునందు దహరాకాశము బ్రహ్మ మని నిర్ణయింపఁబడి యున్నది, కావుననే గగనశబ్దవాచ్య మగు ఆబ్రహ్మము శోకరహితము అగుచున్నది, అట్టి (హృదయ) పుండరీకమధ్యభాగమునందు యేబ్రహ్మ త_త్త్వము కలదో అయ్యది ఉపాసింపఁదగినది, ఉపాసించుట యనగా ఇతరవిధమయిన జ్ఞానములేక కేవలము సజాతీయ జ్ఞానప్రవాహరూపముగ భావించుట యగును.

మం. ౧౭. యో వేదాదౌ స్వరః ప్రోక్తో
వేదా_న్తే చ ప్రతిష్ఠితః।
తస్య ప్రకృతిలీనస్య
యః పర స్స మహేశ్వరః ॥౨౮॥

మం. అజోఽన్య ఆవివేశ సర్వే చత్వారి చ ॥౧౨॥

టీక. యః=ఏ, స్వరః=ప్రణవము, వేదాదౌ=వేదాదియందు, ప్రోక్తః=చెప్పఁబడినదో, (సః=ఆస్వరము) వేదాంతే చ=ఉపనిషత్తులందున్ను, ప్రతిష్ఠితః = ప్రతిపాదింపఁబడినది, ప్రకృతిలీనస్య-ప్రకృతియందు లీనమయిన, తస్య=ఆప్రణవముయొక్క, యః=ఏ, పరః=శ్రేష్ఠభాగము (గలదో), సః=ఆయ్యదియే, మహేశ్వరః = మహేశ్వరుఁడు (అని ఎఱుంగవలయును).

తా. "అగ్నిమీళే పురోహితం, ఇషే త్వోర్జే త్వా" మున్నగు వేదమంత్రములకు ఆదియందు ప్రణవరూపమగు ఏస్వరము గలదో ఆప్రణవమే ఉపనిషత్తులందును "ఓమిత్యేత దక్షర మిదం సర్వం" అని ప్రతిపాదింపఁబడియున్నది, ఆప్రణవము ధ్యానకాలమునందు అవ్యాకృత మగు జగత్కారణమునందు లీనమగును, తత్క్రమము:—అకారోకార మకారములందు విరాట్, హిరణ్యగర్భ, అవ్యాకృతములను ధ్యానించి విరాడ్రూపమగు 'అ'కారమును 'ఉ'కారమునందు విలీనమొనర్చి, హిరణ్యగర్భరూపమగు ఆ 'ఉ'కారమును మూలప్రకృతిరూప మగు 'మ'కారమునందు విలీన మొనర్ప వలయును. ఈవిధముగా మూలప్రకృతియందు లీన మగు ప్రణవముయొక్క శ్రేష్ఠమయిన భాగము అనఁగా చతుర్థమాత్రరూప మయిన నాదమునందు ధ్యానింపఁదగినది ఎయ్యది గలదో అయ్యదియే మహేశ్వరుఁడని గ్రహింప వలయును, ఈ మంత్రమునందు వెనుకటి మంత్రమునందు చెప్పఁబడిన "గగనశబ్ద వాచ్య" మగు వస్తువు ప్రపంచితమయినది.

---

౧౩. త్రయోదశోఽనువాకః

అవ. పూర్వానువాకమునందు హృదయపుండరీకమునందు ఉపాసింపఁదగినదిగా నిర్దిష్టమయిన మహేశ్వరస్వరూ

షముఁయొక్క ఉపాసింపఁదగిన గుణవిశేషములు ఈ యను వాకమునందు విస్తారముగా చెప్పఁబడుచున్నవి:—

మం. ౧. సహస్రశీర్షం దేవం విశ్వాక్షం విశ్వశమ్భువమ్।
విశ్వం నారాయణం దేవ మక్షరం పరమం పదమ్॥

టీక. సహస్రశీర్షం = అనేకశిరస్సులు కలిగినట్టియు, విశ్వాక్షం=అనేక నేత్రములు కలిగినట్టియు, విశ్వశంభువం = ప్రపంచమునకు సుఖమును కలుగఁజేయునట్టియు, విశ్వం = జగదాత్మకుఁడైనట్టియు, నారాయణం=జగత్కారణములగు పంచమహాభూతములందుండు వాఁడును, అక్షరం=నాశన రహితుఁడును, పరమం = శ్రేష్ఠుఁడును, పదం = జ్ఞానులచేత పొందఁబడువాఁడును, అగు, దేవం=మహేశ్వరుని, ధ్యానముచేయవలయును.

తా. అనేక శిరంబులు కలవాఁడును, సర్వజగదాత్మకమగు విరాడ్రూపమే మహేశ్వరునియొక్క దేహము, అపుడు మనఅందఱియొక్కయు శిరస్సులు ఆభగవంతునకు శిరస్సులగును, అట్లే అపుడు మనఅందఱియొక్కయు నేత్రములు ఆభగవంతునియొక్క నేత్రములు అగును, సమస్తప్రపంచము నేత్రములు ఆభగవంతునియొక్క నేత్రములు అగును, సమస్తప్రపంచమునకు సుఖ మెవ్వనివలన కలుగునో అతఁడు విశ్వశంభువు, ఇయ్యాది సహస్రశీర్షాది గుణవిశిష్ట మయిన విరాడ్రూపముయొక్క వివరణము, ఇఁక మహేశ్వరునియొక్క నిజస్వరూపము చెప్పఁబడుచున్నది—జగదాత్మకుఁడును, నారాయణశబ్దవాచ్యుఁడున్నూ, నారాయణశబ్దముయొక్క నిర్వచనము పురాణములం దిట్లని చెప్పఁబడినది:—

శ్లో. ఆపోనారా ఇతి ప్రోక్తా ఆపోవై నరసూనవః,
అయనం తస్య తాః పూర్వం తేన నారాయణస్స్మృతః.

జగత్కారణభూతములగు పంచభూతములయం దున్నవాఁడనిభావము

ఇతఁడే ఇంద్ర, మిత్రాది రూపముచేత నున్నాఁడు కావున దేవుఁడని చెప్పఁబడుచున్నాఁడు.

ఋగ్వేదమునం దిట్లు చెప్పఁబడియున్నది:—

మం. ఇంద్రం మిత్రం వరుణ మగ్నిమాహు రథో దివ్య స్స సుపర్ణో గరుత్మాన్, ఏకం స ద్విప్రా బహుధా వద న్త్యగ్నిం యమం మాతరిశ్వాన మాహుః. ఋగ్వే. ౧-౧౬౪-౪౬.

అక్షరుఁ డనఁగా నశించనివాఁడును, సర్వంబునకు కారణస్వరూపుఁ డగుటచేత శ్రేష్ఠుఁడును, జ్ఞానులచేత పొందఁబడువాఁడును అగు మహేశ్వరుని ధ్యానించవలయును, లేక ధ్యానించుచున్నాడను అని తాత్పర్యము.

మం. ౨. విశ్వతః పరమా న్నిత్యం
విశ్వం నారాయణగ్ం హరిమ్ ।
విశ్వ మేవేదం పురుష
స్త ద్విశ్వ ముపజీవతి ॥

టీక. విశ్వతః=జడవర్గ మగు జగత్తుకంటె, పరమాత్ = శ్రేష్ఠమయినట్టియు, నిత్యం = శాశ్వతుఁడైనట్టియు, విశ్వం = సర్వాత్మకుఁడైనట్టియు, నారాయణం = నారాయణుఁడును, హరిం=పాపమును—అజ్ఞానమును హరించువాఁడును, (అగు పరమేశ్వరుని ధ్యానించుచున్నాఁడను.) ఇదం = ఈ, విశ్వం ఏవ = ప్రపంచమే, పురుషః = పరమాత్మ, తత్ = ఆ పరమాత్మ, విశ్వం = ప్రపంచమును, ఉపజీవతి = (స్వవ్యవహారనిర్వాహార్థము) ఆశ్రయించుచున్నాఁడు.

తా. జడవర్గ మగు జగత్తుకంటె శ్రేష్ఠమయినవాఁడును, శాశ్వతుఁడును, సర్వాత్మకుఁడును, నారాయణుఁడును, పాపమును అజ్ఞానమును హరింపఁ

చేయువాఁడును అగు పరమేశ్వరుని ధ్యానించుచున్నాఁడను, అజ్ఞానదృష్టిచేత ప్రపంచమువలె గనఁబడుచున్నట్టి ఇదియంతయు తత్త్వదృష్టిచేత పరమాత్మయే యగుచున్నది, ఆ పరమాత్మ స్వవ్యవహారనిర్వహణార్థము ఈ ప్రపంచము నాశ్రయించుచున్నాఁడు.

మం. 3. పతిం విశ్వస్యాత్మేశ్వరగ్ం
శాశ్వతగ్ం శివ మచ్యుతమ్।
నారాయణం మహాజ్ఞేయం
విశ్వాత్మానం పరాయణమ్॥

టీక, విశ్వస్య = ప్రపంచమునకు, పతిం = పాలకుఁడగుటచేత అధిపతియు, ఆత్మేశ్వరం = జీవులకు ఈశ్వరుఁడును, శాశ్వతం = అవిచ్ఛిన్నముగా నుండువాఁడును, శివం = మంగళస్వరూపుఁడును, అచ్యుతం = నాశరహితుఁడును, నారాయణం = నారాయణుఁడును, మహాజ్ఞేయం = తెలిసికొనఁదగిన తత్త్వములలో ప్రౌఢుఁడగుటచేత మహాజ్ఞేయుఁడును, విశ్వాత్మానం=జగదుత్పత్తికి కారణ మగుటచేత ప్రపంచమే ఆత్మగాఁ గలవాఁడును, పరాయణం=ప్రపంచాధారుఁడును, అగు, ఆపరమేశ్వరుని ధ్యానించెదను.

తా. ప్రపంచమున కంతయు అధిపతియుఁను, జీవులను పుణ్యపాపకర్మలందు నియమించువాఁడును, ఎల్లప్పు డుండువాఁడును, నిత్యమంగళస్వరూపుఁడును, వినాశరహితుఁడును, నారాయణుఁడును, తెలిసికొనఁదగిన తత్త్వములలో గూఢముగా తెలిసికొనఁదగినవాఁడును, ప్రపంచోత్పత్తికి హేతుభూతుఁ డగుటచేత ప్రపంచస్వరూపుఁడును, ప్రపంచమునకు శ్రేష్ఠమయిన ఆధారభూతుఁడును అగు ఆపరమేశ్వరుని ధ్యానించెదను.

మం. ౮. నారాయణ పరో జ్యోతి రాత్మా నారాయణః పరః ।
నారాయణ పరం బ్రహ్మ తత్త్వం నారాయణః పరః ।
నారాయణ పరోధ్యాతా ధ్యానం నారాయణః పరః ॥

టీక. నారాయణః = నారాయణుండే, పరః=శ్రేష్ఠమగు, జ్యోతిః = జ్యోతిస్స్వరూపము, నారాయణః = నారాయణుండే, పరః ఆత్మా = పరమాత్మ. నారాయణః = నారాయణుండే, పరం = శ్రేష్ఠమగు, బ్రహ్మ = వేదాంతవేద్య మగు, తత్త్వం = వస్తువు, నారాయణః = నారాయణుండే, పరః = శ్రేష్ఠుండయినవాఁడు, నారాయణః = నారాయణుండే, పరః = శ్రేష్ఠుండగు, ధ్యాతా = వేదాన్తాధికారి, నారాయణః = నారాయణుండే, ధ్యానం = ధ్యానము, నారాయణః = నారాయణుండే, పరః = పాపాత్ములకు శత్రువున్ను (అగుచున్నాఁడు, ఇట్టి నారాయణమూర్తిని ధ్యానింప వలయును).

తా. సకలశాస్త్రములందు నారాయణశబ్దముచేత వ్యవహరింపఁబడు చున్న పరమేశ్వరుఁడే "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" మున్నగు వేదాంత వాక్యములచేత ప్రతిపాదింపఁబడిన బ్రహ్మతత్త్వస్వరూపుఁడు, ఆనారాయణుఁడే పరమాత్మ! ఛాందోగ్యోపనిషత్తునందు 'పరం జ్యోతి రుపసంపద్యతే' అని జ్యోతిర్మయుఁడుగా వర్ణింపఁబడినాఁడు, ఈ నారాయణుఁడే, సకలోపనిషత్తులందు వేద్యమయి ఉపాధికమై యున్న బ్రహ్మతత్త్వము జడత్వాది గుణవ్యతిరిక్తుఁడు నారాయణుఁడే, వేదాన్తాధికారియు, ప్రత్యగాత్మధ్యాన మను వృత్తివిశేషమును నారాయణుఁడే. పాపాత్ములకు శత్రువుఁడును నారాయణుఁడే. ఇట్టి పరమేశ్వరుని ధ్యానించెద నని తాత్పర్యము.

మం. ౫. యచ్చ కించి జ్జగ త్సర్వం
దృశ్యతే శ్రూయతే ఽపివా ॥౨౯॥
అంత ర్బహి శ్చ త త్సర్వం
వ్యాప్య నారాయణ స్థ్సితః ॥

టీక. జగత్ = ఈ ప్రపంచమునందు, యత్=ఏ కించిత్ = కొంచె మగునది, సర్వం = అంతయు, దృశ్యతే = చూడఁబడుచున్నదో, అపివా = లేక, శ్రూయతేచ = వినఁబడుచున్నదో, తత్ = దానియొక్క, అన్తః = లోపలను, బహిశ్చ = వెలుపలను, సర్వం = అంతట, నారాయణః = నారాయణుఁడు, వ్యాప్య = వ్యాపించి, స్థితః=ఉన్నాఁడు.

తా. ఈ ప్రపంచమునందు సమీపమునందుండి దృగ్గోచరములగు చున్న సకలపదార్థములందును, దూరమునందుండి శ్రవణగోచరము లగు చున్న సకలపదార్థములందును లోపలను వెలుపలను అంతట నారాయణుఁడు వ్యాపించియున్నాఁడనియు, అట్టి నారాయణుని నేను ధ్యానించెదను, అని తాత్పర్యము.

మం. ౬. అనంత మవ్యయం కవిగ్ం
సముద్రే ఽంతం విశ్వశంభువమ్ ।
పద్మకోశ ప్రతీకాశగ్ం
హృదయం చాప్యధోముఖమ్ ॥

టీక. అనన్తం = దేశపరిచ్ఛేదశూన్యుఁడును, అవ్యయం = వినాశ రహితుఁడును, కవిం = చిద్రూపముచేత సర్వజ్ఞుఁడును సముద్రే = సంసార

సాగరమునందు, అంతం = అవసానభూతుఁడును, విశ్వశంభువం = సంసార సుఖోత్పత్తికి కారణభూతుఁడును (అగు నారాయణుని ఉపాసించెదను.) పద్మకోశప్రతీకాశం - తామరమొగ్గతో సమానమగు, అధోముఖం = అధోముఖ మగు, హృదయం = హృదయకమలము (అస్తి=కలదు.)

తా. ఈ మంత్రముయొక్క ప్రథమార్థమునందు నారాయణుని యొక్క వాస్తవస్వరూపమును సంక్షేపించి చెప్పఁబడుచున్నది:—దేశపరిచ్ఛేదశూన్య మగుటచేత అనంతమును, వినాశరహితమగుటచేత అవ్యయమును, చిద్రూపమగుటచేత సర్వజ్ఞమును, సముద్రతుల్య మగు సంసారమునకు అంతమైనవాఁడును, సంసారసుఖోత్పత్తికి కారణమయినవాఁడును అగు నారాయణమూర్తినినే నుపాసించెదను, "ఏతస్యైవానందస్యాన్యాని భూతాని మాత్రా ముపజీవంతి" అని బృహ. ౪.౩.౩౨. శ్రుతిగలదు కావున సంసారసుఖము మున్నగు సుఖములకన్నిటికిని పరమాత్మయే కారణభూతుఁ డనుట.

అవ. ఇఁక ఉపాసనస్థానమును చెప్పుచున్నాఁడు:—

మం. ౭. అధో నిష్ట్యా వితస్త్యాంతే
నాభ్యా ముపరి తిష్ఠతి ।
జ్వాలమాలాఽఽకులం భాతీ
విశ్వస్యాయతనం మహత్ ॥

టీక. నిష్ట్యాః = గ్రీవాబంధముయొక్క, అధః = క్రిందిభాగమునందు, నాభ్యాం ఉపరి = నాభిప్రదేశముయొక్క ఊర్ధ్వభాగమునందు, వితస్త్యాంతే = ద్వాదశాంగుల పరిమితి గల ప్రదేశముయొక్క చివరభాగమునందు (హృదయపుండరీకము), తిష్ఠతి = ఉన్నది, విశ్వస్య = బ్రహ్మాండము

నకు, ఆయతనం = ఆధారభూతమయినట్టియు, జ్వాలమాలాకులం=ప్రకాశ పరంపరలతో కూడికొనియున్న, మహత్ = పరబ్రహ్మము, భాతీ = ప్రకాశించుచున్నది.

తా. నిష్టియనఁగా గుండెకాయ, ఆగుండెకాయకు క్రిందిభాగమునందు నాభికంటె మీదిభాగమునందు ౧౨ అంగుళముల పరిమాణమునకు పైభాగమునందు హృదయపుండరీకము గలదు, ఆ హృదయపుండరీకమునందు బ్రహ్మాండమునకు ఆధారభూతుఁడును ప్రకాశపరంపరలతో కూడుకొన్నవాడును అగు పరబ్రహ్మము ఉన్నాఁడని తాత్పర్యము.

మం. ౮. సంతతగ్ం శిలాభి స్తు
లంబత్యాకోశసన్నిభమ్ ।
తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం
తస్మి న్త్సర్వం ప్రతిష్ఠితమ్ ॥

టీక. ఆకోశసన్నిభం = పద్మముకులముతో సమానమగు (హృదయకమలము), లంబతి = హృదయమధ్యమునం దధోముఖముగా వ్రేలాడుచున్నది, (ఆహృదయకమలము) శిలాభిః = నాడులచేత, సంతతం=అంతట వ్యాపింపఁబడియున్నది, తస్య = ఆహృదయముయొక్క, అంతే=సమీపమునందు, సూక్ష్మం=సూక్ష్మమగు, సుషిరం=రంధ్రము(గలదు), తస్మిన్=ఆరంధ్రమునందు, సర్వం = ఈజగమంతయు, ప్రతిష్ఠితం = ఆశ్రితమయియున్నది.

తా. ఆకోశ మనఁగా తామరమొగ్గ, తామరమొగ్గతో సమాన మగు హృత్పుండరీకము, అధోముఖముగ గలదు, ఆ హృత్పుండరీకమునకు నలువైపుల నాడులు వ్యాపించియున్నవి, ఆహృదయముయొక్క సమీపమునందు సూక్ష్మ మగు రంధ్రమొకటుండు గలదు, దానినే సుషుమ్నానాడీనాళ

మందురు, ఆరంధ్రమునందు ఈజగత్తంతయు ప్రతిష్ఠింపఁబడియున్నది, ఆ సుషిరమునందు మనస్సు ప్రవేశించునెడల జగదాధారభూతుఁడగు పరమేశ్వరుఁడు తెలియఁబడుచున్నాఁడు, కావున పరమేశ్వర కార్యమగు జగమంతయుఁ నచట గలదని తాత్పర్యము.

మం. ౯. తస్య మధ్యే మహా నగ్ని
ర్విశ్వార్చి ర్విశ్వతో ముఖః।
సో ఽగ్రభు గ్విభజ న్తిష్ఠ న్నాహార మజరః కవిః।
తిర్యగూర్ధ్వ మధశ్శాయీ రశ్మయ స్తస్య సన్తతాః॥

టీక. తస్య = ఆసుషుమ్నానాళముయొక్క, మధ్యే = మధ్యభాగమునందు, మహాన్ = ప్రౌఢమగు, అగ్నిః=అగ్ని (కలదు), ఆయగ్ని, విశ్వార్చిః= అధికములగు జ్వాలలుగలది, విశ్వతోముఖః = నలువైపులవ్యాపించిన ముఖములుగలది, సః=ఆయగ్ని, అగ్రభుక్ = తనకు ముందున్నదానిని, అనఁగా అన్నాదికమును భుజించును, ఆహారం=భుజించిన ఆయాహారమును, (ఆయా యవయవములకు సమానముగా) విభజన్=విభాగించుచు, తిష్ఠన్=ఉండును, అజరః = తాను నశింపనివాఁడై, కవిః = సర్వజ్ఞుఁడైయుండును, తస్య = ఆ యగ్నియొక్క, రశ్మయః = జ్వాలలు, తిర్యగూర్ధ్వ మధశ్శాయీ = అడ్డముగా నిలువుగా వ్యాపించినవై, సంతతాః=అంతట వ్యాపించియున్నవి.

తా. ఆసుషుమ్నానాళముయొక్క మధ్యభాగమునందు ప్రౌఢ మగు అగ్నిగలదు, ఆయగ్ని మిక్కుటము లగు జ్వాలలు కలవి కావునసే జ్వాలా విశేషములచేత నలువైపులనుండు నాదు లన్నిటియందును వ్యాపించియుండుట చేత వివిధముఖములు గలదై వెలయుచున్నది మఱియు ఆయగ్ని తనకు ముందఱ ప్రాప్త మగు అన్నాదికమును భుజించును, ఇట్లని శ్రీభగవద్గీతలందును (౧౫-౧౪) గలదు:—

శ్లో. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః,
ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.

అర్థ. నేను (జఠర) అగ్నిరూపమునుధరించి ప్రాణులదేహముల నాశ్రయించిన వాడనై, ప్రాణాపానములతో కూడుకొన్నవాఁడనై నాల్గు విధములగు అన్నమును పచన మొనర్చుచున్నాఁడను.

భుజించినయన్నమును ఆయాయవయవములందు సమానముగా విభజించి యిచ్చును, దేహమునందుండును.

భుజించినయన్నమును జీర్ణింపఁజేసి తాను జీర్ణింపకయుండును కావున అజరుఁడనియు, సర్వజ్ఞుఁ డగుటచేత కవి యనియు పేరు, ఆయగ్నియొక్క జ్వాలలు క్రిందిభాగమునకును, ఊర్ధ్వభాగమునకు వ్యాపించియున్నవై నలువైపుల వ్యాపించియున్నవని తాత్పర్యము.

మం. ౧౦. సంతాపయతి స్వం దేహ మాపాదతలమస్తకః
తస్య మధ్యే వహ్నిశిఖా అణీయోర్ధ్వా వ్యవస్థితః॥

టీక. (ఆయగ్ని) ఆపాదతలమస్తకః = పాదములు మొదలుకొని శిరస్సువఱకు వ్యాపించియున్నదై, స్వం=స్వకీయ మగు, దేహం = దేహమును, సంతాపయతి = ఎల్లప్పుడు సంతాపము కలుగఁజేయుచున్నది, తస్య = ఆదేహమునం దంతయు వ్యాపించియున్న అగ్నిజ్వాలలయొక్క, మధ్యే = మధ్యభాగమునందు, వహ్నిశిఖా = ఒక అగ్నిజ్వాల, అణీయః = సూక్ష్మమైనదై, ఊర్ధ్వా = ఊర్ధ్వప్రసారముగలదై, వ్యవస్థితః = విశేషముగానున్నది.

తా. ఆయగ్ని దేహమునందు పాదములు మొదలుకొని శిరస్సు వఱకుఁ గల సకలావయవములను ఆశ్రయించినదై దేహమునకంతయు ఎల్లప్పుడు సంతాపము కలుగఁజేయుచున్నది, ఈ సంతాపము పట్టిమే లోపల

అగ్నియున్నాడని మనము నిశ్చయించుకొనియున్నారము. దేహమునందంతట వ్యాపించియున్న ఆయగ్నియొక్క జ్వాలావిశేషములలో ఒక అగ్నిజ్వాల అతిసూక్ష్మమైనదై సుషుమ్నానాడీమార్గముచేత బ్రహ్మరంధ్రముదనుక ఊర్ధ్వ ముఖముగా వ్యాపించియున్నది.

మం. ౧౧. నీలతోయదమధ్యస్థా ద్విద్యుల్లేఖేవ భాస్వరా ।
నీవారశూకవ త్తన్వీ పీతా భాస్వత్యణూపమా ॥

టీక. (అవహ్నిశిఖ) నీలతోయదమధ్యస్థాత్ = నీలమేఘముయొక్క మధ్యభాగమునందున్న, విద్యుల్లేఖేవ=మెఱుపుతీగవలె, భాస్వరా=ప్రకాశించునదియైయున్నది, నీవారశూకవత్ =నీవారధాన్యపుగింజయొక్క కొనయందుండు ముల్లువలె, తన్వీ=సూక్ష్మమయినది, పీతా=పీతవర్ణముగలది, భాస్వతీ=కాంతి గలది, అణూపమా సూక్ష్మవస్తువులకు ఉపమానభూతమైనటువంటిది.

తా. వర్షాకాలమునందు మేఘములు జలపూర్ణములయి యుండునప్పుడు నల్లగానుండును, అట్టి నీలమేఘములందు మెరుపుతీగ ఉన్నయెడల మిక్కిలికాంతి కలిగియుండును, అట్టి మెరుపు తీగవలె కాంతిగలదియు, నెవరిధాన్యపు ముల్లువలె సూక్ష్మమైనదియు, పీతవర్ణముగలదియు, కాంతి గలదియు, లౌకికములగు సూక్ష్మవస్తువులకు ఉపమానభూతమయినదియు, అగు అగ్నిశిఖగలదు.

మం. ౧౨. తస్యా శ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః ।
స బ్రహ్మ స శివ స్సహరి స్సేన్ద్ర స్సోఽక్షరః పరమ
స్స్వరాట్ ॥3౦॥
అపి వా స న్తతా షట్చ ॥౧3॥

టీక. తస్యాః=ఆసూక్ష్మ మగు వహ్నిజ్వాలయొక్క, శిఖాయాః = అగ్రముయొక్క, మధ్యే=మధ్యభాగమునందు, పరమాత్మా=పరమేశ్వరుడు వ్యవస్థితః=ఉన్నాడు, సః=అతడే, బ్రహ్మ=చతుర్ముఖబ్రహ్మ, సః=అతడే శివః=శివుడు, సః=అతడే, హరిః=విష్ణువు, సః=అతడే, ఇంద్రః=ఇంద్రుడు, సః=అతడే, అక్షరః = నాశరహితుడు, సః=అతడే, పరమః=శుద్ధ చిద్రూపుడు, సః=అతడే, స్వరాట్ = స్వరాట్టును.

తా. వెనుకటిమంత్రమునందు చెప్పబడిన ఆసూక్ష్మమగు వహ్నిజ్వాలయొక్క మధ్యభాగమునందు జగత్కారణభూతుడగు పరమాత్మ గలడు, ఉపాసనార్థము సర్వవ్యాపి యగు మహేశ్వరునకు స్వల్పస్థానమును నివాసముగా చెప్పినను అతడు మాత్రము అల్పుడు కాడు, అతడు సర్వవేదాధిపతి యగు చతుర్ముఖబ్రహ్మయు, పార్వతీపతియు, లక్ష్మీపతియు, శచీపతియగు ఇంద్రుడును అతడే, జగద్ధేతువును మాయావిశిష్టుడును అగు అన్తర్యామియు నతడే కావున ఇతడే అక్షరశబ్దవాచ్యుడ డగుచున్నాడు.

"క్షర స్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే"

అని (౧౫. ౧౬.) భగవద్గీతావచనము గలదు. పరముడనగా మాయారహితుడగు శుద్ధచిద్రూపుడు, అతడే, పరాధీనము లేక స్వయముగా ప్రకాశించువాడు కావున స్వరాట్టని పిలువబడుచున్నాడని తాత్పర్యము.

ప్రథమమున "సహస్రశీర్షం దేవం" మున్నగు విశేషణములలో ప్రతిపాదింపబడిన పరమాత్మను "పద్మకోశప్రతీకాశం" అను మున్నగు వాక్యములలో నిర్ణయించినవిధముగా ధ్యానింపవలయునని భావము.

౧౪. చతుర్దశోఽనువాకః

అవ. ఆదిత్యమండలమునందు పరబ్రహ్మోపాసనము చెప్పఁబడుచున్నది:—

మం. ౧౩. ఆదిత్యో వా ఏష ఏతన్మండలం తపతి తత్ర
తా ఋచస్తదృచా మండలగ్ం స ఋచాం
లోకోఽథ య ఏష ఏతస్మిన్మండలేఽర్చిర్దీప్య
తే తాని సామాని స సామ్నాం లోకోఽథ య
ఏష ఏతస్మిన్మండలేఽర్చిషి పురుషస్తాని యజూ
గ్ంషి స యజుషా మండలగ్ం స యజుషాం లో
కః సైషా త్రయ్యేవ విద్యా తపతి య ఏషోఽం
తరాదిత్యే హిరణ్మయః పురుషః ॥౩౧॥ ౧౪॥

టీక. (పూర్వానువాకమునందు చెప్పఁబడిన పరమేశ్వరుఁడు) ఏషః= ఈ, ఆదిత్యః వై=సూర్యుఁడే కదా, ఏతత్=ఈ, మండలం=సూర్యమండలము, తపతి=సంతాపమును కలుగఁ జేయుచున్నది, తత్ర=ఆమండలమునందు, తాః= ఆప్రసిద్ధములగు, ఋచః=మంత్రములు (ఉంటున్నవి), తత్=ఆకారణము వలన, మండలం = మండలము, ఋచా=ఋక్కుచేత (నిర్మింపఁబడినది), సః=ఆమండలభాగము, ఋచాం = ఋక్కులయొక్క, లోకః = నివాసస్థానము, ఏతస్మిన్ = ఈ, మండలే = మండలమునందు, యః=ఏ, ఏషః=

ఈ, అర్చిః=తేజస్సు, దీప్యతే = ప్రకాశించుచున్నదో, తాని = ఆకాంతి స్వరూపములను, సామాని = సామలనుగా (ధ్యానింపవలయును), సః=ఆ కాంతిభాగము, సామ్నాం = సామాభిమానిదేవతలకు, లోకః = నివాస స్థానము, అథ=ఇంక, ఏతస్మిన్ = ఈ, మండలే = మండలసంబంధమగు, అర్చిషి = కాంతియందు, యః=ఏ, ఏషః=ఈ, పురుషః=పురుషుఁడుగలఁడో, తాని = ఆదేవతారూపములను, యజూంషి = యజుస్సులనుగా (ధ్యానింపవలయును), సః=ఆయజురాత్మకుఁ డగుపురుషుఁడు, యజుషా = యజుస్సులచేత (నిర్మింపఁబడిన), మండలం = మండలమని (ధ్యానింపవలయును) సః=ఆయజుర్భాగము, యజుషాం = యజురభిమానిదేవతలకు, లోకః=నివాస స్థానము, సాఏషా = ఆఇదియే, త్రయీఏవ = ఋగ్యజుస్సామాత్మకమే, విద్యా=విద్యగా, తపతి=ప్రకాశించుచున్నది, యః=ఏ, ఏషః=ఈ, పురుషః = పురుషుఁడు చెప్పఁబడెనో ఆపురుషుఁడు, అంతః ఆదిత్యే = ఆదిత్యమండలముయొక్క మధ్యభాగమునందు, హిరణ్మయః పురుషః = హిరణ్మయ పురుషుఁడై (ఉన్నాడు).

తా. పూర్వానువాకమునందు నారాయణశబ్దవాచ్యుఁ డగు పరమేశ్వరుఁడు చెప్పఁబడి యున్నాఁడో నిరుపాధికుఁడగు ఆపరమేశ్వరుఁడే ఇప్పుడు సోపాధికుఁడై ఆదిత్యరూపముతో నున్నాఁడు, మన నేత్రేంద్రియములకుఁ గనంబడు చున్నట్టి వర్తులాకారమును ఉష్ణప్రకాశమును గల మండలము ఆ సూర్యుని సంబంధమైనదియే, ఇదియే సంతాపమును కలుగఁజేయు చున్నది, ఈ మండలమునందు అధ్యాపక ప్రసిద్ధములగు “అగ్నిమీళే” మున్నగు ఋఙ్మంత్రములు గలవు. అందువలన ఆమండలము ఋక్కుచేత నిర్మింపఁబడినది, ఆమండలభాగము ఋక్కులచేత నిర్మింపఁబడినదని భావము, మఱియు ఋగభిమాని దేవతలయొక్క లోకము అనఁగా ఆదేవతలకు నివాసస్థానము, అని ధ్యానింపవలయును, ఈవిధముగా మండలమును ఋగాత్మకముగా ధ్యానించి పిదప ఆ మండలమును సామాత్మకముగా ధ్యానింపవల

యును, ఎట్లనఁగా— కనఁబడు ఆదిత్యమండలమునందు ఏతేజము ప్రకాశించుచున్నదో ఆ కాంతులను బృహద్రథంతరాదిసామలనుగా ధ్యానింపవలయును, ఆ తేజస్సే సామాభిమానిదేవతలకు నివాసస్థానము, ఈ విధముగా సామధ్యాన మయిన పిదప యజురాత్మకముగా ధ్యానింపవలసినవిధ మెట్లనఁగా, ఈ యాదిత్యమండలముయొక్క తేజస్సునందు ఏదేవతాత్మ గలఁడో ఆ దేవతయొక్క రూపమును యజుస్సులనుగా ధ్యానింపవలయును, ఆ మండలము యజుస్సులచేతనే నిర్మింపఁబడినది కావున ఆతేజోమండలమే యజురభిమానిదేవతలకు నివాసస్థానము, మండలము, దాని కాంతి, అందుండు పురుషుఁడు ఈమూఁడునుగలసి త్రయి యని యగును, ఈత్రయియే ఋగ్వేద, సామవేద, యజుర్వేదరూప మగు విద్య యగుచున్నది, ఈత్రయియందు చెప్పఁబడిన పురుషుఁడే ఆదిత్యమండలమునందు హిరణ్మయుఁడై యున్నాఁడు, శాఖాంతరమునందు హిరణ్మయపురుషుని గుఱించి విస్తారముగా చెప్పఁబడి యున్నది, ఆమంత్ర మిచట వ్రాయఁబడుచున్నది:

శ్రు. 'అథ య ఏషోఽన్తరాదిత్యే హిరణ్మయః పురుషోదృశ్యతే హిరణ్యశ్మశ్రు ర్హిరణ్యకేశ ఆప్రణఖా త్సర్వ ఏవ సువర్ణః.'

ఛాందో. ౧-౬-౬

(అర్థ:—ఈ ఆదిత్యమండలముయొక్క మధ్యభాగమునందు హిరణ్మయుఁడగు ఏపురుషుఁడు గనఁబడుచున్నాఁడో ఆతఁడు హిరణ్యశ్మశ్రువు (బంగారు మీసములుగలవాఁడు) హిరణ్యకేశుఁడు, గోరుమొదలుకొని అంతయు బంగారుగాఁ గలవాఁడు.)

౧౫. పంచదశోఽనువాకః

అవ. ఆదిత్యపురుషునియొక్క సర్వాత్మకత్వలక్షణరూప మగుఉపాస్యగుణజాతమును నిరూపించుచున్నాఁడు:—

మం. ౧౪. ఆదిత్యో వై తేజ ఓజో బలం యశ శ్చక్షు
శ్శ్రోత్రమాత్మా మనో మన్యు ర్మను ర్మృత్యు
స్సత్యో మిత్రో వాయు రాకాశః ప్రాణో లోక
పాలః కః కిం కం తత్సత్య మన్న మమృతో జీవో
విశ్వః కతమ స్స్వయమ్భు బ్రహ్మైత దమృత ఏష
పురుష ఏష భూతానా మధిపతి ర్బ్రహ్మణ స్సా
యుజ్యగ్ం సలోకతా మాప్నోత్యే తాసా మేవ
దేవతానాగ్ం సాయుజ్యగ్ం సార్ష్టితాగ్ం సమా
నలోకతామాప్నోతి య ఏవం వేదేత్యుపనిషత్ ॥

॥3౭॥ ౧౫॥

టీక. ఆదిత్యఃవై = ఆదిత్యుఁడే, తేజః = దీప్తియు, ఓజః = బల కారణమున్ను, బలం = శరీరశక్తియు, యశః = కీర్తియు, శ్రోత్రం = శ్రోత్రేంద్రియద్వయమున్ను, ఆత్మా = దేహమున్ను, మనః = అంతఃకరణ మున్ను, మన్యుః = కోపమున్ను, మనుః = వైవస్వతాది మనువులున్ను,

మృత్యుః = యముఁడును, సత్యః = సత్యుఁడను దేవతయును, మిత్రః = మిత్రుఁడను దేవతయు, వాయుః ఆకాశః = వాయువు ఆకాశము అను భూతములును, ప్రాణః = ప్రాణమును, లోకపాలః = ఇంద్రాది లోకపాలురును, కః = ప్రజాపతియు, కిం = అనిర్వచనీయమును, కం = సుఖమును, తత్ = పరోక్షమయినదియును, సత్యం = యథార్థభాషణమును, అన్నం = ఓదనాదికమును, అమృతః = దేవసముదాయము లేక మోక్షము, జీవః = సమస్తజీవకోటియు, విశ్వః = జగత్తంతయు లేక విశ్వతైజసాదికమును, కతమః = అత్యంతసుఖమును, స్వయంభు = ఉత్పత్తివినాశములులేని, బ్రహ్మ = బ్రహ్మయు, ఏతత్ = ఇదియంతయు (ఆదిత్యుఁడే యని యర్థము). అమృతః = నిత్యుఁడగు, ఏషః = ఈయాదిత్యుఁడే, పురుషః = పూర్ణుఁడు కావున పురుషశబ్దవాచ్యుఁడు, ఏషః = ఈ యాదిత్యుఁడే, భూతానాం = భూతములకు అధిపతిః = ప్రభువు, యః = ఎవ్వఁడు, ఏవం = ఈవిధముగా, వేద = ఉపాసించుచున్నాఁడో (సః = వాఁడు), బ్రహ్మణః = హిరణ్యగర్భునియొక్క, సాయుజ్యం = సహభావమును అనఁగా తాదాత్మ్యమును, సలోకతాం = సాలోక్యమును (అనఁగా హిరణ్యగర్భుఁడు నివసించులోకమునందు నివసించుట), ఆప్నోతి = పొందుచున్నాఁడు, ఏతాసాం = ఈ, దేవతానాం = భూరాది దేవతలయొక్క, సాయుజ్యం = సాయుజ్యమునుగాని, సార్ష్టితాం = సమానైశ్వర్యత్వమును గాని, సమానలోకతాం = వారిలోకముతో సమానమయినలోకమును కలిగియుండుటను గాని, ఆప్నోతి = పొందుచున్నాఁడు, ఇతి = ఈవిధముగా, ఉపనిషత్ = ఉపనిషద్రహస్య భూతమగువిద్య (సమాప్తిని పొందినది).

తా. వెనుకటి అనువాకమునందు ఋగ్యజుస్సామాత్మకముగా నుపాసించిన ఆదిత్యుని ఇచట సర్వాత్మకునిగా విశేషించి చెప్పుచున్నాఁడు, ఈ యాదిత్యుఁడే తేజస్సు, ఇతఁడే ఓజస్సు, ఓజస్సనఁగా బలకారణము, ఇతఁడే,

శరీరబలము, ఇతఁడే కీర్తిస్వరూపుఁడు, ఇతఁడే నేత్రము, ఇతఁడే శ్రోత్రము, ఇతఁడే దేహము, ఇతఁడే అంతఃకరణము, ఇతఁడే కోపము, ఇతఁడే వైవస్వతతమనువు మున్నగు మనువులు, మృత్యువితఁడే, సత్యుఁడు మిత్రుఁడు అను దేవతావిశేషు లితఁడే (ఇది యుపలక్షణము, సర్వదేవతలును ఇతఁడే.) వాయువు ఆకాశము అను మహాభూతము లితఁడే (ఇది యుపలక్షణము, పంచమహాభూతములును ఇతఁడేయని యర్థము). పంచవృత్తిగలప్రాణ మీ యాదిత్యుఁడే, ఇంద్రాదిలోకపాలకులు ఇతఁడే, ప్రజాపతి ఈ యాదిత్యుఁడే, అనిర్వచనీయమయిన దని చెప్పఁబడునదియు ఇతఁడే, సుఖము ఇతఁడే, పరోక్షమయినదియు ఈ యాదిత్యుఁడే, సత్యభాషణమున్ను ఈ యాదిత్యుఁడే, ఓదనాదికమును ఇతఁడే, దేవసముదాయము లేక మోక్షము ఇతఁడే, సమస్తజీవకోటియు ఇతఁడే, ప్రపంచమంతయు, లేక విశ్వతైజసప్రాజ్ఞులున్ను ఇతఁడే, అత్యంతసుఖస్వరూపుఁడు ఇతఁడే, ఉత్పత్తి మున్నగునవి లేని బ్రహ్మము, ఈ పైని చెప్పఁబడిన వన్నియు సూర్యుఁడే యని తాత్పర్యము, మఱియు ఈ యాదిత్యుఁడే పురుషశబ్దవాచ్యుఁడు, పురుషుఁడనఁగా అంతట నిండియుండువాఁడు, ఇతఁడే సకలభూతములకు అధిపతి.

ఇఁక ఈ విషయము నెఱింగినవానికి కలుగు ఫలము చెప్పఁబడుచున్నది:—ఏపురుషుఁ డీవిధముగా ఉపాసించునో వాఁడు సాయుజ్యాది ఫలములను పొందును. ఉపాసనము హిరణ్యగర్భోపాసన మనియు, తదవయవభూత దేవతోపాసన మనియు ద్వివిధము, అందులో—

౧. (౧) హిరణ్యగర్భోపాసనమునందు భావనాధిక్యము కలిగినయెడల హిరణ్యగర్భునియొక్క సాయుజ్య మనఁగా తాదాత్మ్యమును పొందును.

(౨) ఆహిరణ్యగర్భోపాసనమునందు భావనామాంద్యము కలిగినయెడల ఆహిరణ్యగర్భునియొక్క సాలోక్యము అనఁగా ఆ హిరణ్యగర్భుఁడుండు లోకమునందు నివసించుట కలుగును.

౨. (౧) హిరణ్యగర్భావయవభూతదేవతోపాసనమునందు నైకము భావనాధిక్యము కలిగినయెడల భూరాది దేవతలయొక్క సాయుజ్యమును పొందును.

(౨) ఆ హిరణ్యగర్భావయవభూత దేవతోపాసనమునందు మధ్యమ భావన కలిగినయెడల ఆభూరాదిదేవతలతో సమానైశ్వర్యమును పొందును.

(3) ఆహిరణ్యగర్భావయవభూత దేవతోపాసనమునందు మధ్యమ భావన కలిగినయెడల ఆభూరాదిదేవతలయొక్క సాలోక్యమునుపొందును.

పైయనువాకమునందు జపమంత్రమును చెప్పఁబోవుచున్నాఁడు కావున ఉపాసనా ప్రకరణమును ఉపసంహారము చేయఁదలఁచి ఈవిధముగా వెనుకటి యనువాకములం దుపదేశింపఁబడిన ఉపనిషద్రహస్యభూతమగు విద్య సమాప్త మయినది అని చెప్పినాఁడు.

---

౧౬. షోడశోఽనువాకః

అవ. ఇఁక నూతనశివాలయమును నిర్మించి అందు లింగమును ప్రతిష్ఠించుసమయమునందు వినియోగింపఁబడు నట్టియు, ప్రత్యహము పార్థివలింగపూజ చేసికొనునట్టిసమయము నందు వినియోగింపఁబడునట్టియు, జపమాత్రముచేత పాప క్షయము నొనర్చునట్టియు, పార్వతీపతియొక్క నమస్కార బోధకము లగునట్టియు మంత్రములు చెప్పఁబడుచున్నవి:—

మం. ౧౫. ౧. నిధనపతయే నమః ౨. నిధనపతాంతికాయ నమః, ౩. ఊర్ధ్వాయ నమః, ౪. ఊర్ధ్వలింగాయ నమః, ౫. హిరణ్యాయ నమః, ౬. హిరణ్యలింగాయ నమః, ౭. సువర్ణాయ నమః, ౮. సువర్ణలింగాయ నమః, ౯. దివ్యాయ నమః ౧౦. దివ్యలింగాయ నమః, ౧౧. భవాయ నమః, ౧౨. భవలింగాయ నమః, ౧౩. శర్వాయ నమః, ౧౪. శర్వలింగాయ నమః, ౧౫. శివాయ నమః, ౧౬. శివలింగాయ నమః, ౧౭. జ్వలాయ నమః, ౧౮. జ్వలలింగాయ నమః, ౧౯. ఆత్మాయ నమః, ౨౦. ఆత్మలింగాయ నమః, ౨౧. పరమాయ నమః, ౨౨. పరమలింగాయ నమః, ౨౩. ఏతథ్సోమస్య సూర్యస్య సర్వలింగగ్గ్ం స్థాపయతి పాణిమంత్రం పవిత్రమ్ ॥౩౪॥ ౧౬॥

టీక. ౧. నిధనపతయే = (కుబేరరూపమున) అతిశయమైన ధనమునకు ప్రభువగు పార్వతీపతికొఱకు, నమః=నమస్కారము.

-౨. నిధనప+త+అంతికాయ - నిధనప=అతిశయమైన ధనమునకు అధి

పతియు, శ=(అధనమును) భక్తులకు కలుగఁజేయునట్టియు, అంతికాయ = (భక్తులకు) సమీపమై యుండువాఁడును (అగు పార్వతీపతికొఱకు), నమః= నమస్కారము.

3. ఊర్ధ్వాయ = ఊర్ధ్వలోకములందు దేవతారూపమున నుండునట్టి పార్వతీపతికొఱకు, నమః=నమస్కారము.

౪. ఊర్ధ్వలింగాయ=ఊర్ధ్వలోకములందు లింగాకారమున స్థాపింపఁబడి పూజింపఁబడుచున్నవానికొఱకు, నమః=నమస్కారము.

౫. హిరణ్యాయ = (సర్వాత్మకుఁడు కావున) సువర్ణరూపుఁడైనవానికొఱకు, నమః=నమస్కారము.

౬. హిరణ్యలింగాయ = సువర్ణనిర్మిత లింగాకారముగల వానికొఱకు, నమః=నమస్కారము.

౭. సువర్ణాయ = మంచికాంతిగల వానికొఱకు, నమః = నమస్కారము.

౮. సువర్ణలింగాయ = మంచికాంతిగల వెండిచేత నిర్మింపఁబడిన లింగాకారము గలవానికొఱకు, నమః=నమస్కారము.

౯. దివ్యాయ = ద్యులోకసుఖస్వరూపుఁడగు వానికొఱకు, నమః = నమస్కారము.

౧౦. దివ్యలింగాయ = ద్యులోకమునందు ఇంద్రాదులచేత స్థాపింపఁబడిన లింగాకారము గలవానికొఱకు, నమః=నమస్కారము.

౧౧. భవాయ = సంసారరూపుఁడైన వానికొఱకు, లేక బ్రహ్మాండమును సృజించువానికొఱకు, నమః=నమస్కారము.

౧౨. భవలింగాయ=భూలోకమునందుండు మనుష్యులచేత పూజింపఁబడుచున్న శిలామయాది లింగాకారుఁడగు వానికొఱకు, నమః = నమస్కారము.

౧౩. శర్వాయ = మహత్సుఖమును పొందువానికొఱకు, నమః = నమస్కారము.

౧౪. శర్వలింగాయ=సుఖరూపమయిన లింగాకారుఁడగు వానికొఱకు, నమః=నమస్కారము.

౧౫. శివాయ = మంగళరూపుఁడగు శివునికొఱకు, నమః = నమస్కారము.

౧౬. శివలింగాయ = కల్యాణమునకు జ్ఞాపకభూతుఁ డగు శివునికొఱకు, నమః=నమస్కారము.

౧౭. జ్వాలాయ = జ్యోతిర్మయుఁడగు వానికొఱకు, నమః = నమస్కారము.

౧౮. జ్వలలింగాయ = భూలోకమునం దున్న ద్వాదశజ్యోతిర్మయ లింగాకారుఁడగు వానికొఱకు, నమః=నమస్కారము.

౧౯. ఆత్మాయ = నిఖిలజగదాకారుఁడగు వానికొఱకు, నమః = నమస్కారము.

౨౦. ఆత్మలింగాయ = సర్వజంతుస్వరూపుఁడై, ఆజంతువుల హృదయ గుహయందు లీనమయియున్న బ్రహ్మతత్త్వమును వేదాంతరూపముచేత పొందించువానికొఱకు, నమః=నమస్కారము.

౨౧. పరమాయ = శ్రేష్ఠుఁడయిన వానికొఱకు, లేక జగద్రక్షణ మొనర్చుచు మోక్షసామ్రాజ్యమునందు రమించువానికొఱకు, నమః = నమస్కారము.

౨౨. పరమలింగాయ = శ్రేష్ఠుఁడును విలీనమయిన దానిని కూడ ఎఱుంగువాఁడును అగు వానికొఱకు, నమః=నమస్కారము.

౨౩. ఏతత్ = ఈమంత్రములచేత, పాణిమంత్రం = అవయవ భూతములయిన వేదమంత్రములు కలిగినట్టియు, పవిత్రం = పాపులకున్నైశము

పునీతులనుఁగా నొనర్చునట్టియు, సోమస్య సూర్యస్య=సోముఁడు సూర్యుఁడు మున్నగుదేవతలయొక్క ఉపలక్షణముచేత అందఱుదేవతలయొక్కయు ననుట, సర్వలింగం = సకలవిధములగు లింగములను, స్థాపయతి = త్రైవర్ణికులగువారలు స్థాపించుచున్నారు.

తా. ఈమంత్రములు ౨౩. వీనిలో ౨౩-వ మంత్రమునందు "సర్వ లింగగ్గ్ స్థాపయతి, పాణిమంత్రంపవిత్రం" అనియుండుటచేత ఈ మంత్రములు శివలింగములను నూతనముగ ప్రతిష్ఠించునప్పుడును, ప్రతినిత్యము పార్థివ లింగము మున్నగువానిని ప్రతిష్ఠించుకొనునప్పుడున్ను వినియోగింపఁ దగినవని తెలియవచ్చుచున్నది.

౧. నిధన మనఁగా అతిశయమైన ధనము, అట్టి యమితమైన ధనము నకు కుబేరరూపముతో అధిపతి యయినవాఁడు నిధనపతి యని చెప్పఁబడును, అట్టి నిధనపతియగు పార్వతీపతికొఱకు నమస్కరించుచున్నాఁడను. ప్రతి మంత్రము పార్వతీపతికి విశేషణముగా చెప్పఁబడియున్నది, పైమంత్రము లన్నిటియందును ఇట్టి పార్వతీపతికి నమస్కారమని వ్యాఖ్యానానుసారము గ్రహింపవలయును.

౨. నిధనపుఁ డనఁగా అతిశయమైన ధనమును రక్షించువాఁడు. 'త' అనఁగా భక్తులకు సంపద మున్నగువానిని విస్తరింప చేయువాఁడు, అన్తికుఁ డనఁగా సమీపమున నుండువాఁడు, నిధనప+త+అంతికుఁడు, నిధనపతాంతి కుఁడు, అనఁగా మిక్కుటమయిన ధనమునకు రక్షకుఁడై భక్తులకు అట్టి ఐశ్వ ర్యాదికమును విస్తరింపఁజేయుచు వారిసమీపమున నుండువాఁడని యర్థము, అట్టి శివునికొఱకు నమస్కారము.

3. ఊర్ధ్వుఁ డనఁగా ఊర్ధ్వలోకములందు దేవతారూపమున నుండు వాఁడు, అట్టి ఈశ్వరుని కొఱకు నమస్కారము.

౪. ఊర్ధ్వలింగుఁ డనఁగా ఊర్ధ్వలోకములందును భక్తులగువారిచేత లింగరూపమున స్థాపింపఁబడి పూజింపఁబడుచుండువాఁడని యర్థము, అట్టి శివునికొఱకు నమస్కారము.

౫. హిరణ్య మనఁగా బంగారము, శివుఁడు సర్వాత్మకుఁడు కావున బంగారురూపము అయిన శ్రీశివునికొఱకు నమస్కార మగుఁగాక.

౬. హిరణ్యలింగుఁ డనఁగా బంగారుతో నిర్మింపఁబడిన లింగాకారము గలవాఁడు, అట్టి శివునికొఱకు నమస్కారము.

౭. సువర్ణ మనఁగా మంచికాంతి గలది, అట్టి కాంతిగల వెండి యొక్క ఆకారమువంటి ఆకారము గలవాఁడు, అట్టి శివునికొఱకు నమస్కారము, వెనుక మంత్రమునందు హిరణ్యమని బంగారువంటి ఆకారము గలవాఁడని చెప్పి యుండుటచేత ఈ మంత్రమునందుగల సువర్ణశబ్దమునకు రూఢ్యర్థమగు బంగారమును వదలి యౌగికముగా అర్థమును గ్రహించి వెండి యని చెప్పఁబడినది. (౮-వ మంత్రమునం దిట్లే గ్రహింపవలయును.)

౮. సువర్ణలింగు డనఁగా మంచికాంతి గల వెండితో చేయఁబడిన లింగస్వరూపుఁడై భక్తులచేత పూజింపఁ బడుచుండు ఈశ్వరునికొఱకు నమస్కారము.

౯. దివ్యుఁ డనఁగా ద్యులోకసుఖస్వరూపుఁడు, ఇట్టి సుఖస్వరూపుఁడగు ఈశ్వరునికొఱకు నమస్కారము.

౧౦. దివ్యలింగుఁ డనఁగా ఇంద్రుఁడు మున్నగుదేవతలచేత ద్యులోకమునందు ప్రతిష్ఠాపింపఁబడిన లింగాకారము గలిగియున్న ఈశ్వరునికొఱకు నమస్కారము.

౧౧. భవమనఁగా సంసారము, తత్స్వరూపుఁడు భవుఁడు, లేక "భవత్యుత్పద్యతే బ్రహ్మాండం యస్మా దితి భవః" అను వ్యుత్పత్తిచేత ఎవని వల్లనుండి బ్రహ్మాండము పుట్టుచున్నదో అతఁడు భవుఁడని చెప్పఁబడును,

అనఁగా సృష్టికర్త, అట్టి సృష్టికర్త అయిన శివునికొఱకు నమస్కార మగుఁ గాక.

౧౨. భవలింగుఁ డనఁగా—భవులనఁగా జీవులు, అట్టి జీవులచేత భూలోకమునందు పూజార్థము స్థాపింపఁబడిన లింగములు భవలింగములు, అట్టి లింగాకారుఁడైన శివునికొఱకు నమస్కారము, అని తాత్పర్యము.

౧౩. శర్వుఁడనఁగా "శృణాతి బ్రహ్మాండం ప్రళయే హినస్తీతిశర్వః" అను వ్యుత్పత్తిచేత ప్రళయకాలమునందు బ్రహ్మాండమును సంహరించువాఁడని యర్థము, అట్టి శివునికొఱకు నమస్కారము.

౧౪. శర్వుఁడనఁగా: శం మహత్సుఖం వాతి గచ్ఛతీతి శర్వః, "శర్వరూపంచ తల్లింగం శర్వలింగం తస్మై శర్వలింగాయ" అను వ్యుత్పత్తి, శర్వమనఁగా గొప్పసుఖమును పొందునది, అట్టి శర్వరూపమగు లింగము శర్వలింగము, శివలింగపూజనము కల్యాణప్రదము కావున అట్టి శర్వలింగుఁడగు శివునకు నమస్కారము.

౧౫. శివుఁడనఁగా మంగళస్వరూపుఁడు, అట్టి మంగళస్వరూపుఁ డగు శివుని కొఱకు నమస్కారము.

౧౬. శివలింగమనఁగా కల్యాణమని యర్థము, అట్టి శివునికొఱకు నమస్కారము.

౧౭. జ్వలుఁ డనఁగా జ్యోతిర్మయుఁడు కావున ప్రకాశించునట్టి శివునికొఱకు నమస్కారము.

౧౮. జ్వలలింగుఁ డనఁగా భూలోకమునందుండు ద్వాదశవిధ జ్యోతిర్లింగ స్వరూపుఁడు, అట్టి జ్యోతిర్లింగస్వరూపుఁడగు శివునికొఱకు నమస్కారము.

౧౯. ఆత్మ యనఁగా సకల జగదాత్మకుఁడు, అట్టివాఁడగు శివునికొఱకు నమస్కారము.

౨౦. ఆత్మలింగుఁడనఁగా: 'లీనం=సురనరాది సర్వప్రాణిగుహాసు గోపితం బ్రహ్మ వేదాన్తరూపేణ గమయతి=విజ్ఞాపయతీతి లింగః' దేవమనుష్యాది సర్వజంతువుల హృదయగుహాయందు గుప్తమైయుండు బ్రహ్మమును వేదాంతరూపముగ తెలుపునట్టి వాఁడు లింగుఁ డనఁబడును, ఆత్మయనఁగా సకలప్రాణిరూపుఁడు, సకలప్రాణిరూపుఁడై వారి హృదయగుహాయాదుగల బ్రహ్మమును వేదాంతరూపముగ తెలుపునట్టివాఁడు ఆత్మలింగుఁడు, అట్టి శివుని కొఱకు నమస్కారము.

౨౧. పరముఁ డనఁగా ఎవనికంటె శ్రేష్ఠమయినదిగాని శ్రేష్ఠుఁడుగాని లేఁడో అతఁడు పరముఁడు, అట్టి శివునికొఱకు నమస్కారము.

౨౨. పరమలింగుఁ డనఁగా ప+రమ+లింగుఁడు, ప యనఁగా జగమును రక్షించువాఁడు, రముఁ డనఁగా మోక్షసామ్రాజ్యమునందు రమించువాఁడు. లీనం విలీన మపి సర్వజ్ఞత్వా ద్గచ్ఛత్యవగచ్ఛతి జానాతీతి లింగః. అనఁగా విలీనమయిన దానినికూడ సర్వజ్ఞుఁడు కావున దెలిసికొనెడివాఁడు లింగుఁడు, జగమును రక్షించుచు, మోక్షసామ్రాజ్యమునందు రమించుచు, విలీనమయిన దానిని కూడ సర్వజ్ఞుఁడు కావున తెలిసికొనఁజాలువాఁడు పరమలింగుఁడు, అట్టి శివునికొఱకు నమస్కారము.

౨౩. పైనచెప్పిన మంత్రములచేత రసము సువర్ణము మున్నగు లోహములచేత నిర్మింపఁబడిన లింగములను త్రైవర్ణికులగు బ్రహ్మక్షత్రియ వైశ్యజాతులవారు ప్రతిష్ఠింపవలయును, ఆ లింగము ఎట్టిదనఁగా సూర్యునకును చంద్రునకును ఉపలక్షణముచేత దేవతలందఱకును అని యర్థము, ఆ ట్లందఱకు కారణభూతమైనదని యర్థము, వేదమంత్రములే చేతులు, పాదములు, మున్నగు అవయవములుగా ఏర్పడినది పాణిమంత్ర మనఁబడును, పాణి యనునది ఉపలక్షకము, వేదమయశరీర మని భావము. మఱియు ఎట్టి పాపులనైనను తన్ను స్మరించుటవలన పవిత్రులనుగాఁ జేయునది

పవిత్ర మనఁబడును. ఇట్టి పవిత్రమగు లింగమును పూర్వోక్తములగు "నిధన పతయే నమః" అను మంత్రము మొదలుగాఁగల మంత్రములచేత ప్రతిష్ఠింప వలయును. 'ఏతైః' అని ఉండవలసినందులకు "ఏతత్" అని యుండుట ఛాందసము.

---

౧౭. సప్తదశోఽనువాకః

అవ. శాస్త్రాధికారు లగు ద్విజులకు జ్ఞానోత్పత్తినిమిత్తము మహాదేవునియొక్క ౫ వక్త్రములలో పశ్చిమవక్త్రమును ప్రతిపాదించునట్టి మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ౧౬. సద్యోజాతం ప్రపద్యామి సద్యోజాతాయ వై
నమోనమః । భవేభవే నాతిభవే భవస్వమామ్ ।
భవోద్భవాయ నమః ॥3౫॥ ౧౭॥

టీక. సద్యోజాతం = సద్యోజాతమను పేరుగల ఏపశ్చిమవక్త్రము గలదో తద్రూపముగల పరమేశ్వరుని, ప్రపద్యామి=శరణు పొందుచున్నాఁడను, సద్యోజాతాయ = అట్టి సద్యోజాతునికొఱకు, నమః నమః వై= మాటిమాటికి నమస్కారమగుఁగాక, (ఓసద్యోజాతవక్త్రమా!) భవేభవే = ఆయాజన్మముఁనిమిత్తము, మాం=నన్ను, న భవస్వ=ప్రేరేపింపవలదు, అతి భవే = జన్మాతిక్రమణమునందు. భవస్వ = ప్రేరేపింపుము, భవోద్భవాయ=సంసారము నుండి ఉద్ధరించునట్టి సద్యోజాతునికొఱకు, నమః=నమస్కారము.

తా. పరమేశ్వరునకు సద్యోజాతమను పేరుతో నేపశ్చిమవక్త్రము గలదో ఆవక్త్రస్వరూపముగల పరమేశ్వరుని శరణు పొందుచున్నాఁడను, అట్టి సద్యోజాతమూర్తికి మాటిమాటికి నమస్కార మగుఁగాక, ఓసద్యోజాత వక్త్రస్వరూపుఁడవగు పరమేశ్వరా! నన్ను మాటిమాటికి జన్మము లెత్తుచుండు టకు గాను ప్రేరేపింపకుము, నాకు ఇఁకమీఁద జన్మములు లేకుండెడి స్థితికయి ప్రేరేపింపుము, సంసారమునందుండి (దరిగానక యల్లాడుచుండువారలను) ఉద్ధరించునట్టి నీకు నమస్కారమగుఁగాక.

---

౧౮. అష్టాదశోఽనువాకః

అవ. ఉత్తరవక్త్రప్రతిపాదకమగు మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ౮౭. వామదేవాయ నమో జ్యేష్ఠాయ నమశ్శ్రేష్ఠాయ నమో రుద్రాయ నమః కాలాయ నమః కలవికర ణాయ నమో బలవికరణాయ నమో బలాయ నమో బలప్రమథనాయ నమస్సర్వభూతదమనా య నమో మనోన్మనాయ నమః ॥3౬। ౧౮॥

టీక. వామదేవాయ = సుందరమయి ప్రకాశించుచున్న (ఈశ్వరుని యొక్క ఉత్తర) వక్త్రము కొఱకు, నమః = నమస్కారము, జ్యేష్ఠాయ= అన్నిటికంటె ముందుపుట్టుటచేత జ్యేష్ఠముయిన ఆయుత్తరవక్త్రమునకు,

నమః = నమస్కారము, శ్రేష్ఠాయ = శ్రేష్ఠమయిన ఆయుత్తరవక్త్రమునకు, నమః = నమస్కారము, రుద్రాయ = ప్రళయకాలమునం దందఱకు రోదన హేతు వగు ఆవక్త్రముకొఱకు, నమః=నమస్కారము, కాలాయ = (కావునసే) సర్వప్రాణుల ఆయుఃక్షయహేతువగుటవలన కాలస్వరూపమగు ఆముఖముకొఱకు, నమః=నమస్కారము, కలవికరణాయ=కల మనఁగా సుఖమును స్వీకరించునది, వికరణ మనఁగా వివిధమయిన జగత్తును చేయునది, ఇట్టి దానికొఱకు, నమః = నమస్కారము, బలవికరణాయ = (రాక్షసులయొక్క) బలమును హింసించునట్టి ఆముఖముకొఱకు, నమః=నమస్కారము, బలాయ= సకలశక్తులకు స్థానమగుటచేత బలరూపమగు ఆముఖముకొఱకు, నమః=నమస్కారము, బలప్రమథనాయ=స్వేచ్ఛఁగా సకలశక్తులను ఉపసంహారము చేసికొనునట్టి దానికొఱకు, నమః = నమస్కారము, సర్వభూతదమనాయ = సకలభూతములను శిక్షించునట్టి ఆముఖముకొఱకు, నమః = నమస్కారము, మనోన్మనాయ మనమనఁగా అంతయుం ఎఱుంగునది, ఉన్మన మనఁగా సర్వజ్ఞతమ మైనది, అట్టి ముఖముకొఱకు, నమః=నమస్కారము.

తా. శ్రీపరమేశ్వరునియొక్క ఉత్తరవక్త్రమునకు నమస్కరించుచున్నాఁడను, ఆయుత్తరవక్త్రమై మెట్టిదనఁగా, సుందరమై ప్రకాశించుచున్నది, అన్నిటికి ముందుపుట్టినది కావున జ్యేష్ఠశబ్దవాచ్యమైనది, ఇంతకంటె ప్రశస్తమైనది మఱొకటి లేదు కావున శ్రేష్ఠమని చెప్పఁబడునది, ప్రళయకాలమునందు సంహారాత్మకమయి అందఱను రోదింపఁ జేయునుఁగాన రుద్రశబ్దవాచ్యమైనది, సర్వప్రాణులయొక్క ఆయువు క్షీణించిపోవుటకు హేతువైనది కావున కాలశబ్దవాచ్యమైనది, సుఖముకలిగియుండి నానావిధమైన జగత్తును నిర్మించుచున్నది కావున కలవికరణశబ్దవాచ్యమయినది, సకలరాక్షసులయొక్కబలమును హింసించునది కావున బలవికరణశబ్దవాచ్యమైనది, సకల బలశక్తులకు స్థానమైనది అగుటచేత బలశబ్దవాచ్యమైనది, స్వేచ్ఛగా సకలశక్తులను ఉపసంహారము చేసికొను సామర్థ్యము

గలది కావున బలప్రమథనశబ్దవాచ్యమైనది, సకలభూతములను శిక్షించునది కావున సర్వభూతదమన శబ్దవాచ్యమైనది, అంతయు వెలిగించినది మనము, సర్వజ్ఞతమమయిన మనము ఉన్ననము, అట్టి ఉత్తరముఖమునకు నమస్కారమగుగాక, ఈమంత్రమునందు ప్రతిపదసమీపమునందు "నమః నమః" అని ప్రత్యేకముగా చెప్పుట ఆదరార్థమని ఎఱుంగవలయును.

---

౧౯. ఏకోనవింశోఽనువాకః

అవ. దక్షిణవక్త్ర ప్రతిపాదక మగు మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ౧౮. అఘోరేభ్యోఽథ ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః । సర్వేభ్యస్సర్వ శర్వేభ్యో నమస్తే అస్తు రుద్రరూపేభ్యః ॥32॥ ౧౯॥

టీక. సర్వ = సర్వాంతర్యామివగు ఓపరమేశ్వరా! అఘోరేభ్యః = ఘోరములుగాక శాంతస్వరూపము లయినట్టియు, ఘోరేభ్యః=ఉగ్రములయినట్టియు, ఘోరఘోరతరేభ్యః = మిక్కిలి ఘోరతమములయినట్టియు, తే= నీయొక్క, శర్వేభ్యః = లయకాలమునందు ప్రాణులను హింసించునట్టి సర్వేభ్యః = సమస్తములయిన, రుద్రరూపేభ్యః = రౌద్రరూపములకొఱకు, నమః=నమస్కారము, అస్తు=అగుగాక.

తా. అఘోరమనునది పరమేశ్వరునియొక్క దక్షిణవక్త్రనామము, అతనియొక్క విగ్రహములు అఘోరములు, ఇవి సాత్త్వికములు కావున

శాంతములయినవి, మఱికొన్నిరూపములు ఘోరములు, అవి రాజసగుణము గలవి, తదితరములయిన రూపములు, తామసగుణసంబంధముగలవి కావున అతి ఘోరతమములు, ఓ పరమేశ్వరా! సంసారకాలమునందు జగమునంతయు హింసించునట్టి ఈనీ సకలవిధమూర్తులకొఱకు నమస్కారమగుఁ గాక.

---

౨౦. వింశోఽనువాకః

అవ. ప్రాగ్వక్త్ర ప్రతిపాదక మగుమంత్రము చెప్పఁబడు చున్నది:—

మం. ౧౯. తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి ।
తన్నో రుద్రః ప్రచోదయాత్ ॥౩౮॥ ౨౦॥

టీక. ప్రాగ్వక్త్రదేవత తత్పురుషుఁడను నామము గలవాఁడు అట్టి! తత్పురుషాయ = తత్పురుషుఁడనుదేవుని, విద్మహే = గురూపదేశశాస్త్రాభ్యాసములవలన ఎఱుంగుచున్నారము, (అట్లు తెలిసికొని) మహాదేవాయ = ఆమహాదేవుని, ధీమహి=ధ్యానించుచున్నారము, తత్ = ఆకారణమువలన, రుద్రః=ఆరుద్రుఁడు, నః=మమ్ములను, ప్రచోదయాత్ = ధ్యానజ్ఞానార్థము ప్రేరేపించుగాక.

తా. పరమేశ్వరుని ప్రాగ్వక్త్రప్రతిపాదకుఁడగు దేవుఁడు తత్పురుష సంజ్ఞగలవాఁడు, అట్టిదేవుని గురూపదేశ శాస్త్రాభ్యాసములవలన తెలిసికొనియెదము, అట్లు తెలిసికొని ఆమహాదేవుని ధ్యానించెదము, అందువలన రుద్రుఁడు మమ్ములను ఆధ్యానమొనర్చుటయందు ప్రేరేపించుఁగాక యని తాత్పర్యము.

"తత్పురుషం, మహాదేవం" అని ద్వితీయావిభక్తిగా చెప్పవలసినచోట "తత్పురుషాయ, మహాదేవాయ" అని చతుర్థీవిభక్తిని చెప్పుట ఛాందసము.

౨౧. ఏకవింశోఽనువాకః

అవ. ఊర్ధ్వవక్త్ర ప్రతిపాదక మగు మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ౨౦. ఈశాన స్సర్వవిద్యానా మీశ్వర స్సర్వభూతా
నాం బ్రహ్మా ఽధిపతి ర్బ్రహ్మణో ఽధిపతి ర్బ్రహ్మ
శివో మే అస్తు సదాశివోమ్ ॥3౯॥ ౨౧॥

టీక. ఊర్ధ్వవక్త్రాధిపతి యగు దేవుఁ డెవ్వఁడు గలఁడో అతఁడు, సర్వవిద్యానాం = విద్యలకన్నింటికి, ఈశానః = నియామకుఁడు, సర్వభూతానాం = అఖిలప్రాణులకు, ఈశ్వరః = నియామకుఁడు, బ్రహ్మాధిపతిః = వేదమునకు పాలకుఁడు, బ్రహ్మణః=హిరణ్యగర్భునకు, అధిపతిః = అధిపతియయినవాఁడు, బ్రహ్మ=ప్రవృద్ధిగల పరమాత్మ, మే=నాకు, శివః=మంగళకరుఁడు, అస్తు = అగుఁగాక, సదాశివః = ఆసదాశివరూపుఁడను, ఓమ్ = నేను అగుచున్నాఁడను.

తా. శ్రీపరమేశ్వరునియొక్క ఊర్ధ్వవక్త్రమునందుండు దేవతయే సర్వవిద్యలకును సర్వభూతములకును నియామకుఁడు, విశేషించి వేదమును సంరక్షించువాఁడు ఇతఁడే, హిరణ్యగర్భునకు కూడ అధిపతి ఇతఁడే, ఇట్టి పరమాత్మ నాకు శాంతుఁడై మంగళప్రదుఁ డగుఁగాక, ఆ సదాశివస్వరూపుఁడను నే నగుచున్నాఁడను అని తాత్పర్యము.

౨౨. ద్వావింశోఽనువాకః

అవ. శివదేవతాసంబంధ మగు మంత్రము చెప్పఁబడు చున్నది:—

మం. ౨౧. నమో హిరణ్యబాహవే హిరణ్యవర్ణాయ హిరణ్య రూపాయ హిరణ్యపతయే ఽమ్బికాపతయ ఉమా పతయే పశుపతయే నమోనమః ॥౪౦॥ ౨౨।

టీక. హిరణ్యబాహవే = సువర్ణమయమయిన బాహువులు మున్నగు సకలావయవములు గలవాఁడును, హిరణ్యవర్ణాయ = బంగారమువలె దుర్లభములగు వేదాక్షరములు గలవాఁడును, హిరణ్యరూపాయ = తేజోరూపుఁడును, హిరణ్యపతయే = నవనిధులకు అధిపతి యయినవాఁడును, అంబికా పతయే = పార్వతీపతియును, ఉమాపతయే=ఉమాపతియు నగు పరమేశ్వరునకు, నమః=నమస్కారము, పశుపతయే = ఆబ్రహ్మస్తంబపర్యంతభూతములకు నాయకుఁడగు ఈశ్వరునకు, నమఃనమః = నమస్కారము, నమస్కారము.

తా. పశుపతి శబ్దవాచ్యుఁడగు శివునకునమస్కారము, పశుపతియనఁగా బ్రహ్మ మొదలుకొని పూరిపుడకవఱకుఁ గల ప్రాణులందఱు పశువులు, అట్టి పశువులకు నాయకుఁడగువాఁడు పశుపతి, పశువులనఁగా బ్రహ్మాదిస్తంబ పర్యంతములయిన ప్రాణులు అనుటకు ప్రమాణము:—

శ్లో. బ్రహ్మాద్యాః స్తంబపర్యంతాః పశవః పరికీర్తితాః,
తేషాం హి నాయకో యస్మా చ్ఛివః పశుపతి స్స్మృతః.

ఆశివుఁ డెట్టివాఁడనఁగా ఉమాపతి, ఉమ యనఁగా పార్వతి, పార్వతికి "ఉమ" యను శబ్ద మెందులకువచ్చిన దను విషయమును గుఱించి కాళిదాసకవివర్యుఁ డిట్లు వచించెను:—

శ్లో. ఉమేతి మాత్రా తపసో నిషిద్ధా
పశ్చా దుమాఖ్యాం సుముఖీ జగామ.

పార్వతి ఈశ్వరుని వరునిగాఁ బడయవలయునను తలంపుకలిగి అందులకు ఉపాయాంతరములేక తపస్సును చేయవలయునని నిశ్చయించుకొనిన పిదప తల్లి 'ఉ+మా' అని పలికెను, [అనగా ఉ=ఓ అమ్మాయీ! మా= (తపస్సు)వలదు, అని యర్థము,] కావున ఉమయనుపేరు నాటినుండి పార్వతికి ప్రసిద్ధికివచ్చెను, అంబికాపతి యన్నను అంతియే, ఆ పరమేశ్వరుడు మఱియు హిరణ్యబాహువు అనఁగా బంగారువలె ఉన్నబాహువులు గలవాఁడు, (ఇచట బాహువు లుపలక్షణము బంగారువంటి సకలావయవములు గలవాఁడనిభావము. మఱియు హిరణ్యవర్ణుఁడు, హిరణ్యవర్ణుఁ డనఁగా బంగారమువలె దుర్లభము లగువర్ణములు గలవి వేదములు, అట్టి వర్ణములు గల వేదములు ఎవనివల్లనుండి పుట్టుచున్నవో అతఁడు హిరణ్యవర్ణుఁడు, దరిద్రులగు వారలకు బంగారము ఏవిధముగా దుర్లభమయి యుండునో అదేవిధముగా ప్రాణులకు గురుకులవాసాది బహువిధక్లేశముల సహించినఁ గాని వేదములు పొందుటకు శక్యములుకావు కావున "హిరణ్యమువలె దుర్లభములు వేదాక్షరములు" అని ఇచట చెప్పఁబడినది, హిరణ్యరూపుఁ డనఁగా తేజోమయుఁడు, హిరణ్యపతి యనఁగా నవనిధులకు అధిపతి యని యర్థము, హిరణ్యము కేవల ధనవాచి యయినను ఉపలక్షణముచేత నవనిధులని ఇచట గ్రహించదమైనది, అంత్యమునందు "నమో నమః" అని రెండుపర్యాయములు చెప్పియున్నారు, దేనివలన ప్రతివిశేషణమును చెప్పి 'నమః' అని వాక్యమును పూర్తిగా చెప్పినను చెప్పవచ్చును. ఎట్లనఁగా:—

'హిరణ్యబాహవేనమః, హిరణ్యవర్ణాయనమః, హిరణ్యరూపాయ నమః, హిరణ్యపతయేనమః, అంబికాపతయేనమః, ఉమాపతయేనమః, పశు పతయేనమః' అని ప్రత్యేకముగానైనను సరియే.

---

౨౩. త్రయోవింశోఽనువాకః

అవ. ఉపాస్య దేవతానమస్కారమంత్రము చెప్పఁబడు చున్నది:—

మం. ౨౨. ఋతగ్ం సత్యం పరం బ్రహ్మ
పురుషం కృష్ణపింగలమ్ ।
ఊర్ధ్వరేతం విరూపాక్షం
విశ్వరూపాయ వై నమోనమః ॥౮౧॥ ౨౩॥

టీక. పరం = శ్రేష్ఠమగు బ్రహ్మము, ఋతం సత్యం = హిరణ్యగర్భ రూపమగు వ్యావహారిక బ్రహ్మముగాక పారిమార్థికసత్యము, (అట్టి) బ్రహ్మ = బ్రహ్మము, (భక్తానుగ్రహార్థము) కృష్ణపింగళం = కృష్ణపింగలాకారమగు, పురుషం = పురుషరూపము (గలది అగుచున్నది), ఊర్ధ్వరేతం = ఊర్ధ్వరేతస్కుఁ డును, విరూపాక్షం = మూఁడునేత్రములు కలిగియుండుటచేత విరూపాక్షుఁ డును అగు పరమేశ్వరుని (భావించి), విశ్వరూపాయ = సర్వజగదాత్మకుఁడగు ఆపురుషునికొఱకు, నమోనమః=నమస్కారము.

తా. ఈబ్రహ్మము శ్రేష్ఠమయినది, మఱియు మిక్కిలి సత్యమైనది యనియు అర్థము, బ్రహ్మము వ్యావహారికమునందు హిరణ్యగర్భాఖ్యతో

గలదు కావున తద్విలక్షణార్థము ఋతం 'సత్యం' అని చెప్పఁబడినది, హిరణ్యగర్భాఖ్య మగు వ్యావహారికబ్రహ్మము కాదనిభావము, అట్టి పరబ్రహ్మము భక్తులయం దనుగ్రహబుద్ధితో ఉమామహేశ్వరాత్మక మగు స్త్రీపురుష రూపము గలది యగుచున్నది, ఆరూపము కృష్ణపింగలవర్ణము కలిగి యుండును; మహేశ్వరసంబంధ మగు దక్షిణభాగమునందు కృష్ణవర్ణమున్ను, ఉమా సంబంధమగు వామభాగమునందు పింగలవర్ణమున్ను గలదని భావము, యోగబలముచేత ఊర్ధ్వభాగమగు బ్రహ్మరంధ్రమునందు తన రేతస్సును చేర్చుకొన్నవాఁడు ఊర్ధ్వరేతుఁడు, మూఁడునేత్రములు కలగియుండుటచేత విరూపమయిన అనఁగా విలక్షణమయిన నేత్రములు గలవాఁడు కావున విరూపాక్షుఁడనంబడుచున్నవాఁ డనుట, జగత్తున కంతయు కారణ మగుటచేత జగదాత్మకుఁడగు పురుషునికొఱకు నా నమస్కార మగుఁ గాక. "నమోనమః" అని రెండుపర్యాయములు నమశ్శబ్దమునుచెప్పుట ఆదరార్థమని గ్రహింపవలయును.

---

౨౪. చతుర్వింశోఽనువాకః

ఆవ. రుద్రదేవతాక మగుమంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. సర్వో వై రుద్ర స్తస్మై రుద్రాయ నమో అస్తు।
పురుషో వై రుద్రస్సన్మహో నమోనమః।
విశ్వం భూతం భువనం చిత్రం

బహుధా జాతం జాయమానం చ యత్ ।
సర్వో హ్యేష రుద్రస్తస్మై రుద్రాయ నమో అస్తు ॥
౪౨॥౨౪॥

టీక. రుద్రః=రుద్రుఁడే, సర్వః వై=సమస్తము అయియున్నాఁడు గదా, తస్మై=అట్టి, రుద్రాయ=రుద్రునికొఱకు, నమః=నమస్కారము, అస్తు= అగుఁగాక, పురుషః = పురుషుఁడే, రుద్రః వై=రుద్రుఁడేగదా, సన్మహః = సద్రూపమైనతేజము (అట్టి రుద్రునికొఱకు), నమఃనమః = మాటిమాటికి నమస్కారము (యత్ = ఏజడాత్మకమగు,) విశ్వం = విశ్వము, అస్తి=కలదో, (యత్=ఏయ్యది) భూతం=చేతనమగు ప్రాణిజాతముగలదో, ఇటుల చేతనాచేతనరూపమున, చిత్రం=విచిత్రమయిన, భువనం = జగత్తున్నూ, బహుధా = అనేకవిధములుగా, జాతం=ఉత్పన్నమయినట్టియు, జాయమానంచ = జనింపఁబోవునట్టియు, సర్వః=సమస్తము, ఏష రుద్రః హి = ఈరుద్రుఁడే గదా, తస్మై=అట్టి, రుద్రాయ=రుద్రునికొఱకు, నమః నమస్కారము,

తా. పార్వతీపతి యగు ఏరుద్రుఁడు పురాణాదులందు సుప్రసిద్ధముగా వర్ణింపఁబడియున్నాఁడో, ఆరుద్రుఁడు జీవరూపమున సకలప్రాణుల శరీరములందు ప్రవేశించియున్నవాఁడు కావున అట్టి సర్వాత్మకుఁడగు రుద్రునకు నమస్కారము, ప్రకృతిపురుషులలోపల జడాత్మక మగుప్రకృతిని వదలిన చిదాత్మకుఁ డగు ఏపురుషుఁడు గలఁడో ఆపురుషుఁడే భక్తానుగ్రహార్థము రుద్రమూర్తిస్వరూపుఁడై ప్రకాశించుచున్నాఁడు, కావున "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్" అను శ్రుతియందు ఏసద్రూపమగు తేజస్సు ప్రతిపాదింపఁబడి యున్నదో అట్టి సద్రూపుఁ డగు రుద్రునకు మాటిమాటికి మానమస్కారమగుఁగాక, మఱియు జడాత్మకమైనట్టియు, చేతనాత్మక మగునట్టియు ఏ భూతజాతము గలదో, చేతనాచేతనరూపములతో పలువిధములుగా విచిత్ర

ముగా నేప్రపంచము గలదో, మఱియు ఇదివఱకు ఉత్పన్నమయినట్టియు, ఇఁకమీద పుట్టఁబోవు నట్టియు, ఈసమస్తమయిన ప్రపంచము ఈరుద్రుఁడే గదా, ఈరుద్రునకంటె. వ్యతిరేకముగా వాస్తవమయిన జగత్తును నిరూపించుటకు శక్యముకాదు గదా, అట్టి సర్వాత్మకుఁ డగు రుద్రునకు నమస్కారము.

---

౨౫. పంచవింశోఽనువాకః

మం. కద్రుద్రాయ ప్రచేతసే మీఢుష్టమాయ తవ్యసే।
వోచేమ శన్తమగ్ం హృదే।
సర్వో హ్యేష రుద్రస్తస్మై రుద్రాయ నమో అస్తు
౪౩౭౫॥

టీక. ప్రచేతసే = శ్రేష్ఠమయినజ్ఞానము కలిగినట్టివాఁడును, మీఢుష్టమాయ=భక్తులకు అభీష్టముల నొసంగునట్టివాఁడును, తవ్యసే=కొనియాడఁదగినవాఁడును, హృదే = హృదయాంతర్వర్తి యగుటచేత హృద్రూపుఁడును అగు, కద్రూపాయ = శ్రేష్ఠుఁడగు రుద్రునికొఱకు, శంతమం = సుఖకరమగు స్తుతిరూపవాక్యమును, వోచేమ = చెప్పుచున్నారము, సర్వః=ఈసమస్తము, ఏష రుద్రః = ఈరుద్రుఁడే, తస్మై=అట్టి, రుద్రాయ = రుద్రునికొఱకు, నమః= నమస్కారము, అస్తు=అగుఁగాక.

తా. “కత్థ ప్రశంసాయాం” అను ధాతువునుండి పుట్టిన 'కత్' శబ్దము ప్రశంసావాచి, కావున కద్రుద్రుఁ డనఁగా ప్రశస్తమయిన రుద్రుఁడని యర్థము, అట్టి రుద్రునకు నమస్కార మగుఁగాక, ఆ రుద్రుఁ డెట్టి

వాఁడనఁగా ప్రకృష్టమయిన జ్ఞానము గలవాఁడు, మఱియు (భక్తులగువారలకు) అభిలషితార్థముల నెడతెగకుండ కురిపించు చుండువాఁడు, మఱియు అందఱిచేత కొనియాడఁదగినవాఁడు, మఱియు హృదయాంతర్వర్తి కావున హృద్రూపుఁడు, ఇట్టి రుద్రునికొఱకు మిక్కిలి సుఖమును కలుగఁజేసెడి స్తుతిరూపమయిన వాక్యమును పలికెదము, అనఁగా రుద్రుని స్తుతించెదము, ఈ కనంబడు ప్రపంచమంతయు ఈ రుద్రుఁడే కావున అట్టి రుద్రుని కొఱకు నమస్కార మగుఁగాక.

---

౨౬. షడ్వింశోఽనువాకః

అవ. అగ్నిహోత్రకర్మయందు హోమము చేయవలసిన అగ్నిహోత్రహవణి యను సాధనమును ఏవృక్షము యొక్క కొయ్యతో చేయవలయునో ఆవిషయము చెప్పఁబడు చున్నది:——

మం. యస్య వైకఙ్కత్యగ్నిహోత్రహవణీ భవతి ప్రత్యే
వాస్యాఽఽహుతయస్తిష్ఠన్త్యథో ప్రతిష్ఠిత్యై॥

॥౪౪॥౨౬॥

టీక. యస్య = ఏ అగ్నిహోత్రియొక్క, అగ్నిహోత్రహవణీ=అగ్నిహోత్రహవణి, వైకంకతీ = వికంకతవృక్ష సంబంధమయినది, భవతి=అగుచున్నదో, అస్య = అట్టి యీయగ్నిహోత్రియొక్క, ఆహుతయః = (వికంకతవృక్షముయొక్క కొయ్యచేతఁజేయఁబడిన) ఆ యగ్నిహోత్రహవణిచేత ఇవ్వఁబడిన ఆహుతులు, ప్రతి+తిష్ఠంతి+ఏవ=ఫలప్రదములు అగుచున్నవి, అథో=మఱియు, ప్రతిష్ఠిత్యై=ప్రతిష్ఠకొఱకును (అగుచున్నవి).

తా. దేవతలకు ఇచ్చునట్టి హవిస్సును ఏసాధనముచేత అగ్నియందు వ్రేల్చెదరో ఆ సాధనమునకు అగ్నిహోత్రహవణి యని పేరు, అట్టి అగ్నిహోత్రహవణిని వికంకతవృక్షపు కొయ్యతోఁ జేయించి ఏయగ్నిహోత్రి ఆ యగ్నిహోత్రహవణితో దేవతలకు హవిస్సు నొసంగునో అతఁడు దేవతల నుద్దేశించి ఇచ్చిన ఆహుతులన్నియు ఫలప్రదములగును, మఱియు అనుష్ఠాత యగు వానికి చిత్తశుద్ధి కలిగి తద్ద్వారా తత్త్వజ్ఞానప్రతిష్ఠయు కలుగును.

ముముక్షు వగు వానికి వేదోక్తములగు సకలకర్మలు చిత్తశుద్ధిని కలుగఁ జేయుచు మోక్షమునకు సాధనభూతము లగునను విషయమును చెప్పఁదలఁచి తదుపలక్షణముగ కర్మాంగభూతమగు వికంకతవృక్షనిర్మిత అగ్నిహోత్ర హవణీ ప్రశంస ఇందు చెప్పఁబడిన దని గ్రహింపవలయును.

వికంకతవృక్ష మనఁగా పుల్లవెలగ చెట్టు.

౨౭. సప్తవింశోఽనువాకః

అవ. ఈ మోక్షప్రకరణమంత్రములందు చిత్తశుద్ధికి హేతుభూతము లగుకర్మల యుపయోగమును సంగ్రహముగ వచించి పిదప ప్రతిబంధనివారకరూపము లగు రక్షోఘ్నమంత్రముల నిచట సూచించుచున్నాఁడు:—

మం. కృణుష్వ పాజ ఇతి పఞ్చ ॥౪౫॥౨౭।

టీక. కృణుష్వపాజః ఇతి = కృణుష్వపాజః అను అనువాకమునందు గల, పంచ = అయిదు మంత్రములు, ఇచట చెప్పవలయును.

తా. "కృణుష్వపాజః" అను ఋక్కు మొదలుగాఁగల ౫ మంత్రములు తైత్తిరీయసంహిత ప్రథమకాండ ద్వితీయప్రశ్నయందు గలవు, ఆ ౫ దు మంత్రముల నిచట పఠింపవలయును, (అర్థనిర్ణయమును సులభముగ గ్రహించుటకుఁ గాను టీకా తాత్పర్యములతోడ ఆ మంత్రముల నిట వ్రాయుచున్నాఁడను.)

మం. ౧. కృణుష్వ పాజః ప్రసితిం న పృథ్వీం
యాహి రాజేవా మవాగ్ం ఇభేన ।
తృష్వీ మను ప్రసితిం ద్రూణానో
ఽస్తాఽసి విధ్య రక్షస స్తపిష్ఠైః ।

టీక. ఓయగ్ని ! మదీయమగు కామక్రోధాదిశత్రుసంహారార్థము, పృథ్వీం = విస్తీర్ణమయిన, ప్రసితిం న=జాలమువలె, పాజః = బలమును కృణుష్వ = (మాకు) కలుగఁజేయుము, రాజేవ = రాజువలె, అమవాన్ = సేవకులుగలవాఁడవై, ఇభేన = గజతురగాది చతురంగబలసమన్వితుఁడవై, యాహి = శత్రుసంహారార్థము పొమ్ము, తృష్వీం = శీఘ్రముగ సంహార సాధనమగు, ప్రసితిం = జాలముచేత, అనుద్రూణానః = పలాయనకాలము నందు శత్రువులను హింసించుచున్నవాఁడవై, అస్తా = బాణముల వేయు వాఁడవు, అసి=అయితివి, తపిష్ఠైః = మిక్కిలి సంతాపహేతువు లగు ఆయుధ ములచేత, రక్షసః = రాక్షసులను, విధ్య = తాడన మొనర్పుము.

తా. ఓయగ్ని ! నాసంబంధ మగు కామక్రోధాది శత్రువులను సంహరించుటకు సమర్థ మగు బలమును నాకుఁ గలుగఁజేయుము. అందులకు దృష్టాంత మెట్లనఁగా "సీయంతే బధ్యంతే పక్షిణః యయా సా సితిః. ప్రకర్షేణ సితిః ప్రసితిః" ఇ షిఞ్ బంధనే అను ధాతువు వల్లనుండి సితి

యను శబ్దము పుట్టినది. దేనిచేత పక్షులు మున్నగునవి బాధింపఁబడునో అయ్యది సితి, అందులో మిక్కిలి సమర్థమయినది ప్రసితి, అనఁగా పక్షులు మున్నగువానిని బంధించునిమిత్తమై ఏర్పఱచునట్టి సాధనము, ఇదియే వలయని చెప్పఁబడును, పక్షులను భుజించువారలగు నిషాదులు పక్షులను బాధించుటకు విస్తీర్ణమయిన వలను ఏవిధముగా భూమియందు పఱచియుందురో అట్లే కామక్రోధాది అంతరంగశత్రువులను బహిరంగశత్రువులను సంహరింపఁ జాలునంతటి బలమును కలుగఁజేయుము, అమావాన్ అనఁగా సహాయము గలవాఁడని యర్థము, ఆశబ్దముయొక్క వ్యుత్పత్తి ఇది.

"అమన్తి భజన్తిస్వామిన మిత్యమాః సేవకాః తద్వాన్ అమావాన్." స్వామిని సేవించుచుండువారు కావున అము లనఁగా సేవకు లగుచున్నారు అములు గలవాఁడు 'అమావాన్' అగును, సేవకులుగలవాఁడని యర్థము, ఓయగ్నీ ! రాజు ఏవిధముగా చతురంగ సేనాపరివృతుఁడై శత్రువులను సంహరించు నిమిత్తము బయలు వెడలునో అట్లే నీవున్నూ మాశత్రువులను సంహరించుటకు బయలువెడలుము, మఱియు శీఘ్రముగా చంపుటకు సాధనమగు వలచేత శత్రువులను సంహారకాలమునందు హింసించుచున్నవాఁడవై బాణములను వదలువాఁడవు అయితివి, కావున రాక్షసులను మిక్కిలి సంతాపమును కలుగఁజేయునట్టి ఆయుధములతో కొట్టుము.

ఈమంత్రమునందుగల 'ద్రూణానః' అనుపదము 'ద్రుహింసాయాం' అనుధాతువు వల్లనుండి పుట్టినది, అస్తా అనుపదము "అసుక్షేపే" అను ధాతువు వల్లనుండి పుట్టినది, తృష్వీం, ప్రసితిం, అనుశబ్దములకు తృతీయా విభక్త్యర్థ మీమంత్రమునందు గ్రహింపఁబడినది, ఈమంత్రమునందుగల అగ్నిప్రార్థనమునకు ఫలము బాహ్యాభ్యంతర శత్రునిగ్రహమని గ్రహించునది.

మం ౨. తవ భ్రమాస ఆశు యా పతం
త్యనుస్పృశ ధృషతా శోశుచానః।
తపూగ్ంష్యగ్నే జుహ్వా పతంగా
నసందితో విసృజ విష్వ గుల్కాః।

టీక. అగ్నే=ఓయగ్నీ! భ్రమాసః=ప్రాణులను పీడించుటకయి అంతట చరించుచున్నట్టియు, ఆశుయా=రాత్రింబగళ్లు సంచరించుచున్నట్టియు, ఏపిశాచములు, పతంతి=ఇటు అటు తిరుగుచున్నవో, అట్టి, పతంగాన్=పతనశీలములగు ఆపిశాచములను, తపూంషి=ప్రపంచమును తరింపఁజేయునట్టి రాక్షసులను, ధృషతా=ప్రగల్భమయిన నీతేజస్సుచేత, అనుస్పృశ=దహింపుము, శోశుచానః=లేక అంతర్బహిశ్శత్రువులను మిక్కుటముగ దుఃఖింపజేయుచు, జుహ్వా=జుహువుచేత (హోమము చేయఁబడెడి హవిస్సుగలవాఁడవై), అసందితః=రాక్షసులచేత ఖండింపఁబడనివాఁడవై, విష్వక్=మాటిమాటికి, ఉల్కాః=అగ్నిజ్వాలలను, విసృజ=ప్రసరింపఁజేయుము.

తా. ఓయగ్నీ! దేశమంతయు తిరుగుచు ప్రాణులకు పీడించుటయే స్వభావముగాఁ గలిగి రాత్రింబగళ్లు పిశాచములు ఇటు అటు తిరుగుచున్నవి, అట్టిపిశాచములను, ప్రపంచము తపింపఁజేయుటయే స్వభావముగాఁ గల రాక్షసులను, ప్రగల్భమయిన నీతేజస్సుచేత దహించుము, మఱియు అంతర్బహిశ్శత్రువులను మిక్కిలి దుఃఖింపఁజేయుచు, స్రుక్కుచేత హుతమొనర్పఁబడుచున్న ఘృతపురోడాశాది రూపమగు హవిస్సును స్వీకరించుచుండుటచేత ప్రకాశించుచున్నవాఁడవై రాక్షసులకు ఖండింపఁబడనివాఁడవైన ఇట్టి నీవు శత్రువులకు నలువైపుల అనఁగా అంతట అగ్ని జ్వాలలను ప్రసరింపఁజేయుమని తాత్పర్యము.

మం. 3. ప్రతి స్పశో విసృజ తూర్ణితమో
భవా పాయు ర్విశో అస్యా అదబ్ధః ।
యో నో దూరే అఘశగ్ంసో
యో అంత్యగ్నే మా కి ష్టే వ్యథి రా దధర్షీత్

టీక. అగ్నే=ఓయగ్నీ! తూర్ణితమః=అతిక్షిప్రగాముఁడ వగు నీవు, స్పశః = పాశములను, ప్రతి = శత్రువులనుగూర్చి, విసృజ = వదలుము, అస్యాః=ఈమాయొక్క, విశః=పుత్రపౌత్రాది సంతానమునకు, పాయుః = రక్షకుఁడవు, భవ=కమ్ము, యః=ఎవ్వఁడు, నః=మాకు, దూరే=దూరమునందును, అంతి = సమీపమునందును, అఘశగ్ంసః = పాపమును చేయ నిచ్ఛగించు వాఁడు గలడో, (వానినిన్ని పోఁగొట్టుము,) అదబ్ధః = నేను శత్రువులచేత హింసింపఁబడనివాఁడను అయ్యెదనుగాక, వ్యథిః = వ్యథనుకలుగఁజేయునట్టి రాక్షసుఁడు, కిః=ఎవ్వఁడున్ను, మా+అ+దధర్షీత్ = సమర్థమయినవాఁడు కాకపోవుఁగాక.

భగవంతుఁడ వగు నోయగ్నీ! మిక్కిలి చురుకుతనము గలనీవు మమ్ములను బాధించునట్టి శత్రువులను గూర్చి పాశములను వదలుము, అనఁగా వారిని పాశములచేత బంధించి మాసమీపమునకు పొందింపుము, 'స్పశ బాధనే' ధాతువువల్లనుండి ఈశకారాన్త మగు స్పశశబ్దముపుట్టినది, మాసంబంధ మగు పుత్రాదిప్రజలను సంరక్షించువాఁడవు కమ్ము, మాయొక్క సమీపము నందుండి గాని లేకదూరమునందుండిగాని ఎవ్వఁడు మాకు చెరుపును చేయ నిచ్ఛగించునో వానినికూడ తొలగింపుము, నేను శత్రువులచేత హింసింపఁ బడఁజాలనివాఁడనయ్యెదనుగాక, పీడను కలుగఁజేయునట్టి రాక్షసుఁ డెవ్వఁ

దైనను నీయెదుట సమర్థుఁడయినవాఁడు కాఁజాలఁడు, అగ్నిదర్శనము రాక్షస పిశాచపలాయనహేతువని నీతిశాస్త్రమునందు గలదు:—

శ్లో. దివా సూర్యప్రతాపేన రాత్రౌ వహ్నిప్రతాపతః,
పిశాచరాక్షసాదీనాం దూరత స్తు పలాయనమ్.
తస్మా ద్రాత్రౌ మనుష్యాణాం వనే మార్గే గృహేఽపి వా,
వహ్నిసేవనమాహాత్మ్యా త్పిశాచాదిపలాయనమ్.

అర్థ. పగలు సూర్యప్రతాపముచేతను అనఁగా కాంతిచేతను, రాత్రిఁ దీప కాంతిచేతను పిశాచరాక్షసాదికము దూరముగా పలాయనమై పోవును, కావున రాత్రియందు మనుష్యులు వనమునందు మార్గమునందు గృహమునందు మఱి యెచ్చటనైనను అగ్నిని సేవించుటవలన పిశాచములు రాక్షసులు మున్నగువారలు వారిదరిని జేరఁ జాలరని తాత్పర్యము.

అఘం శంసతీతి అఘశంసః, 'శాసిఇచ్ఛాయాం' అను ధాతువునుండి పుట్టినది, 'అ+దధర్షిత్=దమ్భుహింసాయాం' అను ధాతువునుండి పుట్టినది.

'కిః' యను పదము 'కోఽపి' అను అర్థమునందు ప్రయోగింపఁబడినది, ఈ ప్రయోగము ఛాందసము.

మం. ౪. ఉ దగ్నే తిష్ఠ ప్ర త్యా తనుష్వ
న్యమిత్రాగ్ం ఓషతా త్తిగ్మహేతే,
యో నో అరాతిగ్ం సమిధాన చక్రే
నీచా తం ధక్ష్యతసం న శుష్కమ్।

టీక. అగ్నే=ఓయగ్నీ! ఉత్ తిష్ఠ = మమ్ములను అనుగ్రహించుటకు లెమ్ము, ప్రతి = మమ్ములనుగూర్చి, ఆ+తనుష్వ = దయను చేయుము, అమిత్రాన్=శత్రువులను, ని ఓషతాత్=మిక్కిలి భస్మీభూతులనుగాచేయుము,

తిగ్మహేతే = తీక్ష్ణమైన ఆయుధములుగలట్టియు, సమిధాన = ప్రజ్వ లించుచున్న ఓయగ్నీ! యః = ఎవ్వఁడు, నః=మాకు, అరాతిం = శత్రుత్వ మును, చక్రే=చేసెనో, తం=వానిని, శుష్కం అతసం న=ఎండినవృక్షమువ వలె, సంధక్షి = దహింపుము, (మఱియు) నీచా=నరకమార్గమును (పొందిం పుము).

తా. ఓయగ్నీ! మమ్ములను అనుగ్రహించుటకుఁగాను లెమ్ము, మా యందు దయగలవాఁడవు కమ్ము, మాయొక్క కామాద్యంతశ్శత్రుజాల మును బాగుగ కాల్చివేయుము, తీక్ష్ణములగు ఆయుధములు గలిగి దేదీప్య మానుఁడవై వెలింగెడి ఓయగ్నీ! మాకు శత్రుత్వము నెవ్వఁడు చేయఁదలఁ చునో అట్టివానిని ఎండినపొద చెట్టు మున్నగువానినివలె దహింపుము, మఱియు అట్టివారిని నరకమును పొందింపుము, లేక సమిధాన శబ్దమును ప్రత్యేకముగా గ్రహించి దేదీప్యమానుఁడవై వెలింగెడి ఓయగ్నీ! మాసం బంధమయిన ఈ కార్యజాతమునంతయు సాధింపుమనియును తాత్పర్యమును చెప్పవచ్చును.

మం. ౫. ఊర్ధ్వో భవ ప్రతి విధ్యాధ్యస్మ
ద్దావిష్కృణుష్వ దైవ్యాన్యగ్నే।
అవ స్థిరా తనుహి యాతుజూనాం
జామి మజామిం ప్రమృణీహి శత్రూన్।

టీక. అగ్నే = భగవంతుఁడవగు నోయగ్నీ! అధి అస్మత్ = మా యొక్క (కామాది శత్రుసంఘమును), ప్రతి+విధ్య=తాడన మొనర్పుము, దైవ్యాని = దేవతాసంబంధములగు సత్కర్మలను లేక సదుపాసనములను, ఆవిః+కృణుష్వ = ఆవిష్కరింపఁజేయుము, (అనఁగా కలుగఁజేయుము.)

ఊర్ధ్వః = ఊర్ధ్వలోకప్రదుఁడవు, భవ=కమ్ము, యాతుజానాం = రాక్షసులయొక్క, స్థిరా=స్థిరములగు ధనుస్సులను, అవ+తనుహి=దింపిన నారిత్రాడు గలవానినిగాఁ జేయుము, జామిం = ఆలస్యమును (విడిచి), ప్రమృణీహి = నాశన మొనర్పుము, అజామిం = ఆలస్యములేకుండా, శత్రూన్ = శత్రువులను, ప్ర+మృణీహి హింసింపుము.

తా. భగవంతుఁడవగు నోయగ్నీ! మాయొక్క కామక్రోధాద్యాంతరంగ శత్రువులను మిక్కిలి తాడన మొనర్పుము, అటుల కామక్రోధాది దోషములను పోఁగొట్టి దేవతాసంబంధము లగు సత్కర్మలను సదుపాసనములను ఆవిష్కరింపఁ జేయుము, పుణ్యలోకనిరోధులగు రాక్షసులయొక్క స్థిరములయిన ధనుస్సులను దింపఁబడిన నారిత్రాడు గలవానినిగా నొనర్పుము, (అనఁగా వారివలన మాకెట్టి బాధయు కలుగకుండా చేయుము అని భావము) ఆలస్యమును వదలి శీఘ్రముగా జగత్సంహారోద్యుక్తులగు శత్రువులను నాశన మొనర్పుము అని తాత్పర్యము.

౧. 'అస్మత్' అనుపదమును 'అస్మాకం' అను అర్థమునందు ప్రయోగించుట ఛాందసము.

౨. ప్రమృణీహి = అనుపదము 'మృఙ్హింసాయాం' అను ధాతువు నుండి పుట్టినది.

ఈ ౫ దు మంత్రములయొక్క భావమేమనఁగా:—భగవంతుఁడవగు నోయగ్నీ! ఓత్రైలోక్యనాయకా! మాసంబంధమగు అంతర్బహిశ్శత్రుసంఘమును నిర్మూలమొనర్చి మమ్ములను మంచిపనులందు ప్రవర్తింపఁజేసి మాయంతఃకరణమును నిర్మలముగా నొనర్చి నూరుసంవత్సరములు పుత్రపౌత్ర పారంపర్యక్రమముగా మాకు అన్నపానముల నొసంగి మరణానంతరము సకుటుంబముగ మాకు ముక్తి నొసంగు మని తాత్పర్యము.

౨౮. అష్టావింశో ఽనువాకః.

అవ. జీవనహేతు వగు క్షేత్రలాభము మున్నగు వానిని కలుగఁజేసి క్రమముగ ముక్తినొసంగు పృథివీ దేవతయొక్క మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. అదితి ర్దేవా గన్ధర్వా మనుష్యాః పితరో ఽసురా స్తేషాగ్ం సర్వభూతానాం మాతా మేదినీ మహతా మహీ సావిత్రీ గాయత్రీ జగత్యుర్వీ పృథ్వీ బహులా విశ్వా భూతా కతమా కా యా సా సత్యేత్యమృతేతి వసిష్ఠః ॥ ౭౮॥ ౨౮॥

టీక. అదితిః = భూమియే, దేవాః=దేవతలు, గంధర్వాః = గంధర్వులు, మనుష్యాః = మనుష్యులు, పితరః=పితరులు, అసురాః=అసురులు తేషాం=ఆ, సర్వభూతానాం=సకలభూతములకు (ఈయదితియే), మాతా= జనని, (మఱియు) మేదినీ=మధుకైటభుల మేదస్సుచేత పుట్టినది, మహతా= గుణాధిక్యతచేత, (గొప్పది), మహీ = పూజనీయ, సావిత్రీ = ప్రేరకుఁడగు అంతర్యామి సంబంధము గలది, గాయత్రీ = తన్నుపాసించువారలను రక్షించునది, జగతీ = జగదాశ్రయభూతమైనది, ఉర్వీ = సకలధాన్య పరిపూర్ణ, పృథ్వీ = అతివిస్తారము గలది, బహులా = నిబిడీకృతమయిన దేహముగలది, విశ్వా = సర్వాత్మకమైనది, భూతా = ప్రాణిదేహోత్పత్తి కంటె ముందు ఉత్పన్నమై యుండునది, కతమా=అతిశయ సుఖస్వరూపమైనది, కాయా = సర్వప్రాణిదేహరూపమున పరిణతమైనది, సా=ప్రసిద్ధిగలది,

సత్యా = వ్యవహారదశయందు బాధలేనిది, అమృతా = నాల్గుయుగములు చుట్టివచ్చినను నాశనము లేనిది, ఇతి=ఈవిధముగా, వసిష్ఠః=వసిష్ఠమహర్షి (పలికెను).

తా. అదితి యనఁగా అఖండిత యని వ్యుత్పత్తి కావున ఈశబ్దము భూవాచకము, కావుననే వేదనిఘంటువునందు ఈపదము భూపర్యాయ పదములలో పఠింపఁబడినది. దేవతలు, గంధర్వులు, మనుష్యులు, పితరులు, అసురులు, వీరు జాతివిశేషములు, ఈ ఐదుగురు ఉపలక్షణము, సర్వప్రాణి సమూహమునకు ఈభూమి తల్లియగుచున్నది, దేహమునకు ఉపాదానకారణభూతమయినదని భావము, మఱియు ఈభూమి మధుకైటభ రాక్షసుల మేదస్సుచేత నిర్మింపఁబడినది. గుణాధిక్యత గలది, అనఁగా సర్వప్రాణులు చేయునట్టి ఉపద్రవముల నన్నింటిని సహించి యున్నది కావున గుణాధిక్యత గలదనుట యుక్తమే, మఱియు పూజింపఁదగినది, మఱియు ప్రేరకుఁడగు అంతర్యామియొక్క సంబంధముగలది, తన్నుపాసించువారలను రక్షించునది, జగదాశ్రయభూతమైనది, అనేకవిధధాన్యములచేత శోభితయై యుండునది, అతివిస్తారముగలది, అంతట నిండఁబడియున్న అవయవములు గలది, సర్వాత్మకమైనది, ప్రాణులుపుట్టుటకంటె ముందే ఉన్నదియు, అతిశయ సుఖరూపయు, సర్వప్రాణిదేహరూపముగ పరిణమించినదనియు, సుప్రసిద్ధమైన దనియు, వ్యవహారదశయందు బాధలేనిదనియు అని వసిష్ఠమహర్షి వచించెను, మఱియు నాల్గుయుగములు గడచినను నాశనము లేక యున్నది కావున అమృత మనియును ఆవసిష్ఠమహర్షియే పలికెను, ఈ మంత్రమునకు వసిష్ఠుఁడు ఋషి.

౨౯. ఏకోనత్రింశో ఽనువాకః

అవ. వర్షాభావమువలన కలుగునట్టి పీడను పోఁగొట్టి ఉపకార మొనర్చునట్టి జలదేవతాసంబంధమగు మంత్రమును చెప్పుచున్నాఁడుః—

మం. ఆపో వా ఇదగ్ం సర్వం విశ్వా భూతాన్యాపః ప్రాణా వా ఆపః పశవ ఆపో ఽన్న మాపో ఽమృత మాప స్సమ్రా డాపో విరా డాప స్స్వరా డాపశ్ఛందాగ్ం స్యాపో జ్యోతీగ్ంష్యాపో యజూగ్ంష్యాప స్సత్య మాప స్సర్వా దేవతా ఆపో భూర్భువ స్సువ రాప ఓమ్ ॥ ౪౭॥ ౨౯॥

టీక. ఇదం సర్వం = ఈఁగనంబడునది అంతయు, ఆపః వై=జలమే గదా, విశ్వాభూతాని = శరీరములన్నియు, ఆపః=జలస్వరూపము, ప్రాణాః= ప్రాణములు, ఆపః వై=ఉదకములే గదా, పశవః=పశువులు, ఆపః=జలములే గదా, అన్నం=అన్నము. ఆపః=జలములే గదా, అమృతం = అమృతము, ఆపః=జలములే గదా, సమ్రాట్ = సూత్రాత్మ యగు హిరణ్యగర్భుఁడు, ఆపః=ఉదకములే గదా, విరాట్ = బ్రహ్మాండమే దేహముగాఁ గల పురుషుఁడు, ఆపః=జలములే గదా, స్వరాట్=స్వయముగా ప్రకాశించు ఈశ్వరుఁడు, ఆపః = జలములేగదా, ఛందాంసి = గాయత్ర్యాది ఛందస్సులు, ఆపః=జలములేగదా, జ్యోతీంషి = ఆదిత్యాదిజ్యోతిస్సులు, ఆపః=జలము

లేగదా, యజూంషి = యజుర్మంత్రములు, ఆపః = జలములే గదా, సత్యం = యథార్థకథనము, ఆపః = జలములే గదా, సర్వాదేవతాః = దేవతలందఱు, ఆపః = జలములే గదా, భూః భువః సువః = భూర్భువస్సువరాదిలోకత్రయము, ఆపః = జలములేగదా, (ఆపః = ఉదకములు) ఓం = ప్రణవప్రతిపాద్యములు.

తా. దృగ్గోచరము లగుచున్న స్థావరజంగమాదికములు గల ఈప్రపంచమంతయు జలములే గదా! ఎట్లనఁగా జలము రేతోరూపమయి సమస్త ప్రాణుల దేహమునకు మూలకారణ మగుచున్నది కావున సకలప్రాణిశరీరములు జలములగుచున్నవి, శరీరమునందుండు ప్రాణములుకూడ జలములే, ఉదకముచేత ప్రాణులకు ఆప్యాయనము కలుగుచున్నది కావున ప్రాణములును ఉదకములే అని చెప్పఁబడినవి, ఛాందోగ్యోపనిషత్తునం (౬-౭-౧) దిట్లు గలదు:—

"ఆపోమయః ప్రాణో న పిబతో విచ్ఛేత్స్యతే"

పశువులున్నూ జలములే, అనఁగా అచట జలములు క్షీరరూపమున పరిణతములయియున్నవి, అన్నమనఁగా వడ్లు యవలు గోధుమలు మున్నగునవి జలములే, అనఁగా జలముచేతనే వడ్లు మున్నగునవి ఫలించుచున్నవి గదా, హిరణ్యగర్భుఁడగు సూత్రాత్మయు జలములే, బ్రహ్మాండదేహుఁ డగువిరాట్పురుషుఁడు జలములే, ఇంద్రియాదికము లేక స్వతంత్రముగనే ప్రకాశించునట్టి అవ్యాకృతాభిమానియగు ఈశ్వరుఁడును, గాయత్ర్యాదిఛందస్సులును, ఆదిత్యాది జ్యోతిస్సులును, యజుర్మంత్రములు సత్యము, ఇంద్రాది దేవతలు, భూర్భువస్సువర్లోకములు ఇవన్నియు జలమునకు చేరినవియే, ఈయుదకములు మూలకారణ పరమాత్మ ప్రతిపాదకములు అనితాత్పర్యము.

౩౦. త్రింశోఽనువాకః.

అవ. మాధ్యాహ్నికసంధ్యయందు మంత్రాచమనము చేయవలసినమంత్రము చెప్పఁబడుచున్నది:—

(ఈ అనువాకముమొదలుకొని ౩౬.వ యనువాకము వఱకుఁ గల మంత్రములు సంధ్యావందనమంత్రములు.)

మం. ఆపః పునన్తు పృథివీం పృథివీ పూతా పునాతుమామ్।
పునన్తు బ్రహ్మణస్పతి ర్బ్రహ్మ పూతా పునాతు మామ్।
య దుచ్ఛిష్ట మభోజ్యం యద్వా దుశ్చరితం మమ।
సర్వం పునన్తు మా మాపో ఽసతాం చ ప్రతిగ్రహగ్ం
స్వాహా॥ ౪౮॥ ౩౦॥

టీక. ఆపః = జలములు, పృథివీం = భూమిని, పునన్తు = (ప్రక్షాళనముచేత) పవిత్రమగు దానినిగాచేయుఁగాక, పృథివీ = భూమి, పూతా = పవిత్రమయినదై, మాం=నన్ను, పునాతు = పరిశుద్ధునిగా చేయుఁగాక, (ఈ యుదకములు) బ్రహ్మణః పతిం = వేదమునకు పాలకుఁడగు ఆచార్యుని పునన్తు = పవిత్రునిగాచేయుఁగాక, బ్రహ్మ = ఆచార్యోపదిష్టమగువేదము, పూతా = స్వయముగా పరిశుద్ధమయినదై, మాం=నన్ను, పునాతు=శుద్ధునిగాఁ జేయుఁగాక, యత్ = ఎయ్యది, ఉచ్ఛిష్టం = ఉచ్ఛిష్టమును, అభోజ్యం = అభోజ్యమును అయిన అన్నాదికము (నాచేత భుజింపఁబడినదో,) యద్వా = లేక, మమ = నాయొక్క, దుశ్చరితం = దుశ్చరిత్రముకలదో, సర్వం = ఆసమస్తమయిన దానిని, ఆపః=ఉదకములు (పోఁగొట్టి), మాం=నన్ను, పునన్తు =

పవిత్రునిగా నొనర్చుఁగాక, అసతాం = దుర్మార్గులయొక్క, ప్రతిగ్రహాచ = ప్రతిగ్రహమునున్ను (అనఁగా తద్దోషమునున్ను పోఁగొట్టుఁగాక), స్వాహా = (తన్నిమిత్తము నాముఖాగ్నియందు హుతమయిన ఈ జలరూపాహుతి) సుహుత మగుఁగాక.

తా. జలములు మదీయమగు కిల్బిషసమూహమును పోఁగొట్టిభూమిని పరిశుద్ధముగాఁజేయుఁగాక, ఆభూమియు పరిశుద్ధమయినదై సంధ్యావందనాదిక మనుష్ఠించు నన్ను పరిశుద్ధుని జేయుఁగాక, ఈజలంబులు వేదపాలకుండగు ఆచార్యుని పరిశుద్ధునిగాఁ జేయుఁగాక, పరిశుద్ధుఁడగు నాయాచార్యునిచేత ఉపదేశింపఁబడిన వేదస్వరూపంబును పరబ్రహ్మస్వరూపంబును స్వయంపూతమయి నన్ను పరిశుద్ధునిగాఁజేయుఁగాక, ఎయ్యది ఉచ్ఛిష్టమో (ఉచ్ఛిష్టమనఁగా ఇతరులు భుజింపఁగా మిగిలినది) ఎయ్యది అభోజ్యమో (అభోజ్యమనఁగా లోమములు, క్రిములు మున్నగునవి చేరుటచేత భుజియింప నర్హము కానిది) అట్టిపదార్థములను నేనొకవేళ భుజించియుందును, శాస్త్రప్రతిషిద్ధములగు దురితముల నొనర్చి ఏదురితంబుల సంపాదించితినో అట్టి అస్మదీయము లగు సకలదురితములను పరిహరించి నన్ను పరిశుద్ధునిచేయుఁగాక, అట్లే సత్పురుషులు కాని శూద్రాదులవలన ప్రతిగ్రహము నాచరించి నే నేదురితమును చేసితినో దానినంతయు జలములు పోఁగొట్టుగాక, అట్టి పరిశుద్ధినిమిత్తము అభిమంత్రింపఁబడిన యీజలము మదీయముఖాగ్నియందు సుహుత మగుఁగాక, అని అభిమంత్రితజలమును పానము చేయవలయును.

---

౩౧. ఏకత్రింశోఽనువాకః

అవ. సాయంసంధ్యాకాలమందు మంత్రాచమనమంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. అగ్నిశ్చ మా మన్యుశ్చ మన్యుపతయశ్చ మన్యుకృతే భ్యః । పాపేభ్యో రక్షంతామ్ । యదహ్నా పాప మకార్షమ్ । మనసా వాచా హస్తాభ్యామ్ । పద్భ్యా ముదరేణ శిశ్నా । అహ స్తదవలుమ్పతు । యత్కించ దురితం మయి । ఇద మహం మా మమృతయోనౌ సత్యే జ్యోతిషి జుహోమి స్వాహా ॥ ४ϝ॥ ३०॥

టీక. అగ్నిః చ = అగ్నియును, మన్యుఃచ = కోపము అభిమానముగాఁ గలదేవతయును, మన్యుపతయః చ = కోపమునకు నియామకు లగు దేవత లును, మా=నన్ను, మన్యు కృతేభ్యః=కోపముచేత చేయఁబడిన, పాపేభ్యః = పాపముల వల్లనుండి, రక్షన్తాం = రక్షించెదరు గాక, అహ్నా = గడచినపగటి చేత, మనసా=మనస్సుచేతను, వాచా = వాక్కుచేతను, హస్తాభ్యాం = చేతుల చేతను, పద్భ్యాం = పాదములచేతను, ఉదరేణ = ఉదరముచేతను, శిశ్నా = గుహ్యేంద్రియముచేతను, యత్ = ఏపాపమును, అకార్షం = చేసియుంటినో, మయి = నాయందు, దురితం = పాపము, యత్కించ = ఎయ్యది గలదో, తత్ = దానినంతయు, అహః = దివాభిమానియగు దేవత, అవలుంపతు = నశింపఁ జేయుఁగాక, అహం = నేను, ఇదం = ఈపాప సమూహమంతయు, మాం = (లింగశరీరరూపుఁడ నగు) నన్నును, అమృతయోనౌ = మరణ రహి తుఁడై జగత్కారణ భూతుఁడైనట్టియు, సత్యే = కాలత్రయా బాధ్యుఁడై నట్టియు, జ్యోతిషి = స్వయంప్రకాశ మగు, వస్తువునందు, జుహోమి = హుత మొనర్చుచున్నాఁడను, స్వాహా = (తదర్థమభిమంత్రిత మగు ఈజలము నాముఖాగ్నియందు) సుహుత మగుఁగాక.

తా. అగ్నియు, క్రోధ మభిమానముగాఁ గల మన్యుదేవతయును, కోప మును నియమించుచుండుటచేత కోపస్వాము లనంబడు దేవతలును, ఈ ముత్తె ఱంగులయిన వారలును కోపనిమిత్తముతో నేను చేసినట్టియు, చేయుచున్నట్టియు, చేయఁబోవునట్టియు, పాపముల నుండి నన్ను సంరక్షించెదరుగాక, అనఁగా పాపియగు నన్ను తత్పాపవినాశముచేత సంరక్షించెదరు గాక, కడచిన పగటి సమయముచేత నే నేపాపకర్మమును, మనస్సు, వాక్కు, హస్తములు, పాద ములు, ఉదరము, శిశ్నము అను ఈయింద్రియములచేత నాచరించినాఁడనో తత్పాపము నంతయు దివాభిమానియగుదేవత వినాశమొనర్చుఁగాక, ఆయా ఇంద్రియములచేత చేయఁబడు పాపమేమనఁగా:—

౧. ఇతరులకు హింసజేయఁ దలంచుట మనస్సుచేత చేసినపాపము.

౨. అప్రియములును అసత్యములును అగుమాటలను పలుకుట వాక్కు చేత చేసినపాపము.

౩. పరుల సంహరించుటకయి అభిచార హోమాదికము నాచ రించుట, దుర్దానములను పరిగ్రహించుట మున్నగునవి చేతులచేత చేసిన పాపము.

౪. గోబ్రాహ్మణులను కాలితో స్పృశించుట, నిషిద్ధములును, నింద్య ములును అగు ప్రదేశములకుఁ బోవుట పాదములచేత చేసినపాపము.

౫. తినరాని యన్నమును తినుటయు, నింద్యులగు వారల యన్నమును భుజించుటయు ఉదరకృత మగు పాపము.

౬. అగమ్య యగు స్త్రీని కవయుట శిశ్నకృత మగు పాపము, అని గ్రహింపవలయును.

లేక ఆపాపము ఈపాపము అని పరిగణనమేల! నాయం దేర్పడిన పాప మెయ్యది గలదో ఆపాపము నంతయును, ఆ పాపమునకు కర్తనై లింగశరీరరూపమున నున్న నన్ను మరణరహితమయి జగత్కారణమయి

త్రికాలాబాధ్యమగుటచేత సత్యమై స్వయంప్రకాశమయి యున్నజ్యోతిస్సునందు బడవేసి హోమము చేయుచున్నాఁడను, అనఁగా ఈ హోమముచేత దానినంతయు భస్మమొనర్చుచున్నాఁడను, అందులకుఁగాను అభిమంత్రింపఁబడిన ఈజలము నాముఖాగ్నియందు లెస్సఁగా హుతంబగుఁగాక.

విశేషము:—సామాన్యముగా పండితుఁడైనను పామరుఁడైనను దివారాత్రములందు విరామంబులేక పూర్వకర్మానుసారంబుగా నేదేని పాపకార్యం బొనర్చుచునే యుండును, బుద్ధిమంతుఁ డగువాఁడు కడచినరాత్రి తాఁజేసిన పాతకంబునకు గట్టిగా పశ్చాత్తాపమును చెంది అట్టి పాపకార్యములను వేఱ్వేర తలంపునకు గొని వాని పరిహారమెట్లగు నని ఉద్వేగముగలవాఁడయి సర్వంబును బ్రహ్మం బగుటఁగుఱుఁ, ప్రారబ్ధవశంబువలన తన తెలివి యడుగంటుటచేత అవశుఁడయి తానట్టి యకృత్యముల నొనర్చుటయు తలపోయుచు ఏకాగ్రంబగు చిత్తమున కరతల గతములగు జలములనభిమంత్రించి త్రాగవలయును.

---

౩౨. ద్వాత్రింశోఽనువాకః

అవ. ప్రాతస్సంధ్యాకాలమునందు మంత్రాచమనమంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. సూర్య శ్చ మా మన్యు శ్చ మన్యుపతయ శ్చ మన్యు
కృతేభ్యః । పాపేభ్యో రక్షంతామ్ । యద్రాత్రియా
పాప మకార్ షమ్ । మనసా వాచా హస్తాభ్యామ్ ।
పద్భ్యా ముదరేణ శిశ్నా । రాత్రి స్తదవలుమ్పతు ।

యత్కిఞ్చ దురితం మయి । ఇద మహం మా మమృత-
యోనౌ । సూర్యే జ్యోతిషి జుహోమి స్వాహా ॥
॥౫౦॥౩౨॥

టీక. సూర్యశ్చ = సూర్యుఁడును, మన్యుశ్చ = క్రోధము అభిమానము గాఁగల దేవతయును, మన్యుపతయశ్చ=కోపమునకును నియామకులగు అధి దేవతలును, మన్యుకృతేభ్యః = నాకోపముచేత చేయఁబడిన, పాపేభ్యః = పాపములవల్లనుండి,మాం=నన్ను,రక్షన్తాం=నన్నురక్షించెదరుగాక, రాత్రియా= అతీతమయిన రాత్రియందు, మనసా=మనస్సుచేతను, వాచా=వాక్కుచేతను, హస్తాభ్యాం=చేతులచేతను, పద్భ్యాం = పాదములచేతను, ఉదరేణ=ఉదరము చేతను, శిశ్నా = గుహ్యేంద్రియముచేతను, యత్=ఏ, పాపం=పాపమును,-అకార్షం = చేసితినో, తత్ = ఆపాపమును, రాత్రిః=రాత్ర్యభిమానిదేవత అవలుంపతు = నాశనమొనర్చుఁగాక, మయి = నాయందు, యత్కించ = ఏదియేనొక, దురితం=పాపముగలదో, ఇదం=ఈపాపజాతము, మాం=సూక్ష్మ శరీరరూపుఁడ నగు నన్ను, అమృతయోనౌ = మరణరహితుఁడును, జగత్కా-రణుఁడును అగు, సూర్యే=సూర్యోపాధిగల, జ్యోతిషి = జ్యోతిస్సునందు, జుహోమి = హుతమొనర్చుచున్నాఁడను, స్వాహా=సుహుతమగుఁ గాక.

తా. సూర్యుఁడును, కోపాభిమానిదేవతయు, క్రోధనియామకులగు-దేవతలును నేను కోపముచేత అవశుఁడనై చేసిన సకలపాపములయొక్క-దుష్ఫలితముల నాశనమొనర్చి ఆ పాపములవలన నాకు చెరుపుకలుగకుండు నటుల నన్ను సంరక్షించెదరుగాక, మఱియు నేను మనస్సుచేతను, వాక్కు-చేతను, చేతులచేతను, పాదములచేతను, ఉదరముచేతను, గుహ్యేంద్రియము చేతను యేయేపాపముల నొనర్చియున్నాఁడనో ఆ పాపముల నన్నింటిని-

మఱియు సకలవిధములయిన పాపములను మరణరహితుఁడును జగత్కార ణుఁడును అగు సూర్యోపాధిగల తేజస్సునందు హుతమొనర్చుచున్నాఁడను, నే నిట్టితలంపుతో హుతమొనర్చినది సుహుత మగు:గాక, అని మంత్రాభిమంత్రిత మగు జలమును ప్రాశన మొనర్పవలయును.

విశేషవివరము 31-వ అనువాకమునందుఁ గాంచునది.

---

33. త్రయస్త్రింశోఽనువాకః

అవ. ప్రాణాయామాదికమునందు ఆవశ్యక మగు ప్రణవమునకు ఋష్యాదికము చెప్పఁబడుచున్నది:—

మం. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ। అగ్నిర్దేవతా బ్రహ్మ ఇత్యార్షమ్ । గాయత్రం ఛన్దం పరమాత్మం సరూపమ్ సాయుజ్యం వినియోగమ్ ॥౫౧॥33॥

టీక. ఓం ఇతి=ఓం అను, ఏకాక్షరం = ఒకయక్షరమే, బ్రహ్మ = బ్రహ్మము, అగ్నిః=అగ్ని, దేవతా=దేవత, బ్రహ్మ=బ్రహ్మము, ఆర్షం = ఋషి, గాయత్రం=గాయత్రము. ఛందం=ఛందస్సు, పరమాత్మం=పరమాత్మ లక్షణమైనట్టియు, సరూపం=సర్వజగత్స్వరూపమైనట్టియు, సాయుజ్యం = పరబ్రహ్మప్రాప్తియందు, వినియోగః=వినియోగము.

తా. "ఓమ్" అను ఒకయక్షరమే పరబ్రహ్మము, అనఁగా సమస్త బ్రహ్మాండములయొక్క సృష్టిస్థితిలయములకు కారణము. దానికి దేవత యనఁగా వాచ్య మగు పదార్థము అగ్ని, ఇచట అగ్నిశబ్దమునకు రూఢిగా గ్రహింపఁబడుచున్న ఇంద్రాగ్నియమనిరృతాదులలోఁగల అగ్నిదేవుఁ డని

యర్థము కాదు. ఇచటి యగ్నిశబ్దమును యౌగికార్థముచేత పరమాత్మవాచకమునుగా గ్రహించవలయును, అగ్నిశబ్దముచేత ఉపలక్షితమగు బ్రహ్మము ఋషి, ఇట్లు మంత్రము బ్రహ్మము, మంత్రదేవత బ్రహ్మము, మంత్రఋషి బ్రహ్మము, అగుటచేతను సర్వమును స్వయముగా బ్రహ్మంబే యని యర్థము, గాయత్రము అనఁగా దైవీగాయత్రిఛందము, బ్రహ్మమునకు సాయుజ్యము వినియోగము, అనఁగా: పరబ్రహ్మావాప్తియందు వినియోగము, సర్వాత్మకమును పరమాత్మలక్షణ రూపమును అగు పరబ్రహ్మప్రాప్తియే ఈ మంత్రమునకు వినియోగమగునని భావము.

విశేషము:—ప్రతిమంత్రమునకు స్వరూపము. అందు ప్రతిపాదింపఁబడుదేవత ఆ మంత్రమును గనుంగొనిన ఋషి, ఛందము, వినియోగము వీనిని చక్కఁగా నెఱింగినఁ గాని ఉపాసించుట పొసఁగదు, ఇపుడు,

౧. "ఓమ్" అను ఏకాక్షరమగుమంత్రము బ్రహ్మము,

(ఇది మంత్రస్వరూపము.)

౨. అందు ప్రతిపాదింపఁబడు దేవత అగ్నిశబ్దవాచ్య మగు బ్రహ్మము.

(ఇది దేవత.)

3. ఋషియు బ్రహ్మమే. (ఇది ఋషి.)

౪. ఏకాక్షరయగు దైవీగాయత్రీఛందము ఛందస్సనియు,

(ఇది ఛందస్సు.)

౫. పరబ్రహ్మప్రాప్తియందు వినియోగము. (ఇది వినియోగము.)

ఈవిధముగా ప్రణవము నెఱింగి ఉపాసించువారలకు పరమపురుషార్థము లభించును.

౩౪. చతుస్త్రింశోఽనువాకః.

అవ. మార్జనానంతరము సంధ్యాత్రయమునందును గాయత్ర్యావాహనమును చేయునట్టి మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ఆయాతు వరదా దేవీ అక్షరం బ్రహ్మసమ్మితమ్ । గాయత్రీం ఛన్దసాం మాతేదం బ్రహ్మ జుషస్వ మే । యదహ్నాత్కురుతే పాపం తదహ్నాత్ప్రతిముచ్యతే । యద్రాత్రియాత్కురుతే పాపం తద్రాత్రియాత్ప్రతిముచ్యతే । సర్వవర్ణే మహాదేవి సంధ్యావిద్యే సరస్వతి ॥౫౦ ౩౪॥

టీక. వరదా = ఉపాసకులకు అభీష్టముల నొసంగునట్టి, దేవీ = గాయత్రీదేవీ, అక్షరం = వినాశరహితమును, సమ్మితం = వేదాంత ప్రమాణనిశ్చితమును అగు, బ్రహ్మ = జగత్కారణ మగు బ్రహ్మమును గూర్చి, ఆయాతు = మాసమీపమునకు వచ్చుఁగాక, ఛందసాం = గాయత్ర్యాది ఛందస్సులకు, లేక వేదములకు, మాతా = తల్లి యగు, గాయత్రీం = గాయత్రీదేవత, మే = నాకు, ఇదం = ఈ, బ్రహ్మ = బ్రహ్మత్త్వమును, జుషస్వ = ఉపదేశించుఁగాక, సర్వవర్ణే = సకలాక్షర స్వరూపిణియు, సంధ్యావిద్యే = సంధ్యానుష్ఠాన రూపిణియు, మహాదేవీ = మిక్కిలి ప్రకాశించుచున్నట్టియు, సరస్వతి = సరస్వతి స్వరూపిణి వగు ఓగాయత్రీ! అహ్నాత్ = పగటివల్ల నుండి యత్ పాపం = ఏపాపమును, కురుతే = నేను చేయుచున్నాఁడనో, తత్ = ఆ

పాపము, అహ్నాత్ = ఆపగటియందే, ప్రతిముచ్యతే=నన్నువదలి పోవుఁగాక, యత్ పాపం=ఏపాపమును, రాత్రియాత్ = రాత్రియందు, కురుతే= చేయుచున్నాఁడనో, తత్ పాపం = ఆపాపము, రాత్రియాత్ = ఆరాత్రి యందే, ప్రతిముచ్యతే = నన్నువదలి పోవుఁగాక.

తా. మాకభీష్టముల నొసంగుచున్న గాయత్రీఛందోఽభిమానినియగు దేవి నాశనము లేనట్టియు సకలోపనిషత్ప్రతిపాద్యమును అగు బ్రహ్మ తత్త్వమును మాకు ఉపదేశించుటకు గాను మాసమీపమునకు వచ్చుఁగాక, గాయత్రీ త్రిష్టుబాది ఛందస్సులకు లేక వేదములకు జనని యగు గాయత్రీ దేవత ఉపనిషత్ప్రతిపాద్య మగు తత్త్వము నుపదేశించుఁగాక, సంధ్య యనఁగా సాయం ప్రాతఃకాల సంధిసమయమునందు పుట్టినది, తత్కాలము నందు అనుష్ఠించు కర్మయు, తత్సమయమున నుపాసింపఁబడుదేవతయు సంధ్య యని చెప్పఁబడును, సకల వర్ణస్వరూపిణియు, సరస్వతీస్వరూపిణియు, మహా దేవియు, నగు ఓగాయత్రి! నిన్నుఁ పాసించు భక్తుఁడు పగలు తా నేపాపం ఋల నాచరించునో ఆపగటియందే ఆపాపములనుండి విముక్తుఁడగును. ఏరాత్రియందు పాపముల నాచరించునో ఆరాత్రియందే వానిచేత విముక్తుఁడగును, అనఁగా ఎప్పటి పాపముల నప్పుడే పోఁగొట్టుకొనునని భావము, "అహ్నాత్, రాత్రియాత్" మున్నగు ప్రయోగములు ఛాందసము లగుటచేత దూష్యములుగావు.

విశేషము:—త్రిసంధ్యలందును గాయత్రిని మనఃపూర్వకముగా నుపా సించువాఁడు పాపముల నాచరింపఁడు, ఒకవేళ పాపములుచేయుట కలిగిన నది ప్రారబ్ధవశమున ప్రమాదంబుననే జరుగును గాని మనఃపూర్వకంబుగాఁ గాదు కావున అట్టిపాప మాతని కంటదని భావము.

---

౩౫. పంచత్రింశోఽనువాకః.

అవ. గాయత్ర్యావాహనమంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ఓజోఽసి సహోఽసి బలమసి భ్రాజోఽసి దేవానాం
ధామ నామాసి విశ్వమసి విశ్వాయు స్సర్వ మసి
సర్వాయు రభిభూరోం గాయత్రీ మావాహయామి
సావిత్రీ మావాహయామి సరస్వతీ మావాహయామి
ఛందర్షీ నావాహయామి శ్రియ మావాహయామి
గాయత్రియా గాయత్రీ చ్ఛందో విశ్వామిత్ర ఋషి
స్సవితా దేవతాఽగ్నిర్ముఖం బ్రహ్మా శిరో విష్ణుర్ హృ
దయగ్ంం రుద్రశ్శిఖా పృథివీ యోనిః ప్రాణాపానవ్యా
నోదానసమానా సప్రాణా శ్వేతవర్ణా సాంఖ్యాయనస
గోత్రా గాయత్రీ చతుర్వింశత్యక్షరా త్రిపదా ష
ట్కుక్షిః పఞ్చశీర్ షోపనయనే వినియోగః ॥

టీక. (ఓగాయత్రీ నీవు) ఓజః=ఓజోధాతువు, అసి=అయితివి, సహః= శత్రువులను పరాభవింపఁజేయునట్టి శక్తిరూపమైనదానవు, అసి=అయితివి, భ్రాజః = కాంతిరూపమయిన దానవు, అసి=అయితివి, దేవానాం = దేవతల యొక్క, ధామనామా=తేజస్సే పేరుగాఁగలదానవు, అసి=అయితివి, విశ్వం=

సర్వజగద్రూపిణివి, అసి=అయితివి, విశ్వాయుః=సంపూర్ణాయుస్స్వరూపిణివి, అసి=అయితివి, సర్వం = సమస్తము, అసి=అయితివి, సర్వాయుః = సకలాయుస్స్వరూపిణివి, అసి=అయితివి, అభిభూః = సకలపాపములను తిరస్కరించుదానవు (అసి=అయితివి) ఓం=ప్రణవప్రతిపాద్యవు, అసి=అయితివి.

(అట్టి) గాయత్రీం=గాయత్రిని, ఆవాహయామి = (నాహృదయమునందు) ఆవాహనము చేసికొనుచున్నాఁడను, సావిత్రీం=సావిత్రిని, ఆవాహయామి = (నాహృదయమునందు) ఆవాహనము చేసికొనుచున్నాఁడను, సరస్వతీం=సరస్వతిని, ఆవాహయామి=ఆవాహనము చేసికొనుచున్నాఁడను, ఛందర్షీన్ = సర్వఛందములను ఋషులను, ఆవాహయామి = ఆవాహనము చేసికొనుచున్నాఁడను, శ్రియం = సర్వవేదములయొక్క లక్ష్మిని, ఆవాహయామి=ఆవాహనము చేసికొనుచున్నాఁడను, గాయత్ర్యాః=గాయత్రీమంత్రమునకు, గాయత్రీఛందః = గాయత్రిఛందస్సు, విశ్వామిత్రః = విశ్వామిత్రుఁడు, ఋషిః=ఋషి, సవితా=సవిత, దేవతా=దేవత, అగ్నిః=అగ్ని, ముఖం = ముఖము, బ్రహ్మ = చతుర్ముఖబ్రహ్మము, శిరః=శిరస్సు, విష్ణుః = విష్ణువు, హృదయం = హృదయము, రుద్రః = రుద్రుఁడు, శిఖా=శిఖ, పృథివీ=భూమి, యోనిః=యోని, ప్రాణాపానవ్యానోదానసమానా=ప్రాణాపానవ్యానోదానసమాన వాయువులు గలది, సప్రాణా = వాగాదీంద్రియ సమన్వితమయినది, శ్వేతవర్ణా=తెల్లనిరంగుగలది, సాంఖ్యాయన సగోత్రా=సాంఖ్యాయనునితో సమానమయిన గోత్రముగలది, చతుర్వింశత్యక్షరా=ఇరువదినాలుగు అక్షరములుగలది, త్రిపదా=మూఁడు పాదములు గలది, షట్కుక్షిః=షడంగములే కుక్షిగాఁ గలది, పంచశీర్షా = ఐదుశిరములుగలది, (నాల్గువేదములకు నాల్గు ఉపనిషద్భాగములు దేహమునకు శిరస్సువలె వేదమునకు శిరస్సువంటివి కావున నాల్గుశీర్షము లగును, ఇతిహాసపురాణములు సైతము ఉపనిషత్తులవలె జ్ఞానప్రదములు కావున పంచమవేద మగుటచేత

వెనుకటి నాల్గుశీర్షములతో కలసి పంచశీర్షము లగును.) ఇటుల ధ్యానించ వలయును, ఉపనయనే = ఉపనయనమునందు, వినియోగః=వినియోగము.

తా. ఓగాయత్రీ ! నీవే ఓజంబవు, ఓజ మనఁగా శరీరమందుండు ధాతువులలో బలహేతు వగు ఎనిమిదవ ధాతువు, నీవ సహంబవు, సహ మనఁగా శత్రుపరాభవ సమర్థమగు శక్తి, నీవ దీప్తి స్వరూపం బవు, ఇంద్రుఁడు అగ్ని మున్నగు దేవతల సంబంధియగు నేతేజంబు గలదట్టి తేజంబు నీవ, అనఁగా వారితేజోనామమే నీతేజోనామము, నీచే దేవతలకు దేజంబ వని యర్థము, నీవే సర్వజగద్రూపము, నీవే సంపూర్ణాయు స్స్వరూప మవు (ఆదరముతో చెప్పిన దానినే మఱల చెప్పుచున్నాఁడు), సకలజగత్తు నీవు, సర్వాయువు నీవ, సకలపాపముల తిరస్కరించుదానవు నీవ, ఓంకార ప్రతి పాద్యమగు పరమాత్మవు నీవ.

౧. అట్టి నిన్ను గాయత్రిని నామనమునందు ఆవాహనము చేసి కొనుచున్నాఁడను.

౨. "సావిత్రీ మావాహయామి" మొదలుకొని చివరవఱకు గల మంత్రార్థము శ్రీదత్తాత్రేయదిగంబరానుచరులచేత రచింపఁబడిన నారాయ ణోపనిషత్ప్రకాశమునుండి గ్రహింపఁబడిన దని పరిశిష్టవ్యాఖ్యాత వచించి యుండుటచేత తదనుసార మాంధ్రవ్యాఖ్య వ్రాయఁబడినది.

సవిత యనఁగా బ్రహ్మసాక్షాత్కారమును చేయు (అనఁగా జ్ఞాన ప్రకాశకంబగు) పరమాత్మ, తత్సంబంధిని యగునది సావిత్రి, అట్టిదేవత నావాహనము చేసికొనుచున్నాఁడను.

౩. సరస్వతిః— 'బ్రహ్మజలధారణ ప్రస్యందనాభ్యాం వేదాః సరాంసి తన్మయత్వాత్ తద్వతీ సరస్వతీ' (అర్థ. బ్రహ్మం బనెడి జలమును కలిగి యుండుటచేతను, దానిని తదధికారు లగువారికి ప్రవహింపఁ జేయుట చేతను వేదంబులు సరస్సు లనంబడును, తన్మయం బగుటఁజేసి సరస్సులు గలదీ

సరస్వతి చతుర్వింశ త్యక్షరములు గల గాయత్రీమంత్ర స్వరూపమగు దేవత' అట్టి సరస్వతిని ఆవాహనము చేసికొనుచున్నాఁడను.)

గాయత్రియే సర్వమంత్రమయ మగుటఁజేసి సర్వఛందస్సులను, ఎల్లరు ఋషులను, సర్వదేవతలను, ఆవాహనము చేసికొనుచున్నాఁడను, గాయత్రి సర్వవేదమయి ఆగుటచేత సకలవేద శ్రీరూపయగుదేవి నావాహనము చేసికొను చున్నాఁడను.

ఇటు ఉపాసకుఁడు ఏకమగు గాయత్రిని తనమనంబునం దావాహనము చేసికొనుటచేత సర్వమును తనయం దావాహనము చేసికొనుచున్నాఁడనని తలంచి గాయత్రి నావాహనము చేసికొని గాయత్రీమంత్రముయొక్క ఋషిని ఛందమును దేవతను ముందు చెప్పఁబోవురీతిని స్మరియించి ధ్యానము చేయవలయును, అందు మంత్రార్థము:—

౧. గాయత్రీమంత్రమునకు గాయత్రి ఛందము, (గాయత్రీఛందము ౨౬ ఛందస్సులలో ౬ వది, వేదంబునం దిది ఎనిమిది తెఱంగు లగు) అందు మన యీ గాయత్రికి ప్రాజాపత్యయని పేరు, ప్రాజాపత్యాష్టౌ పింగళఛందః. ౨. ౫. (దీనికి పాదమునకు ఎనిమిది అక్షరములు నని ఎఱుంగునది.)

౨. దీనికి ఋషి యనఁగా మంత్రద్రష్ట విశ్వామిత్రుఁడు.

౩. దీనికి దేవత సవిత, అనఁగా సర్వమును ప్రసవించువాఁడు (కలుగఁ జేయువాఁడు) పరమాత్మ, అట్టిపరమాత్మను ప్రతిపాదించునదియే ఈమంత్ర మగుటచేత దీనికి సవితృశబ్దవాచ్యం బగు పరమాత్మయే దేవత.

అని యిట్లు ఛందస్సును, ఋషిని దేవతను స్మరించునది.

ఇఁక ధ్యానము:—౧. ఈగాయత్రికి ముఖము ప్రసిద్ధ మగు నగ్ని' అనఁగా అగ్ని గాయత్రి ముఖస్థానీయుఁ డనుట.

౨. బ్రహ్మము శిరస్సు, చతుర్ముఖుఁ డగు బ్రహ్మ ప్రథమముగ పుట్టుట వలన శిరస్సు అనఁగా శిరస్థానీయుఁ డనుట.

3. విష్ణువు హృదయము, అనఁగా సర్వమునందు సూక్ష్మరూపంబున (చైతన్యంబు) వసించుటకు కర్త (కారణము) అగు విష్ణువు హృదయస్థానీయుఁడు.

౪. రుద్రుఁడు శిఖ, అనఁగా సర్వావయవాతీతుండై శిఖ యుండు తెఱంగున సర్వాతీతుండై ప్రళయకారకుం డగుటం జేసి రుద్రుఁడు శిఖాస్థానీయుఁడు.

౫. పృథివి యోని, సర్వము పుట్టుటకు కారణభూత మగుటచేత భూమి యోనిస్థానీయము.

౬. ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అను ప్రాణాదిపంచకమును, వాగాదీంద్రియములును కలిగి యుండునది.

౭. తెల్లనివర్ణము గలది, శుద్ధగుణ ప్రధాన యగుటం జేసి రంగులలో మొదటిదగు శ్వేతవర్ణము గలది యని యర్థము.

౮. గాయత్రిసాంఖ్యాయన సగోత్ర, సంఖ్యయనఁగా గుణముల లెక్కించుట, గుణవిమర్శనము, అదిచేయువారలు సాంఖ్యులు, సర్వగుణంబుల నిరసించి సాంఖ్యులచేత పొందఁబడువాఁడు సాంఖ్యాయనుఁడు, అనఁగా పరమాత్మ, సగోత్రము—సాంఖ్యాయనునితో సమాన మగు—అనఁగా ఏకమైన గోత్రము కులము—పుట్టుక కలిగినది సాంఖ్యాయనసగోత్ర యగును.

సాంఖ్యాయన సగోత్రా:— 'సంఖ్యాం గుణసంఖ్యానం అహన్తి సాంఖ్యాః, సాంఖ్యై రీయతే ప్రాప్యతే సర్వగుణనిరాసా త్స సాంఖ్యాయనః పరమాత్మా బ్రహ్మ సన్మాత్రం, సాంఖ్యాయనేన సమాన - మేకంగోత్రం - కులం ఉద్భవః అస్యాః సాంఖ్యాయనసగోత్రా' అని వ్యుత్పత్తి.

ఇది దేవతారూపమున గాయత్రీధ్యానము.

ఇఁక మంత్రరూపమున గాయత్రిని మఱల చెప్పఁదలఁచి గాయత్రి యని ఉపక్రమింపఁబడినది:—

౧. మంత్రరూపమగు గాయత్రి ౨౪ అక్షరములు గలది.

౨. పాదమునకు ౮ అక్షరముల చొప్పున మూఁడుపాదములు గలది

౩. గాయత్రి సర్వవేదమయమగుటచేత, ౧ శిక్ష, ౨ వ్యాకరణము ౩ ఛందస్సు, ౪ నిరుక్తము, ౫ జ్యోతిషము, ౬ కల్పసూత్రము అనెడి వేదాంగము లాఱును కుక్షులుగాఁ గలది.

౪. ౫ శిరంబులు గలది, అనఁగా నాలుగు వేదములందును జ్ఞాన ప్రతిపాదకంబు లగు ఉపనిషద్భాగంబులు కర్మకాండమునకు ఉపాసనా కాండమునకు శిరంబువలె పైనుండుటంజేసి నాలుగు శిరంబులు, అట్లు పురాణంబులును ఇతిహాసంబులును ఐదవవేదం బనంబఱఁగి జ్ఞానప్రతిపాదకంబు లగుట చేత కర్మకాండోపాసనాకాండములకు బయటనుండి ఐదవశిరం బగును, ఇట్లు అయిదు శిరంబులు గలది.

౫. ఈమంత్రమునకు వటువునకు ఉపనయనము చేయుటయందు వినియోగము అని యర్థము.

కావున ఇట్లు స్మరించియు పఠించియు గాయత్రీమంత్రమును జపించు నది యని తాత్పర్యము.

ఈపైని చెప్పఁబడినది గాయత్ర్యుపాసనము, ఇట్లు దేవతాస్వరూప ముగాను, మంత్రస్వరూపముగాను ద్వివిధమగు ఉపాసనము తెలుపఁబడినది, దేవతా స్వరూపోపాసనమునందు గాయత్రి పరమాత్మస్వరూప మనియుం దేవతలందఱును, వేదములును ఆమెకు వశులయిన వారనియు వర్ణింపఁబడి నది, అందు అగ్నిదేవుఁడు ముఖముగాను, బ్రహ్మదేవుఁడు శిరముగాను, రుద్రుఁడు శిఖగాను, విష్ణుదేవుఁడు హృదయంబుగను, పృథివి యోనిగను ప్రాణాదిపంచవాయువులును వాయువులుగను కలుగఁజెప్పినాఁడు, శరీరవర్ణము

శ్వేతమనియు, సాంఖ్యాయనసగోత్రమున పుట్టినదనియు వర్ణింపఁబడినది. ఈరూపమున గాయత్రి నుపాసించుటవలన ఆయాదేవతలను వేర్వేఱుపాసించుటవలన కలుగు ఫల మిందు గలదని సూచనము చేయఁబడినది.

మం. ఓం భూః । ఓం భువః । ఓగ్ం సువః । ఓం మహః
ఓం జనః । ఓం తపః । ఓగ్ం సత్యమ్ । ఓం తత్సవితు
ర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి । ధియో యో నః
ప్రచోదయాత్ । ఓమాపో జ్యోతీ రసోఽమృతం
బ్రహ్మ భూర్భువస్సువరోమ్ ॥౩౩॥౩౫॥

టీక. భూః=భూలోకము, ఓం=ప్రణవప్రతిపాద్యము, భువః=భువర్లోకము, ఓం=ప్రణవప్రతిపాద్యము, సువః=సువర్లోకము, ఓం=ప్రణవప్రతిపాద్యము, మహః=మహర్లోకము, ఓం=ప్రణవప్రతిపాద్యము, జనః=జనలోకము, ఓం=ప్రణవప్రతిపాద్యము, తపః=తపోలోకము, ఓం=ప్రణవప్రతిపాద్యము, సత్యం=సత్యలోకము, ఓం=ప్రణవప్రతిపాద్యము. యః=ఏపరమేశ్వరుఁడు, నః=మాయొక్క, ధియః=బుద్ధి వృత్తులను, ప్రచోదయాత్=చక్కఁగా తత్త్వజ్ఞానమునందు ప్రేరేపించునో, అట్టి, సవితుః=అంతర్యామియై ప్రేరకుఁడగు, దేవస్య=దేవునియొక్క, వరేణ్యం=శ్రేష్ఠమయిన, భర్గః=తేజస్సును, ధీమహి=ధ్యానము చేయుచున్నారము.

ఓం=ఈమంత్రము ప్రణవప్రతిపాద్యము.

ఆపః=నదీసముద్రాదిగతములగు ఉదకములును, జ్యోతిః=ఆదిత్యచంద్రాగ్న్యాదులందు గలతేజస్సును, రసః=మధురామ్లాది షడ్రసములును, అమృతం=దేవతాహారమగు అమృతమును, (ఇదియంతయు, ఓం=ప్రణవ

ప్రతిపాద్యమగు, బ్రహ్మ=పరబ్రహ్మము) భూః భువః సువః=భూః భువః సువః లోకములును, ఓం=ప్రణవప్రతిపాద్యములే.

తా. 'భూః' మొదలుకొని 'సత్యం' వఱకును గల పదములు ఏడును భూలోకము మొదలగు ఏడులోకములను తెలుపును, ఇవి వ్యాహృతు లనంబడును, ఆ లోకంబులన్నియు ప్రణవమున కర్థంబు లగు పరబ్రహ్మ రూపంబులగుటను తెలుపుటకయి ప్రతిపదముతోడను ఓంకారమును చేర్చి పలుకఁబడినది, దీని యర్థ మీ తెఱఁగున నగును:—

౧. భూలోకము ఓంకారపదవాచ్యమగు పరబ్రహ్మము.

౨. భువర్లోకము ఓంకారపదవాచ్యమగు బరబ్రహ్మము.

3. సువర్లోకము (లేక స్వర్లోకము) ఓంకారపదవాచ్యమగు పరబ్రహ్మము.

౪. మహర్లోకము ఓంకారపదవాచ్యమగు పరబ్రహ్మము.

౫. జనోలోకము ఓంకారపదవాచ్యమగు పరబ్రహ్మము.

౬. తపోలోకము ఓంకారపదవాచ్యమగు పరబ్రహ్మము.

౭. సత్యలోకంబును ఓంకారపదవాచ్యమగు పరబ్రహ్మము అని యర్థము.

(ఈసప్తవ్యాహృతులను ఉచ్చరించునప్పుడుగాని మనస్సుచేత తలఁచునప్పుడుగాని "సర్వంఖల్విదంబ్రహ్మ" "చరాచరరూపంబున మనకు గోచరంబగు నయ్యది యెల్ల బ్రహ్మమేగదా" యను వాక్యార్థము ననుసరించి సకలలోకంబులును పరబ్రహ్మంబ యని ధ్యానించవలయును.

ఇది వ్యాహృతుల కర్థము

ఇఁక మంత్రార్థము:—సవిత యనఁగా ప్రేరకుండై సర్వాంతర్యామియై వెలుంగుదేవుఁడు, అట్టి దేవునియొక్క శ్రేష్ఠము (కావుననే ఎల్లర

చేతను కోరఁబడఁదగినదియగు తేజస్సును ధ్యానించెదము, అనఁగా సకలశ్రేర ఘండై సర్వాంతర్యామియై వెలుంగునట్టి ఆ దేవునియొక్క శ్రేష్ఠంబును అందఱు గోరఁదగినదియుం అగు తేజమును ధ్యానించెదము (సర్వాంతర్యామి యనఁగా సకలపదార్థంబులందు లోపల గూఢముగా నుండువాఁడు) అట్టి సవిత నుపాసించుట ఎందుల కనఁగా పరమేశ్వరుఁడగు ఆ సవితృదేవుఁడు మాబుద్ధివృత్తులను పరమాత్మతత్త్వజ్ఞానమునందు లెస్సగా ప్రేరేపించును కావున నని భావము.

పైని చెప్పఁబడిన యర్థము గాయత్రీమంత్రముయొక్క అర్థము.

గాయత్రికి జప మనియు, ధ్యాన మనియుం రెండు రీతులు గలవు. జపమనఁగా:—మంత్రాక్షరములను బిగ్గరగానో, మెల్లగా పెదవుల కదుల్చు చునో, లేక మనస్సునందో పలుకుట.

ధ్యానమనఁగా:—మంత్రమునందు చెప్పిన యర్థమును ధ్యానించుట ఇదియే సఫలము శ్రేష్ఠమయినదియు నని భావము.

'ఓం ఆపోజ్యోతి' ఈమొదలగుమంత్రము గాయత్రీశిర మని చెప్ప బడును, ఈ శిరోమంత్రమునకు ముందును వెనుకను "ఓం" కారమును చేర్చి మంత్రమునందు చెప్పఁబడియుంన్నది. దీనియర్థము:—నదులు సముద్రములు లోనగువానియందలి జలంబును సూర్యుఁడు, చంద్రుఁడు, నక్షత్రములు, మెఱుపు మున్నగువాని జ్యోతియు, మధురము ఆమ్లము మొదలగు షడ్ర సములును, దేవతల కాహార మగు అమృతము, ఇవియంతయు ఓంకారపద వాచ్య మగు పరబ్రహ్మమే, భూ ర్భువ స్సువ ర్లోకములును ఓంకారపద వాచ్య మగు పరబ్రహ్మమే యని తాత్పర్యము.

ఈ మంత్రము ప్రాణాయామాంగ మని అమృతనాదోపనిషత్తునం దీవిధముగాఁ గలదు:—

శ్లో. 'సవ్యాహృతిం సప్రణవాం గాయత్రీం శిరసా సహ,
త్రిఃపఠే దాయతప్రాణః ప్రాణాయామ స్స ఉచ్యతే.'

అర్థ. సప్తవ్యాహృతులు ప్రణవసమన్వితములుగాను, గాయత్రిని శిరోమంత్రములోడను ఆయతప్రాణుఁడై ముమ్మారు పఠించుట ప్రాణాయామ మని చెప్పఁబడును.

---

3౬. షట్ త్రింశోఽనువాకః.

అవ. జప మయినపిదప గాయత్రీ విసర్జన మగుమంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ౧. ఉత్తమే శిఖరే జాతే
భూమ్యాం పర్వతమూర్ధని।
బ్రాహ్మణేభ్యోఽభ్యనుజ్ఞాతా
గచ్ఛదేవి యథాసుఖమ్ ॥

టీ. భూమ్యాం = భూమియందు, జాతే = పుట్టిన, పర్వతమూర్ధని = పర్వతముయొక్క పైభాగమునందు, ఉత్తమే = శ్రేష్ఠమయిన, శిఖరే = శిఖరమునందు, (గాయత్రీదేవత నివసించును.) దేవీ=ఓగాయత్రీ! బ్రాహ్మణేభ్యః=బ్రాహ్మణులవలన, అభ్యనుజ్ఞాతా=అనుజ్ఞనుగ్రహించినదానవై, యథాసుఖం=నీసుఖానుసారము, గచ్ఛ=స్వస్థానమునకు పొమ్ము.

తా. భూమియందు మేరువనుపేరుగల ఏపర్వతరాజము గలదో అట్టి పర్వతశ్రేష్ఠముయొక్క ఉత్తమశిఖరమునందు గాయత్రీదేవత! నివసించుచున్నది, ఓ గాయత్రీ! నిన్నుపాసించు బ్రాహ్మణులకు వలయు నభిమతముల నొసంగుట

చేత వారు సంతుష్టులయి నిన్ను స్వగృహమునకు బోవుటకు అనుజ్ఞ నొసంగుదురు కావున అట్టివారి యనుజ్ఞను గ్రహించి నీకు సుఖము కలుగునటుల నీ స్వస్థానమగు మేరుపర్వతశ్రేష్ఠ శిఖరమునకు పొమ్మనితాత్పర్యము.

మం. ౨. స్తుతో మయా వరదా వేదమాతా
ప్రచోదయన్తీ పవనేద్విజాతా ।
ఆయుః పృథివ్యాం ద్రవిణం బ్రహ్మవర్చసం
మహ్యాం దత్వా ప్రజాతుం బ్రహ్మలోకమ్ ॥౫౪॥౩౬॥

టీ. వరదా=ఉపాసకులకు అభీష్టముల నొసంగునదియు, వేదమాతా=వేదములకు తల్లియు, పవనే=వాయువువలె, ప్రచోదయంతీ=అంతర్యామిరూపిణియై ప్రాణులను ప్రేరేపించునదియు, ద్విజాతా=ద్విజులచేత ఉపాస్యమానయు లేక సూర్యమండలము బ్రహ్మలోకము వీనియందు ప్రాదుర్భవించినదియు అగు గాయత్రి, మయా=నాచేత, స్తుతః=కొనియాడఁ బడినదై, పృథివ్యాం=భూమియందుండు, మహ్యాం=నాకొఱకు, ఆయుః=శతసంవత్సరాత్మకమగు ఆయుర్దాయమును, ద్రవిణం=ధనమును, బ్రహ్మవర్చసం=బ్రహ్మవర్చస్సును, దత్వా=ఇచ్చి, ప్రజాతుం=శ్రేష్ఠమయిన, బ్రహ్మలోకమునుగూర్చి (ప్రయాతు=పోవుఁగాక).

తా. వెనుకటి మంత్రమునందు అపరోక్షముగా చెప్పఁబడినవిషయము ఈమంత్రమునందు పరోక్షముగా స్పష్టీకరించి చెప్పఁబడుచున్నది, ఇచ్చట వైదికరహస్యంబేమన:—బ్రహ్మలోకము, ఆదిత్యమండలము ఈరెంటిలో ఒకటి గాయత్రికి నివాసస్థాన మని కొందఱిమతము, కావుననే వెనుకటిమంత్రమునందు మూలమునందు చెప్పఁబడకపోయినను అధ్యాహృతమొనర్చి ఆదిత్యమండలమునందు గాయత్రియున్నదని వర్ణించియుంటిమి, ఈ మంత్ర

మునందు స్పష్టముగ బ్రహ్మలోకము గాయత్రీనివాసస్థానమని గలదు. కావున తద్వ్యాఖ్యానము నొనర్చుచున్నారము, ద్విజాతులగు బ్రహ్మక్షత్రియ వైశ్యజాతులవారిచేత ఉపాసింపఁబడునదియు, లేక సూర్యమండల బ్రహ్మ లోకములందు ప్రాదుర్భవించినదియు, వాయువు చతుర్విధ మగు ప్రాణిజాత మును ఇట్టటు గమనాగమనాదికము నెటుల చేయించునో, అదేవిధముగ అంతర్యామిరూపమున ప్రాణులను ప్రేరేపించునదియును, వేదచతుష్టయము నకు తల్లివంటిదియు, తన్నుపాసించువారల కభిమతార్థముల నొసంగునదియు అగు గాయత్రీదేవత నాచేత కొనియాడఁబడినదై భూమియందున్న నాకు నూరుసంవత్సరముల పరిమితిగల సంపూర్ణాయుస్సును, మణిముక్తాప్రవాళాది రత్నసమన్వితమగుధనమును, బ్రహ్మవర్చస్సును (బ్రహ్మవర్చస్సనఁగా స్వాధ్యా యమును చదివిశిష్యులకుబోధించుటచేతను, వేదార్థము నెఱుంగుటచేతను, వేదా ర్థము నెఱింగి అందు ప్రతిపాదింపఁబడియున్న సత్కర్మల ననుష్ఠించుచు అను ష్ఠింపఁజేయుచుండుటచేతను కలిగెడి ముఖకాంతియగును, అట్టి ముఖకాంతిని గాంచియే లోకులువాని నీవిధముగా పలికెదరు. "ఇతఁడు జ్వలించుచున్న అగ్ని హోత్రుఁడువలె దేదీప్యమానుఁడై యున్నాఁడు:" అని) నాకు కలుగఁజేసి ప్రజా తమగు బ్రహ్మలోకమును గూర్చి పోవుఁగాక యని తాత్పర్యము.

'ప్రజాతః' అనుశబ్దమునకువ్యుత్పత్తి:—అతలాదిభ్యో అధస్తనేభ్యః' భూరాదిభ్యో ఊర్ధ్వతనేభ్యః, సమస్తేభ్యో లోకేభ్యః, ప్రకృష్టత్వేన జాతః పరమాత్మన స్సకాశా దుత్పన్నః ప్రజాతః.

అతల వితలాది అధోభాగస్థిత లోకసప్తకముకంటెను, భూ ర్భువ స్సువ రాది ఊర్ధ్వభాగస్థిత లోక సప్తకముకంటెను శ్రేష్ఠమయినదిగా పర మాత్మవలన నిర్మింపఁబడినది అని యర్థము, ఇట్టిది ప్రజాత మనంబడును.

'స్తుతా' అనియుండుటను 'స్తుతః' అనియు, 'పవనవత్' అనుటను

'పవనే' అనియు, 'ప్రజాతం' అనుటకు 'ప్రజాతుం' అనియు ఉండుట వైదిక మని గ్రహించునది, సాధారణముగా పాణినివ్యాకరణ నిర్ణీతములగు శబ్దరూపములు వేదమునందు మార్పుచెందుచుండుట కలదు.

---

౩౭. సప్తత్రింశోఽనువాకః.

అవ. పూర్వోక్తములగు ఉపాసనలను చేయుటయందు అసమర్థుఁ డగువాఁడు జపింపవలసిన ఆదిత్యదేవతామంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ఘృణిః సూర్య ఆదిత్యో న ప్రభావాత్యక్షరమ్ ।
మధు క్షరంతి తద్రసమ్ । సత్యం వై తద్రస మాపో
జ్యోతీ రసో ఽమృతం బ్రహ్మ భూ ర్భువ స్సువ
రోమ్ ।౫౫।౩౭॥

టీక. సూర్యః = జగదుత్పత్తికి హేతుభూతుఁడును, ఘృణిః = దీప్తి గలవాఁడును, ప్రభావ=ఆదిత్యుని కాంతివలె, అక్షరం = నాశనము లేని వాఁడును అగు, ఆదిత్యః = ఆదిత్యుఁడు, వాతి = ఆకాశమార్గమునఁ బోవుచున్నాఁడు. తద్రసం=ఆసూర్యునివలన జనించిన యుదకము, మధు=మధురముగా, క్షరన్తి=నదులయి ప్రవహించుచున్నవి, తత్ = ఆయాదిత్యలక్షణమగు బ్రహ్మమే, సత్యం వై = యథార్థభాషణము గదా, రసం వై=మధురాదిరస జాతముగదా, ఆపః వై = సముద్రనద్యాదిగతములగు జలములు గదా, జ్యోతిః వై=చంద్రాగ్న్యది జ్యోతిస్సు గదా, రసః వై = పదార్థమాత్రసారభూతము గదా, అమృతం వై=అమృతమేగదా, బ్రహ్మవై=వేద

విద్యారూపముగదా, భూః భువః సువః వై=భూ ర్భువ స్సువ ర్లోకములు గదా, ఓం వై=ప్రణవస్వరూపము గదా.

తా. జగత్తు పుట్టుటకు హేతుభూతుఁ డగుటచేత సూర్యుఁ డనంబడు వాఁడును, దీప్తిమంతుఁడును, నాశరహితుఁడును అగు ఆదిత్యుఁడు ఆదిత్య కాంతివలె ఆకాశమార్గముచేత రాత్రిం బగళ్లు లోకముల నుపకరించు నిమిత్తము సంచరించుచున్నాఁడు, సూర్యునకు ఉపమానాంతరము లేకపోవుట చేత 'తత్పృథనే' ఇచట ఉపమానముగా గ్రహించిరి, స్వకీయ మగు కాంతి యంతయు ముద్దయై ఆకాశమునందున్నయెడల దానినిగాంచి ఇట్టి కాంతిగల వాఁడాదిత్యుఁడు అని ఉపమించురీతిగా ననుట, మఱియు ఆ సూర్యునివలన జనించిన ఉదకమే మధురముగా నద్యాదిరూపమున ప్రవహించుచున్నది, సూర్యునివలన వర్షముకలుగుచున్నది వర్షజలమువలన నదులు ప్రవహించు చున్నవి. లేనియెడల భూమియం దుదకమే ఉండదనిభావము. ఇఁక ఆది త్యరూపపరబ్రహ్మమే సర్వాత్మక మనుట విశదీకరింపఁబడుచున్నది:—ఆదిత్య బ్రహ్మమే సత్యభాషణము, మధురాదిరసజాతము ఆదిత్యుఁడే, సముద్రనద్యాది గతమగుజలము ఆదిత్యుఁడేగదా, చంద్ర, అగ్ని, నక్షత్రాది కాంతిసమూహము ఆదిత్యుఁడేగదా, పదార్థము లన్నిఁటియొక్కయు సారము ఆదిత్యుఁడేగదా, అమృతము, వేదవిద్య, భూ ర్భువ స్సువర్లోకములు ఓంకారము ఇవియన్నియు ఆదిత్యుఁడే యని మనస్సుచేత తలఁచవలయు నని తాత్పర్యము.

---

౩౮. అష్టత్రింశోఽనువాకః.

అవ. జ్ఞానప్రతిబంధక బ్రహ్మహత్యాది పాపనివృత్తికి హేతుభూతములగు త్రిసుపర్ణమంత్రములను మూఁ డనువా

కములందు చెప్పఁదలఁచి, యీ యనువాకమునందు ఆమంత్ర త్రయములో ౧ మంత్రము, తన్మాహాత్మ్యబోధక మగు బ్రాహ్మణముతోడ చెప్పఁబడుచున్నది:—

మం. ౧. బ్రహ్మ మేతు మామ్ । మధు మేతు మామ్ । బ్రహ్మ మేవ మధు మేతు మామ్ । యాస్తే సోమ ప్రజా వత్సో ఽభి సో అహమ్ । దుష్ష్వప్నహా న్దురుష్వహ । యాస్తే సోమ ప్రాణాగ్ం స్తా ఞ్జుహోమి

టీ. బ్రహ్మం=పరబ్రహ్మతత్త్వము, మాం=నన్ను, ఏతు = పొందుఁగాక, మధు = పరమానంద మాధుర్యోపేతమగు వస్తువు, మాం = నన్ను, ఏతు=పొందుఁగాక, మధుం=మధురమగు, బ్రహ్మమేవ = పరబ్రహ్మతత్త్వమే, మాం=నన్ను, ఏతు=పొందుఁగాక, సోమ = బ్రహ్మవిద్యాసమన్వితుఁడవగునో పరమేశ్వరా! తే = నీ యొక్క, యాః = ఏ, ప్రజాః = ప్రజలుగలరో, వారిలో, అహం=నేను, వత్సః=బాలునివంటివాడను, దుష్ష్వప్నహా = సంసారరూప దుఃఖమును నశింపఁజేయునట్టి ఓపరమేశ్వరా! దురుష్వహా= దుస్సహమగు పుట్టుకను నశింపఁజేయుము, సోమ=ఓపరమేశ్వరా! యాః = ఏ, తే = నీయొక్క, ప్రాణాః = ప్రాణవృత్తులుగలవో, తాన్ = ఆ ప్రాణ వృత్తులను, జుహోమి=నీయందు హుతమొనర్చుచున్నాఁడను.

తా. పరబ్రహ్మతత్త్వము నన్నుఁగూర్చి పొందుఁగాక, పరమానంద మాధుర్యోపేత మగు వస్తువు నన్ను పొందుఁగాక, ఈ విషయమే మఱల స్పష్టీకరించి చెప్పబడుచున్నది, మధుర మగు బ్రహ్మమే నన్ను పొందుఁగాక, ఇతర క్షుద్రదేవతలు వలదని భావము, ఉమ యనఁగా బ్రహ్మవిద్య, అట్టియుమ గలవాఁడు సోముడు, అట్టి సోముఁడా! నీసంబంధులగు దేవమనుష్యాది ప్రజ

లలో నీసేవకుఁడ నగు నేను మాత్రము బాలకుఁడను, అనఁగా తల్లితండ్రులు పుత్త్రులందఱియందును సమానమయిన ప్రీతినిఁ కలిగియున్నను చిన్నవారు స్వసంరక్షణము చేసికొనఁ జాలరు కావున వారియందు ఇతరులయందుకంటె విశేష మగు దయను కలిగియుందురు, అట్లే నాయందు నీవు కరుణ కలిగియుండవలయునని భావము, సంసారరూపమగు దుస్స్వప్నమునకు ఘాతకుఁడవగు నోపరమేశ్వరా! దుస్సహమయిన ఈజన్మమరణాది రూప మగు సంసారమును నాశన మొనర్పుము, ఓపరమేశ్వరా! నాయొక్క (మనోవాగాదింద్రియములు) ప్రాణవృత్తులు నీచేతనిర్మింపఁబడినవి కావున భవదీయములే యగుచున్నవి కావున। ఇట్టి ప్రాణాదివృత్తులను నీయందే హుత మొనర్చుచున్నాఁడను, అనఁగా ంఇద్రియములను విషయములనుండి మరలింపఁజేసి నీయందే లగ్నమయిన మనస్సు గలవాఁడ నయ్యెదనని తాత్పర్యము.

మంత్రబ్రాహ్మణము

మం. ౨. త్రిసుపర్ణ మయాచితం బ్రాహ్మణాయ దదాత్ ।
బ్రహ్మహత్యాం వా ఏతే ఘ్నన్తి । యే బ్రాహ్మణా
స్త్రిసుపర్ణం పఠంతి । తే సోమం ప్రాప్నువంతి । ఆస
హస్రా త్పఙ్క్తిం పునంతి । ఓమ్ ।౪౬॥౩౮॥

టీక. త్రిసుపర్ణం=త్రిసుపర్ణమంత్రమును, అయాచితం = యాచింపఁబడకయే, బ్రాహ్మణాయ = బ్రాహ్మణుఁడయినవానికి, దద్యాత్ = ఇవ్వవలయును, యే = ఏ, బ్రాహ్మణాః = బ్రాహ్మణులు, త్రిసుపర్ణం = త్రిసుపర్ణమంత్రమును, పఠన్తి=పఠించుచున్నారో, ఏతే=ఈపఠించు వారలు, బ్రహ్మహత్యాం=బ్రహ్మహత్యాదోషమును, ఘ్నన్తివై = నాశనమొనర్చుచున్నారు

గదా, తే=వారు, సోమం=సోమయాగఫలమును, ప్రాప్నువన్తి = పొందుచున్నారు, ఆసహస్రాత్=వేయింటివఱకు, పఙ్క్తిం=పఙ్క్తిని, పునంతి = పవిత్రమైనదానినిగా చేయుచున్నారు, ఓం=ప్రణవప్రతిపాద్యదేవతయే త్రిసుపర్ణమంత్రమునకు దేవత.

తా. లోకమునందు సాధారణముగ విద్యను గాని మంత్రమునుగాని 'నాపృష్టః కస్య చి ద్బ్రూయాత్' 'అడుగబడక ఎవరికిని చెప్పవలదు' అను శాస్త్రానుసారము శుశ్రూషులై ఉపాసించుచు యాచించెడివానికి మాత్రమే ఉపదేశింపవలయును గాని అందఱకు ఉపదేశింపఁగూడదు, ఈ త్రిసుపర్ణమంత్రమును మాత్రము శిష్యుఁడగు బ్రాహ్మణుఁడు తన్ను యాచింపకపోయినను ఉపదేశము చేయవలయును, అటుల ఉపదేశింపఁబడిన బ్రాహ్మణుఁలు సర్వదా యీ త్రిసుపర్ణమంత్రమును పఠింపుచుండిరేని వారు బ్రహ్మహత్యాదోషమును కూడ నాశన మొనర్పఁగలరు, మఱియు సోమయాగమును చేయుటవలన ఎట్టి ఫలము లభించునో అట్టిఫలమును పొందగలరు, త్రిసుపర్ణమంత్రమును బ్రాహ్మణుఁడు బ్రాహ్మణపఙ్క్తియందు కూర్చుండి భుజించుచున్న యెడల అతనిపఙ్క్తియందు వేయిమంది శంకితదోషులుండి భుజించుచున్నను వారందఱి దోషములను పోఁగొట్టి పవిత్రులనుగాఁ జేయుసామర్థ్యము గలవాఁడగును, ప్రణవప్రతిపాద్యదేవతయే ఈ త్రిసుపర్ణమంత్రమునకుకూడ దేవత యని తాత్పర్యము.

౩౯. ఏకోనచత్వారింశోఽనువాకః.

మం. ౧. బ్రహ్మ మేధయా మధు మేధయా । బ్రహ్మ మేవ మధు మేధయా । అద్యా నో దేవ సవితః ప్రజావ

త్సావీ స్సౌభగమ్ । పరా దుష్ష్వప్నియగ్ం సువ ।
విశ్వాని దేవ సవిత ర్దురితాని పరా సువ । యద్భ
ద్రంత న్మ ఆసువ । మధు వాతా ఋతాయతే మధు
క్షరంతి సింధవః । మాధ్వీ ర్న స్సంత్వోషధీః । మధు
న క్త ముతోషసి మధుమ త్పార్థివగ్ం రజః । మధు
ద్యౌ రస్తు నః పితా । మధుమా న్నో వనస్పతి ర్మ
ధుమాగ్ం అస్తుసూర్యః । మాధ్వీ ర్గావో భవం
తు నః ॥

టీక. బ్రహ్మ = సర్వజగత్కారణమును, సర్వవేదాంతప్రతిపాద్యమును అగు బ్రహ్మము, మేధయా = గురూపదిష్ట మహావాక్యములను, తదర్థములను విచారించుచు నిర్ణీతార్థమును ధరించుట యనెడి ధారణాశక్తిచేత (పొందఁబడును), మధు = పరమానందమాధుర్యోపేతమగువస్తువు, మేధయా = ధారణాశక్తిచేత, (పొందఁబడును.) బ్రహ్మమేవ = బ్రహ్మమే అగు, మధు = పరమానంద మాధుర్యము గలవస్తువు, మేధయా = మేధాశక్తిచేత, (పొందఁబడును) సవితః = ప్రేరకుఁడవగు, దేవ = ఓదేవా! అద్య = నేటిదినమునందు, నః = మాకు, ప్రజావత్ = శిష్యప్రశిష్యసంతతిగల, సౌభగం = ఆచార్య రూపమగు భాగ్యమును, సావీః = ప్రేరేపింపుము, దుష్ష్వప్నియం = దుస్స్వప్నమువంటి ద్వైతభావమును, పరాసువ = నాశన మొనర్పుము, సవితః = ప్రేరకుఁడవగు, దేవ = ఓపరమేశ్వరా ! విశ్వాని = సమస్తములయిన, దురితాని = పాపములను, పరాసువ = తీసివేయుఁము, తత్=అ, భద్రం=మంగళకరమగు తత్త్వజ్ఞానమును, మే = నాకు, ఆసువ = సమగ్రముగా నొసంగుము,

ఋతాయతే = పరబ్రహ్మము నభిలషించు నాకొఱకు, వాతాః = వాయువులు, మధు = మాధుర్యముగా అనఁగా సుఖముగా, (వాంతు = వీచుఁగాక). సింధవః = నదులు, మధు = మాధుర్యమగు ఉదకమును అనఁగా ఆరోగ్యప్రదమగు జలమును, క్షరన్తు = సంపాదించుఁగాక, ఓషధీః = ఓషధులు, నః = మాకు, మాధ్వీః = మధువువలె హితకరములు, సంతు = అగుఁగాక, నక్తం = రాత్రియందును, ఉత = మఱియు, ఉషసి = ప్రాతఃకాలమునందును, మధు = అనుకూలమగు సుఖము, (మాకు కలుగుఁగాక) పార్థివం = భూసంబంధమగు, రజః = దుమ్మునైతము, మధుమత్ = మాధుర్యోపేత మగుఁగాక, నః = మాకు, పితా = తండ్రితో సమానమయిన, ద్యౌః = ఆకాశము, మధు=మాధుర్యమయినది, (అగుఁగాక) నః = మాకు, వనస్పతిః = వనస్పతులు, మధుమాన్ = మధురఫలసమన్వితములు, (అగుఁగాక) సూర్యః = సూర్యుఁడు, మధుమాన్ = మాధుర్యము గలవాఁడు (అగుఁగాక), నః = మాకు, గావః = గోవులు, మాధ్వీః = మధురమయిన క్షీరము నొసంగునవి, భవన్తు = అగుఁగాక.

తా. త్రిసుపర్ణముయొక్క మంత్రత్రయములో ఒకమంత్రము వెనుకటి యనువాకమునందు చెప్పఁబడియున్నది, ఈయనువాకమునందు రెండవ మంత్రము చెప్ప బడుచున్నది.—

సర్వజగత్కారణమును సకలవేదాంత ప్రతిపాద్యమును అగుబ్రహ్మము మేధచేతనే లభించును, మేధయనఁగా గురువులవా రుపదేశించిన మహావాక్యతదర్థవిచారమును ధరించునట్టిశక్తి, పరమానందమాధుర్యోపేత మగుశక్తి సైతము మేధచేతనే పొందఁబడును, బ్రహ్మమే అగుపరమానంద మాధుర్యశక్తియు మేధచేతనే లభించును. సర్వప్రేరకుఁడవగు ఓపరమేశ్వరా! నేను నీవు విద్యార్థులమగు మాయందు దయగలిగి శిష్యప్రశిష్యరూప ప్రజాయుక్తమగు ఆచార్యత్వరూప మహాభాగ్యమును మాకొసంగుము, దుష్టస్వప్నసదృశమగు ద్వైతభ్రమను తీసివేయుము, ఓ పరమేశ్వరా! జ్ఞానప్రతిబంధ

కములగు మదీయములయిన సమస్తపాపములను నాశన మొనర్పుము, మంగళమును-అనఁగా అసంభావనావిపరీత భావనలు లేనితత్త్వజ్ఞానమును ఉపాసకుఁడ నగు నాకు బాగుగా కలుగఁజేయుము, పరబ్రహ్మము నెఱుంగ నిచ్ఛగల నాకు వాయువులు మాధుర్యముగా వీచుఁగాక, అనఁగా వాయువు ప్రబలముగా వీచునెడల రోగములు పుట్టును, రోగము సంభవించునెడల తత్త్వజ్ఞానమునకు విఘ్నము కలుగును కావున అట్టి ప్రతిబంధకము లేకపోవుటకుగాను ఇచట వాయుప్రార్థన మొనర్పఁబడినది. ఇట్లే నద్యాదిప్రార్థనమును గుఱించి తెలిసికొనవలయును, నదులు ఆరోగ్యము నొసంగునట్టి ఉదకము నొసఁగుఁగాక, వ్రీహియవాదికమగు ఓషధిసమూహము మాకు హితకరమయినది అగుఁగాక, రాత్రియందును పగటియందును విద్యార్థినగు నాకు సుఖమగుఁగాక, అనఁగా కాలకృతమగు విఘ్నము లేక పోవుఁగాక, భూమియందుండు పరాగము సైతము మాధుర్యమైనది, అనఁగా ముండ్లు రాళ్లు మున్నగునవి లేక ·సుస్పర్శమై యుండుఁగాక, తండ్రివంటి ఆకాశము అతివృష్టి అనావృష్టి మున్నగు ప్రాతికూల్యముల నాచరింపక సుఖము నొసంగుఁగాక, "ద్యౌః పితా, పృథివీ మాతా" అనుమంత్రముచేత ద్యుదేవతకు పితృత్వము చెప్పఁబడి యున్నది, వనస్పతులనఁగా చూతపనసాశ్వత్థాది ఫలవృక్షములు (పువ్వులులేకయే ఫలించు వృక్షములు వనస్పతులనంబడును), మాధుర్య సమన్వితఫలములు కలిగి జీవనహేతుభూతము లగుఁగాక, సూర్యుఁడును తీక్ష్ణముగా సంతాపమొనర్పక అనుకూలముగా ఎండను కాయుచు మాకు సుఖకరుఁ డగుఁగాక, గోవులు జీవనహేతు భూత క్షీరము నొసంగుఁగాక.

మం. ౨. య ఇమం త్రిసుపర్ణ మయాచితం బ్రాహ్మణాయ ద
ద్యాత్ । భ్రూణహత్యాం వా ఏతే ఘ్నన్తి । యే
బ్రాహ్మణా స్త్రిసుపర్ణం పఠన్తి । తే సోమం ప్రాప్ను

వంతి । ఆసహస్రాత్పఙ్క్తిం పునంతి । ఓమ్ ।౫౭॥ ౩౯॥

టీక. యః = ఎవ్వఁడు ఆచార్యుఁడో, (సః=అతఁడు) ఇమం = ఈ, త్రిసుపర్ణం = త్రిసుపర్ణమంత్రమును, అయాచితం = యాచింపఁబడకయే, దద్యాత్=ఇవ్వవలయును, యే = ఏ, బ్రాహ్మణాః=బ్రాహ్మణులు, త్రిసుపర్ణం = త్రిసుపర్ణమంత్రమును, పఠన్తి = పఠించుచున్నారో, ఏతే = వీరు, భ్రూణహత్యాం = భ్రూణహత్యను, ఘ్నంతివై = పోఁగొట్టుచున్నారుగదా, తే = వారలు, సోమం = సోమయాగఫలమును, ప్రాప్నువన్తి = పొందుచున్నారు, ఆసహస్రాత్ = వేయింటివఱకు, పఙ్క్తిం = పఙ్క్తిని, పునంతి = పవిత్రముగా చేయుచున్నారు, ఓం=ప్రణవప్రతిపాద్యుఁడగు పరమాత్మయే త్రిసుపర్ణ మంత్రమునకు దేవత.

తా. ఆచార్యుఁ డగువాఁడు బ్రాహ్మణుఁ డగు శిష్యునకు అతఁడు యాచింపకపోయినను త్రిసుపర్ణమంత్రము నుపదేశింపవలయును. త్రిసుపర్ణ మంత్రమును సర్వదాజపించువారలు భ్రూణహత్యాదోషమును సైతము పోఁగొట్టుకొనఁగలరు, సోమయాగఫలమును పొందఁగలరు, అతఁ డేపఙ్క్తి యందు గూర్చుండి భుజించునో ఆపఙ్క్తియందు కూర్చున్న వేయుమందిని కూడా అతఁడు పవిత్రులనుగాఁ జేయఁగలఁడు, త్రిసుపర్ణమంత్రమునకు దేవత ప్రణవప్రతిపాద్యుఁ డగు పరమాత్మయే యని గ్రహింపవలయును, భ్రూణ మనఁగా రాజగర్భము, లేక బ్రాహ్మణగర్భము, దానిని చంపుట భ్రూణహత్య యనంబడును.

---

౪౦. చత్వారింశో௨నువాకః.

మం. ౧. బ్రహ్మ మేధవా । మధు మేధవా ।
బ్రహ్మమేవ మధు మేధవా ।

బ్ర॒హ్మా దే॒వానా᳚ం ప॒ద॒వీః క॑వీ॒నా

మృషి॑ర్విప్రా॒ణాం మ॑హి॒షో మృ॒గాణా᳚మ్ ।

శ్యే॒నో గృధ్రా॑ణా॒గ్ం స్వధి॑తి॒ర్వనా᳚నా॒గ్ం

సో॑మః ప॒విత్ర॒ మత్యే॑తి॒ రేభన్ ॥

టీక. బ్రహ్మ=బ్రహ్మము, మేధవా = యజ్ఞముగలది, మధు = పరమానంద మాధుర్యోపేతమగువస్తువు, మేధవా = యజ్ఞముగలది, బ్రహ్మమేవ = బ్రహ్మస్వరూపమగు, మధు = పరమానందమాధుర్యోపేతమగు వస్తువే, మేధవా = యజ్ఞముగలది, (పరబ్రహ్మము) దేవానాం = దేవతలలోపల, బ్రహ్మా = చతుర్ముఖబ్రహ్మ యగుచున్నాఁడు, కవీనాం = కావ్యనాటకాది ప్రబంధకర్తలగు కవులలోపల, పదవీః = వ్యాసవాల్మీకాదికవి స్వరూపుఁడై, యున్నాఁడు, విప్రాణాం = వైదికమార్గప్రవర్తకులగు బ్రాహ్మణులలోపల, ఋషిః=వసిష్ఠాదిగోత్రప్రవర్తక మహర్షి స్వరూపుఁడైయున్నాఁడు, మృగాణాం=మృగములలోపల, మహిషః = మహిషమైయున్నాఁడు, గృధ్రాణాం = పక్షులలోపల, శ్యేనః=డేగయైయున్నాఁడు. వనానాం = వనములయొక్క ఛేదనార్థము, స్వధితిః=పరశువు అయెను, సోమః = సోమలతాత్మకుఁడై, రేభన్ = మంత్రశబ్దయుక్తుఁడగుచు, పవిత్రం=శుద్ధికారణ మగు గంగాది పవిత్రజలమును, అత్యేతి = అతిక్రమించుచున్నాఁడు.

తా. పరబ్రహ్మము దేవతలోపల చతుర్ముఖబ్రహ్మయై దేవతలకు నియామకుఁడై యున్నాఁడు, కావ్యనాటకాది ప్రబంధనిర్మాత లగు మహాకవులలో వ్యాసవాల్మీకాది మహాకవివర్యుఁడై వెలయుచున్నాఁడు, వేద మార్గానుసారముగ చరించునట్టి బ్రాహ్మణులలో గోత్రప్రవర్తకు లగు కశ్యప వసిష్ఠాదిమహర్షుల రూపమున వెలయుచున్నాఁడు, పక్షులలోపల డేగయై

యున్నాఁడు, వనములను ఛేదించుటకు పరశువైయున్నాఁడు, సోమయాగము నందు సోమవల్లీరసస్వరూపుఁడై మంత్రశబ్దయుక్తుఁడగుచు పవిత్రతమములని పేరుబడిన గంగానది పుణ్యనదీజలముల సైకము పరిశుద్ధత్వముచేత అతిక్రమించుచున్నాఁడని తాత్పర్యము.

మం. హగ్ంసశ్శుచిషద్వసురన్తరిక్షస
ద్ధోతా వేదిషదతిథిర్దురోణసత్ ।
నృషద్వరసదృతసద్వ్యోమసదబ్జా
గోజా ఋతజా అద్రిజా ఋతంబృహత్ ॥

టీక. హంసః = ఆదిత్యుఁడు, శుచిషత్ = శుద్ధమగు జ్యోతిర్మండలమునందుండువాఁడు, వసుః=సూత్రాత్మరూపము గలవాఁడై, అంతరిక్షసత్ = అంతరిక్షమునం దుండువాఁడు, హోతా = హోమనిష్పాదకము లగు ఆహవనీయాద్యగ్నిస్వరూపము గలవాఁడు, వేదిషత్ = వేదియందుండువాఁడు, అతిథిః=అతిథిరూపమున, దురోణసత్ = (ఇతరుల) గృహమునందుండువాఁడు, నృషత్ = (కర్మాధికారులగు) మనుష్యులందు జీవరూపమున నుండువాఁడు, వరసత్ = శ్రేష్ఠములగు కాశీ, ద్వారవతీ మున్నగుపుణ్యనగరములందు నివసించువాఁడు, ఋతసత్ = సత్యములగు వైదికకర్మలందు ఫలరూపమున నుండువాఁడు, వ్యోమసత్ = ఆకాశమునందు నక్షత్రాదిరూపమున నుండువాఁడు, అబ్జాః=ఉదకములందు (శంఖ మకరాదిరూపమున) పుట్టువాఁడు గోజాః = గోవులవల్లనుండి క్షీరాదిరూపమున పుట్టినవాఁడు, ఋతజాః = సత్యవచనము నుండి గీర్తిరూపమున పుట్టినవాఁడు, అద్రిజాః = కొండలవల్లనుండి (వృక్షాది రూపమున) పుట్టినవాఁడు, ఋతం = వెనుక చెప్పఁబడిన సత్యము జగజ్జాతమంతయు, బృహత్ = బ్రహ్మమే.

తా. అజ్ఞానదృష్టిచేత జగత్తుగా గనంబడునది అంతయు జ్ఞానదృష్టి చేత బ్రహ్మమే యని చెప్పుచున్నాఁడు:— ఈ ఆదిత్యరూపుఁడగు పర బ్రహ్మమే జ్యోతిర్మయ మగు మండలమునందున్నాఁడు, సూత్రాత్మరూప మున జగమునందు నివసించువాఁడును, వాయురూపమున అంతరిక్షమున నుండువాఁడును, హోమనిష్పాదక మగు ఆహవనీయాద్యగ్నియొక్క రూపము గలవాఁడును, యజ్ఞయాగాదులందు అగ్నులయొక్క మధ్యభాగమునందు వేయఁబడు వేదియందుండువాఁడును, అతిథిరూపుఁడై ఇతరులయొక్క గృహమునం దుండువాఁడును, మనుష్యులందు కర్మాదికారి జీవరూపమున నుండువాఁడును, పవిత్రతమపుణ్యక్షేత్రములగు కాశి, అయోధ్య, గయ మున్నగు నగరములందు పూజనీయాకారములతో నుండువాఁడును, సత్యమగు వైదికకర్మయందు ఫలరూపమున నుండువాఁడును, ఆకాశమునందు నక్షత్రాది రూపమున నుండువాఁడును, నదీసముద్రాదిగతజలములందు శంఖ మకరాది రూపమున జనించువాఁడును, గోవులయందు క్షీరాదిరూపమునజనించువాఁడును, సత్యసంభాషణమువల్లనుండి కీర్తిరూపమున పుట్టువాఁడును, పర్వతములవల్ల నుండి వృక్షాదిరూపమున పుట్టువాఁడును అయియున్నాఁడు, వెనుక చెప్పఁ బడిన 'హంసః, శుచిషత్' మొదలుకొని యింతవఱకు జగత్స్వరూపముచెప్పఁ బడినది, ఇయ్యది అజ్ఞానదృష్టిచేత జగత్తుగాఁ గనంబడుచున్నది కాని జ్ఞాన దృష్టిచేత మాత్రము అంతయు బ్రహ్మస్వరూపమే యని తాత్పర్యము.

అతిథిశబ్దవ్యుత్పత్తి:—'అమావాస్యాది తిథివిశేష మనపేక్ష్య భోజన యాచ్ఞార్థం తత్ర తత్ర గచ్ఛన్ పురుషః వైదేశికః అతిథిః' అమావాస్య మున్నగు తిథివిశేషములు లేకయే భోజనార్థము ఇతరుని గృహమునకు పోయి యాచించునతఁడు అతిథియని చెప్పఁబడుచున్నాఁడు, ఇతఁడు వైదే శికుఁడై యున్ననే అతిథి యని చెప్పఁబడును.

మం. ౨. ఋచే త్వా రుచే త్వా సమిత్స్రవన్తి సరితో న ధేనాః । అన్తర్ హృదా మనసా పూయమానాః । ఘృతస్య ధారా అభి చాకశీమి.

టీ. ఓ పరమేశ్వరా! ఋచే=ఋగ్వేదరూపుఁడవగు, నీకు, సమిత్ = ఈసమిధ, (అగ్నియందు హుతమొనర్పఁబడినది,) రుచే = వేదప్రాప్తికొఱకు, త్వా=నిన్నుగూర్చి, ధేనాః = దేవతలచేత పానముచేయఁబడుచున్నట్టియుం, అంతఃహృదా=హృత్కోశమధ్యమునందున్న, మనసా = మనస్సుచేత, పూయమానాః=పవిత్రములయినవిగా చేయఁబడినట్టియు, ఘృతస్య = (అగ్నియందు హుత మొనర్పఁబడిన) ఆజ్యముయొక్క, ధారాః=ధారలు, సరితఃన = నదుల వలె, ప్రవంతి = కాఱుచున్నవి, అభిచాకశీమి = అట్టి యాజ్యధారలను అందఱకు ఇవ్వఁగలను.

తా. త్రిసుపర్ణశబ్దవ్యుత్పత్తిః— త్రయః సుపర్ణాః పక్షిస్థానీయాః బ్రహ్మవిష్ణుమహేశ్వరాః, విశ్వ తైజస ప్రాజ్ఞాః వా విరాట్ హిరణ్యగర్భేశ్వరా వా యస్మాత్ ఉత్పన్నాః సః త్రిసుపర్ణః. (అర్థ. సుపర్ణులనఁగా పక్షిస్థానీయు లగు బ్రహ్మవిష్ణుమహేశ్వరులుగాని, లేక విశ్వతైజసప్రాజ్ఞులు, లేక విరాట్, హిరణ్యగర్భుఁడు, ఈశ్వరుఁడు ఎవనివల్లనుండి పుట్టిరో అతఁడు త్రిసుపర్ణుఁడు, అనఁగా సర్వదేవతాస్వరూపియనిభావము, అట్టి పరమాత్మ యొక్క మహిమను ప్రకటించు గ్రంథము సైతము త్రిసుపర్ణ మనఁబడును.) ఓపరమేశ్వరా! ఋగ్వేదస్వరూపుఁడవగు నీకొఱకు ఈసమిత్తు అగ్నియందుం చఁబడినది, వేదప్రాప్తికొఱకు, నిన్నుగూర్చి (ఇటుల పలుకు చున్నాఁడను) మఱియు నేను నిన్నుద్దేశించి దేవతలచేత పానము చేయఁబడుచున్నవియు, మనఃపూర్వకముగా హుతమొనర్పుటచేత పవిత్రములయినవియు నగు ఘృత

ధారలను నదులనువలె ప్రవింపఁజేయుచున్నాఁడను, కావున ఇట్టి ఆజ్యధార లను సకలదేవతలను గూర్చియు ఒసంగుచున్నాఁడ నని తాత్పర్యము, 'మనః పూర్వకముగా హోమమొనర్చిననే పవిత్ర మగును గాని లేనియెడలహోమము అపవిత్ర మగు' నని చెప్పుటకుగాను 'అంతర్హృదా మనసా పూయమానాః' అని చెప్పఁబడియున్నది.

మం.3. హిరణ్యయో వేతసో మధ్య ఆసామ్ । తస్మి న్త్సుప
ర్ణో మధుకృ త్కులాయీ భజ న్నాస్తే మధు దేవ
తాభ్యః । తస్యా ఽఽసతే హరయ స్సప్తతీరే । స్వ
ధాం దుహానా అమృతస్య ధారామ్ ॥

టీక. ఆసాం = పూర్వోక్తములగు ఆజ్యధారలయొక్క, మధ్యే = మధ్యభాగమునందు, తస్మిన్ = ఆయాహవనీయాగ్నియందు, హిరణ్యయః = జ్యోతిర్మయుఁడును, వేతసః = అధిక ధనముగలవాఁడును, మధుకృత్ = సుఖకరుఁడును, కులాయీ = సకలప్రాణిదేహాశ్రయుఁడును, అగు, త్రిసువర్ణః = త్రిసుపర్ణమంత్రప్రతిపాద్యుఁడగు పురుషుఁడు, ఆస్తే = ఉన్నాఁడు, తస్య = ఆపరమాత్మయొక్క, తీరే = సమీపమునందు, హరయః = తమ్ముస్మరించెడివారి యొక్క పాపములను పోఁగొట్టునట్టి సప్త = సప్తమహర్షులు, అమృతస్య = అమృతముయొక్క, ధారాం = ధారయగు, స్వధాం = హవ్యకవ్యద్రవ్యము లను, దుహానాః = ఆయాదేవతల కొసంగుచున్నవారలయి, ఆసతే = ఉంటున్నారు.

తా. వెనుకటి మంత్రమునందు హృదయపూర్వకముగ ఆజ్యాహుతు లను పరమేశ్వరుని గూర్చి వ్రేల్చుచున్నాఁడని చెప్పఁబడియున్నది, అట్టి ఆజ్యాహుతులు మధ్యభాగమునఁగల ఆహవనీయాగ్నియందు జ్యోతిర్మయుఁ డును అధికధనము గలవాఁడును కర్మానుసారము ప్రాణులకు సుఖఫలప్రదాతయు,

రగు, సకలప్రాణిదేహములందు నివసించువాఁడును అగు పరమేశ్వరుఁడు ఆయాదేవతలకు మధుర మగు హవిస్సును విభజించి యిచ్చుచు ఉంటు న్నాఁడు, ఆపరమాత్మయొక్క సమీపమునందు నలువైపుల స్మరించువారి పాపములను నాశన మొనర్చువారును, అమృతధారతో సమానములగు హవ్యకవ్యములను ఆయాదేవతలకు ఇప్పింపఁజేయుచున్నట్టి సప్తర్షులయొక్క మండలము గలదు. అనఁగా ఇట్టి సప్తర్షి మండల మధ్యభాగమునందు పరమాత్మ ప్రకాశించుచున్నాఁడని తాత్పర్యము.

మం. ౪. య ఇదం త్రిసుపర్ణ మయాచితం బ్రాహ్మణాయ దద్యాత్ । వీరహత్యాం వా ఏతే ఘ్నన్తి యే బ్రాహ్మణా స్త్రిసుపర్ణం పఠన్తి । తే సోమం ప్రాప్నువన్తి । ఆసహస్రాత్పఙ్క్తిం పునన్తి । ఓమ్ ॥ ౫౫।౪౦.

టీక. యః=ఎవఁడు ఆచార్యుఁడో, (సః=అతఁడు) ఇదం=ఈ, త్రిసుపర్ణం=త్రిసుపర్ణమంత్రమును,అయాచితం=యాచింపఁబడకయే, బ్రాహ్మణాయ= బ్రాహ్మణునికొఱకు, దద్యాత్=ఇవ్వవలయును, యేబ్రాహ్మణాః=యేబ్రాహ్మణులు, త్రిసుపర్ణం+పఠన్తి=త్రిసుపర్ణమంత్రమును పఠించుచున్నారో, ఏతే = వీరలు వీరహత్యాం=వీరహత్యాదోషమును, ఘ్నన్తివై = పోఁగొట్టుచున్నారు గదా, తే=వారలు, సోమం = సోమయాగఫలమును, ప్రాప్నువంతి = పొందుచున్నారు, ఆసహస్రాత్ = వేయింటివఱకు, పఙ్క్తి = పఙ్క్తిని, పునంతి = పవిత్రులనుగా నొనర్చుచున్నారు, ఓం=ప్రణవప్రతిపాద్యుఁడగు పరమేశ్వరుఁడే యీత్రిసుపర్ణమంత్రమునకుదేవత.

తా. ఈ త్రిసుపర్ణమంత్రమును శిష్యుఁడగు బ్రాహ్మణుఁడు తన్నుపదేశింపుమని యడుగక పోయినను వాని కుపదేశింపవలయును, ఈ త్రిసుపర్ణ

మంత్రమును సర్వదా జపించుటవలన వీరహత్యాదోషమును సైతము పోఁగొట్టుకొనును, పంక్తియందు దోషులు వేయుమంది యున్నను వారి పాపములను కూడ పోఁగొట్టి వారలను పవిత్రులనుగా నొనర్చును, ప్రణవప్రతిపాద్యుఁడగు పరమాత్మయే యీత్రిసుపర్ణమంత్రమునకు దేవత, వీరహత్య యనఁగా వేదశాస్త్రములను పఠించి తత్క్రియల ననుష్ఠించు బ్రాహ్మణుఁడు, లేక పట్టాభిషిక్తుఁడగు భూపాలుఁడు వీరుఁ డనంబడును, అట్టివానిని వధించుట వీరహత్య యగును.

---

౪౧. ఏకచత్వారింశోఽనువాకః.

అవ. బ్రహ్మజ్ఞానప్రతిబంధకము లగు మహాపాతకముల నివృత్తికొఱకు జపింపవలసిన త్రిసుపర్ణమంత్రములు వెనుకటి యనువాకమునందు చెప్పఁబడినవి. పంచమహాపాతకములలో బ్రహ్మహత్య యను పాతకము ప్రబలమయినది. అంతకంటె ప్రబలమయినది భ్రూణహత్య. అంతకంటె ప్రబలమయినది వీరహత్య. యావజ్జీవము ఈ త్రిసుపర్ణమంత్రమును జపించుచుండినయెడల ఇట్టి ఘోరపాతకములు సైతము నశించును ఇఁక ఉపపాతకములు పోవునను విషయము ప్రత్యేకముగా చెప్ప నక్కఱ లేదుగదా. ఈవిధముగా ప్రతిబంధనివర్తకోపాయమును చెప్పిన పిదప జీవాత్మకు ఈశ్వరాభేద జ్ఞానమును ఎడతెగక స్మరించునట్టి జ్ఞానము మేధాధీనము కావున మేధాభిమాని దేవతాప్రార్థనము చెప్పఁబడుచున్నది:—

మ. ౧. మేధా దేవీ జుషమాణా న ఆగా

ద్విశ్వాచీ భద్రా సుమనస్యమానా ।

త్వయా జుష్టా నుదమానా దురుక్తా

న్బృహ ద్వదేమ విదథేసువీరాః ॥

టీక. విశ్వాచీ=సర్వావగాహనక్షమయు, (కావుననే) భద్రా=కల్యాణదాయినియు, సుమనస్యమానా = మంచి మనస్సు గలదియు అగు, మేధా దేవీ = మేధాదేవి, జుషమాణా=ప్రీతిగలదై, నః=మమ్ములను గూర్చి, ఆగాత్ = వచ్చుఁగాక, (ఓ మేధాదేవీ!) మేము నీచేత అనుగ్రహింపఁబడిన వారలమై, దురుక్తాన్ = వేదబాహ్యములగు శబ్దములను. నుదమానాః=తీసివేయుచున్న వారలమయి, సువీరాః=మంచిపుత్రులు శిష్యులు మున్నగువారలు గలవారలమై, విదథే=యజ్ఞ మనుష్ఠింపఁబడిన దగుచుండఁగా (శుద్ధాంతఃకరణము గలవారలమయి), బృహత్=బ్రహ్మతత్త్వమును, వదేమ = చెప్పెదము.

తా. మేధ యనఁగా గ్రంథమునందుఁ గల విషయమును గ్రహించి ఆ గ్రహించిన విషయమును మరువకుండా ఉండునటుల ధారణముచేసికొనునట్టి శక్తి, అట్టి మేధాదేవి ప్రీతిగలదై మాసమీపమునకు వచ్చుఁగాక, ఆమేధా దేవత ఎట్టిదనఁగా సకలమును గ్రహించునట్టి సామర్థ్యము గలది, మఱియు కల్యాణరూపమైనది, మాయం దనుగ్రహబుద్ధి గలది, ఓమేధాదేవీ! నీ చేత మేము అనుగ్రహింపఁబడిన వారలమయి వేదబాహ్యము లయినట్టియు, నిరుపయోగము లయినట్టియు, శబ్దములను త్రోసిపుచ్చుచు వేదైకనిష్ఠులమై పుత్రపౌత్రాది సమన్వితులమయి యజ్ఞముల ననుష్ఠించి చిత్తశుద్ధి గలవారలమై పరబ్రహ్మతత్త్వమును చెప్పఁగలము.

మం. ౨. త్వయా జుష్ట ఋషి ర్భవతి దేవి
త్వయా బ్రహ్మాఽఽగతశ్రీ రుత త్వయా ।
త్వయా జుష్ట శ్చిత్రం విన్దతే వసు
సా నో జుషస్వ ద్రవిణో న మేధే ॥౫౯ ౪౧

టీక. మేధే దేవి=ఓ మేధాదేవీ! త్వయా=నీచేత, జుష్టః = అనుగ్రహింపఁ బడినవాఁడు, ఋషిః=అతీంద్రియదర్శి, భవతి=అగుచున్నాఁడు, త్వయా=నీచేత, జుష్టః=అనుగ్రహింపఁ బడినవాఁడు, బ్రహ్మా=హిరణ్యగర్భుఁ డగుచున్నాఁడు, ఉత = మఱియు, త్వయా = నీచేత సేవింపఁబడినవాఁడు, ఆగతశ్రీః = ప్రాప్తమయిన సంపదగలవాఁ డగుచున్నాఁడు, కావున నే, త్వయా=నీచేత, జుష్టః = అనుగ్రహింపఁబడినవాఁడు, చిత్రం=వివిధమయిన, వసు=ధనమును, విందతే = పొందుచున్నాఁడు, మేధే=ఓ మేధాదేవీ! సా= అట్టి (నీవు), నః = మమ్ములను, ద్రవిణః న = ధనపతియగు కుబేరునివలె, జుషస్వ=అనుగ్రహింపుము.

తా. ఓ మేధాదేవీ! నీచేత అనుగ్రహింపఁబడినవాఁడు ఋషి యగుచున్నాఁడు, ఋషి యనఁగా అతీంద్రియార్థద్రష్ట, నీచేత అనుగ్రహింపఁ బడినవాఁడు హిరణ్యగర్భుఁ డగుచున్నాఁడు, మఱియు సంపదలను పొందుచున్నాఁడు, కనుకనే ఆవులు, గుఱ్ఱములు, ధనము, ధాన్యము మున్నగు వివిధమయిన ధనమును పొందుచున్నాఁడు; ఓ మేధాదేవీ! కావున అట్టి నీవు ధనపతి యగు కుబేరునివలె మాయందు అనుగ్రహముగలవాఁడవు కమ్ము, కుబేరునిచేత అనుగ్రహింపఁబడినవాఁడు దరిద్రుఁడైనను ధనవంతుఁ డెట్లగుచున్నాఁడో అట్లే నీచేత అనుగ్రహింపఁ బడిన నేనుకూడ నయ్యెదనని

భావము, మూలమునందు గల ద్రవిణశబ్దము తత్పతి యగు కుబేరుని స్ఫురింపఁ జేయుచున్నది.

---

౪౨. ద్విచత్వారింశోఽనువాకః.

అవ. మేధ నిచ్చునట్టి ఇంద్రాదిదేవతలయొక్క ప్రార్థనా రూప మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం.౧. మేధాం మ ఇన్ద్రో దదాతు మేధాం దేవీ సరస్వతీ
మేధాం మే అశ్వినా వుభా వాధత్తాం పుష్కరస్రజా।

టీక. మే=నాకు, మేధాం=మేధను, ఇంద్రః=ఇంద్రుఁడు, దదాతు= ఇచ్చుఁగాక, సరస్వతీదేవీ=సరస్వతీదేవి, మేధాం = మేధను (ఇచ్చుఁగాక), పుష్కరస్రజా = పద్మమాలలుగల, ఉభౌ అశ్వినా = అశ్వినీదేవత లిద్దఱు, మే=నాకు, మేధాం=మేధను (దదాతు=ఇచ్చెదరుగాక).

తా. ఇంద్రుఁడు, సరస్వతీదేవియు, పద్మమాలాలంకృతులగు అశ్వినీ దేవత లిద్దఱును నాకు మేధను కలుగఁజేయుందురు గాక.

మం. ౨. అప్సరాసు చ యా మేధా గన్ధర్వేషు చ యన్మనః।
దైవీం మేధా సరస్వతీ సా మాం మేధా సురభిర్జు
షతాగ్ం స్వాహా ।౬౦।౪౨।

టీక. అప్సరాసు = అప్సరస్త్రీలయందు, యా = ఏ, మేధా=మేధ గలదో, గంధర్వేషు చ = దేవగాయకులందు, యత్ మనః = మేధాత్మక మగు ఏమనస్సుగలదో, దైవీం = హిరణ్యగర్భాది దేవతాసంబంధమయిన,

మేధా=ఏ మేధగలదో, సరస్వతీ = దేవశాస్త్రరూపమయిన ఏ మేధ గలదో, సా=ఆ, మేధా = మేధ, సురభిః = మంచిగంధముగలదై, లేక సకలాభీష్ట ప్రదయై, మాం=నన్ను, జుషతాం=పొందుఁగాక.

తా. అప్సరసలను దేవతాస్త్రీలయందు ఏసుప్రసిద్ధమయిన మేధ గలదో, దేవగాయకు లగు గంధర్వులందు ఎట్టి మేధ గలదో, హిరణ్యగర్భాది దేవతలం దెట్టి మేధగలదో, వేదశాస్త్రరూప మగు ఏ మేధ గలదో అట్టి మేధ సుగంధముగలదై, లేక అభీష్టప్రదయై నన్ను సేవించుఁగాక.

---

४३. త్రిచత్వారింశోఽనువాకః.

అవ. మఱల మేధాప్రద మగు మంత్రము చెప్పఁ బడు చున్నది:—

మ. ఆ మాం మేధా సురభి ర్విశ్వరూపా
హిరణ్యవర్ణా జగతీ జగమ్యా ।
ఊర్జస్వతీ పయసా పిన్వమానా
సా మాం మేధా సుప్రతీకా జుషన్తామ్॥ ౧॥ ४३॥

టీక. మేధా=మేధాదేవి, సురభిః = అభీష్టప్రదయై, విశ్వరూపా= బహురూపములుగలదియై, హిరణ్యవర్ణా=దేవతాశరీరమునందు సువర్ణమయాకారముగలదియై, జగతీ=జగదాత్మికయై, జగమ్యా = పురుషార్థకాములచేత అవశ్యముపొందఁదగినదియై, మాం=నన్నుగూర్చి, ఆ (గచ్ఛతు) = వచ్చుఁగాక, ఊర్జస్వతీ=బలవతియై, పయసా=గోక్షీరాదిరసముచేత, పిన్వమానా=

మమ్ములను సంతోషపెట్టునదియైన, సా = అట్టి, మేధా = మేధాదేవత, సుప్రతీకా = సుఖముగలదై, జుషన్తాం = సేవించుగాక.

తా. మేధాశక్తి నన్ను పొందుగాక, మేధాశక్తి యెట్టిదనగా:— శోభనగంధము గలది, లేక సకలాభీష్టముల నొసంగునది, మఱియు సకల శాస్త్రములను ధరించు సామర్థ్యము గలది యగుటచేత విశ్వరూప యని చెప్పబడునది, మఱియు దేవతా శరీరమునందు సువర్ణమయదేహముగలది, అంతటనుండునది కావున జగదాత్మకమయినది, మఱియు పురుషార్థకాములగువారలచేత పొందదగినది, బలవతి యయినది, గోక్షీరాదిరసముచేత మమ్ములను సంతుష్టులను చేయుచున్నది, ఇట్టి గుణగణవిశేషము గల మేధ సుఖము గలదై నన్ను సేవించు గాక.

---

४४. చతుశ్చత్వారింశో ऽనువాకః.

మం. మయి మేధాం మయి ప్రజాం మయ్యగ్నిస్తేజో దధా
తు మయి మేధాం మయి ప్రజాం మయీన్ద్ర ఇన్ద్రియం
దధాతుమయి మేధాం మయి ప్రజాం మయి సూర్యో
భ్రాజో దధాతు । ౬౨॥४४

టీక. అగ్నిః = అగ్ని, మయి = నాయందు, మేధాం = వేదశాస్త్రాదిగ్రంథగ్రహణధారణపటుత్వమును, దధాతు = ఉంచుగాక, మయి = నాయందు, ప్రజాం = అవిచ్ఛిన్నమగు సంతతిని, దధాతు = ఉంచుగాక, మయి = నాయందు, తేజః = బ్రహ్మవర్చస్సును, దధాతు = ఉంచుగాక.

ఇంద్రః = ఇంద్రుఁడు, మయి = నాయందు, మేధాం = మేధను, దధాతు = ఉంచుఁగాక, మయి = నాయందు, ప్రజాం = అవిచ్ఛిన్నమగు సంతానమును, దధాతు = ఉంచుఁగాక, మయి=నాయందు, ఇంద్రియం = వీర్యపుష్టిని, దధాతు = ఉంచుఁగాక.

సూర్యః = సూర్యుఁడు, మయి = నాయందు, మేధాం = మేధను, దధాతు=కలుగఁజేయుఁగాక, మయి=నాయందు, ప్రజాం = అవిచ్ఛిన్నమగు సంతానమును, దధాతు = కలుగఁజేయుఁగాక, మయి=నాయందు, భ్రాజః= భ్రాజస్సును, దధాతు = కలుగఁజేయుఁగాక.

తా. మేధ యనఁగా వేదశాస్త్రాదిగ్రంథగ్రహణ ధారణాపటుత్వము, ప్రజ యనఁగా విచ్ఛిత్తిలేని సంతతి, తేజస్సనఁగా బ్రహ్మవర్చస్సు. వీనిని అగ్ని నాకు కలుగఁజేయుఁగాక, మేధను, ప్రజను, ధాతుక్షయాదిరోగములు లేని చక్కని వీర్యపుష్టిని ఇంద్రుఁడు నాకు కలుగఁజేయుఁగాక, మేధను, ప్రజను, భ్రాజస్సును సూర్యుఁడు నాకొసంగుఁగాక, భ్రాజస్సనఁగా దర్శన మాత్రముచేత శత్రువులు భయంపడునట్టి ముఖకాంతి, 'మయి, మేధాం, ప్రజాం, దధాతు' అనుపదములు మఱల మఱల ఆవృత్తిగా వచ్చుట ఆదరార్థమని గ్రహింపవలయును.

---

౪౫. పంచచత్వారింశోఽనువాకః.

అవ. పరమేశ్వరుని సమీపమునందు అభీష్టమును యాచించు మంత్రము:—

మం. అపైతు మృత్యు రమృతం న ఆగ
న్వైవస్వతో నో అభయం కృణోతు ।

పర్ణం వనస్పతే రివాభి న శ్శీయతాగ్ం
రయి స్సచతాం న శ్శచీపతిః ॥ ౯౩॥ ౪౫॥

టీక. (ఓపరమేశ్వరా!) మృత్యుః = మృత్యుదేవత, అపైతు=దూరముగా తొలఁగిపోవుఁగాక, (కావుననే,) అమృతం=మోక్షము, నః=మమ్ములను గూర్చి, ఆగన్=వచ్చుఁగాక, (కనుక) వైవస్వతః = యముఁడు, నః= మాకు, అభయం = అభయమును, కృణోతు=చేయుఁగాక, నః=మాయొక్క (పాపము) వనస్పతేః = వృక్షముయొక్క, పర్ణం న=పర్ణమువలె, అభిశీయతాం=అంతటపడి నశించుఁగాక, నః=మమ్ములను, శచీపతిః=ఇంద్రభోగ్యమగు, రయిః = మహైశ్వర్యము. సచతాం = పొందుఁగాక.

తా. ఓపరమేశ్వరా! మాకు మృత్యువు లేకపోవుఁగాక, మాకు మోక్షము కలుగుఁగాక, వైవస్వతుఁడు మాకు అభయము నొసంగుఁగాక, వృక్షములయొక్క పండుటాకులు అంతట రాలురీతిగా మాయొక్క పాపములు నశించి పోవుఁగాక, మాకు ఇంద్రభోగ్యములగు గొప్పగొప్ప యైశ్వర్యములు కలుగుఁగాక.

---

౪౬. షట్చత్వారింశోఽనువాకః.

మం. పరం మృత్యో అనుప రేహి పన్థాం
యస్తే స్వ ఇతరో దేవయానాత్ ।
చక్షుష్మతే శృణ్వతే తే బ్రవీమి
మా నః ప్రజాగ్ం రీరిషో మోత వీరాన్ ॥౯౪॥ ౪౬॥

టీక. మృత్యోః = ఓమృత్యుదేవతా! చక్షుష్మతే = నేత్రములు కలిగినట్టియు, శృణ్వతే = వినుచున్న, తే=నీకొఱకు, బ్రవీమి=చెప్పుచున్నాఁడను, దేవయానాత్ = దేవయాన (పితృయాన) మార్గము (ల) కంటె, యః=ఏ, ఇతరః=అన్యమైన, తే=నీయొక్క, స్వః=స్వభూతమగు (మార్గము గలదో). పంథాం = ఆమార్గమును, పరేహి=పొందుము, నః=మాయొక్క, ప్రజాం=సంతతిని, మారీరిషః = హింసింపకుము, ఉత=మఱియు, వీరాన్ = వీరులగుభృత్యులను, మా=హింసింపకుము.

తా. ఓమృత్యుదేవా! అర్చిరాది ధూమాది మార్గముకంటె భిన్నమగు ఏమార్గము గలదో నీ వామార్గమును అనుసరించుము, దేవయాన పితృయాన మార్గములచేత వలదు, నేను మాత్రము పైనచెప్పిన మార్గద్వయములలో నొకదానిచేత పోయెదను, నిన్ను చూడ జాలను, నీవు మాయొక్క ప్రజను వీరులయిన సేవకులను హింసింపకుము, నీవు అంధుఁడవును, చెవిటివాఁడవును గాక, చక్షుష్మంతుఁడవును శ్రోత్రవంతుఁడవును గావున నిన్ను ప్రార్థించునట్టి నన్ను (కృపతో) చూచి నాప్రార్థన నాలించి నాప్రార్థనమును సఫలమొనర్పు మని తాత్పర్యము.

---

౪౭. సప్తచత్వారింశోఽనువాకః.

మం. వాతం ప్రాణం మనసాఽన్వారభామహే
ప్రజాపతిం యో భువనస్య గోపాః।
స నో మృత్యో స్త్రాయతాం పాత్వగ్ంహసో
జ్యోగ్జీవా జరా మశీమహి ।౬౫॥౪౭॥

టీక. (వయం = మేము), ప్రాణం = సమస్తపిండాండమునందున్న ప్రాణాపానాదివాయురూపుఁడును, వాతం = అంతరిక్షమునందున్న వాయురూపుఁడును (అగు), యః=ఎవ్వఁడు, భువనస్య = బ్రహ్మాండముయొక్క, గోపాః=రక్షకుఁడో, (అట్టి) ప్రజాపతిం=పరమాత్మను, మనసా=మనస్సుచేత, అన్వారభామహే = అనుసరించుచున్నాము, సః=ఆప్రజాపతి, నః=మమ్ములను, మృత్యోః = మృత్యువువల్లనుండి, త్రాయతాం = రక్షించుఁగాక, అంహసః = పాపమువల్లనుండి, పాతు=రక్షించుఁగాక, జ్యోక్=చాలకాలము, జీవాః=జీవించుచున్నవారమై, జరాం = వార్ధక్యమును, అశీమహి = పొందెదముగాక.

తా. సమస్తపిండాండమునందు ప్రాణాపానాదిరూపమున నున్నవాఁడును, అంతరిక్షమునందు వాయురూపమున నున్నవాఁడును అగు పరమాత్మను మేము మనస్సుచేత అనుసరించెదము, అనఁగా మనఃపూర్వకముగా సేవించెదము, పరమాత్మ సమస్తపిండాండములను ప్రాణాపానాదికముచేతను, బ్రహ్మాండమును వాయువుచేతను ధరించి వానికి ధారకుఁడై యున్నాఁడని చెప్పఁబడెను, ఈప్రజాపతియే బ్రహ్మాండముయొక్క రక్షకుఁడు, అట్టి ప్రజాపతి మమ్ములను మృత్యువువల్లనుండియు పాపమువల్లనుండియు సంరక్షించుఁగాక, మఱియు చిరకాలము అనఁగా పురుషునకు సంపూర్ణాయువు ఎంతవఱకుఁ గలదో అంతకాలము జీవించుచున్నవారమై వార్ధక్యమును పొందెదముగాక.

---

౪౮. అష్టచత్వారింశోఽనువాకః

మం. అమూత్రభూయాదధ యద్యమస్య
బృహస్పతే అభిశస్తేరముంచః ।

ప్రత్యౌహతా మశ్వినా మృత్యు మస్మా
ద్దేవానా మగ్నే భిషజా శచీభిః ॥౯॥౪౮॥

టీక. బృహస్పతే = వేదవాక్కులకు ప్రభువగు ఓపరమాత్మా! యమస్య=యమునియొక్క, యత్ = ఏ (భయముగలదో దానివల్లనుండి నన్ను), అముంచః = వదలింపుము, అభిశస్తేః = అపకీర్తివల్లనుండి, అముంచః = (నన్ను) వదలింపుము, అథ=పిదప, అముత్ర=పరలోకసుఖము, భూయాత్ = నాకు అగుఁగాక, అశ్వినా = అశ్వినీదేవతలు, అస్మాత్ = నాసమీపమునుండి, మృత్యుం = మృత్యువును, ప్రతి+ఔహతాం = దూరముగా నొనర్తురుగాక, అగ్నే=ఓయగ్నీ! దేవానాం = దేవతలయొక్క, భిషజా=వైద్యుఁడవగు నీచేత (సంరక్షింపఁదగినవాఁడను), శచీభిః=ఇంద్రపత్నులచేతఁగూడ (సంరక్షింపఁదగినవాఁడను.)

తా. వేదవాక్యముల కధిపతివగు ఓపరమాత్మా! నాకు యమునియొక్క భయము లేకపోవునటుల చేయుము, అపకీర్తి యనునది నాకు కలుగకుండుఁగాక, ఈరెండును చేసి పిదప నాకు పరలోకసుఖము నొసఁగుము, దేవవైద్యులగు అశ్వినీదేవతలు మాదగ్గఱనుండి మృత్యువును తొలఁగింతురు గాక, ఓయగ్నీ! దేవతలకు వైద్యుఁడవగు నీవు నన్ను సంరక్షింపుము, శచీదేవియు నన్ను సంరక్షించుఁగాక.

---

౪౯. ఏకోనపంచాశోఽనువాకః.

మం. హరిగ్ం హరంత మను యంతి దేవా
విశ్వస్యేశానం వృషభం మతీనామ్ ।

బ్రహ్మ సరూప మను మేద మాగా
గయనం మావివధీర్విక్రమస్వ ౬౩ ।౪౯।

టీక. (ఓపరమాత్మా!) దేవాః=దేవతలందఱు, విశ్వస్య = ప్రపంచము నకు, ఈశానం = ప్రభువును, మతీనాం = ప్రాణిబుద్ధులకు, వృషభం = శ్రేష్ఠుఁడును, హరంతం = భక్తులయొక్క పాపములను హరించునట్టియు, హరిం=విష్ణురూపుఁడవగు నిన్ను, అనుయంతి=భృత్యభావముచేత అనుసరించెదరు గాక, సరూపం = సమానరూపముగలట్టియు, ఇదం=(ద్విజులగు బ్రహ్మక్షత్రియ వైశ్యజాతులవారిచేత ప్రత్యక్షముగా అధ్యయనము చేయఁబడుచున్నదియు అగు ఈ), బ్రహ్మ=వేదచతుష్టయము. మా=నన్ను, అన్వగాత్ = అనుసరించుఁ గాక, అయనం=మేము సంపాదించుకొనిన మోక్షమార్గమును, మావివధీః = హింసింపకుము, విక్రమస్వ=(ఇచ్చుటకు) ప్రయత్నపడుము.

తా. ఓ పరమాత్మా! భక్తపాపసంహారుఁడవై, ప్రపంచమున కధిపతివై సర్వప్రాణిబుద్ధులకు శ్రేష్ఠుఁడవు అనఁగా ప్రేరకుఁడవైన (పుణ్యాపుణ్యములను చేయించుచున్నాఁడవనుట, అట్టి) నిన్ను దేవత లందఱు భృత్యులయి కొలుచు చున్నారు, పరమాత్మ బుద్ధులను ప్రేరేపించుచున్నవాఁడనుటకు ప్రమాణము:— 'ధియోయోనః ప్రచోదయాత్' అను శ్రుతి; మఱియు ద్విజులచేత అధ్యయన మొనర్పఁబడుచున్న సరూప మగు వేదచతుష్టయము నన్ననుసరించుఁ గాక, సరూపమనఁగా, సమాని అపశబ్దాదివైషమ్యరహితాని రూపాణి ప్రకృతి ప్రత్యయాదీని యస్య తత్ సరూపమ్.

(అర్థము. అపశబ్దము మున్నగు వైషమ్యములు లేక సమమయిన ప్రకృతి ప్రత్యయములు గలది, సరూప మనఁబడును.) మఱియు మేము (చిత్తశుద్ధి కలిగి జ్ఞానముచేత) సంపాదించుకొనిన వేదమార్గమును హింసింప

కము, మాకు అట్టిమార్గమును ఇచ్చుటకు పరాక్రమింపుము, అనఁగా ప్రయత్నపడుమని తాత్పర్యము.

---

౫౦. పంచాశోఽనువాకః.

మం. శత్రైక్ష్ణ రగ్ని మిన్ధాన ఉభౌ ల్లోకౌ సనేమహమ్ । ఉభయో ర్లోకయోర్ బుద్ధ్వా ఽతి మృత్యుం తరామ్యహమ్ ।౬౮॥౫౦ ।

టీక. (ఓభగవంతా! నేను) శత్రైక్ష్ణః = సమిధలచేత, అగ్నిం = ఆహవనీయాదికమగు అగ్నిని, ఇంధానః = జ్వలింపఁజేయుచున్నవాఁడనై, ఉభౌ లోకౌ = ఇహపరలోకములను, సనేం = పొంచెదను, ఉభయోః లోకయోః = లోకద్వయమును, బుద్ధ్వా=పొంది, మృత్యుం=మృత్యువును, అహం=నేను అతితరామి = అతిక్రమించెదను.

తా. ఓపరమాత్మా! నేను సమిధలచేత ఆహవనీయ గార్హపత్యాద్యగ్నులను ప్రజ్వలింపఁజేయుచు అనఁగా యజ్ఞయాగాదికము నొనర్చుచు ఇహపరలోకములను పొంచెదను, అట్లు లోకద్వయము పొందినపిదప మృత్యువు నతిక్రమించెదను, అనఁగా ఆయు వున్నంతకాలము ఇహలోకసౌఖ్య మనుభవించి అంతమునందు దేవత్వమును పొంచెదను గాక అని భావము.

---

౫౧. ఏకపంచాశో౾నువాకః.

మం. మాచ్ఛిదో మృత్యో మావధీ ర్మా మే బలం వివృహో మా ప్రమోషీః । ప్రజాం మా మే రీరిష ఆయు రుగ్ర నృచక్షసం త్వా హవిషా విధేమ ।౬౯॥౫౧।

టీక. ఉగ్ర=క్రూరుఁడవగు, మృత్యో=ఓమృత్యువా! (నాయొక్క మంచిజ్ఞానమును) మాచ్ఛిదః = నాశనముచేయవలదు, (నాసత్కర్మానుష్ఠానమును) మావధీః = హింసింపకుము, మే=నాయొక్క, బలం=శరీరబలమును, మావివృహః = పీడింపకుము, (నాపరలోకసాధనమును) మాప్రమోషీః = హరింపకుము, మే=నాయొక్క, ప్రజాం = ప్రజను, ఆయుః=ఆయువును, మారీరిషః = హింసింపకుము, నృచక్షసం = పుణ్యపాపపరీక్షణార్థము జనులను చూచునట్టి, త్వా=నిన్ను, హవిషా = హవిస్సుచేత, విధేమ = సేవించుచున్నారము.

తా. క్రూరుఁడవగు నోయగ్ని! నీవు మాకుఁ గల జ్ఞానమును ఛేదింపకుము, మాసత్కర్మానుష్ఠానమును హింసింపకుము, నాశరీరబలమును పీడింపకుము, నాసంబంధమగు పరలోకసాధనమును హరింపకుము, నాసంతానమును ఆయుస్సును హరింపకుము, పుణ్యపాపములను చేయుచున్నవారలను పరీక్షించుచు చూచుచున్న నీకు మమ్ములను ఈవిధముగా సంరక్షింపుమని హవిస్సులు ఇచ్చుచు నీపరిచర్యలు సలిపెద మని తాత్పర్యము.

౫౨. ద్విపంచాశోఽనువాకః.

మం. మా నో మహాన్త ముత మా నో అర్భకం
మా న ఉక్షన్త ముత మా న ఉక్షితమ్ ।
మా నో వధీః పితరం మోత మాతరం
ప్రియా మా నస్తనువో రుద్ర రీరిషః ॥౭౦॥ ౫౨॥

టీక. రుద్ర=దుష్టులను ఏడ్పించునట్టి ఓరుద్రుఁడా! నః=మాయొక్క, మహాన్తం=గురువు మున్నగు పూజ్యవర్గమును, మావధీః = హింసింపకుము, ఉత=మఱియును, నః=మాయొక్క, అర్భకం = బాలకుని, మా=హింసింప కుము, నః=మాయొక్క, ఉక్షంతం=తేజోవంతుఁడగు యువకుని, మా=హింసింప కుము, ఉత=మఱియు, నః=మాయొక్క, ఉక్షితం=గర్భస్థపిండమును, మా= హింసింపకుము, నః=మాయొక్క, పితరం=తండ్రిని, మావధీః=హింసింపకుము, ఉత=మఱియు, మాతరం = తల్లిని, మా=హింసింపకుము, నః=మాయొక్క, ప్రియాః=ప్రియమైన, తనువః=దేహమును, మారీరిషః=హింసింపకుము.

తా. దుష్టులగువారలను దుఃఖింపఁజేయునట్టి ఓరుద్రుఁడా! నీవు మాకు పూజ్యులగు గురువు మున్నగువారిని హింసింపకుము, మాసంతానమునందు స్తనంధయులయి యున్న బాలకులను హింసింపకుము, వీర్యవంతులగు యువకు లను గాని, గర్భములందుండు వారలను గాని హింసింపకుము, మాతండ్రిని మాతల్లిని, మాదేహమును (వేయేల) మాసంబంధమయిన దానినంతయు సుఖింపఁజేయు మని భావము.

౫౩. త్రిపంచాశోఽనువాకః.

మ. మా న స్తోకే తనయే మా న ఆయుషి
మా నో గోషు మా నో అశ్వేషు రీరిషః ।
వీరాన్మా నో రుద్ర భామితో వధీర్
హవిష్మన్తో నమసా విధేమ తే ౭౧ ౫౩।

టీక. రుద్ర=ఓరుద్రుఁడా! (నీవు) భామితః = మేమొనర్చిన అపరాధములచేత క్రుద్ధుఁడవై, నః=మాయొక్క, తోకే=పసిబాలురయందును, తనయే = తరుణులగు పుత్రులందును, మారీరిషః = హింసింపకుము, నః = మాయొక్క, ఆయుషి = ఆయుస్సునందు, మా = హింసింపకుము, నః = మాయొక్క, గోషు=గోవులయందు, మా=హింసింపకుము, నః=మాయొక్క, అశ్వేషు = అశ్వములందు, మా=హింసింపకుము, నః=మాయొక్క, వీరాన్ = మాకు హితమొనర్చునట్టియుం, బలవంతులయినట్టియు పురుషులను, మావధీః= హింసింపకుము, హవిష్మంతః = హవిస్సుగలమేము, నమసా = నమస్కారముచేత, తే=నీకు, విధేమ = పరిచర్యను సలిపెదము.

తా. ఓరుద్రుఁడా (మేము అజ్ఞానముచేతచేసిన) అపరాధములచేత క్రుద్ధుఁడవై మాయొక్కపసిబాలురను గాని, బాలకులనుగాని హింసింపకుము, మా ఆయుస్సును పోఁగొట్టకుము, మాయొక్కగోవులను గాని, అశ్వములను గాని, మాకు హితమొనర్చు పురుషులనుగాని హింసింపకుము, మేము యథా

విధిగా నీకు హవిస్సుల నొసంగుచు నీపరిచర్యను సలుపుచుండెద మని. తాత్పర్యము.

---

౫౪. చతుఃపంచాశోఽనువాకః.

మం. ప్రజాపతే న త్వదేతాన్యన్యో
విశ్వా జాతాని పరి తా బభూవ ।
యత్కామాస్తే జుహుమస్తన్నో అస్తు
వయగ్ం స్యామ పతయో రయీణామ్ ।౭-౨।౫౪।

టీక. ప్రజాపతే=ప్రజాధిపతివగు ఓబ్రహ్మా! విశ్వా=సమస్తమయిన వితాని = ఈగనంబడుచున్న, తా=ఆభూతములన్నియు, త్వత్ = నీవల్ల నుండి (యే), జాతాని = ఉత్పన్నములాయెను, అన్యః=ఇతరుఁడు, న+ పరి+బభూవ = సంహరింపఁజాలఁడు, (పుట్టింపఁజాలఁడు, రక్షింపఁజాలఁడు) వయం=మేము, యత్కామాః = ఏకోరికగలవారలమై, తే = నీకొఱకు, జుహుమః = హోమము చేయుచున్నారమో, తత్ = ఆకామము, నః= మాకు, అస్తు=అగుఁగాక, (వయం=మేము) రయీణాం=ధనములకు, పతయః= అధిపతులము. స్యామ=అయ్యెదముగాక.

తా. ప్రజాపతీ! భగవంతా! ఓపార్వతీపతీ! నీవల్లనుండియే ఈ గనంబడుచున్న సకలభూతజాతము ఉత్పన్నమాయెను, దేవ మనుష్యతిర్యగాది భేదములు గలదియు, పంచభూతములును, చతుర్దశభువనములును, నానా విధములగు బ్రహ్మాండపిండాండములును నీవల్లనుండియే జనించినవి, ఇట్టి బ్రహ్మాండముయొక్కయు ఇతరభూతముయొక్కయు నిర్మాణమునకు ఇతరుఁ

డెవ్వఁడును సమర్థుఁడు కాఁడు, దీనిపరిపాలనమునకును సంహారమునకును నీవే సమర్థుఁడవు, ఇతరుఁ డెటుల సృజింపఁజాలఁడో అట్లే పరిపాలించుటకును, సంహరించుటకునుకూడ సమర్థుఁడు కాఁడు, మూలమునందు తిరస్కారార్థమగు న+పరి+బభూవ అనుపదమువలన కేవలము సంహరింపఁజాలఁడు అని మాత్రమే తెలియుచున్నను ఉపలక్షణముచేత సృష్టిస్థితులనుకూడ గ్రహించుటయుక్తము కావున గ్రహించితిమి, కావున సృష్టిస్థితిలయకారుఁడవై భగవంతుఁడవైన నీకొఱకు శ్రౌతస్మార్తకర్మలందు హవిస్సునొసంగుచున్నారము, మేము ఐహికాముష్మికములందుదేని నభిలషించి హోమము సలుపుచున్నారమో అట్టి యభీష్టము మాకు కలుఁగుగాక. మఱియు నీకృపాదృష్టికి లోనైన మేము ఈలోకమునందు విద్యావినయసంపదలను పరోపభోగ్య మగు యోగ్యసంపదకును అధిపతులము (అనఁగా కలవారలము) అయ్యెదము గాక.

ఈమంత్రము బ్రాహ్మణులకు భోజనమును పెట్టునప్పుడున్ను, ఈశ్వరప్రీతిని కలుగఁజేయునట్టి ఉదకదానమునందున్ను వినియోగింపఁబడుచున్నది, అప్పుడు "జుహుమః" అనుపదమునకు బ్రాహ్మణముఖాగ్నియందు "మిష్టాన్నరూపమయిన హవిస్సును హుతమొనర్చుచున్నారమని అర్థమును గ్రహింపవచ్చును, తక్కినవిషయమంతయు సమానమే.

---

౫౫. పంచపంచాశోఽనువాకః

మం. స్వస్తిదా విశస్పతిర్వృత్రహా విమృధో వశీ ।
వృషేన్ద్రః పుర ఏతు నస్స్వస్తిదా అభయంకరః ।

॥౭౩।౫౫।

టీ. స్వస్తిదాః=భూలోకసుఖకరుఁడును, విశస్పతిః = నానావిధులగు ప్రజలకధిపతియు, విమృధః = రక్షోజాతిని సంహరించినవాఁడును, వశీ. త్రైలోక్యమును లోబఱచుకొను శక్తిగలవాఁడును, వృషా = వర్షాకాలమునందు వర్షమును కురిపించువాఁడును, స్వస్తిదాః = పరలోకసుఖము నొసంగువాఁడును, అభయంకరః = (తన్నాశ్రయించినవారలకు) అభయమొసంగువాఁడును అగు, ఇంద్రః=ఇంద్రుఁడు, నః=మాకు, పురః=ప్రాగ్భాగమునందు, ఏతు=(సంరక్షణార్థము) వచ్చుఁగాక.

తా. మూలమునందు "పురః" అని మాత్రమే యున్నను "ప్రాగాది సర్వదిక్కులందును" అని గ్రహింపవలయును. 'పురః' అను పదము ఉపలక్షణము, ఇంద్రుఁడు మమ్ములను సంరక్షించుటకు గాను, అన్ని దిక్కులందు సన్నద్ధుఁడై యుండుఁగాక, మే మచ్చటచ్చట సంచరించుచుందుము కావున అన్నివైపుల నని గ్రహింపవలయును, అన్నిదిక్కులందు వజ్రహస్తుఁ డగు ఇంద్రుఁడు మమ్ములను రక్షించుచుండును కావున మేము నిర్భయులమై యుందుము గాక యని భావము, ఇంద్రుఁ డెట్టివాఁ డనఁగా:—భూలోకసుఖము కలుగఁజేయువాఁడు, నానావిధు లగు ప్రజలకు అధిపతి, వృత్రాసుర. సంహర్త, శత్రుగణసంహర్త, వర్షమును కురిపించువాఁడు, పరలోకసుఖము నొసంగువాఁడు, త్రైలోక్యమును లోబఱచుకొనిన సామర్థ్యము గలవాఁడు

---

౫౬. షట్పంచాశోఽనువాకః.

మం. త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్।

ఉర్వారుకమివ బంధనా న్మృత్యోర్ముక్షీయ మాఽమృ
తాత్ ॥౭౪।౫౬

టీక. (భగవంతుఁడవగు ఓపార్వతీపతీ ! వయం=మేము) సుగంధిం = మంచిపరిమళము కలిగినట్టియు, పుష్టివర్ధనం=లౌకిక వైదిక పుష్టిని వృద్ధిచేయు నట్టియు, త్ర్యంబకం=మూఁడునేత్రములుగల ఈశ్వరుఁడవగు నిన్ను, యజామహే=పూజించుచున్నారము, (ఓపార్వతీపతీ!) బంధనాత్ = తొడిమవల్ల నుండి, ఉర్వారుకం ఇవ = దోసకాయనువలె, మృత్యోః = మృత్యువువల్ల నుండి, ముక్షీయ=వదలిపెట్టఁబడినవారము కాకపోయెదముగాక. అమృతాత్ = మోక్షమునుండి, మా=వదలిపెట్టఁబడినవారము కాకపోయెదము గాక.

తా. మొగలిపువ్వు, మల్లెపువ్వు మున్నగు పరిమళముగల పుష్పముల యొక్క సుగంధము దూరమునం దుండువారలకు సైతము ఘ్రాణేంద్రియమునకు ఎటుల గోచరమగునో అట్లే ఎవనిదేహముయొక్క పరిమళము దూరమునందుండువారలకు సైతము గోచరించునో అట్టివాఁడు సుగంధి యనంబడును, లౌకికవైదికము లగు పుష్టులను కలుఁగ జేయువాఁడు పుష్టివర్ధనుఁడు, మూఁడునేత్రములు గలవాఁడు త్ర్యంబకుఁడు, ఇట్టినిన్ను సత్కర్మలచేత పూజించెదము, దోసకాయను తొడిమెనుండి ఎటుల వేఱుగాఁ జేయుచున్నాఁడవో అట్లే మమ్ములను మృత్యువునుండి వేఱుగాఁ జేయుము, అనఁగా పండిన దోసపండుయొక్క తొడిమ అనాయాసముగ నెటుల తొడిమ నుండి వేఱగునో అట్లే మమ్ములను మృత్యువునుండి వేఱుపఱుచుము, మోక్షమునుండి మమ్ములను వేఱుపరచవలదు.

---

౫౭. సప్తపంచాశోఽనువాకః.

మం. యే తే సహస్ర మయుతం పాశా మృత్యో మర్త్యాయ
హంతవే । తాన్ యజ్ఞస్య మాయయా సర్వా నవ
యజామహే ॥౭౫।౫౭॥

టీక. మృత్యో = ఓమృత్యుదేవతా! మర్త్యాయ = ప్రాణిజాతమును, హంతవే=హింసించుటకొఱకు, సహస్రః=వేలకొలదిగను, అయుతం = పదివేల కొలఁదిగను, తే=నీయొక్క, యే=ఏ, పాశాః=పాశములు (గలవో), తాన్= సర్వాన్=ఆపాశములను అన్నింటిని, యజ్ఞస్య=సత్కర్మజాతముయొక్క, మాయయా=శక్తిచేత, అవ+యజామహే=నివారించుచున్నారము.

తా. ఓ మృత్యుదేవా! ప్రాణులను హింసించుటకుగాను వేలు పది వేలు లక్షలుగా ఏ నీ పాశములు గలవో వానిని మేము సలిపిన సత్కర్మల యొక్క సామర్థ్యమువలన నివారించుచున్నారము, అనఁగా ఆపాశములు మమ్ములను హింసింపకుండు లాగున మేము సత్కర్మల నాచరించి యున్నారము కావున ఆ సత్కర్మాచరణబలమువలన మాకు మృత్యుపాశబలము లేక పోవు గాక యని భావము.

పూజార్థమగు యజధాతువునకు అవ యను ఉపసర్గయోగమువలన భిన్నార్థము కలిగినది, మూలమునందు గల 'మాయయా' అనుశబ్దమునకు శక్తియను అర్థమును గ్రహింపక 'మిషచేత' అని అర్థమును చెప్పినను చెప్ప వచ్చును, అప్పుడు "పుత్రజన్మమిషచేత పైతృకఋణము నిపుడు తీసివైచు కొన్నాఁడు" అను ప్రయోగమువలె ఈప్రయోగమును గ్రహింపవలయును.

౫౮. అష్టపంచాశోఽనువాకః.

అవ. ఇఁక పాపమాత్రనివారకములగు హోమమంత్రములు చెప్పఁబడుచున్నవి, స్వాహాశబ్దము చివరయుండుటచేత ఈ మంత్రములు హోమార్థకములని గ్రహింపవలయును. స్వగృహ్యోక్తవిధానము ననుసరించి ఆజ్యసంస్కారమువఱకు చేయవలసిన కర్మను నిర్వర్తించి ఈ జెప్పఁబోవునట్టి ప్రధాన హోమములను చేయవలయును, ప్రధానాహుత్యనంతరము స్విష్టికృదాదితంత్రము స్వస్వగృహ్యానుసార మాచరింపవలయును, ఇదిమొదలు ౬౭-వ అనువాకమువఱకు చెప్పఁబోవునట్టి మంత్రములు అన్నియు హోమమంత్రములే అని ఎఱుంగవలయును.

మం. మృత్యవే స్వాహా మృత్యవే స్వాహా ౹ ౭౬ ౫౮౹

టీక. మృత్యవే = మృత్యుదేవతకొఱకు, స్వాహా = ఈహుత మొనర్పఁబడిన ఆజ్యము సుహుత మగుఁగాక, మృత్యవే = మృత్యుదేవతకొఱకు, స్వాహా = ఈహుత మొనర్పఁబడిన ఆజ్యము సుహుత మగుగాక.

తా. ఎవనిచేత ప్రాణులు చనిపోవుచున్నారో అతఁడు మృత్యువు; అట్టి మృత్యువు నుద్దేశించి నేను ఒక్క పర్యాయము గ్రహించి అగ్నియందు వ్రేల్చిన ఈఆజ్యాహుతి చక్కఁగా హుత మైనది అగుఁగాక, 'మృత్యవే

స్వాహా' అని మఱియొకమారు చెప్పుటచేత రెండుపర్యాయములు హోమము చేయవలసినదని తెలుపుటకని ఎఱుంగునది, ఈయాహుతిద్వయమునకు దేవత మృత్యువని గ్రహింపవలయును.

---

౬౯. ఏకోనసప్తతితమో౽నువాకః.

మం. ౧. దేవకృతస్యైనసో౽వయజనమసి స్వాహా.

౨. మనుష్యకృతస్యైనసో౽వయజనమసి స్వాహా.

3. పితృకృతస్యైనసో౽వయజనమసి స్వాహా.

౪. ఆత్మకృతస్యైనసో౽వయజనమసి స్వాహా.

౫. అన్యకృతస్యైనసో౽వయజనమసి స్వాహా.

౬. అస్మత్కృతస్యైనసో౽వయజనమసి స్వాహా.

౭. యద్దివా చ నక్తం చైనశ్చకృమ తస్యావయజనమసి స్వాహా. ౮. యత్స్వపన్తశ్చ జాగ్రతశ్చైనశ్చకృమ తస్యావయజనమసి స్వాహా. ౯. యత్సుషుప్తశ్చ జాగ్రతశ్చైనశ్చకృమ తస్యావయజనమసి స్వాహా. ౧౦. యద్విద్వాꣳసశ్చావిద్వాꣳసశ్చైనశ్చకృమ తస్యావయజనమసి స్వాహా॥

౧౧. ఏనస ఏనసో ఉవయజన మసిస్వాహా ॥౭౭॥ ౫౯॥

టీక. ఈ పదునొకండుమంత్రములందు హవిస్సును గ్రహించునట్టి దేవతయొక్క నామములేను కావున అగ్నియే ఈ మంత్రములకు దేవత యని గ్రహింపవలయును, అగ్నియే సర్వదేవతలకు ప్రధానముగదా, ఈ పదునొకండు మంత్రములలో మొదటి ఆఱుమంత్రములు విధురవైశ్వదేవమునందును వినియోగింపఁబడును:—

౧. (ఓఆజ్యమా! నీవు) దేవకృతస్య = దేవతాసంబంధముగా చేయఁబడిన, ఏనసః = పాపమునకు, అవయజనం=నివారక మయినదానవు, అసి= అయితివి, (కావున ఇట్టి ఆజ్యము అగ్నిదేవత కొఱకు) స్వాహా=సుహుత మగుఁగాక, లేక, దేవకృతస్య = ఇంద్రియములచేతఁ జేయఁబడినఁ ఏనసః= పాపముయొక్క, అనిగాని చెప్పవచ్చును, తక్కినది సమానము.

౨. (ఓఆజ్యమా ! నీవు) మనుష్యకృతస్య = మనుష్యుల నుద్దేశించి చేయఁబడిన, ఏనసః = పాపమునకు, అవయజనం=నివారకము, అసి=అయితివి, (కావున ఇట్టి ఆజ్యము అగ్నికొఱకు) స్వాహా=సుహుత మగుఁగాక.

3. (ఓఆజ్యమా ! నీవు) పితృకృతస్య = పైతృకకర్మలందు చేయఁబడిన, ఏనసః = పాపముయొక్క, అవయజనం = నివారకమైనదానవు, అసి=అయితివి, (కావున ఇట్టి ఆజ్యము అగ్నికొఱకు) స్వాహా = హుత మగుఁగాక.

౪. (ఓఆజ్యమా ! నీవు) ఆత్మకృతస్య = స్వయముగా నొనర్పఁబడిన, ఏనసః = పాపముయొక్క, అవయజనం = నివారకమైనదానవు, అసి=అయితివి, (కావున ఇట్టి ఆజ్యము అగ్నికొఱకు) స్వాహా = సుహుత మగుఁగాక.

౫. (ఓఆజ్యమా ! నీవు) అన్యకృతస్య = భార్య మున్నగు ఇతరుల చేత చేయఁబడిన. ఏనసః = పాపమునకు, అవయజనం=నివారకమైనదానవు. అసి=అయితివి, (కావున ఇట్టి ఆజ్యము అగ్నికొఱకు) స్వాహా=సుహుత మగుఁగాక.

౬. (ఓఆజ్యమా ! నీవు) అస్మత్కృతస్య = మాజ్ఞానసమూహము చేతఁ జేయఁబడినఁ ఏనసః=పాపమునకు, అవయజనం = నివారకమైనదానవు, అసి=అయితివి, (కావున ఇట్టి ఆజ్యము అగ్నికొఱకు) స్వాహా=సుహుత మగుఁగాక.

౭. (ఓఆజ్యమా ! నీవు) యత్=ఏ, ఏనః=పాపమును, దివాచ = పగలున్ను, నక్తంచ = రాత్రియున్ను. చకృమ=చేసినారమో, తస్య=అట్టి పాపముయొక్క, అవయజనం = నివారకము, అసి=అయితివి, (కావున ఇట్టి ఆజ్యము అగ్నికొఱకు) స్వాహా=సుహుత మగుఁగాక.

౮. (ఓఆజ్యమా ! మేము) స్వపంతః చ=స్వప్నము చెందినవారల మయి, జాగ్రతః చ=మేల్కొనిన వారలము అయి, యత్=ఏ, ఏనః= పాపమును, చకృమ = చేసినారమో, తస్య=అట్టిపాపముయొక్క, అవయ జనం=నివారకము, (త్వం=నీవు) అసి=అయితివి, (కావున ఇట్టి ఆజ్యము అగ్నిదేవతకొఱకు) స్వాహా=సుహుత మగుఁగాక.

౯. (ఓఆజ్యమా ! మేము) సుషుప్తః చ=సుషుప్తిని చెందినవారల మయి, జాగ్రతః చ=మేల్కొనినవారలము అయి, యత్=ఏ, ఏనః=పాప మును, చకృమ=చేసినారమో, తస్య=అట్టిపాపముయొక్క, అవయజనం= నివారకము, (త్వం=నీవు) అసి=అయితివి (కావున ఇట్టి ఆజ్యము అగ్ని కొఱకు) స్వాహా=సుహుత మగుఁగాక.

౧౦. (ఓ ఆజ్యమా ! మేము) విద్వాంసః చ = ఎఱిఁగియున్న వార లమై, అవిద్వాంసః చ=అవిద్వాంసులమును అయి, యత్=ఏ, ఏనః=పాప

మును, చకృమ = చేసితిమో, (త్వం=నీవు) తస్య=అట్టి పాపముయొక్క, అవయజనం = నివారకమవు, అసి=అయితివి. (కావున ఇట్టి ఆజ్యము అగ్నికొఱకు) స్వాహా=సుహుత మగుఁగాక.

౧౧. (ఓఆజ్యమా ! నీవు) ఏనసః = పాపులసంపర్కమువలన కలిగిన, ఏనసః=పాపముయొక్క, అవయజనం = నివారకమవు, అసి=అయితివి. (కావున ఇట్టి ఆజ్యము అగ్నికొఱకు) స్వాహా=సుహుత మగుఁగాక.

తా. ఆజ్యము సకలపాపములను పోఁగొట్టుటయందు సమర్థమైనది, కావున ఇట్టి ఆజ్యమును అగ్నియందు వ్రేల్చువారల సకలవిధపాపములు నశించును కావున అగ్నిదేవతనుగుఱించి నేనొనర్చెడి ఆజ్యాహుతి సుహుత మగుఁగాక, ఈ అనువాకమునందు ౧౧ మంత్రములు చెప్పఁబడినవి, ఒక్కొకమంత్రమునందు ఒక్కొకవిధమగు పాపమును వచించి నీవు అట్టి పాపమును నివారించుదానవు గావున తన్నివారణార్థ మీయాహుతి ఒసఁగఁబడినదని చెప్పఁబడినది.

౧. దేవకృత మగు పాతకము, అనఁగా దైవికకర్మల నాచరించునప్పుడు చేయవలసిన దానిని సరిగా చేయకపోవుటవలన కలుగునట్టి పాతకము, (లేక) ఇంద్రియములను దుర్వృత్తులందు ప్రవేశపెట్టి ఆర్జించిన పాతకము.

౨. మనుష్యుల ధిక్కరించుట, అతిథ్యాదులకు అన్నమును పెట్టకపోవుట ఇయ్యది మనుష్యకృతపాపము.

౩. పైతృక కర్మలందు క్రియాలోప మొనర్చుట పితృకృతపాపము.

౪. అగమ్యాగమనాదికము ఆత్మకృత పాతకము.

౫. భార్య మున్నగువారు సలిపిన పాతకము అన్యకృతపాతకము.

౬. జ్ఞాతులు మున్నగువారలు సలిపిన పాతకము అస్మత్కృతపాతకము.

౭. మఱియు రాత్రియందుగాని పగలుగాని చేసిన పాపము.

౮. స్వప్నావస్థయందును జాగ్రదవస్థయందును చేసినపాపము.

౯. సుషుప్త్యవస్థయందును జాగ్రదవస్థయందును చేసినపాపము.

౧౦. ఎఱింగియు ఎఱుఁగకయు చేసినపాపము.

౧౧. పాపాత్ముల సంసర్గమువలన కలిగిన పాతకము.

ఈపదునొకండువిధములగు పాపములను పోఁగొట్టునట్టి సామర్థ్యము ఆజ్యమునకు కలదు కావున ఇట్టి ఆజ్యమును అగ్నియందు హోమము చేయవలయును.

జాగ్రదవస్థయందు పాపముల నాచరించుట అధికము కావున ౮. ౯. మంత్రములందు రెండుపర్యాయములు "జాగ్రత్" అనుపదము ప్రయోగింపఁబడినది, ప్రతిమంత్రమునకు తాత్పర్యము వ్రాయుట అనావశ్యకమని ఇటుల మొత్తముగా వ్రాసినారము.

---

౬౦. షష్టితమోఽనువాకః.

మం. యద్వో దేవాశ్చకృమ జిహ్వయా
గురు మనసో వా ప్రయుతీ దేవహేడనమ్ ।
అరావా యో నో అభిదుచ్ఛునాయతే
తస్మిన్తదేనో వసవో నిధేతన స్వాహా ॥౭౮।౬౦॥

టీక. వసవః=అంతట నివసించునట్టియు, గురుమనసః=గంభీరమయిన మనస్సుగల, దేవాః = ఓదేవతలారా! (వయం=మేము) వః=మిమ్ములనుద్దే

శించి, యత్=ఏ, ప్రయుతీ = అధికమయిన, దేవహేడనం = దేవనిందను, జిహ్వయా=నాలుకచేత, చకృమ=చేసితిమో, తత్=ఆ, ఏనః=పాపమును, తస్మిన్ = అగంభీరమయిన మనస్సునందే, నిధేతన = ఉంచుకొనుడు, వా= నిజము, వాయో = సప్తమరుత్తులకు ప్రధానమయిన ఓవాయువా! నః=మా యొక్క, యః=ఏపాపము, అభిదుచ్ఛునాయతే=చెడుకుక్కవలె అపవిత్రమై యున్నదో, అట్టి, అరా=మరణ నివర్తకమగు, (ఆజ్యము అగ్నిదేవతకొఱకు) స్వాహా = సుహుత మగుఁగాక.

(లేక) అగురు మనసః అనిభేదముచేసి ఈక్రిందివిధముగా అన్వయింప వచ్చును:—

'వసవః దేవాః! నః (ఉద్దిశ్య) ప్రయుతీ యత్ దేవహేడనం అగురు మనసః(వయం) చకృమ తత్ ఏనః తస్మిన్ నిచేతన వా, వాయో నః యః అరా (ఏనః) అభిదుచ్ఛునాయతే తత్ తస్మిన్ నిధేతన' అని గాని అర్థము చెప్పుకొనవచ్చును.

తా. అంతట నివసించునట్టియు గంభీరమయిన మనస్సు కలిగినట్టియు ఓ దేవతలారా! మిమ్ముల నుద్దేశించి నేనేమైనను గర్హణను (అనఁగా ఇతఁడు అధికుఁడు, ఇతఁడు అల్పుఁడు అని యనుట) నానాలుకతో అనియుందునేని అట్టి యపరాధమును మీరు మీమనస్సునందే పెట్టికొనుఁడు, ఇట్లన్నాఁడని అనఁబోకుఁడు, నాయపరాధమును సహింపవలయునని భావము, లేక 'అగురు మనసః' యని పదమును విభజించి, 'వయం' అనుపదమునకు విశేషణముగా గ్రహింపవలయును, గురువులగు పూజ్యవర్గమునందు భక్తిగల మనస్సు గల వారలు గురుమనసులు, గురుమనసులు కానివారలు అగురుమనసులు, అగురు మనస్సు కలిగినవే దేవహేడనమునకు ప్రసక్తి కలుగును, ఓసప్తదేవతలారా! నాసంబంధి యగు ఏపాతకము కుక్కవలె అపవిత్రమయి యున్నదో అట్టి పాతకమును గూడ నీమనస్సునందే పెట్టుకొని తత్ఫలమును నాకొసఁగకుము

ఇట్టి ఫలము కలుగు నిమిత్తము ఆజ్యమును అగ్నిదేవతకొఱకు వేల్చుచున్నాఁడను, నేను అగ్నిదేవత నుద్దేశించి వ్రేల్చిన ఆజ్యము సుహుత మగుఁగాక.

---

౬౧. ఏకషష్టితమోఽనువాకః

మం. కామోఽకార్షీ న్నమో నమః । కామోఽకార్షీత్కామః కరోతి నాహం కరోమి కామః కర్తా నాహం కర్తా కామః కారయితా నాహం కారయితా ఏష తే కామ కామాయ స్వాహా ॥౭౯।౬౧॥

టీక. (ఓదేవతలారా! మీకొఱకు) నమోనమః = నమస్కారము నమస్కారము, కామః=మన్మథుఁడు, అకార్షీత్=(వెనుక చెప్పిన పాపములను) చేసెను, కామః=మన్మథుఁడే, అకార్షీత్, (వెనుకచెప్పిన పాపములను) చేసెను, కామః=మన్మథుఁడే, కరోతి = చేయుచున్నాడు, అహం = నేను, నకరోమి=చేయను, కామః=కాముఁడే, కర్తా=కర్త, అహం=నేను, నకర్తా = కర్తనుకాదు, కామః=కాముఁడే, కారయితా=చేయించువాఁడు, అహం = నేను, కారయితా=చేయించువాఁడను, న=కాను, కామ = ఓకాముఁడా! కామాయ=మంచి ఆకారముగల, తే=నీకొఱకు, ఏషః = ఈయాజ్యాహుతి, స్వాహా=సుహుత మగుఁగాక.

తా. ఓ ముప్పది ముక్కోటి దేవతలారా! మీకు నమస్కారము నమస్కారము, నేనీపాపములను చేయలేదు, కాముఁడే ఈపాపముల నొనర్చెను, కాముఁడే ఈపాపముల నొనర్చెను, కాముఁడే ఈ పాపములను

చేయుచున్నాఁడు, నేను చేయుటలేదు, ఈ పాపములకు కర్త కాముఁడే, నేను కర్తను గాను, కాముఁడే కారయిత నేను కారయితనుగాను, మంచిరూపము గల ఓకాముఁడా! నీకు ఈయాజ్యాహుతి నిచ్చుచున్నాఁడను, ఈయాజ్యాహుతి నీకు సుహుత మగుఁగాక, 'నమో నమః' అని రెండుపర్యాయములు చెప్పుట ఆదరార్థము. "కామోఽకార్షీత్" అని రెండు పర్యాయములు చెప్పుటయు "నేనెంతమాత్రము చేయలేదు" అనుదానిని దృఢముచేయుట కని గ్రహింపవలయును.

---

౬౨. ద్విషష్టితమోఽనువాకః.

మం. మన్యు రకార్షీ న్నమో నమః। మన్యు రకార్షీ న్మన్యుః కరోతి నాహం కరోమి మన్యుః కర్తా నాహం కర్తా మన్యుః కారయితా నాహం కారయితా ఏష తే మన్యో మన్యవే స్వాహా ॥౮౦।౬౨॥

టీ. (ఓదేవతలారా! మీకు) నమస్కారము నమస్కారము, (వెనుక చెప్పిన పాపములను) మన్యుః=కోపాభిమానిదేవతయే, అకార్షీత్ = చేసెను, మన్యుః = కోపాభిమానిదేవతయే, అకార్షీత్=చేసెను, మన్యుః = కోపాభిమానిదేవతయే, కరోతి = చేయుచున్నది, అహం = నేను,నకరోమి=చేయను, మన్యుః = కోపాభిమానిదేవతయే, కర్తా=కర్త, అహం = నేను, న కర్తా = కర్తనుకాను, మన్యుః = కోపాభిమానిదేవతయే, కారయితా = చేయించు

వాఁడు, అహం = నేను, న కారయితా = చేయించువాఁడను కాను, మన్యో = ఓక్రోధాభిమానుఁడవగుదేవా! మన్యవే = క్రోధరూపుఁడవగు, తే = నీకొఱకు, ఏషః = ఈయాజ్యాహుతి స్వాహా = సుహుత మగుఁగాక.

తా. ఓదేవతలారా! మీకు నమస్కారము నమస్కారము, ఈ పాపములను పాపాభిమానియగు దేవుఁ డాచరించుచున్నాఁడు గాని నే నాచరించుట లేదు, అతఁడే కర్తయు కారయితయు, నేను కర్తనుకాను కారయితనుగాను, ఓక్రోధాభిమానివగు దేవా! ఈయాజ్యాహుతిని నీకొఱకు ఇచ్చుచున్నాఁడను నీకు ఇది చక్కఁగా హుత మొనర్పఁబడినది అగుఁ గాక, నమోనమః, అని రెండుపర్యాయములు చెప్పుట ఆదరార్థము, 'మన్యు రకార్షీత్' అని రెండు పర్యాయములు చెప్పుట నేను కర్తనుగాను, మన్యువే కర్త యని సూచించుట కని గ్రహింపవలయును.

ఇచ్చట మీమాంస చేయఁబడుచున్నది:—

౧. పాపము చేయువానికి సంభవించునా? లేక,

౨. చేయించువానికి సంభవించునా?

సమాధానము:—పాపమును బలాత్కారముగా నొకనిచేత చేయించిన యెడల చేయించినవానికే దోషము కాని ఇచ్ఛలేక చేసిన వానికి దోషము లేదు, పాపము నాచరించువాఁడు బుద్ధిపూర్వకముగా నాచరించుచు ఇతరుఁ డొకఁడు ప్రేరేపింపఁగా చేసిన యెడల ఉభయులకు దోషము సంభవించును, ధర్మశాస్త్రములందు బలాత్కారముచేత పాపము నాచరించిన వానికి సైతము ప్రాయశ్చిత్తము విధింపఁబడియున్నను ఆప్రాయశ్చిత్తము బుద్ధిపూర్వకముగా ఆచరించినవానికి విధించిన ప్రాయశ్చిత్తముకంటె మిక్కిలి అల్పము.

మఱియు ఈ మంత్రములచేత పురుషుఁడు చేతులెత్తి దుఃఖించుచున్నాఁడు, కామమన్యువులు బలాత్కారముగా నాచేత పాపమును చేయించుచున్నవి, నాకెంతమాత్ర మిట్టి పాపకృత్యమును చేయుటకు ఇచ్ఛ

లేదు, నేనేమిచేయుదును ? ఎచ్చటికి పోవుదును ? ఆ కామక్రోధముల బారి నుండి నన్ను రక్షించువారెవరు ? అని దుఃఖించుచు కన్నీరు గార్చి పశ్చాత్తాపము పొందుచున్నాఁడు కావున చేయించువానికే పాపముగాని చేసెడివానికి లేదు అని గ్రహింపవలయునని తాత్పర్యము.

౬౩. త్రిషష్టితమోఽనువాకః.

అవ. ఇఁక సర్వపాపక్షయము నొనర్చునట్టియు, సర్వోత్కృష్టమయిన చతుర్థాశ్రమమును స్వీకరించు సమయము నందు చేయవలసిన విరజాహోమమునకు వినియోగింపఁబడునట్టి మంత్రములు పఠింపఁబడుచున్నవి. మంత్రలింగ మదేవిధముగ నున్నది. సర్వపాపక్షయము చేసికొని సన్న్యాసమును స్వీకరింపఁ దలఁచిన అధికారి స్వగృహ్యసూత్రానుసారము అగ్నిసంస్కారము మున్నగు పూర్వతంత్రము నాచరించి ఈచెప్పఁబోవు మంత్రములచేత ప్రధానాహుతుల నాచరింపవలయును. ప్రధానాహుత్యనంతరము స్విష్టకృదాదితంత్రము సమానమే. హవిర్గ్రాహియగుదేవత అన్నిహోమములందును పరమాత్మయే. ౬౩, ౬౪, ౬౫, ౬౬ అనువాకములవఱకు విరజాహోమమంత్రములు.

మం. తిలా జ్జుహోమి సరసాగ్ం సపిష్టా న్గంధార మమ చిత్తే రమన్తు స్వాహా.

టీక. గంధార = ఓపరమాత్మా! సపిష్టాన్ = పిష్టములోఁ గూడికొని యున్న, సరసాన్ = రససమన్వితములగు, తిలాన్ = తిలలను, జుహోమి = హోమముచేయుచున్నాఁడను, (ఆహోమమునకు ఫలముగా పవిత్రములగు నీగుణములు) మమ = నాయొక్క, చిత్తే = చిత్తమునందు, రమన్తు = క్రీడించుగాక, స్వాహా = (పరమాత్మ నుద్దేశించి వ్రేల్చిన ఈహవిస్సు) సుహుత మగుఁగాక.

తా. పరిమళమగు దేహసౌరభముగల ఓపరమాత్మా! పేలపిండి మున్నగు పిష్టాంతరములో మిళితము లయినట్టియు, నీరసములుగాక చమురు కలిగియున్న నువ్వులను నేను హోమము చేయుచున్నాఁడను, ఈహోమమునకు ఫలముగా పవిత్రములగు నీగుణములు నాహృదయమునందు సర్వదా రమించుచుండుఁగాక, ఇప్పుడు నిన్నుద్దేశించి నేనొసంగిన హవిస్సు సుహుత మగుఁగాక.

మం. గావో హిరణ్యం ధన మన్నపానగ్ం సర్వేషాగ్ం శ్రియై స్వాహా.

టీక. (ఓపరమాత్మా!) గావః = గోవులు, హిరణ్యం = బంగారము, ధనం = ధనము, అన్నపానం = అన్నపానములు (సిద్ధించుఁగాక), సర్వేషాం = భోగ్యములగు పదార్థములయొక్క (ప్రాప్తి సిద్ధించుఁగాక). శ్రియై = గజాంత మగు ఐశ్వర్యముకొఱకు (ఈహవిస్సు నీకొసంగఁబడినది), స్వాహా = సుహుత మగుఁగాక.

మం. శ్రియం చ లక్ష్మీం చ పుష్టిం చ కీర్తిం చానృణ్యతామ్ । బ్రహ్మణ్యం బహుపుత్రతామ్ । శ్రద్ధామేధే ప్రజా స్సం దదాతు స్వాహా ॥౮౧॥౬3॥

టీక. శ్రియంచ=రాజ్యలక్ష్మిని, లక్ష్మీంచ=మోక్షలక్ష్మిని, పుష్టించ=శరీరాదిపుష్టిని, కీర్తించ=(త్రిలోకములకు విదితమగు కల్యాణగుణములు కలిగియుండు) కీర్తిని, అనృణ్యతాం=దేవ, ఋషి, పితృఋణవిముక్తిని, బ్రహ్మణ్యం=సర్వబ్రాహ్మణులలో శ్రేష్ఠత్వమును బహుపుత్రతాం=అనేకపుత్రులు కలిగియుండుటను, శ్రద్ధామేధే=శ్రద్ధామేధలను (శ్రద్ధయనఁగా గురువేదాన్తవాక్యవిశ్వాసము, మేధయనఁగా వేదశాస్త్రార్థధారణపటుత్వము) ప్రజాః=పుత్రికలను, (పరమాత్మ నాకొఱకు) సందదాతు=లెస్సఁగా ధరించియుండుఁగాక, (అనఁగా ఇచ్చుఁగాక.)

తా. రాజ్యలక్ష్మిని, మోక్షలక్ష్మిని, శరీరారోగ్యాదికమును త్రిలోకవిదితములగు సుగుణములు గలవాఁడనెడి కీర్తిని, దేవర్షి పితృఋణ విముక్తిని, సర్వబ్రాహ్మణులలో శ్రేష్ఠుఁడై యుండుట, పుత్త్రులనేకులు కలిగియుండుట, శ్రద్ధామేధలు కలిగియుండుట, పుత్త్రికాసంతానము వీని నన్నింటిని పరమాత్మ నాకు కలుగఁజేయుఁగాక.

దేవర్షి పితృఋణవిముక్తి ఎట్లనఁగా:—

౧. యథావిధిగ గృహస్థాశ్రమమును స్వీకరించి యజ్ఞయాగాది క్రతువుల నాచరించిన దేవఋణవిముక్తి యగును.

౨. బ్రహ్మచర్యాది నియమపూర్వకముగ సమగ్రముగ వేదాధ్యయనము నర్థపూర్వకముగ నభ్యసించిన ఋషిఋణవిముక్తి యగును.

3. యథాశాస్త్రముగ వివాహితయగు భార్యయందు సుపుత్త్రులను బడసినయెడల పితృఋణవిముక్తి యగును.

౬౪. చతుష్షష్టితమోఽనువాకః.

మం. ౧. తిలాః కృష్ణాస్తిలాశ్శ్వేతా స్తిలా స్సౌమ్యా
వశానుగాః । తిలాః పునన్తు మే పాపం యత్కిఞ్చి
ద్దురితం మయి స్వాహా ॥

టీక. కృష్ణాః=నల్లనివగు, తిలాః = తిలలున్ను, శ్వేతాః = తెల్లనివగు, తిలాః=తిలలున్ను, తిలాః=ఈద్వివిధము లగు తిలలు, సౌమ్యాః=రోగాద్యుపద్రవము నివ్వఁజాలవు, వశానుగాః = నావశమునందున్నవి, (ఓపరమాత్మా! నీయాజ్ఞచేత) తిలాః=ఈతిలలు, మే = నాయొక్క, యత్=ఏ, కించిత్ = కొంచెమైన, దురితం = దుష్టమగు, పాపం = పాపము, మయి=నాయందు (గలదో), (తత్=దానిని) పునంతు=శోధించుఁగాక, స్వాహా = (తదర్థమయి నీకొసంగఁబడిన ఈహవిస్సు) సుహుత మగుఁగాక.

తా. తిలలు నల్లనివియు తెల్లనివియు గలవు, ఈద్వివిధము లగుతిలలును హోమార్హములే, ఈద్వివిధములగు తిలలున్ను రోగోపద్రవాది జనకములు గాక సౌమ్యములయినవి, మఱియు ఇవి నావశమునందున్నవి, అనఁగా ఈతిలలు స్వధర్మము ననుసరించి సంపాదించిన ద్రవ్యము నిచ్చికొన్నవి; కాని దొంగతనముచేతఁ గాని అధికారముచేతఁ గాని తెచ్చినవి కావని యర్థము, (ఇట్లని భాష్యమునందు వ్రాయఁబడియున్నది.) ఇట్టి తిలలను నేను హోమము చేయుచున్నాఁడను, ఓపరమాత్మా! నీయాజ్ఞచేత ఆతిలలు నాయొక్క పాపమును పోఁగొట్టి నన్ను పవిత్రునిగా నొనర్చుగాక, అచేతనములగు తిలలకు పాపనాశనసామర్థ్యము నీయాజ్ఞచేతనే అని భావము.

మం. ౨. చోరస్యాన్నం నవశ్రాద్ధం బ్రహ్మహా గురుతల్పగః।
గోస్తేయగ్ం సురాపానం భ్రూణహత్యా తిలా
శాన్తిగ్ం శమయన్తు స్వాహా ।

టీక. (ఓపరమాత్మా! నీయాజ్ఞచేత) తిలాః = తిలలు, చోరస్య అన్నం = దొంగతనముచేయునట్టివాని యన్నమును తినుటయు, నవశ్రాద్ధం = నవశ్రాద్ధము, ఏకోద్దిష్టము మున్నగు ఆశౌచశ్రాద్ధములందు భుజించినట్టియు, బ్రహ్మహా = బ్రహ్మహత్యయొక్కయు, గురుతల్పగః = గురుభార్యాగమనము, గోస్తేయం = గోవులను దొంగిలించుటయు, సురాపానం = మద్యపానము, భ్రూణహత్యా = భ్రూణహత్య (ఈమొదలగు పాపములయొక్క), శాంతిం = నాశనమును, శమయంతు = చేయుదుగాక, స్వాహా = (ఈయుద్దేశము కలిగి నే నగ్నియందు వ్రేల్చిన ఆహుతి) సుహుత మగుగాక.

తా. చోరునియన్నము, నవశ్రాద్ధాన్నము తినుటవలన సంభవించునట్టి పాతకమును, బ్రహ్మహత్య, గురుభార్యాగమనము, గోవులను దొంగిలించుట, మద్యపానము, భ్రూణహత్య వీనివలన సంభవించునట్టి పాతకమును, నీ యను గ్రహమువలన ఈతిలలు నశింపజేయుగాక యనుతలంపుతో నే నొనర్చిన హోమము సుహుత మగుగాక.

మం. 3. శ్రీశ్చ లక్ష్మీశ్చ పుష్టిశ్చ కీర్తిం చానృణ్యతామ్ ।
బ్రహ్మణ్యం బహుపుత్రతామ్ । శ్రద్ధామేధే ప్రజ్ఞాతు
జాతవేద స్సం దదాతు స్వాహా ।౮౨।౬౪।

టీక. జాతవేద = వేదములన్నింటిని పుట్టించినట్టి ఓపరమాత్మా! శ్రీః చ = రాజ్యలక్ష్మిని, లక్ష్మీః చ = మోక్షలక్ష్మిని, పుష్టిః చ = దేహారోగ్యమును,

కీ_ర్తిం చ=కీ_ర్తిని. ఆనృణ్యతాం = దేవర్షిపితృఋణ విము_క్తిని, బ్రహ్మణ్యం = సర్వబ్రాహ్మణులందు ఉ_త్తమత్వమును, బహుపుత్రతాం = అనేకపుత్త్ర పుత్త్రి కలను, శ్రద్ధామేధే=శ్రద్ధా మేధలను, ప్రజ్ఞా తు = కుశాగ్రబుద్ధిత్వమును, సందదాతు = చక్కఁగా ఇచ్చుఁగాక, (అట్టి యుద్దేశముతో నే నొసంగిన ఈ యాజ్యాహుతి) స్వాహా=సుహుత మగుఁగాక.

తా. సర్వవేదములకు ఉత్పాదకుఁడ వగు ఓపరమాత్మా! మాకు రాజ్య లక్ష్మిని, మోక్షలక్ష్మిని, దేహారోగ్యమును, కీ_ర్తిని, దేవర్షిపితృ ఋణవిము_క్తిని బ్రాహ్మణు లందఱిలో శ్రేష్ఠత్వమును, బహుపుత్రత్వమును, పుత్రికలను, శ్రద్ధామేధలను, కుశాగ్రబుద్ధిని వీనిని మాకు కలుగఁజేయుమని ఇట్టి యుద్దేశము కలిగి ఇప్పుడు ఇచ్చిన హవిస్సు సుహుత మగుఁగాక యని తాత్పర్యము.

---

౬౫. పంచషష్టితమోఽనువాకః.

మం. ప్రాణాపానవ్యానోదానసమానా మే శుధ్యంతాం
జ్యోతిరహం విరజా విపాప్మా భూయాసగ్‌ం స్వాహా।

టీక. (ఆజ్యహోమము లివి) ఓపరమాత్మా! ఈయాజ్యహోమము చేత, యతః=ఏయవి పరిశుద్ధము లగుటవలన, అహం=నేను, విపాప్మా=ప్రతిబంధకములగు పాపములు నశించినవాఁడనై, విరజాః = పాపకారణభూత మగు రజోగుణము సైతము లేనివాఁడనై, జ్యోతిః = జగత్కారణము అయిన ప్రకాశస్వరూపుఁడను, భూయాసం = అయ్యెదనో, అట్టి, మే= నాయొక్క, ప్రాణాపానవ్యానోదానసమానాః = ప్రాణ, అపాన, వ్యాన,

ఉదాన, సమానములను ప్రసిద్ధములగు పంచవాయువులు, శుద్ధ్యన్తాం = పరి శుద్ధములయినవి అగుగాక, (తన్నిమిత్తము నేనిచ్చిన నీయాజ్యాహుతి) స్వాహా=సుహుత మగుగాక.

తా. నాసంబంధము లగు ప్రాణాపానవ్యానోదానసమానవాయువులు ఈయాజ్యహోమమువలన పరిశుద్ధములయిన వగుగాక, కావుననే నేను ప్రతి బంధకము లగు పాపములు నశించిన వాడనై, పాపమునకు కారణ మగు రజోగుణము కూడ నశించినవాడనై జగత్కారణ మగు బ్రహ్మస్వరూప భూతుడ నయ్యెదనుగాక, అట్టి తలంపుకలిగి నేను వ్రేల్చిన యీయాజ్యా హుతి సుహుత మగుగాక.

మం. ౨. వాఙ్మనశ్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణరేతో బుద్ధ్యా కూతి స్సంకల్పా మే శుద్ధ్యంతాం జ్యోతి రహం విరజా విపాప్మా భూయాసగ్ం స్వాహా ॥

టీక. (ఓపరమాత్మా!) యతః=ఏయవి పరిశుద్ధములగుటవలన, అహం= నేను, విపాప్మా = పాపములు నశించినవాడనై, విరజాః = రజోగుణములు లేనివాడను, అయి, జ్యోతిః=జ్యోతిస్స్వరూపుడను, భూయాసం=అయ్యె దనో, అట్టి, మే = నాయొక్క, వాఙ్మ...సంకల్పాః-వాక్ = వాక్కు, మనః=మనస్సు, చక్షుః=కన్నులు, శ్రోత్ర=చెవులు, జిహ్వా=నాలుక, ఘ్రాణ= ముక్కు, రేతః=గుహ్యేంద్రియము, బుద్ధి=నిశ్చయాత్మకమగు అంతఃకరణ వృత్తియగుబుద్ధి, ఆకూతిః = అనిశ్చయాత్మకమగు వృత్తి, సంకల్పాః = కల్ప నాత్మకవృత్తియగు సంకల్పము, ఇవియన్నియు, శుద్ధ్యంతాం=పరిశుద్ధము లయిన వగుగాక. (ఇట్టి యుద్దేశములో నే నొసంగిన యీయాజ్యాహుతి సుహుత మగుగాక.

తా. ఓపరమాత్మా! నాయొక్క వాక్కు, మనస్సు, కన్నులు, చెవులు, నాలుక, ముక్కు, గుహ్యేంద్రియము, అంతఃకరణముయొక్క నిశ్చయాత్మక వృత్తి యగు బుద్ధి, అనిశ్చయాత్మకవృత్తి యగు ఆకూతి, ఇది మంచిది అని కల్పనాత్మకవృత్తి యగు సంకల్పము, ఇవన్నియు దీనివలన పరిశుద్ధములయినవి అగుఁగాక, ఇందువలన నేను విగతపాపుఁడను, విగతరజోగుణుఁడను అయి జ్యోతిస్స్వరూపుఁడ నయ్యెదను గాక, ఇట్టి యుద్దేశముతో నేనొసంగిన ఆజ్యహోమము సుహుత మగుఁగాక.

మం. 3. త్వక్చర్మ మాꣳస రుధిర మేదో మజ్జా స్నాయవో ఽస్థీని మే శుధ్యన్తాం జ్యోతి రహం విరజా విపాప్మా భూయాసꣳ స్వాహా.

టీక. (ఓపరమాత్మా!) యతః = ఏయవి పరిశుద్ధము లగుటవలన, అహం=నేను విపాప్మా = పాపరహితుఁడను, విరజాః = రజోగుణరహితుఁడను, అయి, జ్యోతిః = జ్యోతిస్స్వరూపుఁడను, భూయాసం=అయ్యెదనో, అట్టి, మే=నాయొక్క, త్వక్...స్నాయవః-త్వక్ = త్వక్కు, చర్మ = చర్మము, మాంస=మాంసము, రుధిర = రక్తము, మేదః=మేదస్సు, మజ్జా= వస, స్నాయవః = నరములు, అస్థీని=ఎముకలు, శుధ్యన్తాం = పవిత్రములయినవి అగుఁగాక, (ఇట్టి యుద్దేశముతో నేనొసంగిన యీయాజ్యాహుతి) స్వాహా = సుహుత మగుఁగాక.

తా. ఓపరమాత్మా! నాయొక్క త్వక్కు, చర్మము, మాంసము, రక్తము, మేదస్సు, వస, నరములు అను సప్తధాతువులు, ఎముకలు ఇవన్నియు ఈ యాజ్యాహుతివలన పరిశుద్ధము లయినవి అగుఁగాక, అందువలననే నేను పాపరహితుఁడనై రజోగుణము లేనివాఁడనై జ్యోతిస్స్వరూ

పుఁడ నయ్యెదను గాక, ఇట్టి తలంపుతో నేనొసంగిన ఆజ్యాహుతి సుహుత మగుఁగాక.

మం. ౮. శిరఃపాణిపాదపార్శ్వపృష్ఠోరూదరజఙ్ఘ శిశ్నోపస్థపాయవో మే శుధ్యంతాం జ్యోతిరహం విరజా విపాప్మా భూయాసగ్ంం స్వాహా.

టీక. (ఓపరమాత్మా! యతః = ఏయవి పరిశుద్ధములగుటవలన) అహం=నేను, విపాప్మా = పాపరహితుఁడనై, విరజాః = రజోగుణరహితుఁడనై, జ్యోతిః = జ్యోతిస్స్వరూపుఁడను, భూయాసం = అయ్యెదనో, అట్టి, మే=నాయొక్క, శిరః...పాయవః-శిరః = శిరస్సు, పాణి=హస్తములు, పాద = పాదములు, పార్శ్వ=పార్శ్వములు, పృష్ఠ=వీపు, ఊరు=తొడలు, ఉదర=పొట్ట, జంఘ=పిక్కలు, శిశ్న=శిశ్నము. ఉపస్థ = ఉపస్థ, పాయవః = గుదము, (ఇవి) శుధ్యన్తాం=పరిశుద్ధము లయినవి అగుఁగాక, (ఇట్టి యుద్దేశముతో నేనొసంగిన నీయాజ్యాహుతి) స్వాహా = సుహుత మగుఁగాక.

తా. ఓపరమేశ్వరా! నాయొక్క శిరస్సు, చేతులు, పాదములు, పార్శ్వములు, వీపు, తొడలు, పొట్ట, పిక్కలు, శిశ్నోపస్థలు, గుదము ఇవి పరిశుద్ధము లయినవి అగుఁగాక, నేను ఇందువలన పాపరహితుఁడనై, రజోగుణరహితుఁడనై జ్యోతిస్స్వరూపుఁడ నయ్యెదను గాన ఇట్టి తలంపు కలిగి నేనొసంగిన యీయాజ్యాహుతి సుహుత మగుఁగాక.

మం. ౯. ఉత్తిష్ఠ పురుష హరిత పిఙ్గల లోహితాక్షి దేహి

దేహి దదాపయితా మే శుద్ధ్యన్తాం జ్యోతి రహం
విరజా విపాప్మా భూయాసగ్ం స్వాహా ॥౭౩॥౬౫॥

టీక. హరిత=ప్రతిబంధకముల హరించుటయందు సామర్థ్యముగలవాఁడా! పురుష అగ్ని శరీరమందున్న ఓపరమాత్మా! పింగల=పింగలవర్ణము గలవాఁడా! లోహితాక్ష=ఎఱ్ఱనికన్నులు గలవాఁడా! ఉత్తిష్ఠ=లెమ్ము, దేహిదేహి=మాటి మాటికి నాకు పరిశుద్ధిని ఇమ్ము, దదాపయితా=ఆచార్య సమీపమునుండి తత్త్వ జ్ఞానము నిప్పించువాఁడవు, (భవ=కమ్ము) (అట్టి తత్త్వజ్ఞానోత్పత్తికొఱకు) మే=నాయొక్క చిత్తవృత్తులు, శుద్ధ్యంతాం=పరిశుద్ధములయినవి అగుఁగాక, అహం=నేను, విపాప్మా=పాపరహితుఁడను, విరజాః = రజోగుణరహితుఁడను అయి, జ్యోతిః=జ్యోతిస్స్వరూపుఁడను, భూయాసం=అయ్యెదను, (ఇట్టి యుద్దేశములోనే నొసంగిన యీఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుఁగాక.

తా. ఈ మంత్రమునందు సర్వకర్మలకు ప్రధానభూతుఁడైనట్టి అగ్ని యొక్క ఉపాధివిశిష్టుఁ డగు పరమేశ్వరునియొక్క స్తుతి చేయఁబడినది:— ప్రతిబంధకములను హరించుటయందు సామర్థ్యముగలవాఁడా! పింగలవర్ణుఁడా! రక్త నేత్రములు గలవాఁడా! ఔదాసీన్యమును పదలి నన్ను గ్రహించు నిమి త్తము త్వరగాలెమ్ము, నాకు తత్త్వజ్ఞానమును మాటిమాటికి నిప్పింపుము, ఆచార్యుఁ డిచ్చిన జ్ఞానమును గ్రహించుటకుగాను నాచిత్తవృత్తులను పవిత్ర ములనుగా నొనర్పుము, నేను పాపరహితుఁడనై, రజోగుణ రహితుఁడనై జ్యోతిస్స్వరూపుఁడ నయ్యెదను, ఇట్టియుద్దేశములో నేనొసంగిన యీ ఆజ్యా హుతి సుహుత మగుఁగాక.

౬౬. షట్ షష్టితమోఽనువాకః.

మం. ౧. పృథివ్యాపస్తేజో వాయురాకాశా మే శుధ్యంతాం జ్యోతి రహం విరజా విపాప్మా భూయాసగ్ం స్వాహా.

టీక. (ఓపరమాత్మా! యతః = ఏయవి పరిశుద్ధము లగుటవలన,) అహం=నేను, విపాప్మా = పాపరహితుండనై, విరజాః = రజోగుణరహితుండనై, జ్యోతిః = పరబ్రహ్మస్వరూపుండను అయ్యెదనో (అందువలన), మే= నాయొక్క, పృథివ్యాపస్తేజోవాయురాకాశాః=భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము (అను పంచభూతములు), శుధ్యంతాం = పరిశుద్ధము లయినవి అగుంగాక. (ఇట్టి తలంపుతో నే నొసంగిన ఈ ఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుంగాక.

తా. నాశరీరమునకు ఉపాదానకారణము లగు పృథివ్యాపస్తేజో వాయురాకాశములను పంచభూతములు పరిశుద్ధములయినవి అగుంగాక, నాశరీరమునకు ఉపాదానకారణములగు పంచభూతములు పరిశుద్ధము లగుట వలన తత్కార్యమగు నేనుకూడ పాపరహితుండను, రజోగుణరహితుండను అయి యుందునుగాక, ఇట్టి తలంపుతో నే నొసంగిన ఈ ఆజ్యాహుతి సుహుత మగుంగాక.

మం. ౨. శబ్దస్పర్శరూపరసగన్ధా మే శుధ్యన్తాం జ్యోతి రహం విరజా విపాప్మా భూయాసగ్ం స్వాహా.

టీక. (ఓపరమాత్మా! ఏయవి పరిశుద్ధము లగుటవలన) అహం = నేను, విపాప్మా=పాపరహితుఁడను, విరజాః=రజోగుణ రహితుఁడను, భూయాసం = అయ్యెదనో, అట్టి, మే=నాయొక్క, శబ్ద స్పర్శ రూప రస గంధాః = పంచ భూతములందున్న శబ్ద స్పర్శ రూప, రస గంధ గుణములు, శుధ్యంతాం=పరిశుద్ధము లగుగాఁక. (ఇట్టి యుద్దేశముతో నేనొసంగిన ఈ ఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుఁగాక.

తా. శరీరోపాదానకారణము లగు పంచభూతములందు ఈశబ్ద స్పర్శరూపరసగంధగుణములు గలవు, ఇయ్యవి పరిశుద్ధము లయినయెడల నేను పాపరహితుఁడను, రజోగుణరహితుఁడను అయ్యెదను గాన అట్టి యుద్దేశముతో నేనొసంగిన ఈ ఆజ్యాహుతి సుహుత మగుఁగాక.

మం. 3. మనోవాక్కాయకర్మాణి మే శుధ్యన్తాం జ్యోతిరహం విరజా విపాప్మా భూయాసగ్ం స్వాహా.

టీక. (ఓపరమేశ్వరా! ఏయవి పరిశుద్ధము లగుట వలన) అహం = నేను, విపాప్మా=పాపరహితుఁడను, విరజాః=రజోగుణ రహితుఁడను అయి, జ్యోతిః=జ్యోతిస్స్వరూపుఁడను, భూయాసం=అయ్యెదనో, (అట్టి) మే = నాయొక్క, మనోవాక్కాయ కర్మాణి = మనోవాక్కాయకర్మలు, శుధ్యంతాం=పరిశుద్ధములయినవి అగుఁగాక, ఇట్టి తలంపుతో నే నొసంగిన ఈ ఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుఁగాక.

తా. నాయొక్క మనోవాక్కాయకర్మములు పరిశుద్ధములయినవి అగుఁగాక అని తాత్పర్యము.

(తక్కిన విషయము ౧, ౨ మంత్రములకువలె సమానమే, ౪ ౫, ౬, ౭ మంత్రములు కూడ ఇట్టియర్థము కలవియే కావున విశేషవిషయమును మాత్రము వ్రాసెదను.

మం. ౪. అవ్యక్తభావై రహంకారై ర్జ్యోతిరహం విరజా విపా
ప్మా భూయాసగ్ం స్వాహా॥

టీక. (ఓపరమేశ్వరా! ఏ యవి వదలఁబడినయెడల) అహం = నేను, విపాప్మా = పాపరహితుఁడను, విరజాః = రజోగుణరహితుఁడను, భూయాసం = అయ్యెదనో, (అట్టి) అవ్యక్త భావైః=అప్రకటితాభిప్రాయములగు, అహంకారైః=గర్వములచేత విముక్తుఁడ నయ్యెదనుగాక.

తా. ఓపరమేశ్వరా ! ఏయవి వదలఁబడినయెడల నేను పాపరహితుఁడను రజోగుణ రహితుఁడను అయ్యెదనో, అట్టి అప్రకటితాభిప్రాయములగు అహంకారములు లేనివాఁడ నయ్యెదనుగాక. (తక్కినది సమానమే.)

మం. ౫. ఆత్మా మే శుధ్యన్తాం జ్యోతి రహం విరజా విపాప్మా
భూయాసగ్ం స్వాహా।

మం. ౬. అన్తరాత్మా మే శుధ్యన్తాం జ్యోతి రహం విరజా
విపాప్మా భూయాసగ్ం స్వాహా

మం. ౭. పరమాత్మా మే శుధ్యన్తాం జ్యోతి రహం విరజా
విపాప్మా భూయాసగ్ం స్వాహా।

మం. ౮. క్షుధే స్వాహా

మం. ౯. క్షుత్పిపాసాయ స్వాహా।

మం. ౧౦. వివిట్ట్యై స్వాహా!

మం. ౧౧. ఋగ్విధానాయ స్వాహా।

మం. ౧౨. కషోత్కాయ స్వాహా।

టీక. ౫. (ఓ పరమేశ్వరా! ఎయ్యది పరిశుద్ధము లగుటవలన,) అహం=నేను, విపాప్మా=పాపరహితుఁడను, విరజాః = రజోగుణరహితుఁడను, జ్యోతిః=జ్యోతిస్స్వరూపుఁడను, భూయాసం=అయ్యెదనో, (అట్టి) మే = నాయొక్క, ఆత్మా=శరీరము, శుద్ధ్యంతాం = పరిశుద్ధ మగుఁగాక. (తదర్థము హుతమయిన ఈఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుఁగాక.

౬. (ఓ పరమేశ్వరా! ఎయ్యది పరిశుద్ధమగుటవలన) అహం = నేను, విపాప్మా=పాపరహితుఁడను, విరజాః=రజోగుణరహితుఁడను అయి, జ్యోతిః= జ్యోతిస్స్వరూపుఁడను, భూయాసం=అయ్యెదనో,(అట్టి) మే = నాయొక్క, అన్తరాత్మా=అంతఃకరణము, శుధ్యంతాం = పరిశుద్ధమయినది అగుఁగాక (ఇట్టి తలంపుతో హుతమయిన ఈ ఆజ్యాహుతి) స్వాహా = సుహుత మగుఁగాక.

౭. మే=నాయొక్క, పరమాత్మా=పరమాత్మ, శుద్ధ్యంతాం=పరిశుద్ధ మయిన వాఁడగుఁగాక, అహం=నేను, విపాప్మా=పాపరహితుఁడను, విరజాః= రజోగుణరహితుఁడనై, జ్యోతిః = జ్యోతిస్స్వరూపుఁడను, భూయాసం = అయ్యెదనుగాక, (ఇట్టి తలంపుతో నాచేత హుతమయిన నీ ఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుఁగాక.

౮. క్షుధే=క్షుదధిష్ఠాన దేవతకొఱకు (హుతమయిన ఈ ఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుఁగాక.

౯. క్షుత్పిపాసాయ=క్షుత్పిపాసాధిష్ఠానదేవతలకొఱకు (నేనొసంగిన ఈ ఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుఁగాక.

౧౦. విపిట్ట్యై=విశేషముగా వ్యాపించియుండునట్టి బ్రహ్మమునకు (నేనొసంగిన ఈ ఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుగాక.

౧౧. ఋగ్విధానాయ=వేదమంత్రములను రచించినట్టి (బ్రహ్మము) కొఱకు, (నేనొసంగిన ఈ ఆజ్యాహుతి) స్వాహా=సుహుత మగుగాక.

౧౨. కషోత్కాయ=కార్యప్రపంచమును సృజించుటకు ఉత్సుకత కల పరమేశ్వరునికొఱకు నేనొసంగిన ఈ ఆజ్యాహుతి, స్వాహా = సుహుత మగుగాక.

తా. ౫, ౬, ౭ ఓ పరమేశ్వరా! నాదేహము పరిశుద్ధ మగుటచే నేను పాపరహితుడను, రజోగుణరహితుడను అయి జ్యోతిస్స్వరూపుడ నయ్యెదను, కావున అట్టి తలంపుతో నేను ఈ ఆజ్యాహుతిని హోమము చేయుచున్నాడను, కనుక నేనిచ్చిన యీ ఆజ్యాహుతి సుహుత మగుగాక, నాయంతఃకరణము సైతము పరిశుద్ధ మగుగాక, పరమాత్మయు పరిశుద్ధుడయినవా డగుగాక యనియు తాత్పర్యము, వీనిపరిశుద్ధి సైతము ఆవశ్యక మని భావము, పరమాత్మ నిత్యపరిశుద్ధుడు గదా! అతనికి పరిశుద్ధిని కోరుట ఏలయని తలంపవలదు? అవిద్యాదోషముచేత పరమాత్మ మనకు గనంబడక పోవుటయే అశుద్ధి, స్పష్టముగా గనబడుటయే శుద్ధి.

తా. ౮, ౯, ౧౦, ౧౧, ౧౨ క్షుదధిష్ఠానదేవతకొఱకును, క్షుత్పిపాసాధిష్ఠానదేవతలకొఱకును, విపిట్టి యనగా అంతట వ్యాపించునట్టి పరమాత్మకొఱకును, ఋగ్విధానుడనగా వేదమంత్రములను రచించునట్టి పరమాత్మకొఱకును, కషోత్కుడనగా కార్యప్రపంచమును సృజించవలయు నను ఉత్సాహముగల భగవంతునికొఱకు నేనొసంగిన ఈ ఆజ్యాహుతి సుహుత మగుగాక.

(విపిట్టిః) వి=విశేషేణ, పిట్టిః=వ్యాప్తి యస్య బ్రహ్మణః సః విపిట్టిః విశేషముగా ఏ బ్రహ్మమునకు వ్యాప్తికలదో అతడు విపిట్టి యనబడును.

(బుద్ధిదాః) బుద్ధిం దధాతి = కరోతి వ్యుత్పాదయతీతి బుద్ధి దాః=వేదశాస్త్రములను చేయువాడు బుద్ధిదాయని చెప్పబడును.

(కృతజ్ఞః) కృత్యతే=క్రియత ఇతి కృతః నామ రూప కర్మాత్మకః కార్యప్రపంచః, తస్మిన్ ఉద్యుక్తః=ఉద్యుక్తుడు మహత్వాన్, కృతజ్ఞః, పరమే శ్వరః = చేయబడునది కృతము, అనగా నామరూప కర్మాత్మక మగుకార్య ప్రపంచము, అట్టి ప్రపంచమునందు ఉపకారమును చేయుటకు ఉత్సాహశక్తియు గలవాడు కృతజ్ఞుడు, అనగా సృష్టిస్థిత్యాదులను ఉద్యుక్తుండగు పర మేశ్వరుడు.

మం. ౧౩. క్షుత్పిపాసామలాం జ్యేష్ఠామలక్ష్మీర్నాశయామ్య
హమ్। అభూతిమసమృద్ధిం చ సర్వాం నిర్ణుద మే
పాప్మానగ్ం స్వాహా।

టీక. (ఓపరమేశ్వరా!) అహం = నేను, (నీ యనుగ్రహమువలన) క్షుత్పిపాసామలాం = క్షుత్పిపాసలను మలమును, జ్యేష్ఠాం=అలక్ష్మీః జ్యేష్ఠయగు, అలక్ష్మీం=అలక్ష్మిని, అభూతిం=అనైశ్వర్యమును, అసమృద్ధిం చ = ధనధాన్యాది సమృద్ధి లేకపోవుటను, సర్వాన్=అన్నిటిని, నాశయామి= నాశనము చేయుచున్నాడను, మే = నాయొక్కను, పాప్మానం = పాప మును, నిర్ణుద=నాశనమొనర్పుము, స్వాహా = (ఇట్టి యుద్దేశముతో చేయబడి నన హవిర్ద్రవ్యాహుతి) సుహుతమగుగాక.

తా. ఓపరమేశ్వరా! నేను నీయనుగ్రహమువలన క్షుత్పిపాసలను పెద్దక్కను, అలక్ష్మిని, అనైశ్వర్యమును, ధనధాన్యములు లేకపోవుటను నాశ నము చేయగలను, నాయొక్క సకలపాపములను నీవు పోగొట్టుము, ఇట్టి తలంపుతో నేను ఇచ్చిన ఈ ఆహుతి సుహుతమగుగాక.

మం. ౧౪. అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ
మానన్దమయమాత్మా మే శుద్ధ్యన్తాం జ్యోతి రహం
విరజా విపాప్మా భూయాసగ్ౕం స్వాహా ౮౪ ౬౬

టీక. మే=నాయొక్క, అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞాన మయం ఆనందమయం ఆత్మా = అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞాన మయ ఆనందమయము లనియెడి దేహములు, శుద్ధ్యంతాం=పరిశుద్ధములగుఁ గాక, అహం=నేను, విపాప్మా=పాపరహితుఁడను, విరజాః = రజోగుణరహితుఁడను అయి, జ్యోతిః=జ్యోతిస్స్వరూపుఁడను, భూయాసం=అయ్యెదనుగాక, స్వాహా=(తదర్థమయి నేను వ్రేల్చిన ఈయాజ్యాహుతి) సుహుత మగుఁగాక.

తా. పరమేశ్వరా ! నాయొక్క అన్నమయ ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ ఆనందమయములను కోశపంచకము ఈ ఆజ్యహోమముచేత పరిశుద్ధ మగుఁగాక, నేను ప్రతిబంధక పాపవిరహితుఁడను, పాపమునకు కారణభూతమగు రజోగుణము లేనివాఁడనయి జగత్కారణభూత బ్రహ్మ జ్యోతిస్స్వరూపుఁడ నయ్యెదనుగాక, అట్టి తలంపుతో నేను వ్రేల్చిన ఆజ్యాహుతి సుహుత మగుఁగాక యని తాత్పర్యము.

---

౬౭. సప్తషష్టితమోఽనువాకః

అవ. ఇఁక వైశ్వదేవమంత్రములు చెప్పఁబడుచున్నవి.

మం. ౧. అగ్నయేస్వాహా. ౨. విశ్వేభ్యో దేవేభ్య స్స్వాహా.

౩. ధ్రువాయ భూమాయ స్వాహా. ౪. ధ్రువక్షితయే స్వాహా. ౫. అచ్యుతక్షితయే స్వాహా. ౬. అగ్నయే స్విష్ట కృతే స్వాహా.

టీక. ౧. అగ్నయే = అగ్నిదేవతకొఱకు (అగ్నియందు వ్రేల్వఁబడిన ఈ హవిస్సు,) స్వాహా = సుహుత మగుఁగాక,

౨. విశ్వేభ్యః దేవేభ్యః = విశ్వేదేవతలకొఱకు (అగ్నియందు వ్రేల్వఁబడిన ఈహవిస్సు), స్వాహా=సుహుత మగుఁగాక.

౩. భూమాయ = విస్తారుఁడగు, ధ్రువాయ = ధ్రువుఁడను దేవతకొఱకు (అగ్నియందు వ్రేల్వఁబడిన ఈహవిస్సు) స్వాహా = సుహుత మగుఁగాక.

౪. ధ్రువక్షితయే = ధ్రువక్షితియను పేరుగల దేవతకొఱకు (అగ్నియందు వ్రేల్వఁబడిన ఈ హవిస్సు), స్వాహా=సుహుత మగుఁగాక, (శాశ్వత మగు స్థితికలవాఁడు కావున ధ్రువక్షితి యను పేరు కలిగినది.)

౫. అచ్యుతక్షితయే = అచ్యుతక్షితి యనుపేరుగల దేవతకొఱకు (అగ్నియందు వ్రేల్వఁబడిన ఈహవిస్సు). స్వాహా = సుహుత మగుఁగాక, (నశించనిస్థితిగలవాఁడు కావున అచ్యుతక్షితి యనుపేరు కలిగినది.)

౬. స్విష్టకృతే=స్విష్టకృత్తగు, అగ్నయే=అగ్నికొఱకు (అగ్నియందు వ్రేల్వఁబడిన ఈహవిస్సు, స్వాహా=సుహుత మగుగాఁక, (ఒకానొకప్పుడు ప్రమాదవశముగా అనుష్ఠాత లగువారలు తప్పుగా కర్మల నాచరించినను దానిని, సుఇష్టం కృత్=మిక్కిలి చక్కఁగా చేయువాఁడు, 'స్విష్టకృత్' అగును, ఇట్టి విశేషణముగల అగ్ని, స్విష్టకృత్తని వచింపఁబడును.

తా. అగ్ని, విశ్వేదేవతలు, భూమండగు ధ్రువుడు, ధ్రువక్షితి, అచ్యుతక్షితి, స్విష్టకృద్విశేషణముగల అగ్ని, ఈ మూర్ధన్యదేవతల నుద్దేశించి ప్రకృతము చేయఁబ్రేల్చబడి అన్నాదిరూపమగు హవిస్సు సుహుతమగుఁగాక.

అవ. ఇఁక బలిహరణమంత్రములు చెప్పఁబడుచున్నవి:—

మం. ౭. ధర్మాయ స్వాహా. ౮. అధర్మాయ స్వాహా. ౯. అద్భ్యః
స్వాహా. ౧౦. ఓషధివనస్పతిభ్యః స్వాహా. ౧౧.
రక్షోదేవజనేభ్యః స్వాహా. ౧౨. గృహ్యాభ్యః స్వా
హా. ౧౩. అవసానేభ్యః స్వాహా. ౧౪. అవసానపతిభ్యః
స్వాహా. ౧౫. సర్వభూతేభ్యః స్వాహా. ౧౬. కా
మాయ స్వాహా. ౧౭. అన్తరిక్షాయ స్వాహా. ౧౮.
యదేజతి జగతి యచ్చ చేష్టతి నామ్నో భాగోఽయం
నామ్నే స్వాహా. ౧౯. పృథివ్యై స్వాహా. ౨౦. అన్త
రిక్షాయ స్వాహా. ౨౧. దివే స్వాహా. ౨౨. సూర్యాయ
స్వాహా. ౨౩. చన్ద్రమసే స్వాహా. ౨౪. నక్షత్రేభ్యః
స్వాహా. ౨౫. ఇన్ద్రాయ స్వాహా ౨౬. బృహస్పత
యే స్వాహా. ౨౭. ప్రజాపతయే స్వాహా. ౨౮. బ్రహ్మ
ణే స్వాహా. ౨౯. స్వధా పితృభ్యః స్వాహా. ౩౦.
నమో రుద్రాయ పశుపతయే స్వాహా.

టీక. ౭. ధర్మాయ = ధర్మమను దేవతకొఱకు (వేఱొసంగిన బలి) స్వాహా=సుహుతమగుగాక.

౮. అధర్మాయ = అధర్మమను దేవతకొఱకు (వేఱొసంగిన బలి) స్వాహా=సుహుతమగుగాక.

౯. అద్భ్యః = జలాధిదేవతలకొఱకు (వేఱొసంగిన బలి), స్వాహా=సుహుతమగుగాక.

౧౦. ఓషధివనస్పతిభ్యః = ఓషధివనస్పతి దేవతలకొఱకు (వేఱొసంగి బలి), స్వాహా = సుహుతమగుగాక.

౧౧. రక్షోదేవజనేభ్యః = రాక్షసులకొఱకును, దేవతాభృత్యులకొఱకును (వే ఱొసంగిన బలి), స్వాహా=సుహుతమగుగాక.

౧౨. గృహ్యాభ్యః=గృహమునందున్న పలుదేవతలకొఱకు (వేఱొసంగిన బలి), స్వాహా=సుహుతమగుగాక.

౧౩. అవసానేభ్యః = గృహప్రాంత ప్రదేశదేవతలకొఱకు (వేఱొసంగిన బలి), స్వాహా=సుహుతమగుగాక.

౧౪. అవసానపతిభ్యః = గృహసమీపప్రదేశ దేవతలకొఱకు (వేఱొసంగిన బలి), స్వాహా=సుహుతమగుగాక.

౧౫. సర్వభూతేభ్యః = సమస్తభూతములకొఱకు (వేఱొసంగిన బలి), స్వాహా=సుహుతమగుగాక.

౧౬. కామాయ = లోకత్రయ వ్యామోహకుడగు మన్మథునికొఱకు (వేఱొసంగినబలి), స్వాహా = సుహుతమగుగాక.

౧౭. అంతరిక్షాయ=అంతరిక్ష లోకమునందుండు వారికొఱకు (వేఱొసంగిన బలి), స్వాహా = సుహుతమగుగాక,

౧౮. జగతి = బ్రహ్మాండమునందు, యత్ = ఎయ్యది, ఏజతి=గాలి మున్నగు వానితాఁకుడువలన కదలుచున్నదో, యత్ చ = ఏమనుష్యాదికము, చేష్టతి = కదలుచున్నదో. అయం = ఇదియంతయు, నామ్నః = పరమాత్మ యొక్క, భాగః=భక్షణీయాంశము, నామ్నే=అట్టి, నామ్నే = పరమాత్మ కొఱకు (నేనొసంగినబలి), స్వాహా = సుహుత మగుఁగాక.

౧౯. పృథివ్యై = పృథివ్యధిష్ఠానదేవతకొఱకు (నేనొసంగినబలి), స్వాహా = సుహుత మగుఁగాక.

౨౦. అంతరిక్షాయ = మధ్యమలోకాధిష్ఠానదేవతకొఱకు (నేనొసంగిన బలి), స్వాహా = సుహుత మగుఁగాక.

౨౧. దివే = ద్యులోకాభిమానదేవతకొఱకు (నేనొసంగిన బలి), స్వాహా = సుహుత మగుఁగాక.

౨౨. సూర్యాయ = సూర్యునికొఱకు (నేనొసంగినబలి), స్వాహా = సుహుత మగుఁగాక.

౨౩. చంద్రమసే = చంద్రునికొఱకు (నేనొసంగినబలి), స్వాహా = సుహుత మగుఁగాక.

౨౪. నక్షత్రేభ్యః=నక్షత్రములకొఱకు (నేనొసంగినబలి), స్వాహా= సుహుత మగుఁగాక.

౨౫. ఇంద్రాయ = ఇంద్రునికొఱకు (నేనొసంగినబలి), స్వాహా = సుహుత మగుఁగాక.

౨౬. బృహస్పతయే = బృహస్పతికొఱకు (నేనొసంగినబలి), స్వాహా= సుహుత మగుఁగాక,

౨౭. ప్రజాపతయే = విరాడ్రూపుఁడగు ప్రజాపతికొఱకు (నేనొసంగిన బలి), స్వాహా = సుహుత మగుఁగాక.

౨౮. బ్రహ్మణే = హిరణ్యగర్భరూపుఁడగు వానికొఱకు (నేనొసంగిన బలి), స్వాహా=సుహుత మగుఁగాక.

౨౯. పితృభ్యః = అగ్నిష్వాత్తాది పితృదేవతలకొఱకు, స్వధా = స్వధాకారము (ఈయొసంగఁబడినబలి), స్వాహా=సుహుత మగుఁగాక.

౩౦. పశుపతయే = పశుపతి శబ్దవాచ్యుఁడగు, రుద్రాయ=రుద్రుని కొఱకు, నమః=నమస్కారము, (నేను రుద్రున కొసంగినబలి) స్వాహా = సుహుత మగుఁగాక.

అవ. పంచమహాయజ్ఞమంత్రములును, అగ్రదానమంత్రములును, దివానక్త బలిమంత్రము చెప్పఁబడుచున్నవి:—

మం. ౩౧. దేవేభ్య స్స్వాహా. ౩౨. పితృభ్య స్స్వధా உస్తు.
౩౩. భూతేభ్యో నమః. ౩౪. మనుష్యేభ్యో హన్తా.
౩౫. ప్రజాపతయే స్వాహా. ౩౬. పరమేష్ఠినే స్వాహా.
౩౭. యథా కూప శ్శతధార స్సహస్రధారో అక్షితః । ఏవా మే అస్తు ధాన్యగ్ం సహస్రధార మక్షితమ్ । ధనధాన్యై స్వాహా. ౩౮. యే భూతాః ప్రచరంతి దివా నక్తం బలి మిచ్ఛన్తో వితుదస్య ప్రేష్యాః । తేభ్యో బలిం పుష్టి కామో హరామి మయి పుష్టిం పుష్టిపతి ర్దధాతు స్వాహా ॥౮౮॥

మం॰ ఓషధివనస్పతిభ్యః స్వాహాఽన్తరిక్షాయ స్వాహా నమో రుద్రాయ పశుపతయే స్వాహా ఏతదస్య ప్రేష్యా ఏకం చ ॥౬౭॥

టీక. 3౧. దేవేభ్యః=ఇంద్రాదిదేవతలకొఱకు (అగ్నియందు వ్రేల్వఁబడిన ఈహవిస్సు) స్వాహా = సుహుత మగుఁగాక.

3౨. పితృభ్యః=పితరులకొఱకు, ఈస్వధా=స్వధాకారము, అస్తు = అగుఁగాక.

33. భూతేభ్యః = దేవయోనివిశేషులకొఱకు, నమః = నమస్కారము.

3౪. మనుష్యేభ్యః=మనుష్యులకొఱకు, హంతా = హంతకారము, అనఁగా ఈయన్నము అగ్నియందు హుత మొనర్పఁబడినది.

3౫. ప్రజాపతయే = బ్రహ్మకొఱకు (నేనొసంగినబలి), స్వాహా= సుహుత మగుఁగాక.

3౬. పరమేష్ఠినే=చతుర్ముఖబ్రహ్మకొఱకు (అగ్నియందు వ్రేల్చిన హవిస్సు), స్వాహా=సుహుత మగుఁగాక.

3౭. యథా=ఏవిధముగా, శతధారః సహస్రధారః = నూర్లకొలఁది వేలకొలఁది జలప్రవాహములుగల, కూపః = కూపము, (పలువురు నీరును తోడుకొనుచున్నను) అక్షితః = అక్షయ్యమైనది అగుచున్నదో, ఏవ = ఈ విధముగా, మే=నాకు (పరమేశ్వరుని యనుగ్రహమువలన), ధాన్యం = ధాన్యము, అక్షితం = అక్షయ్యమైనదియు, సహస్రధారం = వేలకొలఁది పుట్ల పరిమాణముగలదియు అగుఁగాక, (తదర్థము, ఈయాహుతి) ధన

ధాన్యై = ధనధానియను పేరుగల దేవతకొఱకు, స్వాహా=సహుత మగుఁగాక.

౩౮. వితుదస్య = శ్మశానవాసియగు కాలాగ్నిరుద్రునకు, ప్రేష్యాః= భృత్యులవంటివారగు, యే=వి, భూతాః = భూతములు, బలిం=బలిని, ఇచ్ఛంతః = కోరుచున్నవై, దివానక్తం = రాత్రింబగళ్లు, ప్రచరంతి=సంచరించుచున్నవో, తేభ్యః = అట్టిభూతములకొఱకు, పుష్టికామః=పుష్టికాముఁడనై, బలిం=బలిని, హరామి = ఇచ్చుచున్నాను, పుష్టిపతిః = ధనధాన్యబలపోషణాదికమునకు ప్రభువగు భగవంతుఁడు, మయి = నాయందు, పుష్టిం= పుష్టిని, దధాతు = స్థాపించుఁగాక.

తా. మొట్టమొదట వైశ్వదేవహోమమంత్రములు ౬ చెప్పఁబడినవి, వీనికే షడాహుతిమంత్రము లనిపేరు, ఇఁక వైశ్వదేవ బలిహరణమంత్రములు ౨౮ న్ని. పంచయజ్ఞమంత్రములు ౫ న్ని, అగ్రదానమంత్రములు ౨ న్ని దివానక్తబలిమంత్రమొకటియు మొత్తము ౩౨ మంత్రములు చెప్పఁదుబచున్నవి:—

౭-౧౭. ధర్మదేవతకొఱకును, అధర్మదేవతకొఱకును, జలాధిదేవతకొఱకును, ఓషధివనస్పత్యధిదేవతలకొఱకును, రక్షోదేవజనులకొఱకును, దేవజనులనఁగా దేవతాభృత్యులనియర్థము గృహ్యలనఁగా గృహసంబంధులు, అనఁగా కులదేవతలకొఱకును, అవసానము లనఁగా గృహసమీప ప్రదేశములు, ఇట్టి ప్రదేశమునందలి దేవతలు అవసాను లనఁబడుచున్నారు, ఇట్టి యవసానులకొఱకును, అవసానపతు లనఁగా గృహసమీపభాగమునందుండు దేవతలకు అధిపతులయిన వారికొఱకును, పంచభూతముల కొఱకును, కాముఁడనఁగా త్రిలోకవ్యామోహకుఁడును రతీపతియు నగు మన్మథనికొఱకును, అంతరిక్షలోకమునందుండు వాయుదేవతకొఱకును, నేనొసంగిన ఈబలులు సుహుతములయినవి అగుఁగాక.

తా. ౧౮. ఈ ప్రపంచమునందు వృక్షాదికమగు ఏపదార్థము వాయ్వాదినిమిత్తముచేత చలించుచున్నదో, పశుపక్ష్యాత్మకమగు ఏపదార్థము గమనాగమనాదిచేష్టలను చేయుచున్నదో, ఉపలక్షణముచేత పర్వతాదికము స్థిరమైయున్నదో, ఏనద్యాదికము ప్రవహించుచున్నదో, ఇది యంతయు పరమాత్మకు భోజ్యమయిన అంశములో చేరినదియే ప్రళయకాలమునందు జగమంతయు పరమాత్మయందు ఉపసంహృతమై యుండుట చేతను, ఒకపరమాత్మయే జగత్తుయొక్క సృష్టిస్థితిలయములకు కర్తయని సిద్ధాంతమై యుండుటచేతను ప్రపంచము పరమాత్మకు భక్షణీయాంశమగుట ఉపపన్నమేయగును. అట్టి జగత్సంహర్త యగు పరమాత్మకొఱకు ఇవ్వఁబడిన ఈహవిస్సు సుహుత మగుఁగాక.

తా. ౧౯-౩౦, పృథివ్యధిష్ఠానదేవతకొఱకును, అంతరిక్షమనఁగా మధ్యమలోకాధిష్ఠానదేవతకొఱకును, ద్యులోకాభిమానదేవతకొఱకును, సూర్యునికొఱకును, చంద్రునికొఱకును, నక్షత్రములకొఱకును, ఇంద్రునికొఱకును, బృహస్పతికొఱకును, విరాట్పురుషునికొఱకును, హిరణ్యగర్భునికొఱకును, పితృదేవతలకొఱకును, పశుపతి యగు రుద్రునికొఱకును నేనొసంగిన ఈ బలిదానము సుహుత మగుఁగాక.

౩౧. ఇంద్రాదిదేవతలకొఱకు నేను అగ్నియందు వ్రేల్చిన హవిస్సు సుహుత మగుఁగాక యని అగ్నియందు హోమము చేయవలయును.

౩౨. పితృదేవతలకొఱకు స్వధ యగుఁ గాక అని అగ్నికి దక్షిణముగా బలిని ఉంచవలయును.

౩౩. భూతములకొఱకు నమస్కారము అని అగ్నికి ఉత్తరముగా బలిని ఉంచవలయును.

౩౪. మనుష్యులకొఱకు ఈహవిస్సు ఒసంగఁబడినది అని నివీతియై అగ్నియందు హవిస్సును హోమము చేయవలయును.

౩౫. ప్రజాపతికొఱకు ఈ హవిస్సు ఉంచబడినది అని పలికి ఉంచవలయును.

సూచనము:—మనుష్యులకు హవిస్సు నొసంగునప్పుడు "హంత" యనుపదమును, దేవతలకు హవిస్సు నొసగునప్పుడు "స్వాహా" యనుపదమును, భూతములకు హవిస్సు నొసగునప్పుడు "నమః" యనుపదమును, పితరులకు కవ్యము నొసంగునప్పుడు 'స్వధా' యనుపదమును మంత్రాంతమునందు చెప్పవలయును, బ్రాహ్మణులు భుజించునప్పుడు "పూజ్యులారా! మాయదృష్టవశమువలన నేడు తమవంటిమహాత్ములు లభించితిరి, తమయోగ్యతకు తగినంత గొప్ప సత్కారమునుచేయ నసమర్థుఁడనై యున్నాఁడను, భక్తిశ్రద్ధలతో నొసగునట్టి నామాతిథ్యమును నాయందనుగ్రహబుద్ధితో స్వీకరింపుఁడు" మున్నగు ఉపచారవాక్యములు పలుకుచున్నయెడల ఆబ్రాహ్మణులెట్టి ప్రీతిని పొందెదరో, అట్లే తమకు హవిస్సు నొసగునప్పుడు. ౧. దేవతలు 'స్వాహా' పదమును, ౨. పితరులు 'స్వధా' పదమును ౩. భూతములు 'నమః' పదమును, ౪. మనుష్యులు 'హంత' పదమును అంతమందు పలికినయెడల అట్టి ప్రీతిని పొందెదరు అని తాత్పర్యము.

౩౬. చతుర్ముఖబ్రహ్మకొఱకు అగ్నియందు వ్రేల్వఁబడిన ఈహవిస్సు సుహుత మగుఁగాక.

౩౭. నూర్లకొలఁది వేలకొలఁది జలప్రవాహములు (ఊటలు) గల బావిలోని యుదకమును ఎందఱు గ్రహించుచున్నను ఆయుదకము తగ్గిపోక మునుపటివలెనే ఎటుల ఊరుచుండునో అట్లే నాయింటియందు ఎంత అధికముగ ఉపయోగించినను తరిగిపోనట్టి వేలకొలఁది పుట్లధాన్యము పరమాత్మయొక్క అనుగ్రహముచేత నాకు కలుగుఁగాక, ఇట్టి యుద్దేశముతో ధనధాని యను పేరుగలదేవతకొఱకు ఈహవిస్సును హుతమొనర్చితిని, ఇయ్యది సుహుత మగుఁగాక.

"ధనాని దధాతి = పోషయతి భక్తానా మితి" 'ధనధాని' (అర్థ. భక్తులయొక్క ధనమును ధాన్యమును పోషించుదేవత 'ధనధాని'.)

౩౮. ఏభూతములు రాత్రింబగళ్ళు బలిని అపేక్షించుచు తిరుగుచున్నవో, అట్టి భూతముల కొఱకు నేను పుష్టికాముఁడనై బలి నొసగుచున్నాఁడను, ఆభూతములు ఎట్టివనఁగా శ్మశానవాసియై కాలాగ్నిరుద్రరూపమున లయకాలమునందు ప్రాణులను పీడించుచున్న రుద్రునియొక్క భృత్యులు, ఇట్టి భూతముల తృప్తికొఱకయి నేను బలిదానము నొసఁగినాఁడను కావున ధనధాన్యాది పోషణమున కధిపతి యగు పరమేశ్వరుఁడు నాకు ధనధాన్యాదిపుష్టిని నాయందు స్థాపించుఁగాక యని తాత్పర్యము.

---

౬౮. అష్టషష్టితమోఽనువాకః.

అవ. జపమాత్రముచేతనే పాపక్షయమును కలుగఁజేయు మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ఓం తద్బ్రహ్మా । ఓం తద్వాయుః । ఓం తదాత్మా ।
ఓం తత్సత్యమ్ । ఓం తత్సర్వమ్ । ఓం తత్పురోర్న
మః। అన్తశ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు।
త్వం యజ్ఞస్త్వం వషట్కారస్త్వమిన్ద్రస్త్వగ్ం రుద్ర
స్త్వం విష్ణుస్త్వం బ్రహ్మత్వం ప్రజాపతిః । త్వం

తదాప ఆపో జ్యోతీ రసో ఽమృతం బ్రహ్మ భూర్భువ
స్సువ రోమ్ ॥౨౯ ౬౮।

టీక. ఓం=ప్రణవ ప్రతిపాద్యమగు, తత్ = ఆవేదాంతవేద్య మగు వస్తువు, బ్రహ్మ = మిక్కిలిగొప్పది, ఓం = ప్రణవప్రతిపాద్యమగు, తత్ = ఆవస్తువే, వాయుః=వాయువు, ఓం=ప్రణవ ప్రతిపాద్యమగు, తత్=ఆవస్తువే, ఆత్మా=జీవుఁడున్ను, ఓం=ప్రణవప్రతిపాద్యమగు, తత్=ఆవస్తువే, సత్యం= సత్యము, ఓం=ప్రణవప్రతిపాద్యమగు, తత్ = ఆవస్తువే, సర్వం=చరాచర జగత్స్వరూపము, ఓం=ప్రణవప్రతిపాద్యమగు, తత్ = ఆవస్తువే, పురః= విస్తీర్ణమగు బ్రహ్మాండమునకు కారణము, (అందువలన ఆవస్తువునకు) నమః= నమస్కారము, (ఇట్టి బ్రహ్మము) విశ్వమూర్తిషు=నానావిధ శరీరములుగల, భూతేషు=ప్రాణులందు, గుహాయాం అంతః = హృదయపుండరీకమధ్యము నందు, చరతి=సంచరించుచున్నది, (ఓపరమేశ్వరా!) త్వం = నీవు, యజ్ఞః= నానావిధక్రతురూపుఁడవు, త్వం = నీవే, వషట్కారః = వషట్కారము, త్వం=నీవే, ఇంద్రః = ఇంద్రుఁడవు, త్వం=నీవే, రుద్రః=రుద్రుఁడవు, త్వం= నీవే, విష్ణుః=విష్ణువు, త్వం=నీవే, బ్రహ్మా=బ్రహ్మవు, త్వం=నీవే, ప్రజాపతిః= విరాట్పురుషుఁడవు, త్వం=నీవే, తత్ = ఆప్రసిద్ధమగు బ్రహ్మాండము, త్వం= నీవే, ఆపః=నద్యాదిగతములగు జలములు, త్వం=నీవే, ఆపః=(సముద్రగతము లగు) జలములు, త్వం=నీవే, జ్యోతిః=సూర్యాదులకుఁ గలతేజస్సు, త్వం= నీవే, రసః=మధురాదిరసము, త్వం=నీవే, అమృతం=అమృతము, త్వం=నీవే, బ్రహ్మ=వేదరాశివి, త్వం=నీవే, భూర్భువస్సువః=భూర్భువ స్సువర్లోకస్వరూ పుఁడవు, (త్వం=నీవే) ఓం=ఓంకారరూపుఁడవగు శబ్దబ్రహ్మమవు.

తా. ఓంకారముచేత ప్రతిపాదింపఁబడినట్టియు, ఉపనిషద్వేద్య మునట్టియు ఆవస్తువే మిక్కిలి గొప్పదైనది, ఆవస్తువే వాయువు, ఆవస్తువే

డేవుఁడు, ఆవస్తువే సత్యస్వరూపము, వేయిమాట లెందుకు? చరాచరాత్మక మగు జగత్తంతయు ఆవస్తువే, ఆవస్తువే ఈవిస్తారమయిన బ్రహ్మాండమునకు కారణము కావున ఆవస్తువునకొఱకు నమస్కారము, మఱియు ఈవిధ మగు బ్రహ్మము నానావిధదేహములు గల ప్రాణులయొక్క హృదయపుండరీక మునందు సంచరించుచుండును. ఈవిధముగ పరోక్షముగ స్తుతియొనర్చి ఇఁక అపరోక్షముగా పరమాత్మను సర్వాత్మకునిగా నిరూపించు చున్నాఁడు:—ఓ పరమేశ్వరా! నీవే నానావిధక్రతుస్వరూపుఁడవు, నీవే వషట్కారము, వషట్కార మనఁగా దేవతలకు హవిస్సు నొసంగునప్పుడు చెప్పెడిశబ్దము. ఇట్లే స్వాహా, స్వధా, హంతశబ్దములు కూడ నీవ యని యుపలక్షణము చేత గ్రహింపవలయును, నీవే ఇంద్రుఁడవు, నీవే బ్రహ్మ, విష్ణువు, రుద్రుఁడు అను మూర్తిత్రయము, నీవే విరాట్పురుషుఁడవు, నీవే బ్రహ్మాండము, నీవే నద్యాదిగతములును సముద్రగతములును అగు జలములు, నీవే చన్ద్ర సూర్యాదులందు గలతేజస్సు, నీవే మధురాదిరసములు, నీవే అమృతము, నీవే వేదరాశివి, నీవే భూః భువః సువః అను లోకత్రయము, నీవే ఓం కారరూప మగు శబ్దబ్రహ్మము అని తాత్పర్యము.

---

౬౯. ఏకోనసప్తతితమోఽనువాకః

అవ. ప్రాణాహుతిమంత్రములు చెప్పఁబడుచున్నవి:—

మం. ౧. శ్రద్ధాయాం ప్రాణే నివిష్టోఽమృతం జుహోమి.

౨. శ్రద్ధాయామపానే నివిష్టోఽమృతం జుహోమి.

3. శ్రద్ధాయాం వ్యానే నివిష్టోఽమృతం జుహోమి.

౪. శ్రద్ధాయాముదానే నివిష్టో ఽమృతం జుహోమి.
౫. శ్రద్ధాయాగ్ం సమానే నివిష్టో ఽమృతం జుహోమి.
౬. బ్రహ్మణి మ ఆత్మా ఽమృతత్వాయ ॥

టీక ౧. శ్రద్ధాయాం=శ్రద్ధ కలిగిన దగుచుండఁగా, ప్రాణే = (శరీరగతములగు ఐదు వాయువులలో) ప్రాణమను పేరుగల మొదటివాయువునందు, నివిష్టః=ఆదరము గలవాఁడనైఁ (అహం=నేను) అమృతం=అమృతతుల్యమగు అనఁగా స్వాదుగుణముగల ఈహవిస్సును, జుహోమి=హోమము చేయుచున్నాఁడను.

౨. శ్రద్ధాయాం=శ్రద్ధ కలిగిన దగుచుండఁగా, అపానే = (శరీరగతములగు ఐదువాయువులలో) అపానమను పేరుగల రెండవవాయువునందు, నివిష్టః=ఆదరముగల వాఁడనై, (అహం=నేను) అమృతం=అమృతతుల్యమగు ఈహవిస్సును, జుహోమి=హోమము చేయుచున్నాఁడను.

3. శ్రద్ధాయాం=శ్రద్ధకలిగిన దగుచుండఁగా, వ్యానే=(శరీరగతములగు ఐదువాయువులలో) వ్యానమను పేరుగల మూఁడవవాయువునందు, నివిష్టః=ఆదరముగలవాఁడనై, (అహం=నేను) అమృతం = అమృతతుల్యమగు ఈ హవిస్సును, జుహోమి=హోమము చేయుచున్నాఁడను.

౪. శ్రద్ధాయాం=శ్రద్ధ కలిగిన దగుచుండఁగా, ఉదానే=(శరీరగతములగు ఐదువాయువులలో) ఉదానమను పేరుగల నాల్గవవాయువునందు, నివిష్టః=అత్యాదరము గలవాఁడనై, (అహం=నేను) అమృతం = అమృతతుల్యమగు ఈహవిస్సును, జుహోమి-హోమము చేయుచున్నాఁడను.

౫. శ్రద్ధాయాం = శ్రద్ధ కలిగినదగుచుండఁగా, సమానే = (శరీరగతములగు ఐదువాయువులలో) సమాన (మను పేరుగల ఐదవ) వాయువునందు, నివిష్టః=అత్యాదరము గలవాఁడనై, (అహం = నేను) అమృతం = అమృతతుల్యమగు ఈ హవిస్సును, జుహోమి = హోమము చేయుచున్నాఁడను.

౬. (ఈ ఐదు ఆహుతులచేత) మే=నాయొక్క, ఆత్మా = జీవుఁడు, అమృతత్వాయ= మోక్షముకొఱకు, బ్రహ్మణి = పరబ్రహ్మమునందు (ఏకీభవతు=ఏకీభవించుఁగాక.)

తా. ౧-౬. శ్రద్ధయనఁగా వేదవిహితకర్మలందు గల విశ్వాసాతిశయము, అట్టి శ్రద్ధ కలిగియుండఁగా నాదేహమునందుండు ఐదువిధములు గలవాయువులలో ప్రాణమను పేరుగల మొదటి వాయువునందు అత్యాసక్తి గలవాఁడనై అమృతముతో సమానమయిన-అనఁగా మంచి స్వాదుగుణముగల హవిస్సును హోమము చేయుచున్నాఁడను, అనఁగా తాను భుజించునట్టి అన్నమునే హవిస్సునుగా భావించి దానిని ఆహవనీయాగ్నిరూపమగు ముఖమునందు వేసికొనుచున్నాఁడ నని భావము. ఇదేవిధముగా అపాన, వ్యాన, ఉదాన, సమాన, వాయువులను గుఱించి చెప్పఁబడిన మంత్రముల అర్థమును గ్రహింపవలయును, నేనిట్టి తలంపుకలిగి ముఖాహవనీయాగ్నియందు హుతమొనర్చిన ఆహుతి పంచకముచేత నాజీవుఁడు మోక్షముకొఱకు పరమాత్మయం దైక్యమగుఁ గాక యని తాత్పర్యము.

అవ. జలపానమంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ౭. అమృతోపస్తరణమసి॥

టీక. (ఓజలమా! నీవు) అమృతోపస్తరణం=(ప్రాణదేవతకు) నశించని ఆస్తరణము, అసి=అయితివి.

తా. ఈమంత్రము భోజనసమయమునందు ప్రథమమున జలప్రాశనార్థము వినియోగింపఁబడుచున్నది, నాచేత పానము చేయఁబడుచున్న ఓ జలమా! నీవు ప్రాణదేవతకు వినాశరహితమగు ఉపస్తరణము అయితివి, ఉపస్తరణమనఁగా మంచము మున్నగు దానిమీఁద నిద్రించుటకుఁగాను సుఖస్పర్శముగా నుండుటకయి పరుచుకొనునట్టి దూదిపరుపు కంబళి మున్నగునది యగును, అట్టి యుపస్తరణము నిద్రించువానికి ఎట్టి సుఖము నొసంగునో అట్లే ఇచట ప్రాణదేవతకును ఈ జల ముపస్తరణ మని భావము. ప్రాణవిద్యయందు వాజసనేయులు ప్రాణదేవతకు జలమును వస్త్రముగా చెప్పియున్నారు:—

మం. శ్రోత్రియా అశిష్యన్త ఆచామన్త్య శిత్వా చామన్త్యేతమేవ తదన్న మనగ్నం కుర్వంతో మన్యంతే. (బృహ. ౬-౧-౧౪.)

(అర్థ. అందువలన భుజింపఁబోవునప్పుడును భుజించిన తర్వాతను ఆచమింపవలయును, ఇటుల చేయుటచేత ఆయన్నమును నగ్నము కానిదానిగా చేయుచున్నాఁడు, నగ్నుఁడనఁగా వస్త్రవిహీనుఁడు అన్నమును నగ్నము కానిదానినిగా చేయుట యనఁగా వస్త్రముచేత ఆచ్ఛాదించుట యగును, ఇచట జలమును వస్త్రముగా పోల్చినాఁడనుట సుప్రసిద్ధము.)

అవ. ప్రాణాహుతివిషయమునందు పక్షాంతరమునందు కొందఱు వికల్పముగా చెప్పిన మంత్రములను చెప్పుచున్నాఁడు:—

మం. ౧. శ్రద్ధాయాం ప్రాణే నివిష్టోఽమృతం జుహోమి ।
శివో మా విశాప్రదాహాయ । ప్రాణాయ స్వాహా. ॥౯౦॥

మం. ౨. శ్రద్ధాయా మపానే నివిష్టో ఽమృతం జుహోమి ।
శివో మావిశాప్రదాహాయ । అపానాయ స్వాహా ।

మం. 3. శ్రద్ధాయాం వ్యానే నివిష్టో ఽమృతం జుహోమి ।
శివో మావిశాప్రదాహాయ । వ్యానాయ స్వాహా ॥

మం. ౪. శ్రద్ధాయా ముదానే నివిష్టో ఽమృతం జుహోమి ।
శివోమా విశాప్రదాహాయ । ఉదానాయ స్వాహా

మం. ౫. శ్రద్ధాయాగ్ం సమానే నివిష్టో ఽమృతం జుహోమి ।
శివో మా విశాప్రదాహాయ । సమానాయ స్వాహా

మం. ౬. బ్రహ్మణి మ ఆత్మా ఽమృతత్వాయ ॥

టీక. ౧. శ్రద్ధాయాం = శ్రద్ధ కలిగిన దగుచుండగా, ప్రాణే = (శరీరగతవాయుపంచకమునందు) ప్రాణ మను పేరుగల ప్రధానవాయువు నందు, నివిష్టః = ఆదరము గలవాఁడనై, (అహం = నేను) అమృతం = అమృతతుల్యమగు హవిస్సును, జుహోమి = హోమము చేయుచున్నాఁడను, (హోమ మొనర్పఁబడిన ఓ పదార్థమా! నీవు) శివః = శాంతమైనదానవై, అప్రదాహాయ = ఆఁకలిచేత కలిగిన దాహము నశించుటకొఱకుగాను, మా = నన్ను, విశ = ప్రవేశించుము, (ఈ హోమమొనర్పఁబడిన ద్రవ్యము) ప్రాణాయ = ప్రాణదేవతకొఱకు, స్వాహా = సమర్పిత మగుఁగాక.

౨. శ్రద్ధాయాం = శ్రద్ధ కలిగిన దగుచుండగా, అపానే = (శరీరగత వాయుపంచకమునందు) అపాన మను పేరుగల రెండవవాయువునందు,

నివిష్టః = ఆదరము గలవాఁడవై, (అహం=నేను) అమృతం = అమృతతుల్యమగు హవిస్సును, జుహోమి = హోమము చేయుచున్నాఁడను, (హోమమొనర్పఁబడిన ఓపదార్థమా! నీవు) శివః = శాంతమైన దానవై, అప్రదాహాయ = ఆఁకలిచేత కలిగిన దాహము నశించుటకొఱకు గాను, మా=నన్ను, విశ=ప్రవేశించుము, (ఈ హోమమొనర్పఁబడిన ద్రవ్యము) అపానాయ = అపానదేవతకొఱకు, స్వాహా = సుహుత మగుఁగాక.

౩. శ్రద్ధాయాం = శ్రద్ధ కలిగిన దగుచుండఁగా, వ్యానే = (శరీరగత వాయుపంచకమునందు) వ్యాన మను పేరుగల మూఁడవ వాయువునందు, నివిష్టః = ఆదరముగలవాఁడవై, (అహం=నేను) అమృతం=అమృతతుల్యమగు హవిస్సును, జుహోమి = హోమము చేయుచున్నాఁడను, (హోమమొనర్పఁబడిన ఓపదార్థమా! నీవు) శాంతః=శాంతమైన దానవై, అప్రదాహాయ = ఆఁకలిచేత కలిగినదాహము నశించుటకొఱకుగాను, మా=నన్ను, విశ=ప్రవేశింపుము, (ఈహోమ మొనర్పఁబడిన ద్రవ్యము. వ్యానాయ = వ్యానదేవతకొఱకు, స్వాహా = సుహుత మగుఁగాక.

౪. శ్రద్ధాయాం=శ్రద్ధ కలిగిన దగుచుండఁగా, ఉదానే=(శరీరగత వాయు పంచకమునందు) ఉదానమను పేరుగల నాల్గవవాయువునందు, నివిష్టః=ఆదరము గలవాఁడవై, (అహం=నేను,) అమృతం=అమృతతుల్యమగు హవిస్సును, జుహోమి=హోమము చేయుచున్నాఁడను, (హోమ మొనర్పఁబడిన ఓపదార్థమా! నీవు) శాంతః = శాంతమైన దానవై, అప్రదాహాయ= ఆఁకలిచేత కలిగిన దాహము నశించుటకొఱకుగాను, మా=నన్ను, విశ=ప్రవేశించుము. (ఈహోమ మొనర్పఁబడిన ద్రవ్యము) ఉదానాయ=ఉదాన దేవతకొఱకు, స్వాహా=సుహుత మగుఁగాక.

౫. శ్రద్ధాయాం శ్రద్ధ కలిగిన దగుచుండఁగా, సమానే=(శరీరగత వాయుపంచకమునందు) సమానమను పేరుగల ఐదవ వాయువునందు,

నివిష్టః = ఆదరముగలవాఁడనై, (అహం = నేను,) అమృతం=అమృత తుల్యమగు హవిస్సును, జుహోమి = హోమము చేయుచున్నాఁడను, (హుతమొనర్పబడిన ఓపదార్థమా! నీవు) శాంతః = శాంతమైనదానవై, అప్రదాహాయ=ఆఁకలిచేత కలిగినదాహము నశించుటకొఱకు గాను, మా=నన్ను, విశ=ప్రవేశింపుము, (ఈహుత మొనర్పఁబడిన ద్రవ్యము) సమానాయ = సమానమను దేవతకొఱకు, స్వాహా=సుహుత మగుఁగాక, మే=నాయొక్క, ఆత్మా=జీవుఁడు, అమృతత్వాయ = మోక్షము కొఱకు. బ్రహ్మమునందు (ఏకీభావమును పొందుఁగాక.)

తా. ౧-౫. శ్రద్ధాపూర్వకముగ నాప్రాణవాయువునందు ఆదరముగల వాఁడనైన నాచేత అమృతతుల్యమగు ఈహవిస్సు హుతమొనర్పఁబడినది. ఇట్టి శ్రదాపూర్వకముగ నాముఖమునందు నాచేత హుతమొనర్పఁబడిన యోపదార్థమా! నీవు శాంతమయినదానవయి ఆఁకలిచేత కలిగిన దాహము నుపశమింపఁ జేయుటకొఱకు నాయందు ప్రవేశింపుము, ఈహుతమొనర్పఁబడిన ద్రవ్యము ప్రాణవాయుదేవతకొఱకు సుహుత మగుఁగాక, శ్రద్ధాపూర్వకముగ నా అపానవాయువునందు ఆదరముగలవాఁడనై అమృతతుల్యమగు ఈహవిస్సును నేను హుత మొనర్చుచున్నాఁడను. హుతమొనర్పఁబడిన ఓపదార్థమా! నీవు శాంతమయినదానవయి ఆఁకలిచేతకలిగిన దాహము నుపశమింపఁ జేయుట కొఱకు నాయందు ప్రవేశింపుము, హుతమొనర్పఁబడిన ఈపదార్థము అపాన వాయుదేవతకొఱకు సుహుత మగుఁగాక, వ్యాన ఉదాన సమానదేవత లందును ఇట్టి తలంపు కలిగియే ఆదరముతో అమృతతుల్యమగు హవిస్సును హుత మొనర్చు చున్నాఁడను కావున ఆపదార్థము శాంతమయినదై ఆఁకలివలన కలిగిన దాహము నుపశమింపఁజేయుగాక, ఈహుత మొనర్పఁబడిన పదార్థము ప్రాణాపాన వ్యానోదాన సమాన వాయుదేవతల కొఱకు సుహుతమగుఁగాక, నాయొక్క జీవుఁడు మోక్షముకొఱకు బ్రహ్మమునం దేకీభావమును పొందుఁగాక అని తాత్పర్యము.

అవ. భోజనానంతరము జలప్రాశనముచేయునట్టి మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. అమృతాపిధానమసి ౬౯।

టీక. (ఆచమనము చేయఁబడుచున్న ఓ జలమా! నీవు) అమృతాపిధానం-అమృత = నశింపని, అపిధానం = ఆచ్ఛాదక మైనదానవు, అసి = అయితివి.

తా. భోజనానంతరము నాచేత ఆచమింపఁబడుచున్న ఓ జలమా! నీవు నశింపని ఆచ్ఛాదకము అగుచున్నావని తాత్పర్యము.

---

౭౦. సప్తతితమోఽనువాకః.

అవ. భోజనానంతరము ఉత్తరాపోశనమును స్వీకరించి కాళ్లుచేతులు కడిగికొనిన పిదప భుజించిన యన్నము నభిమంత్రించునట్టి మంత్రములు చెప్పఁబడుచున్నవి:

మం. ౧. శ్రద్ధాయాం ప్రాణే నివిశ్యామృతగ్ం హుతమ్ ।
ప్రాణమన్నేనాప్యాయస్వ ।

మం. ౨. శ్రద్ధాయా మపానే నివిశ్యామృతగ్ం హుతమ్—
అపాన మన్నేనాప్యాయస్వ ।

మం. 3. శ్రద్ధాయాం వ్యానే నివిశ్యామృతగ్ం హుతమ్ ।
వ్యాన మన్నేనాప్యాయస్వ ।
మం. ౪. శ్రద్ధాయా ముదానే నివిశ్యామృతగ్ం హుతమ్ ।
ఉదాన మన్నేనాప్యాయస్వ ।
మం. ౫. శ్రద్ధాయాగ్ం సమానే నివిశ్యామృతగ్ం హుతమ్ ।
సమాన మన్నేనాప్యాయస్వ ।౬౨ ౭౦॥

టీక. ౧. శ్రద్ధాయాం=వైదికకర్మలందు విశ్వాసాతిశయము కలదగుచుండఁగా, ప్రాణే=ప్రాణవాయువునందు, నివిశ్య = ఆదరాతిశయమును చేసి, అమృతం = నశించినట్టియు స్వాదుభూతముగు అగు (కూహవిస్సు), హుతం= హుతమొర్పఁబడినది, (ప్రాణవాయువునకు అభిమానినివగు ఓదేవీ! నీవు,) ప్రాణం = = ముఖనాసికాసంచారి యగుప్రాణవాయువును, అన్నేన = హుతమొనర్పఁబడిన అన్నముచేత, ఆప్యాయస్వ=వృద్ధిని పొందింపుము.

౨. శ్రద్ధాయాం = వైదికకర్మలందు విశ్వాసాతిశయము కలదగుచుండఁగా, అపానే=అపానవాయువునందు, నివిశ్య = ఆదరాతిశయమును చేసి, అమృతం = నశించనట్టియు స్వాదుభూతమునగు (కూహవిస్సు), హుతం = హుత మొనర్పఁబడినది, (అపానవాయువునకు అభిమానినివగు ఓదేవీ ! నీవు,) అపానం = అపానవాయువును, అన్నేన=హుత మొనర్పఁబడిన అన్నముచేత, ఆప్యాయస్వ = వృద్ధిని పొందింపుము.

3. శ్రద్ధాయాం = వైదికకర్మలందు విశ్వాసాతిశయము కలదగుచుండఁగా, వ్యానే=వ్యానవాయువునందు, నివిశ్య = ఆదరాతిశయమును చేసి,

అమృతం = నశించనట్టియు స్వాదుభూతము నగు (ఈహవిస్సు), హుతం = హుతమొనర్పఁబడినది, (వ్యానవాయువునకు అభిమానిని వగు ఓదేవీ! నీవు), వ్యానం=వ్యానవాయువును, అన్నేన=నాచేత హుతమొనర్పఁబడిన అన్నము చేత, ఆప్యాయస్వ = వృద్ధిని పొందింపుము.

౪. శ్రద్ధాయాం=వైదికకర్మలందు విశ్వాసాతిశయము కలదగుచుండఁగా, ఉదానే=ఉదానవాయువునందు, నివిశ్య = ఆదరాతిశయమును చేసి, అమృతం = నశించనట్టియు స్వాదుభూతమును అగు (ఈహవిస్సు), హుతం= నాచేత హుతమొనర్పఁబడినది, (ఉదానవాయువునకు అభిమానిని వగు ఓదేవీ! నీవు) ఉదానం = ఉదానవాయువును, ఆప్యాయస్వ = వృద్ధిని పొందింపుము.

౫. శ్రద్ధాయాం=వైదిక కర్మలందు విశ్వాసాతిశయము గల దగుచుండఁగా, సమానే = సమానవాయువునందు, నివిశ్య = ఆదరాతిశయమును చేసి, అమృతం=నశించనట్టియు స్వాదుభూతమును అగు (ఈహవిస్సు), హుతం = నాచేత హుతమొనర్పఁబడినది, (సమానవాయువునకు అభిమానిని వగు ఓదేవీ! నీవు) సమానం = సమానవాయువును, ఆప్యాయస్వ = వృద్ధిని పొందింపుము.

తా. ౧-౫. వైదికకర్మలందు నాకు అత్యంతవిశ్వాసము గలదు కావున ప్రాణ వాయువునందు అత్యాసక్తితో, నశించనట్టియు, రుచిగలట్టియు ఈ అన్నాది హవిస్సును హుతమొనర్చితిని, ప్రాణవాయువునకు అభిమానిని వగు ఓదేవీ! హృదయమునందు ఆశ్రయించి ముఖనాసికాగోళములందు సంచరించునట్టి నాప్రాణవాయువును నేను హుతమొనర్చిన అన్నముచేత బలపఱుపుము, ఇచట హుతమొనర్చుట యనఁగా జఠరాగ్నిని అగ్నిగా భావించి మనము శాస్త్రీయమగు ఆహారమును భుజించుటయేయగుచున్నది, ఇదేవిధముగా అపాన వ్యానాదివాయువులందు ఆదరాతిశయము

కలవాఁడనై అపాన, వ్యాన, ఉదాన, సమానవాయువులందును హుతమొనర్చి యున్నాఁడను, ఆయా వాయువులకు అభిమానినులగు దేవులందఱు ఆయా స్థానముల నాశ్రయించిన అపాన, వ్యాన, ఉదాన, సమానవాయువులను నేను హుత మొనర్చిన అన్నముచేత వృద్ధిని పొందించెదరు గాక యని తాత్పర్యము.

---

౭౧. ఏకసప్తతితమోఽనువాకః.

అవ. ఆఁకలి మున్నగు వానివలన కలిగిన చిత్తవిక్షేపము శాంతించిన పిదప భోక్త యగు జీవునకు పరమేశ్వర స్వరూపానుసంధానహేతు భూత మగు మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. అఙ్గుష్ఠమాత్రః పురుషో ఽఙ్గుష్ఠం చ సమాశ్రితః ।
ఈశ స్సర్వస్య జగతః ప్రభుః ప్రీణాతి విశ్వభుక్ ॥

।౯౩।౭౧।

టీక. పురుషః=జీవరూపుఁడగు పురుషుఁడు, అంగుష్ఠమాత్రః = స్వాంగుష్ఠమాత్ర పరిమితిగలవాఁడు, అంగుష్ఠంచ = అంగుష్ఠము మొదలు కొని మస్తకమువఱకు, సమాశ్రితః=ఆశ్రయించి యున్నాఁడు, (అపురుషుఁడు) సర్వస్య=సమస్తమయిన, జగతః=జగత్తునకు, ఈశః=నియామకుఁడు, (కావుననే) విశ్వభుక్ = సర్వము ననుభవించువాఁడు, అట్టి, ప్రభుః=ప్రభువు, ప్రీణాతి= ఈభోజనముచేత తృప్తిని పొందుఁగాక.

తా. హృదయమధ్యగత మగు ఆకాశము స్వాంగుష్ఠపరిమితము, ఆహృదయాకాశమునందున్న బుద్ధియు అంతటిదే, ఆహృదయాకాశమునందున్న బుద్ధిచేత అవచ్ఛిన్నుఁ డగుజీవరూప పురుషుఁడున్ను స్వాంగుష్ఠపరిమితుఁడే, ఆపురుషుఁడు జ్ఞానక్రియాశక్తిచేత అంగుష్ఠము మొదలు శిరస్సువఱకు ఆశ్రయించి యున్నాఁడు, చకారమువలన ఈ యర్థమును మనము గ్రహింపవలయును, ఆ జీవుఁడు ఉపాధిసంబంధములేని వాస్తవ మగు స్వరూపముచేత సకలజగత్తునకు నియంతయై యున్నాఁడు, కావుననే సకల జగద్విషయములను అనుభవించుచున్నాఁడు, అట్టి ఈశ్వరుఁడు ఈభోజనముచేత తృప్తి గలవాఁ డగుఁగాక యని తాత్పర్యము.

౭౨. ద్విసప్తతితమోఽనువాకః.

అవ. భోజనము అయిన పిదప పరమేశ్వరానుసంధానము చెప్పి పిదప భోక్తయొక్క సకలావయవములు స్వస్థతగా ఉండవలయునని కోరుకొనునట్టి మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. వాఙ్మ ఆసన్ । నసోః ప్రాణః అక్ష్యో శ్చక్షుః । కర్ణయో శ్శ్రోత్రమ్ బాహువో ర్బలమ్ । ఊరువో రోజః । అరిష్టా విశ్వాన్యఙ్గాని తనూః । తనువా మే సహ నమస్తే అస్తు మా మా హింసీః ౯౪॥౭౨

టీక. (ఓపరమేశ్వరా!) మే=నాయొక్క, ఆసన్ = నోటియందు, వాక్=వాగింద్రియశక్తియు, నసోః = నాసికాగోళములందు, ప్రాణః = ప్రాణవాయుశక్తియు, అక్ష్యోః = నేత్రగోళకములందు, చక్షుః = ఈక్షణ శక్తియు. కర్ణయోః = కర్ణగోళకములందు, శ్రోత్రం = శ్రవణశక్తియు, (పొందఁబడినవి,) బాహువోః = బాహువులందు, బలం = బలము, (కలిగి నది,) ఊరువోః = తొడలందు, ఓజః=గమనాగమనశక్తి, (సంభవించినది) విశ్వాని=సమస్తమయిన, అంగాని = అవయవములు, అరిష్టాని = స్వస్థము లాయెను, మే=నాయొక్క, తనువా సహ = సూక్ష్మశరీరముతోడ, తనూః = స్థూలశరీరము, (స్వస్థమైనది) తే=నీకు, నమః=నమస్కారము, మా = నన్ను, మాహింసీః = పీడింపకుము.

తా. ఓ పరమేశ్వరా! ఆకంఠము షడ్రససమన్వితముగా తృప్తిగా భుజించిన నాయొక్క ముఖమునందు వక్తృత్వశక్తియు, నాసికాగోళకము లందు ప్రాణశక్తియు, నేత్రగోళకములందు ఈక్షణశక్తియు, కర్ణగోళకము లందు శ్రవణశక్తియు, చక్కఁగా పొందఁబడినది, భుజించుటకు ముందు క్షుత్తుచేత ముఖాద్యవయవములు తత్తదింద్రియశక్తులు లేక వికలములయి యుండినవనియు, భోజనానంతరము మఱల ఆయా ఇంద్రియములకు ఆయా శక్తులు కలిగిన వనియు భావము, కావుననే బాహువులకు బలము కలిగినది, తొడలకు గమనాగమనశక్తి కలిగినది, వేయిమాట లెందుకు? నాసకలావయ వములున్ను హింసితములుగాక స్వస్థములయి యున్నవి, ఆయాయవయవ ములు మాత్రమే తృప్తిచెందినవని యేల? సూక్ష్మశరీరముతోడ నాస్థూల దేహము అంతయు స్వస్థమైనది, ఓ పరమేశ్వరా! నీయనుగ్రహమువల్లనే మా కిట్టి యన్నము లభించి స్థూలసూక్ష్మశరీరములు రెండును పరిశుద్ధములయి నవి, కావున నీకు నమస్కారము అగుఁగాక, ఈ విధముగా ప్రత్యహము సకుటుంబముగ నాకు తృప్తిని కలుగఁజేసి సర్వాంగములకు స్వాస్థ్యమును కలుగఁ

జేసి మరణపర్యంతము నన్నుఁగాని నాకుటుంబములోని వారలనుగాని పీడింప కుము, సుఖపెట్టుము అని తాత్పర్యము.

ఈ మంత్రమును ప్రత్యహము బ్రాహ్మణులు పరమేశ్వరుఁడు మనలకు కలుగఁజేసిన మేళ్లను స్మరణమునకు తెచ్చుకొనుటకుఁగాను భోజనానంతరము పఠించుచున్నారు, కావున అర్థానుసంధానపూర్వకముగా పఠించుటవలన కలిగెడి ఆనందము అనిర్వచనీయము, మఱియు శ్రేయోదాయకము.

---

౭౩. త్రిసప్తతితమోఽనువాకః.

అవ. ఈవిధముగా సర్వాంగస్వాస్థ్యప్రతిపాదకమంత్రమును వచించి సర్వాపక్షయార్థమును, ఉత్తరోత్తరధనప్రాపకము నగు ఇంద్రసప్తర్షిసంవాదరూపక మగు మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. వయస్సుపర్ణా ఉపసేదు రిన్ద్రం ప్రియమేధా ఋషయో నాధమానాః। అపధ్వాన్త మూర్ణుహి పూర్ధి చక్షు ర్ముముగ్ధ్యస్మా న్నిధయేవ బద్ధాన్ ।౯౨॥౭౩॥

టీక. ప్రియమేధాః = సకలప్రాణులకు ప్రియమొనర్చెడి బుద్ధికలిగినట్టియు, సుపర్ణాః = మంచిరెక్కలుగల, వయః = పక్షులవలె మంచిగమనము గల, ఋషయః=సప్తర్షులు, అపధ్వాన్తం = పోఁగొట్టఁబడిన హృదయాంధకారము కలిగినట్టియు, ఇంద్రం=ఇంద్రుని, నాధమానాః = (ఒకదానిని) యాచించుటకు కుతూహలముగల వారలయిరి. (ఆకోరినవిషయ మేదనఁగా), ఓ

పరమేశ్వరా! ఊర్ణుహి = దివ్యము లగు దుకూలాదికముచేత నన్నాచ్ఛాదింపుము, చక్షుః=మాయొక్క కన్నులను, పూర్ధి = (మంచి సౌందర్యముగల పదార్థముల గనంబఱచుచు) నిండించుము, అస్మాన్=మమ్ములను, ముముగ్ధి = పాపములనుండి వదలింపుము, నిధయే=నిధులకొఱకు, అవబద్ధాన్=ఆసక్తులయిన వారలునుగా (మమ్ములను చేయుము).

తా. సర్వప్రాణులకు హితమొనర్చునట్టియు, మంచిఱెక్కలుగల పక్షులవలె శీఘ్రగమనము కలిగినట్టియు సప్తర్షులు ఒకప్పుడు పోఁగొట్టఁబడిన హృదయాంధకారముగల ఇంద్రుని ఒకవిషయమును కోరుటకుగాను భూలోకమునుండి స్వర్గలోకమునకు వెళ్ళిరి, వెళ్ళి ఈక్రిందివిధముగా ఇంద్రుని అడిగిరి:—"ఓఇంద్రుఁడా! మమ్ము దివ్యములగు దుకూలాదిదానములచేత ఆచ్ఛాదింపుము, మానేత్రములకు మంచి సౌందర్యము గల పదార్థములను గనంబఱచుచు, అట్టి పదార్థములను కలుగఁజేయుచు సంతోషపెట్టుము; మమ్ములను సకలవిధము లగు పాపములనుండియు వదలింపుము, మమ్ము లను నిధులకొఱకు ఆసక్తిగలవారలనుగా-అనఁగా బహువిధధనరత్నములు గల నిధులను గల నిధులను గలవారలనుగా మమ్ముల నొనర్పుము."

ఈ విధముగా సప్తర్షులు ఇంద్రుని యాచింపఁగా ఇంద్రుఁడు వారు కోరిన సమస్తభోగములను ఆమహర్షుల కొసంగెను. అంతట ఋషులు సుఖము గలవారలయి భూలోకమునకు వచ్చి తమతమ ఆశ్రమములందు సుఖముగా నుండిరి అను కథాభాగమును పూర్తికొఱకు గ్రహింపవలయును.

౭౪. చతుస్సప్తతితమోఽనువాకః.

౭౫. జపమైన పిదప హృదయమును స్పృశించి జపింపవలసిన మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. ప్రాణానాం గ్రన్థిరసి రుద్రో మా విశాన్తకః । తేనాన్నేనాప్యాయస్వ ॥౯౬।౪౭।

టీక. (హృదయవర్తి వగు నో అహంకారమా! నీవు) ప్రాణానాం = వాయురూపములును ఇంద్రియరూపములును అగు ప్రాణములకు, గ్రంథిః = వదలిపోకుండుటకుగాను ముడివంటిదానవు, అసి = అయితివి, (అట్టి) రుద్రః = (అహంకారాభిమాని దేవతయగు) రుద్రరూపుఁడవగునీవు, అంతకః = దుఃఖ వినాశకుఁడవయి, మా = నాశరీరమును గూర్చి, విశ=ప్రవేశించుము, తేన= ఆ, అన్నేన = (నేనుభుజించిన) అన్నముచేత, ఆప్యాయస్వ=నన్ను వృద్ధిని పొందింపుము.

తా. హృదయాంతర్వర్తి వగు ఓయహంకారమా! నీవు వాయురూపములును ఇంద్రియరూపములును అగు ప్రాణములు పరస్పరము విడిపోక ఉండునటుల ధరించుటకు హేతువగుచున్నావు. అట్టి ఈఅహంకారాభిమాని దేవత యగు ఓ రుద్రుఁడా! దుఃఖమునకు వినాశకుఁడవై నాశరీరమును ప్రవేశించుము, ప్రవేశించి నేను భుజించిన అన్నముచేత నన్ను వృద్ధిని పొందింపుము.

౭౫. పంచసప్తతితమోఽనువాకః

అవ. హృదయాభిమంత్రణమును వచించి పిదప యావజ్జీవము మృత్యుపరిహారము కలుగుటకుఁగాను దేవతాస్తుతి రూపమగు మంత్రము చెప్పఁబడుచున్నది:—

మం. నమో రుద్రాయ విష్ణవే మృత్యుర్మే పాహి॥ ౯౭॥ ౭౫।

టీక. రుద్రాయ = పార్వతీపతికొఱకును, విష్ణవే = లక్ష్మీపతికొఱకును, నమః=నమస్కారము, అస్తు=అగుఁగాక, ఓరుద్ర విష్ణువులారా! మే=నన్ను, మృత్యోః=మృత్యువువల్లనుండి, పాహి=పరిరక్షింపుఁడు.

తా. పార్వతీపతి యగు రుద్రునకును, లక్ష్మీపతియగు విష్ణువునకును నమస్కారము, ఓరుద్రవిష్ణులారా! నన్ను మృత్యువువల్లనుండి కాపాడుఁడు అని తాత్పర్యము.

౭౬. షట్సప్తతితమోఽనువాకః

మం. త్వమగ్నే ద్యుభి స్త్వ మాశుశుక్షణి
స్త్వ మద్భ్య స్త్వమశ్మన స్పరి ।
త్వం వనేభ్య స్త్వ మోషధీభ్య
స్త్వం నృణాం నృపతే జాయసే శుచిః॥ ౯౮॥ ౭౬॥

టీక. అగ్నే=ఓయగ్నీ! త్వం=నీవు, ద్యుభిః = ఉత్తమకాంతులచేత (కూడుకొని యున్నవాఁడవు). త్వం=నీవు, ఆశుశుక్షణిః = (భక్తులగువారల పాపములను) త్వరగానశింపఁజేయువాఁడవు, త్వం = నీవు, అద్భ్యః పరి = జలములకు పైన (కారణముగా నున్నాఁడవు), త్వం=నీవు, అశ్మనః పరి= మహామేరుపర్వతముమీఁద నున్నాఁడవు, త్వం=నీవు, వనేభ్యః = నందనాది సకలవనములందు (విహరించెదవు), త్వం=నీవు ఓషధీభ్యః=సోమలతాదికము లగు ఓషధులందు (వ్యాపించి యున్నాఁడవు), నృపతే=యజమానరూపులగు మనుష్యుల కధిపతివగు ఓయగ్నీ! నృణాం = యజమానులగుమనుష్యులలోపల, జాయసే = శ్రేష్ఠముకొఱకు అగుచున్నాఁడవు, శుచిః=సర్వదా శుచివియే.

తా. ఓయగ్నీ! నీవు ఉత్తమకాంతులు గలవాఁడవై మాయొక్క మృత్యువును నివారింపుము, నీవు భక్తులగువారల పాపాలను శీఘ్రముగా శోషింపఁజేయసమర్థుఁడవు, నీవు జలములకుకారణము, కావున జలములకంటె శ్రేష్ఠమయినవాఁడవు, నీవు మహామేరు శిఖరములందు నైతము గలవు, అనఁగా మహామేరువు అగ్న్యాదిదేవతలకు నివాసస్థానమనుట సుప్రసిద్ధియేగదా! నీవు నందనాది సకలవనములందును విహరించు వాఁడవు. ("వనేషు" అని యుండవలసినందులకు వ్యత్యయముగా "వనేభ్యః" అని యున్నది, చతుర్థికి సప్తమీవిభక్తిని చెప్పుట ఛాందసము, 'ఓషధీభ్యః' అనుచోటకూడ నిట్లే గ్రహింపవలయును), సోమలత మున్నగు సకలఓషధిగణములందును వ్యాపించియున్నాఁడవు, యజమానరూపు లగు మనుష్యులను అధిపతివగు ఓయగ్నీ! నీవు యజమానరూపు లగు మనుష్యులలో పూజ్యుఁడవు, మఱియు నీవు లౌకిక వైదికరూపములగు సకలపదార్థములను హుతమొనర్చుచున్నను, శ్మశానాదికము నందున్నను ఎల్లప్పుడును శుచివియే, ఇట్టి ప్రభావముగల నీవు "మృత్యుసకాశమునుండి మమ్ములను రక్షింపుము" అని పూర్వమంత్రముతో అన్వయము.

---

౭౭. సప్తసప్తతితమోఽనువాకః.

అవ. పరమాత్మను అభీష్టము నొసంగుమని ప్రార్థించు చున్నాఁడు:—

మ. శివేన మే సంతిష్ఠస్వ స్యోనేన మే సంతిష్ఠస్వ సుభూతేన మే సంతిష్ఠస్వ బ్రహ్మవర్చసేన మే సంతిష్ఠస్వ యజ్ఞస్యర్ధి మను సంతిష్ఠస్వోపతే యజ్ఞ నమ ఉప తే నమ ఉపతే నమః ।౯౯।౭౭।

టీక. యజ్ఞ = సర్వయజ్ఞస్వరూపుఁడ వగు నోపరమేశ్వరా! తే= నీకొఱకు, ఉప=సామీప్యమునందు, నమః=నమస్కారము, తే ఉప నమః= నీకు సామీప్యమునందు నమస్కారము, (నీవు) శివేన = కల్యాణప్రదానములో, మే=నాయొక్క, (గృహమునందు) సంతిష్ఠస్వ = ఉండుము, స్యోనేన = ఐహికసుఖప్రదానములో, మే=నాయొక్క, (గృహమునందు) సంతిష్ఠస్వ = ఉండుము, సుభూతేన = మహైశ్వర్య ప్రదానములో, మే = నాయొక్క, (గృహమునందు) సంతిష్ఠస్వ = ఉండుము, బ్రహ్మవర్చసేన = బ్రహ్మవర్చస్సులో, మే=నాయొక్క, (గృహమునందు) సంతిష్ఠస్వ = ఉండుము, యజ్ఞస్య = (నీప్రీతికొఱకు చేయఁబడిన) యజ్ఞముయొక్క, ఋద్ధిం అను = వృద్ధి ననుసరించి (పిదప తత్ఫలము నొసంగుటకుఁ గాను), సంతిష్ఠస్వ = ఉండుము.

తా, సకలయజ్ఞస్వరూపుఁడ వగు ఓపరమేశ్వరా! నీకొఱకు సమీపమునందు నమస్కార మగుఁగాక, అనఁగా నీసన్నిధియందు నీకు సమక్షము

నందు మాటిమాటికి నమస్కారముల నాచరింతు మని భావము, "ఉప తే నమః, ఉప తే నమః" అని రెండుపర్యాయములు చెప్పుట ఆదరార్థము.

ఈవిధముగా మాచేత నమస్కరింపఁబడిన ఓపరమేశ్వరా! సర్వదా నాగృహమునందు కల్యాణప్రదానముతోడ నుండుము, ఐహికసుఖముతోడను, మహైశ్వర్యముతోడను, బ్రహ్మవర్చస్సుతోడను, నాగృహమునందుండుము, ఇట్టి గుణములతోడ నీవు నాగృహమునందు నివసించియున్న యెడల నేనున్ను ఇట్టి గుణములు గలవాఁడను కాఁగలనని ప్రార్థించువాని యభిప్రాయము.

మఱియు నీప్రీతికొఱకై నే నాచరించుచున్న యజ్ఞాదిసత్కర్మల యొక్క ఫలితము నొసంగుటకుఁగాను మాసమీపమునందు కదలక ఉండుము. సంతిష్ఠస్వ = 'సమ్యగచలిత స్సన్ ఉపవిశ' యని యర్థము, అనఁగా లెస్సగా కదలక కూర్చుని యుండుమని శబ్దార్థము, టీకయందు సంగ్రహార్థము "ఉండుము" అని మాత్రమే వ్రాసితిమి.

---

౭౮. అష్టసప్తతితమోఽనువాకః.

అవ. భోజనప్రకరణము, కర్మప్రకరణము సమాప్తమైనవి, సర్వకర్మస్వరూప మగు సంసారబీజదాహార్థము సన్యాసప్రకరణము ఆరంభింపఁబడుచున్నది—జ్ఞానప్రతిబంధకము లగు మహాపాతకముల పరిహారార్థము జ్ఞానయోగ్యలక్షణము గల శుద్ధిసి వచించి యోగ్యుఁడగు పురుషునకు జ్ఞానసాధనములగు కర్మలన్నిఁటిలో సన్న్యాసమే శ్రేష్ఠమయినదని చెప్పఁదలఁచి

ప్రథమమున సన్న్యాసభిన్నము లగు ౧౧ సాధనములను నిరూపించి పిదప దీనికంటె సన్న్యాసము శ్రేష్ఠమయినదని బోధించుచున్నాఁడు:—

మం. ౧. సత్యం పరం పరగ్ం సత్యగ్ం సత్యేన న సువర్గా
ల్లోకా చ్చ్యవన్తే కదాచన సతాగ్ం హి సత్యం
తస్మా త్స త్యే రమన్తే,

మం. ౨ తప ఇతి తపో నానశనా త్పరం యద్ధి పరం తపస్త
ద్దుర్ధర్షం తద్దురాధర్షం తస్మా త్తపసి రమన్తే,

మం. 3. దమ ఇతి నియతం బ్రహ్మచారిణ స్తస్మా ద్దమే రమన్తే,

మం. ౪. శమ ఇత్యరణ్యే మునయ స్తస్మా చ్ఛమే రమన్తే.

మం. ౫. దాన మితి సర్వాణి భూతాని ప్రశగ్ంసన్తి దానా
న్నాతిదుశ్చరం తస్మా ద్దానే రమన్తే,

మం. ౬. ధర్మ ఇతి ధర్మేణ సర్వ మిదం పరిగృహీతం ధర్మా
న్నాతిదుష్కరం తస్మా ద్ధర్మే రమన్తే,

మం. ౭. ప్రజన ఇతి భూయాగ్ంస స్తస్మా ద్భూయిష్ఠాః
ప్రజాయన్తే తస్మా ద్భూయిష్ఠాః ప్రజననే రమన్తే,

మం. ౮. అగ్నయ ఇత్యాహ తస్మా దగ్నయ ఆధాతవ్యాః,

మం. ౯. అగ్నిహోత్ర మిత్యాహ తస్మా దగ్నిహోత్రే రమన్తే,

మం. ౧౦. యజ్ఞ ఇతి యజ్ఞో హి దేవా స్తస్మా ద్యజ్ఞే రమన్తే,

మం. ౧౧. మానస మితి విద్వాగ్ంస స్తస్మా ద్విద్వాగ్ంస ఏవ
మానసే రమన్తే,

మం. ౧౨. న్యాస ఇతి బ్రహ్మా బ్రహ్మా హి పరః పరో హి బ్రహ్మా
తాని వా ఏతాన్యవరాణి పరాగ్ంసి న్యాస ఏవా
త్యరేచయద్య ఏవం వేదేత్యుపనిషత్ ।౧౦౦. ౭౮।

టీక. ౧. సత్యం=సత్యవచనము, పరం = (పురుషార్థసాధనములందు) శ్రేష్ఠమైనది, సత్యం=సత్యవచనము, పరం = (పురుషార్థసాధనములందు) శ్రేష్ఠమైనది, సత్యేన=(యావజ్జీవము) సత్యమునే పలుకుటచేత, సువర్గాత్=స్వర్గలోకమునుండి, కదాచన = ఒకప్పుడున్ను, న చ్యవంతే=తొలఁగరు. సత్యం= సత్యవాక్యము, సతాం = సజ్జనసంబంధమైనది, తస్మాత్ = ఆకారణమువలన, సత్యే=సత్యవాక్యమునందు, రమంతే=క్రీడించుచున్నారు.

౨. తపః ఇతి=తపస్సే మోక్షసాధన మని (కొందఱిమతము), తపః= తపస్సనఁగా, అనశనాత్ = భుజింపకుండుటకంటె, పరం=వేఱయినది, న= లేదు, యత్=ఏ, పరం=శ్రేష్ఠమయిన, తపః = అనశనరూప మగు తపస్సు గలదో, తత్=ఆతపస్సు, దుర్ధర్షం హి=ఇతరులు అతిక్రమించుటకు శక్యము కాదుగదా, తత్ =ఆతపస్సు, దురాధర్షం=చేయుటకు అశక్యమయినదిగదా, తస్మాత్=అందువలన, (కొందఱు మహాత్ములు) తపసి=తపస్సునందు, రమంతే= క్రీడించుచున్నారు.

3. బ్రహ్మచారిణః = నైష్ఠికబ్రహ్మచారులు, దమః ఇతి = దమమే (మోక్షసాధనము) అని, నియతం=ఎల్లప్పుడు, (పలుకుచున్నారు) తస్మాత్ = అందువలన, దమే=దమమునందే, రమంతే=క్రీడించుచున్నారు.

౪. అరణ్యే = అరణ్యమునందుండు, మునయః=మునులు (అనఁగా వానప్రస్థాశ్రములు, శమః ఇతి = శమమే మోక్షసాధన మని పలుకుచున్నారు, తస్మాత్ = అందువలన, శమే = శమమునందు రమన్తే=క్రీడించుచున్నారు.

౫. సర్వాణి భూతాని=సకలప్రాణులు, దానం ఇతి=దానమే మోక్ష సాధనమని, ప్రశంసన్తి = పలుకుచున్నారు, దానాత్=దానముకంటె, అతి దుశ్చరం=మిక్కిలి కష్టముగాఁ జేయవలసినది, న = లేదు, తస్మాత్=అందు వలన, దానే=దానమునందు, రమన్తే=క్రీడించుచున్నారు.

౬. ధర్మః ఇతి = వాపీకూప తటాకాది నిర్మాణరూప మగు తపస్సే మోక్షసాధనభూత మయిన దని (కొందఱు ప్రభువులు పలుకుచున్నారు) ధర్మేణ=ధర్మముచేత, ఇదం=ఈ, సర్వం=సమస్తమైన జగత్తు, పరిగృహీతం= గ్రహింపఁబడియున్నది, ధర్మాత్ =ధర్మముకంటె, అతిదుష్కరం=చేయనశక్య మయినది, న=లేదు, తస్మాత్ = అందువలన, ధర్మే=ధర్మమునందు, రమన్తే= (కొందఱు ప్రభువులు) రమించుచున్నారు.

౭. భూయాంసః = పలువురు, ప్రజన ఇతి = అపత్యోత్పాదనమే (మోక్షసాధనమని తలంచుచున్నారు) తస్మాత్ = అందువలననే. భూయిష్ఠాః = అధికముగా, ప్రజాయంతే = పుట్టుచున్నారు, తస్మాత్ = అందువలన, భూయిష్ఠాః = పలువురు, ప్రజననే = అపత్యోత్పాదమునందు, రమంతే = అనురాగము కలిగియున్నారు.

౮. అగ్నయః ఇతి = అగ్నులే మోక్షసాధన మని, ఆహ = (ఒక వేదజ్ఞుఁడు) పలికెను, తస్మాత్ = అందువలన, అగ్నయః = గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులు, ఆధాతవ్యాః = ఆధాన మొనర్పఁదగినవి.

౯. అగ్నిహోత్రం ఇతి = అగ్నిహోత్రమే మోక్షసాధన మని, ఆహ = (ఒక వేదజ్ఞుఁడు) పలికెను, తస్మాత్ = అందువలన, అగ్నిహోత్రే = అగ్నిహోత్రమునందే, రమన్తే = ఆసక్తు లయియున్నారు.

౧౦. యజ్ఞః ఇతి = యజ్ఞమే మోక్షసాధన మని కొందఱు పలికిరి. యజ్ఞః = యజ్ఞముచేత, దేవాః = దేవతలు, (దివం గతాః హి = స్వర్గమును పొందిరిగదా) తస్మాత్ = అందువల్లనే, యజ్ఞే = యజ్ఞమునందు, రమన్తే = ఆసక్తికలిగి యున్నారు.

౧౧. విద్వాంసః = కొందఱు విద్వాంసులు, మానసం ఇతి = మనోనిష్పాద్యమగు ఉపాసనమే (మోక్షసాధనము) అని (పలుకుచున్నారు) తస్మాత్ = అందువలన, విద్వాంసః = విద్వాంసులు, మానసఏవ = ఉపాసనమునందే, రమంతే = ఆసక్తులయి యున్నారు.

౧౨. బ్రహ్మా = హిరణ్యగర్భుఁడు, న్యాసః ఇతి = (వెనుకవచించిన అగ్నిహోత్రాదికము యొక్క) త్యాగమే (మోక్షసాధనము) అని పలికెను, బ్రహ్మా = ఆహిరణ్యగర్భుఁడు, పరః హి = పరమాత్మగదా, పరః హి = పరమాత్మయే బ్రహ్మా = హిరణ్యగర్భుఁడు, తాని = ఆ, ఏతాని = ఈ సత్యము మున్నగు ౧౧ సాధనములు, పరాంసి వై = శ్రేష్ఠములయినను, అవరాణి =.

(సన్న్యాసాపేక్షచేత) తక్కువవినవే, న్యాసః ఏవ=సన్న్యాసమే, అత్య రేచయత్ = అన్నింటిని అతిక్రమించెను.

౧3. యః=ఏపురుషుఁడు, ఏవం = ఈవిధముగా, వేద = ఎఱుంగుచున్నాఁడో (అవిద్వాంసునకు), ఇతి = ఈవిధమయిన, ఉపనిషత్ = ఉపనిషద్రహస్య మగును.

తా. ౧. ఏవస్తువు ప్రమాణభూతమగు నేత్రాదింద్రియముచేత ఎటుల గ్రహింపఁబడినదో అటులనే వచించుట సత్య మనఁబడును, అట్టి సత్యవచనము పలుకుటయే పరమపురుషార్థ సాధనములలో శ్రేష్ఠమయిన సాధనము, 'పరం సత్యం' మఱల రెండవ పర్యాయము చెప్పుట ఆదరార్థము, (లేక 'పరం సత్య' మనుదానికిది భాష్యమునందు మఱొకవిధముగా వ్యాఖ్యానము చేసియున్నారు:—పరం=బ్రహ్మమువలె, సత్యం = అబాధ్యమైనది, పరబ్రహ్మమెటుల దేశకాలాబాధ్యమో అట్లే సత్యవచనముకూడ వ్యావహారిక బాధారాహిత్యము గలది కావున శ్రేష్ఠమయినదని బోధింపఁ దలఁచి దృష్టాంత రూపముగా 'పరం సత్యం' అని చెప్పఁబడినది.)

జీవించియున్నంతకాలము సత్యవాక్యమును పలుకువాఁడు స్వర్గమునుండి ఒకప్పుడున్ను క్రిందికి దిగఁడు, అనఁగా ఎల్లప్పుడు స్వర్లోకసుఖము ననుభవించుచుండును గాని ఆ పుణ్యము నశించి మఱల భూలోకమునకు రాఁడు, అనృతమాడువారలు మఱొక పుణ్యకర్మము నాచరించి ఒకప్పుడు స్వర్గలోకమును పొందినను, ఆపుణ్యకర్మఫల మున్నంతకాలము స్వర్లోక సుఖము ననుభవించి మఱల వెంటనే అనృతవాదనరూప కర్మఫల మనుభవించుటకుఁ గాను స్వర్గమునుండి భూలోకమును పొందుచున్నారు, "సత్యం" అనుశబ్దమునకు వ్యుత్పత్తి "సతాం ఇదం" సత్యం, అనఁగా 'ఇది సజ్జనుల సంబంధమయినది' అని యర్థము, సత్యము అట్టిది కావున సత్యమే శ్రేష్ఠ

మయిన మోక్షసాధన మని కొందఱు పెద్దలు సర్వదా సత్యమునందు క్రీడించుచున్నారు.

౨. తపస్సే మోక్షసాధన మని కొందఱు పలుకుచున్నారు, తపస్సనఁగా తీర్థయాత్ర, జపహోమాదికము మున్నగునవి అనేకమున్నను ఏకవారాశనము, ఉపవాసము మున్నగు అనశనవ్రతరూపమైనతపస్సే శ్రేష్ఠమయిన తపస్సు, ఇట్టికృచ్ఛ్రచాంద్రాయణాదిరూప మగు తపస్సు ఇతరులు సహింపఁజాలనిది, కావున అట్టిదుశ్శకమయిన తపము మోక్షసాధనముగా భావించి ఆతపస్సునందు ఆసక్తికలిగి కొందఱు మహాత్ము లాచరించు చున్నారు.

౩. దమ మనఁగా వాక్చక్షుశ్శ్రోత్ర జిహ్వా ఘ్రాణాది బాహ్యేంద్రియములను నిషిద్ధములయిన విషయముల పొంతకుఁ బోనీయక యుండుట దమ మనంబడును, ఇదియే ఉత్తమమయిన మోక్షసాధన మని నైష్ఠిక బ్రహ్మచారులు తలంచుచున్నారు, వారు అట్టి దమమునందే సర్వదా ఆసక్తులయి యున్నారు.

౪. అంతఃకరణమునందు కోపము మున్నగు నవి లేకయుండుట శమ మనంబడును, ఇట్టిశమము మోక్షసాధనమని అరణ్యమునందు నివసించుచున్న వానప్రస్థాశ్రమ నిరతులగు మునులు పలుకుచున్నారు, కావున వారలు ఈ శమమునందు ఆసక్తికలిగి యున్నారు.

౫. దాన మనఁగా స్వకీయ మగు గో భూహిరణ్యాదికము శాస్త్రోక్త మార్గము ననుసరించి స్వత్వపరిత్యాగ పూర్వకముగ పరునకు స్వత్వమును వానియందు కలుగఁజేయుట యగును, అట్టి దానమే సర్వోత్తమమగు మోక్షసాధన మని ప్రాణులందఱు ప్రశంస చేయుచున్నారు, దానము చేయుటకంటె దుష్కరమగు కార్యాంతరము లేదు, ధనత్యాగము గదా దాన మగును, లోకమునందు ధనమును రక్షించుకొను నిమిత్తము ప్రాణములను సైతము కోల్పోవుచున్నవారలు గనంబడుచున్నారు, కావునసే

గో భూహిరణ్యాదిదానమునందు ప్రాణులనేకులు ఆసక్తికలిగి యున్నారు.

౬. ధర్మమనఁగా ఇచట స్మృతిపురాణములందు ప్రతిపాదింపఁబడిన వాపీకూపతటాకాది నిర్మాణరూపమయిన ధర్మమని గ్రహించవలయును. అట్టిధర్మమే మోక్షసాధనములలో ఉత్తమ మయినదని కొందఱు ప్రభువులు అమాత్యులు మున్నగువారలు తలంచుచున్నారు, అట్టి ధర్మముచేతనే ఈ ప్రపంచ మంతయు ధరింపఁబడియున్నది, అట్టి వాపీకూప తటాకములందు మనుష్యులు పశువులు మున్నగు ప్రాణిజాతమంతయు స్నానపానాదికము చేత తృప్తిని చెందునుగదా. అట్టి ధర్మముకంటె దుష్కరమగు ధర్మము మఱొక్కటిలేదు, కావున అట్టి ప్రభువులు మున్నగువారు ధర్మమునం దాసక్తులయి యున్నారు.

౭. ప్రజనన మనఁగా సంతానోత్పాదనము, అయ్యదియే ఉత్తమమైన మోక్షసాధన మని పలువు రభిప్రాయపడిరి, కావుననే ధనికులు దరిద్రులు, పండితులు, అపండితులు, శిష్టులు, అశిష్టులు మున్నగు విభేదములేక అందఱు సంతానోత్పత్తి విషయమై ఎక్కువ ప్రయత్నము గలవారుగాఁ గనంబడు చున్నారు, ఒక్కొక్కరు ఇద్దఱు, ముగ్గురు, నలుగురు, ఐదుగురు, ఆర్గుఱు ఈవిధముగా అనేకులగు పుత్త్రులను పొందుచున్నారు, కావున పలువుర ప్రాణులు ప్రజననమునం దాసక్తులయి యున్నారు.

౮. వేదవేత్త యొకఁడు గార్హపత్యాద్యగ్నులు మోక్షమునకు సాధన మని వక్కాణించెను, కావున (గృహస్థునిచేత) అగ్న్యాదాన మాచరణీయము.

౯. అగ్నిహోత్రము—అనఁగా అగ్న్యాధానమయిన పిదప ఆగార్హపత్య, ఆహవనీయ దక్షిణాగ్నులందు సాయంప్రాతఃకాలములందు ఆచరణీయ మగు హోమము అగ్నిహోత్ర మనంబడును, ఆ యగ్నిహోత్రాచరణమే

ఉత్తమ మగు మోక్షసాధన మని ఒక్క వేదవేత్త పలికెను, కావున అగ్నిహోత్రమునం దాసక్తి కలిగి యున్నారు.

౧౦. యజ్ఞ మనఁగా దర్శపూర్ణమాస జ్యోతిష్టోమాది రూపమైనది, ఇట్టి యజ్ఞము మోక్షమునకు ఉత్తమసాధన మని ఒక వేదవేత్త వచించెను, యజ్ఞముచేతనే ఇంద్రాదిదేవతలు స్వర్గలోకమును పొందిరి, ఆకారణము చేతనే ఇప్పటికిని వేదవేత్తలు కొందఱు పూర్వోక్తమగు దర్శపూర్ణమాసాది యజ్ఞమునందు ఆసక్తులయి యున్నారు.

౧౧. సగుణ బ్రహ్మవేత్త లగు విద్వాంసులు మనస్సుచేత చేయఁబడు ఉపాసనమే ఉత్తమ మగు మోక్షసాధన మని పలుకుచున్నారు, కావున వేదప్రతిపాదితోపాసనాతత్త్వము నెఱింగిన పెద్దలు మానసికోపాసనమునందు ఆసక్తుల యున్నారు.

౧౨. న్యాస మనఁగా వదలుట, అనఁగా వెనుక చెప్పఁబడిన అగ్నిహోత్రాది కర్మలను అరుణిజాబాలాద్యుపనిషత్తులందు చెప్పఁబడిన విధిప్రకారము వదలుటయే ఉత్తమ మగు మోక్షసాధన మని హిరణ్యగర్భబ్రహ్మ అభిప్రాయపడినాఁడు, ఆహిరణ్యగర్భుఁడు పరబ్రహ్మమేకాని వెనుక ౧౧ సాధనములను చెప్పిన వారివలె జీవుఁడు కాఁడు, ఈ హిరణ్యగర్భుఁడు దేహధారిగా గనంబడుచున్నను వాస్తవమునకు పరమాత్మయే యని చెప్పవచ్చును, ఇతఁడు ఆ పరమాత్మకు శిష్యుఁడై అతనితో సమానమయిన జ్ఞానము కలిగి యున్నాఁడను విషయము శ్వేతాశ్వతర శ్రుతియందు గలదు:—

శ్రు. యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ
ప్రహిణోతి తస్మై,

వెనుక చెప్పిన సత్యము మొదలుకొని మానసికోపాసనమువఱకు గల ఏకాదశ మోక్షసాధనములు శ్రేష్ఠములయిన కృత్యములే యైనను, సన్న్యాసమును, పూర్వోక్తసత్యవాక్యాది ౧౨ కర్మలను పరిగ్రహించి తరతమ

భావమును విచారించునెడల సన్న్యాసముకంటె సత్యాదిసాధనములు నికృష్టము లగుచున్నవి, కావున మోక్షసాధనము లన్నింటిలో సన్న్యాసమే శ్రేష్ఠతమమయిన సాధన మని సిద్ధాంతము.

ఏపురుషుఁడు ఈవిధముగా—అనఁగా సాధనాంతరములకంటె సన్న్యాసమే మోక్షమునకు ఉత్తమసాధన మని ఎవఁ డెఱుంగునో ఆట్టి విద్వాంసునకు ఈ యుపనిషద్రహస్యభూత మగు విద్య సాధ్యమగుచున్నది.

---

౭౯. ఏకోనాశీతితమోఽనువాకః.

అవ. వెనుకటి యనువాకమునందు చెప్పఁబడిన మోక్షసాధనములను ఉపపాదింపఁదలఁచి ఆఖ్యాయికను చెప్పుచున్నాఁడు:—

మం. ౧. ప్రాజాపత్యో హారుణి స్సుపర్ణేయః ప్రజాపతిం పితరముపససార కిం భగవన్తః పరమం వదన్తీతి తస్మై ప్రోవాచ,

టీక. ప్రాజాపత్యః = ప్రజాపతి పుత్త్రుఁడును, సుపర్ణేయః = సుపర్ణ యను స్త్రీకి పుత్త్రుఁడును అగు, ఆరుణిః = ఆరుణి యనువాఁడు, పితరం = తండ్రియగు, ప్రజాపతిం = ప్రజాపతిని, ఉపససార = (ఉత్తమసాధన జిజ్ఞాసచేత) సమీపమునకు చేరెను, (సమీపమునకు చేరి ఓ ప్రజాపతీ!) భగవంతః = పూజ్యులగు మహర్షులు పరమం = ఉత్తమ మగు మోక్షసాధనమును, కిం వదన్తి ఇతి = దేనిని చెప్పుచున్నారని (ప్రశ్నమొనర్చెను), తస్మై = అట్టి పృచ్ఛనొనర్చిన ఆరుణికి ప్రోవాచ = (ప్రజాపతి) ఈవిధముగా పలికెను.

తా. ప్రజాపతికి సువర్ణయను స్త్రీయందు జన్మించిన ఆరుణి యను వాఁడు తండ్రియగు ప్రజాపతివద్దకును మోక్షసాధనములలో ఉత్తమమైనది ఏది ? అని యడుగఁ దలఁచి అతనిసమీపమునకుఁ బోయి ఓ ప్రజాపతీ! మహర్షులు మోక్షసాధనములలో ఉత్తమమయిన సాధనము దేనినిగా పలుకుచున్నారో ఆవిషయమును నాకు బోధింపుము అని యడుగఁగా ప్రజాపతి ఈవిధముగా వచించెనని తాత్పర్యము.

మం. ౨. సత్యేన వాయు రావాతి సత్యే నాదిత్యో రోచతే
దివి సత్యం వాచః ప్రతిష్ఠా సత్యే సర్వం ప్రతిష్ఠితం
తస్మా త్సత్యం పరమం వదన్తి,

టీక. సత్యేన=సత్యముచేతనే, వాయుః = వాయువు, ఆవాతి = అంతరిక్షమునందు వీచుచున్నాఁడు, సత్యేన = సత్యముచేతనే, ఆదిత్యః = ఆదిత్యుఁడు, రోచతే దివి = ద్యులోకమునందు ప్రకాశించు చున్నాఁడు, సత్యం=సత్యము, వాచః=వాక్కునకు, ప్రతిష్ఠా=స్థిరమగు స్థానము, సత్యే = సత్యభాషణమునందు, సర్వం = సమస్త వ్యవహారజాతము, ప్రతిష్ఠితం=ప్రతిష్ఠింపఁ బడియున్నది, తస్మాత్ = ఆకారణమువలన, సత్యం = సత్యభాషణమునే, పరమం = శ్రేష్ఠమయిన మోక్షసాధనముగా, వదన్తి = (కొందఱు సత్యానుష్ఠానశీలురు) పలుకుచున్నారు.

తా. ఏవాయువు అంతరిక్షమునందు ఇపుడు వీచుచున్నదో ఆవాయువు పూర్వజన్మమునందు మనుష్యమాత్రుఁడై యుండి సత్యవాక్య పరిపాలనముచేసి అసత్యవాక్యపరిపాలనముచేత కలిగిన బలమువలన వాయుదేవతాత్వమునుపొంది లోకానుగ్రహార్థము అంతరిక్షమునందు వీచుచున్నాఁడు, ఇదే విధముగా ఆదిత్యుఁడున్ను పూర్వజన్మమునందు మనుష్యమాత్రుఁడై యుండి

సత్యవాక్యపరిపాలనముచేత ఈ జన్మమునందు ఆదిత్యదేవతాత్వము పొంది ద్యులోకమునందు ప్రకాశించుచున్నాఁడు, సత్యమే వాగింద్రియమునకు స్థిర మగు సాధనము, అనృతము సైతము వాగింద్రియముచేతనే పలుకఁబడుచున్నను ఇతరులచేత నిరాకరింపఁబడును కావున వాక్కునకు ప్రతిష్ఠ యని చెప్పవలనుపడదు, అట్టి సత్యభాషణమునందు ప్రామాణిక మగు వ్యవహారజాతమంతయు ప్రతిష్ఠింపఁబడియున్నది, ఆకారణమువలన సత్యమే ఉత్తమమయిన మోక్షసాధన మని సత్యానుష్ఠానశీలురు పలుకుచున్నారు, ఇది ప్రథమసాధనము.

అవ. పుత్త్రుఁడగు ఆరుణి తండ్రియగు ప్రజాపతి ప్రథమమున వచించిన సత్యరూపసాధనమును ఆలకించి ముఖవికాసాదికమును పొంద నందువలన ఇతనికి తృప్తికాలేదను విషయమును ప్రజాపతి యెఱింగి సాధనాంతరమును చెప్పుచున్నాఁడు (ఈచెప్పఁబోవునది రెండవసాధనము):—

మం. 3. తపసా దేవా దేవతా మగ్ర ఆయ న్తపస ఋషయ

స్సువ రన్వవిన్ద న్తపసా సపత్నా న్ప్రణుదామారాతీ

స్తపసి సర్వం ప్రతిష్ఠితం తస్మా త్తపః పరమం వద న్తి,

టీక. దేవాః = (ఇపుడు స్వర్గమునందున్న అగ్నీంద్రాది) దేవతలు, అగ్రే = పూర్వజన్మమునందు (చేయఁబడిన అన్నపరిత్యాగరూపమయిన కృచ్ఛ్రచాంద్రాయణాదిరూపమగు), తపసా=తపస్సుచేత, దేవతాం=(ఇప్పటి) దేవత్వమును, ఆయన్=పొందిరి, ఋషయః = వసిష్ఠాదిమహర్షులు, తపసా= తపస్సుచేతను, సువః = స్వర్లోకమును, అన్వవిన్దన్ = క్రమముగా పొందిరి, (మేమిపుడు) తపసా = తపస్సుచేత, అరాతీన్ = అస్మదీయ ద్రవ్యాప

భమునను విరోధులగు, సపత్నాన్ = శత్రువులను, ప్రణుదామ = నిరాకరించు చున్నారము, సర్వం = సమస్తమయిన ఫలజాతము, తపసి = తపస్సునందు, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠింపఁబడి యున్నది, తస్మాత్ = అందువలన, తపః = అనశనరూపమగు తపస్సే. పరమం=ఉత్తమమయిన మోక్షసాధనమని, వదన్తి=(తదనుష్ఠాతలు) పలుకుచున్నారు.

అవ. ఈసాధనమునందును సంతోషము లేనివానినిగా తెలిసికొని సాధనాంతరమును చెప్పుచున్నాఁడు:—

మం. ౮. దమేన దాన్తాః కిల్బిష మవధూన్వన్తి దమేన బ్రహ్మచారిణ స్సువ రగచ్ఛన్దమో భూతానాం దురాధర్షం దమే సర్వం ప్రతిష్ఠితం తస్మా ద్దమః పరమం వదన్తి,

టీక. దాన్తాః = బాహ్యేంద్రియ నిగ్రహము గల పురుషులు దమేన=దమముచేత, కిల్బిషం = పాపమును, అవధూన్వన్తి = నాశనముచేసికొనుచున్నారు, దమేన = దమముచేత, బ్రహ్మచారిణః = నైష్ఠిక బ్రహ్మచారులు, సువః=స్వర్గలోకమును, అన్వగచ్ఛన్ = పొందిరి, దమః = దమము, భూతానాం=భూతములకు, దురాధర్షం=దుస్సహము, దమే=దమమునందు, సర్వం=సమస్తమయిన ఫలము, ప్రతిష్ఠితం=ప్రతిష్ఠింపఁబడియున్నది, తస్మాత్= ఆకారణమువలన, దమః=దమమే, పరమం = శ్రేష్ఠమయిన మోక్షసాధనమని, వదంతి=(కొందఱు) పలుకుచున్నారు.

తా. బాహ్యేంద్రియ నియమన శీలురగు పురుషులు దమముచేత తమపాపమును పోఁగొట్టుకొనుచున్నారు, దమముచేతనే నైష్ఠికబ్రహ్మచారులు స్వర్గలోకమును పొందిరి, దమమును ఆచరించుట భూతములకు చాల దుస్స

హము, ఆదమమునందు అపేక్షిత మగు ఫలమంతయుఁగలదు, ఆకారణము వలన దమమే ఉత్తమ మగు మోక్షసాధన మని తదనుష్ఠాతలు పలుకుచున్నారు,

అవ. ఈసాధనమునందును సంతోషము లేనివానినిగా గ్రహించి సాధనాంతరము బోధించుచున్నాఁడు. (తక్కిన సాధనములనుకూడ ఇట్టి తలంపు కలిగియే ప్రజాపతి ఆరుణికి బోధించినాఁడని గ్రహింపవలయును):—

మం. ౫. శమేన శాన్తా శ్శివ మాచరన్తి శమేన నాకం మునయో ఽన్వవిన్ద ఞ్ఛమో భూతానాం దురాధర్షం
శమే సర్వం ప్రతిష్ఠితం తస్మా చ్ఛమః పరమం వదన్తి.

టీక. శాంతాః = కామక్రోధాది దుర్గుణములు లేక శాంత మగు అంతఃకరణము గలవారలు, శమేన=శమముచేత, శివం=మంగళకర మగుపురుషార్థమును, ఆచరంతి = చేయుచున్నారు, మునయః=నారదాదిమునీశ్వరులు, నాకం=స్వర్గమును, అన్వవిందన్ = పొందిరి, శమః=శమము, భూతానాం= భూతములకు, దురాధర్షం=దుస్సహము, శమే=శమమునందే, సర్వం = సమస్తము, ప్రతిష్ఠితం=ప్రతిష్ఠింపఁబడినది, తస్మాత్=అందువలన, శమః=శమము పరమం = ఉత్తమమయిన మోక్షసాధనమని, వదంతి = (తదనుష్ఠాతలు) పలుకుచున్నారు.

తా. శాంతులనఁగా అంతఃకరణమునందు కామక్రోధాది దుర్గుణవృత్తులు లేని వారలు, ఇట్టివారలు శమముచేత మంగళకరమగు పురుషార్థము నాచరించుచున్నారు. శమముచేతనే నారదాదిమహామునులు స్వర్గలోకము

పొందిరి, ఈశమము నాచరించుట భూతములకు చాలకష్టము కావున అట్టి శమమే ఉత్తమమగు మోక్షసాధన మని తదనుష్ఠాతలు పలుకుచున్నారు.

మం. ౬. దానం యజ్ఞానాం వరూథం దక్షిణా లోకే దాతా
రగ్ం సర్వభూతాన్యుపజీవంతి దానేనారాతీ రపా
నుదన్త దానేన ద్విషన్తో మిత్రాభవంతి దానే సర్వం
ప్రతిష్ఠితం తస్మా ద్దానం పరమం వదన్తి,

టీక. దానం = గోభూహిరణ్యాది దానము, యజ్ఞానాం=యజ్ఞముల యొక్క సంబంధమయిన, దక్షిణా = దక్షిణ యగుచున్నది, (అందువలన) వరూథం=శ్రేష్ఠమయినది, లోకే = లోకమునందు, దాతారం=దాతను, సర్వ భూతాని=భూతములన్నియు, ఉపజీవన్తి = ఆశ్రయించుచున్నవి, దానేన= దానముచేత, అరాతీః=శత్రువులను, అపానుదన్త = నిరాకరించుచున్నారు, దానేన = దానముచేత, ద్విషంతః = ద్వేషించుచున్నవారలును, మిత్రాః = మిత్రులు, భవంతి = అగుచున్నారు, దానే = దానమునందు, సర్వం=సమస్త మైనదియు, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠింపఁబడియున్నది, తస్మాత్ = ఆకారణము వలన, దానం=దానము, పరమం=శ్రేష్ఠమయిన మోక్షసాధన మని, వదంతి= (తదనుష్ఠాతలు) పలుకుచున్నారు.

తా. గోభూహిరణ్యాది దానమే యజ్ఞసంబంధ మగు దక్షిణ యగుచున్నది, కావున ఆదానము శ్రేష్ఠ మయినది, లోకమునందును దాతయగు వానిని వేదశాస్త్రవేత్తలు, మూర్ఖులు మున్నగు వారందఱు ఆశ్రయించుచున్నారు, మఱియు యుద్ధసమయములందు రాజులు భటులగు వారలకు ధన మొసంగి వారికి ఉత్సాహము పుట్టించి తమతమ శత్రురాజులను అవలీలగా జయించుచున్నారు, ప్రబలవిద్వేషులయినవారలు ధనదానముచేత సంతుష్టు

లయి మిత్రులగుచున్నారు, ఇట్లు దానములందు సమస్తముగలదు కావున ఈ దానమే మోక్షసాధనములలో ఉత్తమమయిన దని తదనుష్ఠాతలు పలుకు చున్నారు.

మం. ౭. ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా లోకే ధర్మిష్ఠం ప్రజా ఉపసర్పంతి ధర్మేణ పాప మప నుదతి ధర్మే సర్వం ప్రతిష్ఠితం తస్మా ద్ధర్మం పరమం వదన్తి,

టీక. ధర్మః=ధర్మము, విశ్వస్య = సమస్తమగు, జగతః = ప్రపంచమునకు, ప్రతిష్ఠా=ఆశ్రయభూతము, లోకే=లోకమునందు, ధర్మిష్ఠం=మిక్కిలి ధర్మమునం దుండువానిని, ప్రజాః = ప్రజలు, ఉపసర్పన్తి = సమీపమును పొందుదురు, ధర్మేణ = ధర్మముచేత, పాపం = పాపమును, అపనుదతి = పోఁగొట్టుకొనుచున్నాడు, ధర్మే=ధర్మమునందు, సర్వం = సమస్తము, ప్రతిష్ఠితం=ప్రతిష్ఠింపఁబడియున్నది, తస్మాత్ = అందువలన, ధర్మం = ధర్మము, పరమం=శ్రేష్ఠమయిన మోక్షసాధనమని, వదన్తి = (తదనుష్ఠాతలు) పలుకు చున్నారు.

తా. ధర్మమనఁగా శ్రుతిస్మృతులందు ప్రతిపాదింపఁబడిన వాపీ కూప తటాక వనాది నిర్మాణరూప మయినది, ఇట్టి ధర్మము సమస్తమయిన ప్రపంచమునకు ఆశ్రయ భూతమయి యున్నదను విషయము సుప్రసిద్ధము, అట్టి ధర్మకార్యముల నాచరించువాని సమీపమునకు ప్రజలు అతిశయముగా పోవుచుందురు, (ప్రాయశ్చిత్తరూపముగా విధింపఁబడిన) ఈ ధర్మకార్యము వలన పాపములను సైతము పోఁగొట్టుకొనుచున్నారు, ఈధర్మమునందే సమస్తము ప్రతిష్ఠితమయి యున్నదికావున ఇయ్యదియే ఉత్తమమగు మోక్ష సాధన మని ధర్మానుష్ఠాతలు పల్కుచున్నారు.

మం. ౮. ప్రజననం వై ప్రతిష్ఠా లోకేసాధు ప్రజాయాస్త
స్తుం తన్వానః పితృణా మనృణో భవతి తదేవ తస్యా
అనృణం తస్మా త్ప్రజననం పరమం వదన్తి,

టీక. ప్రజననం = పుత్రోత్పాదనము, ప్రతిష్ఠావై = (గృహస్థులకు) ప్రతిష్ఠగదా, లోకే=లోకమునందు, ప్రజాయాః=ప్రజయొక్క, తంతుః = తంతువును, సాధు=శాస్త్రీయముగా, తన్వానః = విస్తరింపఁజేయువాఁడు, పితృణాం=పితరులకు, అనృణః = ఋణవిముక్తుఁడు, భవతి=అగుచున్నాఁడు, తత్ ఏవ=ఆప్రజనమే, తస్య=అగృహస్థునకు, అనృణం = ఋణములేకపోవుట, తస్మాత్=అందువలన, ప్రజననం= ప్రజననమును, పరమం=శ్రేష్ఠ మగు మోక్ష సాధనముగా, వదంతి= (తదనుష్ఠాతలు) పలుకుచున్నారు.

తా. ప్రజనన మనఁగా పుత్రోత్పాదనము, ఈ ప్రజననము గృహస్థులకు ప్రతిష్ఠయగుచున్నది, పుత్రుఁడు గృహకృత్య నిర్వాహకుఁ డగును గావున ప్రజనము గృహస్థునకు ప్రతిష్ఠ యనుట యుక్తమే యగును, "సోఽయం మనుష్యలోకః పుత్రేణైవ జయ్యో నాన్యేన కర్మణా" అని శ్రుతి గలదు, అర్థ. ఈమనుష్యలోకము పుత్త్రునిచేతనే జయింపఁదగినది, ఇతరకర్మచేత కాదు, మఱియు పుత్రపౌత్రాదిరూప ప్రజాతంతువును యథాశాస్త్రముగా విస్తరింపఁజేయువాఁడు మృతులకు పితృపితామహులకు అనృణుఁ డగుచున్నాఁడు, అనఁగా పితృపితామహులకు మనము ఇవ్వవలసిన ఋణము పుత్రోత్పత్తి యగునేని వారికి ఆఋణము తీర్చినటుల యగుచున్నది, ఇట్లు ప్రజననమే ఋణాపాకరణమునకు హేతువు కావున అయ్యదియే ఉత్తమ మగు మోక్షసాధన మని కొందఱు పలుకుచున్నారు.

మం. ౯. అగ్నయో వై త్రయీ విద్యా దేవయానః పన్థా

గార్హపత్య ఋక్పృథివీ రథంతర మన్వాహార్యపచ
నం యజు రంతరిక్షం వామదేవ్య మాహవనీయ
స్సామ సువర్గో లోకో బృహత్తస్మా దగ్నీ న్పరమం
వదన్తి,

టీక. అగ్నయః=గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులు, త్రయీ విద్యా=వేదత్రయసంబంధ మగు విద్యారూపము, దేవయానః=దేవతాప్రాపక మగు, పంథాః = మార్గము, (ఆయగ్నిత్రయములో) గార్హపత్యః = గార్హపత్యాగ్ని, ఋక్=ఋగ్వేదము, పృథివీ = భూలోకము, రథంతరం = రథంతర సామము అని (ప్రశంసచేయఁబడుచున్నది); అన్వాహార్యపచనం = దక్షిణాగ్ని, యజుః=యజుర్వేదము, అంతరిక్షం=అంతరిక్షలోకము, వామదేవ్యం= వామదేవసామము; ఆహవనీయః = ఆహవనీయాగ్ని, సామ=సామవేదము, సువర్గోలోకః=సువర్గలోకము, బృహత్ = బృహద్రథంతర సామాత్మకము; తస్మాత్=అందువలన, అగ్నీన్ = గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులనే, పరమం=శ్రేష్ఠమయిన మోక్షసాధనము అని, వదంతి = (అగ్న్యాధానము ఆచరించిన వారలు) పలుకుచున్నారు.

తా. గార్హపత్యాఽఽహవనీయ దక్షిణాగ్ను లను అగ్నిత్రయమే వేదత్రయాత్మకము, వేదత్రయమునందు గల సకలకర్మలకు సాధనమగుట చేతను వేదవిహితమగుటచేతను అగ్నిత్రయము త్రయీవిద్య యగుచున్నది, అగ్నిత్రయమే యాగరూపముగా దేవత్వప్రాపక మగుచున్నది గావున దేవ యానమార్గమనియు చెప్పఁబడినది; ఆయగ్నిత్రయములో:

౧. గార్హపత్యాగ్ని—ఋగ్వేదాత్మకము, పృథివీలోకరూపము, రథంతరసామాత్మకము అనియు;

౨. అన్వాహార్యపచనమనఁగా దక్షిణాగ్ని—యజుర్వేదాత్మకము, అంతరిక్షలోకాత్మకము, వామదేవ్యసామాత్మకము అనియు;

3. ఆహవనీయాగ్ని—సామవేదాత్మకము, సువర్లోకాత్మకము, బృహద్రథంతర సామాత్మకము అనియును ప్రశంసింపఁబడినది; కావున అగ్నిత్రయాధానమే మోక్షసాధనములలో ఉత్తమ మగు సాధనమని అహితాగ్నులు పలుకుచున్నారు.

మం. ౧౦. అగ్నిహోత్రగ్ం సాయంప్రాత ర్గృహాణాం ని
ష్కృతి స్స్విష్టగ్ం సుహుతం యజ్ఞక్రతూనాం
ప్రాయణగ్ం సువర్గస్య లోకస్య జ్యోతి స్తస్మా ద
గ్నిహోత్రం పరమం వదన్తి,

టీక. సాయంప్రాతః = సాయం ప్రాతఃకాలములందు, అగ్నిహోత్రం = అగ్నిహోత్రాచరణము, గృహాణాం = గృహములకు, నిష్కృతిః = క్రయసాధన మగు మూల్యము; మఱియు, స్విష్టం = శోభనయాగ రూపమైనది, సుహుతం = శోభన హోమరూపమైనది, యజ్ఞక్రతూనాం = యజ్ఞక్రతువులకు, ప్రాయణం = ప్రారంభము, (కావుననే) సువర్గస్యలోకస్య = స్వర్గలోకమునకు, జ్యోతిః = ప్రకాశకము తస్మాత్ = అందువలన, అగ్నిహోత్రం=అగ్నిహోత్రము, పరమం=ఉత్తమమయిన మోక్షసాధనము అని, వదంతి=(అగ్నిహోత్రానుష్ఠాతలు) పలుకుచున్నారు.

తా. సాయంప్రాతః కాలములందు అగ్నిహోత్రాచరణము గృహములకు క్రయసాధన మగుమూల్యము, అనఁగా అగ్నిహోత్రమును సాయంప్రాతఃకాలములందు చేయనియెడల అగ్ని క్షుధితుఁడై గృహములను దహించును గావున అట్టిది లేకుండా గృహములను అగ్నిహోత్రము సంరక్షించు

చున్నది కావున గృహములకు నిష్కృతియని చెప్పఁబడినది, ఈ అగ్నిహోత్రమే యాగరూపమున్నూ హోమరూపమున్నూ అయియున్నది. దేవత నుద్దేశించి ద్రవ్యత్యాగము యాగ మగును, ఆ ద్రవ్యమును అగ్నియందు ఉంచుట హోమమగును, మఱియు ఈయగ్నిహోత్రమే యజ్ఞములకు క్రతువులకు ప్రారంభము.

యజ్ఞములనఁగా—అగ్న్యాధేయము, అగ్నిహోత్రము, దర్శపూర్ణ మాసలు, ఆగ్రయణము, చాతుర్మాస్యము, నిరూఢపశుబంధము అని సప్త హవిర్యజ్ఞములు; క్రతుశబ్దము యూపముగల సోమయాగములందు రూఢమయి యున్నది—అగ్నిష్టోమము, అత్యగ్నిష్టోమము, ఉక్థ్యము, షోడశి, వాజపేయము, అతిరాత్రము, అప్తోర్యామము, అను సోమసంస్థలు క్రతువులని చెప్పఁబడును; ఇట్టి యజ్ఞములకు క్రతువులకు అగ్నిహోత్రము ప్రారంభము కావుననే స్వర్గలోకమునకు ప్రకాశమయి యున్నది, ఇట్టి యగ్నిహోత్రమే ప్రధాన మగు మోక్షసాధన మని అగ్నిహోత్రులు పలుకుచున్నారు.

మం. ౧౧. యజ్ఞ ఇతి యజ్ఞేన హి దేవా దివం గతా యజ్ఞేనాసురా నపానుదన్త యజ్ఞేన ద్విషన్తో మిత్రా భవన్తి యజ్ఞే సర్వం ప్రతిష్ఠితం తస్మా ద్యజ్ఞం పరమం వదన్తి,

టీక. యజ్ఞః ఇతి=యజ్ఞమే, (మోక్షసాధనములలో ఉత్తమ మని కొందఱు పలుకుచున్నారు) యజ్ఞేన=యజ్ఞముచేత, దేవాః=దేవతలు, దివం గతాః హి=స్వర్గమును పొందిరికదా, యజ్ఞేన=యజ్ఞముచేతనే, అసురాన్ = రాక్షసులను, అపానుదన్త = నాశనమొనర్చిరి, యజ్ఞేన = యజ్ఞముచేత,

ద్విషన్తః=శత్రువులు, మిత్రాః=మిత్రులుగా, భవన్తి=అగుచున్నారు, యజ్ఞే=యజ్ఞమునందు, సర్వం = సమస్తము, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠితమయియున్నది, తస్మాత్ = అందువలన, యజ్ఞం=యజ్ఞమును పరమం = ఉత్తమయిన మోక్షసాధనమును, వదన్తి = పలుకుచున్నారు.

తా, యజ్ఞమే మోక్షసాధనములలో ఉత్తమ మగు సాధనము, యజ్ఞముచేతనే దేవతలు స్వర్గలోకమును పొందిరి, అనగా పూర్వజన్మమునందు మనుష్యులయి యుండి దేవత్వప్రాపకమగు యజ్ఞవిశేషము ననుష్ఠించుటచేతనే స్వర్గమును పొందిరనిభావము, యజ్ఞాచరణమువలన కలిగిన సామర్థ్యము చేతనే అపుడపుడు రాక్షసులను సంహరించిరి, సర్వాభీష్టప్రాప్తికి సాధనభూత మగు జ్యోతిష్టోమాదికముచేతనే పూర్వము శత్రువులుగా నున్నవారలు సైతము మిత్రు లగుచున్నారు, కావున యజ్ఞమునందే సకలము ప్రతిష్ఠిత మయి యున్నది, అందువలన యజ్ఞమునే మోక్షసాధనములలో ఉత్తమ మయిన సాధనముగా కొందఱు తదనుష్ఠాతలు పలుకుచున్నారు.

మ. ౧౨. మానసం వై ప్రాజాపత్యం పవిత్రం మానసేన
మనసా సాధు పశ్యతి మానసా ఋషయః ప్రజా
అసృజన్త మానసే సర్వం ప్రతిష్ఠితం తస్మా న్మానసం
పరమం వదన్తి.

టీక. మానసం = మానసికమగు ఉపాసనమే, ప్రాజాపత్యం = ప్రజాపతిప్రాప్తికి సాధన మగు, పవిత్రం=చిత్తశుద్ధి కారణము, మానసేన = మానసికోపాసనాసమన్విత మగు, మనసా = మనస్సుచేతనే, సాధు = చక్కగా పశ్యతి = (అతీతానాగత వ్యవహితాది వస్తుజాతమును యోగియగువాడు)

చూచుచున్నాఁడు, మానసా = ఏకాగ్రమనస్సమన్వితులగు, ఋషయః = మహర్షులు, ప్రజాః = ప్రజలను, అసృజన్త = సృజించిరి, మానసే = మానసికోపాసనమునందు, సర్వం = సకలము, ప్రతిష్ఠితం = ప్రతిష్ఠింపఁ బడినది, తస్మాత్ = ఆకారణమువలన, మానసం = మానసిక మగు ఉపాసనము, పరమం=శ్రేష్ఠ మగు మోక్షసాధనముగా, వదన్తి = పలుకుచున్నారు.

మం. ౧౩. న్యాస ఇత్యాహు ర్మనీషిణో బ్రహ్మాణమ్,

మం. ౧౪. బ్రహ్మా విశ్వః కతమ స్స్వయమ్భు ప్రజాపతి స్సంవ
త్సర ఇతి,

మం. ౧౫. సంవత్సరో ఽసా వాదిత్యో య ఏష ఆదిత్యే
పురుష స్స పరమేష్ఠీ బ్రహ్మాత్మా,

టీక. ౧౩. మనీషిణః = బుద్ధిమంతులగు మహర్షులు, బ్రహ్మాణం = హిరణ్యగర్భ రూపుఁడగు బ్రహ్మమును, న్యాసఇతి=న్యాసమే అని, ఆహుః = పలుకుచున్నారు.

౧౪. బ్రహ్మా=ఆహిరణ్యగర్భుఁడు, విశ్వః=సకలజగదాత్మకుఁడు, కతమః=అతిశయ సుఖస్వరూపుఁడు, స్వయంభు ప్రజాపతిః = స్వయంభువును ప్రజాపాలకుఁడును అయినవాఁడు, సంవత్సరః=కాలాత్మకుఁడు, ఇతి = ఈవిధముగా గ్రహింపవలయును.

౧౫. సంవత్సరః = కాలాత్మకుఁడని ఎవనిని చెప్పితిమో (అతఁడు) అసౌ=ఈ, ఆదిత్యః వై=ఆదిత్యుఁడే గదా! ఆదిత్యే = సూర్యమండలము

నందు, యః=ఏపురుషుఁడు గలఁడో, సః=ఆపురుషుఁడే, పరమేష్ఠీ=జగత్కారణమగు, బ్రహ్మ=బ్రహ్మము, ఆత్మా=అందఱకు ప్రత్యగాత్మ యయినవాఁడును అతఁడే.

తా. ౧౩. (బుద్ధిమంతులును స్మృతికర్తలును అగు మహర్షులు) పూర్వోక్తములగు సకలవిధకర్మలయొక్క త్యాగమే హిరణ్యగర్భస్వరూపమని పలుకుచున్నారు, ఈ త్యాగము హిరణ్యగర్భప్రాప్తికి అంతరంగసాధనమగుటచేత తద్రూపమని చెప్పఁబడుట ఉపపన్న మగుచున్నది.

౧౪. ఆహిరణ్యగర్భుఁడే సకలజగదాత్మకుఁడు, మఱియు అతిశయ సుఖస్వరూపుఁడు, స్వయంభువు - అనఁగా ఉత్పాదకు లగు తండ్రియుం తల్లియులేకయే స్వయముగా ఉద్భవించినవాఁడు, ప్రజాపతియనఁగా ప్రజాపాలకుఁడు, అట్టివాఁడు స్వయంభుప్రజాపతి యనంబడును, మఱియుం కాలాత్మకుఁడు. ఈవిధముగా సర్వస్వరూపుఁడు అతఁడే యని ఊహించవలయుం నని తాత్పర్యము, సన్న్యాసస్తుతినిమిత్తము సన్న్యాసముచేత ప్రాప్యుఁడగు హిరణ్యగర్భునియొక్క రూపము వివరించి చెప్పఁబడినది.

౧౫. మఱల సన్న్యాసమును స్తుతించుటకుఁ గాను హిరణ్యగర్భావయవరూపము వివరించి చెప్పఁబడినది.

సంవత్సరాత్మక మను ఏకాలము చెప్పఁబడినదో ఆకాలమే ఈ ఆదిత్యునియొక్కగతివిశేషముచేత సంవత్సరముగా ఏర్పడుచున్నది కావున సంవత్సరము ఆదిత్య స్వరూపమగుట యుక్తమే యగుచున్నది. ఈ యాదిత్య మండలమునం దేపురుషుడు గలఁడో అతఁడే పరమేష్ఠి - అనఁగా హిరణ్యగర్భస్వరూపుఁడు, ఆదిత్యమండల మార్గద్వారముగా హిరణ్యగర్భుఁడు ప్రాప్యుఁడగును కావున అతఁడే పరమేష్ఠియనుట ఉపపన్నమే, ఆపరమేష్ఠియే జగత్కారణ మగు వస్తువు, అతఁడే సకలజగదాత్మయు ప్రత్యగాత్మభూతుఁడును అని తాత్పర్యము.

మం. ౧౬. యాభి రాదిత్య స్తపతి రశ్మిభి స్తాభిః పర్జన్యో వర్
షతి పర్జన్యేనౌషధివనస్పతయః ప్రజాయన్త ఓష
ధివనస్పతిభి రన్నం భవత్యన్నేన ప్రాణాః ప్రా
ణై ర్బలం బలేన తప స్తపసా శ్రద్ధా శ్రద్ధయా
మేధా మేధయా మనీషా మనీషయా మనో మన
సా శాంతి శ్శాన్త్యా చిత్తం చిత్తేన స్మృతిగ్ం స్మృ
త్యా స్మారగ్ం స్మారేణ విజ్ఞానం విజ్ఞానేనాత్మానం
వేదయతి తస్మా దన్నం దద న్థ్సర్వాణ్యేతాని దదా
త్యన్నా త్ప్రాణా భవన్తి భూతానాం ప్రాణై
ర్మనో మనస శ్చ విజ్ఞానం విజ్ఞానా దానన్దో బ్రహ్మ
యోనిః ॥

టీక. ఆదిత్యః = సూర్యుఁడు, యాభిః=ఏ, రశ్మిభిః = కిరణములచేత, తపతి=సంతాపమును మిక్కుటముగాఁ గలుగఁ జేయుచున్నాఁడో, తాభిః = అతీక్ష్ణకిరణములచేతనే, పర్జన్యః= మేఘరూపుఁడై, వర్షతి=వర్షించుచున్నాఁడు, పర్జన్యేన = ఆవర జలముచేత, ఓషధివనస్పతయః = వడ్లుమున్నగు ఓషధులు. అశ్వత్థపనసాదికము లగు వనస్పతులు, ప్రజాయంతే=ఉత్పన్నము లాయెను, ఓషధివనస్పతిభిః = ఓషధివనస్పతులచేత, అన్నం=అన్నము, భవతి = కలుగు చున్నది, అన్నేన = అన్నముచేత, ప్రాణాః=ప్రాణములు (పోషితము లగు చున్నవి), ప్రాణైః=ప్రాణముచేత, బలం = దేహమునందు బలము కలుగు

చున్నది, బలేన=బలముచేత, తపః = (కృచ్ఛ్ర)చాంద్రాయణాది రూపమగు) తపస్సు (కలుగుచున్నది), తపసా=తపస్సుచేత, శ్రద్ధా=తత్త్వజ్ఞానసంబంధమగు శ్రద్ధ, జాయతే=ఉత్పన్నమగుచున్నది. శ్రద్ధయా = ఆశ్రద్ధచేత మేధా = గురూపదిష్టగ్రంథార్థధారణారూప మగు మేధ (కలుగుచున్నది.) మేధయా=మేధచేత, మనీషా=బుద్ధి (కలుగుచున్నది), మనీషయా = ఆబుద్ధిచేత, మనః=నిరంతరముగా తత్త్వజ్ఞానమననము (కలుగుచున్నది), మనసా = ఆతత్త్వజ్ఞానమననముచేత, శాంతిః = క్రోధాదివృత్తి రహితరూప మగు శాంతియను వృత్తి (కలుగుచున్నది) శాంత్యా = శాంతిచేత, చిత్తం=తత్త్వవిషయక ప్రమాణజనితజ్ఞానము (కలుగుచున్నది), చిత్తేన = ఆజ్ఞానముచేత, స్మృతిం=తత్త్వవిషయక స్మృతిని (పొందుచున్నాఁడు). స్మృత్యా=స్మృతిచేత, స్మారం = నిరంతరస్మరణమును (పొందుచున్నాఁడు), స్మారేణ=నిరంతరస్మరణముచేత, విజ్ఞానం=విశిష్టమయిన జ్ఞానమును (పొందుచున్నాఁడు), విజ్ఞానేన=విజ్ఞానముచేత, ఆత్మానం=ఆత్మను, వేదయతి = తెలిసికొనుచున్నాఁడు, తస్మాత్=అందువలన, అన్నం = అన్నమును, దదత్ = ఇచ్చుచున్నవాఁడు, ఏతాని సర్వాణి=ఈచెప్పినవన్నియును, దదతి=ఇచ్చుచున్నాఁడు, అన్నాత్ = అన్నమువలన, భూతానాం = భూతములయొక్క, ప్రాణాః = ప్రాణములు, భవన్తి=కలుగుచున్నవి, ప్రాణైః = ప్రాణములచేత, మనః = మనస్సు (కలుగుచున్నది), మనసః చ = మనస్సువల్లనుండి, విజ్ఞానం = విజ్ఞానమును, విజ్ఞానాత్=విజ్ఞానమువలన, ఆనందః = పరమానందస్వరూపుఁడై, బ్రహ్మ=వేదాన్తప్రతిపాద్య మగు, యోనిః=జగత్కారణరూపుఁడు (అగుచున్నాఁడు.)

తా. ఈకనంబడుచున్న ఆదిత్యుఁడు ఏతీక్ష్ణతమము లగు కిరణములచేత సంతాపమును కలుగఁజేయుచున్నాఁడో, ఆ తీవ్రతమము లగు ఆకిరణములచేతనే భూమియందున్న జలమును గ్రహించి మేఘస్వరూపుఁడై .వర్షించుచున్నాఁడు, ఆవర్షజలముచేత వ్రీహి మున్నగు ఓషధులను, అశ్వత్థాదివన

స్పతులున్ను పుట్టుచున్నవి, ఈఓషధివనస్పతులవల్లనుండి భోజ్య మగు అన్నము కలుగుచున్నది, అన్నముచేత ప్రాణములు పోషింపఁబడుచున్నవి, పోషింపఁబడిన ప్రాణములచేత శరీరమునందు బలము కలుగుచున్నది, బలముచేత కృచ్ఛ్రచాంద్రాయణాదిరూప మగు తపస్సు సిద్ధించుచున్నది, అట్టి తపస్సుచేత పరిశుద్ధమైన చిత్తముగలవానికి తత్త్వజ్ఞానవిషయక మగు శ్రద్ధకలుగుచున్నది, ఆశ్రద్ధచేత ఏకాగ్రచిత్తము గలవానికి మేధ కలుగుచున్నది, మేధ యనఁగా గురువు ఉపదేశించిన వేదాంతశాస్త్రవిషయము, తదర్థమువీనినిధరించుటయు అనునది, ఆమేధచేత మనీషజనించుచున్నది, మనీష యనఁగా బుద్ధిచేత మననము—అనఁగా ఎడతెగక తత్త్వవిషయముును మనన మొనర్చుట కలుగుచున్నది, అట్టి మననముచేత క్రోధాదిమానసికద్వేషములకు అవసరము లేకపోవుటచేత శాంతి జనించుచున్నది, ఆశాంతిచేత విక్షేపరహితుఁడగువానికి తత్త్వవిషయ ప్రమాణజనిత మగు చిత్తము-అనఁగా జ్ఞానము కలుగుచున్నది, అట్టి జ్ఞానముచేత నిద్రాదివ్యవధానమున్నను తత్త్వవిషయక మగు స్మృతిని పొందుచున్నాఁడు, నిద్రాద్యనంతరభావిని యగు స్మృతిచేత స్మారమును-అనఁగా నిరంతరస్మరణమును పొందుచున్నాఁడు, అట్టి నిరంతరస్మరణముచేత విజాతీయము లగు వ్యవధానములు లేక సర్వదా అవిచ్ఛిన్నముగానుండు విజ్ఞానమును పొందుచున్నాఁడు, అట్టి విజ్ఞానముచేత ఆత్మను ఎఱుంగుచున్నాఁడు, అన్నము ఈవిధముగా ప్రాణబలాది పరంపరాక్రమముగ ఆత్మను ఎఱుంగుటకు హేతు వగుచున్నది కాన ఇట్టి యన్నమును ఒకనికి పెట్టునట్టివాఁడు ప్రాణము మొదలుకొని ఆత్మానుభవమువఱకుఁ గల వస్తువులను దాన మొనర్చినవాఁడే యగుచున్నాఁడు, అన్నదానముచేత సర్వదానములు చేసినటులే యగునను విషయమును స్పష్టముచేయఁదలఁచి వెనుక చెప్పిన విషయమునే మఱల సంగ్రహముగా చెప్పుచున్నాడు, అన్నమువలన భూతములకు ప్రాణములు కలుగుచున్నవి, ప్రాణములచేత మనస్సు కలుగుచున్నది, మనస్సు

చేత విజ్ఞానము, విజ్ఞానముచేత ఆనందరూపుఁడై వేదాన్తప్రతిపాద్యుఁడగు జగత్కారణస్వరూపుఁడే తా నగుచున్నాఁడు, లేక విజ్ఞానముచేత వేదాన్త కారణ స్వరూపుఁ డగుచున్నాఁడు అని గాని తాత్పర్యము.

అవ. ఆసన్న్యాసమును స్తుతిచేయుటకుఁగాను అట్టి సన్న్యాసముచేత పొందఁబడిన తత్త్వజ్ఞానమును ప్రశంసించుటః—

మం. ౧౭. స వా ఏష పురుషః పఞ్చధా పఞ్చాత్మా యేన
సర్వమిదం ప్రోతం పృథివీ చాన్తరిక్షం చ ద్యౌ
శ్చ దిశ శ్చావాన్తరదిశా శ్చస వై సర్వమిదం
జగత్స సభూతగ్ం సభవ్యం జిజ్ఞాస క్లృప్త ఋతజా
రయిష్ఠా శ్శ్రద్ధా సత్యో మహస్వాన్తమసోపరి
ష్టాత్ ॥

టీక. (ఏపురుషుఁడు సన్న్యాసపురస్సరముగా తత్త్వజ్ఞానమును సంపాదించునో) సః వై ఏషపురుషః = ఆ ఈపురుషుఁడే, పంచధా = అయిదువిధములుగా, పంచాత్మా=పంచాత్మ గలవాఁడు, లేక పంచవింశతితత్త్వస్వరూపుఁడు అగుచున్నాఁడు, యేన = ఏబ్రహ్మస్వరూపముచేత, ఇదం సర్వం = ఈప్రపంచమంతయు, ప్రోతం=గుచ్చబడియున్నదో, అంతరిక్షం చ = అంతరిక్షము, ద్యౌశ్చ = ద్యులోకము, దిశశ్చ = దిక్కులు, అవాంతరదిశాః చ= విదిక్కులు, ఇదం=ఈ, సర్వం జగత్ = జగము అంతయు, సః వై = ఆపురుషుఁడేగదా! సభూతం=భూతములోఁగూడుకొన్న, జగత్=జగత్తు, సః=ఆపురుషుఁడే, భవ్యం = కాఁబోవునట్టి జగత్తునైతము, సః = ఆపురుషుఁడే,

(ఆపురుషుడే) జిజ్ఞాసక్లృప్తః = వేదాంతవిచారముచేత సర్వాత్మకుఁ డని నిశ్చయింపఁబడుచున్నాఁడు, ఋతజాః = సత్యమగు - అనఁగా ప్రామాణిక మగు జ్ఞానముచేత సర్వాత్మమయినాఁడు, రయిష్ఠాః = గురూపదేశమునం దుండువాఁడు, శ్రద్ధా = శ్రద్ధచేత లభించువాఁడు కావున శ్రద్ధాస్వరూ పుఁడగుచున్నాఁడు. సత్యః = (కాలత్రయాబాధ్యమగు బ్రహ్మస్వరూపము గలవాఁడు కావున) సత్యుఁడు (అని చెప్పఁబడుచున్నాఁడు), మహ స్వాన్ = తేజస్సుగలవాఁడు (అగుచున్నాడు), తపసః = సంసార కారణమగు అజ్ఞానముచేత (వియుక్తమగుటచేత), ఉపరిష్టాత్ = పైగా ఉన్నాఁడు, మూలమునందు 'తపసోపరిష్టాత్" అని ఉన్నదానికి భాష్యము నందు "తమసా—ఉపరిష్టాత్" అని పదవిభాగముచేసి మకార, పకార, టకా రములకు పకార, వకార, తకారాదేశము ఛాందసమని వ్రాసి యర్థము పైవిధముగా వ్రాయఁబడియున్నది, తపసః = తపస్సువలన, ఉపరిష్టాత్ = అందఱి కంటె శ్రేష్ఠుఁడుఁగా నున్నవాఁడని ఎఱుంగఁబడుచున్నాఁడని యర్థము కూడ చేయవచ్చును, అయినను భాష్యము ననుసరించి మే మిచట ఈవిధముగా అర్థమును వ్రాసినారము.

తా. ఏపురుషుఁడు సన్న్యాసపూర్వకముగ తత్త్వజ్ఞానమునుపొందనో అతఁడు సర్వాత్మకుఁ డగుచున్నాఁడు, ౫ ప్రకారములచేత పంచాత్మయగు చున్నాడు, అనఁగా పంచవింశతితత్త్వస్వరూపుఁడగుచున్నాఁడు.

౧. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను గుణపంచకము.

౨. పృథివి, అపస్సు, తేజస్సు, వాయువు, ఆకాశము అను భూత పంచకము.

3. త్వక్కు, చక్షుస్సు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము అను జ్ఞానేం ద్రియ పంచకము.

౪. వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థ అను కర్మేంద్రియ పంచకము, లేక అయిదువిధములగు ఆత్మలచేత కూడుకొన్నవాఁడు పంచాత్మ యనంబడును:—

శ్లో. భూతాత్మా చేంద్రియాత్మా చ ప్రధానాత్మా తథా భవాన్,
ఆత్మా చ పరమాత్మా చ త్వ మేకః పంచధా స్థితః.

అర్థ. (భూతాత్మ, ఇంద్రియాత్మ, ప్రధానాత్మ, ఆత్మ, పరమాత్మ యను ఐదువిధములుగా నీవొక్కఁడవే అయి ఉన్నాఁడవు,) అని గలదు, అట్టి పంచాత్మ వని యర్థము, ఏ బ్రహ్మస్వరూపముచేత ఈ జగత్తంతయు సూత్రమునందు మణిగణమువలె చక్కఁగా వ్యాపింపఁబడియున్నదో ఆ బ్రహ్మమే పృథివి, అంతరిక్షము, దివము, దిక్కులు, అవాంతర దిక్కులు వ్యాపించి యున్న పురుషుఁడు, తత్త్వదృష్టిచేత ఆ బ్రహ్మముకంటె వ్యతిరేకమగు వస్త్వంతరము లేదుగదా, ఇదివఱకు అతిక్రమించినట్టియు, రాఁబోవునట్టియు జగము అతఁడే అని ఎఱుంగునది, తత్త్వవేత్తయగు పురుషుఁడు సైతము సాధారణజనునివలె హస్తపాదాదిసమన్విత సామాన్యదేహవిశిష్టుఁడుగానే గనంబడినను వేదాంత విచారముచేత సర్వాత్మకత్వముగా నిశ్చయింపఁ బడుచున్నాఁడు, మఱియు ప్రామాణికమగు సత్యజ్ఞానముచేత సర్వాత్మ యగుచున్నాఁడు, జిజ్ఞాసా సమయమునందు భ్రాంతిజ్ఞాన మంతయు నశింపఁగా ప్రామాణికమగు సిద్ధాంతజ్ఞానముచేత సర్వాత్మ యగుచున్నాఁడు, వాఁడు ఉపదేశజ్ఞానము గలవారికడనే యుండును. రయిష్ఠుఁడు—రయి అనఁగా ధనము, గురూపదేశరూపమగు ధనమనుట, అట్టి చోట నిలుచుండి యుండు వాఁడు, అనఁగా ఉపదేశవిహీనులకుఁ గనంబడఁడు, ఇట్టి స్వరూపవిజ్ఞానము శ్రద్ధచేతనే లభించుచున్నది, కావున శ్రద్ధారూపుఁడగుచున్నాఁడు, "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అని స్మృతియు గలదు, మఱియు తేజస్సు కలిగియుండుటచేత స్వయంప్రకాశుఁడు, సత్యమనఁగా త్రికాలాబాధ్యము, తత్స్వ

రూపుఁదగుటచేత ఇతఁడును సత్యుఁ డనంబడుచున్నాఁడు; అగుచున్నాఁడు, కావుననే సంసారణ కారణము వదలిపోవుటవలన, ఉపరిష్టాత్ = పైగా ఉన్నాఁడు అని తాత్పర్యము.

అవ. వెనుకటిమంత్రమునందు సన్న్యాసపూర్వకమగు జ్ఞానము గలపురుషునియొక్క ప్రశంస చెప్పఁబడినది, ఇప్పుడు అట్టి జ్ఞానముగల పురుషుఁడు పొందుఫలము చెప్పఁబడు చున్నది:—

మం. ౧౮. జ్ఞాత్వా తమేవం మనసా హృదా చ భూయో న
మృత్యు ముప యాహి విద్వాన్,

మం. ౧౯. తస్మా న్న్యాసమేషాం తపసా మతిరిక్త మాహుః,

టీక. ఓయారుణీ! తం = ఆ పరమాత్మను, ఏవం = ఈవిధముగా, మనసా=మనస్సుచేతను, హృదాచ = హృదయముచేతను, జ్ఞాత్వా = ఎఱిఁగి, భూయః = మఱల, మృత్యుం = మృత్యువును, న ఉపయాహి = పొందవు గదా! తస్మాత్=అందువలన, ఏషాం=వీనియొక్క, న్యాసం=సన్న్యాసమును, అతిరిక్తం=శ్రేష్ఠ మయినదిగా, ఆహుః = పలుకుచున్నారు.

తా. విద్వాంసుఁడ వగు ఓయారుణీ! ఆ పరమాత్మను ఈవిధముగా హృదయముచేతను, మనస్సుచేతను ఎఱిఁగినవాఁడు మఱల మృత్యువును పొందఁజాలఁడు, కావున న్యాసమునే శ్రేష్ఠమయినదానినిగా పలుకుచున్నారని తాత్పర్యము.

మం. ౨౦. వసురణ్వో విభూ రసి ప్రాణే త్వమసి సంధాతా

బ్రహ్మ స్త్వమసి విశ్వధృ త్తేజోదా స్త్వమస్యగ్ని
రసి వర్చోదా స్త్వమసి సూర్యస్య ద్యుమ్నోదా స్త్వ
మసి చన్ద్రమస ఉపయామగృహీతోఽసి బ్రహ్మణే
త్వా మహసే,

టీక. బ్రహ్మన్ = పరమేశ్వరా! త్వం=నీవు, వసురణ్వః = మమ్ముల ననుగ్రహించుటకు (గాను) వస్తుతత్త్వము నుపదేశించువాఁడవు, అసి = అగుచున్నాఁడవు. విభూః=వివిధముగా ఉత్పన్నమైనవాఁడవు (అనఁగా హిరణ్యగర్భ, విరాడాదిరూపములచేతననుట), (అసి=అయితివి.) త్వం=నీవు, ప్రాణే= వాయురూప మగు ప్రాణమునందు, సంధాతా = జీవాత్మయొక్క యోజయితవు, అసి=అయితివి, త్వం=నీవు, విశ్వధృల్ = బ్రహ్మాండధారక వాయురూపుఁడవు, అసి = అయితివి, త్వం=నీవు, అగ్నిః = (భూలోకవర్తియగు) అగ్నికి, తేజోదాః= ప్రకాశము నిచ్చువాఁడవు, అసి=అయితివి, త్వం = నీవు, సూర్యస్య=ద్యులోకవర్తియగు సూర్యునకు, వర్చోదాః = ప్రకాశమునిచ్చినవాఁడవు, అసి=అయితివి, త్వం=నీవు, చంద్రమసః = చంద్రునకు, ద్యుమ్నోదాః = ప్రకాశరూపధనము నొసంగినవాఁడవు, అసి=అయితివి. (మఱియు యాగములందు సోమరూపుఁడవై) ఉపయామగృహీతః = పార్థివములగు పాత్రలచేత గ్రహింపఁబడినవాఁడవు, అసి = అయితివి, త్వా = నిన్ను, మహసే = జ్యోతిస్స్వరూపమగు, బ్రహ్మణే=బ్రహ్మతత్త్వముకొఱకు,(భజామి= సేవించెదను.)

తా. అంతర్యామి వగు నోపరమేశ్వరా! నీవు వసురణ్వుఁడవు, అనఁగా మాయందనుగ్రహబుద్ధిగలవాఁడవై వస్తుతత్త్వము నుపదేశించునట్టివాఁడ వగుచున్నాఁడవు.

వసురణ్వశబ్దవ్యుత్పత్తి:—

వస్తునః = వస్తుతత్త్వస్య, రణ్వః= వాశితా = కథయితా (అస్మదను గ్రహార్థముపదేష్టా) వసురణ్వః అని యగును.

అర్థము. వసువనఁగా వస్తుతత్త్వము, అట్టితత్త్వమును మాయందుఁ గలయనుగ్రహముచేత రణ్వుఁడు = ఉపదేశించువాఁడు, మఱియు, విరాట్, హిరణ్యగర్భాది వివిధరూపములచేత నుత్పన్నమైనవాఁడు, వాయు రూపమగు ప్రాణమునందు జీవాత్మను సంధానముచేయువాఁడవు, బ్రహ్మాండము ధరించునట్టి వాయురూపుఁడవు. భూలోకవర్తియగు అగ్నికి ప్రకాశ రూప మగు ధనము నొసంగువాఁడవు నీవ, ద్యులోకవర్తియగు సూర్యునకు ప్రకా శము నొసంగునదియు నీవ, పితృలోకవర్తి యగు చంద్రునకు ప్రకాశరూప మగు ధనము నొసంగునదియు నీవయే, మఱియు యోగములందు సోమరస రూపుఁడవై పార్థివములగు మృద్దారుపాత్రలచేత గ్రహింపఁబడునది నీవయే, మూలమునందుగల "ఉపయామగృహీతః" అను సమాసపదమునందుగల ఉప యామపదము పృథివీవాచకముగా తైత్తిరీయసంహిత షష్ఠకాండమునందు మంత్రవ్యాఖ్యానమందు గలదు:—

"ఉపయామ గృహీతోఽసీత్యాహ, ఇయం వా ఉపయామః" అనుచు చెప్పిన రీతిగా సమస్తమునకు కర్తవును అంతర్యామియును అగు నిన్ను జ్యోతి స్స్వరూపమగు బ్రహ్మతత్త్వము మాకు గోచర మగుటకొఱకు భజించుచున్నా మని తాత్పర్యము.

అవ. ఈవిధముగా అంతర్యామిని కొనియాడి పరివ్రాజ విఘ్నములుగల సన్న్యాసికి సమాధి విధింపఁబడుచున్నది:—

మం. ౨౧. ఓమిత్యాత్మానం యుఞ్జీత,

మం. ౨౨. ఏతద్వై మహోపనిషదం దేవానాం గుహ్యమ్॥

టీక. ౨౧. "ఓమ్" ఇతి=ఓం అని, ఆత్మానం=ఆత్మను, యుఞ్జీత = ఆత్మరూపముచేత చిత్తమునందు చేర్చుకొనవలయును.

౨౨. ఏతత్=ఈప్రణవమే, మహోపనిషదం వై = అనేక ఉపనిషత్తులచేత ప్రతిపాదింపఁబడునదిగదా, దేవానాం = ఇంద్రాది దేవతలకు, గుహ్యం=గోపనీయ మగు అమూల్యవస్తువుగదా.

తా. ౨౧ ౨౨. సన్న్యాసానంతరము ప్రణవముచేత ఆత్మసమాధిని విధింపఁ దలఁచి విఘ్నపరిహారార్థము అంతర్యామిని స్తుతించి స్తుత్యనంతరము పరిహరింపఁబడిన విఘ్నములుగల సన్న్యాసి, త్రిమాత్రలుగల "ఓం" అనునట్టి ప్రణవము నుచ్చరించుచు సకలోపనిషత్తులందు నిర్ణయింపఁబడిన పరమాత్మను స్వాత్మరూపముగా చిత్తమునందు భావింపవలయును, ఇదియే సమాధి, ఇట్టి సమాధికి సాధనభూత మగు ఓంకారమే మహోపనిషదము; మహోపనిషద శబ్దవ్యుత్పత్తి:—

"మహత్యః బహ్వ్యః ఉపనిషదః ప్రతిపాదికా యస్య పరమాత్మ వాచకస్య ప్రణవరూపస్య తత్ మహోపనిషదం" అని.

అర్థ. పరమాత్మవాచక మగు దేనికి (ఏప్రణవమునకు) పెక్కు ఉపనిషత్తులు ప్రతిపాదకము లయియున్నవో అట్టిది మహోపనిషదము. ఆకారాంతము ఛాందసము.

ప్రణవము సర్వోపనిషత్తులందు ప్రతిపాదింపఁబడుచున్న దనువిషయము కఠవల్లియందు ఇట్లుపదేశింపఁబడినది:—

మం. "సర్వే వేదా యత్పద మామనన్తి, తత్తే పదం సంగ్రహేణ బ్రవీమ్యో మిత్యేతత్"

అర్థ. సమస్తవేదములు ఏపదమును చెప్పుచున్నవో అట్టిపదమును నీకు సంగ్రహముగా చెప్పెదను, ఆపదము "ఓం" అనునది.

నిర్గుణతత్త్వరూప మగు ఆపదము ఇంద్రాదిదేవతలకును గోపనీయ మైనది, ఇంద్రాదిదేవతలు సైతము శమదమాదిగుణసంపత్తిలేని అనధికారికి ప్రణవమును ఉపదేశింపరు, కావున ఇంద్రాదిదేవతలకును గోపనీయమని చెప్పఁబడినది.

అవ. ఇట్టి ప్రణవసమాధివలన కలుగునట్టిఫలమును చెప్పి సన్న్యాసపురస్సరమగు ఈతత్త్వవిద్యను ఉపసంహారము చేయుచున్నాఁడు:—

మం. ౨౩. య ఏవం వేద బ్రహ్మణో మహిమాన మాప్నోతి
తస్మా ద్బ్రహ్మణో మహిమాన మిత్యుపనిషత్ ।
॥౧౦౧॥ ౭౯॥

టీక. యః=ఎవ్వఁడు, ఏవం=ఈవిధముగా, వేద = బ్రహ్మముయొక్క, మహిమానం = మహిమను, ఆప్నోతి = పొందుచున్నాఁడు, తస్మాత్ = సకలావిద్యానాశన పూర్వకమగు (ఆవేదనమువలన), బ్రహ్మణః = బ్రహ్మము యొక్క, మహిమానం = మహత్త్వమును, (ఆప్నోతి = పొందుచున్నాఁడు), ఇతి=ఈవిధముగా చెప్పఁబడినది, ఉపనిషత్=ఉపనిషద్రహస్యవిద్య.

తా. ఏపురుషుఁడు సన్న్యాస మయినపిదప ప్రణవముచేత బ్రహ్మ తత్త్వసమాధి నొనర్చుచు ఉపనిషద్వాక్యములందు చెప్పిన విధముగా బ్రహ్మ తత్త్వము నెఱుంగుచున్నాఁడో అట్టి జ్ఞాని తనయందు అవిద్యాకల్పిత మగు జీవత్వాపాదకమను పరిచ్ఛేదమును వదలి దేశకాలవస్తుపరిచ్ఛేదశూన్యుఁడగు

బ్రహ్మముయొక్క మహత్త్వమును పొందుచున్నాఁడు, అనఁగా తత్త్వము నెఱింగిన పిదప తాను జీవుఁడ నని పొందిన భ్రమ వదలిపోవుననియు, పిదప బ్రహ్మత్వభావము కలిగి జీవన్ముక్తుఁ డగునని భావము, అట్టి జీవన్ముక్తుఁడగు వానికి ప్రారబ్ధభోగక్షయానంతరము దేహపాతము కాఁగా దానివలన అశేషావిద్యానివర్తక మగు జ్ఞానమువలన అవిద్యయు, తత్కార్య మగు వాసనాలేశమును, లేని బ్రహ్మముయొక్క మహిమను పొందుచున్నాఁడు, అనఁగా విదేహముక్తి కలుగుచున్నదని తాత్పర్యము.

ఈయనువాకముయొక్క ఉపక్రమము మొదలుకొని ఇంతవఱకు ఏవిద్య బోధింపఁబడినదో అవిద్య ఉపనిషద్రహస్యభూతమైనది.

---

౮౦. అశీతితమోఽనువాకః.

అవ. బ్రహ్మజ్ఞానమునకు సన్న్యాసమే అంతరంగసాధనము కావున జిజ్ఞాసు వగువాఁడు సన్న్యాసమునే స్వీకరించవలయును, కర్మానుష్ఠానము గ్రాహ్యముగాదు అను విషయము నిదివఱకుపదేశించిరి. తత్త్వజ్ఞానము కలిగిన పిదప కర్మలను అనుష్ఠించుము అనునట్టి శంకను నివారింపఁ దలఁచి తత్త్వజ్ఞానియొక్క లౌకికములగు సకలవ్యవహారములను యాగాంగములనుగా చెప్పుచున్నాఁడు:—

మం. ౧. తస్యైవం విదుషో యజ్ఞస్యాత్మా యజమానశ్శ్రద్ధా
పత్నీ శరీర మిధ్మ మురో వేది ర్లోమాని బర్హిః.

ర్వేద శ్శిఖా హృదయం యూపః కామ ఆజ్యం మన్యుః పశు స్తపో ఽగ్నిర్దమ శ్శమయితా దక్షిణా వాగ్ఘోతా ప్రాణ ఉద్గాతా చక్షు రధ్వర్యుర్మనో బ్రహ్మా శ్రోత్ర మగ్నీత్.

మం. ౨. యావ ద్ధ్రియతే సా దీక్షా యదశ్నాతి తద్ధవి ర్య త్పిబతి తదస్య సోమపానం యద్రమతే తదుపసదో యత్సంచరత్యుపవిశత్యుత్తిష్ఠతే చ స ప్రవర్గ్యో యన్ముఖం తదాహవనీయో యా వ్యాహృతి రాహుతి ర్యదస్య విజ్ఞానం తజ్జుహోతి యత్సాయం ప్రాత రత్తి తత్సమిధం యత్ప్రాత ర్మధ్యన్దినగ్ం సాయం చ తాని సవనాని,

మం. 3. యే అహోరాత్రే తే దర్శపూర్ణమాసౌ యే ఽర్ధమాసా శ్చమాసా శ్చ తే చాతుర్మాస్యాని య ఋతవ స్తే పశుబన్ధా యే సంవత్సరా శ్చ పరివత్సరా శ్చ తే ఽహర్గణా స్సర్వవేదసం వా ఏత త్సత్రం యన్మరణం తదవభృథః,

మం. ౪. ఏతద్వై జరామర్య మగ్నిహోత్రగ్ం సత్త్రం య ఏ
వం విద్వా నుదగయనే ప్రమీయతే దేవానా మేవ
మహిమానం గత్వా ఽఽదిత్యస్య సాయుజ్యం గచ్ఛ
త్యథ యో దక్షిణే ప్రమీయతే పితృణా మేవ
మహిమానం గత్వా చన్ద్రమసః సాయుజ్యగ్ం సలో
కతామాప్నో త్యేతౌ వై సూర్యాచన్ద్రమసో ర్మహి
మానౌ బ్రాహ్మణో విద్వా నభిజయతి తస్మా ద్బ్ర
హ్మణో మహిమాన మాప్నోతి తస్మా ద్బ్రహ్మణో
మహిమానమ్ ॥౧౦౨॥౮౦॥

(అమ్భస్యేకపఞ్చాశచ్ఛతం, జాతవేదసే చతుర్దశ, భూర
న్నం భూరగ్నయే భూరగ్నయే చైకమేకం, పాహి
పాహి చత్వారి చత్వారి, యశ్ఛన్దసాం ద్వే, నమో
బ్రహ్మణ ఋతం తపో యథా వృక్షస్యైకమేక, మణో
రణీయాగ్ంశ్చతుస్త్రిగ్ంశ, త్సహస్రశీర్షగ్ం షడ్వి
గ్ంశతి, రాదిత్యోవా ఏష ఆదిత్యో వై తేజ ఏక
మేకం, నిధనపతయే త్రయోవిగ్ంశతి, స్సద్యోజాతం
త్రీణి, వామదేవాయైక, మఘోరేభ్య స్తత్పురుషాయ

ద్వే ద్వే, ఈశానో నమోహిరణ్యబాహవ ఏకమేక,
మృతగ్ం సత్యం ద్వే, సర్వోవై రుద్రశ్చత్వారి, కద్రు
ద్రాయ త్రీణి, యస్య వైకఙ్కతీ కృణుష్వ పాజో౽
దితిశాన్తో వా ఇదగ్ం సర్వమేక మేక, మా౽హః పునస్తు
చత్వార్యగ్నిశ్చ సూర్యశ్చ నవ సహో, మితి చత్వా
ర్యా, యాత్తు పశ్చాజో, ఉసిపశో, త్తమే చత్వారి,
ఘృణి స్త్రీణి, బ్రహ్మ మేతు మాం యాస్తే బ్రహ్మ
హత్యాం ద్వాదశ, బ్రహ్మ మేధయా౽దాశ్య న ఇమం
భూరిణహత్యాం బ్రహ్మ మేధవా బ్రహ్మ దేవానామి
దం వీరహత్యామేకాన్నవిగ్ంశతి రేకాన్నవిగ్ంశతి,
ర్మేధా దేవీ మేధాం మ ఇన్ద్రశ్చత్వారి చత్వార్యా,
మాం మేధా ద్వే, మయిమేధామేక, మహ్యైతు పవం
వాతం ప్రాణమముత్రభూయాద్ధరిగ్ం శర్మైరగ్నిం
మా చ్ఛిదో మృత్యో మా నో మహాన్తం మానస్తోకే
ప్రజాపతే స్వస్తిదాస్త్ర్యమ్బకం యే తే సహస్రమయు
తం ద్వే ద్వే, మృత్యవే స్వాహైకం, దేవకృతస్యై
కాదశ, యద్వో దేవాః కామో౽కార్షీన్నమస్యర

కార్షీర్ద్వే ద్వే, తిలాఞ్జుహోమి గావశ్శ్రియం ప్రజాః
పఞ్చ, తిలాః కృష్ణాశ్చోరస్య శ్రీః ప్రజ్ఞాతు జాతవేద
స్సప్త, ప్రాణ వాక్త్వక్చక్షుఽఉత్తిష్ఠ పురుష పఞ్చ, పృ
థివీ శబ్ద మనో వాగవ్యక్తాత్మాఽన్తరాత్మా పరమాత్మా
మేక్షుధేఽన్నమయ పఞ్చదశ, గ్నయె స్వాహైకచ
త్వారిగ్ంశ, దోం తద్బ్రహ్మనవ, శ్రద్ధాయాం ప్రాణే
నివిష్టోఽమృతం జుహోమిచతుర్విగ్ంశతి, శ్రద్ధాయాం
దశ, ఙ్గుష్ఠమాత్రః పురుషో ద్వే, వాఙ్మ ఆసన్సప్త,
వయస్సుపర్ణాః ప్రాణానాం గ్రన్థిరసి ద్వే ద్వే, నమో
రుద్రాయైకం, త్వమగ్నే ద్యుభిర్ద్వే, శివేన మే సంతిష్ఠస్వ
సత్యం ప్రాజాపత్య స్తస్యైవమేకమేకమశీతిః ||౮౦||)

(అమ్భస్యపారే స్వస్తి నః పాహి నో అగ్న ఏకయా
ఽఽదిత్యో వా ఏష ఋతగ్ం సత్యమోమిత్యామాం
మేధా మా నస్తోకే తిలాఞ్జుహోమి శ్రద్ధాయామ
పానే నివిష్టః ప్రాజాపత్యో ద్వ్యుత్తరశతమ్ ||౧౦౨||)

ఉత్తరశాంతిపాఠము

ఓం. సహ నా వవతు । సహ నౌ భునక్తు । సహ వీర్యం కరవావహై । తేజస్వి నా వధీత మస్తు మా విద్విషా వహై । ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః ॥

హరిః ఓమ్. శ్రీకృష్ణార్పణమస్తు

ఇతి తైత్తిరీయోపనిషది నారాయణాఖ్యే చతుర్థప్రశ్నే అన్వ్రిపాఠ స్సమాప్తః.

టీక. ఏవం=పూర్వోక్తప్రకారముగా, విదుషః = బ్రహ్మసాక్షాత్కారమును పొందిన, తస్య = ఆజీవన్ముక్తునియొక్క (సంబంధమగు), యజ్ఞస్య = యజ్ఞమునకు, ఆత్మా=దేహేంద్రియాదికమునకు సాక్షిభూతుఁడగు ఆత్మయే. పత్నీ=భార్య, శరీరం=శరీరమే, ఇధ్మం=ఇధ్మము, ఉరః=హృదయమే, వేదిః = వేది, లోమాని=వెంద్రుకలే, బర్హిః=దర్భలు, శిఖా=శిఖయే, వేదః=వేదము, హృదయం = హృదయమే, యూపః = యూపము, కామః=కామమే, ఆజ్యం=ఆజ్యము, మన్యుః=కోపమే, పశుః=పశువు, తపః=తపస్సే. అగ్నిః = అగ్ని, శమయితా = సర్వేంద్రియోపశమనమొనర్చునట్టి, దమః=దమమే, దక్షిణా = యజ్ఞదక్షిణ, వాక్ = వాక్కే, హోతా = హోత, ప్రాణః = ప్రాణమే, ఉద్గాతా=ఉద్గాత, చక్షుః=నేత్రమే, అధ్వర్యుః=అధ్వర్యుఁడు, శ్రోత్రం=శ్రోత్రమే అగ్నీత్=అగ్నీధ్రుఁడు.

౨. యావత్=ఎంతకాలము, ధ్రియతే=భోజనములేక యుండునో, సా=అదియే, దీక్షా=దీక్ష, యత్=దేనిని, అశ్నాతి=తినుచున్నాఁడో, తత్=అదియే, హవిః=హవిస్సు, యత్ = దేనిని, పిబతి = త్రాగుచున్నాఁడో, తత్=అదియే, అస్య=వీనికి, సోమపానం=సోమపానము, యత్=ఏయది, రమతే=క్రీడింపఁబడుచున్నదో, తత్=అదియే, ఉపసదః=ఉపసదిష్టులు, యత్=ఎయ్యది, సంచరతి=సంచరించుట, ఉపవిశతి = కూర్చుండుట, ఉత్తిష్ఠతేచ = లేచుటయు (గలదో), సః=అదియే, ప్రవర్గ్యః=ప్రవర్గ్యము, యత్ = ఎయ్యది, ముఖం=ముఖమో, తత్ = అది, ఆహవనీయః = ఆహవనీయాగ్ని, యా=ఎయ్యది, వ్యాహృతిః=పలుకుట (గలదో అది), ఆహుతిః=ఆహుతి, యత్ = ఎయ్యది, అస్య=వీనియొక్క, విజ్ఞానం=విజ్ఞానము గలదో, తత్ = దానిని, జుహోతి=హోమముచేయుచున్నాఁడు, సాయంప్రాతః = సాయంప్రాతఃకాలములందు, యత్=దేనిని, అత్తి=భుజించుచున్నాఁడో, తత్=అదియే, సమిధం=సమిధలు, ప్రాతః=ప్రాతఃకాలము, మధ్యందినం = మధ్యాహ్నము, సాయంచ=సాయంకాలము, యత్=ఎయ్యదిగలదో, తాని=అవియే, సవనాని=(ప్రాతః, మాధ్యందిన, సాయం) సవనములు.

3. యే=ఏయవి, అహోరాత్రే = అహోరాత్రములు గలవో, తే=అవియే, దర్శపూర్ణమాసౌ=దర్శపూర్ణమాసములు, యే=ఏయవి, అర్ధమాసాః చ=అర్ధమాసములున్ను (అనఁగా పక్షములున్ను), మాసాః చ=మాసములున్ను (గలవో), తే=అవియే, చాతుర్మాస్యాని = చాతుర్మాస్యయాగములు, యే=ఏయవి, ఋతవః=ఋతువులుగలవో, తే=అవియే, పశుబంధాః = పశుబంధములు, యే=ఏయవి, సంవత్సరాః చ=సంవత్సరములున్ను, పరివత్సరాః చ=పరివత్సరములున్ను (గలవో), తే=అవియే, అహర్గణాః = అహర్గణములు, ఏతత్ = ఈఅహోరాత్రాది సంవత్సరాంతమగు వానియొక్క ఆయుష్యమే. సర్వవేదసం సత్త్రం=సర్వస్వదక్షిణాకమగు సత్త్రయాగము, యత్ = ఎయ్యది, మరణం=మరణము గలదో, తత్ = అయ్యది, అవభృథః = అవభృథ స్నానము.

౪. జరామర్యం = జరామరణావధిక మగు, ఏతత్ వై = ఈ యోగి యొక్క చరితమే, అగ్నిహోత్రం సత్రం=అగ్నిహోత్రాది సహస్రసంవత్సర సత్రాంతకర్మస్వరూపము, యః=ఎవ్వఁడు, ఏవం = ఈవిధముగా, విద్వాన్ = ఉపాసించుచు, ఉదగయనే = ఉత్తరాయణమునందు, ప్రమీయతే = మృతిచెందుచున్నాఁడో, (సః=అయుపాసకుఁడు) దేవానాం = ఇంద్రాది దేవతలయొక్క, మహిమానం = ఐశ్వర్యమును, గత్వా=పొంది, ఆదిత్యస్య= సూర్యునియొక్క, సాయుజ్యం = సహవాసమును (లేక తాదాత్మ్యమును భావనానుసారము), గచ్ఛతి ఏవ=పొందుచున్నాఁడు, అథ=ఇఁక, యః=ఏ యుపాసకుఁడు, దక్షిణే = దక్షిణాయనమునందు, ప్రమీయతే = మర ణించుచున్నాఁడో, (సః=అట్టియుపాసకుఁడు) పితౄణాం = అగ్నిష్వాత్తాది పితరులయొక్క, మహిమానం = ఐశ్వర్యమును, గత్వా=పొంది, చంద్ర మసః = చంద్రునియొక్క, సాయుజ్యం = సహవాసమును, సలోకతాం= సమానలోకమును (భావనాతారతమ్యానుసారము), ఆప్నోతి వై = పొందు చున్నాఁడుగదా, యః బ్రాహ్మణః=ఏబ్రాహ్మణుఁడు, ఏతౌ=ఈ, సూర్యా చంద్రమసోః = సూర్యచంద్రులయొక్క, మహిమానౌ = మాహాత్మ్యము లను విద్వాన్ = తెలుసుకొనునో, (సః=వాఁడు) అభిజయతి = హిరణ్య గర్భసాక్షాత్కారరూపమగు జయమును పొందుచున్నాఁడు, తస్మాత్ =హిరణ్య గర్భలోకవాసిదేహపాతానంతరము, బ్రహ్మణః = హిరణ్యగర్భునియొక్క, మహిమానం = ఐశ్వర్యమును, ఆప్నోతి = పొందుచున్నాఁడు, తస్మాత్ = ఆహిరణ్యగర్భునియొక్క విలయానంతరము, బ్రహ్మణః = సత్యజ్ఞానానంద లక్షణమగు పరబ్రహ్మముయొక్క, మహిమానం = మహిమను, ఆప్నోతి = పొందుచున్నాఁడు.

తా. ౧. యోగియొక్క సకలకృత్యములు యాగరూపముగ నిరూ పింపఁబడుచున్నవి; అందు మొట్టమొదట యోగియొక్క అవయవములను యజ్ఞాంగములనుగాఁ చెప్పుచున్నాఁడు:— వెనుకటి యనువాకమునందు చెప్పఁబడినవిధముగా సన్న్యసించి పరబ్రహ్మముయొక్క మహిమను సాక్షా త్కారమొనర్చుకొనిన జీవన్ముక్తుఁడగువానియొక్క యజ్ఞమునకు దేహం

ద్రియాదికమునకు సాక్షి యగు ఆత్మయే యజమానుఁ డనంబడును, లౌకిక యాగమునందు యజమానుఁడు యజ్ఞమునకు స్వామి యగునటుల ఇచ్చట ఆత్మయే యజమానుఁడని గ్రహించవలయును, అంతఃకరణమునందు గల శ్రద్ధయే పత్ని (పత్నీసహితుఁడు కానివాఁడు లౌకికయజ్ఞమునందు ఏవిధముగా అనధికారి యగుచున్నాఁడో అట్లే శ్రద్ధావిరహితుఁడు యాగమునకు అధికారి కాఁజాలఁడు కావున శ్రద్ధయే పత్నియని చెప్పఁబడినది). శరీరమే ఇధ్మము, ఉరస్సే వేది, రోమములే దర్భలు, శిఖయే వేదము, హృదయమే యూపము, కామమే ఆజ్యము, కోపమే పశువు, తపస్సే అగ్ని, సర్వేంద్రియములను ఉపశమింపఁజేయునట్టి దమమను చిత్తవృత్తి విశేషమే దక్షిణ, వాక్కే హోత, ప్రాణమే ఉద్గాత, నేత్రమే అధ్వర్యుఁడు, శ్రోత్రమే అగ్నీధ్రుఁడు.

౨. ఇఁక యోగియగు వానియొక్క వ్యవహారములను జ్యోతిష్టోమ యాగక్రియలోఁగల అవాంతరరూపములనుగా నుపదేశించుచున్నాఁడు:—

ఎంతకాలము భుజించకయుండునో అదియే దీక్ష, భుజించుటయే హవిస్సు జలమును త్రాగుటయే సోమపానము, క్రీడించుటయే ఉపసదిష్టులు, తిరుగుట, కూర్చుండుట, నిలుచుండుట ఇయ్యవియే ప్రవర్గ్యము, ముఖమే ఆహవనీయాగ్ని, మాట్లాడుటయే ఆహుతి, విజ్ఞానమే హోమము, సాయం ప్రాతఃకాలములందు భుజించుటయే సమిధలు, ప్రాత ర్మధ్యాహ్న సాయం కాలములే సవనములు.

3. ఇఁక కాలవిశేషములను నానావిధయజ్ఞములనుగా వివరించుచున్నాఁడు :—అహోరాత్రములే దర్శపూర్ణమాసయాగములు, పక్షములు మాసములు ఇవియే చాతుర్మాస్యయాగములు, ఋతువులే పశుబంధములు, సంవత్సర, పరివత్సర, ఇదావత్సర. అనువత్సర, ఇద్వత్సరములే ద్విరాత్రత్రిరాత్రాదిక అహర్గణములు, యోగియొక్క యావదాయుర్దాయమే సర్వదక్షిణాకమగు సత్రయాగము, ఈసత్రయాగమునకు మరణమే అవభృథస్నానము.

ప్రభవాది ౬౦ సంవత్సరములందు ఒక్కొక్కసంవత్సరమునకు క్రమముగ సంవత్సర పరివత్సర ఇదావత్సర అనువత్సర ఇద్వత్సరము లనిపేరు,

ఈ ఐదింటికి యుగపంచక మనిపేరు, మఱల ౬-వ సంవత్సరము సంవత్సర మనియు, ౭ సంవత్సరము పరివత్సర మనియు ఇట్లే క్రమానుసారము అగును. ఇందులకు ప్రమాణము కాలనిర్ణయము:—

శ్లో. చాంద్రాణాం ప్రభవాదీనాం పంచకే పంచకే యుగే,
సం పరీ దా న్విది త్యేత చ్ఛబ్దపూర్వా స్తు వత్సరాః.

౪. ఇట్టితలంపుతో నుపాసించునట్టి జీవన్ముక్తునకు ఈ చెప్పఁబోవు ఫలము లభించును:—యోగియొక్క జరామరణావధికమగు చరిత్రమే వేదోక్త మగు అగ్నిహోత్రాది సహస్రసంవత్సరసత్రయాగము వఱకుఁ గల కర్మజాతము, ఈవిధముగా భావించి ఉపాసించునట్టి ఉపాసకుఁడు ఉత్తరాయణమునందు మరణించునెడల ఇంద్రాదులయొక్క ఐశ్వర్యమును పొంది తరువాత సూర్యునియొక్క సాయుజ్యమును పొందును. (సాయుజ్యశబ్దమునకు సహవాసమనియు, తాదాత్మ్యమనియుఁ రెండర్థములు గలవు. భావనాతిశయమున్న తాదాత్మ్యమును, భావనామాంద్యమున్న సహవాసమును పొందునని గ్రహింపవలయును) లేక ఆయుపాసకుఁడు ఉత్తరాయణమునందు మరణింపక దక్షిణాయనమునందే మరణించునెడల అగ్నిష్వాత్తాది పితృదేవతలయొక్క ఐశ్వర్యమును పొంది భావనాతారతమ్యము ననుసరించి చంద్రునియొక్క సాలోక్యమునో, లేక సాయుజ్యమునో పొందును, ఈవిధముగా సూర్యచంద్రుల మహిమల ననుభవించిన బ్రహ్మనిష్ఠుఁడు అచట సగుణబ్రహ్మరూపుఁడగు హిరణ్యగర్భుని తెలిసికొన్నవాఁడౌ హిరణ్యగర్భలోకనివాసులగు ఉపాసకులలో గణ్యుఁడగును. తరువాత హిరణ్యగర్భసాక్షాత్కారమును పొందును. హిరణ్యగర్భలోకనివాసులగు వారియొక్క దేహపాతానంతరము హిరణ్యగర్భునిలోకమునుపొంది అచట హిరణ్యగర్భుని ఐశ్వర్యమును పొందుచున్నాఁడు. పిదప ఆహిరణ్యగర్భలోకమునందు బ్రహ్మతత్త్వసాక్షాత్కారమును పొందినవాఁడయి హిరణ్యగర్భబ్రహ్మలోకవినాశానంతరము సత్యజ్ఞానానందలక్షణ మగు పరబ్రహ్మముయొక్క మహిమను అనఁగా తాదాత్మ్యమును పొందుచున్నాఁడు. సగుణనిర్గుణరూప బ్రహ్మవిద్యాతత్త్వ ప్రతిపాదకమగు తైత్తిరీయోపనిషద్గ్రంథరాజము సమాప్తమైనది.

వివరణము:—ఈ ఆత్మయజ్ఞములో సమానమయిన పురుషయజ్ఞము ఛాందోగ్యమున నిట్లుగలదు:—

ఛాందోగ్యోపనిషత్తునందు గల పురుషయజ్ఞము.

పురుషో వావ యజ్ఞస్తస్య యాని చతుర్విగ్ంశతివర్షాణి తత్ప్రాతస్సవనం చతుర్విగ్ంశత్యక్షరా గాయత్రీ గాయత్రం ప్రాతస్సవనం తదస్య వసవో ఽన్వాయత్తాః ప్రాణా వావ వసవ ఏతేహీదగ్ం సర్వం వాసయంతి ౧. తంచేదేతస్మిన్వయసి కించిదుపతపేత్స బ్రూయాత్ప్రాణా వసవ ఇదం మే ప్రాతస్సవనంమాధ్యందినగ్ం సవన మనుసంతనుతేతి మాఽహం ప్రాణానాం మధ్యేయజ్ఞో విలోప్సీయేత్యుద్ధైవ తత ఏత్యగదో హ భవతి. ౨. అథ యాని చతుశ్చత్వారింశద్వర్షాణి తన్మాధ్యందినగ్ం సవనం చతుశ్చత్వారింశదక్షరా త్రిష్టుప్త్రైష్టుభం మాధ్యందినగ్ం సవనం తదస్య రుద్రా అన్వాయత్తాః ప్రాణా వావ రుద్రా ఏతే హీదగ్ం సర్వగ్ం రోదయంతి. ౩. తంచేదేతస్మిన్వయసి కించి దుపతపేత్స బ్రూయాత్ప్రాణా రుద్రా ఇదం మే మాధ్యందినగ్ం సవనం తృతీయసవన మనుసంతనుతేతి మాఽహం ప్రాణానాగ్ం రుద్రాణాం మధ్యే యజ్ఞో విలోప్సీయేత్యుద్ధైవ తతఏత్యగదో హ భవతి. ౪. అథ యాన్యష్టాచత్వారింశద్వర్షాణి తత్తృతీయసవన మష్టాచత్వారిగ్ంశదక్షరాజగతీ జాగతం తృతీయసవనం తదస్యాదిత్యా అన్వాయత్తాః ప్రాణా వావాఽఽదిత్యా ఏతేహీదగ్ం సర్వమాదదతే. ౫. తంచే దేతస్మిన్వయసి కించిదుపతపేత్స బ్రూయాత్ప్రాణా ఆదిత్యా ఇసం మే తృతీయసవనమాయురను సంతనుతేతి మాఽహం ప్రాణానా మాదిత్యానాం మధ్యేయజ్ఞో విలోప్సీయేత్యుద్ధైవ తతఏత్యగదో భవతి. ౬. ఏతద్ధస్మవై తద్విద్వా నాహ మహిదాస ఐతరేయః సకిం మఏత దుపతపసియోఽహమనేన నప్రేష్యామీతి సహషోడశం వర్షశతమజీవ త్ప్రహషోడశం వర్షశతం జీవతి య ఏవం వేద. ౭.

ఇతి ఛాందోగ్యే తృతీయాధ్యాయే షోడశః ఖండః.

సయదశిశిషతి యత్పిపాసతి యన్నరమతే తా అస్యదీక్షాః. ౧ అథ యదశ్నాతి యత్పిబతి యద్రమతే తదుపసదై రేతి. ౨. అథ యద్ధసతి యజ్జక్షతి యన్మైథునం చరతి స్తుతశస్త్రైరేవ తదేతి. 3. అథయత్తపోదానమార్జవ మహిగ్ంసా సత్యవచనమితి తా అస్య దక్షిణాః. ౪. తస్మాదాహు సోష్యత్య సోష్టేతి పునరుత్పాదన మేవాస్య తన్మరణమేవావభృథః. ౫. తద్ధైతద్ఘోర ఆంగిరసః కృష్ణాయ దేవకీపుత్రాయోక్త్వోవాచా పిపాసఏవ స బభూవ సోఽన్తవేలాయా మేతత్త్రయం ప్రతిపద్యేతాక్షితమస్యచ్యుతమసి ప్రాణసగ్ంశితమసీతి తత్రైతే ద్వే ఋచౌ భవతః. ౬. ఆదిత్ప్రత్నస్యరేతసః, ఉద్వయం తమసస్పరి జ్యోతిః పశ్యంత ఉత్తరగ్ంస్వః పశ్యన్త ఉత్తరం దేవందేవత్రా సూర్యమగన్మజ్యోతిరుత్తమమితి జ్యోతిరుత్తమమితి. ౭.

ఇతి ఛాందోగ్యే తృతీయాధ్యాయే సప్తదశః ఖండః.

అర్థసంగ్రహము:—

౧. (ఆయుర్వృద్ధికొఱకు చేయఁదగిన ఉపాసనము జపమును చెప్పఁబడుచున్నది.) పురుషుఁడు (జీవాత్మ యజ్ఞముగ నున్నాఁడు) యజ్ఞమని భావింపవలయును.) వాని ఇరువదినాలుగు సంవత్సరములదాఁక ప్రాతస్సవనము; గాయత్రి ఇరువదినాలుగు అక్షరములు; గాయత్రీసంబంధమే ప్రాతస్సవనము; దానికి వసువులు దేవతలు; ప్రాణములే వసువులు, ఈవసువులే సమస్తమును జీవించునట్లు చేయుచున్నారు.

౨. ఈ ఇరువదినాలుగేండ్లలోఁగా ఏదేని ఆపద సంభవించినపుడు ఈజపము చేయఁదగును. "ఓప్రాణములగు వసువులారా! ప్రాతస్సవనము మధ్యాహ్నసవనమును అనుసరించున ట్లగునుగాఁక! ప్రాణములనడుమ నాకేవిధమైన కొఱఁతయు రాకుండునుగాక!" అని ఇట్లు జపించినయెడల ఆయాపదనుండి విముక్తుఁడై ఆరోగ్యమునొందును.

3. ఇరువదినాలుగేండ్లకు పైబడి నలువదినాలుగేండ్లు (అనఁగా అరువదెనిమిదేండ్లదాఁక) మాధ్యాహ్నసవనము; త్రిష్టుప్ నలువదినాలుగక్షరములు; రుద్రులు దేవతలు; ప్రాణములే రుద్రులు; ఈరుద్రులే సమస్తమును జీవించునట్లు కావించుచున్నారు.

౪. ఈ అరువదెనిమిదేండ్లలోపల నెవియేని యాపద సంభవించిన యెడల ఈజపము చేయనగును. "ఓప్రాణములగు రుద్రులారా! మధ్యాహ్న సవనము సాయంసవనమును అనుసరించున ట్లగుఁగాక! ప్రాణములనడుమ నాకేవిధమైన కొఱఁతయు రాకయుండునుగాఁక" అని యిట్లు జపించినచో ఆయాపదనుండి విడివడి ఆరోగ్యము నొందును.

౫. ఆవయస్సునకుమీఁద నలువదెనిమిదేండ్లు (అనఁగా నూటపదునాఱువత్సరములు) సాయంసవనము, జగతీఛందస్సు నలువదెనిమిదియక్షరములు; ఆదిత్యులు దేవతలు; ప్రాణములే ఆదిత్యులు; ఈఆదిత్యులే సర్వమును బ్రదుకునట్లు కావించుచున్నారు.

౬. ఈ నూటపదునాఱేండ్లలోపల నేదేని ఆపదకలిగినపుడు ఈ జపము చేయవలయును. "ఓప్రాణములగు ఆదిత్యులారా! ఈ సాయంసవనము పూర్తియగు నంతలోపల నాకెట్టిలోపమును కలుగకుండును గాక!" అని ఇట్లు జపించినయెడల ఆరోగముననుండి విముక్తుఁడై ఆరోగ్యము నొందును.

౭. ఇట్లు నిశ్చయము నెఱింగినమహిదాసుఁ డనుఋషి "ఓరోగమా! నీవు నన్నేమిచేయఁగలవు? ఏల వృథాశ్రమమొంది నన్ను పీడింపఁజూచెదవు?" అని చెప్పిరి. వారు నూటపదునాఱేండ్లు జీవించిరి. ఎవఁ డిట్లు ఉపాసించుచున్నాఁడో వాఁడు నూటపదునాఱేండ్లు బ్రదుకును.

౧౬ వ ఖండము సమాప్తము.

౧. (ఇఁక పురుషునకు యజ్ఞమునకును సామ్యముచెప్పఁబడుచున్నది) దేనిని భుజించుటకును పానము చేయుటకును గోరుచున్నాఁడో, ఏది లభింపమిచే దుఃఖపడుచున్నాఁడో, అదే యజ్ఞమునందు దీక్ష (వ్రతము).

౨. దేనిని భుజించుచున్నాఁడో, దేనిని పానముజేయుచున్నాఁడో; ఏదిలభించినపుడు సంతోషించుచున్నాఁడో, అది యజ్ఞమునందు ఉపసదము. (అల్పాహారము, పాలు మొదలగువానివంటిది.)

౩. నవ్వుట, భుజించుట, మైథునము, ఇవి యజ్ఞమునందు స్తుతశస్త్రములు (స్తోత్రాదులు).

౪. తపస్సు, దానము, ఋజుత్వము (క్రమము), అహింస, సత్యవచనము, ఇవి యజ్ఞమునందు దక్షిణలు.

౫. సోష్యతి, అసోష్ట, అని రెంటియందును చెప్పఁబడుచున్నది. (పురుషపరమునందు—కనఁబోవుచున్నాఁడు, కనినాఁడు; అనఁగా పొందఁబోవుచున్నాఁడు, పొందినాఁడు; యజ్ఞపరమునందు— సోమరసమును పానముఁ జేయఁబోవుచున్నాఁడు, పానము చేసినాఁడు, అని చెప్పఁబడుచున్నది. శబ్దసామ్యము). మరణము యజ్ఞమునందు అవభృథస్నానము (ముగింపు).

౬. ఈవిద్యను దేవకీపుత్త్రుఁడగు కృష్ణునకు ఘోర అను ఆంగిరసుఁ ఉపదేశించెను. అతఁడు తక్కినవిద్యను గోరలేదు. (అనఁగా ఇదే ఉత్కృష్టమని తలంచెను.) ఈ పురుషయజ్ఞపద్ధతిని తెలిసికొన్నవాఁడు (మరణకాలమునం దిట్లు జపము చేయవలసినది. అక్షితమసి (కొఱఁతలేకున్నావు), అచ్యుతమసి (జాఱుట లేక యున్నావు) ప్రాణసంశితమసి (సూక్ష్మప్రాణమై యున్నావు). అని ఈవిషయమునందు రెండు ఋక్కులు కలవు.

౭. పురాణపురుషుఁడై, కారణపురుషుఁడై యుండు (బ్రహ్మసంబంధమైనదియును) తపస్సుకంటె అధికమును ఉత్కృష్టము నైనదియును, దేవ

శిలకంటె మేలైనదియును, ఉత్తమమైనదియును అగు జ్యోతిని చూచిన వారమై యున్నారము; పొందినవారమై యున్నారము.

౧౭-వ ఖండము సమాప్తము.

(వావిళ్ళవారు ప్రకటించిన ద్వాదశోపనిషత్తులు వచనమునుండి గ్రహింపఁబడినది.

మీమాంసావివరణము:—ఉత్తరమీమాంసయందీవిషయమును—అనఁగా ఈ యనువాకమునందు ప్రతిపాదించిన ఆత్మయజ్ఞమునుగూర్చి కొంతచర్చించి వివరింపఁబడియున్నది. బ్రహ్మసూత్రభాష్యమునందీవిద్యను శంకరభగవత్పాదాచార్యులవారు పురుషయజ్ఞమని పేర్కొనిరి. విద్యారణ్యులవారు యీ యుపనిషద్వ్యాఖ్యానమునందు ఈవిద్యను పురుషవిద్య యని పేర్కొనిరి:-

బ్ర. పురుషవిద్యాయామివచేతరేషా మనామ్నానాత్. 3-3-౨౪.

శ్లో. పుంవిద్యైకా ? విభిన్నావా ? తైత్తిరీయక తాణ్డినోః,
మరణావభృథత్వాది సామ్యాదేకేతి గీయతే. ౧.

„ బహునా రూపభేదేన కించిత్సామ్యస్య బాధనాత్,
న విద్యైక్యం తైత్తిరీయే బ్రహ్మవిద్యాప్రశంసనాత్. ౨

వైయాసిక న్యాయమాలః.

సూత్రభాష్యము—“అస్తి తాండినాం పైంగినాంచ రహస్యబ్రాహ్మణే పురుషవిద్యా, తత్ర పురుషః యజ్ఞః కల్పితః, తదీయ మాయుస్త్రేధా విభజ్య సవనత్రయం కల్పితం, అశిశిషాదీనిచ దీక్షాదిభావేన కల్పితాని, అన్యేచధర్మాస్తత్రసమధిగతా ఆశీర్మంత్రప్రయోగాదయః, తైత్తిరీయకా అపి కంచి

త్పురుషయజ్ఞం కల్పయాంతి—తస్యైవం విదుషో యజ్ఞస్యాత్మా యజమానః శ్రద్ధాపత్నీ (నారా. ౮౦) ఇత్యేతేనానువాకేన. తత్ర సంశయః, కిం య ఇతరత్రోక్తాః పురుషయజ్ఞస్య ధర్మాః తే తైత్తిరీయకేషు ఉపసంహర్తవ్యాః కిం వా నోపసంహర్తవ్యాః? పురుషయజ్ఞత్వావిశేషా దుపసంహార ప్రాప్తా వాచక్ష్మహే—నోపసంహర్తవ్యా ఇతి, కస్మాత్? తద్రూపప్రత్యభిజ్ఞానాభా వాత్, తదాహాచార్యః—పురుషవిద్యాయామివేతి, యథైకేషాంశాఖినాం తాండినాం పైంగినాంచ పురుషవిద్యాయా మామ్నానం నైవమితరేషాం తైత్తిరీయాణా మామ్నానమస్తి. తేషాం హీతరవిలక్షణ మేవ యజ్ఞ సంపా దనం దృశ్యతే పత్నీయజమానవేదవేది బర్హిర్యూపాజ్యపశ్వృత్విగాద్యను క్రమణాత్, యదపి కించిస్మరణావభృథత్వాదిసామ్యం తదప్యల్పీయస్త్వా ద్భూయసా వైలక్షణ్యేనాభిభూయమానం న ప్రత్యభిజ్ఞాపనక్షమం, నచ తైత్తి రీయకే పురుషస్యయజ్ఞత్వం శ్రూయతే,విదుషోయజ్ఞస్యేతి హి న చైతే సమానా ధికరణే షష్ఠ్యౌ విద్వానేవ యో యజ్ఞస్తస్యేతి, భవతి హి పురుషస్య ముఖ్యో యజ్ఞసంబద్ధః, సత్యాం చ గతౌ ముఖ్యఏవార్థ ఆశ్రయితవ్యోనభాక్తః, ఆత్మా యజమాన ఇతిచ యజమానత్వం పురుషస్య నిర్బ్రువన్ వైయధికరణ్యే నైవాస్య యజ్ఞసంబంధం దర్శయతి, అపిచ తస్యైవంవిదుష ఇతి సిద్ధవదను వాద శ్రుతౌ సత్యాం పురుషస్య యజ్ఞభావ మాత్మాదీనాంచ యజమానాది భావం ప్రతిపిత్సమానస్య వాక్యభేదః స్యాత్, అపిచ ససన్న్యాసా మాత్మ విద్యాం పురస్తాదుపదిశ్యానన్తరం 'తస్యైవం విదుష' ఇత్యాద్యనుక్రమణా పశ్యంతః పూర్వశేష ఏవైష ఆమ్నాయో న స్వతంత్ర ఇతి ప్రతీమః, తథా చైకమేవ ఫలముభయోరప్యనువాకయోరుపలభామహే "బ్రహ్మణో మహి మానమాప్నోతి" (నారా-౮౦) ఇతి, ఇతరేషాంత్వనన్యశేషః పురుషవిద్యా మ్నాయః, ఆయురభివృద్ధి ఫలోహ్యసౌ సహషోడశంవర్షశతం జీవతి య ఏవం

ఠీద. (ఛాం-3-౧౬-౭) ఇతి సమభివ్యాహారాత్, తస్మాచ్ఛాఖాంతరాధీతా
నాం పురుషవిద్యాధర్మాణా మాశీర్మంత్రాదీనా మప్రాప్తిస్తైత్తిరీయకే. ౨౮.

భాష్యార్థసంగ్రహము:—తాండిపైంగియను శాఖలయొక్క రహస్య
బ్రాహ్మణమునందు 'పురుషవిద్య' యను ఒక ఉపాసనము కలదు. దానియందు
పురుషుఁడు యజ్ఞముగా కల్పింపఁబడినాఁడు. ఆపురుషుని ఆయుస్సు 3 గా
విభజింపఁబడి సవనత్రయముగా కల్పింపఁబడినది. అశిశిష = అనఁగా అన్నము
తినవలెనను ఇచ్ఛ మున్నగునవి దీక్షాదిభావముగ అచట కల్పింపఁబడినవి. ఇట
తైత్తిరీయ నారాయణోపనిషత్తునందుకూడ పురుషయజ్ఞము కల్పింపఁబడినది.
దానియందు దానియందు సవనత్రయకల్పనము, మరణమే అవభృథము
మున్నగుధర్మములు తుల్యములయియుండుటచేత రెండువిద్యలను ఐక్యముగా
గ్రహించి తైత్తిరీయమునందు లేని ధర్మములను తాండిశ్రుతినుండి గ్రహించ
వలయుననియు, తాండిశ్రుతియందు లేని ధర్మములను తైత్తిరీయమునుండి
గ్రహించవలయుననియు పూర్వపక్షము.

అట్లు గ్రహింపఁకూడదని సిద్ధాంతము— ఏలయనఁగా 'మరణము అవ
భృథము' మున్నగునవి ఏ ఒకటి రెండో సమానముగాని వైలక్షణ్యముమాత్రము
చాలగలదు. పత్నీయజమాన వేదవేది బర్హిర్యూపాదికల్పనము తైత్తిరీయము
నందుగలదు. తాండిశ్రుతియందీ కల్పనములేవు. కేవలసవనత్రయమును
మాత్రము తైత్తిరీయ శ్రుతియందుండఁగా ఆయుస్సును 3 గా విభజించి
4+44+48=116 చేసి సవనత్రయము సూచితమయినది. ఫలమునందు
తైత్తిరీయశ్రుతియందు 'బ్రహ్మణోమహిమానమాప్నోతి' అనిబ్రహ్మప్రాప్తి
యుండగా తాండిశ్రుతియందు "సహషోడశం వర్షశతం జీవతి" అని ఆయు
ర్వృద్ధిఫలము చెప్పఁబడియున్నది. కనుక శాఖాంతరమునందు చెప్పఁబడిన
మంత్రాదికమును తైత్తిరీయోపనిషత్ప్రతిపాదిత పురుషవిద్యయందు
గ్రహింపనక్కరలేదు.

ఉత్తరశాంతిపాఠము—పూర్వశాంతిపాఠముతో సమానమే కావున మఱల నిచట వ్రాయలేదు. (చూ. పుట. ౧౧౪-౧౧౬)

ఇది కనుపర్తి మార్కండేయశర్మచేత సాయణాచార్యభాష్యము
ననుసరించి వ్రాయఁబడిన నారాయణప్రశ్నముయొక్క
ఆంధ్రటీకాతాత్పర్యములు సమాప్తము.

నారాయణప్రశ్నము సమాప్తము.

తైత్తిరీయోపనిషత్తు సమాప్తము.

శ్లో. కనుపర్తికులోత్పన్న వేంకట్రామ సుధీశితుః,
కైవల్యనవనీతాది గ్రంథకర్తు స్తనూభువా.
,, కనుపర్తికులోత్పన్న శ్రీమార్కండేయశర్మణా,
తైత్తిరీయోపనిషదః వ్యాఖ్యాతా ఆంధ్రభాషయా.
,, వేదాబ్ధివస్వింధుమితే (౧౮౪౪) శాకే దుందుభివత్సరే,
ఇషకృష్ణత్రయోదశ్యాం సమాప్యగురవేఽర్పితమ్.
,, యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం తు యద్భవేత్,
తత్సర్వం కృపయా దేవ క్షమస్వ పురుషోత్తమ.

16,193

చెన్నపురి: వావిళ్లరామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము. 1954—1500.